ఎమ్బీయస్ - గ్రేట్ ఆంధ్ర ఆర్కయివ్స్ ప్రాజెక్టు

# 2016 Q1 జనవరి - మార్చి ఆర్టికల్స్
## (పిడిఎఫ్ రూపంలో)
## విషయసూచిక


క్రీమీ లేయర్
మోతీలాల్ నెహ్రూ తండ్రి ముస్లిమా?
క్రీమీ లేయర్ విమర్శలు
మోతీలాల్ వ్యాసం- విమర్శలు
సమస్య కరక్టే, పరిష్కారం..?
రోహిత్ వివాదం - వేడి ఎక్కువ, వెలుగు తక్కువ
సిరియా ఎన్నికల ఫలితం అమెరికాకు మింగుడు పడలేదు
రాహుల్ గాంధి చురుకుదనం వెనుక...
యూరోప్ గాథలు 25
యూరోప్ గాథలు 26
ఆంధ్రమూలాల వారి ఓట్లు ఎటు..?
కాపులకు రిజర్వేషన్
బీఫ్ సంగతి, సరే ఓటేయనిస్తారా..?
సిపిఎం డైలమా
కశ్మీర్ పీఠానికి పీటముడి
మేలుకో, లోకేశ్!
ఇదేం రణనీతి, ముద్రగడా?
జైట్లీకి స్థానచలనం..?
కుట్ర తేటతెల్లమౌతోంది
ఇమేజ్ ఛేంజోవర్
నేతాజీ చిక్కుముడి
ఇప్పటికైనా కుట్ర అనవచ్చా?
యూరోప్ గాథలు 27
ఇందిర గొంతు అనుకరించి 60 లక్షల దగా
అరుణాచల్‌లో గవర్నరు అత్యుత్సాహం
మొత్తానికి పీటర్ ముఖర్జీపై చార్జిషీటు
కర్ణుడికే దానం!
యూరోప్ గాథలు 28
పేరుకే ముత్యం...
నంబి కొండయ్య
ఎల్ ఎన్ మిశ్రా హత్య కేసు
మోదీ ఆంతర్యం ఏమిటి?
సోలార్ సరిత తాజా లక్ష్యం
చూసి నేర్చుకోవచ్చు...
యూరోప్ గాథలు 29

**తమిళనాట బిజెపి భాగస్వామి ఎవరు?**
**నూతిలోంచి సూదెలా వస్తుంది?**
**అభివృద్ధి కోసమే...**
**ప్రభుత్వసంస్థ పేరుతో దోపిడీ – మలేసియా మార్గం**
**అవినీతి ఆరోపణలపై స్పందన**
**చంద్రబాబు ఇమేజి**
**ఆశారాం బాపురే!**
**ఎగ్జిక్యూటివ్‌ల బాడీగార్డులు**
**ముంద్‌డా ఎల్‌ఐసి స్కాము**
**ఆంధ్రా లండన్ ఐ కూడా అమరావతి లోనేనా?**
**మమత దూకుడు**
**కింగా? కింగ్‌మేకరా?**
**కేరళలో కూడా తారాతోరణం**
**భరతమాతకు జై అనాల్సిందేనా?**
**అమెరికాలో కబుర్లు చెప్తారా?**
**యూరోప్ గాథలు 30**
**ఆటల పేరుతో రాజకీయక్రీడ**
**ఆసాంలో అట్టు తిరగబడుతుందా?**
**మధ్యతరగతి విషాదం**
**అమెరికాతో కబుర్లు**
**కన్నయ్యను హీరో చేసేస్తున్నారు**
**కువో ఆయిల్ స్కామ్**
**ఉత్తరాకాండలో తాజా మలుపు**
**నిన్న కాదు, నేడు కాదు, ఎప్పటికీ నేనే రాజా..**
**నిషిద్ధ ఔషధాలు**

**2016 జనవరి 01-03 వీక్లీకై**

## ఎమ్బీయస్ : క్రీమీ లేయర్

బిసిలకు క్రీమీ లేయర్ వుండాలా వద్దా అన్న ప్రశ్న యివాళ్టిది కాదు. ఎప్పుణ్నుంచో ప్రభుత్వం ఆలోచించడం, దానికి బిసి నాయకులు అడ్డం కొట్టడం జరుగుతూ వచ్చింది. తమిళ రాజకీయాలు వ్యాసాల్లో రాశాను – 'బిసిలలో ధనికవర్గాలు మాత్రమే అన్ని ప్రయోజనాలు పొందుతూండడంతో రిజర్వేషన్ ఫలాలు పేదలకూ అందాలనే సదుద్దేశంతో 1979 పార్లమెంటు ఎన్నికలకు ముందు ఎమ్జీయార్ బిసి రిజర్వేషన్‌లకు ఏడాదికి రూ.9 వేల రూపాయల కంటె ఎక్కువ ఆదాయం వచ్చేవారికి రిజర్వేషన్ వర్తించదని చట్టం చేశాడు. ఈ రూలు పెట్టిన తర్వాత వచ్చిన ఎన్నికలలో ఘోరంగా ఓడిపోవడంతో బిసిలకు కోపం వచ్చి పార్టీకి వ్యతిరేకమయ్యారని భావించి వెంటనే సీలింగు ఎత్తివేయడంతో బాటు బిసిల కోటాను ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా 31% నుండి 50%కు పెంచివేశాడు. కులపరమైన జనగణన ఏమీ లేకుండానే ఆ పని చేశాడు. ఇక ఆ తర్వాత ఆ కోటాను తగ్గించడం ఎవరి తరమూ కాలేదు. ఏమైతేనేం ఆ తర్వాత వచ్చిన అసెంబ్లీ ఎన్నికలలో ఎడిఎంకెకు బాగా ఓట్లు పడి యిదే సరైన పద్ధతి అనుకునేట్లా జరిగింది.' అని. అప్పణ్నుంచి ఏ ప్రభుత్వమూ క్రీమీ లేయరు గురించి గట్టిగా పట్టుబట్టడం లేదు. ఇప్పుడైనా తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టు ఆదేశాల మేరకే ప్రభుత్వోద్యోగాల నియామకంలో అమలు చేయాలని తలపెట్టింది! వెంటనే బిసి నాయకులు, బిసిల సంక్షేమమే తమ ధ్యేయం అని చాటుకునే అన్ని పార్టీల నాయకులూ వ్యతిరేకత తెలుపుతున్నారు. కెసియార్‌కు శాపనార్థాలు పెడుతున్నారు. బిసిలకు అన్యాయం జరిగిపోయిందని గగ్గోలు పెడుతున్నారు.

ఈ సందర్భంగా రిజర్వేషన్ విధానం గురించి కొన్ని మౌలికమైన సందేహాలు వస్తాయి. రిజర్వేషన్లే వుండకూడదు, అవి అనుమతించాక

మళ్లీ వాటిపై నిబంధనలు విధించకూడదు అని కొందరు వాదిస్తారు. మనం దీనిపై ఎంత సబబైన సూచన చేసినా, రాజకీయ కారణాల చేత దినదినం రిజర్వేషన్ల శాతం పెంచుతూ, కొత్తకొత్త కులాలను జాబితాల్లోకి చేరుస్తూ పోతారు కాబట్టి దీని గురించి ఆలోచించడమే దండగ అని కొందరనుకుంటారు. చాలామంది రిజర్వేషన్ల గురించి ఉదారంగా వుంటారు – అవి వారికి అడ్డు రానంతవరకు! వృత్తివిద్యలో సీటో, ఉద్యోగమో, ప్రమోషనో తమకు దక్కేవేళ రిజర్వ్‌డ్ కాండిడేటు ఎవరో వచ్చి తన్నుకుపోయినప్పుడు హఠాత్తుగా కసి పుట్టుకుని వస్తుంది – స్వాతంత్ర్యం వచ్చి యిన్నేళ్లయినా యింకా రిజర్వేషన్లు ఏమిటండీ? అంటూ ఆక్రోశిస్తారు.

మొదటగా మనం అంగీకరించవలసినది – సమాజంలో అందర్నీ సమానంగా చేయడం ఎవరి తరం కాదు కానీ, సమానావకాశాలు కల్పించడం శ్రేయోసమాజ లక్ష్యంగా వుండాలి. సమానావకాశం అంటే అందరినీ వరసగా నిలబెట్టి పరుగు పెట్టి, ఎవరు వెళ్లి గమ్యం చేరుకుంటే వారికి బహుమతి అనేయడం కాదు. ఆటల్లో చూడండి – వయసురీత్యా, ఎత్తురీత్యా, బరువురీత్యా, లింగభేదంరీత్యా వర్గీకరణ చేసి అప్పుడు పందెం పెడతారు. మైదానంలో వృత్తాకారంలో పరుగుపందెం పెట్టినపుడు అందరి కంటె లోపల వున్నవాడు తిరగాల్సిన వృత్తం పరిధి తక్కువ కాబట్టి వాణ్ని వెనకగా నిలబడతారు, అందరి కంటె బయటి వృత్తంలో వున్నవాణ్ని ముందుగా నిలబెడతారు. సమాజంలో ముందు నుంచి చదువుసంధ్యలు వున్న కుటుంబాలు కొన్ని వుంటాయి. కొందరు ఆర్థికంగా బలంగా వుండి పిల్లలకు ట్యూషన్లు చెప్పించగలుగుతారు, డొనేషన్లు కట్టగలుగుతారు. కొన్ని ప్రాంతాలలో నీటివసతి, ఆరోగ్యకరమైన వాతావరణం, మంచి పాఠశాలలు, మెరుగైన విద్యుత్ సరఫరా, మంచి గ్రంథాలయాలు వుంటాయి. ఆ వాతావరణంలో ఆ కుటుంబాలలో పెరిగిన పిల్లలు యితరుల కంటె మెరుగైన ఫలితాలు సాధిస్తారు.

రోజూ అయిదారు మైళ్లు నడిచి వెళ్లి రెండు మూడు బిందెల నీళ్లు యింట్లో పోసి స్కూలుకి వెళ్లే కుర్రవాడికి, నది పక్కన యిల్లుండే కుర్రవాడికి చదువుపై వెచ్చించే సమయంలో తేడా వస్తుంది. చదువుతో పాటు యింటి పనులు కూడా చేయవలసి వచ్చిన ఆడపిల్లకు, చేయనక్కరలేని మగపిల్లవాడికి తేడా వస్తుంది. ఏ చదువు చదివితే ఉపాధి అవకాశాలు బావుంటాయో, ఎక్కడ మంచి కళాశాలలు వుంటాయో తెలుసుకోవడంలో గ్రామంలో రైతు కొడుక్కి, నగరంలో అధికారి కొడుక్కి తేడా వస్తుంది. వసతులు లేని ప్రభుత్వ పాఠశాలలో చదివినవాడికి, సౌకర్యాలున్న ప్రయివేటు కాన్వెంటులో చదివినవాడికి తేడా వస్తుంది. చదువు ప్రాముఖ్యం తెలియక కొన్నాళ్లు పొలం పనులకు పంపిన తలితండ్రులున్న పిల్లవాడికి, సకాలంలో పాఠశాలలో చేర్చిన తలితండ్రులున్న పిల్లవాడికి వయసు విషయంలో తేడా వస్తుంది. ఇరుకిళ్లల్లో ఐదారుగురి మధ్య, చాలీచాలని వెలుతురులో చదివిన వాడికి, ప్రత్యేకమైన గదిలో సకలసౌకర్యాలతో చదివినవాడికి తేడా వస్తుంది. పోటీ పెట్టినపుడు యిన్ని అంశాలు లెక్కలోకి తీసుకుని, ఒక్కో అంశానికి కొన్నేసి మార్కులు కలుపుతూ వస్తే అప్పుడు లెవెల్ ప్లేయింగ్ గ్రౌండ్ వస్తుంది.

కానీ ప్రస్తుత సమాజంలో కులం తప్ప యివేమీ పట్టించుకోవడం లేదు. ఫలానా కులంలో పుట్టావా, నీకు సకల సౌఖ్యాలు, సౌకర్యాలు వున్నా సరే రిజర్వేషన్ వుంది. ఫలానా కులంలో పుట్టావా నువ్వు అష్టదరిద్రుడవైనా, నీ తలిదండ్రులు నిరక్షరరాస్యులైనా రిజర్వేషన్ లేదు. ఈ పాలసీ వల్లనే సమాజంలో రిజర్వేషన్ పట్ల యింత విరోధభావం కలుగుతోంది. రిజర్వేషన్ పాలసీకి వాళ్లు చెప్పే ఏకైక భాష్యం – సామాజిక గౌరవం! దళిత కులాల్లో లేదా నిమ్న కులాల్లో పుడితే సమాజం గౌరవించడం లేదు అని. వెనుకబడిన కులాలని చెపుతున్న వాళ్లలో చాలా కులాల వారు తరతరాలుగా మర్యాద, గౌరవం పొందుతూనే వున్నారు. అయినా గౌరవం ఒకరిచ్చేది కాదు, ప్రతి వ్యక్తికి ఆత్మగౌరవం వుండాలి. ఒకసారి జగ్జీవన్ రామ్‌ను అడిగారు – "ఎస్సీ, ఎస్టీ మంత్రులు, ఐయేయస్‌ల పిల్లలకు కూడా రిజర్వేషన్ వర్తింపచేయడంలో న్యాయం ఏముంది? అటువంటి హోదా దక్కాక వాళ్ల పిల్లల్ని వాళ్లు బాగా చదివించుకుంటారు, పెద్ద ఉద్యోగాలు వేయించుకుంటారు. పైగా వారికి సంఘంలో ఆటోమెటిక్‌గా ఉన్నతస్థానం లభిస్తుంది, అందరూ వంగి దణ్ణాలు పెడతారు. ఇంకా గౌరవం లేకపోవడం ఏమిటి?" అని. దానికి జగ్జీవన్ రామ్ "ఒక పేద వంటబ్రాహ్మణుడు హరిజన ఐయేయస్ కంటె ఉన్నతుణ్నని అనుకుంటాడు. ఆ భావం పోయేవరకు రిజర్వేషన్‌లు కొనసాగవలసినదే" అని జవాబిచ్చారు.

నిజానికి ఎవడి కులం వాడికి గొప్ప. మరొకరి కంటె ఎక్కువ అని, తక్కువని అనుకోనక్కరలేదు. ఒకవేళ ఎక్కువనే భావం వున్నా అది కేవలం వ్యక్తిగతం. కొంతకాలానికి విజ్ఞత కలిగాక పోవచ్చు. అది వుందో, పోయిందో ఎలా తేలుస్తాం? జనాభాలో 99% మంది పోయి, 1% మందికి మాత్రం మిగిలిపోతే అప్పుడేం చేయాలి? సామాజికగౌరవం అనే బ్రహ్మపదార్థాన్ని సాకుగా చూపిస్తూ తమ రిజర్వేషన్లను నియంత్రించకుండా ఆ యా నాయకులు కాపాడుకుంటున్నారు. గతంలో ఎవరికి వారు మాది అగ్రకులం అని చెప్పేవారు. బిసిల రిజర్వేషన్లు అంటూ వచ్చాక ప్రతివాడూ మాది తక్కువకులం, తక్కువాతితక్కువ కులం, మమ్మల్ని సమాజంలో అందరూ హీనంగా చూస్తారు అని చెప్పుకుంటూ కోటాల్లో వాటాలు అడుగుతున్నారు. ఆత్మగౌరవం స్థానంలో ఆత్మన్యూనత వచ్చి చేరింది. ఇది అత్యంత దురదృష్టకరం. బిసి జాబితాలో చేరదలచిన కులాల జాబితా పెరిగిపోతోంది. వీరందరినీ చేరిస్తే అసలు వెనకబడిన కులాలు మరింత వెనకబడతారని ఒక భయం. క్రీమీ లేయర్ వంటి విధానాలను వ్యతిరేకిస్తూ వ్యాసాలు రాసే బిసి నాయకులు వాటిల్లో బాగా వెనకబడిన కులాల స్థితిగతులను ప్రస్తావిస్తారు. వాస్తవానికి చూడబోతే కోటీశ్వరులు, విద్యాధికులు, ఉన్నతాధికారులు బిసిల పేరుతో ఫలితాలు అందుకుంటున్నారు.

లెవెల్ ప్లేయింగ్ గ్రౌండ్ తయారు చేయడానికి పరిగణనలోకి తీసుకోవలసిన అంశాలు అంటూ నేను పైన చాలా పెద్ద లిస్టే యిచ్చాను. అవన్నీ నిర్ధారించడం కష్టం, చాలా కసరత్తు కావాలి అనుకుంటే కనీసం ఆదాయపరిమితి అంశమైనా అమలు చేయాలి.

ఎందుకంటే డబ్బు వుంటే చాలా అవరోధాలకు పరిష్కారం దొరుకుతుంది. తెలంగాణ ప్రభుత్వం విధిస్తున్న నెలకు 50 వేల ఆదాయం తక్కువేమీ కాదు. సగటు తలసరి ఆదాయంతో పోలిస్తే ఎన్నో రెట్లు ఎక్కువ. అందునా యీ ఆదాయం గణించేటప్పుడు జీతం నుంచి, వ్యవసాయం నుంచి వచ్చే ఆదాయం లెక్కలోకి తీసుకోరు. ఈ పరిమితి కూడా యీ ఉద్యోగాల విషయంలో మాత్రమే తప్ప కాలేజీ ఎడ్మిషన్లు, సంక్షేమపథకాలు, ఎన్నికలలో అభ్యర్థులుగా నిలబడడాలు – వేటిలోనూ వర్తించదు. ఆ లెక్కన చూస్తే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పిల్లలకు కూడా రిజర్వేషన్ సౌకర్యం పోదు. 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో పనిచేసే గ్రూపు ఎ, క్లాస్ 1 ఆఫీసర్ల కంటె కింది ర్యాంకులలో వున్న అధికారుల, ఉద్యోగుల విషయంలో జీతాలు, వ్యవసాయంపై ఆదాయం కాకుండా యితరత్రా వచ్చే ఆదాయం ఏటా 6 లక్షల కంటె ఎక్కువ వుంటేనే వారికి రిజర్వేషన్ వర్తించదు' అంటున్నారు. అంటే వారు ఎంత హైక్లాసు కుటుంబీకులో ఆలోచించండి.

అటువంటి కుటుంబంలో వున్న పిల్లవాడికి సరిగ్గా చదువుకునే అవకాశాలు వుండవని, సొంతంగా ఉద్యోగం తెచ్చుకోలేడనీ, సమాజంలో గౌరవప్రదమైన స్థానం వుండదనీ ఎలా నమ్మగలం? 50 వేల పరిమితి పెట్టినా దానికి కూడా తూట్లు పొడుస్తారు. ఉద్యోగస్తుల జీతం (అదెలాగూ లెక్కలోకి రాదు) విషయంలో ఆదాయం కచ్చితంగా చెప్పగలరు కాని, వ్యాపారవ్యవసాయ వర్గాలలో ఆదాయం తేల్చడం మహా కష్టం. బిసిలలో స్వయంఉపాధి (సెల్ఫ్–ఎంప్లాయ్‌డ్) కలవారు చాలామంది వున్నారు. వారు వెల్లడించే ఆదాయం నెలకు 50 వేలు వున్నపుడే యీ పరిమితి వర్తిస్తుంది. పల్లెటూళ్లలో మోతుబరులు సైతం తెల్లకార్డులు, గులాబీరంగు కార్డులు సంపాదించే యీ రోజుల్లో ఆదాయనిర్ధారణ మహా కష్టం. ఎంతోమంది ధనికులు యీ నిబంధనలోకి రాకుండా తప్పించుకుంటారు. అయినా యిలాటి నిబంధన కనీసం తొలి మెట్టుగానైనా రావాలనే అంటాను నేను. వచ్చినపుడే ఆ కులాల్లో పేద కుటుంబాలకు అవకాశాలు పెరుగుతాయి.

ఎస్సీ, ఎస్టీ, బిసిలలో సర్వే చేసి చూస్తే కొన్ని కుటుంబాల వాళ్లే రిజర్వేషన్ల వలన లబ్ధి పొందుతున్నారని తెలుస్తుందని అనుకుంటున్నాను. మాదిగ పోరాట సమితి వాదన చూడండి – ఎస్సీ రిజర్వేషన్ వలన మాలలే బాగుపడుతున్నారని, అందువలన ఎస్సీలలో కూడా వర్గీకరణ జరిపి తక్కిన ఉపకులాలకు కూడా సబ్–రిజర్వేషన్ యివ్వాలని అంటున్నారు. దానికి ప్రతిగా మాలలు 'మేం మిమ్మల్ని చదువుకోవద్దని అంటున్నామా? మాకు తెలివితేటలున్నాయి, మేం పైకి వస్తున్నాం, మమ్మల్ని చూసి అసూయ పడకండి, స్వయంప్రతిభతో పైకి రండి' అంటున్నారు. అవే మాటలు ఓసి, బిసిలు తమకు చెపితే మాలలేమంటారో తెలియదు. మాదిగ పోరాట సమితి వలన కొన్ని గణాంకాలు బయటకు వచ్చాయి. బిసిలలో కొన్ని కులాల వాళ్లు అలాటి కసరత్తు చేస్తే బిసి రిజర్వేషన్ వలన ఎంతమంది ధనికులు, ఏ కులాల వాళ్లు బాగుపడ్డారో తేలుతుంది. బిసిల నాయకత్వం యీ ధనికుల చేతిలో, పలుకుబడి వున్న వాళ్ల చేతిలో, రాజకీయవేత్తల చేతిలో వున్నంతకాలం అవి బయటకు వస్తాయనుకోను. బాగుపడినవాళ్లే యింకా బాగుపడుతున్నారు. ఆ పరిస్థితి మార్చాలంటే ఆర్థిక స్థితిగతుల పరిమితి పెట్టి కొందర్ని తప్పించాలి. మంద కృష్ణ మాదిగ వర్గీకరణ అంశం ఎత్తుకున్నారు కానీ ఎస్సీలలో కూడా ఆదాయ పరిమితి పెట్టాలని అని వుంటే పేద మాలలు కూడా అతనికి వత్తాసు పలికేవారు.

పేదరికం కారణంగా అవకాశాలు పోగొట్టుకునే వారి పట్ల సమాజం సానుభూతితో వుంటుంది. అగ్రకులమైనా అణగారిన కులమైనా వారికి ఉచితంగా కోచింగ్ క్లాసులు ఏర్పాటు చేసి యితరులతో పోటీ పడే స్థాయికి వారి ప్రతిభను పెంచుతామని ప్రభుత్వం అంటే ప్రజామోదం లభిస్తుంది. అలా కాకుండా ధనం, అధికారం, పదవి అనుభవించేవారు కేవలం కులం పేరు చెప్పి రిజర్వేషన్లు కొట్టుకుపోతూ వుంటే కడుపుమంటగా వుంటుంది. సమాజంలో వైషమ్యం పెరుగుతుంది. అవకాశం చిక్కినపుడు వారి పట్ల వివక్షత చూపించే ప్రమాదం వుంది. ఆదాయ పరిమితి పెడతాం అంటే బిసిలలో చేర్చమని అడిగే కులాల సంఖ్య కూడా తగ్గుతుంది. ఎందుకంటే ఆ కులసంఘాల నాయకులు సాధారణంగా ధనికులు, ఉద్యోగాలు, పదవుల్లో వున్నవారే అయి వుంటారు. తమ వారసులకు లాభం కలగదనేసరికి వారికి ఆసక్తి తగ్గుతుంది. బిసిల కోటా యిప్పుడున్న శాతంతో ఆగినా సరిపోతుంది. బిసిల్లో క్రీమీ లేయరు పోటీలోంచి తప్పుకోవడంతో, రిజర్వేషన్ ఫలాలు యిప్పటిదాకా చేరని కుటుంబాలకు చేరతాయి. వారిలో కొందరు ముందుకు వస్తారు, పైకి వెళతారు. అందువలన క్రీమీ లేయరు విధానాన్ని తప్పక అమలు చేయవలసినదే. ఆదాయ పరిగణనలో జీతం, వ్యవసాయంపై ఆదాయం తీసేయడం సరికాదు. అవి కలిపి చూడాలి. అంతేకాదు కారు కలిగివుండడం/.. యిన్ని ఎకరాల మాగాణీ లేదా యిన్ని ఎకరాల మెట్ట/ యింత విలువ చేసే సొంత యిల్లు/యింతమంది ఉద్యోగులు వున్న వ్యాపారం.. యిలా కొన్ని పెరామీటర్లు కూడా జోడించాలి.

బిసిల విషయంలోనే యివన్నీ పెట్టాలా, ఎస్సీల విషయం వదిలేయాలా అనే ప్రశ్న ఛట్టున వస్తుంది. ఎస్సీల విషయంలో కూడా యివన్నీ జరగాలి. అయితే బిసిల విషయంలో రాష్ట్రప్రభుత్వాలు చొరవ చూపించి అమలు చేస్తే, ఎస్సీల విషయంలో కొన్నాళ్లకు కేంద్రం కూడా ధైర్యం కనబరచవచ్చు. బిసిలకు లేదా ఎస్సీలకు ఆదాయపరిమితి పెడితే బిసిలు ప్రభుత్వానికి ఎదురు తిరుగుతారు అనుకోవడం భ్రమ. ఆయా కులసంఘాల నాయకులు ఎదురు తిరుగుతారు కానీ యీ విధానం వలన తమకు లబ్ధి కలుగుతోందని గ్రహించిన అనేక మంది పేద బిసి, ఎస్సీలు ప్రభుత్వానికి మద్దతుదారులుగా మారతారు. వాళ్లలో చదువు పెరిగినకొద్దీ ఏ విధానం తమకు మేలు చేస్తోందో గ్రహించే జ్ఞానం కలుగుతుంది. ఏ కులసంఘపు నాయకుడికి తన కులంవాళ్లపై అదుపు లేదన్నది వాస్తవం. బిసి నాయకులెవరూ సొంతంగా పార్టీ పెట్టి నడపగలిగినది లేదు. మామూలు పార్టీల్లోనే చేరి బిసి పేరు చెప్పి పదవులు సంపాదించుకోవడం

తప్పు! అది గ్రహించి కెసియార్ ధైర్యంగా ముందుకు వెళితే శ్లాఘనీయుడే! **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2016)**

**2016 జనవరి 04** **ఎమ్బీయస్ : మోతీలాల్ నెహ్రూ తండ్రి ముస్లిమా?**

నా ఎమర్జన్సీ సీరీస్ కామెంట్స్ కాలమ్‌లో ఒకాయన నన్ను ఒక ప్రశ్న అడిగాడు – 'మోతీలాల్ నెహ్రూ తండ్రి ముస్లిముట, పేరు ఘియాసుద్దీన్ ట నిజమా?' అని. దాని కింద కాంగ్రెసు పార్టీ గురించి, సోనియా గాంధీ గురించి చాలా విమర్శిస్తూ చాలా రాసి, చివర్లో ఆ కుటుంబమూలాల గురించి నిగ్గదీస్తే తప్పేముంది? అంటూ ముగించారు. నేను రాస్తున్నది 1975 నాటి రాజకీయ చరిత్ర. ఇందిరా గాంధీ వ్యక్తిగత చరిత్ర కాదు. వాళ్ల పూర్వీకుల చరిత్ర కాదు. అది ఆయన గమనించకుండా వుండరు. అయినా యింత అసందర్భంగా ఆయన ఆ ప్రశ్న ఎందుకు అడిగినట్లు? సందేహనివృత్తికి అడుగుతున్నా అంటూ యీ సందేహాన్ని యితరుల మెదళ్లలో నాటడం పుకార్లు వ్యాప్తి చేసే పద్ధతుల్లో ఒకటి. ఇటీవలి కాలంలో నాకు చాలామంది మెయిల్స్ రాస్తున్నారు – నెహ్రూ ముస్లిమా? అంటూ. ఇదంతా ఒక పథకం ప్రకారం సాగిస్తున్న దుష్ప్రచారం. నాకు యీ మధ్య మెయిల్ రాసినాయన – 'మోతీలాల్ నెహ్రూకి ముస్లిము వుంపుడుగత్తెల ద్వారా జిన్నా, కశ్మీర్ నాయకుడు షేక్ అబ్దుల్లా పుట్టారని నెహ్రూ సెక్రటరీ ఎం ఓ మత్తయ్ రాసిన పుస్తకంలో వుంది కాబట్టి నమ్మవచ్చా?' అంటూ రాశారు. ''మత్తయ్ రాసిన పుస్తకంలో అలా వుందా? ఉంటే ఏ పేజీలో వుంది?" అని అడిగాను. ఆయన వెంటనే "నేను ఆ పుస్తకాన్ని చదవలేదు. నాకు వచ్చిన ఫార్వార్డ్‌లో అలా వుంది." అన్నాడు. ''అలాటప్పుడు '..పుస్తకంలో వుందట' అని రాయాలి తప్ప వుంది అని ఎలా రాశారు?' అని నిలదీశాను.

మత్తయ్ రాసిన ఆ పుస్తకం జనతా ప్రభుత్వం వున్న రోజుల్లో వచ్చింది. నేను చదివాను. నెహ్రూకు సంబంధించిన కొన్ని ఆంతరంగిక విషయాలు రాసిన మాట వాస్తవమే కానీ యిది మాత్రం లేదు. ప్రస్తుతం ఆ పుస్తకం ప్రతులు అలభ్యం. ''ఇంప్రింట్" పత్రికలో వేసిన దాని సంక్షిప్త రూపం నా దగ్గర వుంది. అందువలన ఆ పుస్తకం పేరు చెప్పి అబద్ధాలు చెపితే నేను కనుక్కోగలను. కానీ యీ సౌలభ్యం అందరికీ వుండదు కాబట్టి వాళ్లు పుకార్లు పుట్టించగలుగుతున్నారు. పుస్తకం ఏదైనా వెబ్‌సైట్‌లో దొరికినా చదివే ఓపిక వుండదు కాబట్టి బుకాయించేయవచ్చు. నేను గోడ్సే సీరీస్ రాసినప్పుడు ఒక పాఠకుడు మహాత్మా గాంధీ అనని మాటల్ని కూడా అన్నట్టుగా రాసేసి, ఆధారాలివిగో అంటూ యిచ్చేశారు. వెళ్లి వెతికితే అక్కడున్నది వేరు, యీయన రాసినది వేరు. ఇదిగో యిప్పుడు దీని గురించి వివాదం నడుస్తోంది!

కాస్సేపు నెహ్రూ తాత ముస్లిమే అనుకుందాం. దానివలన ఏం నిరూపిస్తారు? నెహ్రూ పాండిత్యాన్ని కాని, ప్రజాదరణను కానీ, నాయకత్వ పటిమను కానీ పరిపాలనాకౌశలాన్ని కానీ తగ్గించగలరా? హెచ్చించగలరా? ప్రజలు నెహ్రూను నెహ్రూగా చూశారు తప్ప, ముస్లిమా, పార్శీయా, క్రైస్తవుడా అని చూడలేదు. నేను కశ్మీరీ బ్రాహ్మణ్ని కాబట్టి నాకు ఓట్లేయండి అని నెహ్రూ అడగలేదు కదా! కొందరు షెడ్యూల్ కాస్ట్ అని షెడ్యూల్ ట్రైబ్ అని చెప్పుకుని రిజర్వ్‌డ్ స్థానాల నుంచి పోటీ చేస్తారు. వాళ్ల ఆ కులాలకు చెందినవారు కాదని తక్కినవాళ్లు కేసులేస్తారు. నెహ్రూ అటువంటి రిజర్వ్‌డ్ స్థానం నుంచి పోటీ చేసి వుంటే యిలాటి సమాచారం కీలకమయ్యేది. కొంతమంది రాష్ట్ర, కేంద్ర మంత్రులు ఎన్నికల అఫిడవిట్లలో లేని డిగ్రీలు రాసేసుకుంటారు. వాళ్ల మీదా కేసులు పడతాయి. నెహ్రూ అలా దొంగ డిగ్రీ చెప్పుకున్న దాఖలా కూడా లేదు. జనాలు అతని కులం, మతం చూసి కాదు, అతని సిద్ధాంతాలు నచ్చి ఓట్లేశారు. ఇంకెందుకు వంశ చరిత్ర తవ్వాలి? 'అబ్బే, యీ రహస్యం ఛేదిస్తే నెహ్రూ ముస్లిములను బుజ్జగించడానికి గల కారణం ఏమిటో తెలిసిపోతుంది' అంటారా? దేశవిభజనకు అంగీకరించడం ముస్లిములను బుజ్జగించడంలో మొదటి మెట్టు అనుకుంటే దేశవిభజనకు అందరి కంటె ముందుగా అంగీకరించిన రాజాజీ, ఆంబేడ్కర్ తాతల గురించి కూడా ఆరాలు మొదలుపెట్టాలి. స్వాతంత్ర్యానంతరం ముస్లిములను ఓటు బ్యాంకులుగా చూసి వారిని బుజ్జగించారు అనుకుంటే, ఆ పని చేసిన, చేస్తున్న, చేయబోతున్న జాతీయ, ప్రాంతీయ, కుడి, ఎడమ పార్టీల నాయకులందరి తాతల సంగతీ కూపీలు లాగాలి.

వారందరినీ వదిలేసి నెహ్రూ, మోతీలాల్ నెహ్రూ, గంగాధర నెహ్రూల గాథలే ఎందుకు తవ్వితీయాలి? అదేమిటో సడన్‌గా అందరూ హిస్టరీ రిసెర్చర్లు అయిపోయారు. నెహ్రూకు, లేడీ మౌంట్‌బాటెన్‌కు సంబంధం వుందా? నెహ్రూ పచ్చి వ్యభిచారిట కదా, ఇందిరా గాంధీ తిరుగుబోతుట కదా, మోతీలాల్ నెహ్రూకు భార్య కాక ఉంపుడుగత్తెలున్నారట కదా.. యిలా ఎన్నో ప్రశ్నలు నాకు వచ్చిపడుతున్నాయి. మోతీలాల్‌కు జవహర్‌లాల్‌కు గల సిద్ధాంతవైరుధ్యాలేమిటి? ప్రజాస్వామ్యం పట్ల నెహ్రూకు వున్న కమిట్‌మెంట్ ఇందిరకు వుందా లేదా? వంటి ప్రశ్నలు రావటం లేదు. ఎవరు ఎవరితో పడుక్కున్నారు అనేదే యిప్పుడు చరిత్రకు అతి కీలకమైన అంశం అయిపోయింది. మన దేశంలోనే కాదు, విదేశాలతో సహా – అనేకమంది చరిత్రలు చదివిన, వారి గురించి విన్న విషయాలతో నాకు బోధపడినదేమిటంటే – పబ్లిక్ లైఫ్‌లో వున్న చాలామంది జీవితాల్లో లైంగికపరమైన బలహీనత వుంటోందని! కుటుంబానికి దూరంగా వుండడం చేత, యితర నాయకులతో కలిసి టూర్లలో తిరిగే అవకాశాలు ఎక్కువగా వుండడం చేత యిలాటివి జరుగుతూండవచ్చు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న నాయకుల్లో సైతం యిది కనబడుతుంది. అంతెందుకు, కాన్సన్‌ట్రేషన్ క్యాంపుల్లో మృత్యుముఖంలో వున్న యూదుల్లో సైతం యిది వుందని ఏనే ఫ్రాంక్స్ డైరీ చదివితే బోధపడుతుంది. అందువలన వీటిపై చర్చ అనవసరమని నా వ్యక్తిగత అభిప్రాయం. నాయకుల రాజకీయపరమైన నిర్ణయాలు కాని, పాలనాపరమైన విధానాలు గాని వారి

అక్రమసంబంధాల కారణంగా ప్రభావితమైనప్పుడే మనం వాటిని సీరియస్‌గా పట్టించుకోవాలి. లేడీ మౌంట్‌బాటెన్‌తో స్నేహం కారణంగా నెహ్రూ మాకు స్వాతంత్ర్యం అక్కరలేదని చెప్పి వుంటే అప్పుడు ఆ స్నేహాన్ని చర్చించాలి. లేకపోతే అది కేవలం వారివారి కుటుంబసభ్యులకు సంబంధించిన వ్యవహారం మాత్రమే!

మాటవరసకి గంగాధరుడు ఒరిజినల్‌గా ఘియాసుద్దీన్ అనుకుందాం, ఏదో ఒక కారణం చేత హిందూమతంలోకి మారాడనుకుందాం. తప్పేమైనా వుందా? ఎంతోమంది హిందువులు ముస్లిములుగా, క్రైస్తవులుగా మారారు. వారందరినీ మీ తాతల కాలం నాడు హిందూ కుటుంబం అని వాళ్లెవరైనా ఎత్తి చూపుతారా? వివక్షత చూపుతారా? ఈనాడు స్వామీజీల బోధనలు విని హిందూ మతంలోకి చేరిన అనేకమంది విదేశీయులున్నారు. వారిని మనం వేలెత్తి చూపిస్తున్నామా? ఇటీవలి కాలంలో కొన్ని సంస్థలు "ఘర్ వాపసీ" పేరుతో అనేకమంది గిరిజనులను, ముస్లిములను హిందూమతంలోకి చేర్చుకుంటున్నాయి. రేపు వారిని కూడా మీ నాన్న పేరిది, మీ తాత పేరిది, మీరు ఒరిజినల్‌గా హిందువులు కాదు అని అదో పెద్ద అంశంగా చేస్తారా? నిజానికి ఏ వ్యక్తి మూలాలు ఎక్కడున్నాయో కనుక్కోవడం అంత సులభం కాదు. మన దేశంలోకి శకులు, హూణులు, కుషానులు, యవనులు, మ్లేచ్ఛులు యిలా ఎందరో దండెత్తి వచ్చి మన దేశజనాభాలో విలీనమై హిందువులయ్యారు. మన దేశంలో కొంతకాలం బౌద్ధం, జైనం ప్రసిద్ధమతాలుగా వున్నపుడు అనేకమంది హిందువులు ఆ మతాల్లో చేరారు. వాటి ప్రభావం క్షీణించగానే మళ్లీ హిందూమతంలోకి వచ్చేశారు. వీరందరి గతాన్ని ఎత్తి చూపి 'మూడు తరాల కితం నువ్వు ఫలానా' 'నూరు తరాల కితం నువ్వు ఫలానా' అని ముద్రలు కొడుతున్నారా? ముస్లిములు, ఆంగ్లేయులు అధికారంలో వున్నపుడు కొందరు హిందువులు పదవుల కోసమో, ఉద్యోగాల కోసమో మతం మారారట. వాళ్లను చూసి ఒరిజినల్ ముస్లిములు, క్రైస్తవులు అసూయ పడి వుండవచ్చు. ఇప్పుడు మోతీలాల్ తండ్రి హిందూమతంలోకి వచ్చినందువలన ఆయనకు గాని, కొడుకుకు గాని, మనుమడికి గాని ఏదైనా పదవి/ఉద్యోగం/హోదా దక్కిందా? అలాటిది లేనప్పుడు యిక దానిపై చర్చ ఎందుకు?

ఇంతకీ గంగాధర నెహ్రూ కథేమిటి అని తెలుసుకోవాలని ఎవరైనా అనుకోగానే మొదటగా చూసేది వికీపీడియా. అందుకని దానిలోనే గంగాధర్ అసలు పేరు ఘియాసుద్దీన్ ఘాజీ అని, బ్రిటిషువారి వేధింపు నుంచి తప్పించుకోవడానికి హిందువుగా మారాడని ఒక సమాచారాన్ని చొప్పించారు. ఎవరు చేశారీ పని? వికీపీడియాలో ఎవరు కావాలంటే వాళ్లు ఏది కావాలంటే అది రాసేయవచ్చు, యింకోళ్లు వచ్చి మార్చేయవచ్చు. తెలంగాణ ఉద్యమం నడిచే రోజుల్లో వికీపీడియాలో ఒక వ్యాసంలో బ్రహ్మానంద రెడ్డి 1969 తెలంగాణ ఉద్యమం అణచి వేసినందుకే నక్సలైట్ ఉద్యమం వచ్చిందని రాసేశారు. ఎవరో దాన్ని కోట్ చేస్తూ నాతో వాదనకు దిగారు. నక్సలైట్ ఉద్యమం రాష్ట్రంలో ఎప్పుడు ప్రారంభమైందో వేరే ఎక్కడైనా చదువుకుని అప్పుడు మాట్లాడమని చెప్పాను.

అంతెందుకు, "రుద్రమదేవి" సినిమా గురించి సినిమా ఎనౌన్సు చేయగానే నిర్మాతలు కాకుండా వేరెవరో వికీపీడియా పేజీ సృష్టించారు. దానిలో రచన – డా॥ ముదిగొండ శివప్రసాద్, మధుబాబు, ఎమ్బీయస్ ప్రసాద్ అని రాశారు. నిజానికి మేము కథాపరిశోధనా బృంద సభ్యులం. రచన గుణశేఖర్, రచనా సహకారం తోట ప్రసాద్. రచనా విభాగంలో వారి పేర్లు లేవు. ఆ తప్పు సమాచారాన్ని యితరులు కాపీ చేసి తమ బ్లాగ్‌లలో పెట్టుకోవడం వలన అదే యించుమించు ఏడాదిన్నరపాటు ప్రచారంలో వుంది. చివరకు సినిమా రిలీజుకు ముందు వికీపీడియా పేజీని సవరించారు. కానీ తక్కినవాటిల్లో సవరించబడలేదు. మీరు గూగుల్‌కి వెళ్లి mbs prasad rudramadevi film అని కొడితే తెలుస్తుంది – ఎన్ని వెబ్‌సైట్లలో యిప్పటికీ పొరబాటుగా వుందో! ఇలా వుంటాయి వికీపీడియా రాతలు, సవరింపులు. నా ప్రమేయం ఏమీ లేకుండానే నాకు అనవసరమైన క్రెడిట్ యివ్వబడింది. ఫేస్‌బుక్ కూడా యిలాటిదే. ఎవరో కానీ నా పేర ఫేస్‌బుక్ పేజీ తెరిచారు. దానిలో కొన్ని వివరాలు కరక్టే అయినా నా డేట్, ఇయర్ ఆఫ్ బర్త్ తప్పుగా రాశారు. ఈ నాటి సాంకేతిక యుగంలో వేరేవారి పేర మనం మంచికాని, చెడుకాని రాయడం ఎంత సులభమో యిలాటి ఉదాహరణలు చెప్తాయి.

ఇంతకీ గంగాధర నెహ్రూ గురించి అతను జన్మతః ముస్లిము అనే సమాచారాన్ని కావాలని ఎవరు చొప్పించారు? వికీపీడియాను ఎడిట్ చేసేవారు ఏ సర్వర్ నుంచి చేస్తున్నారో గమనించేందుకు సెంటర్ ఫర్ ఇంటర్నెట్ అండ్ సొసైటీ తరఫున ప్రాణేశ్ ప్రకాశ్ అనే ఆయన సాఫ్ట్‌వేర్ తయారు చేశారట. దాని ద్వారా ట్రాక్ చేస్తే అది ఇండియన్ గవర్నమెంటు వారి నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఐఎన్‌సి) అందించిన ఐపి అడ్రసు నుంచే మార్చారని తేలిందట. అలాగే నెహ్రూ పేజీలో ఎడ్వినా మౌంట్‌బాటెన్‌తో వ్యవహారం గురించి రసవత్తరమైన విషయాలు జోడించారట. ఇదంతా 2015 జూన్‌లో టైమ్స్ ఆఫ్ ఇండియాలో రాగానే (http://timesofindia.indiatimes.com/india/Wiki-entries-on-Nehru-family-edited-from-NIC-IP/articleshow/47888589.cms) కాంగ్రెసు యిదంతా మోదీ సర్కారు కావాలనే చేసిందని గొడవ చేసింది. మొత్తానికి దాన్ని తీసేశారు. అప్పణ్నుంచి యిదిగో యిలా ప్రచారం చేయడం మొదలుపెట్టారన్నమాట. ధర్మసందేహంగానో, పుకారుగానో, పరిశోధకాంశంగానో దానికి దుస్తులు తొడిగి చలామణీలో పెట్టారు. పంచతంత్రంలో నలుగురు వరుసగా చెప్పగా ఆవుని కుక్క అనుకున్న బ్రాహ్మణ్లా కొందరైనా యీ ప్రచారం నమ్మకపోరని వారి అంచనా. ఇలాటిదే మరో దాని గురించి కూడా యిదే సందర్భంలో చెప్తాను.

మెకాలే బ్రిటిషు పార్లమెంటులో 1835 ఫిబ్రవరిలో యిచ్చిన ప్రసంగం అంటూ గత ఐదారేళ్లగా ఒకటి ఫార్వార్డ్స్ లో తెగ వస్తూంటుంది. తెలుగులో దాని అర్థం ఏమిటంటే – "నేను భారతదేశం నాలుగువైపులా తిరిగాను. ఒక దొంగగాని, బిచ్చగాడు కానీ

లేదు. ఇక్కడి ప్రజలు ఐశ్వర్యంతో, ఉన్నత నైతిక విలువలతో, గొప్ప నైపుణ్యంతో విలసిల్లుతున్నారు కాబట్టి వీరిని జయించడం ఎప్పటికీ సాధ్యం కాదు. జయించాలంటే దేశానికి వెన్నెముకలా నిలిచిన వీరి సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వం నాశనం చేయాలి. అందువలన వారి పురాతన విద్యావిధానాన్ని మార్చి దాని స్థానంలో విదేశీయత గొప్పదని, తమ భాషల కంటె ఇంగ్లీషు మిన్నయైన భాష అని అనుకునేట్లా చేయాలి. అప్పుడు వారికి ఆత్మగౌరవం నశించి, దేశీయ సంస్కృతి పోగొట్టుకుని మనం కోరుకున్న బానిసజాతిగా మారుతుంది.”

అది చదవగానే యిది బోగస్‌దని నాకు వెంటనే తోచింది. అసలా ఇంగ్లీషే బాగా లేదు. అప్పట్లో ఇంగ్లీషు కాంప్లెక్స్, కాంపౌండు వాక్యాల్లో రాసేవారు. ఇది సీదాసాదాగా వుంది. కొన్ని వెర్షన్లలో పంక్చువేషన్ సరిగ్గా లేక మరీ దరిద్రంగా రాశారు. కాలిబర్ ఇంగ్లీషు స్పెల్లింగు కాకుండా అమెరికన్ స్పెల్లింగ్ రాశారు. పైగా పార్లమెంటులో ప్రసంగం అంటే ఏదో పుస్తకంలో అచ్చు వేసే వుంటారు. దాన్ని స్కాన్ చేసి పెట్టకుండా విడిగా టైపు చేసి, పక్కన అతని ఫోటో పెట్టి చలామణీ చేయడమేమిటి? అప్పట్లో భారతదేశంలో ముష్టివాళ్లు, దొంగలు లేకపోవడమేమిటి, పురాణకాలం నుంచి మనకు వున్నారు. మన కావ్యాల్లో, కథల్లో అడుగడుగునా తగులుతారు. పైగా మెకాలే వంటి సామ్రాజ్యవాది మనల్ని మెచ్చుకుంటాడా? నాన్సెన్స్! మెకాలే విద్యావిధానాన్ని తిట్టడం యీనాటి ఆరెస్సెస్ వారికి మహా ముచ్చటైన పని. వారెవరో యీ ప్రచారానికి దిగి వుంటారని అనుకుని పట్టించుకోలేదు. కానీ యింకా యింకా వస్తూనే వున్నాయి.

ఇప్పుడు గంగాధర్ నెహ్రూ సంగతి రాగానే దాని సంగతేమిటాని పరికించి చూశాను. https://www.quora.com/Did-Lord-Macaulay-really-proclaim-in-the-British-Parliament-that-the-only-way-to-rule-India-is-to-make-the-Indian-culture-seem-inferior లో చాలామంది విపులంగా చర్చించారు. వాటి సారాంశం చెప్పేస్తాను. 1) మెకాలే 1835లో బ్రిటన్‌లో లేనే లేడు. 1834 జూన్ నుండి ఇండియాలోనే నాలుగ్గేళ్లు వున్నాడు. అతను ఇండియాకు లా ఎడ్వైజరీ హోదాలో మద్రాసుకు వచ్చి ఊటీ వెళ్లి కలకత్తా వచ్చాడు. రవాణా సౌకర్యాలు అంతంత మాత్రంగా వున్న ఆ రోజుల్లో భారతదేశాన్ని అతను అడ్డంగా, నిలువుగా కొలిచేశాననడం సర్వాబద్ధం. గవర్నరు జనరల్ కౌన్సిల్‌లో లా మెంబర్‌గా కలకత్తాలో ఆ రోజు ఎడ్యుకేషన్ మినిట్ అని సమర్పించాడు. అందువలన ఆ తారీకును వాడుకున్నారు. కానీ కలకత్తా కౌన్సిల్ అంటే ఘనంగా వుండదని బ్రిటిషు పార్లమెంటు అని కిట్టించారు. 2) మెకాలే వచ్చినది క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ రూపొందించడానికి ! పై స్టేటుమెంటు కరక్టయి వుంటే – దొంగతనం వంటి చిన్న నేరం కూడా జరగని దేశం తయారు చేసినందుకు ముస్లిము పాలకులను (ఎందుకంటే దేశంలో చాలా భాగం ముస్లిము సుల్తానుల ఏలుబడిలోనే వుంది) మెచ్చుకుని, యిక్కడ క్రిమినల్ కోడ్ అవసరం లేదని వెళ్లిపోయి వుండేవాడు. కానీ దాన్ని అతను రూపొందించి 1837లో సమర్పిస్తే అతని మరణించిన ఒక ఏడాదికి 1860లో పార్లమెంటు ఆమోదించింది. 3) ఆ సందర్భంగా అతను ఇండియా పేదదేశమనీ, శిక్ష విధించేముందు ఆ విషయం గమనించాలని వాదించాడు. ఇండియా ఐశ్వర్యంతో తులతూగిందని అతను అనే ప్రశ్నే లేదు. 1833లో పార్లమెంటులో మాట్లాడినప్పుడు బ్రిటిషు వారి రాకకు ముందు ఇండియా సంక్షోభంలో వుండేదని అతను ఉపన్యసించాడు. ఆనాటి బ్రిటిషు వారందరిదీ అదే అభిప్రాయం.

4) అతనికి భారతసమాజంపై గొప్ప అభిప్రాయం వుందని అనుకోవడానికి ఏ రుజువూ దొరకదు. అతను భారతదేశంలోని కులవ్యవస్థను, సతీ సహగమనాన్ని దుయ్యబట్టాడు. భారతీయ భాషల్లో అతి ముఖ్యమైన సంస్కృతం పట్ల, అప్పట్లో పాలకులు గౌరవించే అరబిక్ భాష పట్ల అతనికి గౌరవం లేదు. ‘‘నాకు సంస్కృతంతో కాని, అరబిక్‌తో కాని పరిచయం లేదు. వాటి అనువాదాలను మాత్రం చదివాను. తూర్పు దేశాల భాషల్లో ప్రావీణ్యం వున్నవారితో సంభాషించాను. ఇండియా, అరేబియాలో వున్న సాహిత్యమంతా కలిపినా యూరోపియన్ లైబ్రరీలో ఒక బీరువాలో వున్న సాహిత్యానికి సమానమవుతుందన్న నా అభిప్రాయాన్ని వారు కాదనలేదు. ప్రాగ్దేశాల విద్యావిధానాన్ని సమర్థించే కమిటీ సభ్యులు కూడా పాశ్చాత్య సాహిత్యపు ఔన్నత్యాన్ని అంగీకరించారు. (I have never found one among them who could deny that a single shelf of a good European library was worth the whole native literature of India and Arabia. The intrinsic superiority of the Western literature is indeed fully admitted by those members of the committee who support the oriental plan of education." ఇదీ మెకాలే సొంత భాష. దీన్ని వీళ్లు చలామణీ చేస్తున్న నోట్‌తో పోల్చి చూడండి – ఇమేజి జతపరుస్తున్నాను) 5) అతను భారతీయ విద్యావిధానంలో ఇంగ్లీషు భాషను ప్రవేశపెట్టాలని అన్నది – స్థానికులను (అతని దృష్టిలో) నాగరీకులను చేయాలని తప్ప వారిని దిగజార్చాలని కాదు. (అతని దృష్టిలో వాళ్లు పాతాళంలో మసలుతూ ఉద్ధరించబడవలసిన స్థితిలో వున్నారు). అసలు ఇంగ్లీషు వారెవరూ భారతీయులను అణగదొక్కుతున్నామనీ, వాళ్ల నడుం విరుస్తున్నామనీ ఎన్నడూ అనుకోలేదు, అనలేదు. అలాటిది పార్లమెంటులో అలా మాట్లాడతాడా? అసంభవం. పైగా అలా చేస్తే మనం తప్ప వాళ్లను ఓడించలేం అన్నది తప్పు. అప్పటికే వాళ్లు దేశంలో చాలా భాగం జయించేశారు.

ఇంతకీ మెకాలే ప్రవేశపెట్టిన విద్యావిధానం వల్లన దేశం భ్రష్టు పట్టిపోయిందా? మన జాతి వెనకబడిపోయిందా? జాతీయవాదులమని చెప్పుకునే ఛాందసులు ఎన్నయినా చెప్పవచ్చు. నా మట్టుకు నాకు మెకాలే విధానం వలననే మన జాతి ప్రగతి సాధించిందంటాను. అంతకు ముందు వున్న గురుకుల వ్యవస్థ లేదా మరో వ్యవస్థ ఏదైనా కానీయండి, దాని వలన సమాజంలో అతి కొద్దిమంది మాత్రమే చదువుకోగలిగారు. తక్కినవారందరూ చదువుకు దూరంగానే వున్నారు. అప్పట్లో పాండిత్యం అనేది ఒకటి రెండు సబ్జక్టులకు మాత్రమే

పరిమితమయ్యేది. మెకాలే విధానం వలన కాస్త సైన్సు, కాస్త హిస్టరీ, కాస్త జాగ్రఫీ, కాస్త లెక్కలు, కాస్త మాతృభాష, కాస్త యింగ్లీషు నేర్పసాగారు. వీటిలో ఏదో ఒక సబ్జక్టులో విద్యార్థికి ఆసక్తి కలిగి వుంటుంది. అప్పటివరకు దేశం ముక్కలుముక్కలుగా వుండింది. ఎవరి ప్రాంతీయభాష వారిదే. కామన్‌గా వుండే భాష సంస్కృతం మాత్రమే. కొన్ని ప్రాంతాల్లో పాలక భాషగా పర్షియన్, ఉర్దూ వుండేది. చాలా ఉన్నతవర్గాలవారు మాత్రమే వాటిలో ప్రావీణ్యత సంపాదించేవారు. మెకాలే కారణంగా అన్ని ప్రాంతాల వారూ ఇంగ్లీషు నేర్చుకుని తమ మధ్య అంతరాలు తగ్గించుకున్నారు. సంబంధబాంధవ్యాలు పెంచుకుని మనమంతా భారతీయులం, కలిసి వుండాలి అనే భావన ఏర్పరచుకున్నారు. ఇంగ్లీషు నేర్చిన భారతీయులు పై చదువులకు ఇంగ్లండు వెళ్లి అక్కడ ఇంగ్లీషువారు తమ పౌరులకు యిస్తున్న స్వేచ్ఛను, ప్రజాస్వామిక హక్కులను గమనించి, మేమూ మీ పౌరులమే కదా మాకు మాత్రం ఆ హక్కులు ఎందుకు యివ్వరు అని పోరాడారు. పోనుపోను సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని సమరం సాగించి, చివరకు సాధించారు. ఆ విధంగా ఇంగ్లీషు వారు మనకు యింగ్లీషు నేర్పించి వారి గొయ్యి వారే తవ్వుకున్నారు.

ఇంగ్లీషు వారు ప్రపంచంలో చాలా దేశాల్లో తమ పాలన సాగించిన కారణంగా ఇంగ్లీషుకు ప్రపంచప్రాచుర్యం లభించింది. ఇంగ్లీషు నేర్చినవారికి పోనుపోను అంతర్జాతీయంగా అవకాశాలు విస్తృతంగా కలిగాయి. ఈ కంప్యూటరు యుగంలో భారతీయులు లాభపడ్డారంటే దానికి కారణం ఇంగ్లీషు భాషా పరిజ్ఞానం. మనం ఏ ఫ్రెంచివారి వలసప్రాంతంగానో వుంటే మనకింత లాభం కలిగి వుండేది కాదు. ఇదంతా మెకాలే ఊహించలేదు. కానీ దేశవాసులకు సరైన చదువు వుండాలి, ఎక్కువమంది విద్యావంతులై వుండాలి అనే లక్ష్యం మాత్రం తప్పకుండా వుంది. ఈనాడు యింత శాతమైనా విద్యావంతులున్నారంటే ఆ విద్యావిధానం ప్రవేశ పెట్టడం చేతనే సాధ్యపడింది. లేకపోతే విద్య అనేది అతి కొద్ది వర్గాల చేతిలో మాత్రమే వుండి వుండేది. ఇప్పుడు మెకాలేని నిందించి ప్రయోజనం లేదు. భారతదేశపు గతమంతా ఘనంగా వుండేదని మనల్ని నమ్మించడానికి అతన్ని విలన్ చేయవలసిన అవసరమూ లేదు. అతని పేర చలామణీలో వున్న యీ ప్రసంగాన్ని పరికించి చూస్తే వట్టి కల్పన అని తెలుస్తుంది. కానీ దీనికి ఆరెస్సెస్ అధికార ముద్ర కొట్టింది. అడ్వాణీ వంటి మేధావి తవ్‌లీన్ సింగ్ "దర్బార్" పుస్తకసమీక్ష చేస్తూ అసందర్భంగా దీన్ని కోట్ చేశారు. దాన్ని బిజెపి పార్టీ తన వెబ్‌సైట్‌లో పెట్టింది. http://www.bjp.org/media-resources/press-releases/shri-lk-advanijis-latest-blog-qdurbar-an-extremely-interesting-bookq.

ఇవన్నీ చూసి కొంతకాలానికి యిది నిజమే అని అందరూ అనడం మొదలెడతారు. ఒక్కరు కూడా మెకాలే రాతలపై వచ్చిన పుస్తకంలోంచి సదరు పేజీని స్కాన్ చేసి చూపించండి అని అడగరు. మనం గొప్పవాళ్లం అనుకోవడం మనకు బాగుంటుంది కాబట్టి దానికి అనుగుణంగా ఏం చెప్పినా అనుమానించకుండా నమ్మేస్తాం. కానీ మన జాతి మొదటి నుంచి బోధిస్తూ వచ్చిన సిద్ధాంతం – సత్యాన్వేషణ. మన జాతీయ నినాదం కూడా 'సత్యమేవ జయతే'. సత్యం చెప్పకపోగా అసత్యాన్ని పనిగట్టుకుని ప్రచారం చేయడానికి కొందరు కంకణబద్ధులై వున్నారని మనం గ్రహించి జాగరూకులమై వుండాలి. మన జాతి ఔన్నత్యాన్ని చెప్పడానికి అసత్యాన్ని ఆసరాగా తీసుకోవడం దుర్మార్గం. ప్రస్తుతకాలంలో డిస్–యిన్‌ఫర్మేషన్ రాజ్యమేలుతోంది. అందువలన మనం మరింత మెలకువగా సత్యాన్ని తెలుసుకోవడానికి సర్వవిధాలా కృషి చేయాలి. గుడ్డిగా దేన్నీ నమ్మవద్దు – యీ వ్యాసంతో సహా, దేన్నీ! **– (సమాప్తం) ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2016)**

**జనవరి 06** **ఎమ్బీయస్ : క్రీమీ లేయర్ విమర్శలు**

క్రీమీ లేయర్ వ్యాసంపై వచ్చిన విమర్శలకు నా జవాబులు – 1) మా నాన్న పోయినపుడు గోదానం బ్రాహ్మడికే ఎందుకివ్వాలి? గొల్లవాడికి యివ్వవచ్చుగా అని అడిగారు ఒకాయన. నేను ఆ విషయాన్ని చెప్పిన సందర్భం ఏమిటి? నేటి సమాజంలో ఆవులను పోషించే పరిస్థితి లేదు అని చెప్పడానికి ఆ ఉదాహరణ చెప్పాను. దానిలో కులప్రస్తావన అనవసరం. ముందుగా గోదానం కాన్సెప్టు అర్థం చేసుకోవాలి. దానగ్రహీతకు నీకూ, నీ కుటుంబానికి సొంతానికి వుపయోగించుకో అని చెప్పి యిస్తారు తప్ప దీని పాలు అమ్ముకు డబ్బు చేసుకో అని యివ్వరు. అలా అయితే పాల కంపెనీలకే దానం యిచ్చేయవచ్చు. ఆ యిచ్చేది పేద బ్రాహ్మడికే ఎందుకివ్వాలి అంటే శుభాశుభాల్లో చాకలికి, మంగలికి, కంసాలికి, భోగం వారికి (యీ మధ్య మానేశారు), కొజ్జాలకు కట్నాలు (డబ్బు యిచ్చినపుడు తాంబూలాల్లో పెట్టి యిస్తారు) యిస్తారు. దాని వలన మాకు సామాజిక గౌరవం వచ్చేసిందని వాళ్లందరూ రిజర్వేషన్లు వద్దంటారా?

ముఖ్యంగా గుర్తు పెట్టుకోవలసినది దానం పుచ్చుకోవడం వలన బ్రాహ్మడికి సామాజిక గౌరవం పెరగదు. అర్థిగా, యాచకుడిగా వచ్చినవాడి స్థాయి ఎప్పుడూ తక్కువే. మహావిష్ణువంత వాడు బలి దగ్గర దానానికై వచ్చినపుడు కుబ్జుడై వచ్చాడనే చమత్కార శ్లోకం వుంది. ఊరికే వస్తోంది కదాని ప్రతి బ్రాహ్మడు దానాలు స్వీకరించడు. దానం పుచ్చుకోగానే సరికాదు, పుచ్చుకున్నందుకు గాను ప్రాయశ్చిత్త కర్మలుంటాయి. అవి చేసేవాళ్లే దానాలు స్వీకరిస్తారు. అందుకే చాలామంది పురోహితులు దానాలు పట్టరు. పట్టినవాళు ్లు కూడా కొన్ని రకాల దానాలు పట్టరు. ఈ తలకాయనొప్పి ఎందుని చాలామంది పురోహితులు ఆ వృత్తి నుండి తప్పుకుంటున్నారు, తమ పిల్లలను కంప్యూటర్ ఆపరేటర్ వంటి వేరే వృత్తుల్లోకి పంపుతున్నారు. బ్రాహ్మల్లో పురోహితుల శాతం చాలా చాలా తక్కువ.

వారికి సామాజిక గౌరవం వుందని యీ పాఠకుడు అంటున్నారు. వాళ్లేమో 'మాకు పిల్లనిచ్చేవాడు లేడు' అని టీవీల్లో వాపోతున్నారు. సాధారణ జనం పురోహితుడి కాళ్లకే మొక్కుతారు, అదీ పూజా సమయాల్లో! పుణ్యం వస్తుందనో మరో దానికో!! బ్రాహ్మణ పుటక పుట్టిన ప్రతివాడి కాళ్లకు దణ్ణాలు పెట్టరు. గోదాన ఘట్టం చూసి బ్రాహ్మలందరికీ సామాజిక గౌరవం వుందనడం పొరబాటు. గౌరవం అనేది వ్యక్తి గుణగణాల బట్టి, ఆర్థిక స్థితి బట్టి కలుగుతుంది.

తక్కువ కులం వారి యింట్లో అగ్రకులస్తులు భోజనం చేయరు అని మరొకరన్నారు. వీటన్నిటినీ నిర్ణయించేది ఆర్థికస్థాయి మాత్రమే. హరిజన ఐయేయస్ అధికారి యింటికి పేద బ్రాహ్మడు అతిథిగా వెళతానంటే రానిస్తారా? 'మా యింటికి ఎవరైనా అగ్రకులస్తులు వచ్చి భోజనం చేస్తే నాకు సామాజిక గౌరవం వచ్చేసినట్లే లెక్క, యిక నేను రిజర్వేషన్ కోరను' అని ఎవరైనా బిసి, ఎస్సీ అంటారా? ఇదేదో జగ్జీవన్ రామ్ వంట బ్రాహ్మడి వాదనలా వుంది. ఎస్సీ, బిసిలు కాని కులాల వారందరూ ఆత్మగౌరవాన్ని పోగొట్టుకుని, మేం అందరి కంటె తక్కువ, మాది నీచకులం, మాకు గౌరవం లేదు అని మనసా, వాచా, కర్మణా అనుకునేదాకా రిజర్వేషన్లు కొనసాగాలన్నమాట! వాళ్లకు అంత ఖర్మేం పట్టింది? ఎవడి కులం వాడికి గొప్ప. వేరే వాళ్లతో పోల్చుకునే పనే లేదు.

క్రీమీ లేయర్ భూస్వాముల విషయంలో, రాజకీయవేత్తల విషయంలో అప్లయి కానప్పుడు బిసిలకు మాత్రం ఎందుకు చేయాలని మరొకరు అడిగారు. ఆ భూస్వాములు, నాయకులు కూడా ప్రతిభావంతుల నుంచి అవకాశం లాక్కుని మా కియ్యండి అని డిమాండ్ చేసినప్పుడు వాళ్లకీ యిది తప్పక అప్లయి చేయాలి. రిజర్వేషన్ అనుభవించేవారిని అడగ వలసిన ప్రశ్న – '90 మార్కులు వచ్చినవాణ్ని కాదని 70 మార్కులు వచ్చినా నీకిస్తోంది సమాజం. దాన్ని జస్టిఫై చేసుకోవలసిన అగత్యం నీది. నాకు కుప్పలుతిప్పలుగా డబ్బున్నా సామాజిక గౌరవం లేదు అనే సాకు చూపించి నువ్వు పుచ్చుకుంటున్నావు. మరి నీ కులంలోనే పుట్టి నీలా డబ్బు కూడా లేనివాడి మాటేమిటి? వాడి పట్ల నీకు బాధ్యత లేదా? తక్కిన సమాజం నీ పట్ల చూపిన ఆదరం కూడా నువ్వు అతని పట్ల చూపవా? గ్యాస్ సబ్సిడీ వదులుకున్నవాళ్లలా నువ్వు రిజర్వేషన్ వదులుకోలేవా?' అని.

ఇది ఆర్థికపరమైన వెనకబాటుతనం సమస్య కాదు, సామాజిక వెనకబాటుతనం అని వాదించారొకాయన. నేననేది – సామాజిక వెనకబాటుతనం, ఆర్థిక వెనకబాటుతనం రెండూ వున్నవారి గురించి పట్టించుకోండి మహాప్రభో అని. ఇప్పటికిప్పుడు బిసి రిజర్వేషన్లు ఎత్తివేయమని నేననలేదు. అది సాధ్యం కాదనీ తెలుసు. ఎస్సీ రిజర్వేషన్ల మాట చెప్పనే అక్కరలేదు. ఇంతకంటె పెరక్కుండా వుంటే అంతే చాలురా బాబూ అన్నట్టున్నారు మామూలు ప్రజలు. బిసిలలోనే కడుపునిండిన వారు నిండనివారిపై కనికరం చూపాలని చెప్తున్నాను. తక్కిన కులాల వారిచ్చే గౌరవం గురించి రెచ్చిపోయి మాట్లాడే యీ బిసి నాయకులకు తమ కులానికే చెందిన పేదల పట్ల సహానుభూతి, సానుభూతి కూడా లేకపోవడం శోచనీయం. వాళ్లింట్లో వీళ్లు విస్తరి వేస్తారా?

నిజానికి క్రీమీ లేయరు షరతు విధించాలని యితర కులాల వాళ్లు కాదు, బిసి, ఎస్సీలలో పేదలు పోరాడాలి. 'మీరు యిప్పటిదాకా మా పేరు చెప్పిన అనుభవించినది చాలు, యికపై ఆ ఫలాలు మాకు పంచండి' అని ఆ కులాల యువత వాళ్ల నాయకులకు గట్టిగా చెప్పాలి. బిసిలలో పేద యువత మార్గం చూపితే, ఎస్సీ పేద యువత కూడా అనుసరించవచ్చు. మొదటి మెట్టుగా ప్రస్తుతం వున్న క్లాజ్ వ్యాపారస్తులకు ప్రతికూలంగా, ఉద్యోగులకు, పెద్దరైతులకు అనుకూలంగా వుంది. ఎందుకంటే జీతం రూపేణా వచ్చేది, వ్యవసాయ భూములపై వచ్చే ఆదాయం రెండు పరిగణనలోకి తీసుకోవడం లేదు. వ్యాపారంలో వచ్చే లాభం మాత్రం తీసుకుంటున్నారు. తీసుకుంటే అన్నీ తీసుకోవాలి అని వ్యాపారస్తుల పిల్లలు అడగాలి. ఉన్నతోద్యోగుల్లో వున్న బిసిలు తమకు, తమ కుటుంబీకులకు అనువుగా ఏర్పరచుకున్న రూలు యిది. దీని హేతుబద్ధతను ప్రశ్నించవలసినది నష్టపోతున్నవారే! **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2016)**

**జనవరి 07** **ఎమ్బీయస్ : మోతీలాల్ వ్యాసం– విమర్శలు**

మోతీలాల్ తండ్రి వ్యాసంపై విమర్శలకు నా జవాబులు – కాంగ్రెసుపై యీగ వాలనీయనంటూ నన్ను యీగలు తోలేవాడిగా అనుకునేవాళ్లు ఎమర్జన్సీ సీరీస్‌లో నేను కాంగ్రెసు చరిత్రను గ్రంథస్తం చేస్తున్న తీరు గమనించాలి. యుపిఏ ప్రభుత్వం నడిచినప్పుడు నేను రాసిన వ్యాసాలు గుర్తు చేసుకోవాలి. 'నేషనల్ హెరాల్డ్' కేసు గురించి నేను రాయలేదనేవాళ్లు ఆర్కయివ్స్ చూసి మాట్లాడాలి. సోనియా జైలుకి వెళ్లాల్సినంత కేసు అది. కేసు బాగా బిల్డప్ చేసి, సరిగ్గా హేండిల్ చేయకపోతే చరణ్ సింగ్ ఇందిరా గాంధీ విషయంలో తొందరపడి ఆమెకు సానుభూతి తెచ్చిపెట్టిన చరిత్ర పునరావృతమౌతుంది. నన్ను యీ ప్రశ్న వేసినాయన కేవలం సందేహనివృత్తి గురించే అయితే ఒక్క వాక్యంతో సరిపెట్టేవారు. సోనియా రాజకీయాల గురించి ఆయన విమర్శలు గుప్పించి చివర్లో రాసిన వాక్యం చూడండి – 'ఆ కుటుంబమూలాల గురించి నిగ్గదీస్తే తప్పేముంది?' రాజకీయనాయకులను విమర్శించాలంటే వారి రాజకీయాల గురించి మాట్లాడాలి. సోనియాను, కాంగ్రెసును ఎదుర్కోవడానికి, పోరాడడానికి కావలసినంత బాణసంచా వుంది. పదేళ్ల దుష్పరిపాలన ఒక్కటే చాలు. అది వదిలేసి సోనియా తాత గురించి మాట్లాడినా అప్రస్తుతం. అలాటిది ఆమె భర్త తాతగారి తాతగారి గతం గురించి తవ్వడం అసందర్భం. ఆయన 'ఇందిరా గాంధీ కోడల్నంటూ సోనియా..' అంటూ ఏమేమో రాశారు. ప్రధాని కావాలనే కాంక్షతో తగినంత ఎంపీలు లేకపోయినా రాష్ట్రపతికి తప్పుడు జాబితా యిచ్చి భంగపడినప్పుడు కూడా సోనియా ఇందిర

కోడలే. తర్వాత డీ–ఫ్యాక్టో ప్రధాని అయిందంటే అది ప్రతిపక్షాల చలవే. సోనియా కుటుంబం తప్ప వేరెవర్నీ ఎన్నుకోలేకపోవడం కాంగ్రెసు దౌర్భాగ్యం. వాళ్లు సెల్ఫ్ గోల్ చేసుకుంటే మన కెందుకు గోల? ఆ కాంగ్రెసు మళ్లీ మళ్లీ అధికారంలోకి వచ్చేట్లు చేస్తున్న ప్రతిపక్షాలది దౌర్బల్యం. వాళ్ల సంగతి కాస్త చూడండి. ప్రాంతీయ పార్టీలలో కూడా అధికారం ఒక కుటుంబం చుట్టూనే తిరుగుతూండడం చూస్తున్నాం. బిజెపి విషయంలో వ ృద్ధులే ముఖ్య పదవుల్లో వుంటూ వచ్చారు. ఆ యా పార్టీ సభ్యులు మిగతావారిని ఎందుకు ఎన్నుకోరు? అని మనం వర్రీ అయ్యి ప్రయోజనం లేదు.

గాంధీ పేరు చెప్పుకుని నెహ్రూ కాని, ఇందిర కాని అధికారంలోకి వచ్చాడనడం హాస్యాస్పదం. గాంధీ, నెహ్రూకు గల సిద్ధాంతవైరుధ్యం జగద్విదితం. నెహ్రూ పేరుకుండే గ్లామర్ దాని కుంది. ఇందిర పెళ్లయిన తర్వాత కూడా పుట్టించి పేరు నెహ్రూ వదులుకోలేదు. చాలాకాలం పాటు 'ఇందిరా నెహ్రూ గాంధీ' అనే రాసుకునేది. గాంధీ యింటి పేరున్నందుకే ఓట్లేస్తున్నారనుకోవడం అవివేకం. మహాత్మా గాంధీ వారసులు ఎన్నికలలో నిలబడితే గెలుస్తారా? గాంధీ యింటి పేరుకి అంత విలువుంటే వరుణ్ గాంధీ ఒక ఎంపీగానే మిగిలిపోయాడేం? గుజరాతీల్లో, పంజాబీల్లో కూడా గాంధీలున్నారు. వాళ్లందరికీ జనాలు మొక్కుతారా? గాంధీ ఒక్కడే స్వాతంత్ర్యం తెచ్చాడని అనుకునేటంత మూరు?లుంటే దేవుడే వారిని రక్షించాలి. ప్రతి రాష్ట్రంలోను స్థానిక స్వతంత్రయోధుల విగ్రహాలున్నాయి, వాళ్ల పేర కాలనీలున్నాయి, రోడ్లున్నాయి. గాంధీ నాయకులకు నాయకుడు. అందుకే ఆయన పేర ఎక్కువున్నాయి. గాంధీ యింటి పేరున్నంత మాత్రాన ఇందిరకు ప్రధాని పదవి అప్పగించలేదు. ఎటువంటి పరిస్థితుల్లో ఆమెకు అది దక్కిందో, అది ఊడిపోయే పరిస్థితి ఎలా వచ్చిందో, ఎన్ని టక్కుటమార విద్యలు ప్రదర్శించి దాన్ని నిలుపుకుందో ఎమర్జన్సీ సీరీస్‌లో రాశాను. ఓపికుంటే చదవండి.

ఎన్నికల అఫిడవిట్‌లో మతం గురించి కూడా రాయాలి అని ఒకరు గుర్తు చేశారు. నిజమే, దానిలో మీ మతం రాస్తారా? లేక మీ తాతముత్తాతలు మతం మారితే దాని గురించి రాస్తారా? నెహ్రూ అనే యింటి పేరు కిట్టించినది అని ఒకరు రాశారు. ఇంటి పక్కన కాలువ 'నహర్' వుంది కాబట్టి యింటి పేరు యిలా మారిందని కూడా ముందు నుంచీ చెప్తూనే వున్నారు. ఇటువంటివి జరుగుతూనే వుంటాయి. జోస్యం బాగా చెప్పేవారి కుటుంబానికి మొదటినుంచి వున్న యింటిపేరు మారి జోస్యం యింటిపేరుగా మారిన సంగతి విన్నాను. వైయస్ యింటిపేరులో ఎస్ అంటే 'సందింటి'. సందులో వున్న యింటికి చెందిన కుటుంబం అనే అర్థంలో యింటిపేరు మధ్యలో మారి వుండవచ్చు. అందరికీ గోత్రాలు వుంటాయని లిస్టు యిచ్చినాయన చివర్లో నెహ్రూలకు గోత్రం వుందో లేదో, వుంటే ఏమిటో రాయలేదు. వాళ్ల మూలాల గురించి వీళ్లకున్న శంకలు యితర కశ్మీరీ పండిత కుటుంబాలకున్నట్లు కనబడటం లేదు. ఎందుకంటే 'కౌల్'లు వీళ్లకు పిల్లనిచ్చారు. (ఇప్పుడు కౌల్‌ల గురించి కథనాలు వస్తాయేమో!)

రాజకీయాలు చర్చించేటప్పుడు పాలనతో సంబంధం లేని వ్యక్తిగత విషయాల ప్రస్తావన అనవసరం అన్న నా వాదనను కౌంటర్ చేయడానికి ఒకాయన నేను ఎన్టీయార్ హీరోయిన్లను ఏదో (ఆ మాటలు ఆయనవి, నావి కావు) చేశాడని రాశానన్నారు. నేను రాసినది తెరపై కనబడిన వ్యవహారం గురించి, పడగ్గదుల్లో నడిచినవాటి గురించి కాదు. స్వాష్ బక్లింగ్ హీరో తెరపై చేసే మోటు సరసం గురించి, మెలోడ్రమటిక్ హీరో తెరపై లలితశ ృంగారం గురించి తేడాలు వివరించినప్పుడు రాసిన వాక్యాలను యిక్కడ ప్రస్తావించడం అసందర్భం. రాజకీయవేత్తగా ఎన్టీయార్‌ను చర్చించినపుడు ఆయన తెరవెనుక వ్యవహారాల గురించి రాయడం అనవసరం. ఆయన మొదటి భార్య ప్రస్తావనా అక్కలేదు. రెండో భార్య గురించి మాత్రం తప్పక వస్తుంది, ఎందుకంటే ఆమె పాలనలో జోక్యం చేసుకుంది. ఆమె కారణంగా ఎన్టీయార్ రాజకీయ సంక్షోభం ఎదుర్కున్నారు. ఎన్ఐసి వెబ్‌సైట్ నుంచి అప్‌లోడ్ అయిందనే వార్త 'టైమ్స్ ఆఫ్ ఇండియాలో రాగానే కాంగ్రెసు యిదంతా మోదీ సర్కారు కావాలనే చేసిందని గొడవ చేసింది.' అని రాశాను తప్ప అది నా అభిప్రాయంగా రాయలేదు. అది గమనించకుండా కొందరు కామెంట్లు రాశారు. ఇంగ్లీషు పాలన వలన కలిగిన లాభాలలో ఇంగ్లీషు భాష ఒక అంశం మాత్రమే. దేశాన్ని ఐక్యం చేయడం వంటి అనేక అంశాలు రాశాను. వాటిని విస్మరించవద్దు. మెకాలే విద్యావిధానం వలన భారత్‌కు మేలు జరిగిందని రాశాను తప్ప మెకాలే అభిప్రాయాలను మెచ్చుకోలేదు.

ఈ వ్యాసం రెండు భాగాలకు లింకు లేదని కొందరనుకున్నారు. రెండు భాగాల్లో నేను ఎత్తి చూపినది – డిస్–ఇన్‌ఫర్మేషన్ ఒక పథకం ప్రకారం నడుస్తోంది గమనించండి అని. నా ప్రశ్నకు ఆన్సర్ రాలేదని వాపోయారు సదరు పాఠకుడు. ఇదేమీ బిట్ క్వశ్చన్ కాదు ఠక్కున చెప్పడానికి. టీచరు లెక్క ఎలా చేయాలో ఒక ఉదాహరణ చెప్తాడు తప్ప అన్ని లెక్కలూ చేసి చూపించడు. సులభమైన లెక్క ఆయన చేసేసి, కష్టమైనవి మనకు పడేస్తాడు. మెకాలే విషయంలో కొందరు వాస్తవాలు తవ్వితీసి, అదెంత బోగస్సో నిరూపించారు. దాని ఆన్సర్ యిప్పటికే తెలుసు కాబట్టి నేను టీచర్లా అది చెప్పి వూరుకున్నాను. మోతీలాల్ తండ్రి అసలు మతమేమిటో నేను చెప్పేస్తానని  కొందరు ఎదురు చూసినట్లున్నారు. మా ముత్తాతల పేర్ల వరకే నాకు తెలుసు. ఆ పై వాళ్లెవరు, ఎక్కణ్నుంచి వచ్చారు అన్నది నాకు తెలియదు, నేను పట్టించుకోలేదు.  మోతీలాల్ తండ్రి గురించి తెలుసుకునే ఉబలాటం వున్నవాళ్లే రెండో లెక్క సాల్వ్ చేయాలి. అవతలివాళ్లు ఆరోపణకు ఆధారం చూపకుండానే ప్రచారం మొదలుపెట్టారు, అది యిప్పుడు ప్రశ్నల రూపం ధరించింది. నన్ను అడిగిన పాఠకుడు ప్రదర్శిస్తున్న పరిజ్ఞానం గమనిస్తే ఆయన ఏమీ తెలియనివాడు అడుగుతున్నట్లు లేదు. ఒక నిర్ధారణకు వచ్చేసి ఆ భావాన్ని వ్యాప్తి చేయడానికే యీ వేదిక ఉపయోగించుకున్నారని తెలుస్తోంది. మెకాలేకు భారతదేశం పట్ల, దాని భాషల పట్ల ఎంత చిన్నచూపుందో నా కంటె విస్తారంగా రాశారు కదా. చివర్లో 'అందువలన మెకాలే పేరు మీద ప్రచారంలో వున్న పై

ప్రకటన అబద్ధం – ఆద్వాణీ ఉటంకించినా, ఆరెస్సెస్ వాళ్లు ఎంత ప్రచారం చేసినా ..!' అని చేర్చి వుంటే అప్పుడు ఆయన చిత్తశుద్ధిపై నాకు అనుమానం కలిగేది కాదు.

ఇక ఆయన ప్రశ్నించే విధానం గురించి ఒక మాట – లాజిక్‌లో 'డైలమా'కు ఉదాహరణ చెప్తారు – ''నువ్వు నీ భార్యను కొట్టడం మానేశావు కదా, అవునో కాదో ఒక్క మాటలో చెప్పు'' అని అడగడాన్ని డైలమా అంటారు. భార్యను ఎప్పుడూ కొట్టనివాడు అవుననీ చెప్పలేడు, కాదనీ చెప్పలేడు. అవునంటే గతంలో కొట్టాడన్న అర్థం వస్తుంది, కాదంటే యింకా కొడుతున్నాడన్న అర్థం వస్తుంది. ఇప్పుడీయన వేసిన ప్రశ్న యిలాటిదే. ముస్లిం కాదు అన్నాననుకోండి, ఏ ఆధారంతో అలా చెప్తున్నారని ఆయన నన్నడుగుతాడు. ఆరోపణ ఏ ఆధారంతో చేశారు స్వామీ అంటే ఎక్కడో విన్నాను అని తప్పించుకుంటాడు. ఇలాటి వాళ్లకు సమాధానం చెప్పడం మొదలుపెడితే రేపు ఎవడో వచ్చి 'మీ ముత్తవ్వ శీలం మంచిది కాదుట కదా' అని అడగవచ్చు. 'ఆవిడ పేరే నాకు తెలియదు. ఆవిడ గురించి నీకెలా తెలుసు? నువ్వన్నదానికి ఆధారాలున్నాయా?' అని అడిగితే 'ఎవరో అనగా విన్నాను, నిజమో కాదో తెలుసుకుందామని అడుగుతున్నాను' అని అవతలివాడు నా మెదడులో ఒక అనుమాన బీజం నాటడానికి చూస్తాడు. అప్పుడేం చేయాలి? నా పరిస్థితి మీకెదురైతే మీరేం చేస్తారు? పట్టించుకుంటారా? వదిలేస్తారా? అలాటి పరిస్థితి వస్తే ఎలా ఆలోచించాలో, ప్రశ్న లేవనెత్తిన వాడి ఉద్దేశాన్ని, సామర్థ్యాన్ని ఎలా ప్రశ్నించాలో, ఇదిగో సమాచారం అంటూ ఏదైనా యిస్తే దాన్ని విశ్లేషించడంలో ఏ జాగ్రత్తలు తీసుకోవాలో సూచించడమే యీ వ్యాసం ఉద్దేశం. చివర్లో ఎవరేం చెప్పినా దేన్నీ గుడ్డిగా నమ్మకండి అని చెపితే 'గుడ్డిగా' అనే మాట వదిలేశారు కొందరు. అసలు నన్ను కోట్ చేయడమెందుకు, పెద్దలు చెప్పిన 'వినదగు నెవ్వరు చెప్పిన..' పద్యం గుర్తుపెట్టుకుని అమలు చేస్తే చాలు.

పుకారులో నిజానిజాల గురించి నేనే ఎందుకు చెప్పాలి? మీరూ ఆలోచించవచ్చు. ఆలోచించడం మొదలుపెడితే ప్రశ్నలు వాటంతట అవే వస్తాయి. మోతీలాల్ తండ్రి ఢిల్లీ సుల్తాన్ వద్ద ఢిల్లీ కొత్వాల్‌గా పనిచేశాడని చెప్తున్నారు కదా. అంతటివాడు మతం మారితే ఎక్కడో అక్కడ రికార్డ్ కాకుండా వుంటుందా? పాత పేరు మీద సంపాదించిన ఆస్తులు స్వాధీనం చేసుకోవాలన్నా గెజిట్‌లో పేరు మార్పు నమోదు చేయించుకోవాలి కదా. 1857 తర్వాత మారాడంటే రికార్డులు మరీ దొరక్కుండా వుండవు కదా. ఏ ఆర్యసమాజంలోనో మతం మారి వుంటే అక్కడ నమోదై వుంటుంది. పుకారు ప్రస్తావించిన వాళ్లను ఆ రికార్డు చూపించాలని మీరు అడగాలి. ఇలా అడక్కపోతే రేపు పాకిస్తాన్‌లో పుట్టిన కారణానికి ఆద్వాణీ తాత గురించి మరొకడు కథ పుట్టించవచ్చు. అందుకే జిన్నాను ఒక విషయంలో సమర్థించాడని భాష్యం చెప్పవచ్చు. ఎల్లుండి మోదీ ముత్తాత గురించి యింకోడు పుట్టిస్తాడు. పుకారు వినగానే ప్రశ్నించడం నేర్చుకోవాలి. సరైన సమాధానం వచ్చేవరకు నమ్మకూడదు, దాన్ని యింకోళ్లకు చెప్పనూ కూడదు. ఆన్సర్ తెలుసుకునే ఉత్సాహం వుంటే దాని కోసం శ్రమించాలి. ఎవరో వచ్చి అరటిపండు వలిచి నోట్లో పెట్టేస్తాడని ఎదురుచూడకూడదు. నా మట్టుకు నాకు ఆయన మతం మారాడా లేదా అన్న దానిపై ఆసక్తి లేదు. రాజకీయాల్లోకి వచ్చిన నెహ్రూ కుటుంబసభ్యుల చర్యల వలన దేశానికి మేలు జరిగిందా, కీడు జరిగిందా అన్నదే నాకు ఆసక్తికరమైన అంశం, వాళ్ల మూలాలు కాదు. నదీమూలం, ఋషిమూలం తరచి చూడవద్దంటారు పెద్దలు. వాల్మీకి రామాయణాన్ని నెత్తిన పెట్టుకుంటుకోమన్నారు. వాల్మీకి పూర్వాశ్రమంలో ఎంతమందిని దోచుకున్నాడు, ఏ కులంలో పుట్టాడు అనేది పట్టించుకో మనలేదు. ఇదీ మన సంస్కృతి. దాన్నే కాపాడుకుందాం.

నా నిష్పక్షపాతబుద్ధి గురించి జరుగుతున్న చర్చలో తరచుగా లేవనెత్తే అంశం – అంశాల ఎంపికలో నేను సెలక్టివ్‌గా వుంటానని! ఆ మాట నిజమని వెయ్యిసార్లు చెప్పాను. తెలుగు మీడియా వాయించి వాయించి వదిలిపెట్టిన విషయాలు రాయను. వాళ్లు వదిలేసిన అంశం కానీ, కోణం కానీ దొరికితేనే రాస్తాను. నేపథ్యం సరిగ్గా చెప్పకపోయినా, మరీ కాంప్లికేట్ చేసినా అప్పుడూ రాస్తాను. మోదీ వచ్చాక నా ధోరణిలో మార్పు రాలేదు. మీడియాలోనే మార్పు వచ్చింది. తెలుగు రాష్ట్రాలలో కూడా మీడియా భజనమేళంగా అయిపోయింది. అందువలన నేను వింతగా కనబడుతున్నాను. మోదీ అధికారంలోకి వచ్చేముందు నేను ఎవరి గురించి రాసి వుంటానా, ఏం రాసి వుంటానా అని ఒక్కసారి ఆలోచిస్తే, ఆర్కయివ్స్‌లోకి వెళ్లి తొంగి చూస్తే మీకే తెలుస్తుంది నేను కాంగ్రెసు మీద యీగలు వాలనిచ్చానో లేదో! పాఠకుల్లో ఒకరు నేను జగన్, వైయస్‌పి అభిమానినని, ఆ విషయం నాకు మెయిల్ రాస్తే 'అది నా వ్యక్తిగత అభిప్రాయమని జవాబి'చ్చానని రాశారు. ఇది చాలా మిస్‌లీడింగ్‌గా, స్లాండరస్‌గా వుంది. నేను జగన్ అభిమానిని కాను. సోనియాను ఎదిరించి వరంగల్ వెళ్లినపుడు మెచ్చుకున్నానంతే. ముఖ్యమంత్రి కావడానికి ఆత్రపడ్డప్పుడు, ఫిరాయింపుదారులతో పార్టీ ఏర్పరచి, కాంగ్రెసు ప్రభుత్వాన్ని కూల్చడానికి విఫలయత్నాలు చేసినప్పుడు, తండ్రి నమ్మిన సమైక్యవాదాన్ని విడిచి పెట్టినపుడు, కెసియార్‌తో రాజీ పడ్డప్పుడు, యిలా అనేక సందర్భాల్లో ఘాటుగా విమర్శించాను. అలాటప్పుడు నేను జగన్ అభిమానినని యీ పాఠకుడికి రాస్తానా? నెవర్! ఆయన ఆ మెయిల్ పూర్తి పాఠాన్ని యితర పాఠకులతో పంచుకోవాలని కోరుతున్నాను. అప్పుడే నిజానిజాలు తెలుస్తాయి.**– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2016)**

**జనవరి 09, 10** **ఎమ్బీయస్ : సమస్య కరక్టే, పరిష్కారం..?**

జనవరి 17, 2016 ఆంధ్రజ్యోతి డైలీలో రాధాకృష్ణ గారు 'వైషమ్య రాజకీయం.. ప్రగతికి అవరోధం' అంటూ ఆంధ్ర రాజధాని

ఎదుగుదలకు గల అడ్డుపడే ముఖ్యమైన అడ్డంకి గురించి నిష్కర్షగా చెప్పారు – 'విజయవాడలో రెండు రోజులు గడిపినవారికి అక్కడి కులతత్వం చూసి చిరాకు వేస్తుంది... ఈ కుల దురభిమానం ఎంతవరకు వెళ్లిందంటే సినిమా హీరోలను కూడా కులప్రాతిపదికనే ఆరాధించేంతవరకు.. తెలంగాణలో పుట్టి పెరిగిన నాబోటివాళ్లకు యీ ధోరణి వింతగా, వికారంగా కనిపిస్తుంది. కూడు పెట్టడానికి పనికిరాని కులం కోసం ఎందుకింత ఆరాటపడతారో అని ఆశ్చర్యం కలుగుతుంది.' అని. నిజానికి అక్కడి ప్రధానకులానికి చెందిన రాధాకృష్ణగారికే ఆ కులతత్వం వికారంగా తోస్తే, ఆ కులానికి చెందని యితర ప్రాంతీయుల సంగతి ఏమిటి? రాజధాని రాష్ట్రానికి మధ్యలోనే వుండాలి కాబట్టి విజయవాడ-గుంటూరు మధ్యనే వుండాలని కాబినెట్‌లో తీర్మానం చేశామని శివరామకృష్ణన్ కమిటీకి ఆంధ్రప్రభుత్వం చెప్పిందని వార్త వచ్చినపుడు 2014 జులైలోలో నేను యిదే పత్రికకు "బొడ్డు తప్ప వేరేమీ కనబడదా?" అనే పేరుతో రాసిన వ్యాసంలో రాసిన వాక్యాలు యివి –

"రాజధానిగా ఆ ప్రాంతం వర్ధిల్లాలంటే కొందరు పూనుకుని అక్కడి సామాజిక వాతావరణాన్ని మార్చవలసిన అవసరం వుందని నా వ్యక్తిగత అభిప్రాయం. తక్కిన చోట్ల కూడా కులాల గొడవలు కొద్దో గొప్పో వున్నాయి కానీ కృష్ణా జిల్లాలో కులం పేర కుమ్ములాటలు విపరీతం. ఇందిరా గాంధీ హంతకులు శిఖ్కులు కాబట్టి హత్యానంతరం ఢిల్లీలో శిఖ్కులను చంపారంటే అర్థం చేసుకోవచ్చు. గాంధీ హత్య జరిగినప్పుడు మహారాష్ట్ర బ్రాహ్మణులపై కూడా దాడులు జరిగాయి – గోడ్సే ఆ కులం వాడు కాబట్టి. కానీ రాజీవ్ చావుకి, విజయవాడలో కమ్మలపై దాడులకు లింకు ఏం వుంది? హంతకులు ఎల్‌టిటిఇ వారు కాబట్టి అయితే గియితే తమిళులపై దాడులు జరగాలి. మధ్యలో కమ్మలు ఎక్కణ్నుంచి వచ్చారు? ఈ కులజాడ్యం పాతతరానికి పరిమితం కాలేదు, యువతరానికి కూడా పాకింది. ఒక సినిమా హీరో బ్రాండ్ అంబాసిడర్‌గా వున్న కూల్‌డ్రింకును, అతని కులాన్ని వ్యతిరేకించే కులవిద్యార్థులు కాలేజీ క్యాంటీన్లలో నిషేధించిన వైనాలు అక్కడి ప్రజలకు తెలుసు. ప్రతి మనిషిని, ప్రతి సంఘటనను కులం కళ్లతోనే అక్కడ చూస్తారని ప్రతీతి. అక్కడ సామాజిక కార్యకర్తలు ఐక్యసంఘటనగా ఏర్పడి కొన్ని చర్యలు చేపట్టి ఆ పేరు తుడిచివేసుకోకపోతే రాజధానిగా ఎదగడం కష్టం." ఇదే మాటను విజయవాడ వాసులతో సన్నిహితసంబంధం కలిగిన రాధాకృష్ణ వంటి విజ్ఞులు చెప్పారు కాబట్టి యీ సమస్య నిజమైనదే అనే నమ్మకం అందరికీ లుగుతుంది.

"హైదరాబాదులో అన్ని రాష్ట్రాలవారు, మతాలవారు వుంటారు. ఎవరూ యితరుల గురించి పట్టించుకోరు. అందుకే అది విశ్వనగరం అయింది. విజయవాడలో పరిస్థితి వేరు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారిని అంత సులువుగా అక్కున చేర్చుకోరన్న అభిప్రాయం వుంది. మనవాడా? కాదా? అని ఆరా తీస్తారని చెప్పుకుంటారు." అని కూడా ఆయన రాశారు. నేను కూడా పైన ఉదహరించి వ్యాసంలో యిదే విషయాన్ని ప్రస్తావించాను – 'కృష్ణా, గుంటూరు జిల్లాల వారు చొరవతో, సాహసంతో యితర ప్రాంతాలకు వెళ్లి అక్కడ నెగ్గుకు రావడం, అక్కడి స్థానికులకు కన్ను కుట్టేటంతగా ఎదగడం గమనిస్తాం. కానీ యితర ప్రాంతాల నుంచి ఆ జిల్లాలకు వచ్చి విజయాలు సాధించిన వారున్నారా – అనేది గణాంకాలు చూస్తే తప్ప చెప్పలేం. ఆటోమొబైల్ రంగంలో చిన్న స్థాయిలో పంజాబీలు వుండడం కనబడుతోంది. ఇతర రంగాలలో స్థానికులే వున్నారు. వీళ్లను చూసి బెదిరి యితరులు రారా? వాళ్లు రావడానికి వీల్లేనంతగా వీళ్లే విస్తరించారా? అన్నది అర్థం కాదు. స్థానికుల ంటె మనం మెరుగ్గా వ్యాపారం చేయగలమని అనుకున్నపుడే ఎవరైనా వెళతారు. కృష్ణా, గుంటూరు జిల్లావాసుల దగ్గరకు వెళ్లి ఫలానా వ్యాపారం చేద్దామనుకుంటున్నాను అనగానే 'ఓహో, కాన్సెప్టు బాగుందే' అనుకుని వాళ్లు మీకంటె ముందే అక్కడ పెట్టేస్తే..? ..రాజధానిగా ఎదగాలంటే అందర్నీ ఆహ్వానించే వాతావరణం, ఎదగనిచ్చే గుణం వుండాలి. ముంబయిలో ఎవరైనా వచ్చి వ్యాపారం, ఉద్యోగం చేసుకోవచ్చు. శివసేన వంటి శక్తులు మధ్యమధ్యలో అరాచకం సృష్టించినా మొత్తం మీద వాతావరణం – ఎవరైనా వచ్చి కష్టపడి పైకి రావచ్చు అనేట్లా వుంటుంది. కేరళ పనివారికి ఎంతో నైపుణ్యం వున్నా అక్కడ తగినంత పారిశ్రామిక అభివృద్ధి జరగకపోవడానికి కారణం స్థానిక ప్రజల స్వభావం. కర్ణాటకలో అందర్నీ ఆహ్వానించే లక్షణం కనబడుతుంది. అందుకే బెంగుళూరు అనేక రకాలుగా పెరిగింది. హైదరాబాదులో కూడా స్థానిక ప్రజలు ఎన్నో దశాబ్దాలుగా అందర్నీ ఆహ్వానిస్తూనే వచ్చారు. ఇటీవలి కాలంలో రాజకీయాల కారణంగా విభేదాలు తెచ్చారు కానీ లేకపోతే సామాజికంగా ఎన్నడూ కలహాలు లేవు. విజయవాడ-గుంటూరు ప్రాంతాలలో ముంబయి, బెంగుళూరు, హైదరాబాదు వంటి వాతావరణం నెలకొల్పితే అక్కడి రాజధాని వర్ధిల్లుతుంది. కేరళ వంటి వాతావరణం నెలకొంటే క్రుంగుతుంది. అన్నీ మాకే కావాలి, మేమే బాగుపడాలి అనే ధోరణి అక్కడి నాయకులు యిప్పటికే ప్రదర్శిస్తున్నారు....'

నేను రాసిన ఏడాదిన్నర అయింది. ఈ సమయంలో పరిస్థితి ఏమీ మారలేదని రాధాకృష్ణ తాజా వ్యాసం నిరూపిస్తోంది. మరి దానికి ఆయన సూచించే పరిష్కారమార్గం ఏమిటి? కులాల మధ్య సామరస్యం నెలకొల్పడానికి చంద్రబాబు చర్యలు తీసుకోవాలి అంటారు. 'కులవైషమ్యాలను నివారించడానికి గట్టి చర్యలు తీసుకోని పక్షంలో విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సు ఫలితాలు అందడం మాట అటుంచి రాష్ట్రం తిరోగమనంలోకి వెళుతుంది' అని హెచ్చరించారు. వ్యాసం యిక్కడకి వచ్చేసరికి ఎడిటోరియల్ బాట పట్టేసింది. సంపాదకీయాల్లో సమస్య ఎంత జటిలమో అంతా రాసేసి, చివర్లో 'సంబంధిత పక్షాలన్నీ ఒక చోట సమావేశమై తమ ఆలోచనలు కలబోసుకుని సమన్వయం సాధిస్తే అసాధ్యం కానిదేదీ లేదు..' మార్కు వాక్యంతో ముగిస్తారు. ఆ మధ్య 'ఓపెన్‌హార్ట్ విత్ ఆర్కే'లో రోజాను పిలిచి యీయన మందలిస్తూ 'మీ పార్టీవాళ్లు, టిడిపి వాళ్లు కూర్చుని మాట్లాడుకోవాలి' అంటూ లెక్చరిచ్చారు. ఆవిడ 'నిజమే సార్, ఆ పని చేయాల్సింది స్పీకరు కదా' అంటే యీయన వినలేదు. మళ్లీమళ్లీ అదే పాట. ఈసారి ఆమె 'మీరు చెప్తే

వాళ్లు వింటారు, మీరైనా పిలిచి మాతో కలిసి కూర్చుని మాట్లాడమనండి' అంటూ యీయన్ని యిరికించబోయింది. ఈయన సంపాదకీయం మోడ్‌లోంచి బయటకు రాదలచుకోలేదు. 'మీరిద్దరూ కలిసి కూర్చోండి' అంటూనే పాడుతూ పోయారు. వాళ్లలో వాళ్లకు ఆ పాటి సయోధ్య వుంటే ఏడాది సస్పెన్షన్లు ఎందుకుంటాయి?

అది యీయనకు తట్టక కాదు. పెద్దరికం నిలుపుకోవాలంటే యిలాంటి గంభీరమైన హితోక్తులు నాలుగు చెప్పాలంతే. ఇప్పుడు కులాల మధ్య వైషమ్యాలు పోగొట్టి, సామరస్యం నెలకొల్పే బాధ్యత బాబు నెత్తిన పెట్టేశారీయన. అలాటివి చేయడానికి బాబు సంఘసంస్కర్తా? కులగురువా? ఆయన మాట ఆయన కులస్తులైనా వింటారన్న గ్యారంటీ వుందా? అదే వ్యాసంలో ఆయన ఇంకో మాట కూడా చెప్పారు – 'కులవైషమ్యాలకు కేంద్రబిందువైన విజయవాడ నుంచి ప్రస్తుతం చంద్రబాబు పరిపాలన చేస్తున్నారు. దీంతో కమ్మవారు కొందరు తమదే పైచేయి అన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా మిగతా కులాల వారు అధికార టిడిపివైపు అనుమానపు చూపులు చూస్తున్నారు. 'ముఖ్యమంత్రి మా వాడే' అని కమ్మవారు కొందరు గ్రామాలలో విర్రవీగుతున్నట్లు సమాచారం.' అని. ఇక్కడ ఆయన ఎన్టీయార్ కాలంలో వారి గ్రామంలో జరిగిన సంఘటన ఒకటి చెప్పి అసలు వ్యక్తులకు తెలియకుండానే యిలాటివారి వలన పార్టీ ఎలా నష్టపోతుందో ద ృష్టాంతం చెప్పి 'ఇలాటి పెదధోరణులు విజయవాడ చుట్టుపక్కల గ్రామాల్లో కనిపిస్తున్నాయని చెబుతున్నారు' అని చెప్పారు. ఆంధ్రజ్యోతి పేపరు, టీవీ నెట్‌వర్క్ ద్వారా ఆయనకు క్షేత్రసమాచారం బాగానే అందుతుంది కాబట్టి యీ మాటా నిజమే అనుకోవాలి. ఇలాటి వాటివలన నష్టపోయేది చంద్రబాబే అని కూడా రాధాక ృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం వీళ్లు గమనించడానికి ముందే చారచక్షువైన బాబుకి తెలిసే వుంటుంది. అయినా వాళ్లను ఆయన నియంత్రించ లేకపోయి వుంటారు.

బాబు అనే కాదు, ఏ రాజకీయ నాయకుడికీ కులాల, మతాల మధ్య సామరస్యం సాధించగలిగే స్టేచర్ లేదు. ఎవరైనా సామాజిక కార్యకర్తలు పూనుకోవాలని నేను అభిలషించాను. పోనుపోను పరిస్థితి అధ్వాన్నమై ఎవరూ ఎవరి మాటా లక్ష్యపెట్టని వాతావరణం నెలకొంది. ఇలాటి పరిస్థితుల్లో అలవికాని, అమలు కాని సలహాలు యిచ్చి ఏం ప్రయోజనం? మరి యీ సమస్యకు పరిష్కారం లేదా? అంటే నాకు తోచినది ఒక్కటే! అది కూడా పైన ఉదహరించిన వ్యాసంలోనే వచ్చేసింది. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకూ మధ్యలో వుంది కదాని అమరావతిని రాజధానిగా పెడుతున్నామని బాబు వాదించినపుడు నేను 'సెంటర్లో వుంది కదాని శరీరంలో కడుపుకి మాత్రమే ప్రాధాన్యత యిచ్చి కాళ్లూ చేతులను పట్టించుకోకపోతే కదలిక వుండదు, కడుపుకి తిండి వెళ్లదు, మోసేవాళ్లుండరు. ఈ – గవర్నెన్స్ ద్వారా పాలిస్తున్న యీ రోజుల్లో రాజధాని అన్ని ప్రాంతాలకూ సమదూరంలో వుండాలి అనడమెందుకు? 'గ్రామీణుడు మండల కేంద్రానికి వెళితే చాలు పనులన్నీ ఏకగవాక్షం ద్వారా చేసేస్తాం, మంత్రులు, అధికారులు ప్రజలతో మమేకమై ప్రజల ముంగిటకు పాలన తెచ్చేస్తాం' అని ఓ పక్క అంటూనే మళ్లీ సామాన్యుడు మా దగ్గరకు రావాలంటే దూరం కదా? అని వాదించడం సిల్లీగా వుంది.' అని వాదించాను.

చివర్లో 'ఓకే, రాజధాని సెంటర్లో వుండాలనుకుని అక్కడే పెడతామంటారు. సరే, అక్కడితో ఆపండి. మళ్లీ అన్నీ అక్కడే పెట్టడం దేనికి? రాజధాని కావాలా? యూనివర్శిటీలు, హాస్పటల్స్, పరిశ్రమలు వగైరా కావాలా? అని ప్రజలను అడగండి. రాజధాని వున్నచోట మీడియా ఎలాగూ విస్తరిస్తుంది. దానితో సరిపెట్టండి. తక్కినవి యితర జిల్లాలకు పంచేయండి. అన్నీ ఒకేచోట పెట్టేయడం వలననే తెలుగువాళ్లు విడిపోవలసి వచ్చిందని గుర్తు పెట్టుకోండి. ఇప్పటికే మీడియాకు కేంద్రస్థానంగా, డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌గా, విద్యాకేంద్రంగా ఎదిగిన క ృష్ణా, గుంటూరు జిల్లాలలోనే అన్నీ పెడితే తక్కిన ప్రాంతాల్లో ప్రాంతీయ ఉద్యమాలు తలెత్తుతాయి. ఎన్నికల్లో బిక్కచచ్చి వున్న కాంగ్రెసు ఐదేళ్ల తర్వాతైనా కొన్ని సీట్లు తెచ్చుకోవాలనే తపనతో ఆ ఉద్యమాలకు మద్దతు యిస్తుంది. అధికారపక్షాన్ని యిరకాటంలో పెట్టడానికి వైకాపా కూడా వారితో చేతులు కలుపుతుంది.' అని రాశాను. రాధాక ృష్ణ కూడా ప్రాంతీయ, కులవైషమ్యాలు రాజేయడానికి ప్రయత్నాలు జరుతున్నాయని వాపోయారు. దీనికి మూలకారణం అందరికీ తెలుసు – 'హైదరాబాదు పోగొట్టుకున్నందుకు కసితో వున్న క ృష్ణా, గుంటూరు జిల్లాల ప్రజలు హైదరాబాదునే తమ వద్దకు రప్పించుకోవాలనే పట్టుదలతో వున్నారు. హైదరాబాదును తలదన్నే నగరాన్ని తమ వద్ద నిర్మించుకుని తమ తడాఖా చాటాలనుకుంటున్నారు. అధికారంలో వున్న టిడిపికి మద్దతు పలికే వర్గాలు ఆ రెండు జిల్లాలలో బలంగా వున్నాయి కాబట్టి వారి మాట చెల్లుబాటు అవుతోంది.' అని.

ఉత్తరాంధ్ర, రాయలసీమ ఉద్యమాలు యిప్పటికే పురుడు పోసుకుంటున్నాయి. కమ్మప్రాబల్యం రాజధానిలో విపరీతంగా వుండబోతోందన్న ఆలోచన యితర కులాలకు దుస్సహం, దుర్భరం. ఇది రాష్ట్ర ఐక్యతకు ఏ మాత్రం మేలు చేయదు. రాష్ట్రాన్ని రక్షించాలంటే వికేంద్రీకరణ ఒక్కటే మార్గం. దీనికి ప్రాంతీయ అసమానతలు తగ్గడంతో బాటు, ఒకే కులం గుత్తాధిపత్యానికి కూడా కళ్లెం పడుతుంది. ఎందుకంటే కొన్ని జిల్లాల్లో ఒక్కో కులం బలంగా వుంది. కొన్ని జిల్లాలలో సమతుల్యత వుంది. అభివ ృద్ధిని అమరావతిలో కుప్ప పోయకుండా అన్ని జిల్లాలకు విస్తరింపచేసినపుడు అన్ని కులాల వారికి ఆ లాభాలు అందుతాయి. ఆర్థికపరంగా, పలుకుబడి పరంగా యించుమించు సమానస్థాయిలో కులాలు వున్నపుడు సామరస్యం నెలకొనేందుకు అవకాశాలు మెరుగుపడతాయి. అలా జరగకుండా ఒకే కులం గుప్పిట్లో వున్న ప్రాంతానికే నిధులన్నీ తరలిస్తే ఆ కులస్తులపై రాష్ట్రమంతా యితరులకు అసూయ, ద్వేషం కలుగుతాయి. అది ఎవరికీ మంచిది కాదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2016)**

జనవరి 11 ఎమ్బీయస్ : రోహిత్ వివాదం – వేడి ఎక్కువ, వెలుగు తక్కువ

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్ (సెంట్రల్ యూనివర్శిటీ)లో రోహిత్ అనే ఒక తెలివైన విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరం. ఆ మరణం కేంద్రంగా అనేక అంశాలు చర్చనీయమయ్యాయి. మొత్తం మీద చూస్తే వేడి, ఆవేశం ఎక్కువ కనబడింది, సత్యమనే వెలుగు తక్కువ కనబడింది. ఆ మసక చీకటిలో దొరికిన సమాచారంతోనే యీ వ్యాసం రాస్తున్నాను. పొరపాట్లు ఎత్తి చూపితే సవరించుకుంటాను. మామూలుగా అయితే ఒక విద్యార్థి ఆత్మహత్యపై యింతలేసి చర్చలు జరగవు. ఇదే యూనివర్శిటీలో పదేళ్లగా 10 ఆత్మహత్యలు జరిగాయిట. వారిలో 8 మంది దళితులేట. అప్పుడెప్పుడూ యితర రాష్ట్రాల ముఖ్యమంత్రులూ, జాతీయ పార్టీలో ఉపాధ్యక్షులూ, జనరల్ సెక్రటరీలు వచ్చి వాలలేదు. ఇప్పుడెందుకు వచ్చారంటే యీ ఆత్మహత్యలో నింద మోస్తున్న ఎబివిపి, బిజెపికి అనుబంధ సంస్థ కాబట్టి! బిజెపిని కొట్టడానికి చిన్న గడ్డిపోచ దొరికినా దాన్ని బ్రహ్మాస్త్రంగా మలచుకుందామని ఆరాటపడుతున్నారు కాబట్టి! బిజెపితో రాజకీయశత్రుత్వం వున్నవాళ్లందరూ ఏకమై పోయి, భారీ స్థాయి హితోక్తులు వల్లిస్తున్నారు. సమాజపు స్థితిగతులను చర్చించేస్తున్నారు. అసలు గొడవ ఏమిటి, అవతలివాళ్లు చెప్పేది ఎంతవరకు నిజం వంటి విషయాలు చర్చించడానికి కూడా యిష్టపడటం లేదు. టీవీ చర్చల్లో కూడా బిజెపి, ఎబివిపి వారిని నోరు పెగలనీయకుండా మాటిమాటికీ, మాటమాటకీ అడ్డుపడుతున్నారు.

మొదట కొన్ని విషయాల్లో మనకు స్పష్టత రావాలి. యూనివర్శిటీల్లో రాజకీయాల జోక్యం వుండకూడదు అని అభిభాషణలు చేసే రాజకీయ నాయకులెవరికీ ఆ హక్కు లేదు. వీళ్లందరూ విద్యార్థి దశలో కాలేజీల్లో, యూనివర్శిటీల్లో వుండే రోజుల్లో రాజకీయాల్లో వెలిగినవారే. అక్కడి అనుభవంతోనే పైకి ఎగబాకారు. యూనివర్శిటీలో బలమైన సంఘాలన్నీ ఏదో ఒక పార్టీకి అనుబంధంగా వుండేవే. ఆ యా పార్టీలు వీరికి నిధులు, మార్గదర్శకత్వం చేస్తూ, వీరిలో మంచి వక్తలుగా, నేతలుగా వున్నవారిని గుర్తించి చదువయ్యాక పార్టీలో చేర్చుకుంటూ వుంటారు. ఇది ఎప్పణ్నుంచో జరుగుతూ వస్తున్నది. ఈ రోజు యూనివర్శిటీల్లో అచ్చగా చదువు చదువుకోవాలి తప్ప యితర విషయాల జోలికి వెళ్లకూడదు అనడం ఆచరణలో సాధ్యం కాదు. దేశవిదేశాల్లో జరిగే విషయాలపై విద్యార్థులు ఎందుకు స్పందించాలి, తమ పరీక్షల గోల తాము చూసుకోక.. అని అనవచ్చు కాని ఆ వయసులోనే సమాజం గురించి ఏదో చేయాలనే తపన, ఏదో ఒక భావజాలం చేత ప్రభావితం కావడం, ఆవేశపడడం, తాము తలచుకుంటే ప్రపంచాన్నే మార్చేస్తామనే భ్రమలో పడడం జరుగుతాయి. యూనివర్శిటీ నుంచి బయటకు వచ్చిన తర్వాత యీ నిషా దిగిపోతుంది. ఉద్యోగం ఎవడిస్తాడా, అమెరికాకు వీసా కోసం చిలుకూరు బాలాజీ చుట్టూ ఎన్ని ప్రదక్షిణలు చేయాలా అనే రంధిలో పడతారు. ఉద్యోగం దొరికాక ప్రేమ, పెళ్లి, కుటుంబబాధ్యతలు, ఉద్యోగంలో ప్రమోషన్.. యిలాటివాటితో సమాజం, రాజకీయాలు యిలాటివాటిపై ఆసక్తి చచ్చిపోతుంది. యూనివర్శిటీ రోజుల నాటి ఉపన్యాసాలు, ప్రతిజ్ఞలు ఎవరైనా గుర్తు చేస్తే సిగ్గుపడతారు కూడా. యూనివర్శిటీ రోజుల్లోనే వాళ్లకు పలురకాల భావజాలాలకు ఎక్స్‌పోజ్ అవుతారు. కావాలి కూడా. ఆ తర్వాత తమతో ఏకీభవించనివారితో వాదోపవాదాలు కూడా చేస్తారు.

ఇక్కడితో ఆగాలని అందరూ కోరుకుంటారు. అయితే ఆగటం లేదు. అనేకసార్లు భౌతికపరమైన దాడులకు కూడా దిగుతారు. అక్కణ్నుంచి గొడవలు ప్రారంభం. వారు కొట్టారని వీరు, వీరు తన్నారని వారు. మళ్లీ యిరుపక్షాలు కొన్ని సందర్భాల్లో ఏకమై మూడో పక్షం వారితో తగవుకి వస్తారు. అందరూ బాహాబాహీ యుద్ధం చేస్తున్నారని కంగారు పడి ప్రిన్సిపాలో, వైస్ ఛాన్సలరో పోలీసులను రప్పిస్తే అందరూ కలిసి ఏకమై పోయి పోలీసులను క్యాంపస్‌లో అడుగుపెట్టనివ్వం, అనుమతి యిచ్చిన విసిని ఘొరావ్ చేస్తాం అంటూ గొడవ చేస్తారు. మేం తలకాయలు బద్దలు కొట్టుకుంటున్నా మీరు చూస్తూ కూర్చోవాలి తప్ప పోలీసుల ద్వారా చర్యలు తీసుకోవడానికి వీల్లేదు అంటారు. విద్యార్థుల్లో యీ గొడవలు మామూలేలే, కొన్నాళ్లు పోతే వాళ్లే సర్దుకుంటారు, మధ్యలో మనం తలదూర్చకూడదు అని అధ్యాపకులు, ఎడ్మినిస్ట్రేటర్లు సాధారణంగా చూసీచూడనట్లు వూరుకుంటారు. ఎందుకంటే ఏదైనా క్రమశిక్షణ చర్య తీసుకుంటే విద్యార్థి భవిష్యత్తు పాడై పోతుంది, యీ పాలపొంగు ఆవేశం చల్లబడ్డాక జీవితాంతం వ్యథతో కుమిలిపోతాడు అని సహనం చూపిస్తారు. ఇలాటి ఘటనలు జరిగినప్పుడు వెంటనే బయటివాళ్లు వచ్చి 'ఎడ్మినిస్ట్రేషన్ అలసత్వం వలననే యూనివర్శిటీ వాతావరణం పాడై పోతోంది' అని విమర్శలు చేస్తారు. అలా అని గట్టి చర్యలు తీసుకుంటే మానవత్వం లేకుండా విద్యార్థులపై కాఠిన్యం వహిస్తున్నారు అని మళ్లీ గొడవ చేస్తారు. ఇప్పుడు చూడండి, నలుగురు విద్యార్థుల సస్పెన్షన్ ఎత్తివేశారు. ఎందుకు? వాళు చేసిన పని సవ్యమైనదే అని యూనివర్శిటీ యాజమాన్యం భావిస్తోందా? రోహిత్ ఆత్మహత్య చేసుకోవడం వలన వాళ్ల తప్పు (యిప్పటిదాకా అలాగే అనుకున్నారుగా) సడన్‌గా ఒప్పు అయిపోతుందా? నిన్న వాళ్లు చేసిన పనులు రేపు యితరులూ చేశారనుకోండి, వాళ్లని దండించరా?

చాలా దశాబ్దాలుగా యూనివర్శిటీల్లో లెఫ్టిస్టు యూనియన్లు ఒకవైపు, ఎబివిపి మరొకవైపు వుంటూ వచ్చాయి. ఇటీవలి కాలంలో యువత కమ్యూనిజానికి దూరంగా జరిగారు. వామపక్షాల యూనియన్లు బలహీనపడ్డాయి. ఎబివిపి బలపడుతూ వచ్చింది. దళిత యూనియన్లు ఏర్పడినపుడు కులప్రస్తావన సహించని లెఫ్టిస్టులు వాటిని వ్యతిరేకించారు. అప్పుడు వారికి ఎబివిపి మద్దతు యిచ్చి నిలబెట్టింది. ఎబివిపిలో కూడా అనేకమంది దళిత నాయకులున్నారు. అది అగ్రవర్ణాల నాయకత్వంలో నడవటం లేదు. అయినా దాన్ని దళిత వ్యతిరేకిగా చూపిద్దామనే ప్రయత్నం జరుగుతోంది. ఎందుకంటే ఎబివిపికి కౌంటర్‌గా నిలబట్టేందుకు దళితులు,

మైనారిటీల పేరనే సమీకరణ సాగుతోంది. కానీ వీరి బలం మరీ ఎక్కువగా లేదు. భావజాలం రీత్యా ఆరెస్సెస్‌కి, కులమతాల రీత్యా దళిత, మైనారిటీలకు చెందని తటస్థ విద్యార్థుల సంఖ్య ఎక్కువ కావడంతో చాలామంది విద్యార్థులు యూనియన్లకు దూరంగా వుంటున్నారు. అందువలన విద్యాలయాల యూనియన్లలో చాలా ఏళ్లగా ఎబివిపి బలం పుంజుకుంటూ వస్తోంది. ఇప్పుడు కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక దాని దూకుడు మరీ పెరిగింది. అనేక సందర్భాల్లో అది హద్దులు దాటుతోంది కూడా. దాన్ని అడ్డుకోవడం చేతకాని వారందరికీ రోహిత్ ఆత్మహత్య ఒక సాధనంగా కనబడింది. అతను దళితుడు కావడంతో ఎబివిపికి, బిజెపికి వున్న హిందూత్వ, అగ్రవర్ణ ముద్రపై విరుచుకుపడి దళితుల సానుభూతి సంపాదిద్దామని పథకాలు వేశారు. దానికి తోడు హైదరాబాదులో ఎన్నికలు వచ్చిపడ్డాయి. అందువలన మరీ రెచ్చిపోయారు. బిజెపితో ఎట్టి పరిస్థితుల్లోను కలవని మజ్లిస్, కాంగ్రెస్ అందరి కంటె ఎక్కువ అడావుడి చేశాయి. బిజెపితో ప్రస్తుతం చేతులు కలిపిన టిడిపి, కలపాలని చూస్తున్న తెరాస గట్టిగా ఏమీ అనటం లేదని, అందుకే యిరు తెలుగు ముఖ్యమంత్రులు వచ్చి పలకరించలేదని విరుచుకుపడ్డాయి. విసి రాజీనామా చేయాలి, ఎబివిపి లేఖ ఫార్వార్డ్ చేసినందుకు దత్తాత్రేయ రాజీనామా చేయాలి, ఎంపీ లేఖపై మీ స్పందన ఏమిటని రిమైండర్లు పంపినందుకు స్మృతి ఇరానీ రాజీనామా చేయాలి – అంటూ డిమాండ్ చేశారు. మోదీనీ వదలలేదు. అతని సమావేశంలో నినాదాలు చేశారు. సందట్లో సడేమియాగా అరవింద్ కేజ్రీవాల్ వచ్చి బిజెపిపై తన కసి వెళ్లగక్కి, ఢిల్లీ పోలీసులపై తన అదుపు లేదని వాపోయారు కూడా. నిర్భయ హత్య జరిగినపుడు షీలా దీక్షిత్ యిదే సంగతి మొత్తుకుంటే అప్పుడు అరవింద్ విన్నారు కాదు. అర్ధరాత్రి ఓ ఆడపిల్లను రక్షించలేని షీలా ఢిల్లీ ముఖ్యమంత్రిగా పనికి రాదని నినాదాలు యిచ్చారు, వివాదాలు చేశారు. రాజయ్య కోడలు పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకున్నపుడు వచ్చినపుడు తొంగి చూడని రాహుల్ గాంధీ యిప్పుడు వచ్చి లెక్చరు దంచాడు. 'రాజకీయనాయకుడిగా రాలేదు, యువకుడిగా వచ్చా'నన్నాడు. ఇంకా నయ్యం, సాటి మేధావిగా వచ్చాననో, అసలు యూనివర్శిటీ మొహం ఎలా వుంటుందో చూడ్డానికి వచ్చాననో అనలేదు!

వీళ్లందరికి అందివచ్చిన అంశం – చచ్చిపోయిన విద్యార్థి దళితుడు కావడం. అబ్బే అదేం కాదు, దళితుడు కాకపోయినా యింత ఆందోళన చేసేవాళ్లం అంటే అయితే మరి తెలుగు రాష్ట్రాలలో అనేక ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల్లో ఆత్మహత్యలు చేసుకుంటున్న వందలాది విద్యార్థుల విషయంలో యీ స్థాయి ఆందోళన జరగటం లేదేమన్న ప్రశ్న వస్తుంది. ఐఐటీ విద్యార్థులు కూడా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అక్కడి విసిలు రాజీనామాలు చేశారా? కళాశాలల్లో వాతావరణాన్ని బాగు చేయడానికి ప్రభుత్వాలు ఏమైనా చర్యలు చేపట్టాయా? రోహిత్ దళితుడు కావడం, అంబేడ్కర్ స్టూడెంట్స్ యూనియన్‌లో ముఖ్యుడు కావడం చేతనే యింత పూనకం వస్తోంది. అతన్ని 'యువమేధావి', 'దళితమేధావి' అని కీర్తిస్తున్నారు. మొదట గమనించవలసినది దళితమేధావి, రెడ్డిమేధావి అంటూ విడిగా వుండరు. మేధావితో సరిపెట్టాలి. ఇతడు మేధావి అయ్యే క్రమంలో వున్నాడు. ప్రస్తుతానికి తెలివైన విద్యార్థి అంటే సరిపోయేది. ఇక కర్మధారయసమాసంలో పూర్వపదం కూడా చర్చకు వస్తోంది – దళితుడా కాదా అని. దళితుడు కాదు, 'తండ్రి, తాత వడ్డెర కులానికి చెందినవారు' అని ఎబివిపి సగం సమాచారం బయటపెట్టింది. 'నేను మాల కులస్తురాలిని' అని తల్లి మరో సగం చెప్పింది. ప్రస్తుతానికి అందిన సమాచారం ప్రకారం రోహిత్ తండ్రి బిసి, తల్లి ఎస్సీ అన్నమాట. మరి అతను ఎస్సీ అవుతాడా కాదా అన్నది ప్రశ్న.

2012 లో రమేశ్‌భాయ్ డి. నాయికా వెర్సస్ స్టేట్ ఆఫ్ గుజరాత్ కేసులో తీర్పు చెపుతూ సుప్రీం కోర్టు, సాధారణంగా బిడ్డలు తండ్రి కులాన్నే స్వీకరిస్తారనే వాదనను ఒప్పుకుంటూనే తన తల్లి కులం కారణంగా 'జీవితమంతా అవమానాలకు, తలవంపులకు, తిరస్కారాలకు, అడ్డంకులకు, దోచివేతకు (డిప్రైవేషన్స్, ఇన్‌డిగ్నిటీస్, హ్యుమిలిటీస్, హేండికాప్స్) గురి అయిన పక్షంలో అతన్ని దళితజాతికి చెందినవాడిగా గుర్తించవచ్చు అంది. రోహిత్ విషయంలో యిలాటివి జరిగాయా అని ఆలోచిస్తే అవేమీ కనబడటం లేదు. అతను పేదవాడు, తల్లిదండ్రులు విడిపోయారు అంతే కానీ సామాజికంగా వెనకబడి వున్న దాఖలాలు ఏమీ లేవు. ఎమ్మెస్సీలో ఆరో ర్యాంక్ వచ్చింది. రెండు సార్లు సిఎస్ఆర్ఐకి క్వాలిఫై అయ్యాడు, మెరిట్‌పైనే పిఎచ్‌డి ఫ్రీ సీటు సంపాదించాడని అతని తమ్ముడు చెప్తున్నాడు. అతని ప్రతిభను అణచి వేసినవారెవరూ లేరు. ఇక కార్యకలాపాల పరంగా అంటారా? అతను ఎఎస్ఏ సభ్యుడిగా వుంటూ హిందూత్వ భావజాలాన్ని, వివేకానందుడి బోధనలను, వామపక్షాల ద్వంద్వప్రమాణాలను విమర్శిస్తూ ఫేస్‌బుక్‌లో పోస్టులు పెట్టాడు. వాటి కారణంగా అతనిపై దాడులేమీ జరగనప్పుడు అతను అణచివేతకు గురయ్యాడని ఎలా అనగలం? పైగా అతనే ఈనాడు అతి బలమైన స్టూడెంటు యూనియన్ అయిన ఎబివిపికి వాళ్ల బ్యానర్లు చింపివేసి, 'కాషాయరంగు కనబడింది, కోపమొచ్చింది, చింపా' అని వాళ్ల ప్రత్యక్షంలోనే హుంకరించ గలిగాడు. వాళ్ల నాయకుడిపై దాడి చేయగల లెవెలుకి చేరాడు. తనకు శిక్ష పడితే వైస్ ఛాన్సెలర్ ఎపాయింట్‌మెంట్ తీసుకుని వెళ్లి బతిమాలుకోలేదు. ఆయనకు డిసెంబరులో దళిత విద్యార్థులకు ఉరితాళ్లు, విషం, కారుణ్యమరణం యిమ్మనమని వెక్కిరిస్తూ వుత్తరం రాశాడు. నాలుగు నెలల క్రితం యూనివర్శిటీలో డిప్రెషన్‌లో వున్న విద్యార్థుల కోసం కౌన్సిలర్‌ను పెట్టారు. 20 మంది ఆయన వద్దకు వెళ్లారు కూడా. రోహిత్ అటువైపు తొంగి చూడలేదు. ఇలా షంషేర్‌గా బతికినవాడు పీడనకు గురయ్యాడంటే ఒప్పుతుందా?

ఒప్పించడానికి అతనిపై తీసుకున్న క్రమశిక్షణ చర్యకు 'సాంఘిక బహిష్కారం' అని పేరు పెట్టారు సీతారాం ఏచూరి నుంచి జగన్ వరకు. అలాటి శిక్షలు ఆ యూనివర్శిటీలో 15 ఏళ్లలో 30 మందిపై విధించారు. అప్పుడెప్పుడూ సాంఘిక బహిష్కారం అనలేదే! దీక్షా

శిబిరానికి 'వెలివాడ' అని పేరు పెట్టుకున్నారు సస్పెన్షన్‌కు గురైనవాళ్లు. కాలేజీకి రానిస్తామంటే, సాటి విద్యార్థులతో కలిపి కూర్చోబెట్టి పాఠాలు చెపుతానంటే వెలి వేసినట్లు ఎలా అయింది? హాస్టలుకు రావద్దు అన్నారు. అన్నా వీళ్లు ఆగారా? రోహిత్ హాస్టలు గదిలోనే కదా ఆత్మహత్య చేసుకున్నది! ఆ గదిలోకి వెళుతూంటే ఎవరైనా వెళ్లి అడ్డుపడి, వెలివేశాం, రాకూడదు అన్నారా? ఇతరుల హాస్టలు గదిలోకి వెళ్లి అవతలివాళ్లను ఉతికినందుకు ఒక సెమిస్టర్ (ఆర్నెల్ల) పాటు హాస్టలు నుంచి పంపించివేశారు. విద్యార్థులు సాధారణంగా గుమిగూడే లైబ్రరీ, మెస్‌లకు కూడా రావద్దన్నారు. ఆ పాటి శిక్ష కూడా వేయలేకపోతే యూనివర్శిటీ యాజమాన్యం వున్నదెందుకు? చేతకానిది అనరా? దానికి సాంఘిక బహిష్కారం, వెలి పేరు పెట్టడమేమిటి వీళ్లు? పెట్టాలి, ఎందుకంటే దానికి దళిత కలర్ యివ్వాలి కదా! ఇంత కలరు యిచ్చి, అవతలివాళ్లు కులం గురించి విచారించబోతే కులం ప్రస్తావన ఎందుకు అని అడుగుతున్నారు జగన్. ఎందుకు కాదు? దళిత బ్రాండ్ కాకపోతే దేశమంతా అగ్గి రగిలేదా?

జగన్ చేతిలో పేపరుంది, టీవీ వుంది, కప్పేసిన నిజాలు తవ్విపోసే వందలాది రిపోర్టర్లు వున్నారు, తలచుకుంటే రోహిత్ తండ్రి ఏ కులమో తెలుసుకోలేరా? కానీ ఆయన 'మీసేవ'లో యిచ్చిన కులధ్రువీకరణ పత్రం మీదే ఆధారపడుతున్నారు. ఇక్కడో చిన్న సమాచారం వుంది. రోహిత్ అసలు పేరు మల్లిక్ చక్రవర్తి అనీ, 2005లో తల్లీ తండ్రీ విడిపోయాక అతను క్రైస్తవం తీసుకుని తన పేరును రోహిత్ చక్రవర్తిగా మార్చుకున్నాడని అతని పితామహుడు అంటున్నాడట. ఆ లెక్కన చూస్తే రోహిత్ క్రైస్తవ మైనారిటీ అవుతాడు. ఆ విషయం ప్రస్తావిస్తే సాటి క్రైస్తవుడు కదాని జగన్ రంగంలోకి దిగాడన్న ఆలోచన వస్తుంది. అందువలననే కాబోలు ఆయన 'మనిషి చనిపోయాక కులం పేరుతో రాద్ధాంతం ఎందుకు?' అని కొట్టి పారేయాలని చూస్తున్నాడు. టిడిపి నాయకుడు జూపూడి ప్రభాకరరావు కూడా 'సామాజిక మాధ్యమాల్లో రోహిత్ దళితుడే కాదని కులరాద్ధాంతం చేస్తున్నారని' దుయ్యబట్టారు. రోహిత్ ఆత్మహత్య లేఖలోనే రాశాడు – 'మనిషిని కులంతోనే అంచనా వేస్తున్నారు' అంటూ. నిజానికి రిజర్వేషన్ సౌకర్యం దక్కని అగ్రవర్ణాలవారూ అదే మాట చెప్పి వాపోతారు. చనిపోయాక అయితే మాత్రం కులప్రస్తావన ఆగుతోందా? అగ్రవర్ణుడు ఆత్మహత్య చేసుకుంటే యూనివర్శిటీలో స్మారకస్తంభాలు వెలుస్తున్నాయా? రూ. 5 కోట్ల పరిహారం అడుగుతారా?

దళిత కోణం లేకపోతే నిన్న యూనివర్శిటీలోని 13 మంది దళిత ప్రొఫెసర్లు తమ కార్యనిర్వాహక పదవుల నుంచి ఎందుకు తప్పుకోవాలి? నిజానికి వీళ్లు అయిదుగురు విద్యార్థుల సస్పెన్షన్‌కు మౌలికంగా వ్యతిరేకమా? వ్యతిరేకమైతే అప్పుడే నిరసన తెలపాలిగా! దీక్ష చేసే విద్యార్థులు తాము 15 రోజుల పాటు ''వెలివాడ' నిర్వహించినప్పుడు యూనివర్శిటీలోని 60 మంది దళిత ప్రొఫెసర్లతో సహా ఏ ప్రొఫెసరూ, ఏ రాజకీయనాయకుడూ తమవైపు తొంగి చూడలేదని, క్లాస్‌మేట్స్ కూడా పట్టించుకోలేదని' ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు రాజకీయనాయకులు ఎక్కడెక్కడి నుంచో వచ్చి ముసురుతున్నారు. దళితులై వుండి యిప్పటికైనా సానుభూతి వ్యక్తం చేయరా అని దళిత సంఘాల నుంచి ఒత్తిళ్లు వచ్చి వుంటాయి కాబట్టే యిప్పుడు యీ 13 మంది రాజీనామాలు చేశారనుకోవాలి. ఇలాటి ఒత్తిళ్ల వలననే, రాజకీయంగా ప్రమాదకరమౌతుందనే భయంతోనే యిప్పుడు సస్పెన్షన్ ఎత్తివేయాలని యాజమాన్యం నిర్ణయించి వుంటుంది. రోహిత్ దళితుడు కాదు, మైనారిటీ అనే కోణం బయటకు వస్తే దేశవ్యాప్తంగా సానుభూతి తగ్గే ప్రమాదం వుంది.

దీనితో బాటు వివాదానికి మూలకారణమైన యాకూబ్ మేమన్ ఉరితీత సంబంధిత ప్రస్తావన అంశాన్ని పక్కకు తప్పిస్తున్నారు కొందరు కాలమిస్టులు. ముజఫర్‌పూర్ అల్లర్ల గురించి వచ్చిన ''ముజఫర్ నగర్ బాకీ హై' డాక్యుమెంటరీ ప్రదర్శనను ఢిల్లీలో అడ్డుకున్న ఎబివిపికి వ్యతిరేకంగా ఏఎస్ఏ ప్రదర్శన చేస్తే ఎబివిపి గొడవ చేసిందని రాస్తున్నారు. అది జరిగినది ఆగస్టు 3న. కానీ ఎబివిపి జులై 30 న జరిగిన యాకూబ్ ప్రదర్శన గురించే గొడవ వచ్చిందంటోంది. ఎందుకంటే యాకూబ్ ఉరితీతకు వ్యతిరేకంగా చేసిన ప్రదర్శనలో రోహిత్ తదితరులు చేసిన నినాదాలు దేశంలో అత్యధికులకు సమర్థనీయంగా లేవు. యాకూబ్‌నే కాదు, మనిషనేవాణ్ని ఎవర్నీ ఉరి తీయకూడదు అని వాదించే వారు కొందరున్నారు. వారి వాదన వినిపించే హక్కు వారి కుంది. కొందరిని ఉరి తీయవచ్చు కానీ మేమన్ నిర్దోషి, అసలువాణ్ని వదిలివేసి కొసరు మనిషైన యాకూబ్‌ను ఉరితీయడం తప్పు అని వాదించినవారున్నారు. వారికీ ఆ హక్కు వుంది. యాకూబ్ మరణించినందుకు అతని అంత్యక్రియల్లో భాగంగా నమాజ్ చేసినా సరే కానీలే అనుకోవచ్చు. 'ఒక యాకూబ్‌ను ఉరితీస్తే యింటింటికి ఒక్కో యాకూబ్ పుట్టుకొస్తాడు' అనే నినాదం మాత్రం మింగుడు పడని వాళ్లం చాలామంది వున్నాం. ఆ విషయం ప్రస్తావించిన కొద్దీ రోహిత్‌పై జాలి తగ్గిపోతుంది. అందుకని దాన్ని అండర్‌ప్లే చేస్తున్నారు వ్యాఖ్యాతలు. వ్యాఖ్యలు నచ్చని వారిలో సుశీల్ కుమార్ ఒకడు. అతని అభిప్రాయం వ్యక్తం చేసే హక్కు అతనికి వుంది. లేదని ఎవరైనా అనగలరా? భావప్రకటన చేసే హక్కు వుందని ఒప్పుకుంటే అతనిపై దాడిని ఖండించాలి. రోహిత్ గురించి యింత మాట్లాడేవారు సుశీల్ కుమార్ గురించి ఎందుకు ఆలోచించటం లేదు?

ఏఎస్ఏవారు తమ కార్యక్రమం గురించి ఫేస్‌బుక్‌లో పెట్టుకోగా లేనిది, హిందుత్వ భావజాలాన్ని తీవ్రంగా విమర్శిస్తూ, వివేకానందుణ్ని తిరస్కరిస్తూ రోహిత్ ఫేస్‌బుక్‌లో పెట్టుకోగా లేనిది, ఫేస్‌బుక్‌లో, ట్విట్టర్‌లో ఎవరికి కావలసిన కామెంట్స్ వాళ్లు పెట్టేసుకుంటున్నారు యీ రోజుల్లో సుశీల్ కుమార్ వీళ్ల గురించి 'ఐయస్ఐ గూన్స్' అనడంలో ఆక్షేపణ ఏముంది? కానీ ఏఎస్ఏ వాళ్లకు యిది నచ్చలేదు. ఓకే, వెళ్లి చెప్పవచ్చు, వాదించవచ్చు. 30 మంది అర్ధరాత్రి సుశీల్ హాస్టల్ రూముకి అతని చావగొట్టడమేమిటి? 'అతను క్షమాపణ చెప్పాడు' అని ఏఎస్ఏ వాళ్లు అంటున్నారు. అంతటి ఎబివిపి నాయకుడు ఊరికే చెప్తాడా? తన్ని మరీ చెప్పించి వుంటారని సులభంగా వూహించవచ్చు. 'గూన్స్' అనే పదం వెనక్కి తీసుకోవడానికి ఒప్పుకున్నాను అని సుశీల్ అంటున్నాడు. గూన్స్ అనే పదం అంత

బాధిస్తే మరి యిప్పుడు ఏఎస్ఏ వారు తనను 'మనుస్మృతి ఇరానీ' అనడాన్ని స్మృతి ఇరానీ ఎలా తీసుకోవాలి? ఆమె మనుస్మృతిని అవలంబిస్తోందా? ఆమె నటీమణి. మనువు ఆడవాళ్లకు ఆ స్వేచ్ఛ నిచ్చాడా? నీకు నచ్చకపోతే మనువాది, బ్రాహ్మణవాది అనేస్తావు. అలాగే అవతలివాళ్లు వాళ్ల భాష వాళ్లు వుపయోగిస్తారు. విద్యార్థుల మధ్య యిలాటి కొట్లాటలు సహజం. కానీ అర్ధరాత్రి అంతమంది వెళ్లడం దేన్ని సూచిస్తోంది? గూండాగిరీని కాదా?

సుశీల్ కుమార్ చెప్పేదేమిటి? 30 మందికి పైగా ఏఎస్ఏ నేతలు ఆగస్టు 3/4 అర్ధరాత్రి అతనిపై దాడి చేశారు. సెక్యూరిటీ వాళ్లు రక్షించడానికి వాహనంలోకి ఎక్కిస్తే అందులోంచి కిందకి లాగి మళ్లీ చితక్కొట్టారు. బలవంతంగా క్షమాపణ పత్రం రాయించి దానిపై సెక్యూరిటీ అధికారితో సంతకం చేయించారు. దెబ్బలు ఎంత తీవ్రంగా తగిలాయి అనేదానిపై వివాదం వుంది. పేగులు దెబ్బ తిని ఆపరేషన్ చేయించుకునేటంత తీవ్రంగా తగిలాయి అని సుశీల్ తరఫున కొన్ని వార్తలు వెలువడ్డాయి. సెంట్రల్ యూనివర్శిటీకి దూరంగా వున్న మదీనాగూడలో ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స ఎందుకు చేయించుకున్నాడని సందేహాలు మెదిలాయి. ఆపరేషన్‌పై అబద్ధాలు చెప్తున్నాడు, అతనికి జరిగినది ఎపెండిసైటిస్ ఆపరేషన్ అని మీడియా బయటపెట్టింది. అప్పుడు అవును, ఎపెండిసైటిసే, కానీ వీళ్లు కొట్టిన దెబ్బల వలననే ఎపెండిసైటిస్ ఆపరేషన్ అర్జంటుగా చేయించుకోవలసి వచ్చింది అని సుశీల్ వివరణ యిచ్చాడు. కొట్లాటేప్పుడు కడుపులో, పొత్తికడుపులో గుద్దితే అలాటి అవసరం పడుతుందో లేదో నాకు తెలియదు. కానీ మదీనాగూడ అర్చనా హాస్పటల్‌వారు దాన్ని మెడికో లీగల్ కేసుగానే నమోదు చేసుకున్నారు. ఎడ్మిట్ చేసుకున్నపుడు సుశీల్‌కు భుజంపై దెబ్బ వుందని ధ్రువీకరించారు. చికిత్స పూర్తయి బయటకు వచ్చాక సుశీల్, అతని తల్లి యీ వ్యవహారాన్ని దీనితో పోనీయదలచలేదు. వైస్ ఛాన్సలర్‌కు ఫిర్యాదు అందింది. బిజెపి ఎమ్మెల్సీ రామచంద్రరావు వర్శిటీకి వచ్చి విసిగా వున్న ఆర్ పి శర్మ వద్ద నిరసన తెలిపారు. దాంతో విసి ప్రోక్టోరియల్ బోర్డు వేశారు. అది ఆగస్టు 12 న ఆరోపణకు తగిన ఆధారాలు లేవని, యిరు పక్షాలకు వార్నింగు యిచ్చి వదిలేస్తే చాలనీ అభిప్రాయపడుతూ మధ్యంతర నివేదిక యిచ్చిందట. మళ్లీ వాళ్లే యింకో 19 రోజులకు ఆగస్టు 31 న విచారణ పూర్తి చేసి, ఒక సెమిస్టర్ పాటు హాస్టల్ నుంచి తప్పించాలని చెప్పింది.

దీనికి కారణం ఆగస్టు 17 న దత్తాత్రేయ లేఖ రాయడం అని ఆరోపణ. ఎబివిపి వారు హైదరాబాదు బిజెపి ఉపాధ్యక్షుణ్ని కలిసి తమ గోడు వినిపించగా ఆయన ఆగస్టు 10 న దత్తాత్రేయకు లేఖ రాశారు – 'ఏఎస్ఏ కార్యకలాపాలపై వర్శిటీ విచారణ చేపట్టేలా ఆదేశించండి' అని కోరుతూ. ఆయన ఆగస్టు 17న మానవ వనరుల శాఖ మంత్రి స్మృతి ఇరానీకి జరిగిన ఘటనల గురించి రాస్తూ '…యూనివర్శిటీ యాజమాన్యం ప్రేక్షకపాత్ర వహిస్తోంది, యీ వ్యవహారాలను మీ దృష్టికి తెస్తున్నాను' అన్నారు. అది పెద్ద తప్పయిపోయింది కొంతమందికి. ప్రజాప్రతినిథులు తమ వద్దకు వచ్చినవారి అభ్యర్థనలు పైకి పంపడం సర్వసహజం. జరిగిన ఘటన గురించి విచారించి అప్పుడు రాసి వుండాల్సింది అనేది అర్థరహితమైన మాట. ఎవరైనా ఉద్యోగార్థి వచ్చి అడిగితే ఎమ్మెల్యేకాని, ఎంపీ కాని అతని సర్టిఫికెట్లన్నీ వెరిఫై చేసి, ఇంటర్వ్యూ చేసి, ఉద్యోగానికి తగినవాడా కాదా అని తేల్చుకుని రికమెండ్ చేస్తాడా? ఎవడైనా ఫ్యాక్టరీ పెడతానంటే నీ బాలన్స్‌షీటు స్టడీ చేయనీ అంటాడా? ప్రజలు అడిగారు, 'కైండ్లీ లుక్ యిన్టూ యిట్' అని ఓ లెటరు జతపరిచి పంపేస్తారు. తక్కిన సంగతులు అవతలివాళ్లే చూసుకుంటారు. దత్తాత్రేయపై విరుచుకుపడుతున్న ప్రజాప్రతినిథులకు యీ విషయాలు తెలియకుండా వున్నాయా? వి హనుమంతరావు కూడా అలాటిదే పంపారని బయటకు వచ్చాక ఏం చెప్పగలిగారు?

ఇక స్మృతి ఇరానీ చేసినదేమిటి? సాటి మంత్రి నుంచి లేఖ వచ్చాక ఆమె శాఖ సెప్టెంబరు 3 న యూనివర్శిటీకి పంపి, సమాధానం పంపమని అడిగింది. ఆ స్థాయి వ్యక్తి నుంచి లేఖ వచ్చాక దానికి ప్రత్యుత్తరం యివ్వవలసిన బాధ్యత వాళ్లకు వుంటుంది కదా, సమాధానం రాకపోతే సెప్టెంబరు 24న, అక్టోబరు 6 న, అక్టోబరు 20న, నవంబరు 19 న రిమైండర్లు పంపింది. ఇది అసహజమని నాకు తోచటం లేదు. తక్కిన విషయాల్లో ఎలా వ్యవహరించారో తెలిస్తే తప్ప దీనిలో ఓవరాక్షన్ జరిగిందని తీర్మానించలేం. వీళ్లు ఒత్తిడి చేశారు కాబట్టి అపరాధులు అని విద్యార్థి జాక్ అంటోంది. సెప్టెంబరులో విసిగా వచ్చిన అప్పారావు కూడా బిజెపి మనిషి కాబట్టి వాళ్లు చెప్పినట్లు ఆడాడు కాబట్టి ఆయనా అపరాధే అంటూ మొత్తం ముగ్గురూ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తోంది. ఆగస్టు 12 నివేదికకు, 31 నివేదికకు తేడా రావడానికి కారణం దత్తాత్రేయ, స్మృతి ల ఒత్తిడే కారణమనుకుంటే వాళ్ల మాట విని ఆ బోర్డు నిర్ణయాన్ని తారుమారు చేయించిన అప్పటి విసి శర్మను కూడా తప్పుపట్టాలి కదా! మరి ఆయన పేరు ఎవరూ తలవటం లేదేం? ఎంతసేపూ అప్పారావు పేరే వినబడుతోందేం? నివేదిక రాగానే అమలు చేశారా? లేదే! విచారణ సరిగ్గా జరగలేదంటూ రోహిత్ వాళ్ల యూనియన్ అభ్యంతర పెట్టగానే అమలు నిలిపారు కదా, నిలిపి ప్రొఫెసర్ సుధాకరరెడ్డి కమిటీని వేశారు. ఆ కమిటీ బోర్డు నిర్ణయాన్ని సమీక్షించే అధికారం మాకు లేదు అంటూ చెప్పడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. అంటే విసి లేదా వర్శిటీ యిద్దరు కేంద్రమంత్రుల మాట కంటె రోహిత్ యూనియన్ మాటకు ఎక్కువ విలువ నిచ్చిందనే అనుకోవాలిగా!

సరే సెప్టెంబరులో అప్పారావు విసిగా వచ్చారు. ఆయన బిజెపి మనిషి, దళితుల పాలిట విలన్ గట్రాట! మరి ఆయన వెంటనే రోహిత్ వగైరా మాబాగా దొరికారు అని వెంటనే బోర్డు నిర్ణయాన్ని అమలు చేయకుండా తాత్సారం చేశారేం? నాలుగు రిమైండర్లు పంపేదాకా నిమ్మకు నీరెత్తినట్లు కూర్చున్నారేం? తనను విసిగా సెలక్టు చేసిన బిజెపి నేతలకు కోపం తెప్పిస్తున్నానన్న యింగితం ఆయనకు లోపించిందేం? ఇంతకీ అప్పారావుని విలన్‌గా ఎందుకు చేశారు? 2002లో క్యాంపస్‌లో జరిగిన అల్లరి కారణంగా 10 మంది దళిత రిసెర్చి స్కాలర్లు రస్టికేట్ అయ్యారు, అప్పుడు అప్పారావు చీఫ్ వార్డెన్ కాబట్టి వారి భవిష్యత్తు నాశనం కావడానికి

కారకుడయ్యాడని ఆయన దళిత విలన్‌గా చూపుతున్నారు. వాళ్లు ఆయన్ని కొట్టారన్నమాట చాలామంది కాలమిస్టులు, సంపాదకులు ప్రస్తావించటం లేదు. యూనివర్శిటీలో చాలా అల్లర్లు చూసీ చూడనట్లు వదిలేసేటప్పుడు పదిమందిని ఏకంగా రస్టికేట్ చేశారంటే ఆ సంఘటన ఎంత తీవ్రమైనదో అర్థం చేసుకోవాలి. నాకు పూర్తి వివరాలు తెలియవు, కానీ అప్పటి ప్రొఫెసర్లు విజ్ఞతతోనే వ్యవహరించి వుంటారని, ఏదైనా పగతో వ్యవహరించి వుంటే ఆ స్కాలర్లు కోర్టుకి వెళ్లి వుండేవారనీ వూహిస్తున్నాను.

అప్పారావు బిజెపి వ్యక్తి అనడానికి చెప్పే కారణం ఏమిటంటే ఆయన కంటె సీనియర్లున్నా ఆయన సెలక్టయ్యాడట. ఆయన చెప్పేదేమిటంటే – 190 మందిలో 21 మందిని సెలక్టు చేశారు. వారిలో 17 మంది ఎచ్‌సియు ప్రొఫెసర్లు, వారిలో ఒకడైన నాకు 27 ఏళ్ల సర్వీసు, సెర్చ్ కమిటీ నన్ను సెలక్టు చేసింది' అని. దీనిలోనే కాదు, అనేక సంస్థల్లో సీనియర్లున్నా జూనియర్లను సెలక్టు చేసిన సందర్భాలు కోకొల్లలు. వారందరినీ బిజెపి వాళ్లనలేం. డబ్బో, పలుకుబడో (ఈయన ఓ కేంద్రమంత్రికి బంధువు అని మరో వార్త... కావచ్చు) వుపయోగించి వుండవచ్చు అని సందేహిస్తే సందేహించవచ్చు. ఎందుకంటే అనేకమంది విసిల నియామకాలు వివాదాలతో ముడిపడి వున్నాయి. తాజాగా ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ విసిగా తెలుగు వ్యక్తి జగదీశ్ కుమార్ సెలక్టు కాగానే ఆయన ఆరెస్సెస్ అనుబంధ సంస్థ ఏర్పాటు చేసిన సైన్సు సదస్సుకి హాజరయ్యారు అని మీడియా తవ్వి తీసి బిజెపి మనిషిగా ముద్ర వేయబోయింది. ఇండో–పాక్ ఫ్రెండ్‌షిప్ సొసైటీలో చేరితే ఐఎస్ఐ ఏజంటు, ఇండో–చైనా ఫ్రెండ్‌షిప్ సొసైటీలో చేరిత మావోయిస్టు.. యిలా ముద్రలు కొట్టుకుంటూ పోతే మనం ఎక్కడికి తేలతామో తెలియదు. ఒక్కోప్పుడు తమతో విభేదించినవాళ్లను కూడా తమ సమావేశాలకు పిలిచి తమ వాదన వినిపించమంటూ వుంటారు. ఎవరైనా వ్యక్తి రాజకీయభావాలు ఆయన వ ృత్తిని ప్రభావితం చేయనంతవరకు వీటిపై మరీ అంత చర్చ ఎందుకో నా కర్థం కాదు. ఇప్పుడు అప్పారావుగారు ఆరెస్సెస్ శాఖకో, బిజెపి మీటింగుకో వెళ్లి వుంటే అదో దారి. ఈయన నియామకం జరిగినప్పుడు కేంద్రంలో బిజెపి వుంది కాబట్టి, బిజెపి మనిషి అయిపోతాడా? ఇంతకీ ఆయనేమంటాడు? నాకు లేఖలు వచ్చినమాట నిజమే కానీ, నాకు వాటి ప్రాముఖ్యత బోధపడక పట్టించుకోలేదు అన్నాడు. నాకు ఫోన్లేమీ రాలేదు అన్నాడు. వచ్చే వుంటాయి, రికార్డు బయటకు తీయండి అంటాడు అరవింద్ కేజ్రీవాల్. అలా ఎవరైనా చేసి బయటపెడితే వాటిలో బెదిరింపులో మరోటో వుంటే అప్పుడు స్మృతిపై, అప్పారావుపై నిందలు వేయవచ్చు. తప్పు చేశారని అప్పటిదాకా ఎలా అనగలం?

సరే అప్పారావు ఏం చేశారు? వ్యవహారాన్ని నానబెట్టారు. దత్తాత్రేయ ఉత్తరం రాసినా, స్మ ృతి శాఖ నుంచి వుత్తరం వచ్చినా యూనివర్శిటీ తన కొడుకుని కొట్టిన వాళ్లపై చర్య తీసుకోక పోవడంతో సుశీల్ తల్లి కోర్టుకి వెళ్లారు. నిజంగా విసి రాజకీయపరమైన ఒత్తిళ్లకు లొంగి వుంటే ఆవిడకు కోర్టుకి వెళ్లవలసిన అగత్యమే వచ్చి వుండేది కాదు. కోర్టు ఆవిడ అభ్యర్థన విని అఫిడవిట్ దాఖలు చేయమని వర్శిటీని ఆదేశించింది. అప్పుడు యీయన పాత బోర్డు కంటె విస్తారమైన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌కు అప్పగించారు. అది విచారణ జరిపి పిఎచ్‌డి పూర్తయ్యేవరకు హాస్టల్ సౌకర్యం లేదంటూ నవంబరు 27న తీర్పు యిచ్చింది. కోర్టులో కౌంటర్ దాఖలుకు ముందే ప్రోక్టోరియల్ బోర్డు తీసుకున్న చర్యలను అమలు చేయాలని సూచించింది. అప్పుడు అప్పారావు మళ్లీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సబ్ కమిటీ వేశారు. దీనికి శ్రీవాస్తవ చైర్మన్, మెంబర్లలో ఒక దళిత ప్రొఫెసరు వున్నారు. (ఎవరో చెప్పిన మాట విని స్మృతి చైర్మనే దళితుడు అని స్టేటుమెంటు యిచ్చి యిరకాటంలో పడింది) వీళ్లు పూర్తి స్థాయి సస్పెన్షన్ తగ్గించి, డిసెంబరు 16 న పాక్షిక సస్పెన్షన్ అమలు చేశారు. యూనివర్శిటీ దీన్ని కోర్టుకి నివేదించింది. ఆగస్టు 31 నాటి బోర్డు నిర్ణయానికి దురుద్దేశాలు ఆపాదిస్తున్న మీడియా, తర్వాత వచ్చిన తీవ్ర నిర్ణయం, మళ్లీ దానిలో మినహాయింపుకు ఎవర్ని కారకుల్ని చేస్తారో నాకు అర్థం కావటం లేదు. సబ్ కమిటీ నిర్ణయాన్ని అమలు చేయడానికి డిసెంబరు 20 న విద్యార్థుల చేత హాస్టల్ ఖాళీ చేయించారు. కోర్టు తీర్పు వచ్చేవరకు వర్శిటీ గెస్ట్ హౌస్‌లో వుండేందుకు అనుమతించామని, కానీ తమ ప్రతిపాదనను విద్యార్థి జెఎసి తిరస్కరించిందని విద్యార్థి సంక్షేమ వ్యవహారాల డీన్ కార్యాలయం చెప్పింది. రోహిత్, మరో నలుగురు పోరాటబాట పట్టారు. వెలివాడ పేరుతో నిరసన శిబిరం నిర్వహించారు. కానీ దానికి టీచర్ల నుండి కాని, సాటి విద్యార్థుల నుండి కాని ఎటువంటి ఆదరణా లభించలేదు. ఈ పరిస్థితుల్లో 18 న హైకోర్టులో వాదనలు వినిపించే అవకాశం రోహిత్, అతని మిత్రులకు వచ్చింది. యూనివర్శిటీలో జరుగుతున్న 'దళిత దమనకాండ'ను కోర్టులో అందరి ఎదుటా దుయ్యబట్టే బ్రహ్మాండమైన అవకాశం వాకిట వుండగా రోహిత్ పిరికివాడిలా 17 న ఆత్మహత్య చేసుకోవడం దేనికి? సమాధానం దొరకటం లేదు.

అతను ఆత్మహత్య చేసుకోగానే యిక దళితవాదం ముందుకు వచ్చింది. కేంద్రమంత్రులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసులు నమోదయ్యాయి. వాళ్లకు యీ విద్యార్థుల పేర్లు సైతం తెలిసి వుండవు. వాళ్లేమైనా వీళ్లను కులం పేర దూషించారా? అవమానించారా? ఆ చట్టాన్ని చిత్తం వచ్చినట్లు వాడుతూ నిజమైన అత్యాచారాలు జరిగినప్పుడు జనాలు ఖాతరు చేయని పరిస్థితి తెచ్చిపెట్టారు. దళిత కోణం లేకుండా రోహిత్ తల్లి, మిత్రులు కేవలం రిసెర్చ్ స్కాలర్ ఆత్మహత్యగా ఆందోళన చేసి వుంటే విద్యార్థులందరికి సహానుభూతి కలిగేదేమో, కానీ యింత గుర్తింపు రాదనుకున్నారు కాబోలు. రోహిత్ శవం వద్ద తల్లి, సోదరుడు, సోదరి కనబడ్డారు కానీ తండ్రి కనబడలేదు. తండ్రి సంగతేమిటన్న సందేహం సహజంగానే వచ్చింది. ఏదో పేపర్లో చదివాను – ఆయనకు మతిస్థిమితం లేదని! పాపం అనుకున్నాను. తీరా చూస్తే టీవీ9లో కనబడి పలనాడు పిడుగురాముడిలా విరుచుకుపడ్డాడు. ఇంటర్ చదివాడట, శుభ్రంగా మాట్లాడుతున్నాడు. కొండలు బద్దలు కొట్టేవాడికి కుండ బద్దలు కొట్టడం ఒక లెక్కా? కుండబద్దలు కొట్టి మేం వడ్డెరలం, ఎస్సీలం

కాము, ఇంటర్ స్థాయిలో మా వాడు బిసి నుంచి ఎస్సీగా మార్చుకున్నాడు, ఎందుకురా యిదంతా అంటే ఉద్యోగాలకు పనికి వస్తుందిలే అన్నాడు అని చెప్పేశాడు. మీ భార్య కులం ఏమిటని టీవీవాళ్లు అడగలేదు, అడిగి వుంటే ఆవిడ మాల అవునో కాదో తేలిపోయేది.

రోహిత్ అంత్యక్రియల్లో తండ్రి కాని, తండ్రివైపు బంధువులెవరూ కాని హాజరు కాకుండా చూసినదెవరు? తండ్రి వస్తే దళితులు కాదని తెలిసిపోతుందనా? ఈ విషయం గురించి వాసన తగలటం చేతనే మాయావతి రావడం మానేశారా? రోహిత్ ఆదివారం చనిపోతే సోమవారం మధ్యాహ్నం వరకు కాని జన్మ నిచ్చిన తండ్రికి కబురే తెలియలేదు. తెలిశాక టిక్కెట్టు లేకుండా రైల్లో రావలసి వచ్చింది. తల్లి, తండ్రి మధ్య వున్న విభేదాలు రోహిత్‌ను కలవరపరచాయా? తెలియదు. అతనికి రావలసిన స్టయిపెండ్ నిలిపివేశారన్నదానిపై చర్చ జరుగుతోంది. సాధారణంగా స్టయిపెండులు ఒకటో తారీకు జీతాల్లా వచ్చి పడవు. చాలా డాక్యుమెంట్లు సబ్మిట్ చేయాలి, కొన్ని నెలలది కలిపి ఒక్కసారి యిస్తూ వుంటారు. అతనికి బాకీ నెలకు పాతిక వేల చొప్పున 7 నెలలకు రావాలి, అతని ఆత్మహత్య లేఖలోనే 7 నెలలు అని రాస్తే ఓ కాలమిస్టు ఏడాదిన్నర బాకీ అని రాసేశారు. రోహిత్ యివ్వవలసిన డాక్యుమెంట్లు యివ్వకపోవడం చేతనే అది ఆగిందని అప్పారావు చెప్పారు. నిజానికి జూన్ తర్వాత రోహిత్ రిసెర్చి వర్కు సరిగ్గా సాగలేదని "హిందూ" రాసింది. ఆ డాక్యుమెంట్లు రిసెర్చిలో ప్రగతికి సంబంధించినవేమో తెలియదు. జూన్ తర్వాత అతను చదువు కంటె ఎక్కువగా యూనియన్ కార్యకలాపాల్లో పడ్డాడు లాగుంది. యూనివర్శిటీకి వచ్చిన పని మూలపడింది, యాకూబ్‌లు ముఖ్యమయ్యారు. కొత్తగా చేజిక్కిన దళిత్ కార్డు విచ్చలవిడిగా వాడేశాడు. ఆ పేరు పెట్టి విసిపై చతుర్లు విసిరాడు. ఇప్పుడు అతని కులం గురించి విచారణ జరుగుతోంది. దళితుడు కాదని తేలితే ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసు వీగిపోతుంది, రోహిత్ అసలైన దళితులను మోసగించినట్లు అవగతమౌతుంది.

ఆత్మహత్య చేసుకోవడానికి కారణం ఏమిటో అర్థం కావటం లేదు. ఇతరులు అతన్ని పురికొల్పి వుంటారని ఎబివిపి నాయకులంటున్నారు. కొట్టివేసిన వాక్యాలు తెలిస్తే కొంత పట్టు దొరుకుతుందేమో. ఏది ఏమైనా చాలామంది విద్యార్థులు మానసిక సమతుల్యత పోగొట్టుకుని ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అతి కష్టమైన ఐఐటీలో ఎడ్మిషన్లు తెచ్చుకున్నవాళ్లే ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. సవ్యంగా విచారణ సాగితే అన్నీ బయటకు వస్తాయి. కానీ జరగనిస్తారా? విచారణ కమిటీ సభ్యులిద్దరు వస్తే విద్యార్థులు వారిని తరిమివేశారు. ఇలా అయితే అసలు కారణాలు ఎప్పుడు బయటకు వస్తాయి? ఇప్పుడో జుడిషియల్ కమిషన్ వేశారు. దాని రిపోర్టు ఎప్పుడు వస్తుందో తెలియదు. ఆ రిపోర్టును ఎప్పుడు అమలు చేస్తారో అస్సలు తెలియదు. సత్యమేదో తేలకుండానే అశోక్ బాజపేయి గారు సెంట్రల్ యూనివర్శిటీ యిచ్చిన డాక్టరేటు వాపస్ చేసేశారు. నిజానిజాలు తేలేదాకా ఓపిక పట్టలేనివాళ్ల దగ్గర డాక్టరేట్లు వుంటే వాటి పరువు పోతుంది. అందువలన యీ వాపసీని నేను స్వాగతిస్తున్నాను. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2016)**

**ఎమ్బీయస్ : సిరియా ఎన్నికల ఫలితం అమెరికాకు మింగుడు పడలేదు**

ప్రస్తుత ఇరాక్ సంక్షోభానికి కారణం – ఐయస్ఐయస్ (ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ అల్–షామ్ (గ్రేటర్ సిరియా) అనీ, జిహాద్ పేర శత్రువులను పరిమార్చడంలో ఆ సంస్థ అల్ ఖైదాను మించిపోయిందని, దాని నాయకుడు ఆబూ బకర్ అల్ బాగ్దాదీ బిన్ లాడెన్‌ను కంటె దారుణమైన వాడని అందరికీ తెలుసు. ఆ సంస్థ సిరియాలో అంతర్యుద్ధాన్ని ప్రారంభించి, రాకా వంటి కొన్ని ప్రాంతాలను వశపరుచుకుని అక్కడ షరియా పేరుతో క్రూరమైన శిక్షలు వేస్తోంది. తమను ఎదిరించినవారిని బహిరంగంగా ఉరి వేయడం, క్రైస్తవులపై రక్షణ పన్ను విధించడం జరుపుతోంది. అంతేకాదు, అల్ ఖైదాతో సంబంధం వున్న మరో జిహాదీ సంస్థ నస్రాతో కలిసి తక్కిన ప్రాంతాలలో బీభత్సాన్ని సృష్టిస్తోంది. ఇప్పటికే లక్షా ఏభైవేల మంది సిరియన్లు హతులయ్యారు. 2.30 కోట్ల జనాభాలో మూడోవంతు మంది వూరు వదిలి పారిపోవలసి వచ్చింది. లక్షలాది మంది సిరియన్లు జోర్డాన్, లెబనాన్, ఇరాక్‌లలో శరణార్థులుగా తలదాచుకున్నారు. ఇలాటి పరిస్థితుల్లో ప్రభుత్వానికి మద్దతు యిచ్చి మతోగ్రవాదులను అదుపు చేయడం సమంజసం.

కానీ అమెరికాకు ప్రస్తుతం ప్రభుత్వాన్ని నడుపుతున్న అధ్యక్షుడు బషర్ అల్ అసాద్ అంటే గిట్టదు. అతను అలావీ తెగకు చెందినవాడయినా జనాభాలో 60 శాతం వున్న సున్నీలు అతని నేతృత్వాన్ని సమర్థిస్తారు. అతని బాత్ పార్టీలో 30 లక్షలమంది సభ్యులుంటే అత్యధికులు సున్నీలే. ప్రజలు తన పక్షాన వున్నారు కాబట్టే అతను అనేక జిహాదీ సేనలను అదుపులో వుంచుతూ వచ్చాడు. పాశ్చాత్యదేశాలు, కొన్ని ధనిక అరబ్ దేశాలు యీ వాస్తవాన్ని గుర్తించకుండా అతన్ని బలహీనపరచాలని చూస్తున్నాయి. "ఫ్రీ సిరియన్ ఆర్మీ" పేరుతో సైన్యాన్ని తయారుచేసి పాశ్చాత్యదేశాల నిపుణులతో వారికి తర్ఫీదు యిప్పించి సిరియా ప్రభుత్వంపై తిరుగుబాటు చేయించాయి. ఆ ఆర్మీ పనికిరాకుండా పోయాక ప్రస్తుతం వారినే "ఇస్లామిక్ ఫ్రంట్" అనే మరో పేరుతో సేన ఏర్పాటు చేసి, అమెరికా నిపుణులు పశ్చిమదేశాల సహాయంతో జోర్డాన్, టర్కీలలో క్యాంపులు నిర్వహిస్తూ సిరియా సైన్యంపై పురిగొల్పుతున్నారు. తమ పౌరులను కూడా వారితో భుజం కలిపి పోరాడమని ప్రోత్సహిస్తూ 'వీరు ఉదారవాదులు, సిరియా సైన్యంతోనే కాదు, నస్రా, ఐయస్ఐయస్‌తో కూడా పోట్లాడతారు' అని పైకి చెపుతున్నారు. అమెరికా ఇంటెలిజెన్సు ఏజన్సీల ప్రకారం సిరియాలో 26 వేల

మంది తీవ్రవాదులున్నారు. వారిలో 7 వేల మంది విదేశీయులే. వారిలో బ్రిటిష్, ఫ్రెంచ్‌వారు చెరో 1100 మంది వుంటారు. బెల్జియం, హాలండ్, స్కాండినేవియాల నుండి కూడా సైనికులను పంపారు. 70 మంది అమెరికన్లు వున్నారు.

ఓ పక్క యిలా చేస్తూనే 'సిరియాలో అంతర్యుద్ధం జరుగుతోంది. మైనారిటీలైన అలావీలు, క్రైస్తవులకు, ముస్లిములకు మధ్య సాయుధపోరాటాలు జరుగుతున్నాయి. సిరియాలో ప్రభుత్వం దాన్ని అదుపు చేయలేకపోతోంది. అక్కడ తక్షణం అధికారం చేతులు మారాలి. లేకపోతే ఆ యుద్ధం సిరియా సరిహద్దులు దాటి యితర దేశాలకు పాకుతుంది' అని ఒబామా అంటున్నారు. సిరియా ప్రభుత్వం ఇరాన్, రష్యాల మద్దతుతో యీ తీవ్రవాదులతో పోరాడుతూ వారిని కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితం చేసింది. ఇలాటి పరిస్థితుల్లో సిరియాలో జూన్ 3 న అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. అసాద్ మళ్లీ ఎన్నిక కాకూడదని అమెరికా శతథా ప్రయత్నించింది. గతంలో అయితే ఒక పార్టీ అభ్యర్థి మాత్రమే ఎన్నికలలో పోటీ చేసే వీలుండేది. వివిధ పార్టీల వారు పోటీ చేయవచ్చంటూ 2007లో రాజ్యాంగాన్ని సవరించారు కాబట్టి యీ సారి హఫీజ్ హజ్జార్ అనే సిరియా కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, హసన్ అబ్దుల్లా నౌరీ అనే వ్యాపారవేత్త నిలబడ్డారు. ఎన్నికలలో పాల్గొనడానికి సిరియన్లు ఎగబడ్డారు. ఇతర దేశాల్లో తలదాచుకున్నవారు కూడా సరిహద్దులు దాటి వచ్చి మరీ ఓటు వేశారు. 73% పోలింగు జరిగింది. పోలయిన ఓట్లలో 88.7% ఓట్లు అసాద్‌కు పడ్డాయి. మరో ఏడేళ్లపాటు అధ్యక్షుడిగా వుండి దేశంలో శాంతి నెలకొల్పమని ఆ దేశప్రజలు అతనికి అవకాశం యిచ్చారు.

అయితే యీ ఫలితం పట్ల అమెరికా మండిపడింది. గత రెండేళ్లగా ఒబామా "సిరియా అధ్యక్షుడిగా అసాద్ రోజులు లెక్కపెట్టుకుంటున్నారు" అంటూ వచ్చాడు. ఇటీవలే వెస్ట్ పాయింట్ మిలటరీ ఎకాడమీలో మాట్లాడుతూ ఒబామా "తన ప్రజలను ఆకలిదప్పులతో మాడుస్తూ, వారిపైనే బాంబులు వేసే నియంత పాలనను కూలదోయడానికి సిరియన్ ప్రజలకు మనం అండగా నిలవాలి" అన్నాడు. ఇప్పుడిలా జరగడంతో అమెరికా ప్రభుత్వపు సెక్రటరీ ఆఫ్ స్టేట్ జాన్ కెర్రీ "ఈ ఎలక్షన్ పెద్ద గుండుసున్నా" అని వర్ణించాడు. అంతర్యుద్ధం నడుస్తూండగా ఎన్నికలేమిటి అని ఎద్దేవా చేశాడు. ఉక్రెయిన్‌లో, నాటో సేనలు ఆక్రమించివున్న ఇరాక్‌లో, అఫ్గనిస్తాన్‌లో కూడా యిలాటి పరిస్థితే వున్నపుడు నిర్వహించిన ఎన్నికలు వారికి ఎబ్బెట్టుగా తోచలేదు. అవి చాలా న్యాయంగా జరిగాయని సర్టిఫికెట్టు యిచ్చారు కూడా. ఇప్పుడు ప్రజలు ఆమోదించిన అధ్యక్షుణ్ని దింపడానికి కంకణం కట్టుకుంది. తాము ప్రోత్సహిస్తున్న 'ఇస్లామిక్ ఫ్రంట్'కు తర్ఫీదు యిచ్చి అత్యంత ఆధునిక సేనగా మార్చడానికి ఒబామా సిఐఏకు అధికారం యిచ్చినట్లు "ద వాల్ స్ట్రీట్ జర్నల్" రాసింది. అంతిమంగా యిది ఎటు దారి తీస్తుందో చూడాలి. **(జులై 2014)**

**జనవరి 14** **ఎమ్బీయస్ : రాహుల్ గాంధీ చురుకుదనం వెనుక...**

ఇటీవలి కాలంలో రాహుల్ గాంధీ చురుగ్గా వుంటున్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన విధించినప్పుడు ఆక్షేపణ తెలపడం వంటి రాజకీయ స్పందనలు ఎలాగూ తప్పవు. కొన్ని వర్గాలను అనుకూలంగా మార్చుకునే అదనపు ప్రయత్నం చేస్తున్నట్లు కనబడుతోంది. రోహిత్ ఆత్మహత్య వార్త తెలియగానే వాలిపోయి తను దళితపక్షపాతిని అని చూపించుకునే ప్రయత్నం చేశారు. తమిళనాడు కాంగ్రెసు మహిళా విభాగంలో రాష్ట్ర అధ్యక్షుడు ఇలంగోవన్‌తో పేచీ పెట్టుకున్న విజయధరిణిని తొలగించి ఆమె స్థానంలో దళిత నేత ఝాన్సీ రాణిని నియమించారు. ఆమె ఎమ్మెల్యేగా కూడా లేదు. ఏడుసార్లు ఎమ్మెల్యే అయిన పొణ్ణమ్మాళ్‌కు మనుమరాలు మాత్రమే. ప్రస్తుతం ఒక జిల్లాకు అధ్యక్షురాలు. దళితుల్లాగానే రైతులూ నాకు కావలసినవారే అని చూపడానికి కాబోలు బుందేల్‌ఖండ్‌లో పాదయాత్ర నిర్వహించారు. పేదల కోసం కూడా నిలిచాను అని చూపడానికి వచ్చేవారం అనంతపురం జిల్లాలోని బండ్ల గ్రామానికి రాబోతున్నారు. సందర్భం ఏమిటంటే ఉపాధిహామీ పథకం – నరేగా– (మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ స్కీము) పెట్టి పదేళ్లయిందట! వచ్చి, అది తమ హయాంలోనే ప్రవేశపెట్టబడిందని జనాలకు గుర్తు చేస్తారట. రాష్ట్రవిభజన జరిగిన చాన్నాళ్లు రాహుల్ యిటు తొంగి చూడలేదు. ఆంధ్రలో ఓటమి ఎలాగూ తప్పదు, తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షంగా వుంది కదా, అక్కడైనా పార్టీని నిలపెడదామని ఉపయెన్నికలో, హైదరాబాదు కార్పోరేషన్ ఎన్నికలలో విస్తారంగా తిరిగి ప్రచారమూ చేయటం లేదు. రాజకీయలబ్ధి లేకుండా ఉత్తిపుణ్యానికి యింత చురుకుదనం దేనికి అని ఆలోచిస్తే ఒక విషయం తడుతోంది. నేషనల్ హెరాల్డ్ కేసులో జైలుకి వెళ్లే ప్రమాదం!

బెయిల్ సందర్భంగా సోనియా అన్నమాటలు గుర్తు చేసుకోండి – "నేను ఇందిరా గాంధీ కోడల్ని, పోరాడతాను" అందామె. జనతా పార్టీ అధికారంలో వుండగా హోం మంత్రి చరణ్ సింగ్ జీపుల కేసులో ఇందిరా గాంధీని అరెస్టు చేయించాడు. ఆ సందర్భంగా ఇందిర ప్రభుత్వాన్ని చాలా యాగీ చేసింది. మార్గమధ్యంలో వాహనం దిగడానికి అనుమతి అడిగి, అనుమతి యిచ్చాక మళ్లీ ఎక్కనని మొరాయించి పోలీసులను ముప్పుతిప్పలు పెట్టింది. చరణ్ సింగ్ అసమర్థత కారణంగా కేసు సరిగ్గా నడవలేదు. ఇక ఇందిర తను వెళ్లిన చోట ప్రతీ చోటా నన్ను జైల్లో పెట్టారు అంటూ కన్నీరు కురిపించింది. ప్రజాస్వామ్యవాదులు, మధ్యతరగతివారు, మేధావులు చీదరించుకున్నారు కానీ మహిళలు, పేదలు, దళితులు, మైనారిటీలు ఇందిరపై బోల్డు సానుభూతి కురిపించారు. 1978 ఆంధ్రప్రదేశ్, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలలో ఇందిరా కాంగ్రెసు గెలుపొందడానికి ఆమె కన్నీళ్లే కారణమన్నా అతిశయోక్తి కాదు. ఇందిర జీపు కేసు కంటె నేషనల్ హెరాల్డ్ కేసు చాలా గట్టిది. ప్రస్తుతానికి బెయిలు దొరికింది కానీ 2016 ఫిబ్రవరి 20 న మళ్లీ

కోర్టుకి హాజరు కావాలి. మోదీ ప్రభుత్వం సమర్థవంతంగా వ్యవహరించి, కేసును కడదాకా నడిపిస్తే సోనియా, రాహుల్ తదితరులు జైలుకి వెళ్లే సావకాశం గట్టిగా వుంది. శిక్షంటూ పడితే సోనియా విషయంలో ఆమెకున్న తీవ్రఅనారోగ్యం కారణంగా వెసులుబాటు దొరికే ఛాన్సుంది. కానీ రాహుల్‌కి అలాటి మినహాయింపులు లేవు. జైలుయోగం పడితే తన తరఫున ఆందోళన చేయడానికి కాంగ్రెసు కార్యకర్తలు సరిపోరు, ప్రజల్లో కొన్ని వర్గాలైనా తన కోసం నిలవాలి, ఆందోళన వ్యక్తం చేయాలి. అందుకే యివన్నీ అని నా అనుమానం. ఇంతకీ నేషనల్ హెరాల్డ్ కేసు అంత పెద్దదా?

కాంగ్రెసు పార్టీకి తనకంటూ ఒక పత్రిక వుండాలి, దాని కోసం ఒక పబ్లిషింగ్ కంపెనీ ప్రారంభించాలి అనే నెహ్రూ సూచనతో అసోసియేటెడ్ జర్నల్స్ లి. (ఎజెఎల్) అనే పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ 1938లో వెలిసింది. 2000 ప్రిఫెరెన్షియల్ షేర్ల విలువ ఒక్కోటి రూ.100 కాగా, 30 వేల మామూలు షేర్ల విలువ ఒక్కోటి రూ.10. నెహ్రూ వాటా రూ.100. మొత్తం 5000 మంది స్వాతంత్ర్యయోధులు షేర్‌హోల్డర్లు అయ్యారు. వారిలో పురుషోత్తమ్ దాస్ టాండన్, ఆచార్య నరేంద్ర దేవ్, కైలాశ్ నాథ్ కట్జూ, రఫీ అహ్మద్ కిద్వాయ్, గోవింద వల్లభ పంత్ వంటి దిగ్గజాలు వున్నారు. ఇది నేషనల్ హెరాల్డ్ అనే ఇంగ్లీషు పత్రిక (సంపాదకుడిగా తెలుగువాడే అయిన చలపతిరావు వుండేవారు), ''క్వామీ ఆవాజ్'' అనే ఉర్దూ పత్రిక, ''నయా జీవన్'' అనే హిందీ పత్రిక ప్రచురించేది. స్వాతంత్ర్యపోరాట కాలంలో ఆ పార్టీకి మంచి పేరుప్రఖ్యాతులు, ఆదరణ వుండేవి. కాంగ్రెసు నాయకులు పత్రిక గురించి ప్రచారం చేసి సర్క్యులేషన్ పెంచేవారు. అధికారంలోకి వచ్చాక వారికి పత్రిక గురించి పట్టించుకోవడానికి తీరిక లేకపోయింది. దృష్టి పెట్టేవాళ్లు లేక చందాదారులు తగ్గసాగారు. పార్టీ పత్రికలను ఎలాగైనా బతికించుకోవాలని నెహ్రూకు కోరిక వుండేది. చివరకు 1955లో ఎజెఎల్‌ను లాభాపేక్ష లేని సెక్షన్ 25 కంపెనీగా మార్చారు. (జనహిత్ నిధి ట్రస్టు అనే పేర ఒక ధర్మనిధి ఏర్పాటు చేసి ఎజెఎల్ షేర్లన్నీ దానికి బదిలీ చేశారని కూడా చదివాను, కేసులో యీ ట్రస్టు మాట ఎక్కడా వినబడటం లేదు) ఎజెఎల్‌కు అప్పటికే ఢిల్లీ, హరియాణా, బొంబాయి, లఖనవ్, ఇందోర్‌లలో ఆస్తులుండేవి. పత్రికను బతికించుకోవడం తమ నైతిక బాధ్యతగా కాంగ్రెసు పార్టీ ఫీలయ్యేది. దానికి అప్పుడప్పుడు డబ్బులు యిస్తూ వుండేది.

ఖుశ్వంత్ సింగ్ 1978-79లలో కొంతకాలం ఆ పత్రికకు ఎడిటరుగా పనిచేసేవాడు. డబ్బుల్లేక పత్రిక ఆపేయాలేమో అనుకున్నపుడు సడన్‌గా సూటుకేసుల్లో డబ్బులు వచ్చేవిట. దాంతో జీతాలు యిచ్చి, కరంటు బిల్లులు కట్టేవారట. అది ఎంత దరిద్రంలో బతికిందంటే 2008లో పత్రిక మూతపడేనాటికి ఆఫీసు మొత్తానికి ఒకే ఒక్క కంప్యూటరు వుండేది. పనంతా టైపు రైటర్లపై నడిచేది. చెత్త పేపరుపై 5 వేల కాపీలు వేసేవారు. వాటిలో చాలాభాగం ప్రభుత్వాఫీసులకే వెళ్లేవి. బయట న్యూస్ స్టాల్స్‌కి అతి తక్కువగా వెళ్లేవి. 265 మంది ఉద్యోగస్తులు మిగిలితే విఆర్ఎస్ కింద తలా రూ.15 లక్షలిచ్చి యింటికి పంపించేశారు. అందువలన కాంగ్రెసు అధికారంలో వున్నపుడు కూడా పత్రికను సరిగ్గా పోషించలేదు. 70 సం॥రాల కాలంలో అది అడపాదడపా యిస్తూ వచ్చిన డబ్బు 2008 నాటికి రూ.90 కోట్లకు చేరింది. అది అప్పుగా యిచ్చినట్లా, లేక ఆ కంపెనీలో పెట్టుబడి పెట్టినట్లా అన్నది స్పష్టంగా ఎక్కడా రాసుకోలేదు. వడ్డీ లేకుండా అప్పిచ్చాం అంటోంది కాంగ్రెసు యిప్పుడు. రాజకీయపార్టీలు యిలా అప్పులివ్వచ్చా? అని యిప్పుడు ప్రశ్నలు వస్తున్నాయి.

దీనిపై తీర్పు వస్తే అది చాలా ముఖ్యమైన, మార్గదర్శకమైన తీర్పు అవుతుంది. ఎందుకంటే అనేక రాజకీయపార్టీలకు సంబంధిత పత్రికలున్నాయి. వాళ్లు యిదే తరహాలో తమ పత్రికలను పోషిస్తూ వుండవచ్చు. ఉదాహరణకి ''విశాలాంధ్ర'', ''ప్రజాశక్తి'', ''ఆర్గనైజర్'' వంటి పత్రికలు యాడ్స్‌పై, చందాలపై నడుస్తున్నాయని తోచదు. ఆ యా పార్టీలు నిధులు అందిస్తూ వుండాలి. అవి ఏ పేరు చెప్పి నిధులిస్తున్నాయి? అది చట్టప్రకారం సమ్మతమేనా? అనే విషయం తెలుతుంది. నేషనల్ హెరాల్డ్ పత్రిక మూతపడి, కాంగ్రెసు పార్టీ చేసిన ఆర్థికసాయం మురిగిపోయినా ఎవరూ పేచీ పెట్టి వుండకపోదురు. లేదా తాము చేసిన సాయానికి గాను నేషనల్ హెరాల్డ్ ఆస్తులను కాంగ్రెసు పార్టీ తమ పేర రాయించేసుకున్నా సరేలే అని వూరుకుందురేమో.

కానీ జరిగిన దగా ఏమిటంటే సోనియా, రాహుల్ నేషనల్ హెరాల్డ్ ఆస్తులను దొడ్డిదారిన కాజేయడానికి పూనుకున్నారు. 2010 నవంబరులో యంగ్ ఇండియన్ అనే లాభాపేక్ష లేని కంపెనీ కంపెనీల చట్టం 25 వ సెక్షన్ కింద ప్రారంభించారు. మూలధనం రూ. 5 లక్షలు. కంపెనీలో సోనియా వాటా 38%, రాహుల్‌ది 38%, తక్కిన 24%లో కాంగ్రెసు కోశాధికారి మోతీలాల్ వోరా, సోనియా అంతేవాసి ఆస్కార్ ఫెర్నాండెజ్, (సుమన్ దూబే, శామ్ పిత్రోడా కూడా ఏదో దశలో చేరినట్లున్నారు). ఈ కంపెనీ దగ్గర్నుంచి కేవలం రూ.50 లక్షలు తీసుకుని కాంగ్రెసు పార్టీ 'నాకు నేషనల్ హెరాల్డ్ నుంచి రావల్సిన రూ.90 కోట్లు నువ్వే వసూలు చేసుకో' అని అధికారం యిచ్చేసింది. అప్పుడు ఆ కంపెనీ ఎజెఎల్ వద్దకు వచ్చి 'మీ బదులు కాంగ్రెసు పార్టీకి బాకీ తీర్చేశాం కాబట్టి, మీ కంపెనీలో 99% (ఈ శాతంపై స్పష్టత లేదు, మెజారిటీ షేర్లు అనే కొందరు రాస్తున్నారు) వాటా యివ్వండి' అని అడిగి తీసుకుంది. ఆ విధంగా వివిధ నగరాల్లో ఎజెఎల్ కున్న యావదాస్తులపై యంగ్ ఇండియన్‌కు హక్కు దఖలు పడింది. ఎజెఎల్‌కు వున్న ఆస్తుల విలువ బుక్ వేల్యూ ప్రకారం రూ. 1.71 కోట్లు - ఎప్పుడో ఆరు దశాబ్దాల క్రితం కొన్నారు కాబట్టి! కానీ మార్కెట్ విలువ ఎన్నో రెట్లు ఎక్కువ. రూ.2 వేల కోట్లు అని సుబ్రహ్మణ్యం స్వామి అన్నారు కాబట్టి కనీసం అందులో నాల్గో వంతైనా వుంటుంది.

ఇంత ఆస్తులున్న ఎజెఎల్ ఒకటి రెండు అమ్మేస్తే అతి సులభంగా అప్పు తీర్చేయవచ్చు. ఈ యంగ్ ఇండియన్‌కు మెజారిటీ వాటా ఎందుకివ్వాలి? అలా ఎలా ఒప్పుకుంది? అంటే దానికి 2002 నుండి సిఎండీ వేరెవరో కాదు మోతీలాల్ వోరాయే! ఎజెఎల్‌లో

ప్రస్తుతం వున్న వాటాదారుల సంఖ్య 1037! వారిలో ఏ ఒక్కరు అడ్డుకున్నా యీ బదిలీ చిక్కుల్లో పడుతుంది. అదే జరిగింది. శాంతి భూషణ్ 'తనకు యీ షేర్ల బదిలీ గురించి తెలియపరచలేదం'టూ కోర్టు కెక్కారు. ప్రస్తుతం కాంగ్రెసు పార్టీ సోనియా, రాహుల్ చేతిలో వుంది కాబట్టి పార్టీ నుంచి అభ్యంతరాలు రాలేదు. రేపు వేరేవారు వస్తే 'రూ.90 కోట్ల అప్పును కేవలం రూ.50 లక్షలకే ఎందుకు వదులుకున్నారు? దాని బదులు ఎజెఎల్ ఆస్తులు మన పార్టీ పేర రాయించేసుకుంటే బాగుండేది కదా' అని అడుగుతారు. అంటే అటు పార్టీకి, యిటు స్వాతంత్ర్యసమరయోధులు స్థాపించిన సంస్థను దోచుకుని సోనియా, రాహుల్ బాగుపడుతున్నారన్నమాట!

అబ్బే, అలాటిదేమీ లేదు, ఇప్పటిదాకా ఎజెఎల్ ఆస్తులు స్వాధీనం చేసుకోలేదు, పైగా ఎజెఎల్‌లాగానే మాదీ లాభాపేక్ష లేని కంపెనీ అని సోనియా, రాహుల్ వాదిస్తున్నారు. కాంగ్రెసు పార్టీ కానీ, దాతలు కాని ఎవరూ ఫిర్యాదు చేయనప్పుడు కేసేమి వుంది? మోసం చేశారని ఎలా అంటారు? అని చిదంబరం ఆశ్చర్యపడుతున్నాడు. కానీ తక్కినవాళ్లు అలా అనుకోవడం లేదు. సుబ్రహ్మణ్య స్వామి 2013 జనవరిలో ఢిల్లీ కోర్టులో సోనియా, రాహుల్‌లపై చీటింగ్ కేసు పెట్టాడు. నేషనల్ హెరాల్డ్ ఆఫీసు వుండే బహదూర్ షా జఫర్ మార్గ్ బిల్డింగులో యిప్పుడు పాస్‌పోర్టు ఆఫీసు పెట్టి అద్దె తీసుకుంటున్నారన్నాడు. ఎజెఎల్ పేరు చెప్పి ఆస్తులు సంపాదించుకోవాలనే ఆలోచన సోనియా, రాహుల్‌లకు ముందు నుంచే వున్నట్టుంది. 2006లో హరియాణా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పత్రికలకు ప్రోత్సాహం పేరు చెప్పి అప్పటికే కుంటుతూ వున్న నేషనల్ హెరాల్డ్‌కు రూ.59 లక్షలకు ప్లాటు ఎలాట్ చేసింది. హరియాణాలోను, కేంద్రంలోను వున్నది కాంగ్రెసు ప్రభుత్వమే కాబట్టి యిది సాధించారు. వోరా దాన్ని 2012లో స్వాధీనం చేసుకుని రూ.14.60 కోట్లకు తాకట్టు పెట్టాడు. అంటే అంత విలువైన స్థలాన్ని ఎంత చవకగా కొట్టేశారో గమనించాలి. ఇప్పుడు దాన్ని తమ యంగ్ ఇండియా కంపెనీ అజమాయిషీలోకి తెచ్చేసుకున్నారు.

ఢిల్లీ కోర్టు 2013 జూన్‌లో తల్లీకొడుకులకు సమన్లు పంపించింది. వాళ్లు తమపై కేసు కొట్టేయమంటూ హైకోర్టుకి వెళ్లారు. 2015 డిసెంబరు 7 న హైకోర్టు వారి అభ్యర్థన తిరస్కరించి, పాటియాలా హౌస్‌లో వున్న ట్రయల్ కోర్టుకి హాజరు కమ్మనమని చెప్పింది. తప్పనిసరి పరిస్థితుల్లో వాళ్లు డిసెంబరు 19న హాజరై బెయిల్ యిమ్మనమని అడిగారు. ఇవ్వద్దు, వాళ్లకు చాలా పలుకుబడి వుంది, విదేశాలకు పారిపోతారు అంటూ సుబ్రహ్మణ్యం స్వామి అడ్డుపడ్డాడు. అయినా కోర్టు రూ.50 వేల పూచీకత్తుపై యిద్దరికీ బెయిలు యిచ్చింది. ఫిబ్రవరి 20 న కోర్టుకు మళ్లీ హాజరు కావాలంది. మేము స్వయంగా హాజరు కానక్కరలేకుండా మినహాయింపు యివ్వండి అని వాళ్లిద్దరూ చేసిన అభ్యర్థన కోర్టులు తిరస్కరించాయి కాబట్టి కేసులో ఎంతో కొంత విషయం వుందని ఒప్పుకున్నట్లే. ఢిల్లీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ గోమతి మనోచా తన 2014 జూన్ 26 నాటి తీర్పులో 'ప్రజాధనాన్ని వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకునే ఉద్దేశంతోనే యంగ్ ఇండియన్ లి. అనే కంపెనీని పుట్టించార'ని అభిప్రాయపడ్డారు. బెయిలు మంజూరు చేసిన డిసెంబరు 7 నాటి తీర్పులో హైకోర్టు న్యాయమూర్తి కూడా 'ఎజెఎల్‌లో, యంగ్ ఇండియాలో, కాంగ్రెసు పార్టీలో వ్యక్తులు ఒకరే కాబట్టి ఎజెఎల్ ఆస్తులను చేజిక్కించుకోవడానికి చేసిన ప్రయత్నమిది అని స్పష్టంగా తెలుస్తోంది' అని వ్యాఖ్యానించారు. ఎజెఎల్ వంటి పబ్లిక్ లిమిటెడ్ కంపెనీని యంగ్ ఇండియా వంటి ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఎలా టేకోవర్ చేసుకోగలదని నిపుణులు అడుగుతున్నారు.

ఇదంతా కావాలని చేస్తున్న యాగీ అని కాంగ్రెసు వాదిస్తోంది. 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ రెండు సార్లు –ఒకసారి యుపిఏ హయాంలో, మరోసారి ఎన్‌డిఏ హయాంలో – యీ లావాదేవీని పరిశీలించి, తప్పేమీ లేదని తేల్చింది. సుబ్రహ్మణ్యం స్వామి ఫిర్యాదు తర్వాత కేసు తిరగతోడింది. ఇది రాజకీయ కక్ష కాకపోతే మరేమిటి?" అంటోంది. మాకేమీ సంబంధం లేదు అని బిజెపి వాదిస్తోంది కానీ సుబ్రహ్మణ్యం స్వామికి రాచమర్యాదలు చేస్తోంది. ఢిల్లీ కోర్టులో సోనియా, రాహుల్ హాజరు కావడానికి ముందు రోజు అతనికి ల్యూటెన్స్ జోన్‌లో మంత్రులకు యిచ్చే బంగళా కేటాయించింది, రూలు ప్రకారం అతనికి అంత బంగళా యివ్వకూడదు. ఎవరి ఉద్దేశం ఏదైనా యీ షేరు బదిలీ వ్యవహారంలో దురుద్దేశం స్పష్టంగా కనబడుతోంది. ప్రభుత్వం జాగ్రత్తగా, మెలకువగా వ్యవహరిస్తే సోనియా, రాహుల్‌లు కృష్ణజన్మస్థల దర్శనం తప్పదు. ఈ ప్రమాదాన్ని వూహించే రాహుల్ యిప్పుడు కొన్ని వర్గాలను తమ పక్షాన మచ్చిక చేసుకుంటున్నాడని అనుకోవచ్చు. 'రాజకీయనాయకులు ఏదో ఒక కార్యక్రమం చేపడుతూనే వుంటారు. ప్రస్తుతం చేస్తున్నది అందులో భాగమే తప్ప నేషనల్ హెరాల్డ్ కేసుకి సంబంధం లేదు' అని కూడా కొందరు వాదించవచ్చు. అలాటప్పుడు రాహుల్ పార్టీ అధ్యక్షపదవిని చేపట్టడానికి సిద్ధంగా వున్నారన్న వార్తలు ఎందుకు వస్తున్నాయో సమాధానం చెప్పాల్సివస్తుంది. తల్లి అనారోగ్యం పాలైనప్పుడే ఆ పదవి చేపట్టి ఆమెకు భారం తగ్గించవలసిన తనయుడు తప్పుకుని తిరిగాడు. ఇప్పుడేం కొంప మునిగిందని అధ్యక్షపదవి తీసుకుంటాడు? తను జైలుకి వెళితే 'మమ్మల్ని రాజకీయంగా సమాధి చేయడానికి మా అధ్యక్షుణ్ని జైలుకి పంపారు' అని కాంగ్రెసు పార్టీ బిజెపిని దుమ్మెత్తిపోయడానికా? **– (సమాప్తం) ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2016)**

**జనవరి 11** **ఎమ్బీయస్ : యూరోప్ గాథలు 25**

జవాబులు – స్కాట్లండ్ చరిత్ర గురించి నేను రాసినది ఒకాయన సందేహించారు. ఇంగ్లండు స్కాట్లండ్‌ను ఎన్నడూ జయించలేదని ఆయన విన్నారట. సామాన్య స్కాట్లండ్ ప్రజల హృదయాలు గెలవలేదని కవితాత్మకంగా చెప్పినది విన్నారు కాబోలు. నేను రాసినదంతా చరిత్రే. స్కాట్లండ్‌లో కొందరు వీరులు తిరుగుబాటు చేస్తూండగా అధికాంశం సామంతరాజులు ఇంగ్లండుకు విశ్వాసపాత్రులుగా

వున్న మాట వాస్తవమే.

రోమన్ సార్వభౌముల కథ చాలా రసవత్తరంగా వుంటుంది. స్కాట్లండ్ కథలన్నీ వీరత్వంతో, శూరత్వంతో కూడినవి. రోమ్ పాలకుల కథలు శూరత్వంతో పాటు రాజకీయాలు, ఎత్తుపైయెత్తులు, కుట్రలు, హత్యలతో కూడినవి. తక్కిన దేశాల్లో రాజుల పాలన కాబట్టి మహా అయితే వారసత్వపు తగాదాలు, తిరుగుబాట్లు, పొరుగురాజులతో పోట్లాటలు వుంటాయి. కానీ రోమ్‌లో ప్రజాప్రతినిధులతో కూడిన సెనేట్ దేశంలో ప్రధాన వ్యక్తి అయిన కాన్సల్‌ను నియంత్రిస్తూ వుంటుంది. సెనేట్‌లో బలాబలాలు తారుమారయినప్పుడు పదవులు గల్లంతవడం జరిగేది. రోమన్ సమాజంలో ఎన్నో దొంతరలున్నాయి. వారి మధ్య ఘర్షణలుండేవి. అద ృష్టవశాత్తూ రోమన్లు తమ చరిత్రను క్రీ.పూ. 3 వ శతాబ్దం నుండి నమోదు చేసి పెట్టారు. అందువలన తారీకులతో సహా రోమన్ చరిత్ర మనకు లభ్యమవుతోంది. రోమ్ అనగానే అందరికీ జూలియస్ సీజర్ గుర్తుకు వస్తాడు. అతని యుద్ధవిజయాలు, అతనికి క్లియోపాత్రాకు మధ్య నడిచిన ప్రణయం, అతని హత్య – కథాంశాలుగా అనేక నవలలు, నాటకాలు, సినిమాలు వచ్చాయి. ఆస్టెరిక్స్ కామిక్స్‌లో సీజర్‌ది ప్రధాన పాత్ర. రోమ్ గాథల్లో అతనిదే మనం విపులంగా చెప్పుకునే మొదటి కథ!

ముందుగా రోమ్ నగర స్థాపకుల గురించి వున్న ఐతిహ్యం చెప్పుకుంటే బాగుంటుంది. యూరోప్ గాథలు – 8 లో బ్రిటన్‌కు ఆ పేరు ఎలా వచ్చిందో చెపుతూ రాశాను – 'ఈనియాస్ ట్రాయ్ వీరుడు. ట్రాయ్ రాజుకు వరుసకు సోదరుడైనవాడికి, వీనస్ అనే దేవతకు పుట్టినవాడే ఈనియాస్. అతను ట్రాయ్ యుద్ధంలో సజీవుడిగా మిగిలి, పొరుగుదేశపు రాజు ఆశ్రయం పొందాడు. అతని తరఫున అతని శత్రువైన ఇటలీ రాజుని ఓడించి, అతని కూతుర్ని పెళ్లాడి ఇటలీకి రాజయ్యాడు. రోమ్ నగర స్థాపకులైన రోములస్ సోదరులు అతని వంశజులే.' అని. ఈనియాస్ వారసుడైన న్యూమిటార్ రోములస్, రీమస్ అనే కవల సోదరులకు మాతామహుడు. మధ్య ఇటలీలో వున్న లాటియమ్ నగరానికి చెందిన ఆల్బా లాంగ్ రాజ్యానికి రాజు. కోశాధికారిగా వుండే అతని తమ్ముడు అమూలియస్ కొన్నాళ్లకు న్యూమిటర్‌ను గద్దె దింపి, ఖైదు చేశాడు. అతని కొడుకులందరినీ చంపేశాడు. రియా సిల్వియా అనే కూతురు కూడా వుండడంతో ఆమెను వెస్టా దేవత ఆలయంలో పూజారిణిగా మార్చాడు. ఆ ఆలయంలో నిరంతరం మండే హోమాగ్నిని ఆరకుండా కాపాడవలసిన బాధ్యత యీ పూజారిణిది. వారు బ్రహ్మచర్యం పాటించాలి. ఆ విధంగా అన్నగారికి ఎవరూ వారసులు లేకుండా చేశాననుకున్నాడు. అయితే విధి మరోలా తలిచింది. సిల్వియా గర్భవతి అయింది. ఆమె గర్భానికి కారకుడు మార్స్ దేవుడని కొందరంటారు. అబ్బే కాదు, ఎవరో బలవంతంగా చెరిచారు అంటారు కొందరు. ఏమైతేనేం, తన గర్భానికి దేవుడే కారణమని ఆమె చెప్పుకుంది. మామూలుగా అయితే పూజారిణి ఎవరితోనైనా శయనిస్తే సజీవంగా పాతిపెట్టాలి. కానీ అలా చేస్తే ఆమెను గర్భవతిని చేసిన దేవుడు తనను శపిస్తాడని భయపడిన అమూలియస్ ఆమెను చెరసాలలో పెట్టించి, ఆమెకు కవలలు పుట్టగానే వారిని టైబర్ నదిలో పడేయమన్నాడు. అలా అయితే వారిని చంపిన పాపం ప్రకృతిదవుతుంది కానీ తనది కాదని అతని వూహ. అయితే యిలాటి కథల్లో ఎప్పుడూ జరిగేట్లుగానే చంపవలసిన పనివాడికి జాలి కలిగి ఒక బుట్టలో యిద్దర్నీ పెట్టి వదిలేశాడు.

నదిలో ఆ బుట్ట కొట్టుకుంటూ వచ్చి ఒక చెట్టు కొమ్మల్లో చిక్కుకుంది. ఆ చెట్టు పాలటైన్ పర్వతపాదంలో వుంది. లూపా అనే ఆడ తోడేలు యీ కవలపిల్లలను చూసి జాలిపడి పాలిచ్చి పెంచిందిట. ఆడతోడేలు చంటిపిల్లలుగా వున్న యీ సోదరులకు పాలిస్తున్న విగ్రహాలు రోమ్‌లో కనబడతాయి. వాళ్లు దొరికిన పాలటైన్ కొండ, దానిపై కట్టిన భవంతి కొలోజియమ్‌కు దగ్గర్లోనే, దాదాపు ఎదురుగా వుంది. తోడేలు పాలివ్వడం ఒక గొఱ్ఱెల కాపరి గమనించాడు. అతనికి పిల్లలు లేకపోవడంతో వీళ్లిద్దరినీ సాకాడు. వాళు పెరిగి పెద్దవాళ్లయి పెంపుడు తండ్రి గొఱ్ఱెలను కాచేవారు. ఒకరోజు అమూలియస్ రాజు దగ్గర పనిచేసే గొఱ్ఱెల కాపర్లతో పేచీ వచ్చింది. రీమస్‌ను వాళ్లు బందీగా పట్టుకుపోయారు. అప్పుడు రోములస్ మరి కొందరు గొఱ్ఱెల కాపర్లను వెంటపెట్టుకుని వెళ్లి తమ్ముణ్ని విడిపించుకున్నాడు. ఆ ప్రయత్నంలోనే రాజు అమూలియస్‌ను చంపివేశాడు. వాళ్లు ఫలానా అని తెలిశాక ఆ వూరి ప్రజలు వారికి రాజ్యం కట్టబెట్టబోయారు. కానీ వారు తమ తాత నిమిటార్‌నే మళ్లీ రాజుగా చేసి తమ భుజబలంతో కొత్త నగరం నిర్మించుకుంటామని చెప్పి వచ్చేశారు. ఈ కథ వింటే బలరామకృష్ణులు మేనమామను చంపి, మాతామహుడికి తిరిగి రాజ్యం కట్టబెట్టి, తాము విడిగా ద్వారను నిర్మించుకున్న కథ గుర్తుకు వస్తుంది.

అయితే నగరం ఎక్కడ నిర్మించాలన్న విషయంపై అన్నదమ్ముల మధ్య తగాదా వచ్చింది. టైబర్ నది ఒడ్డున తాము దొరికిన పాలటైన్ కొండ మీద భవంతి కట్టి దాన్ని రాజధానిగా చేసుకుందామని రోములస్ అంటే, అబ్బే, కాదు ఎవెంటైన్ కొండ మీద కడదాం అన్నాడు రేమస్. రోమ్ నగరానికి చుట్టూ వున్న ఏడు కొండల్లోవే యీ రెండూ. టైబర్ నది కారణంగా ఆ నదీ తీరాల్లో జనావాసాలున్నాయి. అయితే జనావాసాల మధ్య చిత్తడినేల ఏర్పడి అవన్నీ విడివిడిగా వున్నాయి. ఏ వూరికా వూరు ఒంటరిగా వుంటూ యితరులతో పేచీ పెట్టుకునేది. ఈ ప్రాంతాల మధ్య నిలవ వున్న నీటిని బయటకు పంపించి వేసి బురదను పోగొట్టి, రహదారులు వేసి వీటన్నిటినీ కలిపి ఒక నగరంగా చేస్తే అదే మహానగరమవుతుంది. అందరూ కలిసి గొప్ప సేనగా మారతారు. అదీ యోచన. దానికి కేంద్రస్థానంగా ఏది వుండాలి అనే దానిపై యిద్దరూ వాదించుకున్నారు. దేవుళ్లు పంపే శకునాల బట్టి స్థలాన్ని నిర్ణయిద్దామనుకున్నారు. పక్షుల రాకపోకల బట్టి ఆ రోజుల్లో శకునాలు చెప్పేవారు. ఇద్దరూ తమతమ పర్వతాల మధ్య పూజలు జరిపి పక్షులకోసం వేచివున్నారు. రీమస్ తను ఆరు పక్షులను చూశానని అన్నాడు. రోములస్ తను పన్నెండు చూశానన్నాడు. అందుకే తనదే గెలుపన్నాడు. 'నీ కంటె నేను ముందుగా చూశాను కాబట్టి సంఖ్య తక్కువైనా నా మాటే నెగ్గాలి' అని వాదించాడు

రీమస్. రోములస్ ఒప్పుకోలేదు. తను అనుకున్న చోట పునాదులు తీసి గోడలు లేపసాగాడు. తన మాట చెల్లనందుకు రీమస్‌కు కోపం వచ్చింది. రోములస్ కట్టే చోటకి వచ్చి గోడలెక్కి గెంతుతూ అల్లరి చేసేవాడు, వెక్కిరించేవాడు. ఓ రోజు అలా గెంతడంలో జారిపడి చనిపోయాడంటారు, లేదు రోములస్ సేనానికి ఒకడికి ఒళ్లు మండి ఒక పార విసిరేస్తే అది తగిలి తల బద్దలైందంటారు, అబ్బే రోములసే చంపేశాడంటారు. ఏమైతేనేం, రోములస్ అతనికి సవ్యంగా అంత్యక్రియలు నిర్వహించాడు. ఇదంతా క్రీ.పూ. 753లో జరిగిందని పురాణం.

తను అనుకున్న నగరం కట్టాక రోములస్ తన పేరు మీదుగా రోమ్ అని దానికి పేరు పెట్టాడు. రోమ్ ఒకరోజులో కట్టబడలేదన్న ఇంగ్లీషు సామెత వుంది. అన్ని రహదారులూ రోమ్‌కే దారి తీస్తాయన్న సామెతా వుంది. ఊళ్ల మధ్య భౌగోళిక, మానసిక అవరోధాలు తొలగించి దారులు వేసుకుంటూ వచ్చారు. వేర్వేరు వూళ్ల వారిని కలుపుకు రావడానికే కాబోలు రోములస్ రిపబ్లిక్ (గణతంత్ర) వ్యవస్థను ఏర్పరచాడంటారు. ఈ గణతంత్ర వ్యవస్థ మన భారతదేశంలో కూడా వుంది. ద్వారకను పాలించినది కృష్ణుడు కాదు. అతను కులరీత్యా క్షత్రియుడే అయినా అతని పూర్వీకుడు యదుడు తన తండ్రి యయాతి శాపానికి గురై రాజ్యార్హత పోగొట్టుకున్నాడు. అందువలన కృష్ణుడు రాజు కాలేదు. ద్వారకను పాలించిన నగరపెద్దలలో అతను కూడా ఒకడు. సూచనలు మాత్రం యిచ్చేవాడు. చరిత్రకు వస్తే లిచ్ఛవులది గణరాజ్యమే. గణతంత్రం కొనసాగితే చిన్నచిన్న రాజ్యాలుగా వుండి విదేశీయుల దాడిని తట్టుకోరనే వాదనతో చాణక్యుడు మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించి చంద్రగుప్తుణ్ని చక్రవర్తిని చేసి అధికారాన్ని ఒక వ్యక్తి చేతిలో కేంద్రీకృతం చేశాడు. ఇక గణరాజ్యాలు అంతమయ్యాయి. రోమ్‌లో మాత్రం గణతంత్రం చక్కగా సాగింది. ప్రజల సహకారంతో అనేక విదేశాలను జయించారు. గ్రీకు సామ్రాజ్యం తర్వాత అంతకు మించిన ప్రఖ్యాతి పొందిన సామ్రాజ్యంగా, నాగరికతకు మారుపేరుగా రోమ్ విలసిల్లింది. **(సశేషం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2016) (ఫోటోలు – కవలలకు పాలిస్తున్న ఆడ తోడేలు విగ్రహం, రోమ్‌లో పాలంటైన్ కొండపై కట్టిన భవంతి ప్రస్తుత రూపం,)**

**జనవరి 12** **ఎమ్బీయస్ : యూరోప్ గాథలు 26**

ఇక్కడ రోమన్ సామాజిక, పాలనా వ్యవస్థ గురించి క్లుప్తంగా చెప్పుకోవలసిన అవసరం వుంది. అప్పుడే తర్వాతి కథల్లో చెప్పుకునే రాజకీయాలు అర్థమవుతాయి. రోమన్ సమాజం ఎలా ఏర్పడిందో కాస్త తెలుసుకోవాలి. రోమ్ కొత్తగా ఏర్పడినపుడు రోములస్ యిస్తున్న స్వేచ్ఛ విని యితర దేశాల నుంచి పారిపోయి వచ్చినవారు, నేరస్తులు, చట్టం నుంచి తప్పించుకున్నవారు, దేశబహిష్కృతులు అందరూ వచ్చిపడ్డారు. మగవాళ్లు ఎక్కువై పోవడంతో ఆడవారు చాలలేదు. అందువలన పక్క వూళ్ల నుంచి ఎత్తుకు రాసాగారు. ఒకసారి సర్కస్ మాగ్జిమస్ అనే పెద్ద మైదానంలో (యిప్పటికి కూడా వుంది) పండగ జరుపుకుంటున్నామని చెప్పి లాటిన్, శాబిన్ ప్రాంతాల నుంచి అందర్నీ ఆహ్వానించారు. రథాల పోటీలు నిర్వహిస్తూ, మగవాళ్ల దృష్టి దానివైపు వుండగా ఆడవాళ్లను ఎత్తుకుపోయారు. ఒప్పుకున్నవాళ్లని పెళ్లి చేసుకున్నారు. తక్కినవాళ్లను బలాత్కరించారు. ఈ చర్య వలన సాబిన్, లాటిన్ వాళ్లు రోమ్‌పై దండెత్తారు కానీ రోమే గెలిచింది. దాంతో సాబిన్ రాజు రోములస్ సంధి చేసుకుని ఐదేళ్లపాటు యిద్దరూ కలిసి రెండు రాజ్యాలు కలిపి ఏలారు. రెండు ప్రాంతాల ఆచారాలు, క్యాలండర్లు, దేవుళ్లు, సైనికవ్యూహాలు యిచ్చిపుచ్చుకున్నారు. తర్వాత కొన్నాళ్లకు సాబిన్ రాజు హత్యకు గురై రోములస్ ఏకైక పాలకుడయ్యాడు. తాత న్యూమిటార్ చనిపోయినప్పుడు అల్బా లాంగాను కూడా తన రాజ్యంలో కలిపేసుకున్నాడు. ఇలా విభిన్న సంస్కృతుల వారిని కలుపుకుంటూ పోయాడు కాబట్టి ఆయా ప్రాంతాల ప్రతినిధులతో సెనేట్ ఏర్పరచి వారి సలహాల మేరకు రాజు నడుచుకోవాలన్నాడు. కానీ తనే కొంతకాలానికి వారిని నిర్లక్ష్యం చేసి అధికారాలన్నీ తన చేతిలోకి తీసుకోవడంతో సెనేట్ సభ్యులే అతన్ని చంపివేశారని అంటారు. అబ్బే కాదు, సుడిగాలి వచ్చి స్వర్గానికి తీసుకుపోయిందని కొందరు కథలు చెప్తారు.

ఇలా విభిన్న సంస్కృతుల వారిని కలుపుకుంటూ పోయాడు కాబట్టి ఆయా ప్రాంతాల ప్రతినిధులతో సెనేట్ ఏర్పరచి వారి సలహాల మేరకు రాజు నడుచుకోవాలన్నాడు. కానీ తనే కొంతకాలాని వారిని నిర్లక్ష్యం చేసి అధికారాలన్నీ తన చేతిలోకి తీసుకోవడంతో సెనేట్ సభ్యులే అతన్ని చంపివేశారని అంటారు. అబ్బే కాదు, సుడిగాలి వచ్చి స్వర్గానికి తీసుకుపోయిందని కొందరు కథలు చెప్తారు.
సెనేట్ అనే పదం సెనెక్స్ అనే లాటిన్ మాట నుంచి పుట్టింది. దాని అర్థం వృద్ధుడు అని. మన రాజ్యసభను ఎల్డర్స్ హౌస్ అన్నట్టుగా అన్నమాట. ఎసెంబ్లీలు ఏర్పరచాడు. మూడు జాతుల ప్రతినిధులతో కమీషియా క్యురియేటా, కమీషియా ట్రైబ్యూటా అనే ఎసెంబ్లీలు వుండేవి. వీటికి అధికారం లేకపోయినా అది ఒక చర్చావేదికగా వుండేది. మిలటరీ అధికారులతో, భూస్వాములతో నిండిన కమీషియా సెంచూరియాటా (సెంచూరియన్ అంటే సైనికాధికారి) కాన్సల్స్‌ను ఎన్నుకోవడం ప్రధాన భూమిక వహించేది. కన్సీలియమ్ ప్లెబిస్ అనే ఎసెంబ్లీ చేసిన చట్టాలు మొదట్లో ప్లెబియన్లకు మాత్రమే వర్తించేవి. క్రీ.పూ. 287 తర్వాత అవి రోమన్లందరికీ వర్తించేవి. సెనేట్‌కు మాత్రం విశేషాధికారాలున్నాయి. దానిలో 100 మంది వున్నత వంశాలకు చెందిన కుటుంబపెద్దలతో రోములస్ ఏర్పరచాడు. ఐదవ రాజు వచ్చేసరికి వీరి సభ్యులను 200 కు పెంచాడు. ఏడవ రాజు వీరిలో కొంతమందిని ఉరి తీసేసి, వారి స్థానంలో వేరెవర్నీ నియమించలేదు. క్రీ.పూ.535లో రాజ్యానికి వచ్చిన లూసియస్ తార్క్విన్ సుపర్బస్ అనే ఒక రాజు కొడుకు తన బంధువైన వివాహితను బలాత్కరిస్తే ఆమె ఆత్మహత్య చేసుకుంది. చనిపోతూ తన సోదరుడు బ్రూటస్‌కి యిదీ కారణం అని చెప్పింది. అతను రాజు మేనల్లుడే.

ఆమె మరణాన్ని ఎత్తి చూపుతూ ప్రజలందరినీ కూడగట్టుకుని విప్లవం లేవదీసి రాజకుటుంబాన్ని బహిష్కరింపచేశాడు. ఇకపై రాజులుండకూడదని వారి బదులు యిద్దరు కాన్సల్స్ వుండాలని ప్రతిపాదించాడు.

కాన్సల్ సెనేట్ సభ్యుల కంటె ఎక్కువ కాదు. సమానుల్లో మొదటివాడు. (ఫస్ట్ ఎమాంగ్ ఈక్వల్స్) అందుకే అతని బిరుదు 'ప్రిన్సెప్స్' (నాయకుడు) అని వుండేది. ఇద్దరు కాన్సల్స్ కలిసి సంయుక్తంగా పరిపాలన, సైన్యపర్యవేక్షణ చూసుకుంటారు. వారికి ఆ పదవి ఏడాది కాలం మాత్రమే. ఏడాది ముగిశాక మళ్లీ పదేళ్ల దాకా ఎన్నుకోలేరు. ఇద్దరూ కలిస్తేనే కొత్త చట్టాలు చేయగలరు. వారిలో ఎవరు వీటో చేసినా (తిరస్కరించినా) చట్టం అమలు కాదు. సంక్షోభం తలెత్తినపుడు డిక్టేటర్ అనే పదవి సృష్టించి సర్వాధికారాలు అప్పగిస్తారు. కానీ అది ఆరు నెలలకు మించి కొనసాగడానికి వీల్లేదు. ఆ పెద్దలను కూడా ప్రజలే ప్రతీ ఏడూ ఎన్నుకోవాలని అన్నాడు. సెనేట్‌లో అప్పటివరకు పేట్రీషియన్స్ అనే అత్యున్నత వంశజులైన వారికే సెనేట్ సభ్యత్వం వుండేది. ఇప్పటినుంచి సంపదలో వారి తర్వాతి స్థానంలో వున్న ఈక్వయిట్స్‌కు కూడా సభ్యత్వం యివ్వాలన్నాడు. గతంలో ప్రజలు తమను పాలించే హక్కు (ఇంపీరియమ్)ను రాజుకి యిచ్చారని, యిప్పుడు వారు యీ రిపబ్లిక్ యివ్వాలని వాదించాడు. వీరే పాలకులను (కాన్సల్స్‌ను) ఎన్నుకుంటారని అన్నాడు. ప్రజలందరూ దానికి సమ్మతించి రాచరికం స్థానంలో గణతంత్రాన్ని నెలకొల్పారు. బ్రూటస్, చనిపోయిన అతని సోదరి భర్త తొలి కాన్సల్స్ అయ్యారు.

రోమన్ పరిపాలనలో సెన్సార్ అనే పదవి ఒకటి వుంది. పౌరసత్వం నమోదు చేయడం, ఆర్థిక వ్యవహారాలు చూడడం, ప్రజాధనంతో కట్టే నిర్మాణాలను పర్యవేక్షించడం యితని పనులు. సెన్సస్ (జనగణన, నమోదు) రోమ్‌లో చాలా ముఖ్యమైన పని. ఐదేళ్ల కోసారి ప్రతీ పురుషుడు తన పేరు, కుటుంబ వివరాలు, భార్యాబిడ్డలు, బానిసలు, ఆస్తిపాస్తులు అన్నీ నమోదు చేసుకోవాలి. అప్పుడు అతనికి పౌరసత్వం లభిస్తుంది. ఆ పౌరసత్వంతో అతను సెనేట్‌కు ఎన్నిక కాగలడు. సైన్యంలో చేరడానికి తగిన పురుషులు ఎందరున్నారో ప్రభుత్వానికి యీ విధంగా తెలిసేది. పౌరసత్వపు నమోదులో సాంఘికపరమైన అంతస్తు కూడా నిర్ధారించేవారు. వ్యవసాయం సరిగ్గా చేయకపోయినా, పిల్లలు లేకపోయినా, భార్య చెడునడవడిని నిరోధించలేకపోయినా స్థాయి దింపేసేవారు. రోమన్ సమాజం ఉన్నతులు (పాట్రీషియన్లు, ఈక్వైట్లు) కాకుండా, పనివారు (ప్లెబియన్లు అనేవారు), బానిసలు యిలా దొంతరలుగా వుండేది. ఉన్నతవర్గాలలో వున్నవారికి కొన్ని బాధ్యతలు కూడా వుంటాయి. వారిలోంచి పుట్టుక బట్టి, పదవి బట్టి 300 మంది సభ్యులను ఎంపిక చేసి వారితో సెనేట్ ఏర్పడేది. క్రీ.పూ. 4వ శతాబ్దం నుంచి ప్లెబియన్లు కూడా ఎంపిక కాసాగారు. వీరు స్వయంగా చట్టాలు చేయలేకపోయినా సలహా మండలిగా వ్యవహరించేవారు. ఆర్థిక, విదేశాంగ వ్యవహారాల్లో వీరి మాట చెల్లేది. వీరి పదవీకాలం ఏడాది మాత్రమే. సెనేట్‌లో విస్తృతంగా చర్చలు జరిగేవి. మంచి వక్తలు యితరులను ఒప్పించగలిగేవారు. సెనేట్ సభ్యత్వం వున్నంతకాలం వ్యాపారాలు చేయకూడదనే నిబంధన వుండేది. పోనుపోను చక్రవర్తి వ్యవస్థ ఏర్పడి సెనేట్‌ను నిర్లక్ష్యం చేయడంతో రోమన్ సామ్రాజ్యపతనం ప్రారంభమైంది.

రోమన్ సామ్రాజ్యం అనగానే గ్లాడియేటర్లు, బానిసలు గుర్తు రాక తప్పదు. ఆ బానిసలు క్రీ.పూ. 73లో తిరుగుబాటు కూడా చేశారు. ఆ తిరుగుబాటుకు నాయకత్వం వహించిన స్పార్టకస్ పై ఆధారపడిన నవలను అనుబంధంగా యిస్తున్నాను. దానిలో బానిస వ్యవస్థ గురించి, గ్లాడియేటర్ల గురించి కొంత చెప్పాను. బానిసత్వం అనేది ప్రాచీనకాలం నుండి అనేక నాగరికతల్లో వుంది. అయితే రోమన్ సామ్రాజ్యంలో అది విపరీతమైన స్థాయికి చేరింది. బానిసల చేత పని చేయించుకోవడం వలననే ఎన్నో నిర్మాణాలు చేపట్టారు వాళ్లు. కానీ బానిసలపై పూర్తిగా ఆధారపడడం చేత రోమన్ పౌరులు బద్ధకస్తులై నైపుణ్యం పోగొట్టుకున్నారు. స్వేచ్ఛ పొందిన బానిసలు వారిని వ్యాపారాల్లో సులభంగా వెనక్కి నెట్టేయగలిగారు. చౌకగా పనివాళ్లు దొరకడంతో పనిని సులభతరం చేసే సాంకేతిక పరికరాలను, యంత్రాలను కనిపెట్టలేదు. బానిసలను రోమన్లందరూ ఒకేలా చూడలేదు. కొందరు దయగా చూసేవారు. మరి కొందరు క్రూరంగా వుండేవారు. ఎలా చూసినా , వారిని ఏం చేసినా ప్రభుత్వం వారినేమీ అనేది కాదు. వారిని పశువుల కంటె వారి స్థాయి ఎక్కువేమీ కాదు. అయితే బానిసలు విడిగా పనిచేసి, ఆ డబ్బు దాచుకుని, యజమాని నుండి స్వాతంత్ర్యాన్ని కొనుక్కునే వీలుండేది. స్వేచ్ఛ పొందిన బానిసకు పౌరసత్వం లభించేది.

స్పార్టకస్ నవలలో కొట్టవచ్చేట్టు కనబడే మరో అంశం – లైంగిక విశృంఖలత్వం. రోమన్లకు స్త్రీ అంటే సెక్స్‌కు ఉపయోగపడే ప్రాణి మాత్రమే. ప్రేమ అనేది ఆడంగి లక్షణమని వారి ఉద్దేశం. ఇంట్లో భార్య పని పిల్లల్ని కనడం మాత్రమే. భర్త ఎవరితో సంబంధం పెట్టుకున్నా అడగడానికి లేదు. సంతానవతి కాని భార్యను వదిలేయవచ్చు. ఇద్దరు యువతీయువకులు సంప్రదాయబద్ధమైన వివాహం చేసుకోకుండా ఒప్పందంతో కలిసి వుండే సౌకర్యం కూడా వుండేది. బానిస స్త్రీలతో, పురుషులతో భార్యాభర్తలు సెక్స్ అనుభవించినా దాన్ని పట్టించుకునేవారు కారు. ఎందుకంటే వారి దృష్టిలో బానిసలు సాటి మనుషులు కాదు. భార్య సమాజంలో యితర కులీనులతో సంబంధం పెట్టుకుని బాహాటంగా తిరిగినప్పుడే భర్తకు తలవంపులయ్యేది. ఈ విషయాలు గుర్తు పెట్టుకుని స్పార్టకస్ నవలా సంగ్రహం చదవండి. దీన్ని 2010లో ఒకసారి పరిచయం చేశాను. ఆర్కయివ్స్‌లో వెతికే పని లేకుండా కింద కొత్తగా లింకు యిస్తున్నాను. దీని తర్వాత సీజర్ కథలోకి వెళదాం. ఎందుకంటే యీ నవలలో తారసిల్లే సేనాని క్రాసస్ సీజర్ జీవితగాథలో ప్రధానపాత్ర వహిస్తాడు. **(సశేషం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2016) (ఫోటో – సర్కస్ మాగ్జిమస్ ప్రస్తుతరూపం, సెనేట్‌లో చర్చ)**

ఫిబ్రవరి 01 ఎమ్బీయస్ : ఆంధ్రమూలాల వారి ఓట్లు ఎటు..?

రేపు జరగబోయే గ్రేటర్ హైదరాబాదు ఎన్నికలలో ఆంధ్రమూలాల వారి ఓట్లు ఎటు పడతాయన్నదానిపై చర్చ చాలా జరుగుతోంది. వాళ్లను ఓటుబ్యాంకుగా పరిగణిస్తూ వాళ్లను ఉద్దేశించి వాగ్దానాలు, హామీలు కురిపిస్తున్నారు, వాళ్లకు ఆగ్రహం కలిగించడానికి వెరుస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలోనే యీ ఎనామలీ వుంది. జంటనగరాలు మాత్రమే కాదు, తెలంగాణ మొత్తమంతా చూసుకుంటే జనాభాలో దాదాపు నాల్గో వంతు మందికి ఆంధ్రలో మూలాలుంటాయి. వీరందరిని వ్యతిరేకం చేసుకుంటే నెగ్గడం, పాలన సాగించడం కష్టం. అందువలన 'మీరు ఎక్కడికీ వెళ్లవలసిన అవసరం లేదు, కడుపులో పెట్టుకుంటాం, మీ అభివృద్ధికి తోడ్పడతాం, మీ ఆస్తుల జోలికి, వృత్తుల జోలికి రాము' అని చెప్పవలసి వస్తుంది. అలా చెప్పినది నిజంగా అమలు చేస్తే తెలంగాణ ఆవిర్భావం కోసం తపించిన వారు ఆక్రోశించాల్సి వస్తుంది. ఎందుకంటే 'తెలంగాణను దోపిడీ చేసినది ఆంధ్రులే, వాళ్లను తరిమివేసి, మీకు ప్రభుత్వ ఉద్యోగాలు యిస్తాం, వారి పరిశ్రమల్లో స్థానికులకు రిజర్వేషన్లు ఏర్పాటు చేసి మీకు ఉద్యోగాలిచ్చేట్లా చేస్తాం, వాళ్లు వెళ్లిపోతే యిక్కడ అన్నీ ఖాళీ, ఆ స్థానాల్లో మీరే వచ్చి కూర్చోవచ్చు, మీ పిల్లలకు బంగారు భవిష్యత్తు ఖాయం' అంటూ బహిరంగంగానే చెప్పారు. లోపాయికారీగా 'వాళ్ల నుండి యిళ్లు లాక్కుని మీకిస్తాం' అని చెప్పడం, గ్రామీణులు చాలామంది నమ్మడం జరిగింది. ఇప్పుడు 'ఆంధ్రులు, ఆంధ్రమూలాల వారు మా సోదరులు, వారిని కించిత్తు కూడా ఏమీ అనం, వెళ్లగొట్టం, మాతో సమానంగా చూసుకుంటాం' అంటే మరి వాళ్లు వెళ్లిపోతారని ఆశ పెట్టుకున్నవాళ్లు ఏమవాలి? వాళ్ల ఆశలు ఎప్పుడు తీరాలి? తీరకపోతే తెలంగాణ వచ్చి మాకేం ఒనగూడిందని వారు నిరాశ చెంది, తెలంగాణ సర్కారుపై కోపం పెంచుకోరా? ఎగదీస్తే గోహత్య, దిగదీస్తే బ్రహ్మహత్య అంటే యిదే కాబోలు.

తెలంగాణ ఉద్యమం నడిచే రోజుల్లోనే యీ ఆంధ్రమూలాల ఓటు బ్యాంకు, సమైక్యవాదుల ఓటు బ్యాంకు గురించి నేను రాస్తూ వచ్చాను. టిడిపి కాని వైకాపా కాని తెలివిగా వ్యవహరించి, వీళ్లను మచ్చిక చేసుకుంటే వారికి కొన్ని సీట్లు ఎప్పుడూ దక్కుతూ, వారి మద్దతు లేనిదే ప్రభుత్వం ఏర్పడలేని పరిస్థితి రావచ్చని! కానీ టిడిపి అందరి కంటె ముందు తెలంగాణ ఏర్పాటుకి లేఖ యివ్వడమే కాక, మేం యిచ్చినా యింకా విభజన జరగలేదేం అంటూ కాంగ్రెసును రెచ్చగొడుతూ సమైక్యవాదుల అభిమానాన్ని, ఆంధ్రమూలాల వారి నమ్మకాన్ని పోగొట్టుకుంది. తన అభిప్రాయం చెప్పకుండా భారమంతా కేంద్రం మీద వేసినట్లు నాటకమాడిన వైకాపా పరిస్థితి కూడా డిటోయే. చివరిలో సమైక్యవాద జండా పట్టుకున్నా, తీవ్ర విభజనవాదియైన తెరాసను పన్నెత్తి ఏమీ అనకపోవడం చేత అటూ, యిటూ కూడా విశ్వసనీయత పోగొట్టుకుంది. ప్రత్యేక ఉద్యమం నడుస్తున్నంతకాలం సమైక్యవాదులు, ఆంధ్రమూలాల వారు నోరు తెరవలేకపోయారు. ఆంధ్రుల సినిమా షూటింగులపై దాడులు జరిగాయి, వారిని నానా మాటలూ అన్నారు. ఇక్కడ కర్రీ పాయింట్లు పెట్టుకుని బతకవచ్చు అని యీసడించారు. ఏ పార్టీ నాయకులూ వీటికి గట్టిగా అభ్యంతరం తెలుపలేదు. తమను అందరూ విడిచి పెట్టేశారని వగచే స్థితిలో తెలంగాణలోని ఆంధ్రమూలాల వారిని వదిలేశారు.

ఇప్పుడు గ్రేటర్ హైదరాబాదు ఎన్నికలు వచ్చేసరికి అందరికీ వారి మనోభావాలు గుర్తుకు వచ్చాయి. కెటియార్ 'ఉద్యమసమయంలో ఏవేవో అప్పటి అవసరాల కొద్దీ ఏవేవో అన్నాం. ఇప్పుడు పాలకులం కాబట్టి ఏమీ అనం. నేను గుంటూరు తదితర ప్రాంతాల్లో చదువుకున్నాను. నాకు అన్ని చోట్లా మిత్రులున్నారు. మిమ్మల్ని యిప్పటిదాకా తన్నలేదు చూశారా?' అని గుర్తు చేస్తున్నారు. ఎంత ఉద్యమసమయమైనా, హద్దులు దాటి కెసియార్, యితరులు మాట్లాడారు. పాఠాలు చెప్పిన గురువుల జాతిని రాక్షస జాతి అని తండ్రి అంటూంటే కెటియార్ అడ్డు చెప్పలేకపోయాడా? పాలనలోకి వచ్చాక మాత్రం పరిస్థితి మెరుగైందా? భౌతికపరమైన దాడులు జరగకపోతే గొప్పగా చూసుకుంటున్నట్లే అనుకోవాలా? ఎన్నో ఉమ్మడి సంస్థల్లో ఆంధ్ర అధికారులను తరిమివేశారు. విద్యుత్ బోర్డులో త్రిశంకు స్వర్గంలో వేళ్లాడుతున్న ఉద్యోగుల సమస్య చూడండి, గాంధీ ఆసుపత్రిలో డాక్టర్ల సమ్మె చూడండి, స్థానికతపై కేంద్ర ఆదేశాలను ఉల్లంఘించి, వీరే ఒక నిర్వచనం యిచ్చేసి, కొత్త రూల్సు ఏర్పరచి దానిలో యిమడనివారిని తరిమి కొడుతున్నారు. ఎన్నో కోట్లు ఖర్చుపెట్టి ఎంతో హంగామా చేసి నిర్వహించిన సమగ్ర సర్వే ఫలితం ఏమైంది? సేకరించిన సమాచారాన్ని వుపయోగిస్తున్నట్లు ఎక్కడైనా అగుపించిందా? దాన్ని విడుదల చేశారా? మరి ఎందుకు నిర్వహించినట్లు? ఆంధ్రమూలాల వారిని గుర్తించి వారి పని పట్టడమే లక్ష్యంగా రూపొందించిన ఆ సర్వే, కోర్టు తీర్పు కారణంగా అసమగ్రం అయింది. ఎప్పణ్నుంచి నివసిస్తున్నారన్న విషయం రాబట్టలేకపోయాక యిక ఆ సర్వేతో పనేముందని పక్కన పడేశారు. కెసియార్ తలపెట్టిన యిలాటి ఎన్నో పనులకు కోర్టు అడ్డుపడుతోంది. అందుకే తెలంగాణకు ప్రత్యేక హైకోర్టు త్వరగా తెచ్చుకుని తన చర్యలకు ఆమోదముద్ర వేయించుకోవాలని కెసియార్ తహతహ. న్యాయమూర్తుల పోస్టింగును కూడా వివాదగ్రస్తం చేయడానికి అదే కారణం. ఇప్పటిదాకా మిమ్మల్నేం ఏమీ చేయలేదు అని కెటియార్ పైకి అంటున్నారు, 'చేయలేకపోవడానికి కోర్టులు అడ్డుపడుతున్నాయి, ఖర్మ' అన్నది అంతరంగంలో వున్న మాట.

నచ్చని ప్రతీవాణ్నీ ఆంధ్రుడనడం పరిపాటి అయింది. తమ చేతకానితనానికి ఆంధ్రులను నిందించడమూ మానలేదు. నిజాలు రాస్తే, వాటిని ఖండించే వీలులేని పక్షంలో ఆంధ్ర మీడియా అని తిట్టిపోయడం, కేంద్రం నుంచి నిధులు రాకపోతే ఆంధ్రులు వెళ్లి తెలంగాణ అభివృద్ధి కాకుండా అడ్డుపడుతున్నారని నిందించడం.. యివన్నీ నడుస్తూనే వున్నాయి. సాంస్కృతికి కార్యక్రమాల విషయంలో, ఎవార్డుల విషయంలో కూడా ఆంధ్రమూలాల వారు వివక్షత ఎదుర్కుంటూనే వున్నారు. ఆంధ్రలో తెలంగాణవారికి

సాహిత్యపరమైన ఎవార్డులు యిస్తున్నారు కానీ యిక్కడ పదవులు, బిరుదులు అన్నీ 'అచ్చ' తెలంగాణ వారికే. ఆంధ్రమూలాలున్నా విభజనోద్యమాన్ని గట్టిగా బలపరచిన పొత్తూరి వెంకటేశ్వరరావుగారి లాటి వాళ్లకు ఏ సత్కారమూ లేదు. టిడిపిలో వున్న తెలంగాణవారిని 'ఆంధ్రభ ృత్యుల'ని అవహేళన చేస్తూనే వున్నారు. మరి కాంగ్రెసువారి అధ్యక్షురాలు ఒకప్పుడు ఇటలీ, ఆ తర్వాత ఢిల్లీవాసురాలు కాబట్టి, వారిని కూడా ఇటలీదాసులనో, ఢిల్లీబానిసలనో అనాలిగా. బిజెపి వారినీ, కమ్యూనిస్టులను అందరినీ ఢిల్లీ తాబేదార్లనే అనాలి. కేవలం టిడిపి వారినే అనడం దేనికి? ఆంధ్రులు లోకువగా దొరికారనా? తెలంగాణ రాజకీయనాయకులు యిప్పటికీ ఆంధ్రశబ్దాన్ని ఒక నిందావాచకంగానే పరిగణిస్తున్నారన్నమాట అక్షరసత్యం.

ఇప్పుడు గ్రేటర్‌లో కెటియార్ ఆంధ్రులను బుజ్జగిస్తూ వుంటే నారాయణఖేడ్‌లో హరీశ్ ఎప్పటిలాగా తెలంగాణ సెంటిమెంటు రగిలిస్తూనే వున్నారు. మరో పక్క హెూం మంత్రి నాయని 'ఆంగ్లదొరల నుంచి స్వాతంత్ర్యం, ఆంధ్రదొరల నుంచి ప్రత్యేకరాష్ట్రం తెచ్చుకున్నాం' అంటూ దోపిడీదారులుగానే చిత్రీకరిస్తున్నారు. ఇక్కడ వున్నవారంతా తెలంగాణ బిడ్డలే అంటూనే లోకేశ్‌ను మాత్రం 'నీకు యిక్కడేం పని?' అంటున్నారు కెటియార్. ఇది వింతగా లేదా? ఆయనకూ నీకూ రాజకీయవిభేదం వుండవచ్చు. అంతమాత్రం చేత లోకేశ్ తెలంగాణ బిడ్డ (మీ నిర్వచనం ప్రకారమే) కాకుండా పోతాడా? అంటే మీ ఉద్యోగాలకు, మీ రాజకీయాలకు, మీ అవసరాలకు అడ్డు రానంతకాలం తెలంగాణ వాడే. ఎప్పుడైతే తన హక్కు ప్రకటించుకుని, సాటి పౌరుడిగా నీతో పోటీ పడ్డాడో అప్పుడు ఆంధ్రుడు, పరాయివాడు, తెలంగాణ ప్రగతినిరోధకుడు అయిపోతాడు. ఇదీ తెరాస స్వభావం. దీన్ని ఆంధ్రమూలాల వారిపై ప్రేమ, వారిని సమానస్థాయిలో చూడడం అనరు. ఆంధ్రమూలాల వారికి టిక్కెట్లు యిస్తామని ప్రకటించారు. మేం టిక్కెట్టిచ్చినవారిలో ఫలానా వారు అలాటి వారు అని చేసిన ప్రకటన నేను చూడలేదు. కనీసం మేం ఫలానా ఆంధ్రమూలాల వారికి ఎవార్డులు యిచ్చాం, సత్కరించాం అని కూడా చాటుకోలేదు. ఎంతసేపూ మిమ్మల్ని యింకా తన్నలేదు, గుద్దలేదు అనే కబుర్లే. కర్మకాలి వాళ్లు ఓడితే, లేక కొద్దిపాటి తేడాతో నెగ్గితే ఆ సత్కారం కూడా జరుగుతుందా అనే సందేహం మెలగకుండా వుండదు.

తెరాస అంటే మహామహా నాయకులకే భయం పట్టుకుంది. తమ పార్టీ ప్రతిపక్షంలో వున్నా ఎన్నో ఏళ్లుగా అంటిపెట్టుకుని వున్న పలు రాజకీయపక్షాలకు చెందిన అనేకమంది సీనియర్ నాయకులు కూడా యీ రోజు తెరాసలోకి దూకుతున్నారు. వేరే పార్టీ టిక్కెట్టుపై గెలిచి కూడా తెరాసకు మారిపోతున్నారు. ఇలా గతంలో ఎప్పుడూ జరగలేదు. ఎందుకిలా? అంటే – ప్రలోభం, భయం అని జవాబు వస్తోంది. ప్రలోభాలు చూపడం అనాదిగా వస్తూనే వుంది, కానీ ఫిరాయింపులు యీ స్థాయిలో జరగలేదే! అందువలన ప్రలోభం కంటె భయం పాలే ఎక్కువ అని అనుకోవాలి. మా పార్టీలోకి చేరితే వదిలేస్తాం, లేకపోతే కేసులు పెట్టి సతాయిస్తాం, మీ నియోజకవర్గానికి నిధులివ్వం, నిన్ను నీ ప్రజలు ఛీత్కరించుకునేట్లు చేస్తాం అని హెచ్చరికలు వెళుతున్నాయట. తెలంగాణలో కాబినెట్ వున్నది నామమాత్రానికే. కెసియార్ కుటుంబసభ్యులకు తప్ప వేరెవరికీ నోరు పెగలదు. కేంద్రీక ృత అధికారంతో తన చిత్తం వచ్చినట్లు పాలన సాగిస్తున్నారు కెసియార్. ప్రత్యేక ఉద్యమంలో గొంతులు, చొక్కాలు చించుకున్న మేధావులు గట్టిగా నిరసన తెలపడానికి కూడా జంకుతున్నారు. మీడియా అంతా నిశ్శబ్దమై పోయింది. అందరి ఆస్తులూ హైదరాబాదులోనే వున్నాయి. ఏమంటే ఏం జరుగుతుందోనని భయం.

ఈ భయానక వాతావరణంలో ఆంధ్రమూలాల వారు కూడా బెదురుతున్నారని వార్తలు వస్తున్నాయి. ఓట్ల లిస్టులోనే ఆంధ్రమూలాల వారి ఓట్లు ఏరిపారేయడానికి చాలా ప్రయత్నాలు జరిగాయని అనేక ఆరోపణలు రావడం, వాటిని మళ్లీ సరిదిద్దుతున్నామని అధికారులు అనడం విన్నాం, కన్నాం. ఇప్పుడు ఎన్నికలలో ఏ వార్డులోనైనా ఆంధ్రమూలాల వారి ఓట్ల కారణంగా తెరాస అభ్యర్థి ఓడిపోతే వారిని ఓ చూపు చూస్తారని చెప్పుకుంటున్నారు. చూపు చూడడమంటే అయ్యప్ప సొసైటీలా యిళ్లు కూలగొట్టనవసరం లేదు, నీటి ఎద్దడి పెరగబోతున్న రాబోయే రోజుల్లో నీటి సరఫరా నిలిపేస్తే చాలు. ఇక పేద వర్గాలలో తెరాసకు ఓటేస్తే తమనూ అచ్చ తెలంగాణ వారిగా గుర్తించి యిళ్లు కట్టిస్తారనే ఆశ కొంతమందికట. అంటే తమను తిట్టినా, కొట్టినా, కోసినా తెరాసకు ఓటేయడం తప్ప ఆంధ్రమూలాల వారికి వేరే గతి లేదు అని మీడియా రాస్తోంది.

రెండు రోజుల్లో పోలింగు వుండనగా జనవరి 31 న "ఆంధ్రజ్యోతి"లో ఒక వ్యాసం వచ్చింది. 'తెరాసకు ఓటేయడమే సీమాంధ్రుల కర్తవ్యం. మరో మార్గం లేదు. ఓడితే ఆ ఓటమికి తమను బాధ్యులను చేస్తారు కాబట్టి, గెలుపోటముల భారం సీమాంధ్రులే తలకెత్తుకుని తెరాసను గెలిపించాలి.' అని వ్యాససారాంశం. తక్కిన పార్టీలన్నిటికీ ఉతికి ఆరేసి, చివర్లో యీ ముక్క చెప్పడంతో యిదేదో 'పెయిడ్ ఆర్టికల్' కేటగిరీలోకి వస్తుందాని అనుమానం వచ్చింది. తమాషా ఏమిటంటే యిది తెరాసచే 'ఆంధ్రమీడియా' అని ముద్ర వేయించుకుని, నిషేధానికి గురైన పత్రికలో వచ్చింది. ఆ నిషేధాన్ని ఎత్తివేయించుకోవడానికి యాజమాన్యానికి కోర్టులు చుట్టూ తిరిగినా ఏడాదికి పైనే పట్టింది. కెసియార్‌కు కోపం వస్తుందేమోనని భయపడి లొంగిపోయి వుంటే ఏ అవస్థా లేకపోయేది. అలాటి పత్రికకు 'బెదిరింపులకు లొంగిపొండి, భయపడండి, నోరుమూసుకుని తెరాసకు ఓటేయండి' అనే వ్యాసాన్ని పంపిన వ్యాసకర్త సాహసానికి ఆశ్చర్యపడాలో, దాన్ని ప్రచురించిన ఆంధ్రజ్యోతి సంపాదకవర్గం తీరుకు విస్తుపోవాలో అర్థం కావటం లేదు.

తమను అనుక్షణం అవమానిస్తున్న తెరాసకు ఓటేయాల్సిన అగత్యం ఆంధ్రమూలాల వారికి లేదు. అలా అని వేరే ఎవరికి వేస్తారు? టిడిపి–బిజెపి కూటమికా? టిడిపి నాయకులు మాత్రం తక్కువ మాట్లాడారా? ఈనాడు తెరాసను తప్పుపడుతున్న రేవంత్ ఆంధ్రుల 'దోపిడీ' గురించి తక్కువ మాట్లాడారా? ఎర్రబెల్లి..? అందరూ ఒక్కటే! 'పదేళ్లపాటు యిక్కడే వుంటా, మీకు రక్షణగా

నిలుస్తా' అన్న చంద్రబాబు ఓటు–నోటు కేసులో యిరుక్కోవడంతో తట్టా, బుట్టా సర్దుకున్నారు. ఆయన మీద చాలా భారం వుంది. కొత్త రాష్ట్రం, ప్రత్యేక హెూదా లేదు, నిధులు రావు, పరిశ్రమలు లేవు, ఆదాయం సరిపోదు, అలవికాని వాగ్దానాలు, పైగా ప్రకృతి వైపరీత్యాలు.. యివన్నీ చాలనట్లు కొత్త రాజధానిని "బాహుబలి" లెవెల్లో ప్లాను చేశారు. అక్కడైతే గ్రాఫిక్స్, యిక్కడ నేల మీద కట్టాలంటే చుక్కలు కనబడుతున్నాయి. కెసియార్‌కైతే కొడుకు, అల్లుడు, కూతురు అండగా నిలిచారు. ఒకరు పల్లెల్లో, మరొకరు నగరాల్లో, యింకొకరు ఢిల్లీలో పనులు చూసుకుంటూ పార్టీని పటిష్టం చేసుకుంటూ, ప్రభుత్వానికి దోహదపడుతూ వున్నారు. ముగ్గురూ మంచి వాగ్ధాటి కలవారే. బాబుకి పాపం అలాటి సాయం ఏమీ లేదు, అన్నిటా తానై చూసుకోవాలి. ఏమీ చేయకుండానే ఏడాదిన్నర గడిచిపోయింది. ఇంకో మూడేళ్లలో ఏదైనా కాంక్రీట్‌గా చేసి చూపించకపోతే ఆబోరు దక్కేట్లు లేదు. మధ్యలో హైదరాబాదులో ఆంధ్రమూలాల వారి బాగోగులు చూసుకోవడమంటే ఆయన కెలా కుదురుతుంది?

ఇక్కడ అస్థిరత వుంటేనే యిక్కణ్నుంచి పరిశ్రమలు తమ వద్దకు తరలి వస్తాయి. ఇక్కడ వారిని సుఖశాంతులతో వుంచడమంటె తన రాష్ట్రప్రయోజనాలకు విఘాతం కలిగించుకున్నట్లే కదా! పైగా నగరానికి సంబంధించి టిడిపి తరఫున పెద్ద నాయకుడెవరూ మిగలలేదు. అందర్నీ కెసియార్ ఎగరేసుకుని పోయారు. బాధితులెవరైనా మొఱపెట్టుకోవాలంటే ఎవరి దగ్గరకు వెళ్లాలి? ఇక బిజెపి – టి–టిడిపి నాయకులు గతంలో తమకు తెలంగాణలో పట్టుంది కదా, ప్రత్యేక ఉద్యమానికి దన్నిస్తే తమకే పట్టం కడతారనే ఆశతో ఆంధ్రులను నిందిస్తూ మాట్లాడారు కానీ బిజెపి నాయకులు మరీ అంత దారుణంగా మాట్లాడలేదు. అదే సమయంలో ఆంధ్రమూలాల వారిని సమర్థిస్తూ కూడా మాట్లాడలేదు. చేతల్లో చేసినదీ లేదు. వారెంతసేపూ ముస్లిములు నుంచి రక్షిస్తామంటారు కానీ తెరాస నుంచి రక్షిస్తామని చెప్పరు. బలమైన ప్రతిపక్షంగా ఎదుగుతుందేమోననే ఆశ మొదట్లో కల్పించి, తర్వాత చప్పబడిపోయారు. కేంద్రంలో తెరాస–బిజెపి బేరసారాలు సాగుతున్నాయనే వార్తలు వస్తూండడంతో వారి గొంతు బలహీనమై పోయింది.

కాంగ్రెసు పార్టీ యిప్పుడు చాలానే మాట్లాడుతోంది కానీ ఆంధ్రులను, ఆంధ్రమూలాల వారినీ తిడుతూ కెసియార్ మాట్లాడినప్పుడు అప్పుడు అధికారంలో వున్న కాంగ్రెసు నోరెత్తకపోగా, అనేకమంది కాంగ్రెసు నాయకులు, కెసియార్‌ను మించి మాట్లాడారు. విభజించినప్పుడు హైదరాబాదును తెలంగాణకు మొత్తంగా కట్టబెట్టినపుడు ఆంధ్రమూలాల వారి రక్షణ గురించి శ్రీకృష్ణకమిటీ చేసిన హెచ్చరికలను గుర్తు పెట్టుకుని విభజన చట్టంలో తగిన సేఫ్‌గార్డ్స్ పెట్టని పాపం కాంగ్రెసుదే. ఆ చట్టాన్ని మొత్తం ఆమోదించిన బిజెపికీ ఆ పాపంలో పాలుంది. ఇప్పుడు ఆ పార్టీ నాయకులే ఒకరి నొకరు అనుమానంగా చూసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో వారు మరొకరికి కాపలాగా వుంటామంటే ఎవరు నమ్ముతారు? మజ్లిస్ – ఆంధ్రమూలాల వారికి భయాందోళనలు వుంటాయని ముందుగా గుర్తించినది మజ్లిసే. సెటిలర్లు అనే పదం యథేచ్ఛగా వాడేస్తున్నపుడు ఆ పదప్రయోగంపై అభ్యంతరం తెలిపినది ఒవైసీయే. వారికి తాము అండగా వుంటామని అందరి కంటె ముందు ప్రకటించినది వారే. వారిని దోపిడీదారులుగా అభివర్ణించని పార్టీ ఏదైనా వుందంటే అది మజ్లిసే. అయితే వారి ధిక్కార ధోరణిని, ప్రతిదాన్నీ మతానికి ముడిపెట్టే భావజాలం మెచ్చడం కష్టం. వాళ్లయినా బీఫ్ నిషేధించేవాళ్లనుండి రక్షిస్తామంటున్నారు కానీ తెరాస నుండి రక్షిస్తామని అనడం లేదు. వారితో పొత్తు పెట్టుకున్నారు మరి!

ఏతావతా ఆంధ్రమూలాల వారికి ఓటేయడానికి ఎవరూ లేరు. అందువలన యీ సారి ఎవరికో ఒకరికి ఓటేసి, చెల్లాచెదురవుతారని అనుకోవచ్చు. వాళ్లు గంపగుత్తగా ఓట్లేసినపుడే ఓటు బ్యాంకుగా తయారయి తమకు కావలసినవి సాధించుకోగలరు. వాళ్లను ఏకీకృతం చేసినవాళ్లకే ఆ ఓటుబ్యాంకు ఉపయోగపడుతుంది. కానీ అలా చేసే ధీమంతుడు ఎవరూ లేరు. అందరూ ఆంధ్రుల్ని తిట్టి, తెలంగాణ ప్రజలను బుజ్జగించడానికి చూసేవారే! సంస్థల విభజనలో, ఆంధ్రుల పట్ల వివక్షత చూపడంలో తెరాస చేస్తున్నది న్యాయబద్ధం కాదు, ధర్మం కాదు అని ఎలుగెత్తి చెప్పగలిగిన తెలంగాణ నాయకుడెవరైనా వుంటే అతడికి ఒక్కడికే వారి విశ్వాసాన్ని చూరగొనగలడు. **– (సమాప్తం) ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2016)**

**ఫిబ్రవరి 03, 04** **ఎమ్బీయస్ : కాపులకు రిజర్వేషన్**

ఉన్న ఉపద్రవాలు చాలనట్లు యిప్పుడు ఆంధ్రను కాపు ఉద్యమం సెగ తాకింది. నిజానికి యిది ఎప్పుడో అప్పుడు రగులుతుందనుకున్న అంశమే. ఎలాగైనా నెగ్గాలన్న తాపత్రయంలో చిత్తం వచ్చినట్లు యిచ్చేసిన నాయకుల వాగ్దానాలు నెరవేరనప్పుడు సంబంధిత వ్యక్తులు తిరగబడడం సహజం. ఋణమాఫీ సంగతి అలాగే అయింది. వ్యవసాయ ఋణాలన్నీ మాఫ్ చేస్తామన్న వాగ్దానాన్ని నీరు కార్చి, చివరకు లక్షన్నర వరకు మాత్రమే అని చెప్పి, మళ్లీ దానికి సవాలక్ష షరతులు పెట్టి, లొసుగులు లాగి యివ్వవలసిన భారాన్ని బాగా తగ్గించేసుకున్నారు. ఈ క్రమంలో బ్యాంకింగ్ వ్యవస్థలో లోపాలు, రైతులు దొంగ ఋణాలు సంపాదించే తీరుతెన్నులు అన్నీ బయటకు వచ్చి ప్రక్రియకు క్షాళన జరిగింది. వాగ్దానానికి, అమలుకు ఎంత వార వుంటుందో రైతులకు జ్ఞానోదయం అయింది. ఇప్పుడు అలాటి జ్ఞానోదయం కాపులకు కూడా కలిగే సమయం వచ్చింది.

ఇప్పుడు చంద్రబాబు అనేక విషయాలు బోధపరుస్తున్నారు. – 'రిజర్వేషన్లు అమలు జరగాలంటే కమిషన్ నివేదికలు లేకుండా అసాధ్యం. జీవో 30 ఏ మాత్రం ప్రయోజనం లేదు.' అని. 'ఆ ముక్క లెక్కెట్టుకోవడానికి ముందు చెప్పాల' అన్నట్టు యీ ముక్క ఎన్నికలకు ముందు చెప్పి వుంటే యీ అపోహలు, ఆశాభంగాలు వుండేవి కావు. కాపులను బిసిల్లో చేరిస్తే వాళ్లు అభ్యంతర

పెడతారని, బిసిలు టిడిపికి అతి ముఖ్యమైన ఓటు బ్యాంకు అని అందరికీ అవగాహన వుంది. అందుకే యిది జరిగే పని కాదనే అనుమానంతో 'ఎన్నో దశాబ్దాలుగా ఎవరూ చేయలేని పనిని మీరెలా చేస్తారు?' అని అడిగారు. దానికి చంద్రబాబు 'బిసిలకు యిబ్బంది కలగకుండా చేస్తాం, అధికారానికి వచ్చిన ఆరునెలల్లో కమిషన్ ఏర్పాటు చేసి రిజర్వేషన్లు కల్పిస్తాం' అని స్పష్టమైన హామీ యిచ్చారు. అంటే రిజర్వేషన్లు యివ్వాలని వీళ్లు వేసిన కమిషన్ తీర్పు యిచ్చి తీరాలన్నమాట! ఇంక కమిషన్ వేయడం దేనికి? ఇలాటి సందేహాలెన్ని వున్నా, 2014 ఆంధ్ర ఎన్నికలలో టిడిపికి కాపుల ఓట్లు కీలకం కావడంతో, యీ హామీని ఏదో ఒక మేరకు అమలు చేసినా చేయవచ్చు అనుకున్నారు.

కానీ ఒకసారి పదవి దక్కాక బాబుకు ధైర్యం వచ్చేసింది. వచ్చీ రాగానే కమిషన్ వేయలేదు. ఆర్నెల్లు కాదు, ఏడాదయినా కదలిక లేదు. ఏడాదయ్యాక ముద్రగడ పద్మనాభం గుర్తు చేశారు. చివరకు 18 నెలల తర్వాత 2016 జనవరిలో మంజునాథ కమిషన్ వేశాం, దాని రిపోర్టు వచ్చేందుకు 9 నెలలు పడుతుంది ఆగండన్నారు. (మంజునాథగారిపై అక్రమాస్తుల ఆరోపణలున్నాయి. ఆయన నిష్పక్షపాతంగా రిపోర్టు యిస్తాడో లేదో తెలియని పరిస్థితి) కాపుల రిజర్వేషన్‌పై గతంలోనే హై కోర్టు ఆదేశాల మేరకు వేసిన పుట్టుస్వామి కమిషన్ రిపోర్టు బయటపెట్టలేదు. దాని ఆధారంగా ఏమైనా చేసినా సరిపోయేది. కొత్త కమీషన్ వేసి చక్రాన్ని మళ్లీ కనిపెట్టడం దేనికి? పుట్టుస్వామి రిపోర్టును అప్‌డేట్ చేసి దాని ఆధారంగా సిఫార్సులు యిచ్చేయండి అని మంజునాథ కమిషన్‌కి చెప్తే సరిపోతుంది. అలా చెప్పలేదు. ఆయన వాయిదాలు వేయకుండా నిజంగా 9 నెలలకు యిచ్చేసినా బాబు అధికారంలోకి వచ్చిన 27 నెలలకు రిపోర్టు వస్తుంది. దానిపై తర్జనభర్జనలయ్యేసరికి మూడేళ్ల కాలం ముగుస్తుంది. అప్పటికి మరో సమస్య ముందుకు వస్తే యిది వెనకపడుతుంది. నిజానికి నిర్ణయాలు వాయిదా వేయడానికి కమిటీలు, కమిషన్లు కానీ, తీసుకోవడానికి కాదని అనేకసార్లు రుజువైంది. రాష్ట్రాన్ని విభజించే ముందు శ్రీక ృష్ణ కమిటీ నివేదికను సోనియా పరిగణనలోకి తీసుకున్నారా? విభజన తర్వాత రాజధాని ఎక్కడో నిర్ణయించడానికి కేంద్రం వేసిన శివరామక ృష్ణన్ కమిటీని బాబు పట్టించుకున్నారా? తనే వేసిన కమిటీ రిపోర్టు రాకుండానే అమరావతి పరిసర ప్రాంతాల్లోనే రాజధాని అని ప్రకటించలేదా? అయినా కమిషన్ దేని ఆధారంగా యింత శాతం యిమ్మనమని చెప్తుంది? కులాల వారీ జనగణన జరగలేదు. తక్కిన కులాల విషయం వేరు. కాపులంటే జనాభాలో అధికశాతంలో వున్నారు. రాయలసీమ రెడ్లు కూడా కాపులే. కాపుల్లో ఎన్నో తెగలు, కొందరు అగ్రవర్ణాలుగా వుంటే, కొందరి పరిస్థితి తక్కువగా వుంది. అందరినీ ఒకే గాట కట్టలేరు. వారిలో ఎవరికి బిసి స్టేటస్ యివ్వాలి, ఎవరికి యివ్వక్కరలేదు, ఎవరు జనాభాలో ఎంత శాతం వున్నారు – యిలాటి విషయాలు తేల్చాలంటే తాజా సమాచారం వుండాలి. అవన్నీ యిప్పటికిప్పుడు తేలతాయా? ఏదైనా అవకతవకగా జరిగితే యిది అశాస్త్రీయంగా జరిగిందంటూ ఎవరో ఒకరు కోర్టు కెళ్లి ఆపించరా?

ఇవన్నీ తెలియనట్లే జగన్ రాజ్యాంగసవరణ చేసి యిచ్చేయచ్చంటున్నారు. అది అంత సులువైతే వైకాపా మానిఫెస్టోలో రిజర్వేషన్లు యిచ్చేస్తామని పెట్టి వుండాలిగా. కమిషన్ వేస్తాం అని వూరుకోవడం దేనికి? ఇప్పుడు ఆ మాట బాబు గుర్తు చేస్తున్నారు. మీరు కమిషన్ వేస్తామని మాత్రమే అన్నారు, కానీ మేం రిజర్వేషన్ యిచ్చి తీరతామని ఢంకా బజాయించి చెప్పాం అని. అలా చెప్పి ఓట్లడిగారు, సంపాదించారు. దాని అమలులో అవరోధాలేమిటో ఇప్పుడు గుర్తుకు వస్తున్నాయి. వ్యవసాయ ఋణాలన్నీ మాఫీ చేస్తామని ఎన్నికల మానిఫెస్టోలో చెప్పినమాట మర్చిపోయారు లాగుంది, యీ మధ్య ఒక విలేఖరి గుర్తు చేస్తే 'అలా అని నీకు కల్లోకి వచ్చి చెప్పానా?' అని దబాయించారు. లక్షన్నరే మాఫీ అన్నది తర్వాత తర్వాత తేల్చిన అంకె. అలాగే కాపులకు రిజర్వేషన్ అనలేదు, రిజర్వేషన్ల కోసం కమిషన్ వేస్తామన్నాం, వేశాం, వచ్చే ఎన్నికల్లో కూడా గెలిపిస్తే అప్పుడు కమిషన్ రిపోర్టు అమలు చేస్తాం అనవచ్చు. మహామహా జాట్‌లు, గుజ్జర్లు, పటేళ్ల ఆందోళనే సఫలం కాలేదు. ఇవాళ కాపులంటే రేపు కమ్మలంటారు. గతంలో కాపులను బిసిలుగా ఆంగ్లేయులు చూపించారని గుర్తు చేస్తున్నారు. ఆ లిస్టులో కమ్మలు కూడా వున్నారని ఆంధ్రజ్యోతి వేసింది. అందువలన కాపుల రిజర్వేషన్ జరిగేదాకా నమ్మడానికి లేదు.

ఉన్న కోటాలోనే కాపులకు యిస్తే వూరుకోమని బిసిలు అంటున్నారు. కాపుల కోసం 15-20% అదనపు రిజర్వేషన్ పెంచితే అప్పుడు జనరల్ వర్గాలకు నష్టం కలుగుతుంది. అందువలన కాపుల రిజర్వేషన్ గురించి కాపులు ఒక్కరితోనే చర్చిస్తే చాలదు. బిసి, ఎఫ్‌సి నాయకులతో కూడా కలిపి చర్చించాలి. వీళ్లందరూ ఏకాభిప్రాయానికి రావడం జరిగే పనేనా? మరి పరిష్కారం ఏమిటి? అనేక రకాలుగా వెనకబాటుతనాన్ని నిర్ణయించాలని నేను క్రీమీ లేయర్ వ్యాసంలో మొదట్లో రాశాను. ఆ అంశాలన్నిటికీ వెయిటేజి యివ్వకుండా కేవలం కులానికి మాత్రమే యివ్వడం వలన అన్ని సమస్యలూ వస్తున్నాయని రాశాను. సోషల్ సైంటిస్టు, సెఫాలజిస్టు, ఒకప్పటి ఆప్ నాయకుడు అయిన యోగేంద్ర యాదవ్ నేను ప్రస్తావించిన గ్రామీణ వాతావరణం, కుటుంబ ఆర్థికస్థితి, తలితండ్రుల నిరక్షరాస్యత యిత్యాది అంశాలు ఒక్కోదానికి వెయిటేజి యిస్తూ వెనకబాటు తనాన్ని ఎలా నిర్వచించాలో ఒక ఫార్ములా ఎప్పుడో తయారుచేశారట. దానిలో కులం యొక్క సామాజిక హోదా కూడా ఒక ఫ్యాక్టరేట. 50% రిజర్వేషన్‌లోనే యీ కాపులను కూడా పెట్టి యిలాటి ఫార్ములా అప్లయి చేస్తే యీ కులాలలోని డబ్బున్నవాళ్లు ఆటోమెటిక్‌గా ఎలిమినేట్ అయిపోతారు. కానీ యిలా చేస్తామని చెప్పడానికి సాహసం వుండాలి.

ఇది చాలా మతలబులతో కూడిన వ్యవహారం కాబట్టి ఏమీ చేయలేదు అనుకున్నా కార్పోరేషన్ పెట్టి ఏటా వెయ్యి కోట్ల డబ్బు యివ్వడానికేం కష్టం వచ్చింది? దానికి యిబ్బంది ఏముంది? రాజ్యాంగ సవరణ అక్కరలేదు. తక్కిన కులాలవారిని నొప్పించనక్కరలేదు.

ఆ కార్పోరేషన్ల ద్వారా కాపు పేదలకు ఆర్థిక సహాయం, విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు, చిన్న వ్యాపారస్తులకు ఋణాలు.. యిస్తే వారి అసంతృప్తి తగ్గేది కదా, అదెందుకు చేయలేదు? దానికి ఎవరైనా అడ్డుపడ్డారా? లేదే! అది చేయకపోవడం మాత్రం నిర్లక్ష్యం. చేయకపోయినా ఏమీ కాదులే అనే తూష్ణీంభావం. గట్టిగా అడిగితే వంద కోట్లు విదిలించారు. అది కాపులను రగిలించింది. ముద్రగడ పద్మనాభం దాన్ని క్యాప్చర్ చేశారు. ఆయన కొత్తగా పుట్టుకుని వచ్చిన నాయకుడు కాదు, కాపుల గురించి ఎప్పణ్నుంచో పోరాడుతున్నవాడు. ఎప్పుడూ విజయం సాధించి ఎరగకపోయినా, కాపుల్లో ఆయనంటే గౌరవం వుంది. ఎందుకంటే కాపుల పేరు చెప్పి పాలకుల దగ్గర్నుంచి ఏమీ దండుకోలేదు. ఆయన తునిలో కాపుగర్జన సభ పెట్టాడు. హఠాత్తుగా ఆందోళన కార్యక్రమం ప్రకటించాడు. విధ్వంసం జరిగింది. ఇక మొత్తమంతా రాజకీయం అయిపోయింది. కాపు గర్జన సందర్భంగా జరిగిన విధ్వంసం కాబట్టి ముఖ్యమంత్రి కార్యక్రమ నిర్వాహకులనే నిందించాలి, అసలే కాపులకు అన్యాయం చేసి పైగా కేసులు కూడా పెడితే మరీ రగిలిపోతారు. అందుకని పాపాల భైరవుడు జగన్‌పై నెట్టేశారు. వైకాపావాళ్లే చేశారు అన్నారు కానీ యిప్పటిదాకా ఆధారాలు చూపలేదు. మీడియా తీసిన కెమెరాల ఫుటేజి తీసుకుని అప్పుడు మాట్లాడాలి. ఈ లోగా 'స్వతహాగా నిదానస్తులైన కాపులకు చెడ్డపేరు తేవడానికి జగన్ తరఫున గూండాలు రైలు తగలబెట్టారు, వాహనాలు ఆపేశారు' అని అడక్కుండానే కాపులకు ఓ సర్టిఫికెట్టు యిచ్చేశారు.

ఏ కులం గురించైనా అంత గ్రాస్ జనరలైజేషన్ చేయడం ఎవరికైనా రిస్కే. కానీ బాబు తరహాలోనే నేనూ గ్రాస్‌గా జనరలైజ్ చేసి చెపుతున్నాను – దీనికి మినహాయింపులు, సవరింపులు తప్పక వుంటాయి – కాపులకున్న వర్ట్యూస్‌లో నిదానం మాత్రం లేదు. నాకు తెలిసి వాళ్లు అచ్చమైన తెలుగువాళ్లు. కష్టపడే స్వభావంతో బాటు ఆవేశం, అనైక్యత రెండూ పుష్కలంగా వున్నాయి. అవే తక్కినవారంతగా వారు ఎదగలేకపోడానికి అవరోధాలుగా వున్నాయి. కాపులు ఐక్యంగా వుండి వుంటే, మంచి నాయకుడు వుండి వుంటే యీ సరికి కనీసం ఒక్క కాపు ముఖ్యమంత్రయినా వుండి వుండేవారు. రాజకీయాల్లో లౌక్యం, ఓర్పు ముఖ్యం. అవి లేకనే ముద్రగడ అక్కడే ఆగిపోయారు. ఆయనను టిపికల్ కాపు అనవచ్చు. మంచివాడు, నిజాయితీ పరుడే కానీ తిక్కమనిషి, నాయకలక్షణాలు లేవు, పట్టువిడుపులు లేవు, ఏదో చిన్న విషయంపై అలిగి మధ్యలో మానివేయవచ్చు. ఇప్పుడీ తుని సభ రసాభాస అయింది. హింసాత్మకం కావడంతో కాపులు డిఫెన్స్‌లో పడ్డారు. మూకలను అదుపు చేయలేనివారు సభెందుకు పెట్టారని పదవిలో వున్న బాబు అడగలేరు. అందుకే జగన్‌పైకి నెట్టేశారు. జగన్ నువ్వే క్రిమినల్ అంటూ రంగా హత్య నాటి సంఘటనలు తవ్వి కోడెల విషయాలు ఎత్తారు. కోడెల సంయమనం కోల్పోయి రౌడీయిజానికి పాంటు, చొక్కా వేస్తే జగన్ అనేశారు. స్పీకరై వుండి అలా మాట్లాడినవారు నాకెవరూ గుర్తు రావటం లేదు. ఆయన బదులు వేరెవరైనా ఆ పాయింట్లు చెప్పి వుండాల్సింది.

బాబు జగన్‌ను నిందిస్తూ పులివెందుల, కడప సంస్కృతి అంటూ మాట్లాడడం సరికాదు. అవేమీ పాకిస్తాన్‌లో లేవు కదా! ఆ జిల్లాలో పరిశ్రమలు పెడదామనుకున్న వారెవరైనా వుంటే వెనక్కి తగ్గరా? పరిటాల రవి హత్య జరిగినప్పుడు అనంతపురం సంస్కృతి ఏమైంది? రవి హత్య జరగ్గానే రాష్ట్రమంతా టిడిపి వారు చేయించిన దహనకాండ సంగతేమిటి? రాయలసీమను రక్తసీమగా సినిమాలు ఎలాగూ ముద్ర కొట్టాయి. ముఖ్యమంత్రి కూడా అలా మాట్లాడితే ఎలా? వాటిని నీచంగా చూపడానికి గోదావరి జిల్లాలు శాంతికి నిలయాలంటూ ఆకాశానికి ఎత్తేయడం దేనికి? అంత శాంతియుతమైనవైతే పోలీసు స్టేషన్లు మూసేసి డబ్బు మిగిల్చి కాపుల కార్పోరేషన్‌కు యిచ్చేయవచ్చు కదా! నిజానికి తునిలో గొడవ కాగానే విజయవాడలో ఎలర్టయ్యారు, అక్కడ అగ్గి అంటుకుంటే యిప్పట్లో ఆరదు. ఇదీ కోస్తాల శాంతియుత జీవనం! కరక్టుగా చెప్పాలంటే కడపలో ఫ్యాక్షనిజం కొందరినే ఎఫెక్ట్ చేస్తే అయితే విజయవాడలో రౌడీయిజం అందర్నీ ఎఫెక్ట్ చేస్తుంది. జగన్ ఆశ పెట్టుకున్నంత మాత్రాన అమరావతికి చెడ్డపేరు రాదు. పాలకుల నిర్వాకమే దానికి ఆ పేరు తెస్తుంది. అలా రాకూడదనే పట్టుదల బాబుకి వుంటే నాగార్జున యూనివర్శిటీలో చనిపోయిన రిషితేశ్వరి కేసు త్వరగా విచారించాలి. విజయవాడలో కాల్‌మనీ–కాల్‌గర్ల్ రాకెట్ దోషులను, కల్తీ సారా దోషులను త్వరగా శిక్షించాలి. అంతేకాదు, గోదావరి జిల్లాలు శాంతికి నిలయాలు అని ఎవరో చెపితే నమ్మేసి లక్షలాది జనం పోగడినపుడు కూడా పోలీసు బందోబస్తు చేయకుండా కూర్చోకూడదు. తుని సభలో వేదిక దగ్గర పోలీసులు ఎవరూ లేరట. జనాలను అదుపు చేయండని నిర్వాహకులు ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినా లాభం లేకపోయిందట. ఇంత గొడవ జరుగుతుందని ఇంటెలిజెన్సు వర్గాలు వూహించలేకపోయాయా? వాళ్లు చెప్పలేదా? మీరు చూసుకోలేదా? కాపులు, తూగోజిల్లా ప్రజలు మీకు ఆప్తులు కదా, శంకుస్థాపన సభల వంట పెద్ద పెద్ద యీవెంట్స్ ఆర్గనైజ్ చేసిన మీకు ఆ సభ బాగా జరిగేట్లా చూడలేకపోయారా? రాయలసీమ జిల్లాల నుంచి రౌడీలు వచ్చారంటే సరిపోదు, ఆధారాలు చూపించి గబగబా వారిని అరెస్టు చేయాలి. అప్పుడే రాష్ట్రంలో శాంతిభద్రతలున్నాయని పెట్టుబడిదారులకు నమ్మకం చిక్కుతుంది.

కాపులు తిరగబడరన్న గట్టి నమ్మకంతో యిన్నాళ్లూ వున్న బాబు కంగు తిన్నట్టున్నారు. ఏ ముఖ్యమంత్రి అడగనట్లు – జీవో అమలు చేసే బాధ్యత మీరు తీసుకుంటారా? అని ఛాలెంజ్ చేస్తున్నారు. అదొక్కటే ఏం కర్మ, అన్నీ అమలు చేస్తాం, మీ సింహాసనం యిచ్చేస్తే.. అంటారు ప్రతిపక్షులు. రిజర్వేషన్లు అమలు చేద్దామంటే కాపు నాయకులే వచ్చి యిప్పుడిప్పుడే వద్దని, కమిషన్ రిపోర్టు రానివ్వమని చెప్పారని బాబు చెప్తున్నారు. అలా చెప్పిన ఆ పుణ్యాత్ములెవరో పేరు చెప్తే బాగుంటుంది. అప్పుడు మీడియా వెళ్లి ఎందుకలా చెప్పారు? వెయ్యి కోట్లు అక్కరలేదని కూడా మీరే చెప్పారా? అని అడుగుతారు. టిడిపి, వైకాపా బ్లేమ్ గేమ్ ప్రతీదానికీ

సాగుతూనే వుంటుంది. బాబు జగన్‌ను ఎన్ని తిట్టినా ప్రజలకు పట్టదు. 'అందుకే కదా, అతన్ని ఓడించి మీకు పట్టం కట్టాం, నేరం చేశాడని కచ్చితంగా తెలిస్తే కేసులు పెట్టి జైల్లో పెట్టండి, కానీ ముందు మా సంగతి తేల్చండి' అని అడుగుతారు. ఇక చేయవలసినదేమిటి? మొదటగా బాబు అలవికాని హామీలు యివ్వడం ఆకాశంలో పేకమేడలు కట్టడం మానేయాలి. మీకింత వరకే చేయగలం అని ప్రజలకు చెప్పి వారిని నేలమీద వుంచాలి, గాల్లోకి ఎగరేసి కింద పడేయకూడదు. తక్కిన పార్టీలను విశ్వాసంలో తీసుకోవాలి. ఎన్నో దశాబ్దాలుగా పెండింగులో వున్న కాపుల రిజర్వేషన్ గొడవకు ఒక పరిష్కారం కనుగొనగలిగితే అది యితర రాష్ట్రాలకు కూడా మార్గదర్శకం అవుతుంది. బిసిల కున్న 50% లోనే కాపులను కూడా ఎడ్జస్ట్ చేసి యోగేంద్ర యాదవ్ ఫార్ములాతో ఆర్థిక పరిమితి, యితర పరిమితులు విధిస్తే, సమాజంలో యితర వర్గాలను ఒప్పించడం కష్టం కాదు. కానీ దీనికి బిసి నాయకులు మాత్రం అడ్డుపడతారు. కాపులు చేరడం, ప్లస్ క్రీమీ లేయర్ అంటే వారికి బాధగానే వుంటుంది. కానీ ఆ నాయకులను పట్టించుకోకుండా ఆ విధానంలోని మేళ్లను చెప్పి సామాన్య బిసి ఓటర్లను ఒప్పించగలిగితే యీ సమస్యకు పరిష్కారం దొరికినట్లే. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2016)**

**ఫిబ్రవరి 05 ఎమ్బీయస్ : బీఫ్ సంగతి, సరే ఓటేయనిస్తారా..?**

'మాకు ఓటేయకపోతే బీఫ్ తినడానికి వుండదు జాగ్రత్త' అని మజ్లిస్ నాయకుడు ఒవైసీ హెచ్చరించాడు. తిండి మాట అవతల, అసలు ఉండనిస్తారా, యిష్టపడినవాడికి ఓటేయనిస్తారా లేదాన్న భయం పట్టుకుంది యీ రోజు. సామాన్యుడికే కాదు, రాష్ట్రస్థాయి నాయకులకు కూడా. సాక్షాత్తూ డిప్యూటీ సిఎం మహమూద్ అలీకే దిక్కు లేని పరిస్థితి కలిగింది పుష్కరం పాటు పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో! ఆయన యింటిపై దాడి చేస్తే అక్కడి పోలీసులు పారిపోయారు. అంతర్జాతీయ స్థాయి పోలీసింగ్ అంటూ వాళ్లకు ఇన్నోవాలు యిచ్చారు కదా, వాటిలో పారిపోయారు కాబోలు. ఎక్కడ పడితే అక్కడ సిసిటివిలు పెట్టేస్తాం అన్నారు, పాతబస్తీలో మజ్లిస్ నాయకులు వీరవిహారం చేస్తూ వుంటే ఆ సీన్లు ఆ కెమెరాల్లో పోలీసు కమిషనర్‌కు, ఎలక్షన్ కమిషనరుకు కనబడలేదా? సెక్షన్ 144 పెట్టిన చోట ఏభయ్యేసి మోటారు సైకిళ్లతో చెట్టంత మనిషి అసదుద్దీన్ తిరుగుతూ వుంటే ఆ కెమెరాలు కాప్చర్ చేయలేదా? హెల్మెట్ పెట్టుకోలేదనే కారణం చూపైనా వాళ్లను ఆపి వుండవచ్చు కదా! అబ్బే! మజ్లిస్ దాడిని ఖండించడానికి మాటల మరాఠీగా పేరు పొందిన కెసియార్‌కు యిప్పటివరకు మాట పెగలలేదు. గ్రేటర్ హైదరాబాదును అంతర్జాతీయ నగరం చేసే బాధ్యత భుజాల కెత్తుకుని వరస లెక్చర్లు దంచిన కెటియార్‌కూ గొంతు మూగబోయింది. కేవలం నాయిని మాత్రం ఖండించారు. పేరుకు హోం మంత్రే కానీ ఆయనకు ఏ ప్రాముఖ్యతా లేదని అందరికీ తెలుసు. ఇలాటి సందర్భాల్లో నాయకులు 'అవతలివాళ్లు మా వాళ్లను రెచ్చగొట్టడంతో మా కార్యకర్తలు ఆవేశంలో ఏదో చేశారు, చింతిస్తున్నాం' అంటారు. కానీ మజ్లిస్ విషయంలో సాక్షాత్తూ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యేలే దాడి చావగొట్టారు. గతంలో ప్రభుత్వోద్యోగులను, వైద్యులను, తస్లీమాను కొట్టినవారు కూడా ఎమ్మెల్యేలే.

అసదుద్దీన్ ఇంగ్లీషులో గొప్ప తర్కంతో బ్రహ్మాండంగా మాట్లాడి పార్లమెంటులో, చర్చావేదికల్లో మేధావులను కూడా మెప్పించవచ్చు. అది ముసుగు మాత్రమే. అతని అసలైన అవతారం ఎన్నికల సమయంలో బయటపడుతుంది. దుడ్డుకర్ర పట్టుకుని ఎన్నికల బూతులపై పడి ఓటర్లను చావగొడుతున్నపుడు అపరిచితుడి మరో రూపం గోచరిస్తుంది. ముస్లిములను రక్షించడానికే అవతరించామని వారు చెప్పుకునేదంతా బోగస్ అని మరోసారి రుజువైంది. నిన్న వాళ్లు కొట్టినది సాటి ముస్లిములనే. వాళ్ల కాళ్ల దగ్గర పడి వుంటేనే, వాళ్ల అత్యాచారాలు భరిస్తేనే వారి దృష్టిలో ముస్లిములవుతారు. వారి ధోరణి వ్యతిరేకిస్తే చాలు చావగొడతారు, నరికి పోగులు పెడతారు. ఇది నిన్న కాదు, ఎప్పణ్నుంచో జరుగుతోంది. తమ పార్టీ నుంచి విడివడిన ఎంబిటి నాయకులతో వారు వ్యవహరించిన, వ్యవహరిస్తున్న తీరు చూడండి. తమ పార్టీకి వ్యతిరేకంగా నిలబడిన ముస్లిము అభ్యర్థుల దుంప తెంపడం వారికి అలవాటు. నిన్నటి క్రమం చూడండి, వాళ్లు పోలీసు వ్యవస్థకు యిచ్చే గౌరవం ఎలా వుందో తెలుస్తుంది.

మజ్లిస్ పార్టీలో టిక్కెట్టు దొరక్కపోవడంతో పార్టీ మారి కాంగ్రెసు తరఫున పురానాపూల్ డివిజన్ అభ్యర్థిగా నిలబడిన గౌస్ మజ్లిస్‌కు ఛాలెంజ్‌గా నిలిచాడు. అతని కొడుకు, భార్య కూడా వేరే డివిజన్లలో నుంచున్నారు. వీరిని భయపెట్టి తీరాలని మజ్లిస్ నిశ్చయించుకుంది. అతని వర్గం, మజ్లిస్ ఎమ్మెల్యే పాషా ఖాద్రీ వర్గం కలహించుకున్నారు. పాషా స్వయంగా గౌస్‌పై దాడికి ప్రయత్నించడంతో పోలీసులు యిద్దర్నీ అరెస్టు చేసి, ఎందుకైనా మంచిదని చెరో పోలీసు స్టేషన్‌కి తీసుకెళ్లారు. చార్మినార్ ఠాణాకు పాషా తీసుకెళ్లి సొంత పూచీకత్తుపై విడిచిపెట్టేశారు. కానీ మీర్‌చౌక్ ఠాణాకు తీసుకెళ్లిన గౌస్‌ను పోలీసులు విడిచి పెట్టలేదు. అక్కడే పక్షపాతం చూపించారు. మజ్లిస్, తెరాసకు మిత్రపక్షం అనే మాట మనకెలా తెలుసో, పోలీసులకూ తెలుసు. పై నుంచి ఆదేశాలు వచ్చాయేమో కూడా. కాంగ్రెసు రాష్ట్ర అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ షబ్బీర్ ఆలీ ఠాణాకు వెళ్లి వాదించి సొంత పూచీకత్తుపై గౌస్‌ను విడిపించుకుని బయలుదేరారు. వాళ్లు అలా వెళ్లగానే కబురు తెలిసిన అసద్ మీర్ చౌక్ ఠాణాకు వచ్చి గేటు తన్నుకుంటూ లోపలకి వెళ్లి గౌస్‌ను ఎందుకు విడిచి పెట్టారంటూ పోలీసు స్టేషన్‌లో బీభత్సం సృష్టించాడు. పాషాతో పాటు అరెస్టయిన యిద్దరు మజ్లిస్ కార్యకర్తల్ని బలవంతంగా ఏ పూచీకత్తు లేకుండా బయటకు తీసుకొచ్చాడు. వాళ్లు వెళుతూంటే పురానాపూల్ వద్ద గౌస్‌ను తీసుకెళుతున్న ఉత్తమ్ కారు కనబడింది. అంతే దాన్ని ఆపేసి, కార్యకర్తల చేత అద్దాలు పగలకొట్టించి, తను స్వయంగా బానెట్‌పై

చేతులతో గుద్ది, ఉత్తమ్‌ను బయటకు లాగి ముఖంపై చేయి విసిరాడు. షబ్బీర్ అలీని అసద్ అనుచరులు కడుపుపై, ముఖంపై పిడిగుద్దులు గుద్దాడు. పోలీసులు వచ్చి అలా గుద్దినతన్ని ఠాణాకు తీసుకెళితే అసద్ ఠాణాపై పడి బెదిరించాడు. వాళ్లు భయపడి వదిలేశారు.

మజ్లిస్ వారు కాంగ్రెసు వారిని, ఎంబిటివారిని, బిజెపి వారిని, టిడిపి వారిని, ముస్లిం పాత్రికేయుణ్ని మాత్రమే కాదు, తెరాస పార్టీ నాయకుడు ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ కొడుకు మహ్మద్ ఆజం అలీని కొట్టారు. వచ్చే ఎన్నికలలో మలక్‌పేటలో అతను తెరాస తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబడతాడనే వదంతి వుండడం చేత యిప్పణ్నుంచే అడలగొడదామని ప్రస్తుత ఎమ్మెల్యే బలాలా 30 మందితో వచ్చి కొట్టాడు. తర్వాత మహమూద్ అలీ యింటిపై పడ్డారు. భద్రతా సిబ్బంది పారిపోయారు. 'పాత బస్తీ మాది, మీకు యిక్కడ పనేముంది?' అని అసద్ అందరితో అంటున్నాడు. నిజమే అని తెరాస ప్రభుత్వం కూడా ఒప్పుకున్నట్లు కనబడుతోంది. అందుకే అక్కడ ఎంత అరాచకం నడిచినా ముఖ్యనాయకులు మౌనం పాటిస్తున్నారు. పోలీసులు గట్టి చర్యలు తీసుకోవటం లేదు. పోలీసుల చేతులు కట్టేసినది పాలకపక్షమే అనడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఈ కథ చాలా పాతదే. మజ్లిస్ నాయకులకు వచ్చిన విద్య ఒక్కటే, ముస్లిముల పేరు చెప్పి తాము దండుకోవడం, దౌర్జన్యంగా వ్యవహరిస్తూ పాత బస్తీని తమ జాగీరుగా చేసుకోవడం, ఏదైనా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటే యావత్తు ముస్లిము సమాజానికి విఘాతం కలిగినట్లు అల్లరి చేయడం. ఇవన్నీ సాగడానికి వారు అధికారంలో ఎవరుంటే వారితో దోస్తీ చేస్తూ వచ్చారు. వారి అవసరం వారిది, కానీ అధికారంలో వున్నవాళ్లు వాళ్లతో మిలాఖత్ కావడం దేనికి?

నాకు తెలిసి ఎన్టీయార్ ఒక్కరే మజ్లిస్‌ను దూరం పెట్టారు. 1983లో ఆయన నెగ్గినపుడు మజ్లిస్ నాయకులు అభినందించడానికి వస్తే ఆయన చీదరించుకున్నాడట. రమణాచారిని కుడాకు యిన్‌చార్జిగా వేసి పాత బస్తీలో ఎంతో అభివృద్ధి చూపించారు. పోలీసులకు స్వేచ్ఛ నిచ్చి శాంతిభద్రతలు నెలకొల్పారు. అది కొద్ది కాలమే. తర్వాతి రోజుల్లో కాంగ్రెసు, టిడిపి ఒకరి తర్వాత మరొకరు మజ్లిస్‌ను మోస్తూ వచ్చారు. సిపిఎం తరఫున మధు, బిజెపి మాత్రమే పోట్లాడుతూ వచ్చారు. ఉద్యమకాలంలో తెరాస మజ్లిస్‌తో సిద్ధాంతపరంగా విభేదిస్తూ వచ్చింది. మజ్లిస్‌ది సమైక్యవాదమైతే తెరాసది విభజనవాదం. అలాటిది ఎప్పుడైతే రాష్ట్రం చీలిందో మజ్లిస్ ప్లేటు ఫిరాయించింది. కాంగ్రెసును వదిలి తెరాసతో అంటకాగుతోంది. తెరాసకు వ్యతిరేకంగా వున్న పార్టీలన్నిటినీ ఓ చూపు చూసింది. మజ్లిస్ చెప్పినట్లా ఆడి, పాత బస్తీలో తమ యూనిట్లను చేజేతులా నాశనం చేసుకున్న కాంగ్రెసు, టిడిపి యీ రోజు లబోదిబో మంటున్నాయి. రీ

మజ్లిస్‌తో అంటకాగే అవసరం తెరాసకు ఏముందో తెలియటం లేదు. 150 సీట్లలో 70–80 సీట్లు వస్తాయని అంచనాలున్నాయి. రాకపోయినా పార్టీ ఫిరాయింపులలో ఆరితేరిన ఆ పార్టీ ఎదుటివాళ్లను లాక్కుని మేయరు పదవిని చేజిక్కించుకోగలదు. ఇక మజ్లిస్‌తో పనేముంది? ఈ ఎన్నికలలో మజ్లిస్ ప్రవర్తనకు తెరాస శిలువ మోయవలసి వస్తోంది. ఆంధ్రుల రక్షణకై అంటూ ఏర్పరచిన సెక్షన్ 8 ని వ్యతిరేకించిన తెలంగాణ నాయకులందరూ యిప్పుడు దాన్ని అమలు చేసి, తమకు రక్షణ కల్పించమని గవర్నరును వేడుకునే స్థితి వచ్చింది. అంటే ఆంధ్రులను తెలంగాణ వారి స్థాయికి తేలేకపోయినా, తెలంగాణ వారిని ఆంధ్రుల స్థాయికి దింపి హాహాకారాలు చేసేట్లు చేసింది తెరాస. బంగారు తెలంగాణ ఎలా వుందో భలేగా రుచి చూపించింది. ఇప్పణ్నుంచి తెరాసకు ఎవరైనా అడ్డు చెపితే "నాయక్" సినిమాలో 'ఆ గదిలోకి వెళ్లండి, అన్నీ విపులంగా చెప్తారు' అన్నట్లు, 'పాత బస్తీకి వెళ్లండి, మా మిత్రులు మీకు నచ్చచెపుతారు' అంటారు కాబోసు. ఈ లెక్కన తెరాస పాత బస్తీని మజ్లిస్ వంటి అసాంఘిక శక్తులకు ధారాదత్తం చేసినట్లే. టెర్రరిజానికి చిరునామాగా ముద్రపడిన హైదరాబాదులో, సాక్షాత్తూ డిప్యూటీ సిఎంకే రక్షణ లేని యిలాటి ఒక ఘెట్టో ఏర్పడడం ఎంత ప్రమాదకరమో కేంద్రం గుర్తించి, తగు చర్యలు తీసుకోవాలి. అవసరమైతే హైదరాబాదును యూటీగా చేసి తన పాలనలోకి తీసుకోవాలి. అటువంటి ప్రతిపాదనను తెరాసేతర పక్షాలు వ్యతిరేకించబోతే ఫిబ్రవరి 2 నాటి సంఘటనలు గుర్తు చేసి, "తన్నులు సరిపోలేదా?" అని అడగాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2016)**

**ఫిబ్రవరి 06 వీక్లీకై** **ఎమ్బీయస్ : సిపిఎం డైలమా**

ఏప్రిల్ నెలలో రాబోతున్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెసుతో జత కట్టాలో లేదో సిపిఎం తేల్చుకోలేకపోతోంది. బెంగాల్‌లో కాంగ్రెసు, సిపిఎంలకు ఒకరి పొడ మరొకరికి గిట్టేది కాదు. ఒకర్ని ఓడించి మరొకరు అధికారంలోకి వచ్చారు. అలాటివాళ్లకు యీనాడు చేతులు కలపాలన్న ఆలోచన తెప్పించినది మమతా బెనర్జీ. ఆమె పరిపాలన బాగా లేకపోయినా, ఆమె పార్టీ పూర్తిగా బలహీనపడలేదు. కొత్తగా బిజెపి కొంత బలం పుంజుకుంది. బిజెపితో చేతులు కలిపితే ఓట్లు గణనీయంగానే పడతాయి. ప్రతిపక్షాలైన కాంగ్రెసు, సిపిఎం విడివిడిగా పోటీ చేస్తే త్రిముఖ పోరాటంలో తృణమూల్, బిజెపిలదే గెలుపు. కానీ అవి కలిసి పోటీ చేస్తే, ఒకరి ఓట్లు మరొకరికి బదిలీ చేసుకోగలిగితే తృణమూల్‌ను ఓడించడం సాధ్యమే. ఈ రకమైన ఆలోచన యీ మధ్యే జరిగిన సిలిగుడి మునిసిపల్ కార్పోరేషన్ ఎన్నికల తర్వాత వచ్చింది. గత ఐదేళ్లగా తృణమూల్ లోకసభ, మునిసిపల్, పంచాయితీ యిలా అన్ని ఎన్నికలలో గెలుస్తూ వచ్చింది. సిపిఎం, కాంగ్రెసు రెండూ దెబ్బ తింటూనే వచ్చాయి. వాటి కార్యకర్తలు పార్టీ వదిలి తృణమూల్‌లో చేరిపోతున్నారు, లేదా నిరాసక్తంగా వుంటున్నారు. దశాబ్దాలుగా వారికి ఓటేస్తున్నవారు కూడా తమ ఓటు వలన కలిగే ప్రయోజనమేముంది

అనే మీమాంసలో పడ్డారు. ఇలాటి పరిస్థితుల్లో సిలిగుడిలో తృణమూల్, బిజెపి కాని పక్షాలన్నిటిని కూడగట్టుకుని సిపిఎం పోటీ చేసి అనేక సీట్లు గెలిచి మేయరు పదవి కూడా దక్కించుకుంది. ఇదే ఫార్ములాను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేద్దామనే ఆలోచన బెంగాల్‌లోని కాంగ్రెసు, సిపిఎం నాయకుల్లో రగిలింది.

ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ జనరల్ సెక్రటరీ ఓం ప్రకాశ్ మిశ్రా పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీకి రాసిన ఉత్తరం యీ మధ్య వెలుగులోకి వచ్చింది. దానిలో అతను – 'కాంగ్రెసు, వామపక్షాల కూటమిగా ఏర్పడితే మొత్తం 294 సీట్లలో 161 గెలుచుకుంటాయి, తృణమూల్‌కు 126 వస్తాయి, గూరా? జనముక్తి మోర్చాకు 3, బిజెపికి 4 వస్తాయి' అని రాశాడు. కాంగ్రెసు అధిష్టానం ఏం ఆలోచిస్తోందో రాష్ట్రనాయకత్వానికి బోధపడటం లేదు. జాతీయ రాజకీయాలను దృష్టిలో పెట్టుకున్న కాంగ్రెసు తృణమూల్‌ను బిజెపి కౌగిట్లోకి నెట్టకూడదనే ఆదుర్దాతో వుంది. డిసెంబరులో సోనియా పుట్టినరోజునాడు మమత ఢిల్లీ వెళ్లి మాట్లాడి వచ్చింది. 'బిజెపితో కలవకుండా వుండాలంటే నాతో పొత్తు పెట్టుకోమని మీ స్టేట్ యూనిట్‌కు చెప్పండి' అని మమత చెప్పి వుండవచ్చు. మమతను మచ్చిక చేసుకోవడానికి బిజెపి కూడా ప్రయత్నాలు చేస్తోంది. తృణమూల్ పెద్ద తలకాయలన్నీ యిరుక్కున్న శారదా చిట్ స్కాముపై సిబిఐ విచారణ వేగాన్ని మందగింప చేసింది. ఇటీవలే కలకత్తాలో జరిగిన పారిశ్రామికవేత్తల సమావేశానికి అరుణ్ జైట్లీ వెళ్లి వచ్చారు. సుభాష్ బోసు ఫైళ్ల విషయంలో కూడా మమత, మోదీ కాంగ్రెసును అప్రదిష్టపాలు చేసే ప్రయత్నాలు చేయడంలో ఒకటయ్యారు. మరీ వదిలేస్తే మమత పూర్తిగా ఎన్‌డిఏ కూటమిలో చేరిపోతుందేమోనన్న భయంతో రాహుల్ తృణమూల్‌తో పొత్తు పెట్టుకుందామని ఆలోచిస్తున్నాడన్న వార్తలు వచ్చాయి. ఆ మాట నిజమా అని రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడు అధీర్ చౌధురీని అడిగితే 'నేను అధ్యక్షుడిగా వుండగా తృణమూల్‌తో పొత్తు అసంభవం. సిపిఎంతో చేతులు కలపాలని బెంగాల్ ప్రజలు కోరుకుంటున్నారనే విషయాన్ని ఢిల్లీకి వెళ్లి రాహుల్‌తో చెప్తాం' అన్నాడు. ఫిబ్రవరి 1 న బెంగాల్ ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ సభ్యులు రాహుల్‌ను కలిశారు కూడా. ఎలాటి నిర్ణయం తీసుకున్నారో యింకా వార్తలు రాలేదు. స్థానిక కాంగ్రెసు నాయకులు "గతంలో సిపిఎంను గద్దె దించడానికి తృణమూల్‌తో చేతులు కలపమని మా పార్టీ ఓటర్లు అడిగేవారు. ఇప్పుడు తృణమూల్‌ను తొలగించడానికి సిపిఎంతో చేతులు కలపమంటున్నారు. ఇదివరకు సిపిఎం మా చేతులు నరికితే, యిప్పుడు తృణమూల్ ఏకంగా మా తలే నరుకుతోంది." అంటున్నారు.

నిజానికి మమతపై ప్రజలు చాలా అసంతృప్తితో వున్నారు. రాష్ట్రం బాగుపడాలంటే పారిశ్రామికీకరణ జరిగి తీరాలి. పెట్టుబడి పెట్టేవారు అడిగితే భూములివ్వాల్సిందే అని సిపిఎం వాదించి సింగూరులో టాటాలకు భూమినిస్తే తృణమూల్ పెద్ద ఆందోళన చేపట్టి అక్కడి ప్రజలను రెచ్చగొట్టింది. 1900 మంది రైతులు యిచ్చిన నష్టపరిహారం తీసుకుని 600 ఎకరాలు అప్పగించగా, తృణమూల్ బోధనలు విని 1200 మంది రైతులు తక్కిన 400 ఎకరాలు యివ్వలేదు, పరిహారమూ తీసుకోలేదు. ఈ ఆందోళన చూసి టాటా తన నానో ఫ్యాక్టరీని గుజరాత్ తీసుకుపోయింది. 2011లో మమత అధికారంలోకి వచ్చి సింగూరులో రైతుల నుంచి తీసుకున్న భూమిని వెనక్కి యిచ్చేస్తామంటూ చట్టం చేసింది. టాటా మోటార్స్ హైకోర్టుకు వెళ్లారు. అది చట్టవిరుద్ధం అని కోర్టు అంది. మమత సుప్రీం కోర్టుకి వెళ్లింది. అప్పణ్నుంచి అక్కడే పెండింగులో వుంది. ఫ్యాక్టరీ వస్తే ఉద్యోగాలు వస్తాయనుకున్నవారికి ఉద్యోగాలు రాలేదు కానీ నష్టపరిహారంగా వచ్చిన డబ్బు అనుభవిస్తున్నారు. నష్టపరిహారం వద్దన్నవారు ఉభయత్రా నష్టపోయారు. భూమి పనికిమాలినదిగా పడి వుంది. ధర లేదు. వారికి మమత ప్రభుత్వం నెలకు రూ. 2 వేల పెన్షను, 16 కిలోల బియ్యం యిస్తోంది. అవి తీసుకుంటూ, మమతను తిట్టుకుంటూ, టాటాలు తిరిగి వస్తే పూలదండేసి భూములు అప్పగిస్తామని చెపుతూ ఆ రైతులు కాలక్షేపం చేస్తున్నారు. మమత తరఫున సిపిఎంతో పోరాడిన విరోధి కమిటీ వీరుల్లో యిద్దరికి మంత్రి పదవులు దక్కాయి, కొందరికి స్థానిక సంస్థల్లో పదవులు దక్కాయి. అనేకమందికి ఉభయభ్రష్టత్వం, ఉప్పరిసన్యాసం సిద్ధించింది.

దీనికి తోడు తృణమూల్ అధికారంలోకి వచ్చాక ప్రతీ నియోజకవర్గంలో ఆ పార్టీ కార్యకర్తలు సిండికేట్లుగా ఏర్పడ్డారు. ఎవరైనా పరిశ్రమ పెడతాననగానే వాళ్లు వచ్చి తమకు ఉద్యోగాలు, కాంట్రాక్టులు యివ్వకపోతే కుదరదని పేచీ పెడుతున్నారు. ప్రభుత్వం చూస్తే భూములివ్వదు, ప్రజలను రెచ్చగొడుతుంది. సొంతంగా భూమి కొని మొదలుపెడదామంటే స్థానికులు యిలా అడ్డుపడతారు. నాయకులు, పోలీసులు వారికి వత్తాసు యిస్తున్నారు. ఇక పరిశ్రమలు ఎలా వస్తాయి? అందుకే రాలేదు. దాంతో ఆర్థికాభివృద్ధి ఆగింది. నిరుద్యోగం ప్రబలింది. పదవీకాలం అంతమయ్యే సమయానికి మమతకు యిదంతా తెలిసి వచ్చింది. "సజ్జన్ జిందాల్ రూ.10,500 కోట్ల పెట్టుబడితో స్టీలు ప్లాంట్, రూ.800 కోట్లతో సిమెంటు ప్లాంటు పెడదామని వస్తున్నారు. మీరు అడ్డుపడకండి. పెద్ద పరిశ్రమ వస్తే దాని చుట్టూ అనేక చిన్న యూనిట్లు వస్తాయి. జనావాసాలు ఏర్పడతాయి. మార్కెట్ వస్తుంది. హోటళ్లు, దుకాణాలు వస్తాయి. అనేకమందికి ఉద్యోగాలు వస్తాయి." అని ఒక పబ్లిక్ మీటింగులో హితబోధ చేసి "సహాయం చేస్తారు కదూ, రాష్ట్రానికి చెడ్డ పేరు తేరు కదూ" అని జనాల్ని అడిగింది. జనాల నుంచి ఏ సమాధానమూ రాకపోవడంతో "ఏమిటీ, గొంతు లేవటం లేదు" అని రెట్టించింది. ఇక 'తప్పకుండా' అంటూ అరవక తప్పలేదు జనాలకి. ఇప్పటికిప్పుడు పెద్దమనుష్యులు అయిపోమంటే వాళ్ల తరమా? గతంలో సిపిఎం యివే మాటలు చెప్పినపుడు యిదే దీదీ వారిని వెక్కిరించింది కదా, యిప్పుడు గొంతు మారిస్తే అర్థం చేసుకోవడానికి టైము పట్టదా? నిజానికి సల్బోనీలో 4 వేల ఎకరాల స్థలంలో జిందాల్ రూ.35 వేల కోట్ల స్టీలు ప్లాంటు కడదామనుకున్నాడు. 2007లో అతను సిపిఎం ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుని రెండేళ్ల తర్వాత భూమి స్వాధీనం చేసుకున్నాడు. కానీ చైనా నుంచి చవక ఉత్పత్తులు వచ్చి పరిశ్రమను దెబ్బ తీయడంతో ప్లాంటు ప్రారంభం ఆలస్యమైంది. దాంతో భూమి వెనక్కి

యిచ్చేయాలనే ఆందోళన ప్రారంభమైంది. ఇప్పుడు ప్లాంటు సైజును మూడో వంతుకు కుదించి, 294 ఎకరాల భూమి విలువను వెనక్కి యిచ్చేస్తున్నాడు. ఫ్యాక్టరీ ఎలాగైనా నెలకొల్పించాలని మమత పట్టుదలగా వుంది. అందుకే దాని ప్రారంభోత్సవానికి జిందాల్ కంటె ముందుగా వచ్చి కూర్చుంది. ఈ తెలివితేటలు ఐదేళ్ల క్రితమే వుంటే బెంగాల్ పరిస్థితి, పార్టీ పరిస్థితి యిలా వుండేది కాదు.

తమను మట్టి కరిపించిన మమతా బెనర్జీని ఓడించాలన్న కుతూహలం సిపిఎంకు ఎంత వున్నా, కాంగ్రెసుతో చేతులు కలపాలంటే చేతులు ముందుకు రావటం లేదింకా. తరతరాలుగా తమంటే పడని కాంగ్రెసు ఓటర్లు తమకు ఓట్లేస్తారా లేదాన్న సందేహం పీడిస్తోంది. ఈ విషయమై 16 మంది సభ్యులున్న పొలిట్ బ్యూరో చర్చ జరుగుతోంది. రెండు రాష్ట్రాల విభాగాలు వేర్వేరు దృక్పథాలతో వున్నాయి. బెంగాల్‌కు చెందిన మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య, బిమాన్ బోస్, సూర్యకాంతి మిశ్రా, మహమ్మద్ సలీమ్, త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ వీరందరూ పార్టీ జనరల్ సెక్రటరీ సీతారాం యేచూరిపై ఒత్తిడి తెస్తున్నారు. అతనికి ఆ పదవి దక్కడానికి వీరందించిన సహాయమే కీలకం కాబట్టి అతను వారి మాట కాదనలేడు. అయితే పూర్వ జనరల్ సెక్రటరీ ప్రకాశ్ కారట్, అతని భార్య బృంద, అతని సన్నిహితుడు పినరాయ్ విజయన్ కాంగ్రెసుతో పొత్తుకు ససేమిరా అంటున్నారు. ఎందుకంటే వీరు కేరళకు చెందినవారు, కేరళలో లెఫ్ట్, కాంగ్రెసు వేర్వేరు కూటములకు నాయకత్వం వహిస్తున్నాయి. యుపికి చెందిన సుభాషిణీ ఆలీ, ఆంధ్రకు చెందిన రాఘవులు కూడా కారట్ వైపే వున్నారు. "వీరి మాటలు వినే గతంలో చెడ్డాం. యుపిఏ1కు మద్దతిస్తూ ఎంతో పలుకుబడి అనుభవించాం. అమెరికాతో అణు ఒప్పందం విషయంపై పంతానికి పోయి, 2008లో మద్దతు ఉపసంహరించి ఆ ప్రభుత్వాన్ని కూలదోయబోయాం. ఆ ప్రభుత్వం పడిపోలేదు సరి కదా, తర్వాతి ఏడాది యినుమడించిన బలంతో యుపిఏ2 కూడా అధికారంలోకి వచ్చింది. 2008లో 62 మంది ఎంపీలున్న మన లెఫ్ట్ ఫ్రంట్‌కు యీనాడు కేవలం 9 మంది వున్నారు. అప్పుడు మూడు రాష్ట్రాల్లో అధికారంలో వున్నాం. ఈనాడు ఒకే ఒక చిన్న రాష్ట్రం త్రిపురలో వున్నాం. మనకు కంచుకోటలాటి బెంగాల్‌లో 2014 పార్లమెంటు ఎన్నికలలో బిజెపికి చోటిచ్చాం. మన ఓటింగు శాతం 29%కు పడిపోగా బిజెపికి 17.6% దక్కాయి. గుడ్డిగా కాంగ్రెసును ద్వేషిస్తూ పోతే బిజెపి, తృణమూల్ కలిసి మనల్ని బెంగాల్‌లో తుడిచి పెట్టేస్తాయి." అని బెంగాల్ నాయకులు వాదిస్తున్నారు.

ఎవరి మాట వినాలో సిపిఎం అధినాయకత్వం యింకా తేల్చుకోలేదు. అటు కాంగ్రెసు అధిష్టానమూ తేల్చుకోలేదు. బెంగాల్ సిపిఎం రాష్ట్ర కమిటీ ఫిబ్రవరి 12, 13 తారీకుల్లో సమావేశమై ఏం చేయాలో చర్చించి ఒక తీర్మానం చేస్తుంది. 'అది వచ్చాకనే ఫిబ్రవరి 17, 18 తారీకుల్లో జరిగే సమావేశంలో సెంట్రల్ కమిటీ దానిపై ఆలోచిస్తుంది.' అంటున్నాడు ప్రకాశ్ కారట్. ఏం జరుగుతుందో వేచి చూడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2016)**

**ఫిబ్రవరి 07, 08 వీక్లీకై** **ఎమ్బీయస్ : కశ్మీర్ పీఠానికి పీటముడి**

కశ్మీర్ ముఖ్యమంత్రి ముఫ్తీ మొహమ్మద్ సయీద్ చనిపోయి నాలుగు వారాలవుతోంది. అతని కూతురు, రాజకీయవారసురాలు మెహబూబా వెంటనే అతని స్థానంలో ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టిస్తుందనుకుంటే ఆమె ఉలుకూపలుకూ లేకుండా కూర్చుంది. గవర్నరు పిలిచి సంగతేమిటి, ఎవరైనా వచ్చి ప్రభుత్వం ఏర్పాటు చేస్తారా, రాష్ట్రపతి పాలన కొనసాగించాలా అని అడగాల్సి వచ్చింది. ఇది ఎవరికీ, ముఖ్యంగా మన తెలుగువాళ్లకు మింగుడపడటం లేదు. మన చుట్టూ వున్న నాయకులెటువంటివారు? తండ్రి దుర్మరణం పాలైతే శవం వుండగానే కొడుకు కోసం సంతకాలు సేకరించినవారు, అలా మరణించకుండా పూలరంగడిలా మళ్లీ పెళ్లి చేసుకున్న మామగార్ని వెన్నుపోటు పొడిచి దింపేసినవారు, దళితుణ్ని సిఎం చేస్తానని ఓట్లడిగి తనే కుర్చీ ఎక్కేసినవారు.. యిలాటివాళ్లను చూస్తూ రాజకీయాలంటే యిలాగే వుంటాయనుకుంటూంటే యీ మెహబూబాకు యింత విముఖతేమిటి అనే ఆశ్చర్యం కలగదా? సోదరుడు చనిపోయేక తల్లి బలవంతంమీద రాజకీయాల్లోకి వచ్చిన రాజీవ్ లాటిదా యీమె అనే సందేహమూ రావచ్చు. అలాటిదేమీ లేదు. సయీదా రాజకీయాల్లోకి వచ్చి 20 ఏళ్లయింది. నిజానికి వద్దామని ఆమె కూడా అనుకోలేదు. తన తండ్రి కాంగ్రెసు నాయకుడు. నలుగురు పిల్లల్లో పెద్దామె యీమె. మేనబావనే పెళ్లి చేసుకుంది. ఇద్దరు ఆడపిల్లల్ని కంది. అయితే భర్తతో పొసగలేదు. విడాకులు తీసుకుని, కూతుళ్లతో సహా 1987లో ఢిల్లీకి వెళ్లిపోయింది. 1989లో కశ్మీర్‌లో తీవ్రవాదం ప్రబలడం, వాళ్ల చేతిలో చెల్లెలు కిడ్నాప్‌కు గురికావడం ఆమెను భయపెట్టాయి. కశ్మీర్ జోలికి వెళ్లకుండా ఢిల్లీలోనే వుండిపోవాలనుకుంది. ఎయిర్‌లైన్సులో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసింది. పిల్లలకు బాగా చదువు చెప్పించింది.

తీవ్రవాదం పెచ్చరిల్లడంతో కేంద్రం కశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన విధించి ఆరేళ్ల తర్వాత 1996లో ఎన్నికలు నిర్వహించబోయింది. అయితే కాంగ్రెసు తరఫున పోటీ చేయడానికి అభ్యర్థులు దొరకలేదు. కాంగ్రెసు అధ్యక్షుడిగా వున్న ఆమె తండ్రి ముఫ్తీ గత్యంతరం లేక తన కుటుంబసభ్యులకే టిక్కెట్లు యిచ్చాడు. భార్య గుల్షన్‌ను పహల్‌గాంవ్ నుంచి నిలబెట్టాడు. తన సొంత వూరైన బిజ్‌బెహారాలో కొడుకు తస్సాదక్ హుస్సేన్‌ను నిలబెడదామనుకున్నాడు. కానీ అతనికి వయసు చాలలేదు. (వయసు వచ్చిన తర్వాతైనా అతను రాజకీయాల్లోకి వెళ్లకుండా సినిమా రంగంలోకి వెళ్లాడు. అతని చిన్న మేనకోడలు, మెహబూబా కూతురు కూడా అతన్ని అనుసరించింది. ముఫ్తీ పోయిన తర్వాత అతన్ని పార్టీ సమావేశానికి పిలిస్తే వచ్చి కాస్సేపు కూర్చున్నాడు తప్ప తండ్రి స్థానం తీసుకుందామని అనుకోలేదు) అందుచేత పెద్ద కూతురు మెహబూబాను ఢిల్లీ నుంచి రప్పించి నువ్వు ఒంటరిగా అక్కడ వుండడం బాగాలేదంటూ

నచ్చచెప్పి అభ్యర్థిగా నిలబెట్టాడు. అప్పటికి ఆమె వయసు 36. తండ్రి మాట కొట్టేయలేక ఉద్యోగానికి రాజీనామా చేసి పోటీ చేసింది. తల్లి ఓడిపోయింది కానీ ఆమె నెగ్గింది. మూడింట రెండు వంతుల మెజారిటీతో నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం ఏర్పరచగా యీమె ప్రతిపక్ష నాయకురాలై పోయింది. 1999లో ముఫ్తీ కాంగ్రెసు వదిలేసి, సొంత పార్టీ పిడిపి (పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ)ని స్థాపించినపుడు ఆమె అతనికి కుడిభుజంగా పనిచేసింది. భద్రతాదళాల చేతిలో మిలిటెంట్లు చనిపోయినపుడు ప్రజలు అధికారంలో వున్న నేషనల్ కాన్ఫరెన్సుపై ఆగ్రహం చూపేవారు. ఈమె వాళ్లింటికి వెళ్లి ఓదార్చి వస్తూండేది. వేషభాషల్లో తనను తాను పూర్తి కశ్మీరీ మహిళగా చూపించుకుని వారికి ఆత్మీయురాలిగా మారింది. 2008 ఎన్నికలలో ఆమెకు వ్యతిరేకంగా ప్రచారం చేయడానికి ఆమె మాజీ భర్త ఇక్బాల్‌ను నేషనల్ కాన్ఫరెన్సు పిలిపించినా కశ్మీరు మహిళలు ఆమెనే ఆదరించారు. ముఫ్తీ రాజకీయ చతురత చూపిస్తూ వుంటే యీమె కార్యకర్తలతో బంధం పెంచుకుంటూ పోయింది.

పార్టీ ఏర్పడిన మూడేళ్ల తర్వాత 2002లో వచ్చిన ఎన్నికలలో పిడిపికి 16 సీట్లు వచ్చాయి. పిడిపి, కాంగ్రెసు సంయుక్త ప్రభుత్వం ఏర్పడింది. దఫదఫాలుగా ముఖ్యమంత్రి పదవి మార్చుకోవాలనే ఒప్పందంతో ముఫ్తీ తొలి మూడేళ్లు ముఖ్యమంత్రి అయ్యాడు. ఆరేళ్ల తర్వాత (మన దగ్గర ఐదేళ్ల కోసారి ఎన్నికలైతే అక్కడ ఆరేళ్ల కోసారి) 2008లో పిడిపికి 21 సీట్లు వచ్చాయి. అప్పుడు నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెసు కలిసి ఒప్పందానికి వచ్చి ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రి అయ్యాడు. ఈమె ప్రతిపక్షంలో వుంటూ వాళ్లపై ఘాటు విమర్శలు చేసేది. ఆమె నిరంతర కార్యశీలత కారణంగా దక్షిణ కశ్మీర్ పిడిపికి కంచుకోటగా మారింది. 2014 ఎన్నికలు వచ్చేసరికి పిడిపికి 28 సీట్లు వచ్చాయి. 87 సీట్లున్న అసెంబ్లీలో మెజారిటీ కావాలంటే 25 సీట్లు తెచ్చుకున్న ఆగర్భశత్రువు బిజెపితో చేతులు కలపక తప్పని పరిస్థితి. రాజకీయాల్లో యిలాటి శషభిషలు పెట్టుకోకూడదనుకున్న ముఫ్తీ వారితో కలిసి సంకీర్ణప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాడు. ఇది మెహబూబాకు అస్సలు నచ్చలేదన్నది బహిరంగ రహస్యం. ఎన్నికల ప్రచారసభల్లో ఆమె బిజెపిని, మోదీని తిట్టిపోసేది. ఎన్నికల తర్వాత యిలాటి ఏర్పాటు వలన కశ్మీరు లోయలో తమ ప్రతిష్ఠ పోతుందని భయపడింది. ఎందుకంటే కశ్మీర్ లోయలో బిజెపి 36 స్థానాల్లో నిలబడితే 35 స్థానాల్లో డిపాజిట్ గల్లంతైంది. కానీ ముఫ్తీ ధైర్యంగా ముందుకు వెళ్లాడు. బిజెపితో కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు అభ్యంతరం తెలిపిన తన కార్యకర్తలకు పిడిపి '2014 వరద బాధితులను ఆదుకోవాలంటే రూ. 50 వేల కోట్లు కావాలి. కాంగ్రెసుతో లేదా నేషనల్ కాన్ఫరెన్సుతో చేతులు కలిపితే ఒరిగేదేముంది? డబ్బు కోసమే బిజెపితో రాజీ పడుతున్నాం' అంటూ చెప్పింది. వాళ్లు సరిపెట్టుకున్నారు. కానీ ఆచరణలో జరిగినదేమిటి?

2015 నవంబరులో మోదీ ప్రకటించిన రూ. 80 వేల కోట్ల ప్యాకేజీలో వరద బాధితుల పునరావాసానికి యిప్పటిదాకా యిస్తానన్నది రూ. 8 వేల కోట్లు. మొదటి విడతగా యిచ్చినది రూ. 1200 కోట్లు. అది కూడా ముఫ్తీ 'ఫ్లడ్ చెక్కు, చెక్కు' అంటూ ఆసుపత్రి మంచం మీద నుంచి కూడా కలవరించగా చివరకు జనవరి 4 న అరుణ్ జైట్లీ సంతకం పెట్టాడు. మూడు రోజులకే ముఫ్తీ కన్ను మూశాడు. ముఫ్తీ పదినెలల కాలంలో విద్య, వైద్యసౌకర్యాలు ఏమీ మెరుగుపడలేదు. విద్యుత్ కోతలు ఎక్కువై పోవడంతో పరిశ్రమలు రాలేదు. యువకులందరూ నిరాశానిస్పృహలతో తీవ్రవాదం బాట పట్టి లష్కరే తొయిబాలో, హిజ్‌బుల్ ముజాహిదీన్‌లో చేరుతున్నారు. సాధారణ ప్రజల విషయానికి వస్తే తీవ్రవాదంతో వ్యవహరించే విధానం విషయంలో ముఫ్తీ గుంజాటన వలన కశ్మీరు లోయలో అతనిపై గౌరవం పోయింది. కితం నెలలో ముఫ్తీ స్వగ్రామంలో ముగ్గురు మిలిటెంట్లను సైన్యం మట్టుపెట్టినపుడు ముఫ్తీ సొంత యింటిపై స్థానిక ఆందోళనకారులు దాడి చేసి యింటి కప్పుపై పాకిస్తాన్ జండా ఎగరేశారు. అతనేమీ చేయలేకపోయాడు. ముఫ్తీ గతంలో ముఖ్యమంత్రిగా వుండగా యిలాటి సంఘటనను వూహించలేం కూడా. బిజెపితో పొత్తు తర్వాత అతని కంచుకోటలోనే అతనికి పాప్యులారిటీ అడుగంటింది.

దీనికి కొలమానం ఏమిటంటే అతని అంత్యక్రియలకు హాజరైన జనాలు కేవలం వెయ్యికి లోపే! అతను కొద్దికాలంగా అస్వస్థుడిగా వుంటూ ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందాడు. చనిపోయిన తర్వాత మోదీ, రాజనాథ్ సింగ్ ఎయిర్‌పోర్టుకు వచ్చి శవపేటికపై పూలగుచ్ఛం వుంచారు. అంత్యక్రియలు కశ్మీరులో జరిగాయి. కశ్మీరు సింహంగా పేరు పొందిన షేక్ అబ్దుల్లా పోయినపుడు ఇందిరా గాంధీ స్వయంగా అంత్యక్రియలకు హాజరయ్యారు. పదిలక్షల మంది జనం వచ్చారు. ఇప్పుడు మోదీ వెళ్లలేదు సరి కదా పఠాన్‌కోటకు వెళ్లినపుడు అట్నుంచి అటే కశ్మీరు వెళ్లి మెహబూబాను పరామర్శించ లేదు కూడా. సంతాపదినాల్లో నాల్గవ రోజున సమాధికి అందరూ వెళ్లి ప్రార్థనలు చేస్తారు. అప్పుడు కూడా కేవలం 5 వేలమంది వచ్చారు. అదీ ముఫ్తీ స్వస్థలంలో! మూణ్నెళ్ల క్రితం లష్కరే తొయిబా పాకిస్తాన్ కమాండర్ అబూ కాసిమ్ అంత్యక్రియలు జరిగినప్పుడు 30 వేల మంది వచ్చారు. ఎన్‌కౌంటర్లలో పాకిస్తాన్ తరఫున పని చేసిన ఉగ్రవాదులు చచ్చిపోతే వారి కోసం పుల్వామా పట్టణంలో స్మారకచిహ్నం కడతామంటే ముఫ్తీ ప్రభుత్వం ఒప్పుకోలేదు. దాంతో పదిహేను రోజుల పాటు దుకాణాలు మూసేసి బంద్ నిర్వహించారు. ఇవన్నీ పిడిపికి ఒకప్పటి కంచుకోట అయిన దక్షిణ కశ్మీరులో జరుగుతున్నాయి. వీటివలన బిజెపితో తమ పొత్తును తమ ఓటర్లు ఆమోదించలేదని, 16 ఏళ్లగా నిర్మించుకున్న పార్టీ యంత్రాంగం కుప్పకూలుతోందని గ్రహించింది. కానీ బిజెపితో తెగతెంపులు చేసుకునే ధైర్యమూ చేయలేకపోతోంది. చేసుకుంటే తన తండ్రివి అవకాశవాద రాజకీయాలని నిరూపించినట్లవుతుంది. కాదని కాంగ్రెసును వాటేసుకుంటే కేంద్రం నుంచి వచ్చే నిధులకు గండి పడవచ్చు. కేంద్రం సహాయం లేనిదే కశ్మీర్‌లో తెల్లవారదు. బిజెపిని నట్టేట ముంచి కాంగ్రెసుతో జతకడితే మెహబూబా ప్రభుత్వానికి మోదీ చేయూత నిస్తాడనుకోవడం భ్రమ. సోనియా గాంధీ, గులాం నబీ యితరులు పరామర్శకు వచ్చినపుడు బేరసారాలు

సాగాయేమో తెలియదు. 12 సీట్లున్న కాంగ్రెసు తో చేతులు కలిపినా మరో నలుగురు ఎమ్మెల్యేలు కావలసి వస్తారు.

ముఫ్తీ పోయిన తర్వాత బిజెపి నాయకులూ తొందర పడటం లేదు. అంత్యక్రియలకు రామ్ మాధవ్, నితిన్ గడ్కరీ వచ్చారు. సంతాపదినాలు నడుస్తూండగానే బిజెపి నాయకులు జమ్మూలో పబ్లిక్ ఫంక్షన్లకు వెళ్లారు. ఇప్పుడు ముఫ్తీ పోయాడు కాబట్టి వంతుల వారీగా తమకు ముఖ్యమంత్రి పదవి కావాలని అడుగుతున్నారని వార్త వచ్చింది. మూడేళ్లు పిడిపికి, మూడేళ్లు బిజెపికి అనుకుంటే పిడిపికి యింకా రెండేళ్ల ఛాన్సుంది. ఈ లోపునే సిఎం మార్పు ఒప్పుకుంటారా? విరుద్ధ భావాలు కల బిజెపితో కలిసి ప్రయాణం సాగించాలంటే ముఫ్తీకున్నంత ఓర్పు మెహబూబాకు లేదు. ఆమెకు ఆవేశకావేషాలు హెచ్చు. పైగా పిడిపిలో అంతఃకలహాలు కూడా వున్నాయి. బేగ్, తారీఖ్ కారా అనే యిద్దరు నాయకులకు ఎప్పుడూ పడదు. వాళ్లిద్దరూ బిజెపితో తెగతెంపులు చేసుకోమని బహిరంగంగా చెప్తున్నారు. ఇద్దరం మెహబూబాకు మద్దతిస్తాం అంటున్నారు కానీ బిజెపి కొత్త డిమాండ్లు, ఎక్కువ పదవులు అడిగితే ఏమవుతుందో తెలియదు. కశ్మీర్, జమ్మూ రెండు ప్రాంతాలకూ వేర్వేరు ప్రయోజనాలున్నాయి. పిడిపి, బిజెపి ఆ యా ప్రాంతాలకు ప్రాతినిథ్యం వహిస్తున్నాయి. ఈ సంకీర్ణం వలన వాటి కార్యకర్తలు, ఓటర్లు అసంతృప్తిగా వున్నారు. అయితే మెహబూబా కాడి పారేస్తే, ఆమె పార్టీ నాయకులు అందివచ్చిన అధికారాన్ని ఎందుకు వదులుకోవాలని వాదించవచ్చు. అందుకని మరిన్ని షరతులతో మెహబూబా ముందుకు వస్తోంది. అభివృద్ధి పథకాలు పెంచాలన్న కోరిక ఎలాగూ కోరింది. వరద బాధితుల పునరావాసం ప్రధాన అంశంగా వుంది. అది జరిగితే పిడిపికి పేరు వస్తుంది. కేంద్రం నిధులివ్వకుండా ఆపడం వలన పిడిపికి పేరు రాకుండా పోయింది. దీనికి తోడు వేర్పాటువాదులతో వ్యవహరించేందుకు తమకు స్వేచ్ఛ నివ్వాలని మెహబూబా కోరుతోంది. తాము చెప్పిన చోటకి సైన్యదళాలు తరలి వెళ్లాలని ముఫ్తీ సెప్టెంబరు 29న బహిరంగంగా కోరాడు. దాన్ని అమలు చేయమని ఆమె అడుగుతోంది. ఇవన్నీ ఎప్పటికి తేలతాయో, కశ్మీరులో ప్రభుత్వం ఎప్పుడు ఏర్పడుతుందో ఎవరికీ తెలియదు. దేశభద్రత దృష్ట్యా అత్యంత కీలకమైన రాష్ట్రంలో యిలాటి అనిశ్చితి దేశానికే ముప్పు అనడంలో రెండో మాట లేదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2016)**

**ఫిబ్రవరి 09 , 10** **ఎమ్బీయస్ : మేలుకో, లోకేశ్!**

గ్రేటర్ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. తెరాస, మజ్లిస్ గెలుస్తాయని మొదటినుంచీ అంటూనే వున్నారు కానీ తెరాసకు అనుకున్న దాని కంటె 20–30 సీట్లు ఎక్కువ వచ్చాయి. 100 సీట్లు గెలుస్తామన్న మాట అబద్ధం చేయడానికా అన్నట్లు సరిగ్గా 99 దగ్గర ఆగిపోయాయి. ఇది నిశ్చయంగా ఘనవిజయం. ఈ విజయం తెరాసలో ఎలాటి మార్పు తెస్తుందో వేచి చూడాలి. ప్రతిపక్షాలు కుప్పకూలడం వలననే తెరాస యింత గొప్పగా గెలిచిందన్నది నిర్వివాదాంశం. ప్రతిపక్షాల్లో అన్నిటి కంటె ఘోరంగా దెబ్బ తిన్నది గతంలో 45, యిప్పుడు 1 గెలిచిన టిడిపి! గ్రేటర్ ఎన్నికలలో టిడిపికి సారథ్యం వహించిన లోకేశ్ యీ విషయాన్ని గుర్తించి, మరమ్మత్తు చర్యలు చేపట్టాలి.

ముందుగా ఫలితాలను గణాంకాల ద్వారా విశ్లేషించి చూస్తే, వచ్చిన మార్పేమిటో స్పష్టమైన చిత్రం గోచరిస్తుంది. 2009 గ్రేటర్ ఫలితాలతో పోల్చిచూడడంలో అర్థం లేదు. అప్పటికి తెరాస యిక్కడ ఒక శక్తి కాదు. రాష్ట్ర విభజన ప్రకటన తర్వాత గ్రేటర్ పరిధిలో జరిగిన 2014 ఎసెంబ్లీ ఎన్నికల ఫలితాలను దగ్గర పెట్టుకుని అప్పటికి, యిప్పటికి వచ్చిన మార్పు ఏమిటి, ఎందుకు అన్నదే చూడాలి. శాసనసభ నియోజకవర్గాలలో మొత్తం 81.43 లక్షలు కాగా, యీ సారి గ్రేటర్‌లో ఓట్లు 74.23 లక్షలు. అప్పుడు 52% పోలింగు అయితే, యిప్పుడు 45% అయింది. మామూలుగా నగరాల్లో పోలింగు తక్కువే జరుగుతుంది. హైదరాబాదు నగరవాసుల మనోభీష్టం గురించి తెలుసుకోకుండానే విభజన జరిగిపోయింది. ఎవరికి ఓటేయాలో తెలియక, అన్ని పార్టీలపై ఆగ్రహంతో వున్నపుడే 52% పోలింగు జరిగింది. ఇప్పుడు ఆ నిరాసక్తత మరీ పెరిగి 45%తో ఆగిపోయింది. అంటే రాజకీయాలపై ఆసక్తి బాగా వుండి, ఏదో ఒక పార్టీకి విధేయులై వున్నవారు మాత్రమే ఓటేశారు అనుకుంటే యీ అంకెలు పార్టీ యంత్రాంగ పటిష్టతకు సూచికలుగా అనుకోవాలి.

ఆ విధంగా చూస్తే తెరాస తన ఓటింగు శాతాన్ని అమాంతంగా 25.5% పెంచుకుంది. ఓటర్ల సంఖ్యలో చూస్తే 6.87 లక్షల మంది అదనంగా దానికి వేశారు. గతంతో పోలిస్తే 9.09 లక్షల మంది ఓటర్లు తగ్గారని గుర్తు పెట్టుకుంటే యిది ఎంత విశేషమో అర్థమవుతుంది. పైగా 48 డివిజన్లలో 50% కంటె ఎక్కువ ఓట్లు తెచ్చుకుంది! దీనికి చాలా కారణాలే చెప్తున్నారు. నిజానికి తెరాస వచ్చిన తర్వాత నగరానికి జరిగిన మేలంటూ ఏమీ కనబడలేదు. తెరాస ఎడాపెడా వాగ్దానాలు చేస్తూ పోవడం తప్ప మెట్రో రూటు మారుస్తామంటూ అనవసరంగా ఆలస్యం చేశారు. టూ బెడ్‌రూమ్ పథకానికి పేదలు ఆకర్షితులయ్యారంటున్నారు. దాన్ని ఎలా నమ్మారు? ఋణమాఫీ విషయంలో కెసియార్ చేసిన వాగ్దానం పూర్తి కాలేదు. ఇంకా ఋణాలున్నాయి, వడ్డీలు పెరుగుతున్నాయి, కొత్త ఋణాల జారీకి యిబ్బందిగా వుంది. బాబు లక్షన్నర పరిమితి పెట్టి అమల్లో చాలామందికి రకరకాల కారణాలు చెప్పి ఎగ్గొట్టారు. తెలంగాణలో అలాటి యిబ్బంది లేకపోయింది. అందుకని నమ్మారేమో తెలియదు. డివిజన్ల పునర్విభజన చేయడం, సర్వశక్తులూ మోహరించడం, విపరీతంగా ప్రచారం చేయడం, టిడిపి, కాంగ్రెసు నాయకులను తన పార్టీలోకి గుంజుకుని వాళ్లకు నాయకులు లేకుండా చేయడం, యితర రాష్ట్రాల నుంచి వచ్చినవారిని ఆకర్షించే హామీలు గుప్పించడానికి సాక్షాత్తూ ముఖ్యమంత్రి

కొడుకును వుపయోగించడం.. యిలా తెరాస ఎన్నో మార్గాలు అవలంబించింది. లిచిన మాట వాస్తవం.

ఇక తక్కిన పార్టీలన్నీ ఓట్లు పోగొట్టుకున్నాయి. టిడిపి-బిజెపి కూటమికి గతంలో కంటె 11% తగ్గాయి, అంకెల్లో చెప్పాలంటే 6.80 లక్షల మంది తగ్గారు. కాంగ్రెసుకు తగ్గినది 4%, అంకెల్లో 2.72 లక్షలు. మజ్లిస్‌కు 11% తగ్గారు, అంకెల్లో 6 లక్షలు. ఇతర పార్టీలు, స్వతంత్రులకు గతంలో ఎన్ని వచ్చాయో యిప్పుడూ యించుమించు అన్నే వచ్చాయి. ఈ విధంగా చూస్తే టిడిపి-బిజెపి కూటమే భారీగా నష్టపోయింది. మజ్లిస్‌కు కూడా ఓటర్లు తగ్గినా, సీట్లు తగ్గలేదు. కాంగ్రెసు అంతఃకలహాల్లో మునిగిపోయింది. నాయకులెవరికీ ఉత్సాహం లేదు. ఢిల్లీ నాయకత్వానికి ముందే హుషారు లేదు. ఇక్కడ నెగ్గినా, నెగ్గకపోయినా ఒకటే అన్నట్టున్నారు. అందువలన 2 సీట్లు వచ్చాయి. 3%, అంకెల్లో 2.70 లక్షల ఓట్లు తగ్గాయనుకోవచ్చు. కానీ బిజెపి, టిడిపి పరిస్థితి అది కాదు. బిజెపి తెలంగాణ పోరాటంలో ముందు వుంది. కిషన్ రెడ్డి యీ మధ్య చప్పబడ్డారు కానీ లేకపోతే ఆ మధ్య కెసియార్ తప్పులు ఎండగడుతూ చురుగ్గా వున్నారు. వాళ్లకు క్యాడర్ కూడా వుంది కానీ యించుమించు అదీ 3% ఓట్లు పోగొట్టుకుంది. సంఖ్యాపరంగా 2.20 లక్షల ఓట్లు తగ్గాయి. 66 డివిజన్లలో పోటీ చేసి కేవలం 4 నెగ్గింది. 34 డివిజన్లలో 300 ఓట్ల తేడాతో ఓడిపోయాం అని కిషన్ రెడ్డి చెప్పుకున్నారు కానీ అలాటి సందర్భాలు యితరులకూ వుంటాయి. టిడిపితో చేతులు కలిపి నష్టపోయాం అనుకుంటున్నారట. అసెంబ్లీ ఎన్నికలలో నగరమే వాళ్ల పరువు కాచింది. టిడిపితో పొత్తు వుంది కాబట్టే టిడిపి ఓట్లు బదిలీ అయి నగరంలోని 24 ఎసెంబ్లీ సెగ్మంట్లలో బిజెపికి 5 వచ్చాయి. ఇప్పుడు అన్ని డివిజన్లు కూడా రాలేదు. అన్నిటికన్న బాధాకరమేమిటంటే వాళ్ల ఆజన్మవిరోధి మజ్లిస్ తెరాస ప్రభంజనంలో కూడా తన స్థానాలు నిలబెట్టుకుంది.

ఇక టిడిపికి సుమారుగా 5 లక్షల ఓట్లు తగ్గాయి. శాతం ప్రకారం చూస్తే సుమారు 8%! ఇది చాలా ఎక్కువ. టిడిపి ఓట్లు తెరాసకు పడ్డాయనే ప్రచారం సాగుతోంది. అది కచ్చితంగా చెప్పగలిగిన విషయం కాదు. తెరాసకు అదనంగా వచ్చిన 6.87 లక్షల ఓటర్లు అన్ని పార్టీల నుంచి వచ్చి వుండవచ్చు. ముఖ్యంగా గతంలో టిడిపికి వున్న 45 మంది కార్పోరేటర్లలో 30-35 మందిని తెరాస చేర్చుకుని వారికి టిక్కెట్లు యిచ్చింది. వాళ్లు గెలిచారు. వాళ్ల ఓట్లన్నీ టిడిపికి తగ్గి తెరాస ఖాతాలో పడి వుండవచ్చు. అది కాకుండా టిడిపికి దన్నుగా నిలబడిన మధ్యతరగతి వర్గాలు, ఆంధ్రమూలాలున్నవారు యిల్లు కదిలి వుండకపోవచ్చు. వారిలో కొందరు టిడిపిపై కోపంతో తెరాసకు వేసి వుండవచ్చు. నిరాసక్తత చూపినవారి కారణాల గురించి ఆలోచిస్తే - ఉమ్మడి రాజధానిలో పదేళ్ల పాటు వుండి ఆంధ్ర, తెలంగాణలను రెండు కళ్లగా చూసుకుంటానన్న చంద్రబాబు తమను వదిలే పెట్టేసి తన బాగు చూసుకున్నారని నిరాశ పడి వుండవచ్చు. బాబు ఆలోచనాధోరణిలో సడన్‌గా వచ్చిన మార్పుకి రేవంత్ రెడ్డి నోటు-ఓటు వ్యవహారానికి లింకు వుందన్న సంగతి అందరికీ తెలుసు. ఇక్కడ వుంటే తమ ఫోన్లు ట్యాప్ అయ్యే అవకాశం వుందని, తెలంగాణ పోలీసులు తమను సతాయించగలరని బాబు భయపడడం చేతనే రాష్ట్రం నడిబొడ్డునుండి పాలన మొదలెట్టేస్తాం అనే పాట అందుకున్నారు. కొత్త రాష్ట్రం ఏర్పడినపుడే రాష్ట్రం నుంచి పాలిస్తే మంచిదనే ఆలోచన రావాలిగా. కానీ అప్పుడంతా పదేళ్లదాకా మనకి హక్కు వుంది, ఎందుకు వదులుకోవాలి అని వాదించేవారు. సెక్రటేరియట్‌ను చీల్చారు. తన ఛాంబర్‌కు వాస్తుమార్పులు చేయించారు. అలాటిది ఎప్పుడైతే కెసియార్ ఆ కేసులో యిరికించారో, భయపడిపోయారు. రాజీ పడ్డారు. ఆ రాజీ కూడా సమానస్థాయిలో జరిగినట్లు లేదు. కెసియార్ తన ప్రసంగాల్లో బాబును యీసడించారు. తన రాజధానికి ఏమీ తెచ్చుకోలేక పోయాడు కానీ హైదరాబాదుకి ఏం తెస్తాడు? 13 జిల్లాలున్నాయి, పోయి అక్కడ ఊడ్చుకోమను అని తీసిపారేశాడు. అయినా బాబు తన ప్రసంగంలో కెసియార్‌ను పన్నెత్తి మాట్లాడలేదు. జగన్ కూడా కెసియార్‌ను ఏమీ అనకపోవడం చేతనే ఆంధ్రులలో, తెలంగాణలోని ఆంధ్రమూలాల వారిలో గౌరవం పోగొట్టుకున్నాడు. ఇప్పుడు బాబుకు అదే గతి పడుతోంది. కెసియార్‌తో మ్యాచ్ ఫిక్సింగ్ అయిపోయిన బాబు తమనేం రక్షిస్తారనే ఆలోచన ఆంధ్రమూలాల వారిలో కలగడంలో ఆశ్చర్యం ఏముంది? అందువలన ఉన్న కొమ్మనే గట్టిగా పట్టుకోవాలనే భావనతో కొందరు తెరాసకు వేసి వుండవచ్చు. మరి కొందరు ఎవరికీ వేయకుండా వూరుకునీ వుండవచ్చు.

నిజానికి 2014 అసెంబ్లీ ఎన్నికల సమయానికి టిడిపి ఓటర్లు అత్యుత్సాహంతో వున్నారు. హైదరాబాదులో వున్న ఆంధ్రమూలాల వారు చాలామందికి ఆంధ్రలో కూడా ఓట్లున్నాయి. బాబు పార్టీ అంటే అభిమానం వున్న అనేక కంపెనీల వారు తమ ఉద్యోగులకు సెలవులు, వాహనాలు యిచ్చి ఆంధ్ర పంపి టిడిపికి ఓట్లేయించారు. వారిలో కొంతమంది యిక్కడి ఓటు దాచుకుని అక్కడే వేసినా, మరి కొందరు అక్కడా యిక్కడా కూడా వేశారు. ఆంధ్రలో బాబు ఎలాగూ వస్తారు, హైదరాబాదులో కూడా వుండి, మనల్ని రక్షిస్తారు అనే నమ్మకంతోనే వారీ పని చేశారు. ఆంధ్రలో టిడిపిని గెలిపించడానికి గల కారణాల్లో ముఖ్యమైనది వ్యవసాయ ఋణమాఫీ! అన్ని రకాల ఋణాలు మాఫ్ చేస్తారనే అభిప్రాయం కలిగించారు. అయితే ఆచరణలోకి వచ్చేసరికి లక్ష నిబంధనలు పెట్టి, రాష్ట్రానికి బయట వున్న వారికి ఆ బెనిఫిట్ అందకుండా పోయింది. ఇది ఎదురుచూడని దెబ్బ కాబట్టి బాబుపై ప్రేమ తగ్గిపోయింది. ఉద్యోగుల విషయానికి వస్తే పదేళ్ల ఉమ్మడి రాజధాని క్లాజ్ కారణంగా తాము యిప్పట్లో కదలనక్కరలేదని, రాజధాని తయారీ పదేళ్లు కాదు కదా పదిహేనేళ్లయినా పట్టవచ్చని, ఆ పాటికి తాము రిటైరు కావడమో, లేక కెరియర్ చివర్లో వుండడమో జరుగుతుందని, హైదరాబాదు వదిలే సందర్భమే రాదనీ ఆంధ్రమూలాల ఉద్యోగులు అనుకున్నారు. తీరా చూస్తే బాబు యిప్పుడే తరలి రావాలంటున్నారు. ఉద్యోగులెవరికీ తరలి వెళ్లడం యిష్టం లేదని అందరికీ తెలిసిన విషయమే. ఇళ్ల అద్దెలు ఎక్కువని, సౌకర్యాలు లేవనీ ఏదో ఒకటి చెప్తూ వస్తున్నారు. ఇప్పుడు అవకాశం వచ్చింది కాబట్టి ఉద్యోగస్తులు, వారి కుటుంబాలవారు టిడిపికి వ్యతిరేకంగా ఓటేసి వుండవచ్చు,

లేదా పోలింగు బూతుకే వెళ్లి వుండకపోవచ్చు.

జంటనగరాలలో రాయలసీమ నుండి వచ్చి స్థిరపడినవారెందరో వున్నారు. ప్రస్తుతం రాయలసీమవారికి బాబుపై ఆగ్రహం వుండడంలో ఆశ్చర్యం ఏముంది? వారికి రాజధాని లేదు సరి కదా హైకోర్టయినా ఎలాట్ చేయలేదు. కర్నూలు, కడప జిల్లాల్లో ఏమైనా పెట్టాలన్న సూచన రాగానే అక్కడ శాంతిభద్రతలు సరిగ్గా వుండవు అంటూ ముఖ్యమంత్రే తోసిపారేస్తున్నారు. ఇన్నాళ్లూ తెలంగాణ ఉద్యమకారులు 'హైదరాబాదు ఒకప్పుడు ప్రశాంతంగా వుండేది, వైయస్ హయాంలో రాయలసీమ రౌడీలు తెల్లలుంగీలు కట్టుకుని వచ్చి హైదరాబాదులో కబ్జాలు చేసేసి, భయభ్రాంతుల్ని చేశారు' అంటూ ప్రచారం చేసేవారు. ఇప్పుడు రాయలసీమకు చెందిన బాబు, ఆయన సహచరులు అలాటి ప్రచారం చేస్తున్నారు. కోస్తాజిల్లాలవారు శాంతికాముకులు, రాయలసీమవారు రక్తపిపాసులు అనే కలర్ యిస్తున్నారు. ఎన్నికల సమయంలో టిడిపి 'రాయలసీమ ఫ్యాక్షనిజాన్ని, బాంబుల సంస్కృతిని వైజాగ్‌కు దిగుమతి చేస్తున్నారు. విజయమ్మను ఓడించకపోతే యిది మిగతా జిల్లాలకు కూడా పాకుతుంది. ఇది శాంతి సీమ, యిక్కడ యిలాటి అరాచకం సహించం' అంటూ ప్రచారం చేసింది. ఎన్నికల తర్వాత కూడా అలాటి ప్రచారాన్ని తగ్గించలేదు. రాయలసీమలో మూలాలున్న నగరవాసులకు యిది రుచిస్తుందా? వారు టిడిపికి వ్యతిరేకంగా ఓటు వేసి వుండకపోయినా అనుకూలంగా వేసి వుండకపోవచ్చు.

అబ్బే అలాటిదేమీ లేదు, జగన్‌ను నిలవరించడానికి అక్కడ ఏం అన్నా, యిక్కడ మాత్రం మీకు రక్షణగా నిలుస్తాం అంటూ వారి దగ్గరకు వెళ్లి నచ్చచెప్పే నాయకుడెవరూ టిడిపిలో కాన రాలేదు. టిడిపి నాయకులందరూ తెరాసలోకి దూకేశారు. 2019లో తెలంగాణలో అధికారంలోకి వస్తాం అని చెప్పుకుంటున్న బాబు, ఆయన ప్రతినిధిగా యిక్కడే వున్న లోకేశ్, తెలంగాణకు అనుకూలంగా లేఖ యిచ్చి తీరాలని పట్టుబట్టి సాధించిన ఎర్రబెల్లి యిత్యాది నాయకులు ఎవరూ నాయకుల వలసను అడ్డుకోలేక పోయారు. టిడిపి చాలాకాలంగా యువతను పట్టించుకోవడం మానేసింది. ఎన్టీయార్ తరహాలో యువతను ఆకట్టుకుని టిక్కెట్లు యిచ్చి వుంటే వారైనా పార్టీతో నిలిచేవారేమో. యువకులకు భవిష్యత్తుపై నమ్మకం వుండి ఒకే పార్టీలో కొనసాగుతారు. కానీ 50 ఏళ్ల పడిలో పడిన నాయకులెవరూ అధికారం లేకపోతే విలవిలలాడిపోతారు. ఫిరాయించడానికి అవకాశాల కోసం వెతుకుతారు. ఎన్టీయార్ కాలంలో చేరిన యువకులే తప్ప బాబు హయాంలో టిడిపిలో చేరిన యువకులెవరు? అప్పటివాళ్లే కొనసాగుతున్నారు. జగన్ పార్టీ పెట్టినపుడు యువతను చేర్చుకుని అవకాశాలు యిచ్చి వుంటే ప్రస్తుత అవస్థ వుండేది కాదు. కాంగ్రెసు ప్రభుత్వాన్ని పడగొట్టాలనే ఆతృతతో నాయకులనే చేర్చుకున్నాడు. అవకాశం రాగానే వాళ్లు ఫిరాయించేస్తున్నారు. ఆంధ్రలో, తెలంగాణలో యిదే కథ. కెసియార్, బాబు ఫిరాయింపుదారులపై ఆధారపడే రాజకీయాలు నడుపుతున్నారు. ఎదురుగాలి వీచగానే యీ గాలికోళ్లు దిశ మార్చుకుంటాయి. ఇప్పటికైనా తెరాస, వైసిపి, టిడిపి కొత్త నాయకులను తయారు చేసుకోవాలి. గ్రేటర్ ఎన్నికలు రాబోతున్నాయని తెలిసినపుడు ముందుగానే టిడిపి, వైసిపి యీ ప్రక్రియ మొదలుపెట్టవలసినది. అలాటిది చేయకపోవడం చేతనే వైసిపి రంగంలోకి దిగడానికి ధైర్యం చేయలేకపోయింది.

ఇక టిడిపి ఎవరూ దొరకనట్లు రేవంత్‌ను కార్యనిర్వాహక అధ్యక్షుణ్ని చేసి దించింది. ఆయన నగరానికి చెందిన నాయకుడు కాదు. పైగా నోటు-ఓటు కేసులో నిందితుడు. ఆ కేసులో బాబు హస్తం వుందో లేదో అన్న సందేహానికి తావుంది కానీ రేవంత్ వీడియోలో పట్టుబడిపోయిన వ్యక్తి. ఆయన కెసియార్ అవినీతిని ఎదుర్కొంటాం అంటూ ప్రచారం చేస్తే హాస్యాస్పదంగా వుండదా? పైగా ఆయన అనేకసార్లు హద్దులు మీరి మాట్లాడాడు.

బాబు మొదట్లో, చివర్లో ప్రచారానికి వచ్చారు. పాడిందే పాటరా అన్నట్లు 'హైదరాబాదుకి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చాను, బిల్ గేట్స్‌కు నచ్చచెప్పాను, సైబరాబాదు కట్టాను. ..' యివే కబుర్లు. 'నీకు యింజనీరింగు చదువు చెప్పించడానికి ఎంత కష్టపడ్డామో తెలుసా?' అని తలితండ్రులు చెప్పబోతేనే పిల్లలకు విసుగు. 'ఆపవయ్యా సుత్తి, యిప్పుడు స్టేట్స్ పంపడానికి డబ్బిస్తావా లేదా అది చెప్పు చాలు' అంటారు. బాబు జమానా 2004తో అయిపోయి పదకొండేళ్లయింది. ఆయన తొమ్మిదేళ్ల పాలనకు ముందు, దానికి తర్వాత ఏమీ జరగలేదని ఆయన మనల్ని నమ్మమంటాడు. హైదరాబాదు యిలా యివాల్వ్ కావడానికి 400 ఏళ్ల పై బడి పట్టింది. పోనీ ఆధునిక హైదరాబాదు చరిత్ర తీసుకున్నా 60 ఏళ్లు. దానిలో తొమ్మిదేళ్లంటే ఏ మూలకి? బిల్డింగు పెయింటు వేసిన ప్రతీ వాడూ నాదే బిల్డింగంటే ఓనరేం కావాలి? సరే ఆయన అంత ప్రజ్ఞావంతుడైతే యిప్పుడు అమరావతి కుంటుతోందేం? తాత్కాలిక సెక్రటేరియట్, తాత్కాలిక రాజ్‌భవన్, తాత్కాలిక అసెంబ్లీ... యిలా అన్నీ తాత్కాలికాలే కట్టడమేం? కట్టడాలు కనబడటం లేదు, శంకుస్థాపన మహోత్సవాలు తప్ప! ఈయనకు మోదీ దగ్గర ఏమీ పలుకుబడి లేదని కెసియార్ ఎంత వెటకారంగా చెప్పాడో చూడండి. బాబు తన సొంత రాష్ట్రంలో ఏదైనా చేసి చూపిస్తే తప్ప యిక్కడ కాస్తయినా అంబ పలకదు. అక్కడ చేసినా, యిక్కడ కూడా ఒక కాలుంది, మిమ్మల్ని వదిలిపెట్టలేదు అని చూపించుకుంటే తప్ప తెలంగాణలో టిడిపిలో చేరేవాడుండడు.

ఈ విషయాన్ని లోకేశ్ గుర్తించాలి. ఆయన యిప్పటిదాకా తెర వెనుక రాజకీయాలే చేస్తున్నాడు. ట్వీట్ చేసే టాలెంటు వేరు, జనంలోకి వచ్చి మెప్పించే టాలెంట్ వేరు. ట్వీట్ విషయంలో ఘోస్ట్ రైటర్స్ వున్నారేమోనన్న అనుమానం వుంటుంది. ఆయన జనంలో తిరుగుతూ. సందర్భోచితంగా మాట్లాడుతూ, అవసరమైన చోట చమత్కారం ప్రదర్శిస్తూ తను ఒక యువనాయకుణ్ని అని చూపించుకోవాలి. ప్రత్యర్థి నుంచి కూడా నేర్చుకోవచ్చు. కెటియార్ జాతీయ టీవీ ఛానెల్స్‌లో, కాన్ఫరెన్సులలో అనేక చోట్ల పాల్గొని తన మేధస్సును, వచోపటిమను చూపుకున్నారు. మూణ్నెళ్లగా వాడవాడలా తిరుగుతూ కార్యకర్తలను మంచి చేసుకున్నారు. తెరాస

గెలుపు ఖాయం అనుకున్నారు కాబట్టి టిక్కెట్లకోసం ఆశావహులు, నిరాశోపహతులు ఎందరో వున్నారు. వారిని కెటియార్ బుజ్జగించి, రెబెల్స్ బెడద లేకుండా చూసుకున్నాడు. మరి టిడిపి విషయంలో బిజెపితో పొత్తు సవ్యంగా సాగలేదు. ఓట్ల బదిలీ కాలేదు. అటూయిటూ రెబెల్స్ నిలబడి విజయావకాశాలను దెబ్బ తీసుకున్నారు. వీటికి ఎవరు బాధ్యత వహిస్తారు? ఆంధ్ర పాలనలో లోకేశ్‌కు పనేమీ లేదు. తండ్రి ఆరోగ్యంగా వున్నారు, అన్ని విషయాలూ స్వయంగా చూసుకుంటున్నారు. హెరిటేజి వ్యవహారాలు తల్లి చూసుకుంటున్నారు. మరి తను తెలంగాణను పట్టించుకుని ఓటమి బాధ్యతను తలకెత్తుకుని, నాయకత్వ లక్షణాలు ప్రదర్శించాలి. తెలంగాణలో టిడిపికి బలమైన క్యాడర్ వుంది. బిసిల మద్దతు వుంది. ఎన్టీయార్ ఎందరికో ఆరాధ్యదైవం. కష్టపడితే కొన్ని వర్గాలనైనా ఆకట్టుకుని ఒక బలమైన శక్తిగా కొనసాగవచ్చు. బద్ధకిస్తే పార్టీ మొత్తం తెరాసలో విలీనమై పోతుంది. ఆంధ్ర రాజకీయాలతో సతమతమవుతున్న బాబే యివన్నీ చూసుకోవాలనడం భావ్యం కాదు. లోకేశ్ మేల్కోవాలి. ఎన్టీయార్ భవన్ విడిచి బయటకు వచ్చి చిన్నతనంలో తిరిగినట్లుగా గల్లీల్లో తిరుగుతూ, పతంగులు ఎగరేస్తూ, అన్ని వర్గాలతో కలిసిమెలసి తిరిగి, అన్ని రకాల రాజకీయ, సాంస్కృతిక సమావేశాల్లో కనబడుతూ, మాట్లాడుతూ ప్రజల్లో తనేమిటో, తన సత్తా ఏమిటో చూపుకోవాలి. అమెరికాలో చదివిన విద్య నిరర్థకం కాలేదని నిరూపించుకోవాలి. వయసులో కాస్త పెద్దవాడైన, ప్రస్తుతం విజేతగా నిలిచిన కెటియార్‌ను ఆదర్శంగా తీసుకున్నా, అనుకరించినా తప్పు లేదు. ఈ ప్రయత్నంలో ఏడాదికైనా, రెండేళ్ల కైనా ఏదో ఒక ఉపయెన్నికలలోనైనా విజయం సాధించిచూపితే తండ్రికి పుత్రోత్సాహం కలుగుతుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2016)**

తెరాస 99– 43.85%, 14.69 లక్షల ఓట్లు, 2014లో 18.4%, 7.82 పెరిగినది 6.87 లక్షలు
టిడిపి 1– 13.11%, 4.39 , 2014లో 20.9%, 9.29
బిజెపి 4– 10.34%, 3.46, 2014లో 12.8%, 5.66
కలిపి 2014లో 34.42%, 14.66 లక్షలు (తగ్గినది 6.80 లక్షలు (11%)
కాంగ్రెసు 2– 10.4%, 3.48, 2014లో 14.5%, 6.20 తగ్గినది 2.72 (15%)
మజ్లిస్ 43– 15.85%, 5.31, 2014లో 26.64%, 11.42 తగ్గినది 6.09 (10.8%)
అదర్స్ 5.8%, 2.48, 2014లో 6.45% 2.16 లక్షలు 0.32 పెరిగాయి.
మొత్తం 33.49,379 – 2014లో 42.58, 912 తగ్గినవి 9.09
బిజెపి–టిడిపి 24 ఎసెంబ్లీ సెగ్మెంట్లలో 14 (టిడిపి 9, బిజెపి 5) గెలిచింది.

**ఫిబ్రవరి 11, 12** **ఎమ్బీయస్ : ఇదేం రణనీతి, ముద్రగడా?**

ఆందోళన ప్రారంభించేవారు పాలకుల నుండి ఏదైనా సాధించాలనే ఉద్దేశంతోనే మొదలుపెడతారు. ఎందుకంటే ఏదైనా యివ్వగలిగేది అధికారంలో వున్నవారే తప్ప, ప్రతిపక్షాల్లో వున్నవారు కాదు, మీడియా కాదు, పక్కన నినాదాలు యిచ్చేవారు, కంచాలు సొట్టపరిచేవారు కాదు. ఇప్పుడు కాపుల రిజర్వేషన్‌పై, కాపు కార్పోరేషన్ నిధులపై నిర్ణయం తీసుకోవలసినది చంద్రబాబు. ఆయనతో అనునయంగానో, హెచ్చరిస్తూనో, లౌక్యంగానో, యిరకాటంలో పెడుతూనే ఉద్యమం సాగితే ఎంతో కొంతమేరకు విజయం సాధించవచ్చు. కానీ యీ ముద్రగడేమిటి, ఏకంగా చంద్రబాబును డైరక్టుగా నిందించడం మొదలుపెట్టారు! 'రెండు ఎకరాల నుంచి రెండు లక్షల కోట్ల స్థాయికి ఎలా ఎదిగారో బాబు చెప్పాలంటూ స్టేటుమెంటు యిచ్చారు. ఆ కిటుకేదో చెప్పి కాపుజాతిని కూడా అభివృద్ధి చేయాలట. కిటుకు చెప్పేస్తే కార్పోరేషన్‌కు నిధులివ్వమని అడగరట.

మొట్టమొదట ముద్రగడ తెలుసుకోవలసినది – కాపులను 'జాతి' అని ప్రస్తావించిన కొద్దీ కాపేతరులకు మండుతుంది. తెలుగుజాతి ఒకటి అంటూ పాటలు పాడుకుంటూ వచ్చాం యిన్నాళ్లూ. ప్రాంతభేదం చూపించి తెలంగాణ జాతి వేరు అంటూ టి–ఉద్యమకారులు వేరు రాగం తీసి, తెలుగు తల్లికి ప్రతిగా తెలంగాణ తల్లి రూపకల్పన చేశారు. తెలంగాణ భాష వేరే అంటున్నారు. ఇప్పుడు ముద్రగడ కాపుల గురించి మొదలెట్టారు. ఇక అతి త్వరలో కాపు తల్లి, కాపు భాష, కాపు సంస్కృతి, కాపు చారిత్రకవారసత్వం వగైరాలు వెలుస్తాయేమో. ఇలా ప్రతి కులమూ తమను తాము జాతిగా ప్రకటించుకుంటే అతి త్వరలో ఆంధ్రప్రదేశ్‌లో కనీసం అరవై జాతులు ఏర్పడుతాయి. మా కులానికి... అంటే పోయేదానికి మా జాతి అనడం దేనికి, వ్యవహారం ముదిరితే ఆయన వూరినో, జిల్లానో మా దేశం అని కూడా అనేయవచ్చు.

ఇక రెండో పాయింటు – బాబు రెండు లక్షల కోట్ల నాయకుడని ముద్రగడకు ఎలా తెలుసు? ఎవరు చెప్పారు? అఫిడవిట్‌లో వుందా? ఆధారాలున్నాయా? ఏమీ లేకుండా లూజుగా మాట్లాడితే ఎలా? జగన్–లక్ష కోట్లు పాట పాడిపాడి టిడిపి పలుచనై పోయింది. సిబిఐ పెట్టిన కేసులు కూడా (వాటి అతీగతీ ఎవరూ చెప్పలేరు, ధిక్కరించినందుకు జగన్‌ను జైల్లో పెట్టేసి సోనియా కసి తీర్చేసుకుని మర్చిపోయింది, అవినీతి తుదముట్టిస్తాననే మోదీ యీ కేసుల విచారణ వేగవంతం చేసి విడిచిపెట్టడమో, జైల్లో పెట్టడమో చేయాలి. కానీ నానుస్తూనే వున్నాడు) ఆ మొత్తానికి చాలా దూరంలో ఆగిపోయాయి. అయినా అసెంబ్లీలో జగన్ లేవగానే 'లక్ష కోట్లు'

అంటూ లయబద్ధంగా టిడిపి నాయకులు పాట పాడుతూనే వుంటారు. అధికారంలోకి రాగానే లోటస్ పాండ్‌పై దాడి చేసి లక్ష కోట్లు లాక్కుని పేదలకు పంచుతామని, రాజధాని కట్టేస్తామని యిలా చాలా ప్రకటనలు చేశారు టిడిపి నాయకులు. ఇప్పుడవేమీ గుర్తుకు రాక, కాపుల కార్పోరేషన్‌కు నిధులు లేవు, వాళ్లు ఓర్చుకోవాలి, రాజధానికి డబ్బు లేదు, స్కూలు పిల్లల దగ్గర్నుంచి పదీ, పరకా యివ్వాలి, యిటికలు కొనుక్కోవాలి అంటూ తంటాలు పడుతున్నారు. అంటే గజం మిథ్య, పలాయనం మిథ్య అన్నట్లు జగన్ లక్ష కోట్లు మిథ్య, వాటిని వడేసి పట్టుకోవడం మిథ్య అన్నట్లుగా తయారైంది. టిడిపి జోకులకే నవ్వలేక ఛస్తూ వుంటే యిప్పుడు మీరూ వారికి తోడవుతే ఎలా ముద్రగడ గారూ! వాళ్లు తమలపాకుతో ఒకటంటే, నేను తలుపుచెక్కతో రెండంటా అన్నట్లు, వాళ్లు లక్ష అన్నారని మీరు రెండు లక్షలన్నారా? ఇలా అయితే మీ మాటకు విలువుంటుందా?

పైగా ఆ కిటుకేదో చెప్పేయాలా? అమ్మా, ఆశ! రెండు లక్షల కోట్లు కాదు, దానిలో 1% రెండు వేల కోట్లు మాత్రమే సంపాదించారనుకోండి. అదైనా ఎలా సంపాదించారో మీకు చెప్పేస్తారా? చెపితే పెద్దపెద్ద వ్యాపారస్తులందరూ ఐఐఎమ్‌లని సలహాదారులుగా పెట్టుకోవడం మానేసి ముఖ్యమంత్రుల వెంట పడరా? మీకు నిజంగా బాబుతో బాటు ఎదగాలని వుంటే వెళ్లి భాగస్వామిగా చేరాలి. లేకపోతే వ్యాపారాల నుంచి, రాజకీయాల నుంచి రిటైరయ్యాక బాబు ఆత్మకథ రాస్తే అది కొనుక్కుని చదువుకోవాలి. బాబే కాదు, ఏ వ్యాపారవేత్తయినా సరే, మాకు లాభాలొస్తున్నాయి, ఆ రహస్యాలేమిటో చెప్తాను పట్టండి అంటూ క్లాసులు పెట్టి చెప్పరు. నష్టాల్లోనే వున్నాం, ఏదో అలవాటు కొద్దీ, మా ఉద్యోగులను రోడ్డు మీద పడేయడం యిష్టం లేక వ్యాపారాన్ని లాక్కువస్తున్నాం అంటారు. ఇతరులు వీళ్ల విధానాలను అధ్యయనం చేసి మేనేజ్‌మెంట్ కోర్సుల్లో పాఠాలు చెప్పి లక్షల్లో జీతాలు పుచ్చుకుంటారు. మీరు సిన్సియరైతే ఆ క్లాసులకు హాజరై తెలుసుకోవాలి. ఇంకో హెచ్చరిక– కిటుకులు విన్నంత మాత్రాన విద్య పట్టుబడదు. దానికి చేయాల్సిన కృషి చాలా వుంది. మీరెప్పణ్నుంచో రాజకీయాల్లో వున్నారు. మీ కళ్లెదురుగానే మీ కులస్తులతో సహా ఎందరో పైకి వెళ్లారు. వాళ్లను చూసి మీరేం నేర్చుకున్నారు? అప్పుడూ నిరాహారదీక్షలు చేశారు, యిప్పుడూ చేస్తున్నారు. ఎక్కడ వేసిన గొంగళీ అక్కడే వుంది.

బాబు రెండు లక్షల కిటుకేదో చెప్పేస్తే కాపుల కార్పోరేషన్‌కు ఏటా వెయ్యి కోట్లు యివ్వక్కరలేదని చెప్పడానికి మీరెవరు? రిజర్వేషన్ సంగతి దేవుడెరుగు, ఆర్థికసాయం అందిస్తే బాగుపడదామని అనేక మంది కాపు యువత, కాపు వ్యాపారస్తులు ఎదురు చూస్తున్నారు. కిటుకులతో పని కాదని, కాసులు కావాలని వాళ్లకు తెలుసు. మీరు దీక్షలో వుండి నీరసపడడం చేత యీ విషయం తట్టడం లేదు. కాపులెవ్వరికీ కాసులక్కరలేదు, కిటుకులు చాలు అని డిక్లేర్ చేసే దుస్సాహసం చేయకండి. 'నాకు కాదు, బాబుకి వైద్యపరీక్షలు చేయించండి, హామీలు గుర్తొస్తాయి' అంటూ సెటైర్లు ఒకటా? పైగా యిది వ్యంగ్యం కాదు అంటూ తూగోజి మార్కు వెటకారం కూడా జోడించారు. బాబు రాయలసీమవారు. ఆయన భాషలో చమత్కారాలు, వెటకారాలు వుండవు. మీ వెక్కిరింతను అర్థం చేసుకున్నాక ఆయనకు మండుతుంది. ఎందుకంటే రెండు లక్షల కోట్లు అంటూ మీరు ఆయన్ని అవినీతిపరుడిగా చిత్రీకరిస్తున్నారు. జగన్‌ను తిరస్కరించి, ప్రజలు తనకు పట్టం కట్టినది తన యింటిపేరు 'నిప్పు' కాబట్టే అని ఆయన నమ్మి మనల్ని నమ్మమంటున్నారు. అలాటిది మీరు ఆయన్ను జగన్‌కు రెట్టింపు గురువుగా చూపితే ఏమనుకుంటారు? అయినా మీకు యీ ఆరాలన్నీ యిప్పుడే గుర్తుకు వచ్చాయా? '18 నెలల క్రితం మా కాపులందరం మిమ్మల్ని నమ్మి ఓట్లేశాం' అని చెప్తున్నారే, అప్పుడు 'మనకు రిజర్వేషన్, నిధులు యిస్తే చాలు, ఆయన అవినీతిపరుడైనా ఫర్వాలేదు' అనుకున్నారా మీ అందరూ..?

ఇప్పుడాయన్ని మండించి మీరేం సాధించబోతున్నారు? ఈ రోజు ఆయనే ముఖ్యమంత్రి. తలచుకుంటే ఆయనే ఏదైనా యివ్వాలి. తలచుకోకపోతే యివాళ రాత్రికే మీ దీక్ష భగ్నం అయిపోతుంది. మీ ఉద్యమం ద్వారా జగన్‌ను అప్రదిష్ఠ పాలు చేసే అవకాశం వుందేమోనని ఆయన చూస్తున్నాడు. ఆందోళనకారుల మొహం కూడా చూడకుండా వాళ్ల పుట్టుపూర్వోత్తరాలు చెప్పేయగల దిట్ట ఆయన. కావాలనుకుంటే హింస రెచ్చగొట్టారనే నేరంపై మిమ్మల్ని అవేళే అరెస్టు చేయించవచ్చు. మిమ్మల్నేమీ గట్టిగా అనకుండా జగన్‌కు దండన వేద్దామని ఆయన ఓపిక పడుతున్నారు. దాన్ని మీరు అలుసుగా తీసుకుని, బాబును నోటి కొచ్చినట్లు అనేస్తే ఆయన ఓపిక హరిస్తుంది. మీరు నిరాహార దీక్ష కాదు, తపస్సు చేసినా యిప్పటికిప్పుడు ముఖ్యమంత్రిని మార్చలేరు. 2019 తర్వాత రాబోయే ముఖ్యమంత్రి ఎవరైనా – మాట వరసకి మీరే అయినా – కాపు రిజర్వేషన్ సమస్య తేల్చడం ఎవరి తరం కాదు. ఇప్పటికిప్పుడు బాబుతో వైరం దేనికి? ఆయన హామీలు మర్చిపోయినందుకా? పోనీ మీకు గుర్తున్నాయి కదా, మీరేం చేశారు? లేఖ రాసి వూరుకోవడమేం? దీక్ష చేస్తే ఎన్నాళ్లు చేస్తారు? ఎన్నాళ్లు చేయనిస్తారు? గతంలో తుపాకీ దగ్గర పెట్టుకుని కూడా చేశారు. ఏమైనా సాధించారా? గతంలో అయితే ఉమ్మడి రాష్ట్రంలో కాపులు అంత నిర్ణయాత్మకమైన ఓటు బ్యాంకు కాదు. అందుకే కాంగ్రెసు, టిడిపిలు వాగ్దానాలను తుంగలోకి తొక్కినా ఎవరూ ఏమీ చేయలేకపోయారు. ఇప్పుడు అవశేష ఆంధ్రప్రదేశ్‌లో సంఖ్యాబలంతో కాపులకు కొత్త శక్తి వచ్చింది. వారి డిమాండ్లు నిర్లక్ష్యం చేయడం పాలకులకు కష్టం. ఏదైనా సాధించదలిస్తే యిదే అదను.

ఇటువంటి సమయంలో గత 18 నెలలుగా మీరేం చేశారు? బాబుకైతే లక్ష సమస్యలు, కాపు సంక్షేమం తప్ప మీకు వేరే వ్యాపకమేముంది? ఊరూరా తిరిగి, వాడవాడలా కాపు సంఘాలు పెట్టవచ్చుగా, పెట్టారా? మీ డిమాండ్లు సమంజసమో కాదో ఎడ్యుకేట్ చేశారా? మీకు రిజర్వేషన్ యిస్తే మా మాటేమిటి? అని అడిగే బిసిలకు, ఓసిలకు ఎలా సమాధానం చెప్పాలో తర్ఫీదు యిచ్చారా? కాపుల్లో అనేక తెగలు, ప్రాంతీయ భేదాలు. ముఖ్యంగా యీ రోజు కోస్తా, రాయలసీమ, ఉత్తరాంధ్రల మధ్య ప్రాంతీయభేదాలు

పెరుగుతున్నాయి. వాటిని అధిగమిస్తూ కాపులను ఐక్యం చేసి ఒక శక్తిగా తీర్చిదిద్దవలసిన బాధ్యత చేపట్టకుండా వూరికి ముందు అన్నం తిననంటూ కూర్చుంటే సరిపోతుందా? గాంధీగారు దక్షిణాఫ్రికా నుంచి వస్తూనే నిరాహారదీక్ష అంటూ కూర్చున్నారా? ఒక పిలుపు యిస్తే దేశం నలుమూలలా స్పందన రగిలి, ప్రభుత్వం వణికేటంత సేవాదళాల్ని సమకూర్చుకుని అప్పుడు దీక్షకు కూర్చునేవారు. అందుకే ప్రభుత్వం ఏం చేయాలో తెలియక జుట్టు పీక్కునేది. తను ప్రారంభించిన దీక్ష సందర్భంగా దేశంలో ఏ మూలైనా సరే హింస చెలరేగితే గాంధీజీ వెంటనే దీక్ష మానేసేవారు. అందువలన ప్రభుత్వం ఆయనను తప్పుపట్టలేక పోయేది.

మరి మీరు? రాష్ట్రమంతటా నెట్‌వర్క్ ఏర్పరచుకోలేదు, ఒకవేళ మీరు అరెస్టయితే ఉద్యమం ఎలా ముందుకు తీసుకుని వెళ్లాలో కార్యాచరణ సిద్ధం చేయలేదు, మీ ఉద్యమవారసులెవరో ప్రకటించలేదు, కాపు గర్జన అంటూ సభకు పిలిచి హఠాత్తుగా అత్యంత నాటకీయంగా రాస్తా రోకో, రైల్ రోకో ప్రకటించారు. అది చివరకు విషాదాంత నాటకంగా ముగిసింది. పోలీసు స్టేషన్ దహనాలు అవీ జరిగినప్పుడు మీరు చింతించి దీక్ష ఆపలేదు, సరే, ఉద్యమం నా చేయి దాటిపోయింది అనైనా గ్రహించాలి కదా. ఆ హింస మీ ఉద్యమానికి చెడ్డపేరు తెచ్చిందన్న విషయం గ్రహించి కాస్త విరామం తర్వాత మొదలుపెట్టాలి కదా. ఇప్పుడు దీక్ష అంటారు, తలుపులు మూసేస్తారు, వైద్యుల్ని రానీయరు, సెటైర్లు వేస్తారు. సరే మీ వ్యక్తిగత శైలి అలాటిది, మీ యిష్టం. ఈ ధోరణి వలననే మీరు ఏకో నారాయణగా మిగిలిపోయారు. అందరూ దూరం నుంచే దణ్ణం పెట్టి వెళ్లిపోతారు. ఈ రోజు మీరు కాపుల నాయకుడిగా చూపుకుంటూ బాబుతో కయ్యం పెట్టుకుంటే నష్టం ఎవరికి? మీకు సంఘీభావం తెలిపే కాంగ్రెసు, వైకాపా ఏ ఉపకారమైనా చేయగలవా? బాబును బెల్లించి, బెదిరించి, లాలించి, అడలుగొట్టి పనులు సాధిస్తే కాపులకు మేలు చేసినవారవుతారు.

బాబును అడగాలంటే మీకు ప్రశ్నలే లేవా? కమిషన్ వేయడానికి 18 నెలలెందుకు పట్టింది? కమిషన్‌కు చైర్మన్ వేసి నెల్లాళ్లవుతోంది, సభ్యుల్ని వేయలేదేం? పని ప్రారంభింప చేయలేదేం? శంకుస్థాపనలకు, పుష్కరాలకు నిధులు కురుస్తున్న మీరు కాపు కార్పోరేషన్‌కు ఎందుకు రాల్చరు? పోనీ రాజధాని కోసం యిటికలమ్మినట్లుగా కార్పోరేషన్ నిధుల కోసం యిసుకో, సున్నమో, బాండ్లో అమ్మకానికి పెడితే, కాపుల్లో ధనికులో, కాపు సంక్షేమం కోరే యితరులో అవి కొంటారు కదా? – యిలా అడగవచ్చు. ఏ పనైనా ఓర్పుతో, నేర్పుతో సాధించాలి. తెరాస వాళ్లు అంటున్నారు – మా ఉద్యమం పుష్కరకాలం సాగింది, ఏ నాడైనా రైలు తగలబెట్టామా? కాపులకు ఆ మాత్రం ఓర్పు లేదా? అని. మీ ఉద్యమధోరణి కారణంగా కాపుల యిమేజికి, వారి ప్రయోజనాలకు విఘాతం కలుగుతోంది. మీ ప్రసంగాలతో రెచ్చగొట్టబడిన కాపు యువకులు ఆత్మహత్య చేసుకుంటే ఆ మేరకు మీరు వారికి, వారి కుటుంబాలకు ద్రోహం చేసినట్లే. కాపు రిజర్వేషన్ జటిలమైన సమస్య. ఇప్పట్లో తేలదు. 'మా ప్రయోజనాలకు విఘాతం కలగకుండా కాపులను బిసిల్లో ఎలా చేరుస్తారో 72 గంటల్లో మాకు వివరణ యివ్వండి' అంటూ బిసిలు బాబును అడుగుతున్నారు. ఆయన దగ్గర సమాధానం ఏముంది? మరో కమిషనో, కమిటీనో వేస్తాను అని తప్ప! 'కాపులకు కూడా రిజర్వేషన్ యిస్తే చిరంజీవి కొడుక్కి, ఆదికేశవులు నాయుడు మనుమడికి కూడా రిజర్వేషన్ సౌకర్యం వస్తుంది. ఇదెక్కడి సామాజిక న్యాయం?' అని అడిగే యితర కులాల యువతకు సమాధానం చెప్పడం కష్టం. దీనికి సమాజంలో అన్ని వర్గాల వారు కూర్చుని మేధోమథనం చేసి, ఒక పరిష్కారం కనిపెట్టాలి. రమణగారి భాషలో 'యిదంతా అర్రీబుర్రీగా తేలే యవ్వారం కాదు' అని మీరే కాపు యువతకు చెప్పి సంయమనంతో వుండమని చెప్పాలి. దానికి ముందు మీరు సంయమనంతో వుండి ముఖ్యమంత్రిని రెచ్చగొట్టి వ్యవహారం చెడగొట్టవద్దు. మీకు వచ్చే నష్టాన్ని మీరు భరించగలరు కానీ మీ తప్పుడు స్ట్రాటజీల కారణంగా తమ ప్రయోజనాలకు కలిగే నష్టాన్ని యితర కాపులు భరించలేరు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2016)**

**ఫిబ్రవరి 14, 15 ఎమ్బీయస్ : జైట్లీకి స్థానచలనం..?**

మోదీ కాబినెట్‌లో మార్పులు తప్పవని అప్పుడప్పుడు వార్తలు వస్తూంటాయి. ఈసారి కాస్త గట్టిగానే వస్తున్నాయి. మోదీ పనితీరు ప్రజలు ఆశించిన మేరకు లేదని సర్వేసర్వత్రా వినబడుతున్న విమర్శ. సర్వే ప్రకారం కూడా బిజెపికి 10% సీట్లు తక్కువ వస్తాయని అంచనా. ఢిల్లీ, బిహార్ అసెంబ్లీ ఎన్నికలు, గుజరాత్, మహారాష్ట్రలలో స్థానిక ఎన్నికలు, మధ్యప్రదేశ్‌లో ఉపయెన్నికలు – యిలా చాలా చోట్ల ఓటమి కూడా సంభవిస్తూ 2014 నాటి స్థాయి నుంచి మోదీ ప్రజాదరణ తగ్గుతూనే వస్తోందని నిరూపిస్తున్నాయి. పనితీరు మెరుగు పరచుకోకపోతే మర్యాద దక్కదని మోదీ కాబినెట్ సహచరులను హెచ్చరించినట్లు వార్త వచ్చింది. మరి కొద్ది నెలల్లో బిజెపికి అంతగా బలం లేని బెంగాల్, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరిలలో ఎన్నికలు రాబోతున్నాయి. వీటితో పాటు ఎన్నికలు జరగబోయే అసాంలోనే బిజెపికి కాస్త ఆశ వుంది. ఇవన్నీ కలిసి బిజెపి పని అయిపోయిందనే సందేశం యిస్తే చాలా ప్రమాదం. అందువలన మంత్రివర్గంలో మార్పులు తెచ్చి, యిమేజి పెంచుకోవాలని చూడడంలో ఆశ్చర్యం లేదు. సదానంద గౌడ (న్యాయశాఖ), రాధామోహన్ సింగ్ (వ్యవసాయం), మహేశ్ శర్మ(సాంస్కృతిక వ్యవహారాలు)ల పని తీరు బాగాలేదని వారిని మారుస్తారని పుకార్లున్నాయి. 75 ఏళ్లు దాటిన నజ్మా హెపాతుల్లా (మైనారిటీలు)ను గవర్నరుగా పంపుతారని, 75 దాటిన కల్‌రాజ్ మిశ్రాను కూడా తీసేద్దామనుకున్నా ఆయన యుపి బ్రాహ్మణుడు కావడం చేత, యుపి ఎన్నికల దృష్ట్యా కొనసాగిస్తున్నారని అంటున్నారు. అరుణ్ జైట్లీ (ఫైనాన్స్, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్), నిర్మలా సీతారామన్ (కామర్స్)ల పని తీరు ఆశించినదాని కంటె చాలా తక్కువగా వుందని

అందరూ నమ్ముతున్నారు. ఎకానమీ పుంజుకోలేదు, ఎగుమతులు తగ్గాయి, సెన్సెక్స్ పడిపోతోంది. అందువలన జైట్లీని మారుస్తారని కొందరు, అబ్బే ఆయన మోదీకి ఆత్మీయుడు కాబట్టి ఇన్ఫర్మేషన్ తీసేసి ఫైనాన్స్ మాత్రం కొనసాగిస్తారని కొందరు అంటున్నారు. కేవలం పనితీరు గురించే అయితే జైట్లీ బాధ్యతలు కుదించరు. ఆయనపై డిడిసిఎ తాలూకు అభియోగాలు కూడా వున్నాయి కాబట్టి ఆ అంశాన్నీ లెక్కలోకి వేస్తున్నారని అనుకోవాలి.

డిడిసిఎ (ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్)కు అరుణ్ జైట్లీ పధ్నాలుగేళ్లు (1999-2013) అధ్యక్షుడిగా వున్న కాలంలో ఆర్థిక నేరాలు జరిగాయని ఆరోపణ. వృత్తి రీత్యా లాయరైన జైట్లీకి, క్రికెట్‌కు సంబంధం ఏమిటని అడగకూడదు. యూరోప్, అమెరికా వంటి దేశాల్లో స్పోర్ట్స్ బాడీస్‌కు మాజీ క్రీడాకారులు అధ్యక్షులుగా వుంటారు. ఇండియాలో మాత్రం రాజకీయనాయకులు వుంటారు. వారికి ఆ ఆట వచ్చా రాదా అని ఎవరూ అడగరు. ఆ విధంగా జైట్లీ క్రికెటే కాదు, హాకీ బోర్డులోనూ పదవిలో వున్నాడు. నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా వుండగా గుజరాత్ క్రికెట్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా వున్నాడు. ఇప్పుడు అమిత్ షా వున్నాడు. బిజెపి యువనాయకుడు అనురాగ్ ఠాకూర్ హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్‌కు అధ్యక్షుడు. ఢిల్లీ బిజెపి నాయకుడు విజయ్ మల్‌హోత్రా ఇండియన్ ఆర్చరీ (విలువిద్య) అసోసియేషన్‌కు అధ్యక్షుడు. కాంగ్రెసు నాయకుడు రాజీవ్ శుక్లా బిసిసిఐలో చాలాకాలం పాటు ముఖ్యమైన పదవిలో వున్నాడు. దివంగత ప్రియరంజన్ దాస్‌మున్షీ ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్‌కు అధ్యక్షుడిగా వుండేవాడు. ఇప్పుడు అతని స్థానంలో ఎన్‌సిపి లీడరు ప్రఫుల్ పటేల్ వచ్చాడు. మరో ఎన్‌సిపి నాయకుడు శరద్ పవార్ ముంబయి క్రికెట్ అసోసియేషన్‌కు చాలాకాలంగా అధ్యక్షుడిగా వున్నాడు. వీళ్లందరికీ ఆ యా ఆటల్లో ప్రావీణ్యం కాదు కదా, ప్రవేశం కూడా వుండి వుండదు. అన్నిటి కంటె డబ్బు, పలుకుబడి దండిగా వున్నది క్రికెట్ ఆట. అందుకే వసుంధరా రాజె లలిత్ మోదీ ద్వారా రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్‌ను కైవసం చేసుకుంది.

జైట్లీ హయాంలో డిడిసిఎలో అక్రమాలు జరిగాయని చాలా స్పష్టంగా తెలుస్తోంది. అయితే వాటివలన జైట్లీ ఆర్థికంగా లాభపడ్డాడా లేదా అన్నది యిప్పుడే చెప్పలేం. ఆయన కింద పనిచేసిన వారందరూ అవినీతిపరులే, వారిని ఆయన వెనకేసుకుని వచ్చాడు. మరి ఆ కాలంలో మొదటి ఐదేళ్లు ఎన్‌డిఏ అధికారంలో వున్నా, తర్వాతి తొమ్మిదేళ్లు యుపిఏ అధికారంలో వుంది కదా వాళ్లు యితనిపై ఏ చర్యా తీసుకోలేదేం? అనే ప్రశ్నకు సమాధానం లేదు. స్పోర్ట్స్ పేరు చెప్పి మనం తినేసినదానితో పోలిస్తే యిదెంత, దీని సంగతి ఎత్తితే మన లొసుగులు బయటపడతాయి అని యుపిఏ నాయకులు వూరుకున్నారేమో తెలియదు. నిజానికి యిది బయటకు రావడానికి కారకుడు బిజెపి ఎంపీ అయిన కీర్తి ఆజాద్. అతను క్రికెట్‌లోంచి రాజకీయాల్లోకి వచ్చేశాడనుకోకూడదు. రాజకీయాలు అతని రక్తంలోనే వున్నాయి. అతని తండ్రి భగవత్ ఝా ఆజాద్ బిహార్‌కు ముఖ్యమంత్రిగా చేసిన కాంగ్రెసు నాయకుడు. ఇతను మాత్రం బిజెపి ద్వారానే ఢిల్లీలో ఎమ్మెల్యే అయ్యాడు. బిహార్‌లోని దర్భంగా నుంచి రెండు సార్లు ఎంపీగా ఎన్నికయ్యాడు. కొంతమంది క్రికెట్ ఆటగాళ్లు జైట్లీ డిడిసిఎను జైట్లీ నిర్వహిస్తున్న తీరుపై ధ్వజం ఎత్తుతూనే వున్నారు. వారిలో ఆజాద్ కూడా ఒకడు కావడం చేత జైట్లీ అతనికి సీటు రాకుండా చేయాలని ప్రయత్నించి విఫలమై, అతని భార్య పూనమ్ ఆజాద్‌కు ఢిల్లీ ఎసెంబ్లీ ఎన్నికలలో టిక్కెట్టు రాకుండా చేయడంలో మాత్రం సఫలుడయ్యాడని అంటారు. 2009-14 మధ్య జైట్లీ రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా వుండగా ఆజాద్ సుష్మా స్వరాజ్‌కు సన్నిహితంగా వుండేవాడు. ప్రస్తుతం మోదీకి జైట్లీ ఆత్మీయుడిగా వుండడంతో సుష్మ ఎందుకైనా మంచిదని, ఆజాద్‌ను రక్షించే ప్రయత్నం మానుకుని దూరంగా వుంది.

2015 జులైలో ఆజాద్ పార్లమెంటులో డిడిసిఎ వ్యవహారాలపై విచారణ ఎలా సాగుతోందని ప్రశ్న సంధించాడు. దాన్ని పార్లమెంటరీ వ్యవహారాల శాఖకు పంపారు. అక్కణ్నుంచి హెూం శాఖకు వెళ్లింది, వాళ్లు స్పోర్ట్స్ శాఖకు పంపారు. వాళ్లు ఏం చేయాలో తెలియక కాబోలు ఢిల్లీ ప్రభుత్వానికి పంపి తగిన చర్యలు తీసుకోమని అన్నారు. బిజెపిపై కత్తులు నూరుతున్న అరవింద్‌కు యిది అంది వచ్చిన అవకాశమైంది. వెంటనే విజిలెన్సు డిపార్టుమెంటులో ప్రిన్సిపల్ సెక్రటరీగా వున్న చేతన్ సంఘీ అధ్యక్షుడిగా, పుణ్యా శ్రీవాస్తవ, రాహుల్ మెహ్రాలు సభ్యులుగా అక్టోబరులో ఒక కమిటీ వేసింది. ముగ్గురూ ఐయేయస్‌లే. వారు నవంబరులో తమ నివేదిక యిచ్చారు. సంఘీ కమిటీ జైట్లీ పేరు ప్రస్తావించకపోయినా అతని హయాంలో ఆర్థికపరమైన అక్రమాలు జరిగాయని నిర్ధారించింది. డిడిసిఎని వెంటనే సస్పెండ్ చేసి, విధివిధానాలను సరిదిద్దాలని (స్ట్రీమ్‌లైన్) సిఫార్సు చేసింది. అది జరిగేలోపు క్రికెట్‌ను వృత్తిగా స్వీకరించిన క్రీడాకారులు క్రికెట్ వ్యవహారాలను నిర్వహించాలంది. వెంటనే కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ వేసి లోతుగా పరిశోధించాలని అంది. డిడిసిఎ ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభుత్వసాయం పొందుతోంది కాబట్టి దాన్ని ఆర్‌టిఐ (సమాచార హక్కు) కింద తేవాలంది, అంతేకాదు, డిడిసిఎ ఆఫీసు బేరర్స్‌ను అవినీతి నిరోధక చట్టం పరిధిలోకి తేవాలంది. వీటితో బాటు స్పోర్ట్స్ బాడీలలో రాజకీయనాయకులను వదిలించుకోవాలని. క్రికెట్ ఆటగాళ్లే దాని వ్యవహారాలు చూసుకోవాలి అని స్పష్టంగా చెప్పింది.

డిడిసిఎ యిప్పటికే సిబిఐ విచారణ ఎదుర్కుంటోంది. డిడిసిఎ అంతర్గత ఆడిట్ లోపభూయిష్టంగా వుంది. దానిపై ప్రశ్నలు సంధిస్తూ నవంబరు 26 న సిబిఐ ప్రిలిమినరీ ఎంక్వయిరీ (పిఇ) లెటర్ పంపింది. డిడిసిఎ జవాబివ్వలేదు. 2006-2012 కాలంలో డిడిసిఎ కార్యకలాపాల్లో 62 రకరకాల అక్రమాలు జరిగాయని సీరియస్ ఫ్రాడ్ యిన్వెస్టిగేషన్ ఆఫీసు కూడా కనుగొంది. నిధుల గోల్‌మాల్, పన్నులు కట్టకపోవడం, కీలక సమావేశాల్లో దొంగ ఓట్లు వేయడం, టెండర్లు పిలవకుండా పనులు అప్పగించడం, సభ్యత్వం విషయంలో, టిక్కెట్ల అమ్మకాల విషయంలో అవినీతికి పాల్పడడం... యిలా చాలా వున్నాయి. ఫిరోజ్ షా కోట్లా స్టేడియంలో

కొంతభాగం కట్టడానికి రూ. 24.26 కోట్లు అవుతుందని అంచనా వేసి పని ప్రారంభించి చివరకు రూ. 114 కోట్లు ఖర్చు పెట్టారు. దాని మరమ్మత్తులకై టెండర్లు పిలవకుండా ఆశ్రితులైన కంట్రాక్టర్లకు రూ.57 కోట్లు యిచ్చి దానికి సరైన లెక్కలు చూపలేదని సంఘీ కమిటీ చెప్పింది.

విధాన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, శ్రీరామ్ ట్రేడ్‌కామ్, మేపల్ ఇన్‌ఫ్రా రియాల్టీ అనే మూడు కంపెనీలకు డిడిసిఎ రూ.1.55 కోట్లు అప్పిచ్చినట్లు చూపారు. 'చారిటబుల్ కంపెనీగా ఏర్పడిన డిడిసిఎ వాణిజ్య అవసరాలకై అప్పెలా యిచ్చింది?' అని అడిగితే యిప్పటి డిడిసిఎ అధ్యక్షుడు ఎస్‌పి బన్సాల్ "ఇవన్నీ యిన్వెస్ట్‌మెంట్స్. వడ్డీ వస్తుంది కదాని వాటిలో పెట్టాం." అన్నారు. వడ్డీ కోసం బ్యాంకు డిపాజిట్లలో పెట్టాలి కానీ యిలా అప్పులిస్తే రేపు ఆ కంపెనీలు దివాళా తీస్తే డిడిసిఏ పరిస్థితి ఏమిటి? డిడిసిఎ భారీ చెల్లింపులు చేసిన 9 కంపెనీలకు ఒకటే రిజిస్టర్డ్ ఆఫీసు, కామన్ డైరక్టర్లు మాత్రమే కాదు, ఒకటే ఈమెయిల్ ఐడీ కూడా. సంబంధిత అధికారులు ఆథరైజ్ చేయనిదే డబ్బులు చెల్లించకూడదు. అలాటి ఆథరైజేషన్ లేకుండానే సేవలందించారన్న పేరుపై లాయర్లకు, ఆడిటర్లకు, ఎకౌంటెంట్లకు విపరీతంగా డబ్బులు చెల్లించేశారు. వారందించిన సేవలేమిటని అడిగితే జవాబు రావటం లేదు. కొంతమందికి రెండేసి సార్లు డబ్బిచ్చారు. ఇలాటి డూప్లికేటు పేమెంట్స్ కోట్లలో వున్నాయని సంఘీ కమిటీ అంది. కమిటీ సిఫార్సుల మేరకు వెంటనే ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం డిడిసిఎకు జైట్లీ అధ్యక్షుడిగా వున్న 1999-2013 కాలంలో జరిగిన ఆర్థిక అక్రమాలపై విచారించడానికి ప్రసిద్ధ లాయరు గోపాల సుబ్రమణియన్ అధ్యక్షతన ఏకసభ్య కమిటీ నియమించింది.

ఇవన్నీ జైట్లీని బాధించాయి. ఇప్పటిదాకా తనపై అవినీతి ఆరోపణలు లేవు. కానీ తను రక్షిస్తూ వచ్చిన వారి కారణంగా తన పేరు మాసిపోతుందన్న భయం పట్టుకుంది. డిడిసిఏ ఫైళ్లను చేజిక్కించుకోవడానికి కాబోలు ఒక పథకం వేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రికి ప్రిన్సిపల్ సెక్రటరీగా పని చేస్తున్న, అరవింద్‌కు ఐఐటీలో క్లాస్‌మేట్ ఐన రాజేంద్ర కుమార్‌పై సిబిఐ విచారణ ప్రారంభించారు. అతనిపై వున్న అవినీతి ఆరోపణ ఏమిటంటే 2007లో ఎండీవర్ సిస్టమ్స్ అనే సంస్థను ప్రమోట్ చేసి అధికారం దుర్వినియోగం చేసి దానికి రూ. 9.50 కోట్ల టెండర్లు కట్టబెట్టాడట. దానికి గాను ఆ కంపెనీ నుంచి కమిషన్లు తిన్నాడట. ఈ ఆరోపణపై సిబిఐ విచారణ చేపడితే రాజేంద్ర కుమార్‌ను తమ ఆఫీసుకి పిలిపించి ప్రశ్నించవచ్చు. రాజేంద్ర కుమార్ ఉన్నతస్థానంలో వుండడమే కాక 2007లో 'ప్రైమ్ మినిస్టర్స్ ఎవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ యిన్ పబ్లిక్ ఎడ్మినిస్ట్రేషన్' పొంది వున్నాడు. అలాటి వ్యక్తిపై యింట్లో, ఆఫీసులో డిసెంబరు 15 న దాడి చేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అనుమతి తీసుకోలేదు. ఇంట్లో వాళ్లకు దొరికిందేమిట్రా అంటే సీల్డ్ బాటిల్స్‌లో 11.75 లీటర్ల లిక్కర్. తెరిచి వున్న మూడు సీసాల్లో 2.25 లీటర్ల లిక్కర్. మొత్తం మీద 14 లీటర్లు. ఢిల్లీ రూల్సు ప్రకారం 25 సంఎలు దాటిన వ్యక్తి వద్ద 9 లీటర్ల లిక్కర్ వుండవచ్చు. ఆ విధంగా పరిమితి కంటె ఆయన వద్ద ఎక్కువుంది అనబోయారు ఎక్సయిజ్ వారు. కానీ కుమార్, అతని భార్య యిద్దరూ 25 సంఎలు పై బడినవారే కాబట్టి యిద్దరికీ కలిపి 18 లీటర్ల వరకు పరిమితి వుంది. కొండను తవ్వి ఎలకను పట్టారని సామెత. ఇక్కడ కొంప తవ్వి సారా పట్టినట్లుంది. ఇక ఆఫీసు విషయానికి వస్తే రాజేంద్ర కుమార్ ఆఫీసు సోదా సాకు చెప్పి అదే ఫ్లోర్‌లో వున్న ముఖ్యమంత్రి ఆఫీసు కూడా రోజంతా మూసేసి కొన్ని ఫైళ్లు తీసుకుపోయారు. ఇదెక్కడి అన్యాయం అంటే ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్‌లలో రాజేంద్ర కుమార్‌కు సంబంధించిన 14 చోట్ల చేశాం, వాటిల్లో యిదొకటి అంటోంది సిబిఐ. దీంతో గంగవెర్రులెత్తి పోయిన అరవింద్ ఏకంగా మోదీపై విరుచుకుపడి నానామాటలూ అన్నాడు.

ఎవరేమనుకున్నా జైట్లీ యింతటితో ఆగలేదు. డిడిసిఎ అక్రమాలు బయటపెట్టిన కమిటీకి అధ్యక్షత వహించిన చేతన్ సంఘీపై ఎసిబి చేత ఎఫ్‌ఐఆర్ వేయించాడు. 2011-12 మధ్య ఢిల్లీ స్టేట్ ఇండస్ట్రియల్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్‌కు అతను చైర్మన్‌గా వున్న కాలంలో 350 ఇండస్ట్రియల్ ప్లాట్లను లీజ్‌హోల్డ్ నుంచి ఫ్రీ హోల్డ్‌గా మార్చడం జరిగింది. దానిలో సంఘీకి కమిషన్లు ముట్టాయని ఎసిబి యిప్పుడు అనుమానిస్తోంది. ఈ కేసు వేయగానే సంఘీ వణికాడు. తన రిపోర్టులో ఒక ముఖ్యమైన వ్యక్తి (జైట్లీ అని తాత్పర్యం) పేరు ప్రస్తావించాలని తనపై ఒత్తిడి వచ్చిందని (ఒత్తిడి చేసినవాడు అరవింద్ అని తాత్పర్యం), అందువలన తనను ఢిల్లీ సర్వీసు నుంచి మార్పించి, కేంద్ర సర్వీసులోకి మళ్లీ తీసుకోవాలని హెూం శాఖకు లేఖ రాశాడు. హెూం శాఖ ఆ అభ్యర్థనను పరిశీలిస్తోంది. కమిటీలో యితర సభ్యులు యిలాటి ఫిర్యాదు చేయలేదు. సంఘీని ఆ విధంగా లొంగదీశారు.

ఇక రాజేంద్ర కుమార్‌పై యిప్పటివరకు సిబిఐ కచ్చితమైన ఆరోపణలు చేయలేదు. చూడబోతే యిదంతా డిడిసిఎ ఫైళ్లు కామాపు చేయడానికే అనే సందేహం అందరిలో కలిగింది. అందరూ జైట్లీవైపు వేలెత్తి చూపుతున్నారు. అతనికి ప్రశ్నలు సంధించి సిడిలు విడుదల చేసిన కీర్తి ఆజాద్‌కు పార్టీ సమాధానం చెప్పకపోగా డిసెంబరు 23 న అతన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేసి తను జైట్లీ వైపే వున్నానని చూపుకుంది. ఇదే సమయంలో హాకీ ఇండియాకు చీఫ్‌గా పని చేసిన ప్రఖ్యాత పోలీసు అధికారి కెపిఎస్ గిల్ జైట్లీపై మరో ఆరోపణ చేశారు. హాకీ ఇండియా లీగ్‌కు సలహాదారుగా వున్న తన పదవి వుపయోగించి జైట్లీ తన కూతురు సోనాలీ జైట్లీని హాకీ గవర్నింగ్ బాడీకి లీగల్ కౌన్సిల్‌గా నియమించమని ఒత్తిడి చేశాడట. బిషన్ సింగ్ బేదీ వంటి క్రికెట్ ఆటగాళ్లు కూడా జైట్లీపై విరుచుకు పడుతున్నారు. కానీ జైట్లీ వెనక్కి తగ్గటం లేదు. తనూ, తన కుటుంబసభ్యులు యీ లావాదేవీల వలన లాభపడ్డారంటూ 2015 డిసెంబరులో తనపై ఆప్ నాయకులు చేసిన వ్యాఖ్యలపై కేజ్రీవాల్‌పై, మరో ఐదుగురు ఆప్ లీడర్లపై పరువునష్టం దావా వేశాడు. ఫిబ్రవరి 3 న ఢిల్లీలో చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు జైట్లీ స్టేటుమెంటును రికార్డు చేశాడు. తరువాతి వాయిదా ఫిబ్రవరి 15కి పడింది. ఏది ఏమైనా జైట్లీ ప్రవర్తన సందేహాస్పదంగా వుంది. డిడిసిఎలో అక్రమాలు జరిగాయన్నది వాస్తవం. అతని పదవికాలంలో

జనరల్ సెక్రటరీగా, అతని తర్వాత అధ్యక్షుడిగా వున్న స్నేహ ప్రకాశ్ బన్సాల్ నుండి యిప్పటికే అధికారాలు లాగేసుకున్నారు. ఇంకా ఎందరో అధికారులపై, ఉద్యోగులపై విచారణ విచారణ సాగుతోంది. మన్‌మోహన్ సింగ్ లాగే అరుణ్ జైట్లీ స్వయంగా డబ్బు తినకపోవచ్చు కానీ తన సహచరులను తిననిచ్చాడన్నది స్పష్టంగా తెలుస్తోంది. మన్‌మోహన్ లాగే అరుణ్ జైట్లీ ప్రతిష్ఠ కూడా మసకబారింది. అతనికి ఏదో ఒక విధంగా స్థానచలనం కలిగించకపోతే పార్టీకీ ఆ మసి అంటుతుందనే భయం వుంది కాబట్టి జైట్లీ మంత్రిత్వ శాఖ మారవచ్చనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. **ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2016)**

**ఫిబ్రవరి 17 ఎమ్బీయస్ : కుట్ర తేటతెల్లమౌతోంది**

ఎర్రబెల్లి దయాకరరావు పార్టీ ఫిరాయింపు వినగానే మొదటి తట్టిన కాప్షన్ – 'యూ టూ బ్రూటస్..' అని! నమ్మకద్రోహం చేసినవారిని వెంటనే అలా అనడం పరిపాటి. కానీ అది యిక్కడ అన్వయించదు. ఎందుకంటే బ్రూటస్‌కు ఒక ఫిలసఫీ వుంది. సీజర్ నియంతగా మారుతున్నాడు కాబట్టి అతన్ని అంతమొందించి తీరాలి అని అతని మిత్రులే, సహచరులే నిశ్చయించుకుని అతన్ని పొడిచి చంపారు. సీజర్ వ్యక్తిగతంగా స్నేహితుడైనా అతని పోకడతో వ్యతిరేకించి బ్రూటస్ ఎదురు తిరిగాడు. చివరి కత్తిపోటు అతనిదే. ఇది ఎదురు చూడని సీజర్ 'నువ్వూనా, బ్రూటస్!' అని నివ్వెరపోయాడు. ఇక్కడ ఎర్రబెల్లికి బాబుతో సిద్ధాంతవైరుధ్యం ఏమీ లేదు. 'టిడిపి నాకెంతో యిచ్చింది, తెలంగాణ హితం కోరి తెరాసలో చేరుతున్నాను. బాబు అంటే గౌరవం వుంది. టిడిపి కార్యకర్తలు అర్థం చేసుకోవాలి' అంటూ ముకుళిత హస్తాలతో, సజల నయనాలతో యివాళ స్టేటుమెంటు యిచ్చారు. చూస్తూ వుండండి, వరంగల్లులోనో, నిజాం గ్రౌండ్సులోనో త్వరలో జరగబోయే సభలో ఆయన టోన్ ఎలా మారుతుందో! బాబుపై ఎన్ని నిందలు వేస్తాడో చెవులారా విందురుగాని. తెలంగాణ బాగు పడాలంటే తెరాసలోనే చేరాలా? తెరాస యివాళ పుట్టిన పార్టీనా? పుష్కరం కింద పుట్టింది. వరంగల్లు, కరీంనగర్ జిల్లాలలో తెరాస మొదటినుంచీ బలంగా వుంది. స్థానిక కార్యకర్తలు తెరాసలో చేరాలని పట్టుబడుతూనే వుండి వుంటారు. అయినా చేరలేదే!? ఇవాళ గుర్తుకు వచ్చిందా, కెసియార్ నాయకత్వమే రాష్ట్రానికి అవసరమని..? ఇదంతా నాటకం.

నా ఉద్దేశంలో కాంగ్రెసు నుండి, టిడిపి నుండి యిప్పుడు తెరాసలోకి జరుగుతున్న ఫిరాయింపులు ఎప్పుడో ప్లాన్ చేసినవి. అంతా ఒక పథకం ప్రకారమే జరుగుతోంది. నా ఊహ ప్రకారం – యిది కేవలం వూహ మాత్రమే, నిజానిజాలు ఆ యా నాయకులకు, దేవుడికి తెలియాలి – కెసియార్ తెరాస పెట్టిన తర్వాత యీ నాయకులందరందరినీ కదలేసి వుంటారు. 'ఉమ్మడి రాష్ట్రంలో మీరు నాయకులుగా ఎదగలేరు. ఆంధ్ర నాయకుల పలుకుబడి ముందు మీరు నిలవలేరు. టిడిపి వున్నంతకాలం బాబే ముఖ్యమంత్రి. కాంగ్రెసు అధికారంలోకి వస్తే మూడు ప్రాంతాల్లో ఎవరైనా కావచ్చు. వాటాల్లో తెలంగాణాకు ఎంత వస్తుందో, కులాల లెక్కల్లో మీకు మంత్రి పదవైనా దక్కుతుందో లేదో తెలియదు. రాష్ట్రాన్ని చీలిస్తేనే మీకు పదవులు వస్తాయి. లేకపోతే చిన్న పదవుల్లోనే కొట్టుమిట్టులాడాలి. ఆలోచించుకోండి' అని వుంటారు. 'సరే, అయితే పార్టీలో చేరమంటారా?' అంటే 'ఇప్పుడే వద్దు, మీరు బయటకు వచ్చేస్తే మీ స్థానంలో మరో నాయకుణ్ని ఆ పార్టీ తయారు చేసుకుంటుంది. అందువలన మీరు మీ పార్టీలోనే వుంటూ నాపై నిప్పులు కక్కుతూ, మీ నాయకుణ్ని ఏమారుస్తూ వుండండి.' అని చెప్పి వుంటారు.

'అలా అయితే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడడం ఎలా? మాకు పదవులు దక్కడం ఎలా?' – ఈ ప్రశ్న కాంగ్రెసు నాయకులు, టిడిపి నాయకులు యిద్దరూ వేసి వుంటారు. ఎందుకంటే కాంగ్రెసు 1969, 1972 వేర్పాటు వుద్యమాలను అణిచివేసింది. దేశంలో తలెత్తిన అనేక ప్రత్యేక ఉద్యమాలకు స్పందించటం లేదు. ఢిల్లీ కాంగ్రెసు నాయకులతో ఆంధ్ర కాంగ్రెసు నాయకులకు దోస్తీ ఎక్కువ. వ్యాపారబంధాలు ఎక్కువ. విభజనకు కాంగ్రెసు ఒప్పుకునే అవకాశాలు బహు తక్కువ. ఇక టిడిపి – తెలుగుజాతి ఐక్యత, ఆత్మగౌరవం నినాదాలపై ఏర్పడినది. నాయకత్వం ఆంధ్రులదైనా తెలంగాణలో పటిష్టమైన పార్టీ నిర్మాణం కలది. వాళ్లెందుకు విభజనకు అంగీకరిస్తారు? 'ఇక్కడే మీ చాతుర్యం చూపించాలి. తెలంగాణ ప్రజలందరూ ప్రత్యేక రాష్ట్రం కోరుతున్నారని మీ అధినాయకత్వానికి చెప్పి వాళ్ల మైండ్‌సెట్ మార్చండి. లేకపోతే పార్టీ విడిచి పెట్టవలసిన అవసరం వస్తుందని బెదిరించండి. మీ ఒత్తిడికి లొంగి తెలంగాణకు అనుకూలంగా తీర్మానం చేసేట్లా చూడండి.' అని కెసియార్ ఉపాయం చెప్పి వుంటారు. ఇది టిడిపికి వర్తింప చేస్తూ కాంగ్రెసు వాళ్లతో 'రాష్ట్రం యిస్తే నేను మీ పార్టీలో చేరతానని, నన్ను పట్టుకుని వచ్చి ఆమె కాళ్ల దగ్గర పడేస్తానని మీరు సోనియాకు నమ్మబలకండి. నేనూ అప్పుడప్పుడు బ్లో హాట్, బ్లో కోల్డ్‌గా మాట్లాడుతూంటాను. నేను టిడిపిలోంచి వచ్చేసి పార్టీ పెట్టాను కాబట్టి, దానిలో మళ్లీ చేరతానంటే నమ్మరు. కాంగ్రెసులో చేరి, టిడిపి భరతం పడతానని సోనియా, ఆమె సుపుత్రుడు నమ్ముతారు.' అని చెప్పి వుంటారు.

ఆ స్కీము ప్రకారమే ఎర్రబెల్లి, కడియం యిత్యాదులు తెలంగాణకు అనుకూలంగా లేఖ యివ్వకపోతే రాష్ట్రంలో కొంప మునిగిపోతుందని బాబును ఊదరగొట్టేశారు. ఆయన స్వతహాగా సమైక్యవాది అయినా, వీళ్ల బోధనలకు లొంగారు. ఆంధ్ర నాయకులందరూ ఠాఠ్ వీల్లేదన్నారు. బాబు ఎర్రన్నాయుడు పేర కమిటీ వేసి, ప్రజాభిప్రాయ సేకరణ అంటూ ఒక తంతు నిర్వహించి (ఎవర్నీ అడగలేదని ఎర్రన్నాయుడే తర్వాతి రోజుల్లో చెప్పారు) లేఖ యిచ్చేశారు. ఆంధ్ర టిడిపి నాయకులందరూ బహిరంగంగానే టీవీ చర్చల్లో, సభావేదికలపై 'మేం సమైక్యవాదులమే, పార్టీ ప్రయోజనాలను దృష్ట్యా నాయకుడి మాటను గౌరవిస్తున్నాం' అని పదేపదే చెప్పుకున్నారు. ఈ నాడు

పార్టీయే తుడిచిపెట్టుకుపోతోంది. మిగిలిన అడుగూబొడుగూ కూడా ఎంతకాలం వుంటుందో తెలియదు. ఒకరి తర్వాత మరొకరు తమ మారువేషాలు చాలించి నిజరూపాల్లో దర్శనమిస్తున్నారు. కడియంపై మొన్నటిదాకా కారాలు మిరియాలు నూరిన ఎర్రబెల్లి యీ రోజు ఆయన పక్కనే చేరారు. ఎర్రబెల్లిపై వైరం ప్రదర్శించి, కెసియార్‌పై ఎన్నో దుర్భాషలాడిన మోత్కుపల్లి నర్సింహులు కూడా తెరాసలో చేరిన రోజున వీళ్ల నాటకం మనకు పూర్తిగా అర్థమవుతుంది. ఎర్రబెల్లి వంటి వారు పార్టీలో వుంటూనే నాయకులను బయటకు పంపేస్తూ, టిడిపిని బలహీనపరుస్తూ, చివరకు తాము పైకి ఎక్కివచ్చిన నిచ్చెనను తన్నేసి, ముసుగులు తీసేస్తున్నారు.

ఇక కాంగ్రెసు విషయానికి వస్తే తెలంగాణ యిస్తే చాలు, కెసియార్ మన పార్టీలో చేరతాడు అంటూ నమ్మబలికి సోనియాను ముంచిన వారందరూ కేశవరావుతో సహా పలు నాయకులు తెరాసలో చేరి పదవులు అలంకరిస్తున్నారు. జానారెడ్డిని చూసి నేర్చుకోవాలి, పార్టీలోనే వుంటూ గోతులెలా తీయాలో! తెలంగాణ యిచ్చి కాంగ్రెసు అటూయిటూ తిరుక్షవరం చేసుకుంది. తెలంగాణ యివ్వాలని లేఖ యిచ్చి టిడిపి సగం గుండు కొట్టించుకుంది. తెలంగాణలో పార్టీ తుడిచిపెట్టుకుపోతోంది. ఈ లీడర్లందరూ ముందే పోయి వుంటే యీ పాటికి వారి స్థానంలో కొందరు యువకులనైనా తయారుచేసుకునే వారు. వీళ్లను నమ్మడంలో బాబు తెలివితక్కువతనం బయటపడుతోంది. అపర చాణక్యుడిగా ఒకప్పుడు పేరు తెచ్చుకున్న బాబుకు 'అతని కంటె ఘనుడు ఆచంట మల్లన' రూపంలో కెసియార్ ఎదురయ్యాడు. తెలంగాణలో టిడిపి కున్న గుడ్‌విల్, నిర్మాణవ్యవస్థ చాలా గొప్పది. ఓర్పుతో, ఓపికతో, పట్టుదలతో పార్టీని పునరుజ్జీవింప చేసుకోవచ్చు. బాబు ప్రతిపక్షంలో వుంటే తీరిక వుండేది. కానీ ఆయన అనేక సమస్యలతో మునిగి తేలే కొత్త రాష్ట్రానికి ముఖ్యమంత్రి. వయసు కూడా ఆయన పక్షాన లేదు. ఆయన ఎవరికైనా బాధ్యత అప్పగించి, స్వేచ్ఛ నివ్వాలి. అప్పుడే పార్టీ మనగలుగుతుంది. ఎన్టీయార్ సమైక్యవాదాన్ని వదిలిపెట్టి తత్కాల రాజకీయాల కోసం సిద్ధాంతాలను బలిపెట్టినందుకు బాబు పశ్చాత్తాపపడుతూండాలి.

నేను పైన వూహించిన సినారియో తప్పు అని వాదించేవాళ్లు యింకోలా ఎలా జరిగి వుంటుందో చెప్పాలి. ఎందుకంటే తెలంగాణలో జరుగుతున్న ఫిరాయింపులకు అర్థం, పర్థం లేకుండా పోయింది. ఏ పార్టీకైనా జయాపజయాలు తప్పవు. ఓడిపోయినంత మాత్రాన గెలిచిన పార్టీలోకి దుమికేయరు. అదే అయితే ఈ ఎర్రబెల్లి, కడియం, నాగం వీళ్లందరూ 2004లోనే కాంగ్రెసులోకి దుమికేయాల్సింది. 1994లో కాంగ్రెసు వాళ్లందరూ టిడిపిలోకి జంప్ చేసి వుండాల్సింది. అప్పుడు జరగని ఫిరాయింపులు యిప్పుడే జరగడమేం? ఇదంతా కోవర్టు వ్యవహారం. శత్రుకూటమిలో తన వాడిని నియమించుకుని వారిని తప్పుదోవ పట్టించడం. ఈ టెక్నిక్కు యిప్పటిది కాదు. పంచతంత్రంలోనే గ్రంథస్తమైంది. మూడో తంత్రం, కాక-ఉలూకీయం చదవండి. గుడ్లగూబలను జయించలేక కాకులు ఒక పథకం వేస్తాయి. ఒక ముసలి కాకిని గాయపరచి, ఎక్కడికో వెళ్లిపోతాయి. ఆ ముసలి కాకి గుడ్లగూబలు వచ్చినపుడు 'మీతో సఖ్యంగా వుండమని సలహా చెప్పినందుకు వాళ్లు హింసించారు' అని చెప్పి వాపోతుంది. గుడ్లగూబలు సంతోషించి దాన్ని తమ స్థావరంలోకి తీసుకెళ్లి తిండి పెట్టి పోషిస్తాయి. స్థావరం ఆనుపానులు బాగా తెలుసుకున్నాక, ఆ ముసలికాకి తన కాకులబృందాన్ని తీసుకుని వచ్చి గుడ్లగూబల స్థావరాన్ని కాల్చివేస్తుంది. కెసియార్ ఎర్రబెల్లి వంటి వారిని గాయపరచి శత్రుస్థావరానికి పంపలేదు. అక్కడే వుండి, నాతో వైరం నటిస్తూ మీ రాజు బుర్ర చెడగొట్టు అన్నారు. విభీషణుడు కోవర్టు పని చేసి బంగారు లంకను ఏలుకున్నాడు. బంగారు నాణాలకు ఆశపడి గోల్కొండ కోట గుమ్మం తెలుపు తెరిచి ఔరంగజేబును రప్పించేసినవారు యీ గడ్డమీదే పుట్టారు. వారసత్వం వూరికే పోతుందా? **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2016)**

**ఫిబ్రవరి 20 వీక్లీకై** **ఎమ్బీయస్ : ఇమేజ్ ఛేంజోవర్**

నాయకుడనేవాడెప్పుడూ సహచరుల, కార్యకర్తల, అనుయాయుల నమ్మకాన్ని నిలుపుకోవాలి. ఈయన్ని నమ్ముకుంటే యివాళ కాకపోయినా రేపైనా గట్టెక్కిస్తాడన్న విశ్వాసం వుంటేనే కష్టకాలంలో సైతం అంటిపెట్టుకుని వుంటారు. ఈ సూత్రం రాజకీయ నాయకులకే కాదు, కార్పోరేట్ అధిపతులకూ వర్తిస్తుంది. కంపెనీ ఛైర్మన్ లేదా సిఇఓ ఆరోగ్యంగా, చురుకుగా, సమయస్ఫూర్తితో పనిచేస్తూ, పాలకులతో సఖ్యంగా వున్నాడన్న అనిపిస్తేనే ఆ కంపెనీలో సమర్థులు నిలుస్తారు. లేదనిపించినా, సిఇఓ అనారోగ్యంతో బాధపడుతున్నాడన్నా, ఏవైనా కేసుల్లో యిరుక్కున్నాడన్నా కంపెనీ షేరు వాల్యూ సైతం పడిపోతుంది. రాజరికం కాలం నుండి వస్తున్నదే యిది. రష్యాలాటి పత్రికా స్వేచ్ఛ లేని దేశాల్లో అధినేత జబ్బుపడినా బయటకు పొక్కనిచ్చేవారు కారు, పార్టీలో తిరుగుబాటు వస్తుందేమోనన్న భయంతో!

ఇవి అన్ని దేశాల్లోనూ వున్న విషయమే కానీ, మన దేశంలో జ్యోతిష్యం, యితర మతవిషయాలపై గురి జాస్తి. ఫలానా పార్టీ నాయకుడికి వచ్చే ఏడాది ప్రాణగండం వుందట, పదవీభ్రష్టత్వం వుందట, జైలుపాలు అవుతాడట అని వార్తలు వస్తే ఆ పార్టీని విడిచిపెట్టడానికే అందరూ చూస్తారు. అందుకే నాయకులెవ్వరూ తమ జాతకాలను బయటకు పొక్కనివ్వరు. జీవితమన్నాక ఎగుడుదిగుళ్లు తప్పవు. కానీ వచ్చే ఎన్నికల్లో ఫలానా నాయకుడికి ఓటమి తప్పదు అని జాతకచక్రం చూసి ఓ పేరున్న జ్యోతిష్కుడు చెపితే ఆ పార్టీ టిక్కెట్టు తీసుకోవడానికి జనం వెనకాడతారు. తక్కిన రాజకీయపరమైన లెక్కలు వేస్తూనే దీనికి కూడా కొంత వెయిటేజి యిస్తారు. 'ప్రస్తుతం ఆయనకు ఏలినాటి శనిట, అందుకే కలిసి రావటం లేదు, యీసారి వదిలేసి వచ్చేసారి తీసుకుందాం' అనే ఆలోచనలు

చేస్తారు. ఇలాటి ప్రమాదాలు వుంటాయనే రాజు తన జాతకాన్ని గోప్యంగా వుంచాలని రాజనీతి చెప్తుంది. మన నాయకులూ సాధ్యమైనంతవరకు గోప్యతను పాటిస్తారు. ఉగాదికి తమ పార్టీ ఆఫీసుల్లో ఏర్పాటు చేసే పంచాంగశ్రవణాల్లో యీ సారి జయం తథ్యం అనే మాట అనిపించి శ్రేణుల్లో ఉత్సాహం నింపుతారు.

ప్రస్తుతం కెసియార్ టైము బాగుంది అనే మాట ప్రబలంగా వినబడుతోంది. ఆంధ్రలో చేష్టలుడిగి వున్నా పేరుకైనా ప్రతిపక్షం వుంది. తెలంగాణలో ప్రతిపక్షాలు మటుమాయ మవుతున్నాయి. గ్రేటర్ హైదరాబాదులో తెరాస, దాని మిత్రపక్షమైన మజ్లిస్ కలిసి ఝుంఝూమారుతంలా చెలరేగిపోయారు. ఏ రోజు ఏ నాయకుడు తెరాసలో దూకుతాడో తెలియకుండా వుంది. గ్రేటర్ పరిధిలో అసెంబ్లీ ఉపయెన్నికలు వస్తే తెరాస బలం తెలుస్తుందేమో అనుకుంటే ఎర్రబెల్లి టి–టిడిపిని తెరాసలో విలీనం చేస్తూ స్పీకరుకు లేఖ యిస్తారని వినబడుతోంది. క్షేత్రస్థాయిలో బలమైన నిర్మాణం వున్న టిడిపి తెలంగాణ నుండి కనుమరుగైతే కెసియార్‌కు ఎదురు లేనట్లే. కాంగ్రెసులో కలహించే నాయకులు ఎక్కువ, కష్టపడే కార్యకర్తలు తక్కువ. అధినాయకత్వమే నీరసించి వుంది. అందువలన కెసియార్ దూసుకుపోతున్నారు. దీనికి కారణం యిటీవల ఆయన శ్రద్ధగా ఆయుత మహా చండీ యాగం చేయడమే అనే వ్యాఖ్యానాలు చేస్తున్నారు చాలా మంది. కెసియార్ ఒకప్పుడు చండీయాగాలు చేసినా తెలంగాణ రాలేదు. ఇప్పుడు మాత్రం యీ ఆయుత యాగఫలం సిద్ధించి గ్రేటర్‌లో వాళ్లూహించిన దాని కంటె ఎక్కువ సీట్లు వచ్చాయంటున్నారు. నిజమో కాదో తెలియదు. ఎందుకంటే మతవిశ్వాసాల విషయంలో తర్కం పనిచేయదు.

కెసియార్ గురించి 'మద్యం సేవించి, ఫామ్‌హౌస్‌లోనే పడుక్కుంటాడు. పొద్దున్న లేవలేడు, ఎక్కడికీ కదలలేడు, అర్ధరాత్రి ఫోన్ చేసి మద్యం మత్తులో ఏదేదో అనేస్తాడు, ఇలాటి వాడు రాజ్యమేం చేస్తాడు' అనేవారు. అలాటిది తెలంగాణ బిల్లు పాసయిన దగ్గర్నుంచి ఆయనలో విపరీతమైన మార్పు వచ్చింది. ఎన్నికలలో పొద్దున్నే లేచి, ప్రచారానికి బయలుదేరేవారు. నెగ్గి ముఖ్యమంత్రి అయ్యాక అందరికీ అందుబాటులో వుంటూ అధికారులతో చర్చలు జరుపుతూ, రాజకీయంగా చురుగ్గా వుంటూ, ఎక్కడా నీరసం కనబర్చలేదు. ఆయన వేసే రాజకీయపు ఎత్తులు బ్రహ్మాండంగా వర్కవుట్ అవుతున్నాయంటే మేధస్సు ఎంత చురుగ్గా పనిచేస్తోందో అర్థమవుతోంది. ఈ మధ్యే కెటియార్ తన తండ్రి అనారోగ్యంపై వచ్చేవన్నీ పుకార్లేననీ, ఆయన ఆరోగ్యం బ్రహ్మాండంగా వుందనీ చెప్పారు. బహుశా అలవాట్లు కూడా మార్చుకున్నారేమో తెలియదు. ఇక యీ యాగం విషయానికి వస్తే దాన్ని భారీ స్థాయిలో నిర్వహించి, హిందువులందరినీ ఆకట్టుకున్నారు. మజ్లిస్‌తో దోస్తీ చేయడం వలన కోపం వచ్చి వున్నా, యింతటి దైవభక్తి వున్నవాడు హిందువులకు అన్యాయం చేయడు అని అనుకునేట్లా చేశారు. భారతీయుల్లో యిదే వీక్‌నెస్. దేవుడి పేరు చెపితే చాలు సులభంగా ఏమారిపోతారు. 'నేను నాస్తికుణ్ని' అని ఎవడైనా చెప్పుకున్నాడంటే వాణ్ని పాపాత్ముడిగా చూస్తారు. పూజాపునస్కారం చేసేవాళ్లు దుష్టకర్మలు చేయరని గొప్ప నమ్మకం. కెసియార్ యింత పెద్ద యాగమూ తన సొంత ఖర్చుతో చేశానని, ప్రజాధనం వినియోగించలేదనీ చెప్పుకున్నారు. దానితో గౌరవం మరీ పెరిగిపోయింది. శ్రద్ధాభక్తులతో కెసియార్ యాగం చేశారని అందుకే ఆయనకు పనులు సానుకూల పడుతున్నాయని ప్రజలు నమ్మసాగారు.

తెలంగాణ వరకు చూస్తే బాబు టైము బాడ్‌గానే వుందనేది నిస్సందేహం. పార్టీ తరఫున యిద్దరు, మహా అయితే ముగ్గురు ఎమ్మెల్యేలు తప్ప మిగిలేట్లు లేరు. ఇది యివాళ్టి పరిస్థితి. రెండు మూడేళ్లలో పరిస్థితి మారవచ్చు. ప్రస్తుతానికి మాత్రం టిడిపి కార్యకర్తల స్పిరిట్స్ 'లో'గా వున్నాయి. ఆంధ్రలో కూడా అనుకున్న షెడ్యూల్ ప్రకారం ఏదీ జరగటం లేదు. ఖర్చులు పెరుగుతున్నాయి. ప్రత్యేక హోదా సుదూరంగానే వుంది. బాబు తంటాలు పడటం లేదని ఎవరూ అనలేరు. '...కానీ పాపం కాలం కలిసిరావటం లేదు' అనే మాట జనాల్లో రాకుండా చూసుకోవాలి. రాజకీయంగా అయితే ఏ ప్రమాదమూ లేదు. ఎందుకంటే ప్రస్తుతం టిడిపికి ఆంధ్రలో ప్రత్యామ్నాయం లేదు. ఆ పార్టీ వీడి వెళ్లేందుకు వేరే పార్టీ లేదు. ప్రజల్లోనే కాస్త ఆశ నింపాలి – తమ ముఖ్యమంత్రికి మరీ వ్యతిరేక పవనాలు లేవులే అని.

దీనికోసం బాబు కెసియార్ పురోహితులను పిలిచి సొంత డబ్బుతో అక్కడా ఆయుత యాగం చేయించాలా? అబ్బే, అంత దూరం అక్కరలేదు. నా ఉద్దేశంలో బాబు తన యిమేజిలో కొద్దిపాటి మార్పు చేసుకోవడం అభిలషణీయం. ఆయన పూజాదికాల్లో సంప్రదాయబద్ధంగా కనబడితే బాగుంటుంది. 20 ఏళ్ల క్రితం బాబు యిమేజి – కార్పోరేట్ సిఇఓ! ఆయన వేసుకున్న డ్రస్సు, బూటు, గడ్డం అన్నీ దానికి సరిగ్గా అమిరాయి. అప్పట్లో ఆయన ముహూర్తాల గురించి, సంప్రదాయాల గురించి పట్టించుకున్నట్లు కనబడేవారు కారు. విపరీతమైన చాదస్తాలు ప్రదర్శించిన ఎన్టీయార్ ఛాందసుడిగా కనబడితే, దానికి కాంట్రాస్టుగా బాబు వ్యక్తిగత నమ్మకాల మాట ఎలా వున్నా ఆధునికతకు ప్రతిబింబంగా, రాబోయే తరానికి ముందుదూతగా కనబడేవారు. 20 ఏళ్లు గడిచాయి. ఇప్పుడు బాబు వాస్తు గురించి మాట్లాడుతున్నారు. అమరావతి శంకుస్థాపన సమయంలో ఏకంగా పురోహితుడి అవతారం ఎత్తేసి ఎంత మట్టిలో, ఎన్ని నీళ్లు శాస్త్రోక్తంగా కలపాలో దగ్గర్నుంచి చెప్పేశారు. మార్పు సహజం. దానికి ప్రజామోదం వున్నపుడు యిబ్బందేమీ లేదు.

అయితే ఎన్ని పూజలు చేస్తున్నా, బాబు డ్రస్సులో మార్పు లేదు. అది చూడడానికి ఎబ్బెట్టుగా కనబడుతోంది. 'జైసా దేశ్, వైసా వేష్' అంటారు. దేశం బదులు ప్రదేశం అనుకున్నా సామెత కరక్టే. చర్చికి వెళ్లినపుడు చొక్కా విప్పి, పంచె కట్టి విబూదినామాలతో వెళితే అదోలా వుంటుంది. గుడికి వెళ్లినపుడు సూటూ, బూటుతో వెళ్లినా అంతే. కేరళ గుళ్లల్లో అయితే చొక్కా తీసేసి, ధోవతితో

రమ్మంటారు. ప్రభుత్వం తరఫున నిర్వహించే పూజల్లో పీటల మీద కూర్చున్నపుడు లక్షణంగా చీరా, జాట్టులో వున్న భార్య పక్కన బాబు పంచె, లాల్చీ ఉత్తరీయంతో కనబడితే బాగుంటుంది. ఒళ్లు కనబడుతుందన్న సంకోచం ఏమీ పెట్టుకోనక్కరలేదు. పెదరాయుడు టైపు పంచెలు, ఫుల్ హేండ్స్ లాల్చీలు ఏ మాత్రం యిబ్బంది పెట్టవు. కాస్త బొట్టూ, అదీ దిట్టంగా పెట్టి కెసియార్ టైపులో కాస్సేపు కళ్లు మూసుకుని ధ్యానముద్రలో వుంటూంటే ప్రజలకు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. బాబు మానవప్రయత్నానికి తోడు దైవబలం కూడా కలిసి వచ్చి రాష్ట్రం బాగుపడుతుందనే ఆశ చిగురుస్తుంది. ఎవరో చెప్పినట్లు – చీకట్లో చిరుదీపానికి మారుపేరే ఆశ. అదే మనల్ని ముందుకు నడిపిస్తుంది. నేడు ఆంధ్రులకు కావలసిన ఆశావహ దృక్పథమే! దాన్ని అందించడానికి ముఖ్యమంత్రి కాస్త యిమేజి కరక్షన్ చేసుకున్నా తప్పు లేదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2016)**

**ఫిబ్రవరి 21,22, 23** **ఎమ్బీయస్ : నేతాజీ చిక్కుముడి**

ముందే చెప్తున్నా – చివరిదాకా చదివినా నేతాజీ ఎప్పుడు చచ్చిపోయారో, అసలు చచ్చిపోయారో లేదో కూడా నేను చెప్పటం లేదు, ఎందుకంటే నాకు తెలియదు, నా హైస్కూలు రోజుల్నించి యీ మిస్టరీ గురించి వింటున్నా. ఇప్పటికీ మిస్టరీ విడలేదు. వచ్చే జన్మలో కూడా యిక్కడే పుట్టినా అప్పటికి కూడా యీ మిస్టరీని అలాగే కాపాడతారు. బెంగాల్ అనే ప్రాంతం మనదేశంలో అంతర్భాగంగా వున్నంతకాలం, అక్కడ ఎన్నికల ప్రక్రియ జరుగుతున్నంతకాలం యీ చిక్కుముడిని చిక్కుముడిగానే వుంచి అవసరం వచ్చినప్పుడల్లా దాన్ని అటూయిటూ కళ్ల ముందు ఆడిస్తారు. ఇటీవలి కాలంలో నేతాజీ ఫైళ్ల గురించి మీరంతా చదివే వుంటారు. ఆయన చితాభస్మం టోక్యోలోని రెంకోజీ ఆలయంలో ఒక పాత్రలో వుందని, దాని సంరక్షణకు భారతప్రభుత్వం అద్దె చెల్లిస్తోందని చదివేవుంటారు. అది నేతాజీ అవశేషమో కాదో తెలుసుకోవడానికి ఒక్క డిఎన్ఏ టెస్టు చేయిస్తే చాలు కదా అని నాలాగే మీకూ అనిపించి వుంటుంది. అలాటి డిఎన్ఎ టెస్టు చేయడానికి సాధనసంపత్తి లేదా? మన దగ్గరే బోల్డంత టెక్నాలజీ వుంది. పోల్చి చూడడానికి మనుష్యులు లేరా? బోసు సోదరుల పిల్లలే చాలామంది వున్నారు. స్వయానా ఆయన కూతురుంది. పోనీ వాళ్లకేమైనా అభ్యంతరాలున్నాయా? సాక్షాత్తూ కూతురే అడుగుతోంది – ఆ పరీక్ష చేసి అవునో కాదో తేల్చేయండి అని. మరి ఆ పని ఎందుకు చేయరు? "సత్యమేవ జయతే" అని నుదుటి మీద రాసి పెట్టుకున్న మనం సత్యాన్ని తెలుసుకోవడానికి యింత సులభమైన మార్గం వుండగా దాన్ని వదిలిపెట్టి ఫైళ్ల వెనక్కాల పడడమేం?

సరే, పద్దారు, పోనీ అవైనా అన్నీ బయటపెడుతున్నారా? లేదే! 2015 అక్టోబరు 14న 33 ఫైళ్లు డిక్లాసిఫై చేసి నేషనల్ ఆర్కయివ్స్‌కు యిచ్చారు. 2016 జనవరి 23 న 100 ఫైళ్లు డిక్లాసిఫై చేశారు, సంతోషం. తర్వాత నుంచి నేషనల్ ఆర్కయివ్స్‌వారు నెలకు 25 ఫైళ్ల చొప్పున రిలీజు చేస్తూ పోతారట. ఈ లెక్కేమిటో, సినిమాలో హీరో లాంచింగ్‌లో పిడికిలి, మణికట్టు, భుజం, ఛాతీ.. యిలా ఒక్కోటీ రివీల్ చేస్తూ పోయినట్లు వాయిదాల పద్ధతి విడుదలలో లాజిక్ ఏమిటో నాకు అర్థం కావటం లేదు. ఇక్కడ నాకు కొడవంటిగంటి వారి డిటెక్టివ్ కేయాస్ కథ – "వింత భూకంపం" గుర్తుకు వస్తుంది. ఆ రోజుల్లో డిటెక్టివ్ నవలలు విస్తారంగా చదివేవారు. రచయితలు సస్పెన్స్ సాగదీయడానికి సమాచారం కొద్దికొద్దిగా అందిస్తూ టెంపో మేన్‌టేన్ చేసేవారు. వారిలో కుటుంబరావు గారి బావమరిది కొమ్మూరి సాంబశివరావుగారు ఒకరు. అలాటి రచనలను ప్యారడీ చేస్తూ కుటుంబరావుగారు టివి శంకరం పేరుతో 'డిటెక్టివ్ కేయాస్' కథలన్ని చాలా వ్యంగ్యంగా రాశారు. 'వింత భూకంపం' కథలో పద్మావతి అనే ఒకావిడ చనిపోయింది. భర్తను డిటెక్టివ్ విచారిస్తున్నాడు. భర్త 'ఇంకో విషయం చెప్పాలి సార్, మా ఆవిడ చచ్చేముందు గుడ్డల సాయిబొకడు వచ్చి ఏదో బట్టలు చూపించి వెళ్లాడు...' అని చెప్పబోతూ వుంటే డిటెక్టివ్ కేయాస్ '..అది కథలో యిప్పుడే రాదులే, చెప్పొద్దు' అంటాడు. విచారణలో భాగంగా ఒకావిణ్ని కలుస్తాడు. 'పద్మావతి తెలుసా?' అని అడిగితే '... మా అమ్మాయితో కలిసి మైసూరులో హాస్టల్లో వుండేది. తనతో మాట్లాడతారా?' అని అడుగుతుందామె. 'మీ అమ్మాయితో యిప్పుడు మాట్లాడకూడదు. ఇంకా చాలా పేజీలు గడవాలి.' అంటాడు డిటెక్టివ్. ఆయన ప్యారడీ గొప్పగా వుంది అనుకున్నాను కానీ నిజజీవితంలో యిప్పుడు చూస్తున్నాను. డిటెక్టివ్ పుస్తకాల రచయితకి పుస్తకం బరువు పెరగాలన్న యావ. మన ప్రభుత్వానికి బెంగాల్ ఎన్నికల దాకా దీన్ని సాగదీయాలన్న తపన.

బెంగాల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే మమతా బెనర్జీ, మోదీ యిప్పుడు బోసు పేరును వాడుకోవాలని పోటీ పడుతున్నారు. కాంగ్రెసు బోసుకు అన్యాయం చేసింది, తగిన స్థానం కల్పించలేదు, నెహ్రూ అసూయతో బోసు స్మృతిని చెరిపేద్దామని చూశాడు, మేం ఆ కుట్రను బయటపెట్టి బోసు పట్ల మా భక్తిని ప్రదర్శిస్తున్నాం అని చెప్పుకోవడమే యిద్దరి లక్ష్యం. బోసు అంతర్ధానం గురించి ఎంతోమంది ఎన్నేళ్లయినా రిసెర్చి చేస్తూనే వుంటారు. జర్నలిస్టులు ఏదో ఒక విషయాన్ని తవ్వుతూనే వుంటారు. 2015 ఏప్రిల్ లో భారత మీడియా ఒక విషయాన్ని బయట పెట్టింది – 'బోసు కుటుంబంపై 20 ఏళ్ల పాటు భారత ప్రభుత్వం నిఘా వేసింది' అని. ఫలానా కారణం చేత వేసింది, ఫలానా ఫలానా విషయాలు కూపీ చేసి లాగింది అని కథనంలో లేదు. నిఘా వేసిందని మాత్రమే బయటకు రాగానే దేశంలో గగ్గోలు పుట్టింది. కేంద్రప్రభుత్వ వైఖరిపై సందేహాలు పొడసూపాయి. వెంటనే కేంద్రం చేయవలసిన పని – నేతాజీ ఫైళ్లను బహిర్గతం చేసి ఆ నాటి పరిస్థితులు యివి, అందువలన చేయవలసి వచ్చిందనో, లేకపోతే పొరపాటైంది, జాతిని క్షమించమని కోరుతున్నామనో చెప్పడం! కానీ మోదీ సర్కారు అలాటిది ఏమీ చేయలేదు. విషయాన్ని నానుస్తూ, నిజంతో దోబూచులాడుతూ

పోయింది.

నిజానికి బోసు ఫైళ్లను డీక్లాసిఫై చేసి నిజానిజాలు జాతి ముందు వుంచుతామని మోదీ ఎప్పుడో వాగ్దానం చేశారు, కానీ నిలబెట్టుకోలేదు. సమాచార హక్కు కింద ఎవరో అడిగితే 'భారతదేశానికి యితర దేశాలతో వున్న సంబంధాలు దెబ్బ తింటాయి కనుక వాటిని విడుదల చేయలేం' అని జవాబిచ్చారు. మరి యీనాడు కొద్దికొద్దిగా రిలీజు చేస్తున్నారు, యిప్పుడు దౌత్యసంబంధాలు దెబ్బ తింటాయన్న భయం లేదా? ఇప్పటికే తినేశాయా? ఇతర దేశాల్లో రహస్యఫైళ్లను డిక్లాసిఫై చేయడానికి కాలపరిమితి వుంటుంది. మన దేశంలో లేదు. అందువలన ఎన్నాళ్లు దాచి వుంచినా ఎవరూ అడగలేరు. పాలకుల రాజకీయప్రయోజనాలకు అనుగుణంగా దాచి వుంచుతున్నారు. కానీ బోసు కుటుంబంపై నిఘా విషయం చాలా గంభీరమైన విషయం కాబట్టి జాతికి వివరణ యివ్వవలసిన అవసరం వుంది. దానివలన ఆనాటి ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చినా భరించవలసినదే. ఆ ప్రభుత్వాలను నడిపిన వ్యక్తులు యిక్కడ ప్రధానం కాదు, కేంద్రం అనేది ఒక ఎంటిటీ. అది నిరంతరం కొనసాగుతోంది. సంజాయిషీ చెప్పవలసిన బాధ్యత దానికి వుంది. కానీ ప్రధాని మోదీ ఆ బాధ్యత విస్మరించారు. రహస్యాన్ని కాపాడుతూ సందేహాలను పెంచిపోషించ దలచారు. మమతా బెనర్జీ యీ అవకాశాన్ని అంది పుచ్చుకుంది. రాష్ట్రప్రభుత్వపు ఆర్కయివ్స్‌లో వున్న 64 నేతాజీ ఫైళ్లను 2015 సెప్టెంబరులో పబ్లిక్‌కు విడుదల చేసింది. వారం రోజుల తర్వాత 1938 నుండి 1947 వరకు నేతాజీకి సంబంధించిన కాబినెట్ పేపర్లను బహిర్గతం చేసింది. దాంతో బెంగాల్‌లో ఆమె పాప్యులారిటీ పెరిగిపోయి, కాంగ్రెసు వ్యతిరేక ఓట్లన్నీ తృణమూల్‌కు పడిపోతాయన్న శంక కలిగిందేమో, బిజెపి ప్రభుత్వం నేతాజీ పుట్టినరోజు జనవరి 23 న నేతాజీ కుటుంబాన్ని పిలిచి వారి ఎదురుగా 100 ఫైళ్లు విడుదల చేసింది. వాటిలో 15 వేల పేజీలున్నాయి. ఇకపై నెలనెలా పాతిక ఫైళ్లను విడుదల చేస్తామని వాగ్దానం చేశారు. ఇప్పటిదాకా బయటకు వచ్చిన ఫైళ్ల ద్వారా కొత్తగా తెలిసిన విషయం ఏమీ లేదు. రాబోయే ఫైళ్ల ద్వారా కూడా ఏమైనా తెలుస్తుందో లేదో భగవంతుడికే తెలియాలి. ఈ లోపున పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ప్రభుత్వాలకు కావలసినది అదే!

నేను హైస్కూల్లో చదివే రోజుల్లోనే నేతాజీ చచ్చిపోలేదట, బ్రిటిషు వాళ్ల కళ్లు కప్పడానికై, బోసు కావాలని తన చావు వార్త సృష్టించి, మారు వేషంలో దేశంలో ప్రవేశించి, ఉత్తర ప్రదేశ్‌లో గుమ్నామీ బాబా పేరుతో వున్నాడట అని చెప్పుకునేవాళ్లం. అప్పట్లో సమర్ గుహ అని ఫార్వర్డ్ బ్లాక్ (నేతాజీ స్థాపించిన పార్టీ) ఎంపీ వుండేవాడు. బోసు బతికే వున్నాడని ప్రచారం చేయడమే అతనికి ప్రధాన వ్యాపకం. ఓసారి బోస్ ఫోటో యిదిగో అంటూ ఒక వృద్ధుడి ఫోటో విడుదల చేసేశాడు. తీరా చూస్తే బోసు పాత ఫోటోలోని మొండెం తీసుకుని పైన ఆయన అన్నగారు శరత్ చంద్ర బోసు తల అతికించేశాడు. అప్పట్లో ఫోటోషాప్ లేదు కాబట్టి యీ అతుకు బాగా తెలిసిపోయి అందరూ హేళన చేశారు. అయినా ఆయనను బెంగాలీలు ఆదరిస్తూనే వచ్చారు. ఎందుకంటే వాళ్లకు నచ్చినట్లుగా సత్యాన్ని వక్రీకరిస్తున్నాడు కాబట్టి! 1977లో ఎమ్ఓ మత్తయ్ తన పుస్తకంలో రాశాడు – ఇంకో వందేళ్లు పోయినా బోసు బతికే వున్నాడని బెంగాలీలు నమ్ముతారు, బోసు కూడా మామూలు మనిషేనని వాళ్లను నమ్మించడం కష్టం, నిజాన్ని తట్టుకోలేరు అని.

నేతాజీ స్వభావాన్ని ఏ మాత్రం తెలిసున్నవారైనా యీ బాబా ఉదంతాన్ని కొట్టిపారేస్తారు. బోసు ప్రధానంగా రాజకీయనాయకుడు. ఆధ్యాత్మిక గురువు కాదు. అవకాశాలు వస్తే వదులుకునేవాడు కాదు. కాంగ్రెసు అధ్యక్షపదవికి వరుసగా రెండోసారి నిలబడకూడదనే సంప్రదాయం వున్నా దాన్ని ధిక్కరించి, నిలబడి గెలిచినవాడు. కాంగ్రెసులోంచి బయటకు వచ్చాక ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ పెట్టినవాడు. అలాటివాడు మారుపేరుతో అనామకంగా ఎందుకుంటాడు? ప్రజల్లో తిరిగి స్వతంత్ర భారత ప్రభుత్వ విధానాలకు మద్దతుగానో, వ్యతిరేకంగానో ఉద్యమించడా? పైగా అతనికి సన్యాసం తీసుకునేటంత వైరాగ్యం వుందని ఎవరు చెప్పారు? అతనికి కుటుంబంతో చాలా అనుబంధం. అన్నగారు శరత్ బోసు అంటే చాలా గౌరవాభిమానాలు. లేటుగా 45 ఏళ్ల వయసులో పెళ్లి చేసుకున్న భార్య (జర్మనీలో వుండగా ఆయన వద్ద సెక్రటరీగా పనిచేసిన ఎమిలీ స్కెంకెల్) అన్నా, 46 ఏళ్ల వయసులో పుట్టిన కూతురన్నా కూడా యిష్టం వుండే వుంటుంది. వాళ్లను కూడా ఆయన తన ఉనికి తెలియపరచలేదు. ఈ విషయాన్నే బోసు కూతురు 73 ఏళ్ల అనితా బోస్ ఫాఫ్ ఎత్తి చూపింది. మా నాన్న హృదయం లేని మనిషి కాదు. బతికి వుండి వుంటే, వీలు వుండి వుంటే తప్పక మాతో సంపర్కం పెట్టుకునేవాడు అంది.

ఇక రెండో పుకారేమిటంటే బోసు రష్యాలో ఖైదీగా వున్నాడని. మాస్కోలో రాయబారిగా వుండగా డాఎ రాధాకృష్ణన్ ఆయన్ని చూశారని ..ట కబుర్లుగా చెప్పుకునేవారు. రష్యా ప్రమేయం నాకు అర్థం కాదు. బోసు జపాన్‌కు సన్నిహితుడు. యుద్ధం సాగుతూండగానే బోసుకు, జపాన్ సైన్యానికి విభేదాలు వచ్చాయి. బర్మా వరకు ఫర్వాలేదు కానీ ఇండియాలో ఐఎన్ఏ (ఆజాద్ హింద్ ఫౌజ్ అనబడే ఇండియన్ నేషనల్ ఆర్మీ) తప్ప జపాన్ సైన్యం అడుగుపెట్టడానికి వీల్లేదని బోసు నిబంధన విధించడం వారికి కొరుకుడు పడలేదు. తామే సైన్యం, ఆయుధాలు అన్నీ సమకూర్చి కీలుబొమ్మలా వుంటాడని అనుకుని నిలబెట్టిన యీ పెద్దమనిషి తమకే ఎదురుతిరుగుతున్నాడేమిట్రా అనుకున్నారు. అందువలన వాళ్లే విమానప్రమాదాన్ని కల్పించారేమో, విరాళాలుగా సేకరించిన బంగారంలో చాలా భాగం కొట్టేశారేమో తెలియదు. అలా కాదు, ఆయన 1945 ఆగస్టు 17 న మంచూరియాకై ఎక్కిన విమానం అక్కడ క్షేమంగా చేరి, మంచూరియాలో రష్యన్లకు యుద్ధఖైదీగా పట్టుబడ్డాడు అనుకుని చూడాలి. మంచూరియాలో జపాన్ నిలబెట్టిన కీలుబొమ్మ ప్రభుత్వంపై రష్యా ఆగస్టు 7నే దాడి చేసింది. అక్కడి ప్రమాదం తెలిసే బోసు విమానం ఎక్కారనుకోవాలి. ఎందుకు? యుద్ధంలో జపాన్ ఓడిపోవడం చేత గెలిచిన రష్యాను ఒప్పించి, ఇండియాపై దాడి చేయమని అడుగుదామనిట! బోసు జర్మనీకి వెళ్లి క్యాంపు వేసినా

ఇండియాపై దాడికి హిట్లర్‌ను ఒప్పించలేకపోయాడు. ఇక జపాన్‌తో చేతులు కలిపితే అది దెబ్బ తింది. రష్యా అప్పటికే తూర్పు యూరోప్‌ను ఆక్రమించి వుంది. ఇండియాపై ఆసక్తి ఏముంటుంది? అయినా బోసు వెళ్లి అడుగుదామని అనుకున్నారు.

సరే, రష్యాకు ఆయన చిక్కితే వాళ్లు ఆయన్ను కుదరదు అని చెప్పి వెనక్కి పంపించి వుండాలి, లేదా జపాన్‌తో చేతులు కలిపిన శత్రువుగా పరిగణించి యుద్ధఖైదీగానైనా విచారించి వుండాలి. లేదా అమెరికాకో, బ్రిటన్‌కో అప్పచెప్పాలి. తన పెరల్ హార్బర్‌పై దాడి చేసినందుకు జపాన్‌మీద అమెరికాకు కసి కాబట్టి, జపాన్‌తో కలిసినందుకు బోస్‌మీద కోపం వుండి వుండాలి. జపాన్‌తో కలిసి తన ప్రాంతాలపై దాడి చేసినందుకు బ్రిటన్‌కు కసి వుండాలి. అందువలన వాళ్లు బోసును తమకు అప్పగించమని రష్యాను కోరి వుండాలి. రష్యాకు బోసుతో డైరక్టు వైరం, స్నేహం ఏమీ లేవు. నిక్షేపంలా అప్పగించేయవచ్చు. లేదూ చంపి పారేయవచ్చు. ఊరికే జైల్లో కూర్చోబెట్టి తిండి పెట్టవలసిన అగత్యం ఏముంది? స్టాలిన్ రోజుల్లో మహామహా వాళ్లే ఉఫ్‌మని ఎగిరిపోయేవారు. అలాటిది ఒక జపాన్ మిత్రుణ్ని దాచి వుంచుకుని ప్రయోజనం ఏముంది? వేరేవాళ్లతో ఎక్స్‌ఛేంజ్ చేయడానికి వీలుగా కొందరిని సజీవంగా వుంచుకుంటారు. అలాటి ఖైదీల మార్పిడి కూడా దరిమిలా ఏమీ జరగలేదు. బోసు ఇండియాకు తిరిగి వస్తే తన పాప్యులారిటీకి దెబ్బ కాబట్టి రష్యాలోనే అతన్ని బంధించి వుంచమని నెహ్రూ కోరి వుంటాడని వూహిద్దామన్నా 1945 నాటికి నెహ్రూ పెద్ద లీడరేమీ కాదు, భారతదేశానికి స్వాతంత్ర్యం యిస్తారని అప్పటికి ఊహల్లో కూడా లేదు. రెండవ ప్రపంచయుద్ధానంతరం చర్చిల్ ఓడిపోయి లేబరు పార్టీ బ్రిటన్‌లోకి అధికారంలోకి రావడంతోనే స్వాతంత్ర్యం సిద్ధించింది. ప్రధాని ఎవరవుతారో అని కాస్త ఊగిసలాట జరిగి నెహ్రూ కావడం జరిగింది. అలాటప్పుడు రెండేళ్లు ముందుగానే నెహ్రూ మాట వినడానికి స్టాలిన్ అంత చిన్న లీడరేమీ కాదు. ఒకవేళ నెహ్రూకి కసి వుందనుకున్నా, రష్యా నెహ్రూ మాట విందనుకున్నా అలాటి పరిస్థితుల్లో బోస్‌ను చంపిపారేసి వుంటారు కానీ జైల్లో కూర్చోబెట్టి మేపుతారా? తప్పించుకుని పారిపోతే ఎప్పటికైనా ప్రమాదమే కదా!

ఈ ప్రశ్నలకు ఎవరూ సమాధానం చెప్పరు. 'నెహ్రూకు బోసుకు పడదు, బోసు వస్తే తన మొహం చూసేవారుండరు అని నెహ్రూ భయం. అందుకని తన స్నేహితుడైన రష్యాకు చెప్పి ఖైదీగా వుంచాడు' అనే ప్రచారమే సాగిస్తూ పోయారు. నిజానికి బోసుకు నెహ్రూ కంటె ఎక్కువ పాప్యులారిటీ వుందా అని తాపీగా ఆలోచించి చూడండి. 1939లో గాంధీ అభ్యర్థి ఐన పట్టాభిని ఓడించి బోస్ రెండోసారి కాంగ్రెసు ప్రెసిడెంటు అయ్యాడు గాంధీ ఆగ్రహానికి వెఱచి ఎగ్జిక్యూటివ్ కమిటీలో 12 మంది సభ్యులు సభ్యత్వానికి రాజీనామా చేశారు. వాళ్లెవరెవరో తెలుసా? పటేల్, మౌలానా ఆజాద్, భూలాభాయ్ దేశాయ్, రాజేంద్ర ప్రసాద్, సరోజిని నాయుడు, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్... ఇలా.. అందరూ ప్రముఖులే! వీళ్లందరూ అంత తెలివితక్కువగా బోస్‌మీద కత్తి కట్టారనుకోవాలా? చిన్నప్పుడు ఆవేశ పడేవాణ్ని కానీ కాస్త వివేకం వచ్చాక ఆలోచిస్తే నాకు ఒకటి తట్టింది. గాంధీగారి మెయిన్ స్ట్రెంగ్త్ ఎక్కడుందంటే, ఇండియన్ సైకీని ఆయన స్టడీ చేసినట్టు వేరెవరూ చేయలేదు. ఆయన చేపట్టిన సత్యాగ్రహమే అంతమంది జనాల్ని ఉద్యమంలోకి లాక్కొచ్చింది. మనం అందరూ ఊహల్లో డిక్టేటర్లమే కానీ నిత్యజీవితంలో హింసావాదులం కాదు. విప్లవ మార్గాన్ని చేపట్టినవారిని తర్వాత తర్వాత గ్లోరిఫై చేస్తాం కానీ అప్పటికప్పుడు మాత్రం దూరంగానే వుంటాం. మీరు లెక్కేయండి – భగత్‌సింగ్‌తో బాటు ఉరికంబం ఎక్కిన వీరులెందరు? వాళ్ల ఉద్యమంలో కడదాకా నిలబడ్డవారు ఎంతమంది? పంజాబ్ జనాభాలో పాయింట్ నాట్ వన్ పర్సంటైనా వుంటారా? అంతెందుకు అల్లూరి సీతారామరాజు కథ 70 ఎమ్మెమ్‌లో సూపర్‌స్టార్లతో తీసేసరికి సీతారామరాజు కాలంలో రాష్ట్రమంతా ఆయన వెంట నిలిచిందేమోనన్న భ్రమ కలుగుతుంది. అబ్బే, సీతారామరాజు ప్రభావం రెండు జిల్లాలకు మించి పోలేదు. అదీ ఒకటి, రెండేళ్లు. అంతే! ఆయన్ను టాకిల్ చేసింది కూడా ఓ కలెక్టరు ర్యాంక్ ఆఫీసర్. దాన్ని ఇంగ్లీషువాళ్లు విప్లవం అనలేదు, పితూరీ అన్నారు.

కాంగ్రెసులో ప్రతికూల పరిస్థితులు ఏర్పడడంతో అధ్యక్షుడిగా ఎన్నికయిన బోస్ నెల తిరక్కుండానే కాంగ్రెస్ విడిచి 1939 మేలో 'ఫార్వర్డ్ బ్లాక్' పార్టీని ఏర్పరచారు. అయితే ఇందులో చేరిన హేమాహేమీలు ఎవరూ అంటే – ఎవ్వరూ లేరు. ఎటిలీస్టు వాళ్ల పేర్లు ఇప్పుడు చెప్తే ఎవ్వరికీ తెలియదు. ఆంధ్రానుండి మద్దూరి అన్నపూర్ణయ్యగారి పేరు కొంతమందికి తెలుస్తుంది, అంతే! కాకాని వెంకటరత్నం కూడా కొంతకాలం ఆ పార్టీలో వుండేవారు. తమిళనాడు నుంచి ముత్తురామలింగ దేవర్, బొంబాయి నుంచి ఎచ్.వి.కామత్ ఓ పాటి ప్రముఖులు. నిజానికి 1941 జనవరిలో బోసు ఇండియా నుంచి రహస్యంగా జర్మనీకి పారిపోయిన తర్వాత, అక్కణ్నుంచి 1943 మేలో జపాన్‌కు సబ్‌మెరైన్‌లో పారిపోయిన తర్వాతనే హీరోగా తోచాడు. ఇండియాలో వుండగా బోసుకు అనుచరులు తక్కువ. గాంధీ, నెహ్రూలతో పోటీ పడే ప్రశ్నే లేదు. ఐఎన్ఏకు సుప్రీం కమాండర్ అయ్యాక గ్లామర్ పెరిగింది. కానీ నేతాజీకి యుద్ధ కౌశలం కాని, పూర్వానుభవం కానీ లేదు. ఆరోగ్యమూ అంతంత మాత్రమే. 1943 సంవత్సరాంతానికి భారతదేశంలో ఐఎన్ఏ అడుగుపెడుతుందని ప్రకటన చేయడం శత్రువుకు తమ ప్లాన్ ముందుగా చెప్పేసినట్టయింది. జపాన్ సైన్యం యుద్ధంలో ఓడుతూ వారికే ఆయుధాలు, మందు సామగ్రి చాలని పరిస్థితిలో వుండగా నేతాజీ ఐఎన్ఏ కోసం ఇంకా ఇంకా ఆయుధాలు కావాలని అడిగేవారు. జపాన్ జర్నలిస్టులకు 'నేతాజీ' అన్న పదమే రుచించలేదు. జపాన్ చక్రవర్తి బిరుదుకు పోటీ వస్తుందని భావించారు.

జపాన్‌వారు నేతాజీ పేరుమీద వారే యుద్ధం చేద్దామని అనుకున్నారు. 1943 అక్టోబర్ 21న సింగపూర్‌లో స్వేచ్ఛా భారత తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడ్డాక 'మీ ఆజాద్ హింద్ ఫౌజ్ సింగపూర్‌లోనే ఉండడం మంచిది. మేమే ముందుకు సాగి యుద్ధం చేసేస్తాం' అని జపాన్ ఆర్మీ చీఫ్ ప్రతిపాదించినపుడు నేతాజీ సగర్వంగా 'మీ త్యాగాలతో సంపాదించే స్వాతంత్ర్యం బానిసత్వం కంటే

హీనమైనది' అని బదులిచ్చారు. ఇది వినడానికి బాగున్నా, యుద్ధం నడిపే విధానం ఇది కాదు. తమని తాము సరిగ్గా అంచనా వేసుకోవాలి. తన ఆజాద్ హింద్ ఫౌజ్ గురించి నేతాజీకి చాలా అవాస్తవికమైన అంచనా వుండేది. నిజానికి ఆజాద్ హింద్ ఫౌజ్ (ఐఎన్ఎ)లో చేరిన దెవరు? దానిలో చేరితే జపాన్ ప్రభుత్వం తమకు ఏదో ఒనగూరుస్తుందన్న ఆశతో చాలామంది యువకులు చేరారు. 1942లో సింగపూర్‌లో జపాన్ బ్రిటిష్ సైన్యాన్ని ఓడించి యుద్ధ ఖైదీలుగా పట్టుకున్న వారిలో బ్రిటన్ తరఫున పోట్లాడుతున్న ఇరవైవేలమంది భారతీయులున్నారు. వారిని ఆజాద్ హింద్ ఫౌజ్‌లో కలిపివేశారు. 1944 మార్చిలో భారత గడ్డమీద కాలుమోపి ఇంఫాల్‌లో యుద్ధం చేసేటప్పుడు బ్రిటిష్ సైన్యంలో వున్న భారతీయులందరూ తమ పక్షం చేరతారని నేతాజీ జపాన్ వారికి హామీ ఇచ్చేరు. కానీ జరిగింది – దానికి పూర్తిగా వ్యతిరేకం, ఆజాద్ హింద్‌ఫౌజ్‌లో చేరిన మాజీ సైనికులందరికీ జీతాలు, బకాయిలతో సహా ఇస్తామని ఇంగ్లీషువారు ప్రకటించగానే వారందరూ అటు తిరిగిపోయారు. ఇంఫాల్ లోయ ప్రాంతం, కోహిమా ప్రాంతంలో ఎనిమిది రంగాలలో సమరం సాగుతుండగా ఇంఫాల్‌లో మూడు మైళ్ల దూరంలో లార్డ్ మౌంట్ బాటన్ అడ్డుకుని వారిని ఓడించాడు. ఓడిపోయిన వారిలో కొందరు నానా కష్టాలు పడి బాంకాక్ చేరుకున్నారు. కొందరు బ్రిటిష్ జైళ్లలో మగ్గారు.

ఐ.ఐ.ఎల్.లో ముఖ్యులుగా వుండి ఐఎన్ఏకు, జపాన్‌కు లయజన్ ఆఫీసర్‌గా పనిచేసిన ఎ.ఎం.నాయర్ 1985లో భారతదేశం వచ్చినప్పుడు 'సండే అబ్జర్వర్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇలా అన్నారు – ''.. ఇంఫాల్ ఓటమి తర్వాత నేతాజీ ఆడవాళ్లతో ఏర్పరచిన రాణీ ఝాన్సీ రెజిమెంట్‌ని యుద్ధరంగానికి పంపిస్తానన్నప్పుడు మేం తెల్లబోయేం. ఈయనకి మతిపోలేదు కదానిపించింది. ఆయన ఆవేశంలో అటువంటి నిర్ణయాలు చేసేవారు. ఆయన అద్వితీయ దేశభక్తుడే కానీ పొరపాట్లు చేశారు. ఇండియా వదిలిరావడం ఆయన మొదటి తప్పు. జపాన్ సహకారంతో స్వాతంత్ర్యం సంపాదిద్దామనుకుని అవాస్తవికమైన అంచనాలు వేయడం మరొక తప్పు.. నేతాజీ ప్రయాణం చేస్తున్న విమానం 1945 ఆగస్టు 18న నేలకూలిందని, నేతాజీ మరణించారని ఆగస్టు 22న టోకియో రేడియో ప్రకటించింది. సుభాష్ బోస్ ప్రభుత్వ ప్రచారమంత్రి ఎస్.ఎ. అయ్యర్ ఆ విమాన ప్రమాదం తర్వాత ఒక హోటల్ రూమ్‌లో జపాన్ లెఫ్టినెంట్ కల్నల్ కదామస్తుతో రహస్య సమావేశం జరిపేకనే ఈ విమాన ప్రమాదం గురించి, ఆ దుర్ఘటనలో ఆజాద్ హింద్‌ఫౌజ్ సేకరించిన నిధులు పోయాయనీ వార్త వెలువడింది... ఇది జరిగిన కొన్ని రోజులకే ఒక బ్రిటిష్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్‌కు అయ్యర్ లొంగిపోయారు. నేతాజీకి అత్యంత సన్నిహితుడైన కల్నల్ హబీబుర్ రహమాన్ కూడా. ఇద్దరినీ ఇండియాకు తీసుకెళ్లిపోయారు. ఆ తర్వాత రాయిటర్ సంస్థ నుంచి బకాయిలతో సహా జీతం ముట్టిందని విన్నాను. రెహమాన్ బ్రిటన్ ప్రభుత్వం నుంచి 'రావలసినవన్నీ' పుచ్చుకున్నాక పాకిస్తాన్‌లో స్థిరపడ్డారు. నిధుల గురించి చెప్పాలంటే – మూడుకోట్ల పౌండ్ల నిధిని సేకరించడానికి నేతాజీ పూనుకున్నారు. ఎంతోమంది భారతీయులు ఇచ్చిన బంగారం కిలోల లెక్కన వుండాలి. జపాన్‌వాళ్లు ఏదో కొద్దిపాటి బంగారం మాత్రం భారత ప్రభుత్వానికి అప్పగించారు...''

ఇప్పుడు బయటపడుతున్న ఫైళ్లు యీ విషయాలనే ధ్రువీకరిస్తున్నాయి, గమనించండి. తమకు పట్టుబడిన ఐఎన్ఏ సైనికులను బ్రిటన్ సైన్యం రెండుగా విభజించింది. బోసు లక్ష్యం కోసం పూర్తిగా అంకితమైనవారిని బ్లాక్స్ అనేది, వాళ్లను తీవ్రంగా శిక్షించింది. ఐఎన్ఏలో నామ్‌కే వాస్తే చేరినవాళ్లను వైట్స్ అనేది. వీళ్లు 'మేం బ్రిటన్ సైన్యంలో పనిచేస్తూ విధేయులుగా వున్నాం. 1942 సింగపూరులో ఓడిపోయాక మమ్మల్ని ఖైదీలుగా పట్టుకున్న జపాన్ మా కిష్టం లేకపోయినా దీనిలో కలిపేసింది' అని చెప్పుకునేవారు. ఐఎన్ఏలో ఎంతమంది పనిచేశారన్నదానిపై యిప్పటికీ నిర్ధారణకు రాలేదు. 45 వేల నుండి 60 వేల దాకా రకరకాల అంకెలు చెప్తున్నారు. 26 వేలమంది చనిపోయారని అంటారు. విమానప్రమాదం నిజంగా జరిగిందా లేదా, లేక నేతాజీయే కల్పించారా అని బ్రిటన్‌కు కూడా అనుమానం వుండి వాకబులు చేశారు. యుద్ధసమయంలో మొదట చచ్చిపోయేది సత్యమే అని నానుడి. దేన్నీ ఓ పట్టాన నమ్మలేం. 1942 మార్చి 24న బోసు టోక్యోకు వెళుతూ విమానప్రమాదంలో చనిపోయాడని బ్రిటిష్ యింటెలిజెన్సు వారు ఒక వార్త పుట్టించారు. గాంధీజీ దాన్ని నమ్మి బోసు తల్లికి సంతాపం తెలియబరచాడు కూడా. తర్వాత బతికివున్న వార్త తెలిసి క్షమాపణలు చెప్పాడు. 1945 ఆగస్టు 18న ఫార్మోజా (ఇప్పటి తైవాన్) లో తైపీ వద్ద విమానప్రమాదమే జరగలేదని అమెరికా అన్నదని, నేతాజీ కుటుంబసభ్యులు వాదిస్తారు. అలా నిర్ధారించడానికి అమెరికాకు గల సాధనసంపత్తి ఏమిటన్నది ప్రశ్న. అప్పట్లో శాటిలైట్లు లేవు. అప్పుడక్కడ రష్యన్ సైన్యం తచ్చాడుతోంది. వారిలో అమెరికన్ గూఢచారులున్నారా? ఏమో!

ప్రభుత్వం బోసు మృతిపై మూడు కమిషన్లు వేసింది. బోసుతో కలిసి పని చేసిన షా నవాజ్ నేతృత్వంలో 1956లో వేసిన కమిటీ బోసు విమానప్రమాదం తర్వాత పోయారని చెప్పింది. నివేదికను ప్రభుత్వం ఆమోదించింది కానీ బోసు కుటుంబం తిరస్కరించింది. ఎంతో నిబద్ధత కలిగినవారిగా పేరు పొందిన జస్టిస్ జిడి ఖోస్లా నేతృత్వంలో 1970లో వేసిన కమిటీ కూడా అదే చెప్పింది. దాన్ని 1977లో అధికారంలోకి వచ్చిన జనతా ప్రభుత్వం తిరస్కరించింది. 2000లో ఎన్‌డిఏ హయాంలో ఎంకె ముఖర్జీ నేతృత్వంలో వేసిన కమిటీ నేతాజీ ప్రమాదంలో చనిపోలేదని, రెంకోజీ గుడిలో వున్న చితాభస్మం జపాన్ సైనికుడిదని 2005లో నివేదిక యిచ్చింది. 2004లో అధికారంలోకి వచ్చిన యుపిఏ దీన్ని తిరస్కరిస్తూ కారణాలు చెప్పింది. ఛత్రపతి శివాజీ గురించి పరిశోధన చేయమని మహారాష్ట్రుణ్ని అడగడం ఎంత రిస్కో, బోసు గురించి పరిశోధించమని బెంగాలీని అడగడం అంత రిస్కు. బోసు చచ్చిపోయాడని ముఖర్జీగారు నివేదిక యిచ్చి వుంటే బెంగాల్ అంతా ఆయన దిష్టిబొమ్మలు తగలబడేవి. చితాభస్మానికి డిఎన్ఏ టెస్టు చేయించే సులభమార్గం వుండగా యీ డొంకతిరుగుళ్లు అందుకే! అక్కడ వున్నది బోస్‌దే అని నమ్మిన నెహ్రూ, ఇందిర, వాజపేయి జపాన్

వెళ్లినపుడు దర్శించి వచ్చారు. ఇటీవల జపాన్ వెళ్లిన మోదీ అక్కడకు వెళ్లలేదు. వెళితే ఆమోదముద్ర వేసినట్లవుతుందని భయపడ్డారేమో. అవి మీ బోసువే పట్టుకుపోండి అని జపాన్ గుడివాళ్లు అంటున్నా, మనవాళ్లకు ధైర్యం చాలటం లేదు. తెచ్చుకుంటే బోసు మరణించినట్లు ఆమోదించాలి, దాని వలన బెంగాల్‌లో ఆవేశకావేషాలు రగులుతాయి అని పాలకుల భయం. 1976లో తెచ్చే ఆలోచన వచ్చినపుడు అప్పుడు ఇంటెలిజెన్సు చీఫ్ రాజేశ్వర్ అదే హెచ్చరిక చేశారు. 2007లో మన్‌మోహన్ తెద్దామనుకుని ఆయనా దడిశారు. ముఖర్జీ కమిషన్ చెప్పినట్లుగా అవి జపాన్ సైనికుడి బూడిదే అయితే వాటి సంరక్షణకు విదేశాంగ శాఖ జపాన్‌కు డబ్బెందుకు చెల్లిస్తున్నట్లు? 'మా నాన్న చితాభస్మం అవునో కాదో డిఎన్ఏ టెస్టు ద్వారా తేల్చండి, అయితే పట్టుకుని వచ్చి గంగానదిలో కలపండి' అని బోసు కూతురు అనిత చేస్తున్న ప్రార్థన అరణ్యరోదనే అవుతోంది.

బెంగాల్ ఎన్నికల తర్వాత ఫైళ్ల విడుదల మందగించకుండా మొత్తమంతా బయటపెట్టి, డిఎన్ఏ టెస్టు జరిపించి, దాగుడుమూతలు ఆపి, విషయం ఏమిటో చెప్పేస్తే 'సత్యమేవ జయతే' అనే మన నినాదానికి న్యాయం చేసినవారమౌతాము. **-(సమాప్తం) ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2016)**

**ఫిబ్రవరి 27** **ఎమ్బీయస్ : ఇప్పటికైనా కుట్ర అనవచ్చా?**

ఎర్రబెల్లి దయాకరరావుగారు పదిమంది టిడిపి ఎమ్మెల్యేల సంతకాలతో స్పీకరుకి లేఖ పంపుతూ తమ టి-టిడిపిని తెరాసలో విలీనం చేశామని, ఆ విషయం గుర్తించాలని లేఖ రాశారు. పార్టీలో మూడింట రెండు వంతుల మందిని చీల్చడంతో ఫిరాయింపు ముద్ర, రాజీనామా చేసి మళ్లీ ఉపయెన్నికలు ఎదుర్కోవలసిన అగత్యాన్ని తప్పించుకున్నారు. తలసాని టిడిపిలో రాజీనామా చేయకుండా తెరాసలో చేరి మంత్రిపదవి చేపట్టడంపై వివాదం నడుస్తూనే వుంది. ఇప్పుడు అలాటి వాళ్లందరూ నిశ్చింతగా వుండవచ్చు. ఈ మ్యాజిక్ ఫిగర్ 10 చేరేవరకు, ఎర్రబెల్లి టి-టిడిపిలోనే వుంటూ అందర్నీ పోగేసివుంటారని అనుకోవడంలో తప్పు వుందా? ఇది ముందే ప్లాన్ చేసి వుండకపోతే తెరాస కనీసం తలసాని చేత రాజీనామా చేయించి మళ్లీ పోటీ చేయించేది కదా! ఆ అవసరం పడదనే ధీమాతోనే తెరాస యిన్నాళ్లూ విమర్శలు సహిస్తూ వచ్చింది. ఇలాకాక మరోలా ఎలా ఆలోచించాలో నాకైతే తట్టటం లేదు. ఇదేమీ చెల్లదు, వాళ్లంతా ఒకేసారి ఫిరాయించలేదు, అందులో ఆరుగుర్ని పార్టీలోంచి సస్పెండ్ చేశాం కాబట్టి అనర్హులుగా ప్రకటించమని స్పీకరును కోరుతూ ఎర్రబెల్లే కోర్టులో కేసు వేశారు అని టిడిపివారు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు ఎర్రబెల్లి కేసు విత్‌డ్రా చేసుకుంటున్నానని ప్రకటించడం ఖాయం. తర్వాత ఏమవుతుందనేది అప్రస్తుతం కానీ అంత ఎర్రబెల్లి అంతటి కీలకస్థానంలో వుండేట్లా చూడడంలో ముందస్తు ప్రణాళిక లేదనుకోవడం సబబు కాదు.

ఇదంతా రాజకీయకుట్ర అనడం కొంతమందిని నొప్పించింది. రాజకీయంగా ఎప్పుడూ కుట్రలు జరుగుతూనే వుంటాయి. ప్రేమలో, యుద్ధంలో ఏదైనా ఒప్పే అని సామెత. రాజకీయంలో ఎత్తుపైయెత్తులు, కౌటిల్యం పేర కుట్రలు, కూహకాలూ ఎప్పుడూ జరుగుతూనే వుంటాయి. అలా చేయడం వారి జన్మహక్కు అని నాయకులు అనుకుంటారు. సామాన్యప్రజలకు కనీసం వాటిని కుట్రలుగా పేర్కొనే హక్కు కూడా లేదా? నా వ్యాసంలో ఎక్కడా ఎర్రబెల్లితోనే కోవర్టు ఆపరేషన్ ప్రారంభమైందని నేను అనలేదు. మహాభారతంలో శల్యుడే పెద్ద కోవర్టు. కోవర్టు అంటే మన దగ్గర్నుంచి శత్రుపక్షంలోకి పంపబడినవాడు అని ఎవరో అర్థం చెప్పబోయారు. కోవర్టు ఆపరేషన్ అంటే రహస్యంగా చేసే చర్య అనే అర్థం. మన దగ్గర్నుంచి పంపనక్కరలేదు. అక్కడున్నవాణ్నే మనకు అనుకూలంగా మార్చుకోవచ్చు. గూఢచారుల జగత్తులో ఏజంట్లు, డబుల్ ఏజంట్లు పుష్కలంగా వుంటారు. విభీషణుణ్ని అందరూ అనుకునే అర్థంలోనే నేను రాస్తే, ఒకరు నొచ్చుకున్నారు. లోకకల్యాణం గురించి చేశాడన్నారు. రావణుడి పద్ధతి నచ్చక విభీషణుడు పార్టీ మారడం వరకు ఓకే. కానీ యిక్కడకు వచ్చాక అవతలివాళ్ల గుట్టుమట్లు చెప్పడాన్ని ఎలా సమర్థించగలం? రావణుడి పొట్టలో అమృతభాండం వుందని, దాన్ని గురించి విభీషణుడు రాముడికి చెప్పాడనీ వాల్మీకంలో లేదు. కానీ ఇంద్రజిత్తు హోమం చేసే చోటకి లక్ష్మణుణ్ని తీసుకెళ్లి ఆ హోమం జరగకుండా, ఇంద్రజిత్తు భూతబలి యివ్వకుండా అతని చేత భగ్నం చేయించాడని రాసి వుంది. అందుకే యింటిగుట్టు చెప్పి లంకకు చేటు తెచ్చాడన్న పేరుబడ్డాడు. రావణమృతి తర్వాత సింహాసనం వద్దని అని వుంటే అప్పుడు లోకకల్యాణం కోసం గట్రా అంటే నమ్మవచ్చు. ఇప్పుడు మనింట్లో విభీషణుడు పుట్టాడు కదాని అర్జంటుగా ఆ జాతీయాన్ని మార్చడానికి వీలుపడదు.

విభీషణుడు లంకలో పుట్టాడు కానీ మన దగ్గర అలాటివాళ్లు లేరనుకుని పోతారేమోనని, నియరర్ హోమ్, గోల్కొండ ఉదంతం చెప్పాను. అది తెలంగాణ ప్రజలను అవమానించినట్లుగా నాపై కొందరు ఆరోపణ చేశారు. ఎంత హాస్యాస్పదం? అలెగ్జాండర్‌తో చేతులు కలిపిన అంభి గురించి రాస్తే భారతీయులను అవమానపరచినట్లా? చంద్రబాబు ఎన్టీయార్‌ను వెన్నుపోటు పొడిచాడని రాస్తే రాయలసీమ వాళ్లు కోస్తావాళ్లకు ద్రోహం చేశారని రాసినట్లా? రోహిత్ విషయంలో సుశీల్ భావప్రకటనా స్వేచ్ఛ గురించి రాస్తే దానిలో దళిత వ్యతిరేకత చూశారు కొందరు. ప్రతీ విషయాన్ని దళిత-దళితేతర కోణంలో చూడడం చాలనట్లు, యిప్పుడు ప్రాంతీయతావాదం కూడానా? అయినా కాకతీయుల కరవాలాల ధాటి... అని రాసినప్పుడో, గోల్కొండలో కోహినూర్ తళతళలు.. అని రాసినప్పుడే - మాదే మాదే అని, గోల్కొండ ద్రోహి గురించి రాయగానే మాది కాదనగలమా? అయినా అప్పుడు ఆంధ్ర, తెలంగాణ గీతలెక్కడ వున్నాయి? అందరూ ఒకటే జాతి! ఇంకో విషయం గమనించాలి. సాధారణంగా కుట్ర చేసేవాడు, కుట్రకు

బలైనవాడు ఒకే జాతి, చాలా సార్లు ఒకే కులం, బంధువు కూడా అవుతాడు. జయచంద్రుడు, పృథ్వీరాజ్‌లు యిద్దరూ బంధువులే కదా. జయచంద్రుడి వారసుడు విపి సింగ్ దేశప్రధాని కాలేదా? ఏ సంఘటనను ఆ సంఘటన వరకే చూడాలి. ఇలాటివి సహజమేలే అంటూ గతాన్ని గుర్తు చేసినపుడు ఉలిక్కిపడకూడదు.

1971లో తెలంగాణ ప్రజాసమితి స్థాపించి, పది ఎంపీ సీట్లు గెలిచి గంపగుత్తగా కాంగ్రెసులో కలిపేసినపుడు చెన్నారెడ్డిది ద్రోహం, ఇందిరది కుట్ర అనలేదా? పివి నరసింహారావు భూసంస్కరణలకు వ్యతిరేకంగా ఆంధ్ర కాంగ్రెసు నాయకులు జై ఆంధ్ర ఉద్యమం లేవదీసి, పివిని సీటు దింపి, సంస్కరణలను అటకెక్కించి, ఉద్యమాన్ని చెట్టెక్కించినపుడు అది ఆంధ్రప్రజలపై జరిపిన కుట్ర కాదా? వీటన్నిటిని కుట్ర లనకూడదా? ఇప్పుడు ఎర్రబెల్లి దయాకరరావు తెలంగాణ వ్యక్తి కాబట్టి, బాబు ఆంధ్ర వ్యక్తి కాబట్టి కుట్ర అనకూడదంటే, మరి గతంలో తెరాస టిక్కెట్టుపై గెలిచి కాంగ్రెసులోకి మారినవాళ్ల సంగతేమిటి? వాళ్లు తెలంగాణ పేరుపై గెలిచి వైయస్ ఆకర్ష్‌లో పడి ప్రజలకు జెల్ల కొట్టలేదా? అది వైయస్ కుట్ర కాదా? దాన్ని వైయస్ కుట్ర అనాలా, తెలంగాణపై రాయలసీమ కుట్ర అనాలా? 2009లో అటూ, యిటూ ఎమ్మెల్యేలు ఉత్తుత్తి రాజీనామాలు యిచ్చినపుడు అది ప్రజల పట్ల కుట్ర కాదా? రాజీనామాలపై, పార్టీ ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోకుండా స్పీకరు నాన్చిపెడితే అది ప్రజాస్వామ్యం పట్ల కుట్ర అనడం లేదా? ఆంధ్ర స్పీకరు నుండి, లోకసభ స్పీకరు దాకా వైసీపీ అందర్నీ దుయ్యబడుతోంది. ఎస్పీవై రెడ్డి కేసులో ప్రాంతం లెక్కేసి తెలుగువారి పట్ల ఉత్తరాది సుమిత్రా మహాజన్ కుట్ర అనటం లేదు. రేపు – మాటవరసకి – కెటియార్‌ను వారసుడిగా గుర్తించినందుకు అలిగి హరీశ్‌రావు నేడు తెరాస టిడిపిని దఫదఫాలుగా చీల్చినట్లే, తెరాసను అతను చీలిస్తే...? అప్పుడేమనాలి?

అసలు పార్టీ నాయకుడి మాట అటుంచండి, ఒక పార్టీ టిక్కెట్టుపై ఎన్నికయ్యాక పార్టీ మారదామనుకున్నపుడు మళ్లీ ఓటర్ల ఆమోదం తీసుకోవాలి. లేకపోతే వాళ్ల పట్ల కుట్ర చేసినట్లే. ఇది టి-టిడిపి నాయకులకే కాదు, ఆంధ్రలో, యిక్కడా వున్న వైసిపి నాయకులకూ వర్తిస్తుంది. వాళ్లను చేర్చుకుంటున్న పార్టీలు కుట్ర చేస్తున్నాయని అనడంలో సందేహం ఏముంది? తెలంగాణలో టిడిపి కనుమరుగవుతోందని వార్తలు రాగానే కార్యకర్తల మోరేల్ బూస్ట్ చేయడానికి వెంటనే ఆంధ్రలో 25 మంది వైసిపి ఎమ్మెల్యేలు టిడిపిలో చేరుతున్నారనే లీకు వచ్చింది. దాన్ని టిడిపి వేసిన ఎత్తుగా, ట్రిక్కుగా అభివర్ణిస్తే అది ఆంధ్రులను కించపరిచినట్లు అర్థం తీస్తే ఎలా? ఇదెలా వుందంటే ఓటు-నోటు కేసులో చంద్రబాబుకు హస్తం వుందని కెసియార్ అనగానే యావదాంధ్రులకు అవమానం జరిగిందని బాబు గగ్గోలు పెట్టినట్లుంది. ఇక నేను గతంలో జరిగిన కుట్రల గురించి రాశానా లేదా అని కొందరికి సందేహం. అయ్యా నాకు కుట్రలుంటాయనే రాజకీయాలు యిష్టం. రాముడంటే గౌరవం వుంది కానీ యిష్టమైన గ్రంథం భారతమే. అన్నీ వ్యూహప్రతివ్యూహాలే కాబట్టి. ఒట్టి సేవాభావమే కనబరచే వినోబా భావే గురించి రాయమంటే నాకు బోరు. టక్కుటమార విద్యలతో అధికారంలోకి వచ్చిన ఔరంగజేబు గురించి రాయడం యిష్టం. ధీరేంద్రనాథ్ రాసిన పుస్తకానికి మొసలికంటి తిరుమలరావుగారు 'మొఘలాయీ దర్బారు కుట్రలు' పేరుతో చేసిన అనువాదం చిన్నప్పుడు చదివాను. మళ్లీ దొరికితే మీతో పంచుకుందామని ఉబలాటం. అలాగే చాణక్యుడు, రాక్షసుడు పన్నిన పన్నాగాలతో నిండిన 'ముద్రారాక్షసం' కూడా! మన రాష్ట్రంలో కూడా జరిగిన సంఘటనలను ఎందుకు వదిలిపెడతాను స్వామీ, అవి మీ దృష్టికి రాకపోతే నేనేం చేతు? అప్పటికీ కొందరు పాఠకమిత్రులు పాపం గుర్తు తెచ్చుకుని ప్రస్తావిస్తున్నారు కూడా.

నా ఊహాగానంలో తప్పుండవచ్చని నేనే చెప్పాను. ఇప్పుడు ఎర్రబెల్లిని కోవర్టుగా బాబే పంపుతున్నారన్న ఊహాగానంలోనూ సరుకు వుండవచ్చు. కానీ అసలూ వూహే చేయకూడదనడం తప్పు. తెలంగాణ విభజన అనే లక్ష్యం కోసం కెసియార్ ఎన్ని రకాల ఉపాయాలను ప్రయోగించారో చర్చించడంలో తప్పు లేదు. అబ్బే లేదు, ఉపాయాలు, వ్యూహాలు ఏమీ లేకుండానే చెట్టు నుండి ఫలం రాలినట్లు రాలింది అని అనుకునేవాళ్లుంటే వాళ్లకో నమస్కారం. చర్చిస్తే విషం కక్కినట్లు అనుకుంటే రెండు నమస్కారాలు. నిజానికి కెసియార్ వీధుల్లో ఉద్యమం తక్కువగా చేశారు, తెరవెనుక రాజకీయాలతోనే, చర్చలతోనే అనుకున్నది సాధించారు. 2014 దాకా తెలంగాణ వస్తుందని కెసియార్ అనుకోలేదు అని కొందరు రాశారు. అలా అయితే ఆయనా చిరంజీవిలా పార్టీ ఎప్పుడే ఎత్తేసి వుండేవాడు. పుష్కరం పాటు ఎత్తుపల్లాలు చూస్తే మునకలు వేస్తూ యీదుతూండేవాడు కాదు. తను దిగినదే కాక, సొంత పిల్లల్ని దీనిలోకి దింపేవాడు కాదు. పార్టీ నడపడం ఖర్చుతో కూడిన వ్యవహారం. అధికారం లేకుండా అన్నాళ్లు పార్టీ నడిపారంటే ఆయన్ను నమ్మి నిధులు అందచేసినవారెందరో వుండి వుంటారు. టిడిపిని యిరకాటంలో పెట్టడానికి వైయస్సే నెలనెలా డబ్బిచ్చేవాడన్న వదంతీ వుంది. కనపడని శక్తులెన్నో కెసియార్‌కు అండగా నిలిచాయి. బయటకు కనబడేది మాత్రమే మనకు యిప్పుడు తెలుస్తుంది. పాతికేళు పోయాక హోం శాఖలో పనిచేసినవాళ్లెవరో ఆత్మకథ రాస్తే, అప్పుడు విషయం బయటకు వస్తుంది. కనీసం కాంగ్రెసు పట్ల శకుని పాత్ర పోషించిన జయపాల్ రెడ్డి ఆత్మకథ రాసినా చాలా తెలుస్తుంది.

దక్షిణాది రాష్ట్రాలలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముందుకు దూసుకుపోవడం సహించలేని తమిళ, కర్ణాటక నాయకులు ఆంధ్రను చీల్చి బలహీనపరచాలన్న ప్రణాళిక ఎప్పణ్నుంచో వేసుకున్నారు. చిదంబరం వారిలో ప్రథముడు. అతని అనుచరుడు హోం శాఖలో పిళ్లయ్ వున్నాడు. వాళ్లు ముందునుంచి ప్లాను వేసుకుని వున్నారు. 2009 డిసెంబరు 9 నాటి ప్రకటన ఎలా వెలువడిందో ఒక్కసారి గుర్తు చేసుకోండి. అసలు కెసియార్ నిరాహారదీక్షకు చేపట్టిన కారణం ఏమిటి, వాళ్ల ప్రకటన దేని గురించి? ఆ నాటి ప్రకటన ఎలా వుండాలో డ్రాఫ్ట్ చేసిన వారిలో జయపాల్ రెడ్డి, జయశంకర్, కెసియార్ వున్నారని తర్వాత వాళ్లే చెప్పుకున్నారు కదా. నిమ్స్‌లో

కెసియార్ ఆరోగ్యస్థితిపై రిపోర్టులు యిప్పటివరకు బయటకు వచ్చాయా? కేంద్రంలో కొందరు కెసియార్‌ను ఉపయోగించుకుని తమ లక్ష్యం సాధించుకున్నారు. ఆయన నీరసపడినప్పుడు విభజన తథ్యం, వదిలిపెట్టకు అని వెన్ను తడుతూ వచ్చారు. విభజిస్తే తెలంగాణ ప్రజలు మీ కాళ్లు కడుగుతారంటూ సోనియా, రాహుల్‌ను పూర్తిగా తప్పుదోవ పట్టించారు. నువ్వు ఒకందుకు పోస్తే, నేను మరొకందుకు తాగాను అన్నట్లు కెసియార్ వారికి సహకరించారు, లక్ష్యం సాధించారు. ఈ రోజు కెసియార్ వేరెవరికీ ఘనత కట్టబెట్టకుండా సర్వం తనవలనే జరిగిందని చెప్పుకుంటూ వుంటే జయపాల్ రెడ్డి 'శుంఠ' పదానికి అర్థాన్ని గ్రహించిన ఆత్మజ్ఞానిలా, పుచ్చుబతాణీ నమిలిన వేదాంతిలా మొహం పెట్టి భరిస్తున్నారు. నాకు నచ్చనిది కనబడితే సొంత పార్టీనైనా విమర్శిస్తా నంటూ కాంగ్రెసులో వుండగా చెలరేగిపోయినా కేశవరావు గొంతు యిప్పుడు మూగబోయిందేం? వ్యక్తి మారాడా? వ్యక్తిత్వం మారిందా? సిద్ధాంతాలు మారాయా? గతంలో ప్రభుత్వం చేపట్టిన ప్రతి పథకంపై విరుచుకు పడిన తెలంగాణ ఉద్యమకారులందరూ యిప్పుడు కెసియార్ చేస్తున్న అనేకానేక తలతిక్క పనులపై నోరు మెదపరేం? అప్పుడున్న నిర్భయత్వం, చిత్తశుద్ధి, తెలంగాణ పట్ల అంకితభావం గట్రా ఎక్కడ దాక్కున్నాయి?

రాష్ట్రం విడిపోతే పదవులు పెరుగుతాయంటే ఒకాయన నాకు మతి పోయిందన్నాడు. కొత్త జిల్లా ఏర్పడితేనే కొత్త కలక్టరు, డియస్పీ, జెడ్పీటీసీ యిత్యాది పోస్టులు వచ్చినపుడు కొత్త రాష్ట్రం ఏర్పడితే రావా? గతంలో ఒక చీఫ్ సెక్రటరీ, ఒక డిజిపి.. మరి యిప్పుడు? పదవులంటారా? గతంలో వున్న పిఆర్‌ఓలు, సలహాదార్లు, ప్రెస్ ఎకాడమీ చైర్మన్లు, కార్పోరేషన్ చైర్మన్లు ఎంతమంది? ఇప్పుడెంత మంది? ఒక్కో కార్పోరేషన్ రెండుగా చీలితే పదవులు రెట్టింపు కావా? ఈ సింపుల్ లాజిక్ ఎలా మిస్సయ్యారు స్వామీ? ఇది దీనికి పెద్ద చదివేసి ఉన్న మతి పోగొట్టుకోనక్కరలేదు. ఒక రైతు సంఘం రెండుగా విడిపోత్తే యిద్దరు అధ్యక్షులు, యిద్దరు కార్యదర్శులు, యిద్దరు సహాయ కార్యదర్శులు.. తయారవుతారని చదువురాని రైతు కూడా చెప్తాడు. ...ఇంకో ఆయన నేను 2019లో ఏం రాయబోతేనే వూహించారు. నేను అప్పటిదాకా బతికి వుంటానో లేదో, వున్నా రాయగలిగే స్థితిలో వుంటానో లేదో కూడా నాకే తెలియదు. ఆయన భవిష్యవాణి కాస్త ఆశ కలిగించింది. ...కెసియార్, చంద్రబాబులో ఎవరు ఎక్కువ చాణక్యులనేది డిబేట్‌కు పెట్టలేం. ఎవరైనా కొంతకాలమే వెలుగుతారు. ఒక్కోప్పుడు ఒక్కోరిది పైచేయి అవుతుంది. ఎమర్జన్సీ సీరీస్‌లో కామరాజ్ కథ చదవండి.

వ్యాసంపై 50కు పైబడి వ్యాఖ్యలు వచ్చాయి. 1994లో కాంగ్రెసు పూర్తిగా దెబ్బతిన్నప్పుడు, 2004లో టిడిపి బాగా దెబ్బతిన్నపుడు జరగని మాస్ స్కేల్ ఫిరాయింపులు యిప్పుడు తెలంగాణలో ఎందుకు జరుగుతున్నాయి అన్నదానికి ఎవరూ సరైన సమాధానం చెప్పలేదు. నాయకుడికి అధికారమే కావాలి అంటే మరి ఆంధ్రలో కూడా వైసిపి తుడిచిపెట్టుకుని పోవాలిగా! టి-టిడిపి నాయకులకు ఆశ పోయింది కాబట్టి తెరాసలో చేరుతున్నారు అంటున్నారు. ఎందుకు పోవాలి? తెరాస కూడా నాయకులతో కిక్కిరిసి పోతే రేపు టిక్కెట్టు దొరుకుతుందన్న నమ్మకం వుందా? టిడిపి, కాంగ్రెసు పార్టీలకు నిధుల కొరత లేదు. ఎన్నికలలో నిలబడితే హై కమాండ్ నుంచి డబ్బులు వస్తాయి. తెరాసలో అయితే పూర్తిగా కుటుంబపాలనే. ఇప్పుడున్న మంత్రులే పనులు చేయించుకోలేక పోతున్నారు. వీళ్లు వచ్చి ఏం చేస్తారు? ఇంకో మాట – టిడిపి, కాంగ్రెసుల నుండే ఎందుకు మారుతున్నారు? బిజెపి నుండి ఎందుకు మారటం లేదు? వాళ్లకు పదవీలాలస లేదా? తమ నియోజకవర్గంలో పనులు జరగాలన్న (తెరాసలో మారేవాళ్ల స్టాండర్డ్ ఎక్స్‌క్యూజ్ యిది) కోరిక లేదా? ఈ ప్రశ్నలకు సమాధానం దొరికేవరకూ నా కుట్ర థియరీని ఒక హైపోథిసిస్‌గా అంగీకరించి పక్కన వుండనీయండి.

**– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2016)**

**ఫిబ్రవరి 28** **ఎమ్బీయస్ : యూరోప్ గాథలు 27**

ఇప్పుడు సీజర్ గురించి కాస్త విపులంగానే చెప్పుకోవాలి. ఎందుకంటే రోమ్ అనగానే సీజర్ ప్రథమంగా గుర్తుకు వస్తాడు. అతనికి సంబంధించిన ఆనవాళ్లు రోమ్‌లో చాలా కనబడతాయి. క్లియోపాత్రాతో అతని ప్రణయం, అతని హత్య.. యివన్నీ చదవడానికి చాలా ఆసక్తికరంగా వుంటాయి. సీజర్ క్రీ.పూ. 100లో జులై 12 న రోమ్‌లో పుట్టాడు. అతని మేనత్త భర్త, శూరుడు అయిన మారియస్ స్థాపించిన ప్రజల పార్టీ అయిన పాప్యులారెస్‌లో సభ్యుడిగా చేరి అందరి దృష్టిని ఆకర్షించాడు. జూపిటర్ ఆలయంలో పూజారిగా నియమించబడ్డాడు. 17 వ యేట అతను సిన్నా అనే సెనేటర్ కూతురైన కార్నీలియాను పెళ్లాడి రాజకీయంగా బలపడ్డాడు. మారియస్‌కు, మరో సేనాని, కాన్సల్ అయిన శూలాకు పడేది కాదు.

శూలా రోమ్‌ను నియంతలాగే పాలించాడు. అతను గొప్ప శూరుడు, అనేక రాజ్యాలు జయించాడు. మద్యపానంతో ఆరోగ్యం దెబ్బ తిని తనంతట తానే అధికారం నుంచి తప్పుకున్నాడు. తన క్రూరపరిపాలనలో అనేకమంది శత్రువులను చంపివేశాడు. మారియస్ శిష్యుడు కదాని సీజర్‌పై పడ్డాడు. పెళ్లయిన ఏడాదికే కార్నీలియాకు విడాకులు యిమ్మనమని సీజర్‌ను ఆదేశించాడు. సీజర్ నిరాకరించాడు. దాంతో శూలా పగబట్టాడు. సీజర్‌ను చంపేద్దామనుకున్నాడు కానీ అతని తల్లి వైపు బంధువులు శూలా అనుయాయులు కావడంతో బతికిపోయాడు. అయినా రోమ్‌లో వుంటే ప్రమాదమని భావించారు. చిన్నప్పుడు కూడా యిలాటి భయంతోనే పై చదువులకు గ్రీసు పంపించివేశారు. ఇప్పుడు అతను క్రీ.పూ. 81లో ఆసియా మైనర్‌కు పారిపోయాడు.

రోమ్ సైన్యపు తూర్పు మధ్యధరా దళంలో చిన్న అధికారిగా చేరిన సీజర్ సిసిలియాలో మిత్రిడేట్స్‌కు వ్యతిరేకంగా తన యుద్ధపాటవాన్ని ప్రదర్శించి, పేరుప్రఖ్యాతులు సంపాదించి, క్రీ.పూ. 78లో శూలా మరణం తర్వాత రోమ్‌కు తిరిగి వచ్చాడు. అందరిలో గుర్తింపు తెచ్చుకోవాలని వింతగా దుస్తులు ధరిస్తూ రాజకీయ భావాల్లో తీవ్రంగా వ్యక్తం చేసేవాడు. మేజిస్ట్రేటుగా డోలబెల్లా అవినీతి ఆరోపణలపై విచారించి శిక్షలు విధించాడు. ప్రజాజీవితంలో పైకి రావాలంటే వక్తృత్వం వుండాలని భావించి క్రీ.పూ. 76లో రోడ్స్ వెళ్లి వక్తగా శిక్షణ పొందాడు. ఆ ప్రయాణంలో అతన్ని సముద్రపు దొంగలు పట్టుకున్నారు. 20 టాలెంట్లు యిచ్చి విడిపించుకున్నాడు. ఆ తర్వాత కొన్ని నౌకలు అద్దెకు తీసుకుని పైరేట్స్ స్థావరంపై దాడి చేసి, పట్టుకుని వారందరినీ ఉరి తీశాడు. ఇది అతనికి బాగా పేరు తెచ్చిపెట్టింది. పదిమందీ అతన్ని గుర్తించసాగారు. సీజరుకు తన పబ్లిక్ యిమేజి ఎలా కాపాడుకోవాలో బాగా తెలుసు. అతనికి చిన్నతనంలోనే బట్టతల వచ్చేసింది, మైగ్రేన్ తలనొప్పి వచ్చేది, మూర్ఛలు వచ్చేవి. అవన్నీ బయటపడకుండా జాగ్రత్త పడేవాడు.

మరో రెండేళ్లకు మిలటరీ ట్రైబ్యూన్‌లో ప్రవేశించాడు. శూలా తయారుచేసిన రాజ్యాంగాన్ని తిరగరాయడంలో సహాయపడ్డాడు. మరో ఆరేళ్లకు క్రీ.పూ. 68లో స్పెయిన్‌లో పబ్లిక్ ట్రెజరర్ (క్వాయిస్టర్)గా నియమితుడయ్యాడు. ఆ పై ఏడాది అతని భార్య కార్నీలియా చనిపోయింది. పాంపేకు వరుసకు సోదరి, శూలాకు మనుమరాలు అయిన పాంపియాను పెళ్లాడాడు. శూలా సైన్యంలో పనిచేస్తూ పాంపే చిన్నవయసులోనే గొప్ప సేనానిగా పేరు తెచ్చుకున్నాడు. ప్రజలు అతన్ని ఆరాధించేవారు. క్రీ.పూ. 70లో క్రాసస్, పాంపే యిద్దరూ కాన్సల్స్‌గా పని చేశారు. శూలా సేనానిగా స్పార్టకస్ విప్లవాన్ని అణచివేసిన క్రాసస్, బానిస వ్యాపారం చేసి, గనులు కొని పుష్కలంగా డబ్బు ఆర్జించాడు. అతనికి ఆవేశం ఎక్కువ. తన కోపతాపాలతో శూలాకు కూడా దూరమయ్యాడు. క్రాసస్‌కు పాంపే అంటే అసూయ. తర్వాతి కాలంలో పాంపే రోమన్ సైన్యం తరఫున విదేశీ దండయాత్రల్లో పాలు పంచుకున్నాడు. సముద్రపు దొంగలు రోమన్ మేజిస్ట్రేట్లను అపహరించినప్పుడు పాంపే మధ్యధరా సముద్రంలోని దీవులపై దాడి చేసి వాళ్లను విడిపించాడు. దానికి మూడేళ్లు పట్టింది. అతనికి కమాండర్ –యిన్– చీఫ్ పదవి దక్కింది.

క్రీ.పూ. 65 వచ్చేసరికి సీజర్‌కు రోమ్‌లో నిర్మాణాలు పర్యవేక్షించే మేజిస్ట్రేటు పదవికి ఎన్నిక వచ్చింది. దానికి యితను పోటీ పడ్డాడు. క్రాసస్ నుండి డబ్బు అప్పు తెచ్చి ధారాళంగా ఖర్చు పెట్టేడు. నెగ్గాడు. అతని మేనత్త భర్త, తన రాజకీయ గురువు అయిన మారియస్ జర్మనీపై యుద్ధం చేసిన పతాకాలను శూలా గతంలో స్వాధీనం చేసుకున్నాడు. ఇప్పుడు పదవిలో వచ్చాక సీజర్ ఆ పతాకాలను వారి కుటుంబానికి తిరిగి యిచ్చేయడమే కాక, మేనత్త చచ్చిపోతే అంత్యక్రియలు అధికార లాంఛనాలతో నిర్వహించాడు. తనను తాను మారియస్ వారసుడిగా ప్రకటించుకుని రాజకీయంగా అనుయాయులను పెంచుకున్నాడు. శూలా వ్యతిరేకులందరూ తన చుట్టూ తిరిగేట్లు చేసుకున్నాడు. ఈ ప్రయత్నాల వలన రెండేళ్ల తర్వాత క్రీ.పూ. 63 నాటికి సీజర్ పాంటిఫిక్స్ మాగ్జిమస్ పదవికి ఎన్నికయ్యాడు. అది కాన్సల్ పదవికి ఒక మెట్టు మాత్రమే తక్కువ. (మూడేళ్ల తర్వాత కాన్సల్ కూడా అయిపోయాడు) ఈ పదవి మతవ్యవహారాలను పర్యవేక్షించే పదవి. రోమ్‌లోని అధికారమతం ఎలా అవలంబించబడుతోందో గమనించడానికి అనేకమంది పూజారులుంటారు. వారందరిపై అజమాయిషీ సీజర్‌ది.

ఈ పదవి వచ్చినందుకు క్రీ.పూ. 62లో సీజర్ భార్య పాంపియా వాళ్ల యింట్లో 'బోనా దియా' (మంచి దేవత) పేర ఒక రహస్య పూజ నిర్వహించింది. దానిలో స్త్రీలు మాత్రమే పాల్గొనాలి. అయితే పూబ్లియస్ క్లోడియస్ పుల్చర్ అనే ఒక యువకుడు ఆడదానిలా వేషం వేసుకుని ఆ పూజలో చొరబడ్డాడు. అందరూ మద్యం సేవించిన వేళ పాంపియాను అనుభవిద్దామని అతని ప్లాను. కానీ అతను పట్టుబడ్డాడు. అతను పాంపియాకు ప్రియుడని, ఆమెయే అతన్ని పిలిపించుకుందనీ పుకార్లు వచ్చాయి. పూజకు భంగం కలిగించినందుకు అతనిపై విచారణ జరిగింది. సీజర్ అతనికి వ్యతిరేకంగా సాక్ష్యం ఏమీ చెప్పకపోవడంతో అతన్ని విడిచిపెట్టేశారు. అయితే సీజర్ కూడా తన భార్యను విడిచిపెట్టేశాడు. అదేం? అంటే "సీజర్ భార్య అంటే ఆమెపై ఎవరూ సందేహం లేవనెత్తే స్థితిలో వుండకూడదు." (సీజర్స్ వైఫ్ మస్ట్ బి ఎబవ్ సస్పిషన్) అని జవాబిచ్చాడు. రాజనీతిలో అది ఒక సిద్ధాంతంగా ఉదహరిస్తారు. రామాయణంలో లేకపోయినా జనశ్రుతంగా వస్తున్న రాముడి సీతాపరిత్యాగం కథలో రాముడూ యిలాగే అంటాడు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2016)**

**ఎమ్బీయస్ క్రైమ్ రచన – 13**

**ఫిబ్రవరి 30, 31** **ఎమ్బీయస్– ఇందిర గొంతు అనుకరించి 60 లక్షల దగా**

1971 మే 24. ఢిల్లీలోని స్టేటు బ్యాంక్ ఆఫ్ ఇండియా, పార్లమెంటు స్ట్రీటు బ్రాంచ్‌లో చీఫ్ కాషియర్‌గా పనిచేస్తున్న వేద్ ప్రకాశ్ మల్‌హోత్రాకు మధ్యాహ్నం 11.30కు ఒక ఫోన్‌కాల్ వచ్చింది. "నేను ప్రధాని ఆఫీసు నుంచి పిఎన్ హక్సర్‌ను మాట్లాడుతున్నాను. కాస్సేపు వుండండి, ప్రధాని ఇందిరా గాంధీ మీతో మాట్లాడతారు." అని ఫోన్లో ఒకతను చెప్పాడు. కొన్ని నిమిషాల తర్వాత అందరికీ సుపరిచితమైన ఇందిర వాయిస్ వినబడింది. "బంగ్లాదేశ్‌లో నిర్వహిస్తున్న ఒక రహస్య కార్యక్రమానికి అర్జంటుగా రూ.60 లక్షలు అవసరం పడ్డాయి. ఇది జాతీయభద్రతకు సంబంధించిన వ్యవహారం. అందుచేత మీరు వెంటనే ఆ డబ్బు రెడీ చేసి కారులో

చాణక్యపురి వద్దకు తీసుకురండి. అక్కడకు నా తరఫు మనిషి ఒకతను వస్తాడు. నేను యిప్పుడు చెప్తున్న కోడ్‌వర్డ్ 'బంగ్లాదేశ్ బాబు' అని మీతో అంటాడు. "మీరు 'బార్‌ఎట్‌లా' అనాలి. అప్పుడు అతనికీ మీరు ఫలానా అని తెలుస్తుంది. మీరు డబ్బు అతనికి అప్పగించిన ఆ తర్వాత పార్లమెంటు హౌస్‌కు వచ్చి నన్ను కలిసి ఆ డబ్బుకు రసీదు తీసుకోండి." అని చెప్పారు. "సరే, మాతాజీ" అన్నాడు మల్‌హోత్రా. వెంటనే తన అసిస్టెంట్లు ఆర్ పి బాత్రా, ఎచ్ ఆర్ ఖన్నాలను పిలిచి చెస్ట్ లోంచి డబ్బు తీయమన్నాడు. క్యాష్ అడిగితే డిప్యూటీ చీఫ్ క్యాషియల్ రావల్ సింగ్ ఓచరుమీద ఎవరు సంతకం పెడతారని అడిగాడు. 'మల్‌హోత్రా పెడతాడు' అని జవాబిచ్చాడు ఖన్నా. సరే అని డబ్బు తీసి యిచ్చాడు రావల్ సింగ్. చెస్ట్ లోంచి డబ్బు బయటకు రాగానే అసిస్టెంట్లిద్దరూ బ్యాంకు ట్రంకు పెట్టెల్లో రూ. 60 లక్షలు సర్ది యిద్దరు పనివాళ్ల ద్వారా కారులో పెట్టించారు. మల్‌హోత్రా ఆ డబ్బుతో చాణక్యపురిలో చెప్పిన చోటుకి చేరాడు. విదేశీరాయబారుల నివాసాలన్నీ అక్కడే వున్నాయి.

తెల్లగా, పొడుగ్గా, భారీగా 50 ఏళ్ల వయసులో వున్న రుస్తుమ్ సొహ్రాబ్ నగర్‌వాలా కారు వద్దకు వచ్చి కోడ్‌వర్డ్ చెప్పగానే మల్‌హోత్రా అతన్ని కారులో ఎక్కనిచ్చాడు. సర్దార్ పటేల్ రోడ్డు, పంచశీల్ మార్గ్ కలిసే చోట వున్న టాక్సీ స్టాండ్‌కు పోనివ్వమన్నాడు. 65 కిలోల బరువున్న క్యాష్ ట్రంకు పెట్టెలను టాక్సీలో ఎక్కించుకుని "ప్రధాని దగ్గర్నుంచి రసీదు తీసుకోండి." అంటూ వెళ్లిపోయాడు. మల్‌హోత్రా పార్లమెంటు హౌస్‌కు వెళితే ప్రధాని లేరు. అప్పుడు ఆవిడ సెక్రటరీ పి ఎన్ హక్సర్ వద్దకు వెళ్లి రసీదు కోసం అడిగితే ఆయన చివాట్లు వేసి ఎవడో మిమ్మల్ని దగా చేశాడు, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయండి అన్నారు. మల్‌హోత్రా వెంటనే పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. పోలీసులు వెంటనే డి కె కాశ్యప్ అనే ఎఎస్‌పికి నగర్‌వాలాను పట్టుకునే బాధ్యత అప్పగించారు. దీనికి 'ఆపరేషన్ తూఫాన్' అని పేరు పెట్టారు. నిజంగా తుపాను స్పీడుతో కేసు నడిచి, ముగిసింది.

పోలీసులు టాక్సీ స్టాండ్‌కి వెళ్లి నగర్‌వాలాను ఎక్కించుకున్న టాక్సీ డ్రైవరును పట్టుకున్నారు. అతను నగర్‌వాలాను డిఫెన్సు కాలనీలో విడిచి పెట్టానని చెప్పాడు. అక్కణ్నుంచి అతను మరో టాక్సీ తీసుకున్నాడు. ఆ టాక్సీవాడు కథంతా చెప్పాడు – 'రాజేంద్రనగర్‌లో ఓ యింటికి తీసుకెళ్లాడు. ఒక పెద్ద సూటుకేసు వుంది ఆయనతో. నా ఎదురుగానే డబ్బు ట్రంకు లోంచి సూటుకేసులోకి మర్చాడు. బంగ్లాదేశ్‌లో ఒక మిషన్ గురించి తీసుకెళుతున్నా, ఈ రహస్యం ఎవరికీ చెప్పవద్దు అంటూ నాకు 500 రూ.లు యిచ్చాడు.' అన్నాడు. ఆ తర్వాత నగర్‌వాలా పాత ఢిల్లీలోని నికల్సన్ రోడ్డుకు, అక్కణ్నుంచి బహదూర్ షా జఫర్ మార్గ్‌లోని పార్సీ ధర్మశాలలోని తన గదికి వెళ్లిపోయాడు. ఇన్ని క్లూలు వదిలేయడంతో రాత్రి 9.45 కల్లా అతను పట్టుబడినట్లు, అతని దగ్గర రూ.30 వేలు దొరికినట్లు పోలీసులు ప్రకటించారు. 6 వేల రూపాయలు అప్పటికే ఖర్చు పెట్టేశాడు. తక్కిన డబ్బు డిఫెన్సు కాలనీలోని ఎన్ బి కెప్టెన్ అనే అతని మిత్రుడి యింట్లో పెట్టిన సూటుకేసులో దొరికిందన్నారు. అర్ధరాత్రి కల్లా అతను తన నేరాన్ని ఒప్పేసుకున్నట్లు, విచారణ ముగిసినట్లు కూడా ప్రకటించేశారు. ఇంత మెరుపువేగం ఏ కేసులోనూ కనబడదు.

ఇక యిప్పుడు కేసు పెట్టాలి. మల్‌హోత్రా యిచ్చిన ఫిర్యాదుపై, అతని మీదనే సెక్షన్ 409 ఐపిసి (కేంద్ర ఉద్యోగి విశ్వాసఘాతుకం) కింద పెట్టారు. తర్వాత దాన్ని మార్చి అతని అసిస్టెంటు ఎచ్ ఆర్ ఖన్నా ఫిర్యాదు చేసినట్లు రాసుకుని సెక్షన్ 419 (వేరే మనిషిలా నటించడం), సెక్షన్ 420 (మోసగించడం) కేసు పెట్టారు. తర్వాత మల్‌హోత్రాకు దురుద్దేశం లేకపోయినా పొరపాటు పడినట్లు (ఎర్రర్ ఆఫ్ జడ్జ్‌మెంట్) తీర్మానించి వదిలిపెట్టేశారు. 48 గంటల్లోనే నగర్‌వాలాపై కేసు పెట్టేశారు. కోర్టులో సాక్ష్యాలు ప్రవేశపెట్టలేదు. క్యాషియర్ మల్‌హోత్రాను, డబ్బు దాచిన యింటి ఓనరు కెప్టెన్‌ను, టాక్సీ డ్రైవర్‌ను ఎవర్నీ రప్పించలేదు. ఇందిరా గాంధీని సాక్షిగా పిలవలేదు సరి కదా, ఆమె స్టేటుమెంటు రికార్డు కూడా చేయలేదు. నగర్‌వాలా ఒప్పుకోలు పత్రంపై ఆధారపడి కేసు నడిచింది. 10 నిఎలలో ప్రాసిక్యూషన్ వాదన ముగిసింది. తీర్పు కూడా వచ్చేసింది. నాలుగు సంవత్సరాల జైలు, రూ. 4000 ల జరిమానా విధించారు. ఈ తీర్పు వచ్చిన తర్వాత పోలీసులకు మల్‌హోత్రాపై కూడా కేసు పెట్టాలని తోచింది. మే 29 న ఆయన మీద ఐపిసి 409 కింద కేసు పెట్టారు. అప్పుడు నగర్‌వాలా తన తీర్పుపై సెషన్స్ కోర్టులో అప్పీలు చేసుకున్నాడు. మల్‌హోత్రాపై కేసు విచారణ జరిగి తీర్పు వచ్చిన తర్వాతనే తన అప్పీలు విచారించాలని కూడా నగర్‌వాలా కోరాడు. కానీ నవంబరు 16 న అతని అప్పీలు తిరస్కరించబడింది. మల్‌హోత్రాపై కేసు వీగిపోయింది కానీ నగర్‌వాలా మృతి తర్వాత 1972 నవంబరులో అతన్ని బ్యాంకు సర్వీసు నుంచి డిస్మిస్ చేశారు. అతనితో బాటు మరో నలుగురు బ్యాంకు ఆఫీసర్లపై చార్జిషీటు పెట్టారు.

ఈ కేసు దేశప్రజల్లో అనేక సందేహాలను లేవనెత్తింది. ఫోన్ కాల్ చేసినంత మాత్రాన బ్యాంకు చీఫ్ కాషియర్ డబ్బెలా యిచ్చేస్తాడు? ఏ ఖాతాలోంచి యిచ్చాడు? ఇలా యిచ్చే సంప్రదాయం ముందునుంచీ వుందా? ఇది ఇందిరా గాంధీకి లేదా కాంగ్రెసుకు చెందిన నల్లధనమా? నగర్‌వాలాకు ముఖపక్షవాతం వచ్చి మాట ముద్దగా వుంటుంది. అతను ఇందిర గొంతును ఎలా అనుకరించగలడు? అతనికి వేరే మహిళ సహకరించిందా? మరి ఆమెపై కేసు పెట్టలేదేం? నగర్‌వాలాకు మోసం చేసే ఉద్దేశమే వుంటే అన్ని సాక్ష్యాలు ఎందుకు వదిలేస్తాడు? డబ్బు తీసుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోకుండా సొంత గదికే ఎందుకు వెళతాడు? తన తరఫున డిఫెన్సు లాయరును ఎందుకు పెట్టుకోలేదు? బ్యాంకింగ్ వ్యవస్థ ఎంత అస్తవ్యస్తంగా చూపుతూ, డిపాజిటర్ల నమ్మకాన్ని అతలాకుతలం చేస్తూ 60 లక్షలు కొట్టేస్తే అంత తక్కువ శిక్షా? ముందుగా అనుకోలేదు, అప్పటికప్పుడు ఐడియా వేసి కొట్టేశా అని అతనంటే కోర్టు ఎలా నమ్మింది? ఆ బ్యాంకుకే, ఆ బ్రాంచ్‌కే, ఆ చీఫ్ క్యాషియరుకే ఎందుకు ఫోన్ చేశావ్ అని అడగవద్దా? ఒక ఓచరు లేకుండా, చెక్కు లేకుండా, ఖాతాలు నిర్వహించే అధికారి సంతకం లేకుండా, మల్‌హోత్రా అంత బాధ్యతారాహిత్యంగా 60 లక్షలు బయటకు

పట్టుకుని వచ్చేస్తే పోలీసులు అతనిపై కాఠిన్యం చూపలేదేం? మళ్లా నగర్‌వాలా మరణం తర్వాతనే డిస్మిస్ చేశారేం? వీటిపై ప్రధానికాని, ప్రధాని కార్యాలయం కానీ నోరు మెదపరేం?.. యిలా అన్నీ ప్రశ్నలే.

బ్యాంకు డబ్బును సొంత ప్రయోజనాలకు వాడుకోవడానికే ఇందిర బ్యాంకులను జాతీయం చేసిందని ప్రతిపక్ష నాయకులు బయట ప్రచారం చేస్తూనే లోపల్లోపల యిది బంగ్లాదేశ్ ఆపరేషన్‌కు సంబంధించిన చర్యలో భాగమని సందేహించారు. నగర్‌వాలా శిక్షను ఛాలెంజ్ చేస్తూ రివిజన్ పిటిషన్ వేసే విషయం పరిశీలించడానికి వాజపేయి, మొరార్జీ, రాజ్ నారాయణ్, పిఎన్ లేఖీ వంటి ప్రతిపక్ష నాయకులు సమావేశమయ్యారు. చర్చలు చాలాసేపే జరిగాయి కానీ రివిజన్ పిటిషన్‌పై సంతకం పెట్టడానికి ఎవరూ సాహసించలేదు. చివరకు రాజ్ నారాయణ్ వద్ద ప్రయివేటు సెక్రటరీగా పనిచేసే ఊర్మిళేష్ ఝా సంతకం పెట్టాడు. పిఎన్ లేఖీ ఢిల్లీ హైకోర్టులో జూన్ 7న పిటిషన్ పడేసాడు. నగర్‌వాలా తరఫున వాదించడానికి ప్రభుత్వం నియమించిన లాయరు ఆర్ కె మహేశ్వరి, యీ పిటిషన్‌ను సమర్థించకపోగా వ్యతిరేకించాడు!

ఇలా ఎన్నో ఆశ్చర్యాలకు తోడు నగర్‌వాలాకు జైల్లో వుండగానే 1972 ఫిబ్రవరిలో గుండెపోటు వచ్చింది. తీహార్ జైలు ఆసుపత్రిలో చేర్చారు. ఫిబ్రవరి 21న జిబి పంత్ ఆసుపత్రికి మార్చారు. చివరకు 1972 మార్చి 2న తన 51 వ పుట్టినరోజు నాడు మరణించాడు. అంతకుముందే 1971 నవంబరు 20 న అతని కేసు విచారించిన కాశ్యప్ హనీమూన్‌కు వెళ్లబోతూ కారు యాక్సిడెంటులో పోయాడు. ఈ చావులన్నిటికీ ఇందిరా గాంధీయే బాధ్యురాలనే పుకారు విపరీతంగా బలపడింది. ప్రతిపక్షాలు దీనికి బాగా ఆజ్యం పోసాయి. చివరకు వారు 1977లో అధికారంలోకి వచ్చాక ఈ విషయం జస్టిస్ జగన్మోహన్ రెడ్డిగారి అధ్యక్షతన ఒక కమిటీ వేశారు. 1978లో యిచ్చిన 820 పేజీల నివేదికలో ఆయన నగర్‌వాలా మృతి సహజమైనదే అని చెప్పడం మినహా తక్కిన ఏ సందేహాన్నీ నివృత్తి చేయలేకపోయారు. అధికారులు సహకరించటం లేదు, ఏ సమాచారమూ యివ్వటం లేదు అని ఫిర్యాదు చేయడమే కాక, రిపోర్టులో కూడా రాశారు. అప్పుడు అధికారంలో వున్న జనతా ప్రభుత్వం తన అధికారులపై ఒత్తిడి తెచ్చి సమాచారం ఎందుకు రాబట్టలేదో, నిజాలు ఎందుకు బయటపెట్టలేదో ఒక మిస్టరీగా మిగిలిపోయింది.

వీటి కారణంగా యిదంతా భారత యింటెలిజెన్సుకు చెందిన వ్యవహారమని, దేశభద్రత దృష్ట్యా కాంగ్రెసే కాదు, అధికారంలోకి వచ్చిన ప్రతిపక్షాలు కూడా దాన్ని గోప్యంగా వుంచుతున్నారని అంచనాలు వున్నాయి. ఈ అంచనాకు ఊతమిచ్చే అంశాలు కొన్ని వున్నాయి. నగర్‌వాలా మామూలు వ్యక్తి కాదు. బ్రిటిషు ఆర్మీలో పని చేసిన మాజీ మిలటరీ యింటెలిజెన్సు ఆఫీసరు. బ్రహ్మచారి, వ్యసనాలేమీ లేవు. ఇంటెలిజెన్సు శాఖకు, రా (రిసెర్చి అండ్ ఎనాలిసిస్ వింగ్ పేర నడిచే భారత గూఢచారి సంస్థ)కు నమ్మకమైన మనిషి. ఆర్మీ-బిఎస్ఎఫ్-రా దళాలు సంయుక్తంగా చేపట్టిన బంగ్లాదేశ్ మిషన్‌లో ట్రైనింగ్ ఆఫీసరు. అతను గ్రాజువేట్ కాకపోయినా జపాన్‌లో ఒక విద్యాసంస్థలో ఇంగ్లీషు టీచరుగా ఐదేళ్లు పనిచేశాడు. అంటే అక్కడ మనదేశం తరఫున గూఢచర్యం చేశాడని భావించాలి. నిజానికి తను అరెస్టు కాగానే నగర్‌వాలా ప్రధానితో కానీ, బిఎస్ఎఫ్‌కు డైరక్టరు జనరల్‌గా వున్న రుస్తొంజీతో కానీ మాట్లాడాలని కోరాడు. రుస్తొంజి పార్శీ, కుటుంబస్నేహితుడు కూడా. ఇంత కనక్షన్స్ వున్న నగర్‌వాలా కేవలం చీట్ అనుకోవడానికి వీలు లేదు.

అప్పుడు తూర్పు బెంగాల్‌లో (బంగ్లాదేశ్ యింకా ఏర్పడలేదు) పాకిస్తాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ముక్తివాహిని పేర తిరుగుబాటు దారులు విప్లవం లేవదీస్తున్నారు. వారికి భారతప్రభుత్వం చాటుగా సాయపడుతోంది. తూర్పు పాకిస్తాన్‌కు సరిహద్దు గ్రామాల్లో అంతర్జాతీయసమాజానికి తెలియకుండా భారత సైనిక యింటెలిజెన్సు వారికి తర్ఫీదు యివ్వడానికి నిశ్చయించుకుంది. మే నెలలో టైగర్ సిద్దిఖీ అనే 21 ఏళ్ల గెరిల్లా యోధుడు మైమెన్‌సింగ్ జిల్లా నుంచి 10 వేల మంది ముక్తివాహిని వాలంటీర్లను తెచ్చాడు. వారికి ఆయుధాలు, ఆయుధసామగ్రి సమకూర్చాలంటే డబ్బు కావాలి. ఆ డబ్బును నగర్‌వాలా ద్వారా కలకత్తాకు పంపాలని నిశ్చయించింది యింటెలిజెన్సు శాఖ. ఆ శాఖకు ఆ బ్రాంచిలో రహస్యఖాతాలున్నాయి. వాటి ఆపరేషన్స్ చూసే బాధ్యతను మల్‌హోత్రాకు అప్పగించారు. అతను విశ్వసనీయుడు అనుకున్నారు కాబట్టే ప్రైమ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్ కమిటీలో, సిటిజన్స్ కమిటీలో సభ్యత్వం యిచ్చారు. నగర్‌వాలా గురించి మల్‌హోత్రాకు ముందే తెలుసు. అందుకే మల్‌హోత్రా ద్వారా నగర్‌వాలాకు నిధులు అందించడానికి ఫోన్ ద్వారా ఆదేశాలు వెళ్లాయి. గతంలో కూడా యిలాటి ఆపరేషన్స్ జరిగాయి కాబట్టి మల్‌హోత్రా సరేనన్నాడు.

అయితే ఈ వివరాలేమీ తెలియని డిప్యూటీ చీఫ్ కాషియర్ కేవల్ సింగ్‌కు మల్‌హోత్రా ఏ ఓచరూ లేకుండా అంత డబ్బు పట్టుకెళ్లి పోవడం తారెత్తించింది. ఓచరుపై మల్‌హోత్రా సంతకం పెడతాడని ఖన్నా చెప్పాక గంటన్నర వేచి చూసి, యింకా రాకపోతే ఏదైనా అయితే తన మీదకు వస్తుందని భయపడి వెంటనే పోలీసులకు మల్‌హోత్రాపై ఫిర్యాదు చేసాడు. అది రికార్డు చేసిన జూనియర్ ఆఫీసరుకు దీనిలో ఏదో గోల్‌మాల్ కనబడింది. వెంటనే పోలీసు స్టేషన్‌లో వుండే పత్రికా రిపోర్టర్లకు చెప్పేశాడు. కొద్ది సేపటిలోనే నగరమంతా గుసగుసలు ప్రారంభమయ్యాయి. అసలు విషయం బయటకు వస్తే భారత్ తూర్పు పాకిస్తాన్‌లో తిరుగుబాటు చేయిస్తోందని అంతర్జాతీయంగా తెలిసిపోతుందని భయపడింది యింటెలిజెన్సు శాఖ. వెంటనే పోలీసులు నగర్‌వాలా వద్ద వున్న వాకీటాకీకి ఫోన్ చేశారు. నువ్వు పట్టుబడిపోయేట్లుగా వ్యవహరించు అని సలహా యిచ్చారు. అందుకే అతను అడక్కపోయినా టాక్సీ డ్రైవరు ఎదురుగా డబ్బు మార్చాడు. ఐదు వందలు బహుమతిగా యిచ్చాడు. అంతా అనుకున్న ప్రకారమే జరిగింది. పోలీసులు పట్టేసుకున్నారు. కథ అల్లేశారు. నగర్‌వాలా నేరం ఒప్పేసుకున్నాడన్నారు. గబగబా న్యాయవిచారణ జరిపించేసి, తీర్పు యిప్పించేశారు.

అయితే తనను వదిలేస్తారనుకున్న నగర్‌వాలాకు షాక్ తగిలింది. పునర్విచారణ కోరాడు. జైల్లో వుండగానే "కరంటు" పత్రిక ఎడిటరు, పార్శీ అయిన డిఎఫ్ కరాకాకు తన దగ్గరకు వస్తే అన్ని విషయాలు చెపుతూ యింటర్వ్యూ యిస్తానని సందేశం పంపాడు. కానీ కరాకా అస్వస్థుడిగా వుండటం చేత అసిస్టెంటును పంపాడు. నగర్‌వాలా అతనితో మాట్లాడను పొమ్మన్నాడు. ఇవన్నీ బయటకు వస్తే ఎలా హేండిల్ చేయాలా అని బెంగపడిన ప్రభుత్వానికి ఊరట కలిగించేలా నగర్‌వాలాకు గుండెపోటు వచ్చింది. చనిపోయాడు. రహస్యం అతనితో సమాధి అయిపోయింది. జగన్మోహన్ రెడ్డి కమిటీ అతనిది సహజమరణమే అంది. కాశ్యప్ మృతి గురించి విచారణ జరిపిందో లేదో తెలియదు. అది నిజంగా యాక్సిడెంటో, కావాలని చేసినదో యిప్పటికీ బయటకు రాలేదు. భారత సైనిక గూఢచారి వ్యవస్థకు సంబంధించిన వ్యవహారం కాబట్టి యిది ఎప్పటికీ నిజం బయటపడదేమో! **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2016) (ఫోటోలు – నగర్‌వాలా (టోపీతో), మల్‌హోత్రా)**

**ఫిబ్రవరి 32 ఎమ్బీయస్ : అరుణాచల్‌లో గవర్నరు అత్యుత్సాహం**

అరుణాచల్ సమస్యకు ప్రారంభం 2015లో ఏప్రిల్ ముఖ్యమంత్రి నబామ్ తూకీ ఫైనాన్స్ మంత్రి కాలిఖో పూల్‌ను పదవి నుంచి తప్పించడంతో జరిగిందనవచ్చు. కాలిఖో కొంతమంది మద్దతుదారులను వెనకేసుకుని ఢిల్లీ వచ్చి కాంగ్రెసు అధిష్టానంతో మొరపెట్టుకున్నాడు – తూకీ గారి పని పట్టమని. ఎప్పటిలాగే దేనికీ తీరిక లేని, ఏదీ తేల్చని మాతాసుతులు సమస్యను నాన్చారు. ముఖ్యమంత్రి బండి నడిచిపోతోంది. అది సహించలేని అరుణాచల్ బిజెపివారు గవర్నరు నిర్భయ్ శర్మ వద్దకు వెళ్లి ముఖ్యమంత్రి పని పట్టమని కోరారు. కానీ ఆయన తన పరిధిలోకి రాని అంశాల జోలికి వెళ్లలేదు. బిజెపివారు అధిష్టానంతో మొరపెట్టుకున్నారు. కేంద్ర బిజెపికి దీనిలో ఒక ఆశాకిరణం గోచరించింది. కాగల కార్యం తీర్చగల గంధర్వుడి కోసం వెతికారు.

దొరికాడు. ఆయనే జ్యోతి ప్రసాద్ రాజ్‌ఖోవా అనే 71 ఏళ్ల 1968 ఐయేయస్ బ్యాచ్ అధికారి. ఆసాంకు చీఫ్ సెక్రటరీగా చేశాడు. సాహిత్యకారుడు. ఆరెస్సెస్ భావాలున్న దాఖలాలు ఏమీ లేవు కానీ ఈశాన్యప్రాంతాలకు విదేశీయులు వచ్చి పడడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తాడు. ఆసాం స్టూడెంట్స్ యూనియన్ ఉద్యమానికి నైతిక మద్దతు యిచ్చాడట. ఆసాంకు, అరుణాచల్‌కు సరిహద్దు తగాదాలున్నాయి కాబట్టి సాధారణంగా అసామీలను అరుణాచల్ గవర్నర్లుగా వేయరు. కానీ యీయన్ని వేద్దామనుకుని శర్మను మిజోరామ్‌కు పంపించేశారు. గతంలో కూడా నచ్చనివాళ్లందరినీ అక్కడకు పంపిస్తూ గత 10 నెలల్లో మిజోరామ్‌కు 8 మంది గవర్నర్లను ప్రసాదించింది బిజెపి ప్రభుత్వం. శర్మ స్థానంలో రాజ్‌ఖోవాను నియమిస్తూ మే నెలాఖరులో ఆదేశాలు వెలువడ్డాయి. జూన్ 1 కల్లా ఆయన పదవి చేపట్టాడు.

ఇక అప్పణ్నుంచి ఆయన కాంగ్రెసు తిరుగుబాటుదారులను దువ్వడం ప్రారంభించారట. పరిస్థితి గమనిస్తే ముఖ్యమంత్రి తూకీకి స్పీకరు నబాం రెబియా అనుయాయి కావడంతో బాటు కజిన్ కూడా! స్పీకరు ముఖ్యమంత్రి చేతిలో వుంటే ఎన్ని మ్యాజిక్‌లు చేయవచ్చో ఎన్నోసార్లు చూశాం. తెలంగాణలో టి-టిడిపి తెరాసలో విలీనం వ్యవహారం తాజా ఉదాహరణ. ముఖ్యమంత్రి నిర్ణయాలలో స్వార్థం వుందని, ఆర్థిక అక్రమాలు చేశాడని ఆరోపించడానికి గవర్నరు ప్రధానికి అక్టోబరులోనే ఒక లేఖ రాశాడు. రాష్ట్రంలో హోలోంగి ఎయిర్‌పోర్టుకై ఎంపిక చేసిన స్థలం వద్ద తూకీ, రెబియాలకు భూములున్నాయని, అందుచేత అక్కడ పెట్టకుండా ఆసాంకు దగ్గరగా వున్న లీలాబాడీ ఎయిర్‌పోర్టును అప్‌గ్రేడ్ చేస్తే మంచిదనీ లేఖ రాశాడు. అది బయటకు వచ్చింది. ఇలా ముఖ్యమంత్రిపై ఫైలు బిల్డప్ చేస్తూ వచ్చాడు.

నవంబరు కల్లా గవర్నరు ప్రయత్నాలు ఫలించాయి. డిప్యూటీ స్పీకరు నోర్బు తాంగ్డో, కొందరు మంత్రులతో సహా 21 మంది కాంగ్రెసువారు, యిద్దరు స్వతంత్రులు 11 మంది వున్న బిజెపితో కలిశారు. మెజారిటీ వచ్చేసింది. దాంతో ముఖ్యమంత్రి అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేయడానికి జంకాడు. ఈలోగా కాంగ్రెసు హై కమాండ్ మేలుకొంది. తిరుగుబాటుదారులను బుజ్జగించే ప్రయత్నాలు చేయడం ఆరంభించింది. మెజారిటీ వచ్చేవరకు ముఖ్యమంత్రిని అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేయవద్దంది. ఆర్నెల్లదాకా అంటే జనవరి 14 వరకు ముఖ్యమంత్రికి సమయం వుంది. అప్పటిదాకా ఆగితే వాళ్ల ప్రయత్నాలు ఫలిస్తాయన్న భయం వేసిందో ఏమో రాజ్‌ఖోవా అసెంబ్లీ సమావేశం తేదీని ఒక నెల ముందుకి, అంటే డిసెంబరు 16 కే జరిపేశాడు. ఇలా చేయడంలో ముఖ్యమంత్రిని కాని, కాబినెట్‌ను కాని సంప్రదించలేదు. ఇది అసాధారణ చర్య. దీనికి ప్రతిగా డిసెంబరు 15 న తన అధికారాలు వుపయోగించి 14 మంది తిరుగుబాటు కాంగ్రెసు సభ్యులను అనర్హులుగా ప్రకటించాడు.

అలా ప్రకటించినందుకు స్పీకరునే తీసి పారేయాలంటూ బిజెపి గవర్నరును కోరింది. గవర్నరు ఆ అభ్యర్థనను మన్నించి ఈశాన్య రాష్ట్రాలలో గవర్నరుకు ఆర్టికల్ 371 (ఎచ్) కింద వుండే అసాధారణ అధికారాలను వుపయోగించి, స్పీకరును గుర్తించకుండా డిసెంబరు 16 సమావేశాన్ని నిర్వహించే హక్కును డిప్యూటీ స్పీకరుకు ప్రసాదించేశాడు. డిసెంబరు 14 న స్పీకరు ఆ సమావేశాన్ని రద్దు చేసినట్లు ప్రకటించి సమావేశం జరగనీయకుండా ఆ భవనానికి తాళాలు వేయించేశాడు. అప్పుడు ముఖ్యమంత్రి వ్యతిరేకులందరూ కలిసి ముందు ఒక కళ్యాణమండపంలో, తర్వాత హోటల్లో సమావేశమై పోయి, డిప్యూటీ స్పీకరు ఆధ్వర్యంలో స్పీకరును, ముఖ్యమంత్రిని పీకి పారేసి కొత్త ముఖ్యమంత్రిని ఎన్నుకున్నారు. గవర్నరుగారు ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించలేదనుకోండి. డిసెంబరు 17

న గవర్నరు చర్యను నిరసిస్తూ ముఖ్యమంత్రి అనుచరులు రాజ్‌భవన్ ఎదుట మిథున్‌ను బలియిచ్చారు, కొందరు స్త్రీలు అర్ధనగ్నంగా నిరసన తెలిపారు.

స్పీకరు వేటుకు గురైన వాళ్లు గువాహతి హై కోర్టుకి వెళ్లారు. కోర్టు జనవరి 6 న యీ అనర్హత వేటు చెల్లదంది. అంతేకాదు, డిసెంబరు 16 నాటి అసెంబ్లీ సమావేశాన్ని గుర్తిస్తూ జనవరి 13న తీర్పు యిచ్చింది. మర్నాడే స్పీకరు రెబియా యీ తీర్పుపై సుప్రీం కోర్టుకి వెళ్లాడు. వ్యవహారం కోర్టులో వుండగానే ఈ లోగా ఏం తోచిందో ఏమో కేంద్ర కాబినెట్ గవర్నరు ద్వారా ఒక నివేదిక తెప్పించేసుకుని, రాష్ట్రపతి పాలన విధించాలని జనవరి 24 న నిర్ణయించింది. వారి సలహా మేరకు జనవరి 26 న రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. రాజ్‌ఖోవా వెంటనే ఎమర్జన్సీ విధించి తూకీ, అతని సహచర మిత్రుల యిళ్లకు, ఆఫీసులకు పోలీసులను పంపి వారి ఉత్తరప్రత్యుత్తరాలను, డాక్యుమెంట్లను, డేటాను స్వాధీనం చేసుకున్నాడు. (వాటిని తిరిగి యిచ్చేయమని దరిమిలా సుప్రీం కోర్టు కేంద్రాన్ని ఆదేశించింది) ఆఫీసులు మూయించేశాడు. నిరసన ప్రదర్శనలు జరగకుండా రాష్ట్రమంతా సెక్షన్ 144 విధించాడు. నాటి ఎమర్జన్సీని తలపింపచేసే యీ చర్యలు అన్యాయమంటూ దేశంలో గగ్గోలు పుట్టింది. ఇటువంటి విద్యలన్నీ కాంగ్రెసుకు మాత్రమే వెన్నతో పెట్టిన విద్య అనుకున్నవారు బిజెపి కూడా ఏమీ తీసిపోవడం లేదని గ్రహించారు. చైనాతో సరిహద్దులో వున్న రాష్ట్రంలో యిటువంటి అశాంతి, రాజకీయ అస్థిరత నెలకొనడం అభిలషణీయం కాదని అందరూ అభిప్రాయపడ్డారు.

రాష్ట్రపతిపాలన విధింపును ఛాలెంజ్ చేస్తూ జనవరి 28 న తూకీ సుప్రీంకోర్టులో కేసు వేశాడు. ప్రస్తుతం సుప్రీం కోర్టు కేసు విచారిస్తోంది. రాష్ట్రపతిపాలన విధించవలసిన అత్యవసరం ఏమి వచ్చింది, గవర్నరు మీకు పంపిన రిపోర్టు ఏది అని కేంద్రాన్ని అడిగారు. గవర్నరు జనవరి 15 న పంపిన నివేదికలో ఆయన రాసిన విషయాలు – 'నాకూ, నా కుటుంబానికి ప్రాణభయం వుంది. రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యాయి. నా రాజ్‌భవన్ ఎదురుగానే జంతువధ జరిగింది. నాకు ఏ రిపోర్టూ యివ్వవలసిన పని లేదని ప్రభుత్వం తన సిబ్బందికి ఆదేశాలిచ్చింది, నా మీటింగులకు హాజరు కానక్కరలేదని చెప్పింది' అంటూ ఆరోపణలు చేశారు. కోర్టు అడిగినప్పుడు వీటికి రుజువులు ఎలా చూపగలరో వేచి చూడాలి. జాతీయప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఎమర్జన్సీ, రాష్ట్రపతి పాలన విధించామని కేంద్రం చెప్పుకుంటోంది. గవర్నరు తన యింటి ఎదుట గోహత్య జరిగిందని ఫిర్యాదు చేశారని వార్తలు వచ్చాయి. అది ఆవు కాదు, మిథున్‌ను. 8 వేల సంవత్సరాలుగా ఆగ్నేయాసియా, బర్మా, చైనా, బంగ్లాదేశ్‌లలో పెరిగే జంతువది. దాని మాంసాన్ని తింటారు, బలులకు సాధారణంగా వుపయోగిస్తారు.

జనవరి 27 న సుప్రీం కోర్టు గవర్నరుకు నోటీసు యిచ్చి, వారం తర్వాత నాలిక కరుచుకుంది. గవర్నరును ప్రశ్నించే అధికారం తమకు లేదని ఒప్పుకుంటూనే అతని చర్యలను ప్రశ్నించే హక్కు మాత్రం వుందని నిర్ధారిస్తూ విచారణ కొనసాగిస్తోంది. తిరిగి యిచ్చేయమని కేంద్రాన్ని ఆదేశించింది. కేం జస్టిస్ జె ఎస్ ఖేహార్ నేతృత్వంలో అయిదుగురు సభ్యులున్న సుప్రీం కోర్టు బెంచ్ 'శాసనసభ్యుల అర్హత, అనర్హత నిర్ధారించే హక్కు, పార్టీ ఫిరాయింపులపై చర్య తీసుకునే హక్కు స్పీకరుదే. గవర్నరు ఆ అధికారాలను ఎలా దఖలు పరచుకుంటారా'ని అడిగింది. గవర్నరు తరఫున హాజరైన అడ్వకేట్ అంధ్యార్జున 'స్పీకరుపై అనుమాన మేఘాలు కమ్ముకున్నాయి కాబట్టి గవర్నరు తన విచక్షణ (డిస్క్రిషన్) వుపయోగించారు. ఆ విచక్షణ ఎలా వుండాలన్నది రాజ్యాంగంలో నిర్వచించబడలేదు. అందువలన అది కోర్టు పరిధిలోకి రాదు.' అని వాదించారు. అసెంబ్లీని ఏర్పాటు చేసే హక్కే తప్ప పార్టీ సభ్యత్వాన్ని నిర్ధారించే హక్కు గవర్నరుకు లేదని న్యాయమూర్తులన్నారు.

ఈ లోగా రాజ్‌ఖోవా కాంగ్రెసు ప్రభుత్వం ఎంత అసమర్థంగా వ్యవహరించిందో చెప్పడానికి సర్వప్రయత్నాలూ చేస్తున్నాడు. నిన్న చక్మా-హజాంగ్ శరణార్థుల సమస్య లేవనెత్తాడు. వారిని పంపించివేయడానికి గత ప్రభుత్వం చేసిన వేసిన కేసును 2015 సెప్టెంబరులో సుప్రీం కోర్టు కొట్టేసివారి స్థిరనివాసానికి ఏర్పాట్లు చేయమంది. తూకీ సరైన లాయర్లను పెట్టలేదని, అందువలన భూమిపుత్రులకు నష్టం కలిగిందని, యీసారి మంచి లాయర్లను నియమించి మళ్లీ కేసు వేయాలని రాజ్‌ఖోవా చీఫ్ సెక్రటరీని ఆదేశించాడు. 'త్వరలోనే ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడే ప్రభుత్వం అరుణాచల్‌లో నెలకొంటుందని' పత్రికలకు చెప్తున్నాడు. వచ్చే రోజుల్లో రాజ్‌ఖోవా గారు యింకెన్ని తమాషాలు చేస్తారో వేచి చూడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2016)**

**ఫిబ్రవరి 35** **ఎమ్బీయస్ : మొత్తానికి పీటర్ ముఖర్జీపై చార్జిషీటు**

షీనా బోరా కేసులో 2015 నవంబరు 19న పీటర్ ముఖర్జీని నిందితుడుగా అరెస్టు చేసిన సిబిఐ మూణ్నెళ్ల గడువు మూడు రోజుల్లో ముగుస్తుందనగా నిన్న అతనిపై చార్జిషీటు దాఖలు చేసింది. 2015 సెప్టెంబరులో కేసు విచారణ నుంచి ముంబయి పోలీసు కమిషనర్ రాకేశ్ మారియాను తప్పించినపుడు పత్రికల్లో చాలా కథనాలు రావడం చేత సిబిఐ విచారణ ఏ తీరుగా చేస్తుందాని సందేహాలు చాలా పుట్టుకువచ్చాయి. రాకేశ్ చాలా లోతుగా హత్య పరిధిని దాటి ఎక్కడెక్కడికో వెళ్లిపోతున్నాడని, అలా వెళితే ఇంద్రాణి, పీటర్ ముఖర్జీల ఆర్థిక అక్రమాలకు దన్నుగా నిలిచిన కార్పోరేట్ సంస్థకు దెబ్బ తగులుతుందనే భయంతో మహారాష్ట్ర ప్రభుత్వం రాకేశ్‌ను తప్పించిందని సందేహించారు. ఎందుకొచ్చిన గొడవ అనుకుని అతను బదిలీ కాగానే మహారాష్ట్ర ప్రభుత్వం కేసును సిబిఐకు అప్పగించి చేతులు దులిపేసుకుంది. సిబిఐ ఏ కేసైనా చేపట్టిందంటే ఎప్పటికి పూర్తవుతుందో ఎవరికీ తెలియదు.

పైగా సిబ్బంది లేదంటుంది. స్టాఫ్ విషయంలో 33% కొరత వుందట. పైగా సిబిఐ పూర్తిగా కేంద్రం అజమాయిషీలో వుంటుంది. వాళ్లు ఎంతవరకు పరుగు పెట్టనిస్తే అంతవరకే పరుగు పెడుతుంది, ఆగమంటే ఆగుతూంటుంది. కేంద్రంలో ఎక్కడ ఏ ప్రభుత్వం వున్నా యిదే వరస అని పలుమార్లు రుజువైంది. ఇప్పుడు యీ కేసులో కూడా అదే జరుగుతుందేమో యిప్పుడే చెప్పలేం.

ఐఎన్ఎక్స్ మీడియా ద్వారా జరిగిన ఆర్థిక నేరాల గురించి 2010లోనే నీరా రాడియా టేపుల ద్వారా బయటకు వచ్చింది. దానిపై కార్పోరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కింద పని చేసే సీరియస్ ఫ్రాడ్ యిన్వెస్టిగేషన్ ఆఫీసు (ఎస్ఎఫ్ఐఓ) 2013లో విచారణ జరిపి 35 పేజీల నివేదిక సమర్పించింది. ఒక కార్పోరేట్ హౌస్ సూట్‌కేసు కంపెనీల ద్వారా కోట్లాది రూపాయలు యీ కంపెనీల్లో పెట్టుబడి పెట్టిందని వివరాలు బయటపెట్టి ఆ కార్పోరేట్‌పై చర్య తీసుకోమని సిఫార్సు చేసింది. అయితే ఆ కార్పోరేట్ యుపిఏ ప్రభుత్వాన్ని ప్రభావితం చేయడం వలననో ఏమో కథ ముందుకు సాగలేదు. ఈ గోల్‌మాల్ వ్యవహారాల్లో దెబ్బ తిన్న మేరక్‌కు చెందిన ఒక కంపెనీవాళ్లే షీనా హత్య గురించి బొంబాయి పోలీసులకు ఉప్పందించారని ఒక భోగట్టా. మామూలుగా పత్రికల్లో వచ్చినదేమిటంటే హత్యలో పాలు పంచుకున్న శ్యామ్ రాయ్ అనే డ్రైవరు బారులో తాగి వాగుతూ, హత్య గురించి ప్రస్తావించాడనీ, అదే బారులో వున్న ఒక యిన్‌స్పెక్టరు చెవిన పడి అతను పై అధికారులకు చెప్పాడని... అలా బయటకు వచ్చిందని ఒక కథనం వచ్చింది. అబ్బే, అలా కాదు మారణాయుధాలు కలిగి వున్నందుకు డ్రైవరును అరెస్టు చేసి విచారణ చేస్తూ వుంటే ఆ క్రమంలో యీ హత్యోదంతం బయటకు వచ్చిందని మరో కథనం. మారణాయుధాలు కలిగినందుకు పెట్టే కేసులు సవాలక్ష వుంటాయి, వాటిలో పోలీసు ఉన్నతాధికారులు కలగజేసుకోరని, లోగుట్టు ఎఱిగిన వారే టిప్-ఆఫ్ చేసి వుంటారని పోలీసు వ్యవహారాలు తెలిసినవారు అంటున్నారు.

అందుకే కాబోలు ముంబయి పోలీసు కమిషనర్‌గా వున్న రాకేశ్ మారియా తనకు అత్యంత నమ్మకస్తులైన ఎసిపి కంజయ్ కదమ్ ఇన్‌స్పెక్టర్ దినేశ్ కదమ్, నితిన్ అలకనూర్‌లతో ఒక టీము ఏర్పాటు చేసి వాళ్లకు యింటరాగేషన్ అప్పగించాడు. అయితే ఇంద్రాణి గడగడా ఇంగ్లీషులో మాట్లాడుతూ వాళ్లను అదలగొట్టేసింది. ఆగస్టు 29 న అరెస్టు చేసిన నాలుగు రోజులయ్యాక యిక అప్పుడు రాకేశ్ రంగంలోకి దిగాడు. అతను మంచి పొడుగరి. మెత్తగా మాట్లాడుతూ, ఎదుటివాడి కళ్లలోకి లోతుగా చూస్తూ తన గాంభీర్యంతో రహస్యాలు లాగడంలో ప్రసిద్ధుడు. పైగా అతని జ్ఞాపకశక్తి అమోఘం. అనుమానితుడు చెప్పిన ప్రతి చిన్న విషయాన్ని గుర్తు పెట్టుకుని, ఆ సమాచారంతోనే అతన్ని ఉక్కిరిబిక్కిరి చేసి క్రాస్ ఎగ్జామినేషన్‌లో నిజాల్ని కక్కించగల సమర్థుడు. 1993 ముంబయి సీరియల్ బ్లాస్ట్‌ల కేసులో సంజయ్ దత్‌ను, 26/11 ఎటాక్స్‌లో అజ్మల్ కసబ్‌ను నోరు విప్పేట్లా చేసిన ఘనత రాకేశ్‌దే. ఇంద్రాణి రాకేశ్ దగ్గర కూడా షీనా అమెరికా వుందని బుకాయించసాగింది. 'అలాగా, ఆమె పాస్‌పోర్టు మాకు దొరికిందే' అన్నాడు రాకేశ్. దాంతో ఇంద్రాణి ధైర్యం చెదిరింది.

షీనా హత్య వివరాలతో రాకేశ్ ఆగలేదు, ముంబయి పోలీసులోని ఎకనమిక్ అఫెన్సెస్ వింగ్ అధికారులను ముఖర్జీ దంపతుల ఆర్థిక వ్యవహారాల గురించి కూపీ లాగమన్నాడు. ఇది కార్పోరేట్ హౌస్‌ను కదిలించింది. డొంక కదిలితే తమకు ప్రమాదం అని భావించారు. మారియాపై బురద చల్లుడు కార్యక్రమం ప్రారంభమైంది. రాకేశ్ ఎన్‌సిపి లీడర్లకు సన్నిహితుడని బిజెపి నాయకులకు సందేహం. ముంబయి పోలీసు కమిషనర్‌గా పనిచేసి ప్రస్తుతం బిజెపి ఎంపీగా వున్న సత్యపాల్ సింగ్ 'మారియాకు పీటర్ ముఖర్జీ స్నేహితుడు' అని మీడియాకు చెప్పాడు. అందుకనే పీటర్ ముఖర్జీపై నేరం మోపలేదు అని గూఢార్థం. వెంటనే 'పీటర్‌తో తనకు పరిచయం లేద'ని రాకేశ్ ప్రకటించాడు. తగినంత సాక్ష్యాధారాలు వుంటే తప్ప అరెస్టు చేయడం కౌంటర్ ప్రొడక్టివ్ అయి అసలుకు మోసం వస్తుంది. హత్య జరిగేనాటికి పీటర్ యుకెలో వున్నాడు. హత్యతో ప్రత్యక్షంగా పాలు పంచుకోలేదు. రాకేశ్ స్ట్రాటజీ ఏమిటో మనకు తెలియదు. రాకేశ్ లలిత్ మోదీని లండన్‌లో కలిశాడని మరో వచ్చింది. ముఖ్యమంత్రి దానిపై మారియాను సంజాయిషీ అడిగాడు. 'అవును కలిశాను, లలిత్ న్యాయవాది కలవమని కోరితే అప్పటి హెూం మంత్రి పాటిల్ అనుమతి తీసుకునే కలిశాను' అని రాకేశ్ జవాబిచ్చాడు.

సిబిఐకు అప్పగించకుండా ముంబయి స్థాయిలోనే రాకేశ్ యీ కేసును ముందుకు తీసుకుపోవడం మహారాష్ట్ర ముఖ్యమంత్రికి నచ్చలేదు. కానీ రాకేశ్ సిబిఐకు అప్పగించడానికి యిష్టపడలేదు. ఇది సాధారణ హత్య కాదని, ఆర్థికపరమైన కుట్ర చాలా వుందని అతని అభిప్రాయం. రాకేశ్‌ను తప్పించడం అంత సులభమైన పని కాదు. అందువలన సెప్టెంబరు 30 న అతని సీనియర్లు యిద్దరు రిటైరు అవుతున్నారు కాబట్టి సెప్టెంబరు 7 న రాకేశ్‌కు డైరక్టర్ జనరల్‌గా ప్రమోషన్ యిచ్చి ముంబయి పోలీసు కమిషనర్ పదవి నుంచి తప్పించేశారు. ఇంత సమర్థుడైన అధికారి సేవలను ప్రస్తుతం దేనికి వినియోగించుకుంటున్నారంటే హెూమ్ గార్డ్‌స్ హెడ్‌గా! అతని స్థానంలో అహ్మద్ జావేద్ అనే మరొక సమర్థుడైన అధికారిని నియమిస్తూ సెప్టెంబరు 8 కల్లా రాకేశ్‌ను పదవి నుంచి రిలీవ్ చేసేశారు. సెప్టెంబరు 30 కల్లా చార్జిషీటు ఫైల్ చేస్తానని రాకేశ్ చెప్తున్నా, 22 రోజుల ముందు అడావుడిగా ఆ కేసును అతని చేతుల్లోంచి లాగేసుకున్నారు.

ఇది కావాలని చేసిన పని అని, హంతకులను కాపాడే ప్రయత్నమని సర్వత్రా విమర్శలు వచ్చాయి. వాటిని తప్పించుకోవడానికి సెప్టెంబరు 17న కేసు సిబిఐకు అప్పగించేశాడు ఫడ్నవీస్. ఇక సిబిఐ మామూలు ధోరణిలోనే వ్యవహరించసాగింది. పీటర్ పాత్రను కాదనలేని స్థితి రావడం చేతనో ఏమో మూణ్నెల్ల క్రితం నవంబరు 19న అరెస్టు చేసింది. ఇన్నాళ్లకు చార్జిషీటు ఫైల్ చేసింది. దీని

ప్రకారం కొత్తగా వెలుగులోకి వచ్చిన విషయాలేమిటంటే – షీనా, రాహుల్ ప్రేమ వ్యవహారం ఇంద్రాణికే కాదు, పీటర్‌కు కూడా యిష్టం లేదు. 2009 నుండి వద్దని వాళ్లు మూడేళ్ల పాటు చెప్తున్నా పిల్లలు వినలేదు. సిద్ధార్థ దాస్ వలన పుట్టిన యిద్దరు పిల్లలు (షీనా, మిఖాయేల్) డబ్బు కోసం తనను వేధిస్తున్నారని ఇంద్రాణి పీటర్‌తో చెప్పుకుంది. 2005–2008 మధ్య లెక్కలు తీస్తే షీనాకు యిచ్చిన డబ్బు కంటె సంజీవ్ ఖన్నా ద్వారా పుట్టిన విధికి యిచ్చిన డబ్బు ఎన్నో రెట్లు. షీనా పేర ఢిల్లీలో ఉన్న ఒక ఫ్లాట్‌ను పీటర్, ఇంద్రాణి అమ్మేశారు. ఇంద్రాణి రిలయన్సులో తన ఉద్యోగం ఊడగొట్టడానికి చూసిందని షీనా 2009లోనే తన స్నేహితురాలికి యీమెయిల్స్ రాసింది, వాటిల్లో తల్లిని నానా బూతులూ తిట్టింది. షీనాను తుదముట్టించాలని 2012 మార్చిలో అనుకున్నాక పీటర్ భార్యతో సహా కలకత్తాకు అనేక ట్రిప్పులు వేశాడు. ఆమె మాజీ భర్త సంజీవ్ ఖన్నాను కలిశాడు. ఫైనల్ ప్లాను ఇంగ్లండులో వుండగా వేశాక ఇంద్రాణి ముందుగా ఇండియా వచ్చేసింది. పీటర్ 2012 ఏప్రిల్ 26కి వచ్చాడు. హత్య జరగడానికి ముందు, వెనకు పీటర్, ఇంద్రాణి మధ్య జరిగిన కాల్ డేటా రికార్డుల ప్రకారం చూస్తే హత్య గురించి ఇంద్రాణి పీటర్‌కు ఎప్పటికప్పుడు చెప్తోందని అర్థమవుతుంది. సిబిఐ 47 మంది సాక్ష్యులను సేకరించింది. 32 వ నెంబరు సాక్షి షీనా, మిఖాయేల్ యిద్దర్నీ చంపాలని పీటర్, ఇంద్రాణి అనుకున్నారని చెప్పాడట. ఆ సాక్ష్యాన్ని సీల్డ్ కవరులో పెట్టి యిచ్చింది సిబిఐ. సెషన్స్ కోర్టులో హియరింగ్ ఫిబ్రవరి 29 న వుండవచ్చు.

ఇప్పుడు పీటర్, ఇంద్రాణి, సంజీవ్ ఖన్నా, శ్యామ రాయ్‌ల మీద సిబిఐ పెట్టిన కేసు క్రిమినల్ కాన్‌స్పిరసీ (నేరపూరితమైన కుట్ర) అబ్డక్షన్ (ఎత్తుకుపోవడం), మర్డర్ (హత్య), డిస్ట్రక్షన్ ఆఫ్ ఎవిడన్స్ (సాక్ష్యాలను నాశనం చేయడం) కు సంబంధించినవి. ఆర్థిక నేరాల గురించి ప్రస్తావన లేదట. రాహుల్, షీనాల ప్రణయం యిష్టం లేకనే యివన్నీ జరిగాయని సిబిఐ వాదన. పీటర్, ఇంద్రాణి అక్రమమార్గాల్లో సంపాదించిన డబ్బులో కొంత షీనా పేర పెట్టారని, ఆమె దాన్ని వెనక్కి యివ్వడానికి ఒప్పుకోలేదు కాబట్టే హత్య జరిగింది అనే లైను పూర్తిగా వదిలిపెట్టేశారు. అందువలన పీటర్, ఇంద్రాణి ఆర్థిక నేరాలపై విచారణ ఆగిపోతుందని, దీని కోసమే ఆ కార్పోరేట్ హౌస్ చక్రం తిప్పి, సిబిఐ చేతికి కేసు వచ్చేట్లా చేసిందని అనుకోవాలి. అబ్బే, సప్లిమెంటరీ చార్జిషీటు ఫైల్ చేస్తాం, దానిలో ఆర్థికకోణం ప్రస్తావన వుంటుంది అని సిబిఐ అంటోందట. ఆ ముచ్చట కూడా జరిగాక కానీ అసలు విషయం తెలియదు.

**– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2016)**

**ఫిబ్రవరి 40 ఎమ్బీయస్ : కర్ణుడికే దానం!**

మద్రాసు హైకోర్టు జడ్జి సిఎస్ కర్ణన్‌గారికి 'హిందూ మక్కల్ కచ్చి' అనే హిందూ సంస్థ లక్ష రూపాయల చెక్కు దానంగా పంపించింది. 'ఇక్కడ కులవివక్షత భరించలేకపోతున్నాను. న్యాయవ్యవస్థలో కులం పేర నా జన్మహక్కు హరిస్తున్నారు. కులం గురించి పట్టించుకోని దేశానికి వలస పోదామనుకుంటున్నాను' అని ఆయన ప్రకటించాడు కాబట్టి దారి ఖర్చుల నిమిత్తం యీ లక్ష రూపాయల ఆఫర్ వచ్చి పడింది. దానికి చిన్న షరతు మాత్రం చేర్చారు. చెక్కు ఎన్‌క్యాష్ చేసుకుంటే దేశం విడిచి వెళ్లి తీరాలిట, వెళ్లే ముందు ఎక్కడకి దయచేస్తున్నారో చెప్పాలట. ఎలాటి అభ్యంతరాలు లేవనెత్తకుండా కర్ణన్‌గారి వలస సాగేట్లు చూడమని మోదీగారికి యీ సంస్థ సిఫార్సు చేసింది.

కర్ణన్ పేరు గతంలో విన్నా వినకపోయినా యిప్పుడు మాత్రం కర్ణభేరి పగిలేటేట్లు ఆయన పేరు మారుమ్రోగిపోతోంది. హైకోర్టు జడ్జి అయి వుండి ఏకంగా సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌కే ఫిబ్రవరి 15 న ఆదేశాలిచ్చి చరిత్ర సృష్టించిన మహనీయుడాయన. చీఫ్ జస్టిస్ చేసిన పాపం ఏమిటంటే ఆయన్ను కలకత్తా హైకోర్టుకి బదిలీ చేశాడు. ఈయన తన బదిలీ ఆర్డరుపై తనే స్టే యిచ్చేసుకున్నాడు. ఫిబ్రవరి 12 నాటి బదిలీ ఆర్డరు జారీ వేసిన జడ్జిలపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసులు దాఖలు చేయమని యీయన తమిళనాడు పోలీసులకు ఆర్డరు పాస్ చేశాడు కూడా. బదిలీ చేసినా అత్యాచారం చేసినట్లే అనే యీయన యిచ్చిన నిర్వచనం అమలైతే దేశంలో ఏ ఎస్సీ,ఎస్టీ కాండిడేటు ట్రాన్స్‌ఫర్ కానక్కరలేదు. ఉన్నచోటే వుండిపోవచ్చు. ఈయన సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌కు 'ప్రజాప్రయోజనాలుంటేనే బదిలీ చేయాలనే 1993 నాటి జడ్జిమెంటు తీర్పు చూడండి' అని సలహా యిస్తూ, యీ ఆర్డర్‌పై రాతపూర్వకంగా సంజాయిషీ యివ్వమని అడిగాడు. మీరే డైరక్టుగా యివ్వనక్కరలేదు, మీ సబార్డినేట్ల ద్వారా యివ్వండి అంటూ పోనీ కదాని ఏప్రిల్ 29 దాకా టైమిచ్చాడు, అది ఎందుకంటే అప్పటిదాకా తను యిచ్చిన మధ్యంతర ఆదేశం అమల్లో వుంటుందిట. అంటే తను కదల నక్కరలేదు. 'అయినా నా బదిలీ నాకు సంబంధించిన అంశం. నా పరిధిలోకి వచ్చే అంశంలో తల దూర్చకండి' అని కూడా నిష్కర్షగా చెప్పేశాడు. చీఫ్ జస్టిస్‌కు తను యిచ్చిన ఆదేశాలు ఆయన ఎక్కడైనా పారేసుకుంటాడేమోనని కాబోలు రాష్ట్రపతికి, ప్రధానికి, కేంద్ర న్యాయమంత్రికి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు కాపీలు పంపాడు. అంతటితో ఆగలేదు, రాజకీయనాయకులను కూడా దీనిలోకి లాక్కుని వచ్చాడు. సోనియా గాంధీ, మాయావతి, రామ్ విలాస్ పాశ్వాన్‌లకు కూడా కాపీ పంపాడు. చివరి యిద్దరికి ఎందుకంటే వాళ్లూ దళితులట, ఆయనా దళితుడట. తనపై దళిత వివక్షత జరుగుతోంది కాబట్టి దాన్ని వారి దృష్టికి తెస్తున్నాడన్నమాట.

కర్ణన్‌గారు విచ్చలవిడిగా దళిత కార్డు వాడడం ఎప్పుడో మొదలుపెట్టాడు. 2009 మార్చిలో మద్రాసు హైకోర్టులో జడ్జిగా వేసిన దగ్గర్నుంచి ఆయన తీర్పుల ద్వారానో, ఆరోపణల ద్వారానో ఎప్పుడూ వార్తల్లో వుంటున్నాడు. తను దళితుడు కాబట్టి సాటి జడ్జిలు తన పట్ల వివక్షత చూపుతున్నారంటూ 2011 నవంబరులో షెడ్యూల్ కాస్ట్ కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. ఓ పెళ్లి ఫంక్షన్‌లో పక్క కుర్చీలో

కూర్చున్న ఒక దళితేతర జడ్జి తన కాలుకి తగిలేట్లు కాలు మీద కాలు వేసుకున్నాడట! 2009 నుంచి నలుగురు జడ్జిలు తనను అవమానిస్తున్నారట. 2014 జనవరిలో జడ్జి పదవులకై సూచించిన 12 పేర్ల గురించి వేసిన ఒక ప్రజాహిత వ్యాజ్యం గురించి డివిజన్ బెంచి విచారిస్తూండగా యీయన ఆ హాల్లోకి వెళ్లి "సెలక్షన్ అన్యాయంగా జరిగింది. దాని గురించి అఫిడవిట్ వేస్తా" అంటూ అరిచాడు. న్యాయమూర్తి మరొక కోర్టు విచారణలోకి యిలా చొరబడడం ఎక్కడా జరగదు, అందరూ విస్తుపోయారు. దీనిని సుప్రీం కోర్టు మార్చి నెలలో ఖండించింది. "ఇలా జరగడం మమ్మల్ని తీవ్రంగా బాధించింది, కర్ణన్ ప్రవర్తన అనుచితం. ఇది ఏ మాత్రం హుందాగా లేదు." అని వ్యాఖ్యానించింది. దీనితో బాటు కొందరు లాయర్లు ఆందోళన చేపట్టి మద్రాసు హైకోర్టుని బహిష్కరించినప్పుడు కర్ణన్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆర్‌కె అగర్వాల్ గదిలోకి దూసుకెళ్లి యిష్టం వచ్చినట్లు బూతులు తిట్టాడు. ఆయన 'నేనే కాదు, సాటి జడ్జిలందరూ యీయన్ని చూసి బెదురుతున్నారు. న్యాయమూర్తులందరికీ తలవంపులు తెస్తున్న ఈయన్ని యిక్కణ్నుంచి బదిలీ చేసేయండి' అంటూ అప్పటి సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ సదాశివంకు రాశారు. సుప్రీం కోర్టు దానిపై వెంటనే చర్య తీసుకోలేదు కానీ కర్ణన్ తన వంతుగా అగర్వాల్‌పై షెడ్యూల్ కాస్ట్ కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు.

అయినా తనకు బదిలీ తప్పదని గ్రహించాక "నేను కొందరు జడ్జిలపై ఆరోపణలు చేశాను. వాటిని నిరూపించే ఆధారాలు నేను సేకరించడం పూర్తయ్యేవరకు నన్ను యిక్కణ్నుంచి బదిలీ చేయకూడదు" అంటూ అగర్వాల్‌కు, సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌కు లేఖలు రాశాడు. ఆ ఆరోపణలేమిట్రా అంటే 2015 మేలో సాటి జడ్జి ఒకాయన ఒక మహిళా ఇంటెర్న్‌పై తన ఛాంబర్స్‌లో అత్యాచారం చేశాడని ఆరోపించాడు. మరో జడ్జి విద్యార్హతలను ప్రశ్నిస్తూ కేంద్రానికి లేఖ రాశాడు. అగర్వాల్ తర్వాత ఆ స్థానంలో వచ్చిన ఎస్‌కె కౌల్ కూడా కర్ణన్ దెబ్బ తప్పించుకోలేక పోయాడు. సివిల్ జడ్జిల నియామకంలో ఆయన దళితులకు అన్యాయం చేశాడంటూ ఆరోపణ చేసి తనంతట తానే (సుమోటో) నియామకాలను మధ్యంతర ఉత్తర్వు ద్వారా నిలిపివేసి, ఆయనపై కూడా యథావిధిగా ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసు బనాయించాడు. ఈ దశలో సుప్రీం కోర్టు కలగచేసుకుని అతని మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేసింది. కర్ణన్ యిది సహించలేకపోయాడు. జడ్జిల నియామకం చూసే కొలీజియం వ్యవస్థ నియంతలా వ్యవహరిస్తోందంటే ధ్వజమెత్తాడు. తనకు ప్రాధాన్యత కలిగిన పోస్టు యివ్వటం లేదని అలిగి 2015 నవంబరులో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లాడు. ఇవన్నీ చాలనట్లు కౌల్‌కు కులవివక్షత వుందంటూ ఆరోపణలు గుప్పించడంతో యిక మద్రాసు హైకోర్టు వ్యవస్థ సుప్రీం కోర్టుకి మొర పెట్టుకుంది – యీయన్ని యిక్కణ్నుంచి ఎక్కడికైనా పంపించి వేయండని.

మద్రాసు చీఫ్ జస్టిస్‌లందరూ కర్ణన్‌పై ఫిర్యాదు చేస్తూ రావడంతో బాటు తాజాగా మరో రెండు కేసులు వచ్చాయి. పీటర్ రమేష్ కుమార్ అనే అడ్వకేట్ మద్రాసు హైకోర్టు యొక్క మధురై బెంచ్ కోర్టులోకి చొచ్చుకుని వెళ్లి అక్కడ కార్యకలాపాలను భగ్నం చేసినందుకు అతనిపై హైకోర్టు కంటెప్ట్ ఆఫ్ కోర్టు కేసు పెట్టింది. ఆ కేసు ప్రిన్సిపల్ బెంచ్‌కు బదిలీ అయినపుడు కర్ణన్ కలగజేసుకుని ఆ లాయరుకు మద్దతుగా నిలిచాడు. అతని పోలీసు రక్షణ కల్పించాలని, అతన్ని కేసులోంచి తప్పించేందుకు యిది వుపకరిస్తుందని స్టేట్ ప్రిన్సిపల్ సెక్రటరీకి లేఖ రాశాడు. తమిళనాడు స్టేట్ జ్యుడిషయల్ ఎకాడమీ రాష్ట్రంలో కొత్త సెంటర్లు తెరుద్దామనుకుంటోంది. ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడడానికి వెనుకబడిన వర్గాల నుంచి వక్తలుగా ఎవర్నీ పిలవలేదని, తనను ఎకాడమీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ నుంచి తప్పించేశారని కర్ణన్ ఆరోపించాడు. దానికి సమాధానంగా హై కోర్టు కర్ణన్ ఎకాడమీ బోర్డులో ఎన్నడూ సభ్యుడు కాదని స్పష్టం చేసింది. వక్తల్లో యిద్దరు సుప్రీం కోర్టు జడ్జిలుకాగా, యిద్దరు మద్రాసు హై కోర్టు జడ్జిలని, దీనిలో కులప్రసక్తి లేదని కూడా చెప్పింది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని సుప్రీం కోర్టు కొలీజియం ఫిబ్రవరి 11 న సమావేశమై అనేక మంది జడ్జిలను వివిధ ప్రాంతాలకు బదిలీ చేస్తూ వారితో బాటు కర్ణన్‌ను కలకత్తాకు వేసింది. ఆ ఆర్డరునే యిప్పుడీయన ఆపేసుకున్నాడు. ప్రతిగా ఫిబ్రవరి 12 తర్వాత నుంచి కర్ణన్ యిచ్చే ఆదేశాలపై ఏ చర్యా తీసుకోనక్కరలేదని సుప్రీం కోర్టు మద్రాసు హైకోర్టును ఆదేశించింది. కర్ణన్‌కు ఏదైనా పని యివ్వాలో అక్కరలేదో చూసుకునే బాధ్యత కౌల్ మీదే పెట్టింది.

సమాజపు కట్టుబాట్ల గురించి కర్ణన్ దృక్పథం ఎలా వుందో చెప్పడానికి ఆయన 2013 జూన్‌లో వెలువరించిన అపూర్వమైన తీర్పు ఒక ఉదాహరణ. "పెళ్లి అనేదానికి సంఘం లేదా ప్రభుత్వపు గుర్తింపు ఏమీ అక్కరలేదు. ఒక మగాడు, ఒక ఆడది కలిసి రతిలో పాల్గొంటే చాలు అది పెళ్లే. ఇక అప్పణ్నుంచి వాళ్లు మొగుడూ పెళ్లాలమని చెప్పేసుకోవచ్చు. మామూలు పెళ్లి వలన దఖలు పడే హక్కులన్నీ యీ రకమైన 'పెళ్లి' ద్వారా కూడా సంక్రమిస్తాయి." అని తీర్పు యిచ్చాడు. దానిపై దేశమంతా గగ్గోలు పెట్టేసి, మీడియాలో చర్చలు జరిగాయి. రెండు రోజుల తర్వాత ఆయన మరో ఆదేశం యిచ్చాడు – 'తీర్పుకి వ్యతిరేకంగా మీడియాలో ఏ వ్యాఖ్యలూ రావడానికి వీల్లేదు' అని. అలాటాయన యిప్పుడు కొలీజియం వ్యవస్థను నియంతగా వర్ణిస్తున్నాడు. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై, యితర జడ్జిలపై ఆరోపణలు గుప్పించాడు. "నేను సుప్రీం కోర్టుకి సబార్డినేటును కాను. నా కంటూ నాకు రాజ్యాంగబద్ధమైన ఆఫీసు వుంది. నా తరఫు వాదన వినకుండా వాళ్లు నా గురించి ఎలా నిర్ణయం తీసుకోగలరు? నేను దళితుణ్ని కాబట్టే నాపై కత్తికట్టారు. ఆ జడ్జిలను పార్లమెంటుకు రమ్మనమనండి. ఎవరు గొప్పో తేల్చే అధికారం దానికే వుంది" అన్నాడు. న్యాయవ్యవస్థను పార్లమెంటుకు సమాంతర వ్యవస్థగా తీర్చిదిద్దిన మన రాజ్యాంగం గురించి కర్ణన్ అవగాహన యిది!

ఇది జరిగాక కర్ణన్ ఢిల్లీ వెళ్లి చీఫ్ జస్టిస్ ఠాకూర్‌ను కలిసి ఒక అరగంటసేపు మాట్లాడాడు. ఏం జరిగిందో బయటకు రాలేదు. న్యాయశాఖ మాత్రం చీఫ్ జస్టిస్ బదిలీ ఆదేశాన్ని తదుపరి చర్యలకై ప్రధాని కార్యాలయానికి పంపించినట్లు శుక్రవారం వార్త

వచ్చింది. కర్జన్ పక్షాన ప్రముఖులెవ్వరూ యిప్పటివరకు ఎవరూ బహిరంగంగా మాట్లాడలేదు. విపరీతస్వభావం చేత వస్తున్న తన సమస్యలన్నిటికి దళితత్వమే కారణమంటూ కలరింగు యివ్వడం వలన, సమాజంలో దళిత వ్యతిరేక భావాలు బలపడి, నిజంగా బాధితులైన దళితులకు మేలు జరగకపోగా కీడు జరుగుతుందని ఆయన గ్రహించాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2016)**

**ఫిబ్రవరి 41** **ఎమ్బీయస్ : యూరోప్ గాథలు 28**

అతని అధికార నివాసాన్ని రాజకీయ కార్యకలాపాలన్నీ జరిగే ఫోరమ్ అనే ప్రాంతంలో యిచ్చారు. అక్కడ వుండటం చేత అతనికి రోమ్ రాజకీయనాయకులతో పరిచయాలు బాగా పెరిగాయి. ఈ పరిచయాల మాట ఎలా వున్నా పదవులకోసం పోటీ పడడానికి చాలా ఖర్చయింది. ఇప్పటిలాగానే అప్పుడూ రాజకీయాలు చాలా ఖర్చుదారీ వ్యవహారం. ఇటీవల ఒక పార్టీ వారు ''బాహుబలి'' సినిమా ఆడుతున్న థియేటర్లో కొన్ని షోల టిక్కెట్లన్నీ కొనేసి తమ పార్టీ అభిమానుల కోసం షోలు ఏర్పాటు చేశారని వార్త వచ్చింది. దాన్ని చూడాలని ప్రజలందరూ ఎగబడుతున్నపుడు వారికి ఆ అవకాశం ఉచితంగా కల్పించి, పార్టీ పట్ల, తమ పట్ల అభిమానం పెంచుకోవాలని నాయకుల ఆశ. అప్పట్లో సినిమాలు లేవు కానీ గ్లాడియేటర్ షోలు వుండేవి. రాజకీయనాయకులు కొన్ని గ్లాడియేటరు యుద్ధాల షోలను స్పాన్సర్ చేసి ఆ మల్లయుద్ధాలు ఓటర్లకు ఉచితంగా చూపించి పాప్యులారిటీ పెంచుకునేవారు. క్రీ.పూ. 65లో సీజరు అప్పులు చేసి, అనేకమంది గ్లాడియేటర్లను కొనేసేవాడు. వాళ్లు చనిపోయేదాకా యుద్ధం చేయనవసరం లేదనేవాడు. పదేపదే షోలు ఏర్పాటు చేసేవాడు. దానివలన అతనికి పలుకుబడి ఎంత పెరిగిపోయిందంటే ఒక నాయకుడు యింతకు మించి షోలు స్పాన్సరు చేయడానికి వీల్లేదు అని పరిమితి విధిస్తూ సెనేట్ చట్టం పాస్ చేసేటంత!

రోమన్ చట్టం ప్రకారం ఓటర్లకు డబ్బు పంచడాన్ని లంచంగా పరిగణించేవారు కాదు. పైగా తన సొంతానికి ఖర్చు పెట్టుకోకుండా పదిమందితో ఐశ్వర్యాన్ని పంచుకునే ఔదార్యంగా చూసేవారు. సీజరు సీనియర్లు, సమకాలీనులు పెద్ద పెద్ద బంగళాలలో వుంటూ, తరచుగా విందులిస్తూ, విలాసాలపై విపరీతంగా ఖర్చు పెడుతూ వుంటే సీజరు బయటకు ఆడంబరంగా కనబడేవాడు కాదు. అందరికీ ఉదారంగా కానుకలు యిస్తూ, సేవకులను కరుణతో చూస్తూ, మంచివాడిగా పేరు తెచ్చుకున్నాడు. క్రీ.పూ.62కి ప్రియేటర్ (జడ్జి) పదవి సంపాదించాడు. ఈ మంచివాడు యిమేజి కోసం, పదవుల కోసం చేసిన అప్పులు పెరిగి బాకీదారుల నుంచి తప్పించుకోవడానికి ఒక్కోసారి రాత్రిపూట ఊరి నుంచి తప్పించుకుని పారిపోతూ వుండేవాడు. ఈ తిప్పలు తప్పించుకునే మార్గం గురించి వెతికాడు. అప్పట్లో యీ పదవిలో వున్నవాడిని ఏదైనా ప్రాంతానికి గవర్నరుగా నియమించే పద్ధతి వుండేది. క్రీ.పూ. 61లో స్పెయిన్‌కు గవర్నరు అయ్యాడు. అక్కడ వచ్చిన ఆదాయంతో అప్పులు తీర్చేశాడు.

క్రీ.పూ. 60 వచ్చేసరికి సీజరు పాంపే, క్రాసస్‌లతో జట్టుకట్టాడు. ఈ త్రయంలో పాంపేకు మిలటరీ శక్తి వుంది, క్రాసస్‌కు డబ్బుంది, సీజరుకు పాప్యులారిటీ వుంది. మిగతా యిద్దరి సహాయంతో వచ్చే ఏడాది అంటే క్రీ.పూ. 59లో కాన్సల్ పదవికి పోటీ పడి, అతి సులభంగా గెలిచాడు. మరో కాన్సల్‌గా మార్కస్ బిబ్యులస్ నెగ్గాడు. కాల్‌పూర్నియాను పెళ్లాడాడు. ఇక యిప్పణ్నుంచి క్రాసస్, పాంపేలు తన మాట జవదాటకుండా వుండే అవకాశాలు వెతికాడు. గుత్తాలను పెంచి, పోషించే కార్పోరేషన్లు రోమన్ సామ్రాజ్యంలో బలంగా వుండేవి. క్రాసస్ ఆ లాబీకి ఋణాలు యిచ్చి, వారి ప్రయోజనాల కోసం సెనేట్‌లో పోట్లాడేవాడు. అయితే ఆ కార్పోరేషన్ల లావాదేవీల్లో గోల్‌మాల్ జరిగింది. వాళ్లు పన్ను బకాయి బడ్డారు. బకాయి రద్దు చేయాలని, లేకపోతే వాళ్లు దివాళా తీస్తారని క్రాసస్ సెనేట్‌లో వాదించాడు. అయినా సెనేట్ ఒప్పుకోలేదు. అది క్రాసస్ సమస్య. అలాగే పాంపేకు కూడా మరో సమస్య వుంది. అతని సైనికులు సైన్యంలో పదవీవిరమణ చేసిన తర్వాత రావలసిన డబ్బుల గురించి అడుగుతున్నారు. వాటి కోసం పాంపే అడిగినా సెనేట్ ఒప్పుకోలేదు. సీజరు వీళ్లిద్దరినీ మచ్చిక చేసుకోవడానికి యిదే తరుణం అనుకున్నాడు. ''సెనేట్ ఆమోదంతో పని లేకుండా చట్టాలు చేసే అధికారాలు కాన్సల్‌కు వుంది. మీ యిద్దరి కష్టాలు గట్టెక్కేట్లా నేను చట్టాలు పాస్ చేస్తాను, దానికి బదులుగా మీరు నాకు సాయం చేయాలి. నేను కోరుకున్న ఒక ప్రాంతానికి గవర్నరుగా నేను ఒకటీ, రెండూ కాదు, ఐదేళ్లు వుండామనుకుంటున్నాను. దానికి అనుగుణంగా చట్టం మార్చడానికి మీరు మద్దతు యివ్వాలి.'' అని ప్రతిపాదించాడు. అంతకు ముందే పాంపేకు తన కుమార్తె జూలియాను యిచ్చి పెళ్లి చేశాడు.

ఈ విధమైన క్విడ్‌ప్రోకో సెనేట్ సభ్యులను మండించింది. ముఖ్యంగా సీజరు తోటి కాన్సల్ బిబ్యులస్‌ను. ఈ గూడుపుఠాణీని అడ్డుకుంటాం అంటూ సెనేట్‌లో కొందరు గోల చేశారు. ఈ ముగ్గురి అనుయాయులూ గోల చేశారు. ఈ గలభాలో సీజర్ ప్రత్యర్థిపై సెనేట్ హాలులో వున్న చెత్తబుట్టను బిబ్యులస్ నెత్తిమీద బోర్లించారెవరో. గందరగోళంలో చట్టాలు పాస్ అయిపోయాయి. పాంపే, క్రాసస్‌లకు వాళ్లకు కావలసినది వాళ్లకు దక్కింది. సీజరుకు ఒకటి కాదు, మూడు ప్రాంతాలపై గవర్నరు గిరీ దక్కింది. అలా క్రీ.పూ. 58 వచ్చేసరికి సీజరు దక్షిణ ఫ్రాన్సు, ఉత్తర ఇటలీ, ఇప్పటి క్రోషియాలపై ఆధిపత్యం వచ్చేసింది. క్రీ.పూ.58 నాటికి కాన్సల్ పదవీకాలం ముగిసిపోయాక 8 ఏళ్ల పాటు సీజరు మిలటరీ జనరల్‌గా ఘనవిజయాలు సాధిస్తూ రోమ్ కీర్తిని దశదిశలా వ్యాపింపచేస్తూ, రోమన్ ప్రజలకు ఆరాధ్యుడైపోయాడు. నిజానికి సీజరు అప్పటివరకు సీజర్ని ఎవరూ గొప్ప శూరుడిగా అనుకోలేదు. కానీ రాజకీయతంత్రాన్ని పూర్తిగా వంటపట్టించుకున్న సీజరు రణరంగంలో కూడా దీర్ఘప్రణాళికలతో, ముందుచూపుతో, గూఢచారుల

సాయంతో శత్రువులను విడగొట్టి, గందరగోళ పరచి విజయాలు సాధించాడు. అంతేకాదు, దండెత్తిన చోట స్థానిక ప్రజలను ఆదరంగా చూస్తూ, వారి అభిమానాన్ని చూరగొంటూ వాళ్లు తనకు సహకరించేట్లా చేసుకున్నాడు. 'ద గాలిక్ వార్స్' అనే పేరుతో తన జైత్రయాత్రను గ్రంథస్తం చేయించాడు కూడా. ఇప్పటి పేర్లతో చెప్పాలంటే అతను స్విజర్లండ్, బెల్జియం, ఫ్రాన్సు, జర్మనీ, బ్రిటన్‌లోని అనేక తెగలను ఓడించాడు.

సీజరుకు యింత పేరు రావడం క్రాసస్, పాంపేలకు రుచించలేదు. క్రాసస్ తను కూడా సొంతంగా పేరుప్రఖ్యాతులు సంపాదించాలనుకుని, నేటి ఇరాన్, ఇరాక్‌లు కలిసి వున్న ఆనాటి పార్థియన్ సామ్రాజ్యంపై దండెత్తాడు. అది రోమ్ సరిహద్దుల్లో వుంది కానీ వారికీ వీరికీ వైరం లేదు. అయినా క్రాసస్ అన్యాయంగా క్రీ.పూ. 53లో దాడికి తెగించాడు. క్రాసస్ వెంట వున్న పెద్ద సైన్యం ఇప్పటి టర్కీలో పార్థియన్ల చేతిలో చావు దెబ్బ తింది. క్రాసస్ కూడా మరణించాడు. ఆ విధంగా సీజరు పోటీదారుల్లో ఒకడు తగ్గాడు. ఇక రెండోవాడైన పాంపే సీజరుకు అల్లుడు. అయితే ఆ బంధం సడలేలా ఒక దుర్ఘటన జరిగింది. సీజరు కూతురు, పాంపే భార్య అయిన జూలియా పిల్లవాణ్ని ప్రసవిస్తూ క్రీ.పూ. 54లో ప్రసూతిలో మరణించింది. ఇక యిద్దరి మధ్య మధ్యవర్తి లేకుండా పోయారు. ఇతరులు పుల్లలు పెట్టారు. క్రీ.పూ. 52 కల్లా పాంపే సీజరుతో బంధాలన్నీ తెంచుకుని, అధికారం కోసం అవసరమైతే అంతర్యుద్ధం చేయడానికైనా సిద్ధం అనుకుని సన్నాహాలు చేయసాగాడు.

సీజరు తన పట్ల ప్రజలకు ఆరాధన పెరుగుతోందని గ్రహించి, మళ్లీ కాన్సల్ పదవిపై ఆశ పెట్టుకున్నాడు. పదేళ్ల వ్యవధి వుండాలి కాబట్టి క్రీ.పూ. 48లో జరగబోయే ఎన్నికలో పోటీ చేద్దామనుకున్నాడు. అయితే అప్పటి చట్టం ప్రకారం ఎవరైనా జనరల్ రోమన్ సామ్రాజ్యంలో ఏదైనా ప్రాంతాన్ని పాలిస్తూ వుంటే ఆ పదవి వదిలేసి, రోమ్ నగరానికి వచ్చి అప్పుడు పోటీ చేయాలి. శూలా నాటి నియంతృత్వం మళ్లీ రాకుండా చేయాలంటే యిది అవసరం అని సెనేట్ భావన. కానీ సీజరుకు అది యిష్టం లేదు. గాల్ (ఫ్రాన్స్ ప్లస్ జర్మనీ, బెల్జియంలలోని కొన్ని ప్రాంతాలు)పై తన సైనికాధిపత్యాన్ని వదులుకుని వస్తే తన శత్రువులు గతంలో తను కాన్సల్‌గా చేసినప్పటి పనులపై విచారణ మొదలుపెట్టి, తీర్పు వచ్చేవరకు పదవికి పోటీ పడేందుకు తనను అనర్హుడిగా ప్రకటించగలరు. తన చేతిలో సైన్యం వుండదు కాబట్టి దాన్ని ఎదుర్కోలేడు. మరి యీ సమస్యను పరిష్కరించడం ఎలా?

సీజరు తన సైన్యంతో రోమ్ సామ్రాజ్యంపై దండెత్తి అంతర్యుద్ధం లేవదీయ దలచుకున్నాడు. క్రీ.పూ. 49 జనవరిలో రూబికాన్ నది వద్ద తన ఏలుబడిలోని రాజ్యాన్ని దాటి రోమ్ నగరపు ఏలుబడిలోని ప్రాంతాలలో చట్టవిరుద్ధంగా సైన్యంతో ప్రవేశించి 'రణభేరి మోగింది' అని ప్రకటించాడు. రోమ్‌ను రక్షించే బాధ్యత పాంపే తీసుకున్నాడు. పాంపే, సీజర్ సైన్యాలు తలపడ్డాయి. కానీ పాంపే సైన్యం ఓడిపోయి లొంగిపోసాగింది. లొంగిపోయిన వారిపట్ల ఉదారంగా ప్రవర్తించి, క్షమాభిక్ష ప్రసాదించి సీజరు వారి ఆదరాన్ని చూరగొన్నాడు. పాంపే సైన్యం క్రమేపీ సీజరు వశం కాసాగింది. యుద్ధం సాగుతూండగానే సీజరు కాన్సల్ పదవికి పోటీ పడి గెలిచాడు. క్రీ.పూ. 48 ఆగస్టు కల్లా ఉత్తర గ్రీసులో పాంపే సైన్యం పరాజయంతో యుద్ధం ముగిసింది. ఓడిపోయిన పాంపే పొరుగు సామ్రాజ్యమైన ఈజిప్టుకి పారిపోయాడు. అతన్ని వెంటాడుతూ ఈజిప్టు వెళ్లిన సీజరుకు క్లియోపాత్రా పరిచయమైంది. రోమ్, ఈజిప్టు సామ్రాజ్యాల చరిత్రలను మలుపు తిప్పిన ఆ సమాగమం అతి వింతగా జరిగింది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2016) (ఫోటో – పాంపే)**

**ఫిబ్రవరి 42** **ఎమ్బీయస్ : పేరుకే ముత్యం...**

20 ఏళ్లగా అడ్డగోలు వ్యాపారం చేస్తూ రూ.49,100 కోట్ల స్థాయికి చేరిన పెర్ల్ గ్రూపు అధినేత నిర్మల్ సింగ్ భాంగూ ఎట్టకేలకు అరెస్టయ్యాడు. ఎన్నో ఏళ్లగా దాని వ్యవహారశైలిపై విచారణ నడుస్తున్నా, కేసులు వేస్తున్నా, ప్రభుత్వాధికారుల, రాజకీయనాయకుల సహకారంతో వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతూ పోయి నాలుగు రాష్ట్రాలకు చెందిన 5.85 కోట్ల మంది పెట్టుబడిదారుల కొంప ముంచింది. వింత విషయమేమిటంటే కోర్టులు కూడా కరుణ చూపుతూ, ఇది పోంజీ కంపెనీ అవునా కాదా అని తర్జనభర్జన చేస్తూ చర్య తీసుకోకుండా అడ్డుకున్నాయి. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు 2014 ఫిబ్రవరిలో విచారణ ప్రారంభించిన సిబిఐ భాంగూపై రెండేళ్ల క్రితమే ఎఫ్ఐఆర్ దాఖలు చేసినా నత్త స్పీడుతో విచారణ సాగించి, యిన్నాళ్లకు అతన్ని, సహచరులను అరెస్టు చేసింది. భాంగూ అకాలీ దళ్‌కు, ముఖ్యంగా ఉపముఖ్యమంత్రికి సన్నిహితుడు కాబట్టి, 2017 రాబోయే పంజాబ్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే యీ అరెస్టు జరిగిందనే సందేహమూ వ్యక్తమౌతోంది.

35 సం॥రాల క్రితం భాంగూ పంజాబ్‌లోని అట్టారీలో పాలవ్యాపారి. పియర్‌లెస్ యిన్వెస్ట్‌మెంట్ కంపెనీకి ఇన్సూరెన్సు ఏజంటుగా పనిచేస్తూ ప్రజలతో సంబంధాలు పెంచుకున్నాడు. క్రమంగా పోంజీ స్కీముతో కంపెనీ ఒకటి పెడితే బాగుండునని తోచింది. దాదాపు వంద సంవత్సరాల క్రితం ఛార్లెస్ పోంజీ అనే అతను రూపొందించిన యీ విధానం అంతకుముందు కూడా వున్నా, అతను దానికి ఒక పక్కా స్కీముగా తీర్చిదిద్దాడు. మార్కెట్లో వున్న రేటు కంటె హెచ్చు వడ్డీ యిస్తామని అత్యాశ చూపి పెట్టుబడిదారులను ఆకర్షిస్తారు. తమకు వేరే వ్యాపారాలున్నాయని, యీ డబ్బును వాటిలో పెట్టి విపరీతంగా లాభాలు ఆర్జిస్తాం కాబట్టి అందరి కంటె ఎక్కువ వడ్డీ యివ్వగలమని నమ్మబలుకుతారు. అది కాకుండా యింకో లాభం చూపిస్తారు. తనలాటి వాళ్లను

మరో పదిమందినో, యిరవై మందినో స్కీములో చేర్పిస్తే కమిషన్ వస్తుందంటారు. ఆ యిరవై మంది, మరో యిరవై మందిని చేర్పిస్తే మరి కొంత కమిషన్ వస్తుందంటారు. ఇలా గొలుసుకట్టులా సాగిపోతూ స్కీములో చేరినవారి సంఖ్య పెరిగినకొద్దీ, తాము పెట్టుబడి పెట్టిన డబ్బు కమిషన్ రూపేణా వెనక్కి వచ్చేస్తుందంటారు. కొన్నాళ్లకు కంపెనీ యిచ్చే డబ్బు అదనంగా వచ్చే బోనసు లాటిదే అంటారు.

ఇవన్నీ చెప్పి కన్విన్స్ చేయడానికై నియమించే ఏజంట్లకు కంపెనీ విపరీతంగా కమిషన్లు యిస్తుంది. ఒకసారి ఎవరినైనా ఏమార్చి సభ్యుడిగా చేర్పించాక, తక్కినవారిని ఏమార్చే పని అతనే చూసుకుంటాడు. అదేదో యాడ్‌లో 'నేను నమ్మాను, మీరూ నమ్మండి' అన్నట్లు 'నేను చేరాను, మీరూ చేరండి' అంటాడు. ఇంటిపక్కవాళ్లు, బంధువులు, స్నేహితులు అంతా ఒకర్ని చూసి మరొకరు చేరతారు. ఈ స్కీముల్లో ప్రధానమైన అంశం ఏమిటంటే కొన్ని బ్యాచ్‌ల వరకు వాళ్లు చెప్పినట్లుగా డబ్బు వెనక్కి వచ్చేస్తుంది. 'మీరు గతంలో ఎందరినో నమ్మి మోసపోయారు, మేం మాత్రం అలాటి వాళ్లం కాము' అని చెప్పడానికి యిది పనికి వస్తుంది. నిజానికి కంపెనీ చేసే వ్యాపారం పెద్దగా ఏమీ వుండదు, మరి వాళ్లు అంత డబ్బు ఎక్కణ్నుంచి యిస్తున్నారంటే, కొత్త డిపాజిటర్ల నుంచి! కొత్త బ్యాచ్‌లు జోరుగా వస్తున్నంతకాలం పాతవాళ్లకు డబ్బులు తిరిగి వస్తాయి, అది ఎప్పుడైతే ఆగిందో లేదా సన్నబడిందో వీళ్ల కష్టాలు ప్రారంభమవుతాయి. కొత్త బ్యాచ్‌ల నుంచి డబ్బు వచ్చినా కంపెనీ ప్రమోటర్లు ఆ డబ్బును తమ సొంత ఖాతాల్లోకి మళ్లించేసుకుంటారు, తమ పేర ఆస్తులు కొనుక్కుంటారు. పాత వాళ్లకు దక్కేదేమీ వుండదు – కంపెనీ వాడు పారిపోయినప్పుడు లబోదిబో మనడం తప్ప! ఈ స్కీము మన దగ్గర కూడా 'చెయిన్ స్కీము' అని మరొటని అనేక పేర్లతో వర్ధిల్లుతూనే వుంటుంది. సిబిఐ లెక్క ప్రకారం ఒడిశా, బెంగాల్‌లలోనే 200 పోంజీ స్కీములున్నాయట. జనాలు ఎన్నిసార్లు మోసపోయినా, మళ్లీ మళ్లీ మోసపోవడానికి సిద్ధంగా వుంటారు.

పెర్ల్ ఏగ్రిటెక్ కార్పోరేషన్ లి. (పిఏసిఎల్), పెర్ల్ గోల్డెన్ ఫారెస్ట్స్ (పిజిఎఫ్) అనే పేర్లతో భాంగూ కంపెనీలు పెట్టి అలాఅలా ఎదిగిపోయాడు. అతనికి ప్రస్తుతం 23 లక్షల మంది కమిషన్ ఏజంట్లు వున్నారు. వాళ్లకు 40% కమిషను యిస్తాడు. మధ్యతరగతివాళ్లని సభ్యులుగా పెట్టుకుంటే వాళ్లు అవకతవకలను త్వరగా పసిగట్టగలరు. మీడియాకు తెలియపరచగలరు. అందుకని కడుపేద వారిని, గుడిసెల్లో వుండేవారిని, రోజు కూలీలను సభ్యులుగా చేర్పించాడు. దాంతో అతనిపై ఫిర్యాదు చేసేవాళ్లు లేకుండా, మీడియా కంటపడకుండా హాయిగా మోసాలు చేస్తూ పోయాడు, అసంఖ్యాకంగా షెల్ కంపెనీలు పెట్టి డబ్బు అటూయిటూ తిప్పాడు. అతని సామ్రాజ్యం హరియాణా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, తమిళనాడులకు విస్తరించింది. తనను పెద్ద పారిశ్రామికవేత్తగా చూపించుకోవడానికి సొంత మీడియాను తయారుచేసుకున్నాడు. సహారా, శారదా గ్రూపు దగ్గర్నుంచి ఇండియాలోని పోంజీ కంపెనీలన్నీ చేసే పనే యిది. మన రాష్ట్రంలో అగ్రిగోల్డ్ కూడా యిదే విధంగా ఆపరేట్ చేస్తూ ప్రజల్ని మభ్యపెట్టి డిపాజిట్లు వసూలు చేస్తూ "నది" మాసపత్రిక, "టాలీవుడ్" అనే టీవీ ఛానెల్ పెట్టి, "హాయ్‌ల్యాండ్" పెట్టి, తనను పెద్ద గ్రూపుగా చూపుకున్న విషయం గుర్తించాలి. భాంగూ కూడా పి7 పేర ఛానెల్ పెట్టి దాని ప్రారంభోత్సవానికి సుస్మితా సేన్‌ను పిలిచాడు. పంజాబ్ ఉపముఖ్యమంత్రి సుఖ్‌బీర్ బాదల్ ప్రపంచ కబాడీ టూర్నమెంటు పెడితే దానికి రూ. 35 కోట్లతో స్పాన్సర్‌షిప్ తీసుకున్నాడు. కింగ్స్ ఎలెవెన్ పంజాబ్ ఐపిఎల్ టీముకి లీడ్ స్పాన్సర్‌గా వుంటూ శిల్పా శెట్టి భర్త రాజ్ కుంద్రాకు సన్నిహితుడయ్యాడు. బాడ్మింటన్ మ్యాచ్‌లను స్పాన్సర్ చేసి దానికి అక్షయ్ కుమార్‌ను బ్రాండ్ ఎంబాసిడర్‌గా పెట్టుకుని అతనితో కూడా స్నేహం పెంచుకున్నాడు. గ్యాన్‌సాగర్ మెడికల్ కాలేజి అని ఒకటి పెట్టాడు. ఇవన్నీ ఒక యెత్తు. ఆస్ట్రేలియా వాళ్లను బుట్టలో పడేయడం మరో 'ఎత్తు'. ఇక్కడ దగా చేసిన డబ్బులోంచి 150 మిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్లను (రూ. 650 కోట్లు) తరలించి తన పేర, బంధువుల పేర పెట్టిన కంపెనీల ద్వారా ఆస్ట్రేలియాలో పెట్టుబడులు పెట్టి వారిని ఆకర్షించాడు. 2009లో 62 మిలియన్ డాలర్లతో గోల్డ్ కోస్ట్‌లో షెరటన్ మిరాజ్ హొటల్ కొన్నాడు. ఆస్ట్రేలియన్ క్రికెటర్ బ్రెట్ లీని తమ పెర్ల్ గ్రూపుకు బ్రాండ్ అంబాసిడర్‌గా పెట్టుకుని క్వీన్స్‌లాండ్, విక్టోరియాలలో వెయ్యి ఎపార్ట్‌మెంట్లు కడతామని ప్రకటిస్తూ అక్కడివారిని బుట్టలో పెడుతున్నాడు. 2012లో ఆస్ట్రేలియా పౌరసత్వం తీసుకున్నాడు. తన కుటుంబసభ్యులలో చాలామందిని అక్కడకి పంపించేశాడు – ఇక్కడ ఏదైనా గొడవ వచ్చినా వాళ్లెవరూ దొరక్కుండా!

భాంగూ ఆస్తులకు మూలం – పేదవాడు చెమటోడ్చి, సంపాదించి, కూడబెట్టిన డబ్బు. దాన్ని ఎలా లాక్కోగలిగాడంటే విపరీతమైన వడ్డీల ఆశ చూపి! రెండు రూపాయల, మూడు రూపాయల వడ్డీ కూడా యిస్తానన్నాడు. అంతెలా యివ్వగలరంటే మేం కంపెనీ తరఫున అనేక భూములు కొంటున్నాం, రియల్ ఎస్టేటు బూమ్‌లో వాటి ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి, అందుకే యివ్వగలం అని జవాబిచ్చాడు. ఆ భూమిని మీకు యిస్తున్నాం అంటూ ఎలాట్‌మెంట్ లెటర్లు కూడా యిచ్చేశాడు. నిజానికి కంపెనీ దగ్గర అందరికీ యివ్వగలిగేటంత భూమి లేనే లేదు, కానీ తమ ఎలాట్‌మెంట్ లెటర్లపై జనాలకు అనుమానం రాకుండా పెర్ల్ అనేది పెద్ద గ్రూపుగా భ్రమింపచేయాడనికి మీడియాను, స్పాన్సర్‌షిప్పులను, రాజకీయనాయకులతో కలిసి తిరగడాలను వుపయోగించుకున్నాడు. వాళ్ల పి7 టీవీ ఛానెల్ కార్యక్రమానికి రాజ్‌నాథ్ సింగ్‌ను పిలిచి, దాన్ని ప్రముఖంగా చాటుకున్నాడు. మామూలు ప్రజలు టోకరా తినడంలో ఆశ్చర్యమేముంది? మరి యింత పెద్ద ఎత్తున మోసం జరుగుతూంటే ఎవరూ ఏమీ చేయకుండా ఎలా వున్నారన్న సందేహం కలుగుతుంది. ఈ కంపెనీ వ్యవహారాలు ఒక ప్రజాహిత వ్యాజ్యం ద్వారా 1998లోనే ఢిల్లీ హైకోర్టు దృష్టికి వచ్చాయి. వాళ్లు నిషేధించిన 478 కంపెనీల్లో యిది కూడా ఒకటి. కస్టమర్ల సంఖ్య 1,941 మాత్రమే వున్నా యీ కంపెనీ ఆ తీర్పును సవాలు చేసింది. పోంజీ సంస్థ అవునా కాదా అనే విషయం తేల్చే బాధ్యతను సెబికి అప్పగించింది కోర్టు. సెబి ఆడిట్ చేసి పోంజీయే అంది.

ఇది పోంజీ కంపెనీయా, లేక యిన్వెస్ట్‌మెంట్ కంపెనీయా అనే విషయంపై వివిధ రాష్ట్రాల హైకోర్టులు రకరకాల తీర్పులు యిచ్చాయి. రాజస్థాన్ హైకోర్టు పోంజీ కాదంది. పంజాబ్, హరియాణా హైకోర్టు పోంజీయే అంది. మధ్యప్రదేశ్ హైకోర్టు పోంజీ అనడమే కాదు, సిబిఐ విచారణ జరగాలంది. అవునో కాదో తేల్చే భారం ఢిల్లీ హైకోర్టు సెబిపై పెట్టింది. సెబి కూడా పోంజీయే అంది. దానిపై 2003లో కంపెనీ సుప్రీం కోర్టుకి వెళ్లింది. అక్కడే పదేళ్లు పెండింగులో పడిపోయింది. ఇంత ముఖ్యమైన విషయంపై సుప్రీం కోర్టు మౌనంగా వుండడం ఎంత ప్రమాదకరమో ఆలోచించండి. ఆ పదేళ్లలో కంపెనీ బీభత్సంగా విస్తరించేసి కస్టమర్ల సంఖ్యను 5.85 కోట్లు చేసుకుంది. దానికో కారణం వుంది.

ఇది పోంజీ కంపెనీయే అని సెబి తీర్పు వచ్చాక ఢిల్లీ హైకోర్టు జస్టిస్ కె స్వామిదురైను కంపెనీ కస్టమర్లతో కుదుర్చుకుంటున్న సేల్ ఎగ్రిమెంట్లు కరక్టా కాదా అని చూడమంది. ఆయన చూసి కరక్టుగానే వున్నాయన్నాడు. అలా అయితే యికపై జరిగే ఒప్పందాలన్నీ ఆయన ఎప్రూవ్ చేస్తేనే కస్టమర్లకు భూమి అమ్మవచ్చు అంది. ఆశ్చర్యకరంగా దీనిలో సెబిని పార్టీగా చేయలేదు. ఇక దాంతో కంపెనీ 'మా అగ్రిమెంట్లన్నీ కోర్టు పర్యవేక్షణలో జరుగుతున్నాయి' అంటూ ప్రచారం చేసుకుని బ్రహ్మాండంగా బిజినెస్ చేసుకుంది. 2002 నుండి 2013 వరకు స్వామిదురై 19 వేల అగ్రిమెంట్లు వెరిఫై చేసి ఓకే అనేశాడు. సెబి ఆశ్చర్యపోయి శాంపుల్‌గా 500 అగ్రిమెంట్లు తీసుకుని పరీక్షించింది. కంపెనీ అమ్మిన భూమి కంపెనీది కాదని తెలిసింది. అదేమిటని స్వామిదురైని అడిగితే ఆయన "నేను కంపెనీకి, కస్టమరుకు జరిగిన అగ్రిమెంటు కరక్టా కాదా అని చూశాను తప్ప, అగ్రిమెంటులో రాసిన భూమి కంపెనీది కాదా అని చూడలేదు. అది చూడమని ఎవరూ చెప్పలేదు. అది నా పరిధి కాదు." అన్నాడు! ఇది కస్టమర్లపై వేసిన క్రూరమైన జోకు. మేరఠ్‌లో కంపెనీ ఎలాట్ చేసిన భూమి స్మశానంలో వుంది, ప్రభుత్వ అడవుల్లో వుంది. చంబల్‌లో కొన్ని భూములు కొన్నారు. రాజస్థాన్‌లో దేశసరిహద్దుల్లో కొంత కొన్నారు. ఇలా ఎన్నోఎన్నో మోసాలు జరిగాయి.

ఇప్పటికైనా దీన్ని బయటపెట్టడానికి పెర్ల్ కస్టమర్ల తరఫున సురుచి అగర్వాల్ అనే లాయరు పెర్ల్ బాధిత సంఘం ఏర్పాటు చేసి ఆస్తుల వివరాలు, మొత్తం కస్టమర్ల పేర్లు, ఎంతమందికి తిరిగి యిచ్చారు, ఎంతమందికి తిరిగి యివ్వాలి వివరాలు యివ్వమని కంపెనీని అడిగితే కంపెనీ పట్టించుకోవడం లేదు. పైగా బోగస్ కస్టమర్ల అసోసియేషన్లు పుట్టించి, మాకేం అభ్యంతరాలు లేవని ప్రచారం చేయిస్తోంది. రూలుకి వ్యతిరేకంగా డిపాజిట్లు సేకరించిన మార్గదర్శి విషయంలో కూడా యిలాటి వివరణలే యిచ్చారు. 'ఇప్పటిదాకా ఎవరూ ఫిర్యాదు చేయలేదు కదా, కంపెనీ పేర లేకపోయినా మా పేర వేరే చోట ఆస్తులు వున్నాయి కదా' అంటూ కంపెనీ వాదించింది. కోర్టు అధికారులు వచ్చి డిపాజిటర్ల వివరాలు అడిగితే పొడి అక్షరాల పేర్లు, అడ్రసులు లేని పేర్లు చూపారు. సకాలంలో చర్యలు తీసుకున్నారు కాబట్టి మార్గదర్శిలో పెట్టుబడి పెట్టినవారు బతికిపోయారు. అది ఒక పెద్ద గ్రూపుకి చెందినది కాబట్టి, పరపతి పోతుందన్న భయంతో గ్రూపు వాటాలు రిలయన్సుకి అమ్మి డిపాజిట్లు వెనక్కి యిచ్చారు. పెర్ల్ కస్టమర్లకు ఆ భాగ్యం దక్కేట్టు లేదు. వాళ్లకు భూమీ దక్కదు, డబ్బూ వెనక్కి రాకపోవచ్చు. ఇలాటి మోసాలు జరిగినప్పుడే వ్యవస్థలో వున్న ఎన్ని లోపాలు వున్నాయో స్పష్టంగా కళ్లక్కట్టినట్లు కనబడుతుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2016)**

**ఫిబ్రవరి 42, 43** **ఎమ్బీయస్ : నంబి కొండయ్య**

ఆంధ్రలో టిడిపి ఫిరాయింపులకు గేట్లు తెరిచింది. వైకాపా నుంచి ఫలానా వాళ్లు ఎప్పుడు వెళతారు, మొత్తం ఎంతమంది వెళతారు అనే వూహాగానాలు పత్రికలకు కాలక్షేపం. తెలంగాణలో టిడిపి నాయకుల విషయంలో యిలాగే జరిగింది. ఓ గంట తర్వాత పార్టీ ఫిరాయించబోతూ యీ పార్టీ ఆఫీసులో అధ్యక్షుడి పక్క కుర్చీలో కూర్చుని వెళ్లిన ప్రబుద్ధుడున్నాడు. వైకాపాలో మూడోవంతు చీల్చగల సత్తా మాకుంది అనే టిడిపి నాయకుల మాటల్ని మనం శంకించవలసిన పని లేదు. ఒకప్పటి మాట ఏమో కానీ గత ఐదారేళ్లుగా మన తెలుగు ఎమ్మెల్యేలు, ఎంపీలు హరియాణా వాళ్లను మించిపోతున్నారు. దశాబ్దాలుగా ఎవరి సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పోరాడుతూ వచ్చారో ఆ పార్టీలోనే చేరిపోతున్నారు. నియోజకవర్గంలో పనులు జరగడానికి.. అనే ఒక్క కారణం చాలు. అధికార పార్టీ ఎమ్మెల్యే వున్న నియోజకవర్గంలో పనులు అవుతున్నాయా? అవుతూ వుంటే అక్కణ్నుంచి కూడా పింఛన్ల గురించి, నిలిచిపోయిన కార్యక్రమాల గురించి ప్రజల్నుంచి ఫిర్యాదులెందుకు వస్తున్నాయి? రైతుల, ఋణగ్రస్తుల ఆత్మహత్య లెందుకు జరుగుతున్నాయి? అని ఎవరూ అడగరు. పార్టీ మారిన ఆర్నెల్ల తర్వాత వచ్చి యిప్పటికి ఎన్ని పనులు అయ్యాయని అడగరు.

అయినా అదేమిటో కానీ ఫిరాయించేవారికి మళ్లీ ఎన్నికలలో నిలబడే ధైర్యం వుండటం లేదు. దొడ్డిదార్లు వెతుకుతున్నారు. తమ పేరంటు పార్టీలో మూడో వంతు మంది చీలి తమపై అనర్హత వేటు పడకూడదని, తాము మళ్లీ ప్రజల దగ్గరకి వెళ్లే అవసరం పడకూడదని దేవుణ్ని ప్రార్థిస్తున్నారు. గతంలో అయితే మూడో వంతు మంది ఒక్కసారే ఫిరాయించాలని అనుకునేవారు. కొత్త తరం స్పీకర్లు వచ్చాక ఆ బెడద లేదు. ఐదేళ్ల కాలంలో ఎప్పుడు ఎంతమంది వచ్చినా, చివర్లో అందర్నీ కలిపి లెక్కకట్టే సౌలభ్యం వచ్చింది. అందువలన యివాళే వైకాపా నుండి మూడో వంతు వచ్చేస్తారని మనం అనుకోనక్కరలేదు. నెలకో యిద్దరు చొప్పున లాక్కుంటూ వస్తే ఏడాది పాటు పేపర్లకు కాలక్షేపం. తర్వాత ఎవరొస్తారో చెప్పుకో చూదాం అని టీవీ ఛానెళ్లు గేమ్ షోలు పెట్టుకోవచ్చు, కోడిపందాల రాయుళ్లు జూదాలాడవచ్చు. నెలకో శంకుస్థాపన అంటున్నారుగా బాబు. శంకుస్థాపన జరగ్గానే, స్వర్ణాంధ్ర సాధించే సత్తా బాబుకే

వుందని మాకు నమ్మకం కుదిరింది, అందుకే చేరుతున్నాం అంటూ ఓ యిద్దరు ఎమ్మెల్యేలు అదే ఫంక్షన్‌లో చేరేట్లు ప్లాన్ చేస్తే భేషుగ్గా వుంటుంది. ఏడాది చివరకు టార్గెట్ పూర్తవుతుంది. ఉపయెన్నికలు పెట్టి రిస్కు తీసుకోనక్కరలేదు.

ప్లాను వరకూ బాగానే వుంది కానీ యిప్పుడీ ప్లానుకి అవసరం ఏముంది అనే ప్రశ్నే వస్తుంది. ఆ మాటకు వస్తే తెలంగాణలో మాత్రం తెరాసకు ఫిరాయింపుదార్ల అవసరం ఏముంది? తగినంత మెజారిటీ వుంది కదా. జాతీయ పార్టీలైన కాంగ్రెసును, బిజెపిలను తుడిచిపెట్టడం కుదరదు కాబట్టి ప్రాంతీయపార్టీలైన వైకాపా, టిడిపిలను నిర్మూలించేస్తే ప్రతిపక్షం బలహీనపడుతుందని, తన చేష్టలను ఎవరూ ఎదిరించలేరనీ కెసియార్ ఆలోచనట. బాబుకీ అదే ఆలోచన వుండవచ్చు కానీ ఆంధ్రలో వైకాపాను సాంతం తుడిచిపెట్టడం అయ్యే పని కాదని ఆయనకూ తెలుసు. మరి ఎందుకీ కసరత్తు? క్యాడర్‌లో నైతిక స్థయిర్యం పెంచడానికి అని కొందరు జవాబు చెపుతున్నారు. అబ్బే, గంటలో పడగొట్టగలనని జగన్ సవాలు విసిరాడు కాబట్టి తిక్కరేగి బాబు యిది మొదలుపెట్టారు అని మీడియాలో వచ్చింది. జగన్ సవాలు కంటె ముందుగానే చాలా నెలల క్రితమే టిడిపి ఫిరాయింపులకు తెర తీసిందన్న మాట ఎలా మర్చిపోగలం? తాజాగా జగన్ సవాలుకు ముందే వైకాపా నుండి 21 మంది మాలో చేరుతున్నారని టిడిపి నాయకులన్నట్లు పేపర్లో వచ్చింది. దానికి స్పందనగానే జగన్ ఛాలెంజ్ వచ్చింది. అయినా జగన్ ఛాలెంజ్‌ను ప్రజలే సీరియస్‌గా తీసుకోలేదు, బాబు తీసుకున్నారా?

జగన్ కుర్చీ ఎక్కనూ లేదు, ఎక్కినవాణ్ని దింపనూ లేడని కిరణ్ కుమార్ టైములోనే రుజువైంది. జగన్ వైపు ఫిరాయించిన వారిని కూడా కిరణ్ మేనేజ్ చేసి వెనక్కి రప్పించుకున్నాడు. కిరణ్ కంటె కాకలు తీరిన బాబు టైములో జగన్ నెగ్గగలడని ఎవరనుకుంటారు? పైగా స్పీకరు జగన్ మీద కత్తి కట్టివున్నాడు. ఎప్పుడో ఒకప్పుడు సంయమనం కోల్పోయి జగన్ చేతిలోంచి స్వయంగా మైకు లాగేసుకున్నా నేను ఆశ్చర్యపోను. టిడిపి నుంచి ఎవరినైనా తన వైపుకి జగన్ లాక్కుని వచ్చినా వాళ్లందరినీ అనర్హులుగా ప్రకటించే హక్కు స్పీకరుది. అందువలన జగన్ పక్షాన వున్నవాళ్లందరూ ఎమ్మెల్యేలు కారు అని ఒక్క రూలింగు యిచ్చేసి, ఉన్నవాళ్లలో టిడిపికి మెజారిటీ వుంది అని తీర్మానించేయగల ఘనుడు స్పీకరు. స్పీకరును దింపేసి గవర్నరు అ అధికారాలన్నీ తనకు దఖలు పర్చుకోవచ్చు అని సుప్రీం కోర్టు అరుణాచల్ కేసులో తేలిస్తే అప్పుడు స్పీకరుకి మొగుడు సూపరు స్పీకరుగా గవర్నరు అవతరిస్తాడు. కానీ గవర్నరు ఆ అవతారం ఎత్తాలో లేదో తేల్చేది కేంద్రంలోని మోదీ. ఈ పరిస్థితుల్లో గంటలో కూలుస్తా అనే మాటల్ని 'కంటిచూపుతో చంపేస్తా' లాటి డైలాగుగానే తీసుకోవాలి తప్ప 'ఏదీ కంటిచూపుతో, తొడచరుపుతో చంపు చూద్దాం' అని అడక్కూడదు. లోకపు తీరు తెలిసిన బాబు జగన్ మాటలు విని నవ్వుకుని వుంటారు తప్ప 'నా తడాఖా చూపిస్తా' అని జట్టీకి దిగి వుండరు.

మరి ఫిరాయింపులకు ఎందుకు సై అన్నట్లు? అంటే నైతిక స్థయిర్యం అనే జవాబు దగ్గరకు వచ్చి ఆగుతాం. ఇది కూడా అనేక సందేహాలకు దారి తీస్తుంది. ఎక్కడున్న క్యాడర్ నైతిక స్థయిర్యం? పార్టీకి డ్యామేజి జరుగుతున్నది తెలంగాణలో! ఇక్కడ మన పార్టీకి మనుగడ వుందా లేదా అన్న సందేహం కలిగేది అక్కడి కార్యకర్తల్లో! వాళ్లకు వైకాపా నుంచి ఫిరాయింపులు ఏం ఊరట కలిగిస్తాయి? అవే లేకపోతే 'ఫిరాయింపులు – నైతిక విలువల పతనం' అనే పేరుతో సదస్సులు ఏర్పాటు చేసి మేధావుల చేత మాట్లాడించి తెరాస రాజకీయాల పట్ల మధ్యతరగతిలో విముఖత కలిగించే ప్రయత్నమైనా చేయగలిగేవారు. ఇప్పుడు ఆంధ్రలో చేష్టల వలన వాళ్లు డిఫెన్సులో పడ్డారు. కెసియార్‌ను తిట్టినపుడల్లా మీ బాబు ఆంధ్రలో చేస్తున్నదేమిటి అన్న ప్రశ్న ఎదుర్కోవలసి వస్తోంది. అది నైతిక స్థయిర్యాన్ని ఎలా కలిగించగలదు? ఇక ఆంధ్రలో క్యాడర్ కంటారా..? వాళ్ల నైతిక స్థయిర్యానికి వచ్చిన లోటు ఏమీ లేదు. అక్కడ టిడిపికి ఎదురే లేదు. కాంగ్రెసు చనిపోయింది, వైకాపా కోమాలో వుంది. ఏం చేసినా, ఏం కబుర్లు చెప్పినా చెల్లిపోతోంది. వైకాపా క్యాడర్ చేర్చుకుని సాధించేముంది? వాళ్లేమైనా కొత్త ఆరోపణలు చేయగలరా? అదే లక్ష కోట్లు, అదే అభివృద్ధికి అడ్డుపడడం కదా! నిజానికి తెలంగాణలో పరిణామాల పట్ల ఆంధ్ర టిడిపి క్యాడర్ సంతోషంగా వుండి వుండాలి. బాబు రెండు రాష్ట్రాల్లో చెరో కాలు పెడితే, ఆంధ్రకు కావలసినంత టైము కేటాయించలేరు. ఇప్పుడు తెలంగాణలో పార్టీ ముగిసిపోయింది కాబట్టి ఆంధ్రమీదే ఫోకస్ పెట్టి శత్రువులను మరింత శక్తిమంతంగా ఎదుర్కుంటారన్న ఆశ కూడా కలుగుతుంది వారికి.

మరి ఎందుకు ఫిరాయింపులు ప్రోత్సహించినట్లు అనే ప్రశ్న మళ్లీ మళ్లీ ఎదురవుతోంది. నా మట్టుకు నాకు యిది బాబు అహం చల్లార్చుకోవడానికి మాత్రమే అనిపిస్తోంది. డిఫెక్షన్ గేమ్‌లో కెసియార్ చంద్రబాబుకంటె స్మార్ట్‌గా వ్యవహరించారని, ఆయన ముందు బాబు తెలివితేటలు చాలలేదనీ అందరూ వ్యాఖ్యానించడం బాబును బాధించి వుంటుంది. రోషం కంటె ఉక్రోషం ఎక్కువగా వచ్చి దాన్ని జగన్‌పై చూపించి వుంటారు. 'ఊరంతటికీ నేను లోకువ, నాకు నంబి కొండయ్య లోకువ' అని సామెత. కెసియార్‌కు బాబు లోకువ అయిపోతే, బాబుకు జగన్ లోకువ. ఎందుకంటే జగన్‌కు అవకాశాలు వినియోగించుకోవడం రాదు. బాబు పాలనపై ప్రజల్లో రగులుతున్న అసంతృప్తిని నిర్మాణాత్మకమైన కార్యక్రమాల ద్వారా, దీర్ఘకాలపు నిరసనల ద్వారా, ఛానెలైజ్ చేయడం రాదు. ఏ సమస్య పైన స్పష్టమైన విధానాలు ప్రకటించడం చేతకాదు. "సాక్షి" పేపర్లో రాసేస్తే చాలు ప్రజల్ని ఎడ్యుకేట్ చేసేసినట్లే అనుకుంటారు. ఆ పేపరు కొనేవారందరూ రాజకీయవార్తలు చదువుతారన్న గ్యారంటీ లేదు. చాలామంది పేపర్లు ఫీచర్ల కోసమే చదువుతున్నారు. పైగా "సాక్షి"ని మీడియాలో భాగంగా పరిగణించరు. వైయస్సార్ బొమ్మ ముఖపత్రం మీద వేసుకుని వస్తుంది దాన్ని "విశాలాంధ్ర", "ప్రజాశక్తి" వంటి పార్టీ పత్రికగానే చూస్తారు. దానిలో రాజకీయవార్తలను చదివి నమ్మేవారు యిప్పటికే వైకాపా అభిమానులై వుంటారు. తటస్థంగా వున్నవారిని ప్రభావితం చేయడం ముఖ్యని. దానికి "సాక్షి" చాలదు. ప్రజల్లో అవగాహన కలిగించాలంటే పేపర్లో వ్యాసాలు వేస్తే సరిపోదు. పార్టీ కార్యకర్తలు గుడిసెగుడిసెకు వెళ్లి ఎడ్యుకేట్ చేయాలి. కానీ జగన్‌కు మొదటినుంచీ అడ్డదారుల

మీదే ఆసక్తి. కొత్తగా పార్టీ పెట్టినపుడు కొత్తవారిని రాజకీయాల్లోకి తెచ్చి తర్ఫీదు యిచ్చే ఓపిక లేదు. కాంగ్రెసు నుంచి వచ్చిన ఫిరాయింపుదారుల మీద ఆధారపడే రాజకీయాలు ప్రారంభించారు. ఈ రోజు పార్టీ పుట్టి మునుగుతున్నది కూడా ఫిరాయింపుదారుల చేతనే! 'కత్తితో వ్యవహరించువాడు కత్తిచేతనే మరణించును' అని బైబిల్ వాక్యం. 'ఒరులేయవి ఒనరించిన తన కప్రియమగునో, తానొరులకు అవి సేయకునికి పరమధర్మము' అని భారతసూక్తి.

తెలంగాణలో పార్టీ ఐసియులోకి చేరడాన్ని బాబు సీరియస్‌గా తీసుకోవడం సమంజసం కాదు. ప్రాంతీయపార్టీలు రెండు రాష్ట్రాల్లో వుండలేవు. తమిళనాడు, పాండిచ్చేరి రెండు రాష్ట్రాలుగా లెక్కకు వున్నా వాటి మధ్య వైరుధ్యం లేదు. కర్ణాటకలో వుండే డిఎంకె లేదా ఎడిఎంకె యూనిట్ కావేరీ విషయంలో ఎటూ మాట్లాడలేదు కాబట్టి కర్ణాటకలో పుంజుకోలేదు. కర్ణాటకలో మహారాష్ట్ర ఏకీకరణ సమితి అనే పార్టీ వుండేది కానీ అది సరిహద్దు తగాదా వున్న బెళగాంలో మాత్రమే గెలిచేది. 1970 ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్‌లో డిఎంకె అభిమానులు 'ద్రవిడ ముందడుగు కూటమి' అనే పేరుతో పార్టీ పెట్టబోయారు కానీ దాని అడుగు ముందుకు పడలేదు. కెటియార్ తెరాస యూనిట్ ఆంధ్రలో పెడతామని జోక్ చేశారు కానీ అది అయ్యే పని కాదని ఆయనకూ తెలుసు. టిడిపి, వైకాపాలు తెలంగాణలో మనడం కష్టం. రెండు రాష్ట్రాల మధ్య నీటి తగాదాలు ముదిరినకొద్దీ ఎటూ చెప్పలేక అవస్థపడతారు. ప్రత్యేక తెలంగాణ కావాలని లేఖ యిచ్చినపుడే బాబు యీ విషయాలన్నీ ఆలోచించుకుని చేయాల్సింది, యిప్పుడు టూ లేట్. ఇక్కడేదో జరిగిందని, ఆవేశపడి వైకాపాను చీల్చి 'మేమూ మొనగాళ్లమే, మాకూ వచ్చు యీ విద్య' అని చాటుకున్నంత మాత్రాన యిక్కడ ఒరిగేది ఏమీ లేదు.

అక్కడ ఒరిగేది ఏమైనా వుందా అని ఆలోచిస్తే టిడిపికి ఏమీ ఒరగక పోవచ్చు కానీ ఆంధ్ర సమాజానికి మాత్రం కొంత మేలు జరగకపోదు. ప్రస్తుతం టిడిపి ఫోకస్ అంతా రెండు జిల్లాల మీదే, ఒక కులం మీదే వుందని, వాళ్లే లాభపడుతున్నారని ప్రబలమైన భావం వుంది. ఆ కులానికి అనుకూలురు, వ్యతిరేకులుగా సమాజం విడిపోతుందేమోనన్న భయం కలుగుతోంది. ఇప్పుడు ఇలా ఎడాపెడా ఫిరాయింపులను ప్రోత్సహించి అన్ని ప్రాంతాల వాళ్లనీ, కులాల వాళ్లనీ చేర్చేసుకుంటే వాళ్లూ 'అభివృద్ధి' కార్యక్రమాల్లో తమ తమ వాటాలు అడుగుతారు. ఆ విధంగా అభివృద్ధి, దానికి కవల అయిన అవినీతి వికేంద్రీకరణ జరిగి రాష్ట్రమంతటా విస్తరిస్తుంది. 1978లో 175 మంది శాసనసభ్యులతో చెన్నారెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఫిరాయింపులను ప్రోత్సహించారు. 30 మంది సభ్యుల్లో కాంగ్రెసు - యు ను 3కి తెచ్చారు, 60 మంది జనతా పార్టీని 16కి తెచ్చారు. సిపిఎంఎల్ సభ్యుడే కాదు, చెన్నారెడ్డిని నిత్యం చీల్చి చెండాడే రోశయ్య, కె కేశవరావు సైతం కాంగ్రెసు-ఐలో చేరేట్లు చేశారు. ఇలా రాష్ట్రమంతా అ-అ పంచారు. దానివలన ప్రజలకు మొహం మొత్తి 1983లో ఎన్టీయార్‌కి ఏకంగా 199 సీట్లు కట్టబెట్టి వీళ్లని యింటికి పంపించేశారు. తెలంగాణలో, ఆంధ్రలో నేడు మూక ఫిరాయింపులు ప్రోత్సహిస్తున్నవారు ఆ కథను ఒక్కసారి మననం చేసుకుని ముందుకు సాగాలి. **- ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2016)**

**ఎమ్బీయస్ క్రైమ్ రచన - 14**

**ఫిబ్రవరి 46, 47** **ఎమ్బీయస్ క్రైమ్ రచన : ఎల్ ఎన్ మిశ్రా హత్య కేసు**

కేంద్ర రైల్వే మంత్రిగా వున్న లలిత్ నారాయణ్ మిశ్రా అనే బిహారు నాయకుడు 1975 జనవరి 2 న బిహార్‌లోని సమస్తిపూర్ రైల్వే స్టేషన్‌లో బాంబుదాడికి గురయ్యాడు. అతనితో పాటు అతని తమ్ముడు జగన్నాథ్ మిశ్రా కూడా. ఇద్దర్నీ ఆసుపత్రికి తరలించారు. పొట్ట, కాళ్ల మీద గాయాలైన లలిత్ మర్నాడు ఆపరేషన్ టేబుల్ మీదే గుండెపోటుతో 52 ఏళ్లు నిండకుండానే మరణించాడు. కాళ్లు మాత్రమే గాయపడిన జగన్నాథ్ బతికాడు, వెంటనే బిహార్ ముఖ్యమంత్రి అయ్యాడు. దరిమిలా అన్నగారి పేర యూనివర్శిటీలు, కాలేజీలు పెట్టాడు. అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ మిశ్రా హత్యపై చాలా ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చాక మహాత్మా గాంధీ తర్వాత జరిగిన యీ రాజకీయ హత్య వెనుక అనేక కారణాలున్నాయన్నారు. జయప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలో జరుగుతున్న సంపూర్ణ క్రాంతి ఉద్యమం వలన బిహార్‌లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయనడానికి యిది నిదర్శనమని, సిఐఏ (అమెరికన్ గూఢచారి సంస్థ) సహాయంతో భారతదేశాన్ని అల్లకల్లోలం చేయడానికే ప్రతిపక్షాలు కంకణం కట్టుకున్నాయని చెప్పడానికి వేరే సాక్ష్యం అక్కరలేదని వాదించారు. మరో ఆరు నెలల తర్వాత అత్యవసర పరిస్థితి విధించడానికి దీన్ని ఒక కారణంగా వాడుకున్నారు.

ఫిరోజ్ గాంధీకి ఒకప్పటి స్నేహితుడిగా ఇందిర వద్దకు చేరిన మిశ్రా కాంగ్రెసులోని పాత నాయకుల (సిండికేట్ అనేవారు)తో పోరాడడానికి ఇందిర పక్షాన నిలిచాడు. 1969లో కాంగ్రెసు చీలిపోయాక గతంలో అతుల్య ఘోష్, ఎస్ కె పాటిల్‌ల తరహాలో పార్టీకి నిధులు సమకూర్చే బాధ్యత తలకెత్తుకున్నాడు. ఇందిర అతనికి డిఫెన్సు, ప్రొడక్షన్, ట్రేడ్ వంటి కల్పవృక్షాల శాఖలను కట్టబెట్టింది. ట్రేడ్ మంత్రిగా వుండగానే 'లైసెన్సు రాజ్' ప్రవేశపెట్టి పరిశ్రమ పెట్టడానికి లైసెన్సు కావాలంటే కాంగ్రెసు పార్టీకి నిధులు సమర్పించుకోవాల్సిన పరిస్థితి కల్పించారు. అక్కణ్నుంచి రైల్వే మంత్రిగా చేశారు. అతని అవినీతిపై చాలా చర్చలు జరిగాయి. కోసీ ప్రాజెక్టులో అవకతవకలకు పాల్పడ్డారని బిహార్ అసెంబ్లీ ప్రివిలేజెస్ కమిటీ మిశ్రాపై, అతని కుటుంబసభ్యులపై నింద మోపింది.

ఫారిన్ ట్రేడ్ శాఖ మంత్రిగా వుండగా ఇంపోర్ట్ లైసెన్సుల స్కాండల్‌లో నిందితుడైన తుల్‌మోహన్ రామ్ లలిత్ మనిషే అని కూడా ఆరోపణ వుంది. అతనిపై పార్లమెంటులో అనేక ఆరోపణలు వస్తున్నాయి కాబట్టి అతనిపై చర్య తీసుకోమని అనేకమంది కాంగ్రెసు సభ్యులు కోరినా ఇందిర చర్య తీసుకోలేదు. దానికి రెండు కారణాలున్నాయని చెప్తారు. ఒకటి 1971 రాయబరేలీలో ఎన్నిక సమయంలో లలిత్ ఇందిర తరఫున చాలా ఖర్చు పెట్టాడు. వాటికి రసీదులు, రుజువులు తన దగ్గరే పెట్టుకున్నాడు. అప్పటికే ఆ ఎన్నికపై రాజ్ నారాయణ్ కోర్టులో కేసు వేసి వున్నాడు. లలిత్‌తో చెడగొట్టుకుంటే అతను ఆ రసీదులు రాజ్ నారాయణ్‌కి యిస్తే కేసు పోతుంది. ఇక రెండో కారణం ఏమిటంటే లలిత్ సంజయ్ గాంధీ మారుతి ప్రాజెక్టులో పెట్టుబడి పెట్టాడట. అందుకని ఇందిర సహిస్తూ వచ్చిందని, కానీ ఎక్కడో కాని లలిత్ హద్దు మీరాడనీ, కాలక్రమంలో చాలా భాగం నిధులు తనవద్దే అట్టే పెట్టేసుకున్నాడనీ, దానితో కోపగించిన ఇందిరే అతన్ని తన ప్రయివేటు సెక్రటరీ అయిన యశ్‌పాల్ కపూర్ ద్వారా చంపించి వేసిందనీ పుకార్లు వచ్చాయి.

1974లో దేశవ్యాప్తంగా జార్జి ఫెర్నాండెజ్ నాయకత్వంలో నడిచిన రైల్వే సమ్మెను రైల్వేమంత్రిగా ఇందిర ఆదేశాలపై కఠినంగా అణచివేసినందుకు తనపై రైల్వే ఉద్యోగులు కక్ష పెంచుకుని తనకు ప్రాణాపాయం పెరిగిందని మిశ్రా అనేకమంది దగ్గర అన్నాడు. అయినా అతని సెక్యూరిటీ పెంచలేదు. బాంబు దాడి జరిగాక అక్కడి డాక్టర్లు లలిత్‌కు పెద్దగా ప్రమాదం ఏమీ లేదన్నారు. చికిత్స కోసం సమస్తిపూర్ నుండి 50 కి.మీ. దూరంలో వున్న దర్భంగాకు కాకుండా 100 కి.మీ.ల దూరంలో పట్నా వద్ద వున్న దానాపూర్ వద్దకు రైల్వే కోచ్‌లో తీసుకెళ్లారు. ఆ ప్రయాణానికి రైల్వే వాళ్లు 8 గంటలు తీసుకున్నారు – లోపల సాక్షాత్తూ రైల్వే మంత్రే వున్నా! ఆసుపత్రిలో కూడా చికిత్స ఆలస్యంగా ప్రారంభమైంది. ఎవరో కావాలనే యిలా చేయించారని అందరూ నమ్మారు. విచారణ సవ్యంగా జరిగితే నిజానిజాలు బయటకు వచ్చేవేమో! కానీ కేసు అస్తవ్యస్తంగా నడిచింది. 22 మంది జడ్జిలు మారారు. 200 మంది సాక్షులను విచారించారు. చివరకు 2012లో 'కేసు మొదలుపెట్టి మూడున్నర దశాబ్దాలు అయింది కాబట్టి కేసు మూసేయాల'ని నిందితులు కోరడంతో సుప్రీం కోర్టు 'దినవారీ విచారణ నిర్వహించి కేసును ఒక కొలిక్కి తెండి' అని ఆదేశించడంతో యింకో రెండేళ్ల తర్వాత 2014 డిసెంబరు 8 న న్యూ ఢిల్లీలోని ట్రయల్ కోర్టు 6000 పేజీల తీర్పు వెలువరించింది. మిశ్రా హత్య కేసులో రంజన్ ద్వివేది(వయసు 66 సం॥లు), సంతోషానంద అవధూత 75, సుదేవానంద అవధూత 79, గోపాల్‌జీ 73 అనే ఆనందమార్గీయులను దోషులుగా నిర్ణయించింది. యావజ్జీవ కారాగార శిక్ష వేసింది. ఇద్దరికి రూ. 25 వేల జరిమానా, తక్కిన యిద్దరికి రూ.20 వేల జరిమానా. ఇప్పుడు వారంతా 66–79 ఏళ్ల వయసులో వున్నారు. ఇది జిల్లా జజ్ తీర్పు. దీని తర్వాత హైకోర్టు అంటారు, సుప్రీం కోర్టు అంటారు. అప్పటికి యీ నిందితులు మేం ముసలివాళ్లం దయ చూడండి అంటారు. కేసు 40 ఏళ్ల పాటు సాగదీయడంతో వచ్చే ముప్పు యిది.

ఇంతకాలం ఎందుకు పట్టింది అనే ప్రశ్న సహజంగా వస్తుంది. కేసు ఎన్ని మలుపులు తిరిగిందో తెలుసుకోవడం ఆసక్తికరంగా వుంటుంది. లలిత్ చనిపోయాక పోస్టుమార్టమ్ నిర్వహించలేదు. హత్య జరగగానే జయప్రకాశ్ నారాయణ్ నడుపుతున్న ఉద్యమం కారణంగా బిహార్‌లో శాంతిభద్రతలు నాశనమయ్యే పరిస్థితి వచ్చిందని, అదే లలిత్ ప్రాణం తీసిందని అతని శాఖ డిప్యూటీ మినిస్టర్ బూటా సింగ్ ప్రకటించాడు. వెంటనే ప్రతిపక్షాలు, మీడియా చీల్చి చెండాడాయి. దాంతో వెనక్కి తగ్గాడు. జనవరి 2 న దాడి జరిగితే బిహార్ పోలీసులు వెంటనే విచారణ మొదలుపెట్టారు. నాలుగు రోజులు తిరక్కుండా ఎవరూ కోరకుండా కేంద్రం ఆధిపత్యం లోని సిబిఐ కేసును తన చేతిలోకి తీసేసుకుంది. ఆనంద్ మార్గ్, ఆరెస్సెస్, కక్ష పెంచుకున్న రైల్వే ఉద్యోగులు కారణం అనే అనుమానంతో సిబిఐ విచారణ ప్రారంభమైంది. ఆనంద్ మార్గ్ అనే ధార్మిక, సామాజిక సంస్థను ప్రభాత్ రంజన్ సర్కార్ అనే అతను ఆనందమూర్తి అనే పేరుతో బిహార్‌లో 1955లో ప్రారంభించాడు. దీని అనుయాయులు కాషాయం ధరించేవారు. స్కూళ్లు అవీ తెరిచి సామాన్యులను ఆకర్షించేవారు. కమ్యూనిజం ప్రబలుతున్న ప్రాంతాలపై దృష్టి పెట్టి అక్కడి పేదలను ఆకట్టుకోవడంతో సిఐఏ నిధులతో యిది నడుస్తోందన్న అనుమానం బలపడింది. ఎందుకంటే వారికి నిధులు ఎక్కణ్నుంచో ధారాళంగా వస్తూండేవి. 1960ల కల్లా అది బాగా విస్తరించేసి యితర దేశాలకు కూడా వ్యాపించింది. పశ్చిమ బెంగాల్‌లో కమ్యూనిస్టులు అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తున్న సమయంలో ఆనంద మార్గీయులు, కమ్యూనిస్టులు ముఖాముఖీ తలపడేవారు. ఆనంద మార్గీయులు పూజలో వామపంథా (మాంసం, మద్యం, మగువ వంటి పంచ మకారాలతో) అవలంబిస్తారని, చిన్నపిల్లలను బలి యిచ్చి కపాలాలను ధరిస్తారని నమ్మకం వుండేది. చిన్నపిల్లలను ఎత్తుకుపోతున్నారన్న అనుమానంతో కలకత్తాలోని టాలీగంజ్‌లో 1982లో 16 మంది ఆనంద మార్గీయులను కొంతమంది పౌరులు పట్టపగలు సజీవదహనం చేశారంటే పరిస్థితి వూహించుకోండి. దానిపై ఓ పట్టాన విచారణ సాగలేదు. 2012లో జ్యుడిషియల్ కమిషన్ వేసినట్టున్నారు. కమ్యూనిస్టులపై నింద మోపడానికే కాంగ్రెసు వారు యిది చేశారని అప్పటి ముఖ్యమంత్రి జ్యోతి బసు ఆరోపించారు. ఏది ఏమైనా ఆనంద్ మార్గ్ 1970లలో కమ్యూనిస్టు వ్యతిరేకతతోనే పనిచేసిందన్నది నిర్వివాదాంశం. కమ్యూనిస్టులను అణచడానికి ఇందిర వారిని ఉపయోగించుకుందని పరిశీలకులు అంటారు. సంఘవ్యతిరేక కలాపాలు చేస్తున్నారన్న ఆరోపణపై ఆనందమూర్తి అరెస్టు అయ్యాడు.

విచారణ ప్రారంభించిన కొన్ని రోజులకే సిబిఐ ఆనంద్ మార్గ్‌ను అనుమానితుల లిస్టులోంచి తీసేసి అరుణ్ కుమార్ ఠాకూర్, అరుణ్ కుమార్ మిశ్రా అనే యిద్దరు వ్యక్తులను స్వాధీనంలోకి తీసుకుని వారిని తమ పద్ధతిలో విచారించి వారిచేత నేరాన్ని

అంగీకరింపచేశారు. శివ్ నారాయణ్ శర్మ, 'బాస్' ఝా అనే యిద్దరితో కలిసి తామే కుట్ర చేసి చంపేశామని వాళ్లు చెప్పారని అన్నారు. 1979లో ''ఇండియా టుడే''కు యిచ్చిన యింటర్వ్యూలో అరుణ్ ఠాకూర్ తనను సిబిఐ 23 రోజుల పాటు చిత్రహింసలు పెట్టిందని చెప్పుకున్నాడు. ఈ ఒప్పుకోలు కోర్టులో నిలవదని అనిపించి సిబిఐ ఆ 'బాస్' ఎవడో కనుక్కుందామని ప్రయత్నించింది కానీ వీళ్లిద్దరూ నోరు విప్పలేదు. అప్పుడు సిబిఐకు డైరక్టరుగా వున్న డి.సేన్ బిహార్ సిఐడి సహకారాన్ని కోరాడు. ఇది చాలా వింత. సాధారణంగా రాష్ట్ర పోలీసు నుండి సిబిఐకు కేసు వెళుతుంది తప్ప, సిబిఐ నుంచి యిటు రాదు. కానీ యీ కేసు వచ్చింది. నిందితులు సమస్తిపూరు జైల్లో వున్నారు. అక్కడి జైలరు రహమాన్ అరుణ్ మిశ్రాతో కబుర్లు చెపుతూ అతని విశ్వాసం చూరగొని ఆ 'బాస్' ఎవరో చెప్పమని అడిగాడు. అతని పేరు రామ్ బిలాస్ ఝా అని, తనకు అరుణ్ ఠాకూరుకి చెరో 20 వేలు యిస్తానని చెప్పి హత్య జరిగిన తర్వాత 400 చేతిలో పెట్టాడని తిట్టుకుంటూ చెప్పాడు అరుణ్ మిశ్రా. ఆ సంభాషణను టేప్ రికార్డులో రికార్డు చేసి రహమాన్ బిహార్ సిఐడికి అందచేశాడు. వాళ్లు దాన్ని కాపీ చేసి సిబిఐకు పంపించారు. టేపు ముట్టినట్లుగా సిబిఐ రసీదు కూడా యిచ్చింది.

సిబిఐ అక్కణ్నుంచి దూసుకుని వెళ్లిపోవాల్సింది కానీ అలా జరగలేదు. ఎందుకంటే ఈ రామ్‌బిలాస్ ఝా యశ్‌పాల్ కపూర్‌కు సన్నిహితుడు, కాంగ్రెసు నాయకుడు. హత్యకు కొద్ది రోజుల ముందు యశ్‌పాల్ బిహార్ వచ్చి రామ్‌బిలాస్‌కు సహచరుడైన రఘునాథ్ పాండేను కలిశాడు. రామ్‌బిలాస్ పేరు వెల్లడిస్తే యశ్‌పాల్ కపూర్ పేరు, తద్వారా ఇందిర పేరు బయటకు వస్తాయని సిబిఐ డైరక్టరు సేన్ భయపడ్డాడు. టేపు పంపగానే బిహార్ సిఐడితో సంబంధం తెంపుకున్నాడు. దాన్ని ఎక్కడో పారేశాడు. మేజిస్ట్రేటు ముందు రామ్‌బిలాస్ పేరు చెప్పకూడదనే షరతుపై కాబోలు అరుణ్ మిశ్రా, అరుణ్ ఠాకూరు యిద్దరినీ విడిచి పెట్టేశాడు. వారి స్థానంలో ఎవరో ఒకర్ని యిరికించాలి కాబట్టి ఆనంద్ మార్గ్ అసలు దోషి అన్నాడు. ఆనందమూర్తి బెయిల్ కోసం అప్లయి చేస్తే చీఫ్ జస్టిస్ ఎ.ఎన్.రాయ్ యివ్వలేదు. ఆయనపై హత్యాప్రయత్నం జరిగింది. దానిలో నలుగురు ఆనందమార్గీయులు – సంతోషానంద, సుదేవానంద, రంజన్ ద్వివేది, విక్రమ్ అరెస్టయ్యారు. మళ్లీ కొత్తవాళ్లనేం వెతుకుతాం అనుకుని, పనిలో పనిగా వాళ్లమీదే మిశ్రా హత్యానేరం కూడా మోపేశాడు. విక్రమ్ ఎప్రూవర్‌గా మారి, గోపాల్‌జీ అతని స్థానంలో నిందితుడుగా చేరాడు. మేం లలిత్, ముఖ్యమంత్రి అబ్దుల్ గఫూర్ వంటి ప్రముఖులను చంపి, ఆనందమూర్తి అరెస్టుపై దేశం దృష్టి ఆకర్షించాలని పథకం వేశార అని విక్రమ్ చెప్పాడట.

దర్భంగాలోలో పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంటులో క్లర్కుగా పనిచేస్తూ 11 ఏళ్లగా సస్పెన్షన్‌లో వున్న మదన్ మోహన్ శ్రీవాస్తవ అనే అతను పోలీసు యిన్‌ఫార్మర్. 'నేను సంతోషానంద లలిత్, గఫూర్‌ల హత్య గురించి మాట్లాడుతూండగా విన్నాను. నిజానికి నేను విశ్వేశ్వరానంద అనే మారుపేరుతో ఆనంద్‌మార్గ్‌లో వుంటాను. ఆనందమూర్తి కేసులో ఎప్రూవర్‌గా మారిన మాధవానందను చంపడానికి నేను సిద్ధపడ్డాను. అందుకే మిశ్రా హంతకులు నాతో ఫ్రీగా మాట్లాడారు' అని అతను చెప్పినట్లు సిబిఐ పేర్కొంది. ఇలా చెప్పినందుకు సిబిఐ అతనికి ఉద్యోగం మళ్లీ యిప్పించింది. సమస్తిపూర్ కలక్టరేట్‌లో స్టెనోగా పనిచేసిన గిరిజానందన్ ప్రసాద్ 'నేను యీ హంతకులకు మా యింట్లో ఆశ్రయం యిచ్చాను' అని చెప్పాడంది సిబిఐ. (కాంగ్రెసు గద్దె దిగిపోయాక అతను తన స్టేటుమెంటు వెనక్కి తీసుకున్నాడు. సిబిఐ తనను చితక్కొట్టి ఆ స్టేటుమెంటు యిప్పించిందని చెప్పాడు) ఇలా సిబిఐ ఏదేదో చెప్తూ కేసు ఫైల్ చేయడం తాత్సారం చేశారు. ఇందిర అధికారంలో వున్నంతకాలం కేసు ఫైల్ కాలేదు.

1977 ఎన్నికలలో ఇందిర ఓడిపోయి జనతా పార్టీ అధికారంలోకి వచ్చాక మే నెలలో లలిత్ భార్య కామేశ్వరీదేవి హెూం మంత్రి చరణ్ సింగ్‌కు విచారణ విషయం గుర్తు చేసింది. తనకు ఆనందమార్గీలపై అనుమానం లేదంది. చరణ్ సింగ్ కనుక్కుంటే బిహారు సిఐడివాళ్లు తాము రికార్డు చేసిన టేపును ఆయనకు వినిపించారు. ఈ లైనులో ఎందుకు విచారణ జరపలేదని ఆయన సిబిఐను అడిగితే, వాళ్లు మాకు ఆ టేపు రాలేదని బుకాయించారు. 'మీకు ముట్టింది, మీ ఐజి హింగోరానీ సంతకంతో వున్న రసీదు యిదిగో' అని బిహార్ సిఐడి చూపించింది. సిబిఐ ఏదో గోల్‌మాల్ చేసిందని సందేహించిన చరణ్ సింగ్ యీ వ్యవహారంపై విచారణకు ఆదేశించాడు కానీ పొరపాటు ఎక్కడ జరిగిందంటే దాన్ని సిబిఐ అధికారికే అప్పగించాడు. ఆయన అంతా లక్షణంగా వుందని, యీ విషయంలో తదుపరి విచారణ అక్కరలేదని తన పై అధికారులకు సర్టిఫికెట్టు యిచ్చేశాడు. హెూం శాఖలో స్టేట్ మంత్రిగా ధనిక్‌లాల్ మండల్‌కి యిదేమీ నచ్చలేదు. చరణ్ సింగ్ కాళ్లీడ్చేస్తున్నాడని భావించి 1978 జులైలో ప్రధాని మొరార్జీకి ఉత్తరం రాసి, కేసు తిరగతోడమని కోరాడు. మొరార్జీ బిహార్ ముఖ్యమంత్రిగా వున్న కర్పూరీ ఠాకూర్‌కు ఆ బాధ్యత అప్పగించాడు. ఆయన విచారణ జరిపించి సిబిఐ ప్రవర్తన సవ్యంగా లేదని తేల్చి ఆ నివేదికను కేంద్రానికి పంపాడు. దానిపై లీగల్ ఒపీనియన్ తీసుకోమని కేంద్రం సూచిస్తే ఖండేల్‌వాల్ అనే క్రిమినల్ లాయరును సలహా అడిగితే అతను పునర్విచారణ అక్కరలేదని చెప్పాడు. అప్పుడు కర్పూరీ ఠాకూర్ జస్టిస్ వి ఎమ్ తార్కుండే అనే ప్రజాహక్కుల ఉద్యమకారుడికి విచారణ అప్పగించాడు. తార్కుండే ఏం రాసి యిచ్చారో ప్రభుత్వం వెల్లడించలేదు. ఎందుకంటే 1979 నాటికే జనతా పార్టీలో లుకలుకలు ప్రారంభమై యీ కేసు వెనకబడింది. 1979 మేలో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తార్కుండే నివేదిక ఆధారంగా కథనాలు వేసింది. ఇందిరా గాంధీ చెప్పడం బట్టే సిబిఐ విచారణ పక్కదారులు పట్టిందని తార్కుండే అభిప్రాయపడ్డారు. 1975లో ఇందిర గఫూర్‌ను ఢిల్లీకి రప్పించి అరుణ్ మిశ్రా స్టేటుమెంటు రికార్డు చేసిన జైలరు రహమాన్‌కు ప్రమోషన్ ఎందుకిచ్చారని అడిగిందని, యిది చాలా వింతగా వుందని తార్కుండే రాశారట.

జనతా ప్రభుత్వం కొనసాగినా విచారణ పూర్తయేదేమో. కానీ అది 1979 జులైలో కుప్పకూలింది. ఆ తర్వాత 1979 నవంబరు

1న సిబిఐ పట్నాలో చార్జిషీటు ఫైల్ చేసింది. 1980 కల్లా ఇందిరా గాంధీ మళ్లీ అధికారంలోకి వచ్చేసింది. సాక్ష్యాలను తారుమారు చేయకుండా విచారణను ఢిల్లీలో నిర్వహించాలంటూ సుప్రీం కోర్టు ఆదేశాలిచ్చింది. విచారణలో అడుగడుగునా లొసుగులు వున్నాయి కాబట్టి నిందితులు వాటిని అడుగడుగునా సవాలు చేస్తూ పోవడంతో కేసు నత్తనడక నడిచింది. అందువలననే యింత తాత్సారం. ఎప్రూవర్‌గా మారిన విక్రమ్ చెప్పిన విషయాలపై ఆధారపడి యిచ్చిన తాజా తీర్పు కూడా అంతిమం కాదు. మిశ్రా హత్యకు అసలు కారణం ఎప్పటికీ బయటకు రాకపోవచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2016)**

**ఫిబ్రవరి 49** **ఎమ్బీయస్ : మోదీ ఆంతర్యం ఏమిటి?**

నా ప్రభుత్వంపై కుట్ర జరుగుతోంది అని మోదీ యిచ్చిన ప్రసంగం కాస్త గందరగోళం సృష్టించింది. సర్వశక్తిమంతుడని, అవినీతిని దునుమాడి, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించి, అంతర్జాతీయంగా దేశప్రతిష్ఠ పెంచుతాడని ఆశలు పెట్టుకుని గెలిపించిన వ్యక్తి యిలా బేలగా మాట్లాడడం అభిమానుల్లో నిరాశ కలిగించింది. 'నాపై కుట్ర పన్నుతున్నారు' అన్నారు. ఎవరు? ప్రతిపక్షాలా? వాళ్ల కంత శక్తేదీ? కాంగ్రెసు పార్టీ చూడబోతే తల్లికి నీరసం, కొడుక్కి నిరాసక్తత. తప్పదురా దేవుడా అన్నట్టు ఓ సారి కనిపించి ఏదో అవకతవకగా మాట్లాడి మాయమై పోతాడు. ఒక నిర్మాణాత్మక కార్యక్రమం లేదు, ఒక మార్గదర్శకత్వం లేదు. ఎక్కడైనా కాంగ్రెసు పార్టీ బతికి బట్టకడుతోందంటే స్థానికంగా వున్న నాయకుల కృషి వలనే తప్ప, అధిష్టానం ప్రమేయం వలన కాదు. ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. ఇక వాళ్లేం కుట్ర పన్నుతారు? ఇక లెఫ్ట్ – కాంగ్రెసుతో పొత్తు పెట్టుకుందామా వద్దా అని వాళ్లల్లో వాళ్లే కుమ్ములాడుకుంటున్నారు. జనతా పరివార్ చూద్దామా అంటే అదెక్కడుందో వాళ్లకే తెలియదు. తృణమూల్, బియస్పీ, ఎడిఎంకె వగైరాలు ఎవరి ధ్యాసలో వాళ్లున్నారు. ఎడిఎంకె యిటు వచ్చేసినా వచ్చేస్తుంది. అందువలన ప్రతిపక్షాల నుంచి భయపడవలసినది ఏమీ లేదు. మరి విదేశీ శక్తులా? మోదీగారు మ్యాప్‌లో కనబడే దేశాలన్నీ చుట్టబెట్టి వాళ్లతో చెట్టాపట్టాలు వేసుకుని, సెల్ఫీలు దిగి వచ్చారు. వాళ్లకు పాపం యీయన మీద కసెందుకుంటుంది?

తన మీద కక్ష కట్టి కుట్ర పన్నుతున్నవారిలో రెండు వర్గాల వారిని ఆయన పేర్కొన్నాడు. యూరియా కంపెనీవాళ్లు, ఎన్జీఓలు (స్వచ్ఛంద సంస్థలు). దేశంలోని పెద్దపెద్ద పరిశ్రమలతో పోలిస్తే యూరియా కంపెనీల సత్తా ఎంత? వాళ్లు ప్రభుత్వాన్ని అస్థిరపరుద్దామనుకుంటే, స్థిరపరచడానికి దాని బాబుల్లాంటి కంపెనీలు లేవా!? ఇక ఎన్జీఓలు. వాటి వ్యవహారం ఎప్పణ్నుంచో అనుమానాస్పదమే. వాటిలో చాలా భాగం నల్లధనాన్ని తెలుపు చేసుకునేందుకు ఉద్దేశించినవి. మరి కొన్ని తమ తరఫున పనిచేయడానికి విదేశీ గూఢచారి సంస్థలు, విదేశీ కంపెనీలు, మతశక్తులు నియమించుకున్నవి. వాటిలో మన దేశప్రయోజనాలకు విరుద్ధంగా పనిచేసేవి చాలా వుంటాయి. వీటికి తోడు పోటీ కంపెనీ ప్రాజెక్టులకు పర్యావరణం పేరో, మానవహక్కుల పేరో అడ్డుపడడానికి మన కంపెనీలే సృష్టించిన ఎన్జీవోలు వుంటాయి. ఇవన్నీ ఇవాళ పుట్టుకొచ్చినవి కావు, ప్రధానిగా ఎవరున్నా వాటి దుశ్చర్యలు సాగుతూనే వుంటాయి. వాటి నిర్వహణపై ఆరోపణలు, విచారణలు సాగుతూనే వుంటాయి. సిబిఐ కితం ఏడాది యిచ్చిన నివేదిక ప్రకారం దేశంలో 31 లక్షల ఎన్జీవోలున్నాయి. అంటే ప్రతి 400 మంది భారతీయులకు ఒకటన్నమాట! దేశంలో వున్న మొత్తం స్కూళ్ల కంటె యిది రెట్టింపు, ఆస్పత్రుల కంటె 250 రెట్లు! ఇవన్నీ పొద్దస్తమానం సమాజసేవ చేసేస్తూ వుంటే మరి సమాజం యింకా యిలా వుందేం అనుకుంటున్నారా, వీటిలో 1.5% మాత్రమే పనిచేస్తున్నాయట. పనిచేసినా, చేయకపోయినా ఐటీ రిటర్న్స్ సబ్మిట్ చేయాలి కానీ వాటిలో 10% కంటె తక్కువ మందే ఫైల్ చేస్తున్నారు. విదేశీ సాయం గురించి చెప్పాలంటే 23,712 వాటికి విదేశీ విరాళాలు ఏటా 11 వేల కోట్లకు పైగా అందుతున్నాయి. దానిలో అమెరికా వంతు 30%. ఇదంతా చూసి యుపిఏ ప్రభుత్వ హయాంలోనే 2010లో చట్టాన్ని సవరించి వాటికి ముకుతాడు వేసి, బ్లాక్‌లిస్టు చేయడం జరిగింది. మోదీ సర్కారు వచ్చాక మరింత వేగంగా ఆ పని జరుగుతోంది. అవి ప్రభుత్వంపై కుట్ర పన్నేసి, పడగొట్టే స్థాయికి వచ్చాయనుకుంటే అంతవరకు రానిచ్చినందుకు ఇంటెలిజెన్సు వైఫల్యం అని చెప్పుకోవాలి. దానికి మోదీ సర్కారే సంజాయిషీ చెప్పుకోవాలి.

నాయకుడనేవాడికి కుట్రలు, పన్నాగాలు తప్పవు. బయటి దేశాలే కాదు, దేశంలోని శత్రువులే కాదు, పార్టీలో వుండే శత్రువులు కూడా ఏవో ఒక ప్రయత్నం చేస్తూనే వుంటారు. వాళ్లను అదుపు చేస్తూనే పైకి 'అలాటిదేమీ లేదు, మీరేం భయపడనక్కరలేదు, నేనున్నాను, నీకేం కాదు' అని నమ్ముకున్నవారికి ధైర్యం చెపుతూ వుండాలి. అలాకాకుండా నాపై ఎవరో కుట్ర పన్నారు, ఎవరో బలహీన పరచడానికి చూస్తున్నారు అని చెప్పడం దేనికి సంకేతం? మన్‌మోహన్ లాటి బిడియస్తుడు కాదు, ఇటుక బెడ్డకు కంకర్రాయితో జవాబు చెప్పగల 50 యించిల ఛాతీ మోదీ వంటివాడే ప్రస్తుత తరుణంలో మన దేశానికి కావాలి అనుకునే కదా దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు ఏకపక్షంగా బిజెపికి పట్టం కట్టారు. ఎవరి సాయం లేకుండా సొంతకాళ్లపై నిలబడే దర్జాను కొన్ని దశాబ్దాల తర్వాత ప్రస్తుత ప్రభుత్వం అనుభవిస్తోంది. ఏం చేసినా, ఏం చేయకపోయినా అడిగేవాడు లేదు, అడిగినా ఖాతరు చేసేవాడు లేదు. ఇలాటి టైములో యిలాటి ఉపన్యాసం ఎందుకు? ఇక్కడే ఇందిరా గాంధీ గుర్తుకు వస్తుంది. ఇందిరకు, మోదీకి యిప్పటికే చాలా పోలికలు కనబడ్డాయి. సామర్థ్యం, ప్రతిక్షకులను అణచివేయడం, విమర్శలు లెక్కచేయకపోవడం, అధికారమంతా గుప్పిట్లో పెట్టుకుని సహచరులకు ప్రాముఖ్యత యివ్వకపోవడం... యిలా! ఇప్పుడు యిదో పోలిక కనబడుతోంది. ఇందిర కూడా మాట్లాడితే 'విదేశీ

హస్తం', 'సిఐఏ కుట్ర', 'మతతత్వవాదుల, వేర్పాటువాదుల, విచ్ఛిన్నశక్తుల, పెట్టుబడిదారుల వ్యూహం' 'పేదల పక్షపాతిగా వున్నానని నన్ను సహించలేకపోతున్నారు, నన్ను చంపడానికి చూస్తున్నారు' లాటి ఉపన్యాసాలు యిస్తూ వుండేది. ఇదంతా ప్రధాని అయ్యాక నియంతగా మారే దశలో వినబడేది. మోదీ వచ్చి రెండేళ్లు కూడా కాలేదు. అప్పుడే పాట మొదలెట్టేశారు. ఈయనా ఇందిరలాగానే 'ఈ శక్తులను నియంత్రించాలంటే, దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే యిప్పుడున్న చట్టాలు సరిపోవు, దేశంలో అసాధారణ పరిస్థితి ఏర్పడింది కాబట్టి పరిష్కారం కూడా అసాధారణంగా వుండాలి' అంటాడేమో. ఆవిడా యిలాగే కొత్తకొత్త చట్టాలు పెట్టి, తనకు ఎవరూ ఎదురాడకుండా చేసుకునేది. చివరకు ఎమర్జన్సీ విధించింది. మోదీ యిప్పుడే ఎమర్జన్సీ బాట తొక్కకపోవచ్చు కానీ తన చేతిలో మరింత శక్తిని కేంద్రీకరించుకునేందుకు కొత్త చట్టాలు చేస్తారేమో! ఈ ఊహాగానం నిజం కాకూడదని కోరుకుందాం.

ఇందిర తను మహిళ కాబట్టి అవమానాలు ఎదుర్కోవలసి వస్తోందని వాపోయేది. మోదీకి ఆ సౌలభ్యం లేదు కాబట్టి, చాయ్‌వాలా పాట మళ్లీ పాడారు. చాయ్‌వాలా ప్రధాని కావడం కొందరు సహించలేకపోతున్నారుట. చాయ్‌తో పాటు దేశాన్ని అమ్మడం గురించి ఓ కాంగ్రెసు నాయకుడు ఓ వ్యాఖ్య చేస్తే దాన్ని పట్టుకుని ఎన్నికల సమయంలో రాపాడించారు సరే, యిప్పుడు 20 నెలలగా పదవిలో వుంటూ దాన్ని ప్రస్తావించడం అవసరమా? చాయ్‌వాలా నేపథ్యానికి అభ్యంతరం వుంటే ప్రజలు అంత మెజారిటీ కట్టబెట్టేవారా? ఇందిర మరణం తర్వాత రాజీవ్ పోటీ చేసినపుడు బిజెపి వారు అతన్ని ఎయిర్‌హోస్టెస్‌లతో ముచ్చట్లాడే పైలట్, రాజకీయాలేం తెలుస్తాయి అని ఎద్దేవా చేశారు. అతనికి సహాయకులుగా వున్న అరుణ్ నెహ్రూ, అరుణ్ సింగ్‌లను వాళ్ల పాత ఉద్యోగాల పేరు పెట్టి పెయింట్‌వాలా, పాలిష్‌వాలా అని వెక్కిరించారు. రాజీవ్ కోరికపై బహుగుణపై పోటీ చేసిన అమితాబ్ బచ్చన్‌ను నౌటంకీవాలా అన్నారు. (సినిమాతారలు రాజకీయాల్లోకి రావడం దక్షిణాదిన జీర్ణించుకున్నట్లు ఉత్తరాదిన చాలాకాలం జీర్ణించుకోలేకపోయారు. ఉత్తరాది కుటుంబాలలో సంగీతం, నృత్యం నేర్చుకోవడం మర్యాదస్తుల లక్షణం కాదు. ఇటీవలే వారి దృక్పథంలో మార్పు వస్తోంది.) ఎవరేమన్నా ప్రజలు వారందరినీ ఆదరించారు. రజనీకాంత్ రేపు తమిళనాడు రాజకీయాల్లోకి వస్తే 'నువ్వు ఒకప్పుడు బస్ కండక్టరు కాబట్టి నువ్వు ముఖ్యమంత్రి కావడం మేం సహించలేం' అంటారా? దొంగలు, స్మగ్లర్లు కూడా మేం వృత్తి మానేశాం, మంచివాళ్లమై పోయాం అంటే వాళ్లకీ ఓట్లేస్తున్నారు.

ఈ 'చాయ్‌వాలా' యిమేజి మోదీ ప్రధాని పబ్లిసిటీ కాంపెయిన్‌లో డిజైన్ చేసిన రూపం. గుజరాత్ ఎన్నికలలో మోదీ ఎన్నడూ చాయ్‌వాలా కథ చెప్పలేదు. సోనియా, రాహుల్‌ల హై ఫ్లయి స్టయిల్‌కు కాంట్రాస్టుగా 'అండర్‌డాగ్' యిమేజి ఎలా బిల్డ్ చేయాలా అనుకుని ఆలోచించి తయారుచేసిన మోడల్ యిది. ఎన్నికల సమయంలో 'చాయ్‌పై చర్చా' అంటూ ఊదరగొట్టి టీ తాగినప్పుడల్లా మోదీ గుర్తుకు వచ్చేట్లు చేసి విజయం సాధించారు. నెగ్గి ప్రధాని అయ్యాక చాయ్‌వాలా వేషం యిప్పేసి, రోజుకు మూడు డ్రస్సులు మార్చే పూలరంగడు అయిపోయారు. హరేరామ హరేకృష్ణ పేర్లు వరుసగా రాసి వున్న శాలువాలు రాముడు, కృష్ణుడు ఎన్నడూ ధరించి వుండరు కానీ తన పేరు ఫుల్‌గా రాసి వున్న సూటులో మోదీ సూట్‌వాలాగా అవతరించారు. బుద్ధిమంతుడు రాముడు, కొంటెతనాల కృష్ణుడు ఒక్కరే అనే దేవరహస్యం కనుక్కోలేని భక్తగణం తత్తరపడడంతో ఆ సూటు వేలం వేసేశారు. జాంబవంతుడుకి కాస్సేపు రాముడి గెటప్‌లో కనబడి కన్విన్స్ చేసి మణిని, కన్యామణిని స్వీకరించిన కృష్ణుడిని గుర్తు చేసుకుని, ఒరిజినల్‌గా నేను చాయ్‌వాలానే అని మనకు గుర్తు చేయడానికి మళ్లీ యీ పల్లవి ఎత్తుకున్నారు. అయినా చాయ్‌ని మరీ మరిగించేస్తే వికటిస్తుంది. ఇటీవల యుకెలో చెప్పారు – మోదీ పర్యటనకు ఏడాది ముందు నుంచి అక్కడ మోదీ అభిమానులు, ముఖ్యంగా గుజరాతీలు లాబీయింగు మొదలుపెట్టారట. ఇండియన్ హై కమిషన్ ద్వారా భారతీయుల సాంస్కృతిక సంఘాల వివరాలు, ఆఫీసు బేరర్ల పేర్లు, వివరాలు సేకరించి వారిని సంప్రదించారట. 'మీ సంఘంలో 'చాయ్ పే చర్చా' అని కార్యక్రమం నిర్వహించి దాన్ని వీడియో తీసి మాకు పంపించండి. ఆ క్లిప్పింగులతో మేం డాక్యుమెంటరీ తయారుచేసుకుంటాం' అని కబురు పెట్టారట. అంటే వాటిలోంచి మోదీని హైలైట్ చేస్తూ మాట్లాడినవి ఏరుకుని తమకు కావలసిన ప్రచారచిత్రం చేసుకుంటారన్నమాట.

ఇది విని "చాయ్ పే చర్చా' అని పెట్టం కానీ, 'పెట్రోల్ పే పేశ్‌కశ్' (విన్నపం) అని పెడితే ఒకేనా?' అని అడగాల్సింది" అన్నా. ఎందుకంటే మోదీ గాఢాభిమానులకు కూడా పెట్రోలు విషయంలో మోదీ ఎకనామిక్స్ మింగుడు పడటం లేదు. గతంలో అంతర్జాతీయంగా పెట్రోలు ధర పెరిగినప్పుడల్లా యిక్కడా పెరిగేది, అదొక్కటేనా, పెట్రోలు, డీజిల్‌తో నడిచే వాహన, వాహనేతర రంగాలన్నిటిపై ఆ ప్రభావం పడేది. బస్సు టిక్కెట్లు పెరిగేవి, రవాణా ఖర్చు పెరిగిందంటూ సకల వస్తువుల ధరలు పెరిగేవి. ఇవన్నీ దశాబ్దాలుగా చూస్తూ వచ్చాం. ఇప్పుడు అక్కడ చమురు ధరలు 30%కు పడిపోయాయి. మరి యిక్కడ పడవేం? మిగుల్చుకున్న డబ్బంతా ప్రభుత్వం ఏం చేస్తోంది? పాత బకాయిలు తీరుస్తున్నాం అంటారు. అవన్నీ అంతర్గతమైనవే కదా, కాస్త కాస్త తీరుస్తూ సగం బెనిఫిట్టయినా ప్రజలకు అందిస్తే సంతోషిస్తారు కదా. మిగిల్చిన డబ్బుతో స్వచ్ఛభారత్ కార్యక్రమాలు చేపట్టి, పర్యావరణం, ప్రజారోగ్యం కాపాడతారా అంటే అదీ లేదు. దానికి మళ్లీ వేరే సెస్సు! మరి పెట్రోలుతో మిగిలిన డబ్బు సర్దార్ పటేల్ విగ్రహానికి, బుల్లెట్ ట్రెయిన్లకు యిలాటి హంగులకు పోతోందన్నమాట! చాయ్‌వాలా స్థాయి నుంచి పైకి వచ్చిన మనిషి కాస్సేపు సామాన్యుడిలా మారి ఆలోచిస్తే దేనికి ప్రాధాన్యత యివ్వాలో తెలుస్తుంది. సామాన్యులకు ఉపయోగపడే బజెట్ తయారుచేసి అమలు చేస్తే చాలు, నాపై కుట్ర జరుగుతోంది లాటి హారర్ స్టోరీల వలన మాకు ఒరిగేది ఏమీ లేదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2016)**

**ఫిబ్రవరి 50, 51 వీక్లీకై** **ఎమ్బీయస్ : ఆప్ ఏడాది పాలన**

ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం యీ నెలతో ఏడాది పూర్తి చేసుకుంది. ఎన్నో ఆశలు రగిలించి అధికారంలోకి వచ్చిన అరవింద్ చేయగలిగినదేమిటి, చేయలేకపోయినదేమిటి అని గుర్తుకు తెచ్చుకుందామంటే మోదీతో నిత్యఘర్షణ తప్ప వేరేదీ చటుక్కున తోచదు. దాన్ని పక్కకు పెట్టి చూడబోతే కొన్ని విజయాలు కనబడతాయి. ముందుగా గ్రహించవలసినదేమిటంటే ఢిల్లీ ముఖ్యమంత్రి మామూలు ముఖ్యమంత్రి కాదు. అరవింద్ మాటల్లోనే చెప్పాలంటే 'సగం రాష్ట్రానికి పావు ముఖ్యమంత్రి'. ఏం చేయాలన్నా కేంద్రం చేతులు కట్టేస్తోంది. ఇలాటి పరిస్థితుల్లో సరైన మదింపు వేయడం కష్టం. అరవింద్ బ్యూరోక్రాట్ కాబట్టి ఏ పని ఏ మేరకు సాగుతుందో గ్రహింపు వుందని, అందుకని కొన్ని సులభమైన పనులు చేసి పేరు తెచ్చుకున్నాడని అంటారు కొందరు పరిశీలకులు. అలాటి వాటిల్లో – 400 యూనిట్ల వరకు విద్యుత్ బిల్లుల్లో 50% సబ్సిడీ, నెలకు 20 వేల లీటర్ల నీరు ఉచితంగా సరఫరా చేయడం, విద్య కోసం బజెట్‌లో 106% పెంపు, హెల్త్‌కేర్ విషయంలో 45% పెంపు, దేశమంతటా ప్రైమరీ హెల్త్ సెంటర్లు నిర్లక్ష్యానికి గురవుతూంటే ఢిల్లీలో మాత్రం అనేక ప్రాంతాల్లో మొహల్లా క్లినిక్కులని పెట్టి సామాన్యులకు ఆరోగ్యసౌకర్యాలు కల్పించడం వున్నాయి. ఉచితంగా మందుల సరఫరా స్కీము కూడా వుంది. అనేక రాష్ట్రప్రభుత్వాలు మునిసిపాలిటీలకు, పంచాయితీలకు నిధులు యివ్వకుండా ఎండగడుతూ వుంటే, ఢిల్లీలో మాత్రం లోకల్ బజెటింగ్ అని పెట్టి వికేంద్రీకరణ చేశాడు. నిజానికి అధికార వికేంద్రీకరణ తన కాబినెట్‌తోనే మొదలుపెట్టాడు. తన వద్ద ఏ పోర్టుఫోలియో పెట్టుకోకుండా శాఖలన్నీ సహచరులకు పంచేసి, తను కేవలం సమీక్షలు చేస్తూ వుంటాడు. తన పార్టీ పరపతి ఎలా వుందో ప్రతి 15 రోజులకు సర్వే చేయించుకుంటూ వుంటాడు. ఢిల్లీ డైలాగ్ కమిషన్ అని ఒకటి పెట్టి కొత్త ఐడియాల గురించి ఆలోచించమన్నాడు.

ఢిల్లీ నగరం అధికారులమయం. ఏ పనికైనా ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఎవరైనా ఫంక్షన్ పెట్టుకోవాలంటే 27 డిపార్టుమెంట్ల దగ్గర్నుంచి అనుమతులు తెచ్చుకోవాలి. దానికి నాలుగు నెలలు పట్టేది. అన్నిటి కంటె ముఖ్యమైన ఫయర్ డిపార్టుమెంటు వాళ్ల దగ్గర్నుంచి ఫంక్షన్ జరగడానికి గంట ముందు అనుమతి వచ్చేది. ఈవెంట్ మేనేజర్లు యీ విషయాన్ని అరవింద్‌కు చెప్పుకోగానే మొత్తమంతా ఆన్‌లైన్ చేసేసి గంటలో అన్నీ వచ్చేట్లు చేశాట్ట. 'జుబిన్ మెహతా కచ్చేరీకి నిర్వాహకులు 20 నిఎంల్లో తెచ్చుకున్నారు' అని చెప్పుకున్నాడు అరవింద్. బర్త్ సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్టు, కాస్ట్ సర్టిఫికెట్టు వంటి 18 రకాల సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో జారీ చేసేస్తున్నారు. డాక్యుమెంట్లు సెల్ఫ్ అసెస్టేషన్ చేస్తే చాలంటున్నారు. ఢిల్లీ నగరం కాలుష్యభరితం అయిపోయిందన్న సంగతి గమనించి సరి–బేసి సిస్టమ్ పెట్టి ఢిల్లీ వాసుల ఆమోదాన్ని, ప్రశంసలను చూరగొన్నాడు. ఆ స్కీము ప్రజలకు నచ్చదని తప్పుడు అంచనా వేసిన కొందరు బిజెపి నాయకులు ముందుగానే విమర్శించి నాలిక కరుచుకోవలసి వచ్చింది.

వీటితో పాటే కొన్ని వైఫల్యాలు కూడా వున్నాయి. నగరమంతా వుచితంగా వైఫై యిస్తానని ప్రకటించాడు. అది జరగలేదు. 2016 జులైలో మొదలుపెట్టి రెండేళ్లలో పూర్తి చేస్తాం అంటోంది ఆప్. కొత్త బస్సులు ప్రవేశపెడతామన్న వాగ్దానమూ నెరవేరలేదు. 2016 ఆఖరుకు 3 వేల బస్సులు పెడతాం, ఎలివేటెడ్ బిఆర్‌టి కారిడార్లు బస్సుల కోసమే కడతాం అంటోంది. 9 లక్షల పబ్లిక్ టాయిలెట్స్ కట్టిస్తామంది. అది యింకా ఏమీ కాలేదు. వాట్ పెంచం అని చెప్పింది కానీ పెంచింది. ఎలక్ట్రిసిటీ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలను కాగ్ చేత ఆడిట్ చేయిస్తామని వాగ్దానం చేసింది. గతంలో ప్రభుత్వం నడిపినప్పుడు ముకేశ్ అంబానీ, పెట్రోలియం మంత్రులిద్దరు, షీలా దీక్షిత్‌లపై కేసులు పెట్టింది ఆప్. ఈ సారి ఏమీ పట్టించుకోలేదేం? అని అడిగితే అరవింద్ "మా ప్రభుత్వం పడిపోగానే రాష్ట్రపతి పాలన వచ్చింది. వాళ్లు ముందుకు వెళ్లకపోగా ఫైళ్లు మాయం చేసేశారు. మేం వచ్చి వాటిని వెతికి పట్టుకుని రిలయన్సు సిఇఓను పిలిపించాం. పని జరుగుతోంది. కానీ అవినీతిపై మా పోరాటం ముందుకు సాగకుండా పారా మిలటరీ ఫోర్సు పంపి ఎసిబి (యాంటీ కరప్షన్ బ్యూరో)ను లాగేసుకుంటే ఏం చేయగలం?" అని అడిగాడు అరవింద్.

ఎసిబి విషయంపై అరవింద్ వాదనలో బలం వుందనిపిస్తుంది. అతను చెప్పిన ప్రకారం – మొదటి మూడు నెలల్లో ఎసిబి వాళ్ల దగ్గర వుండగా 52 మంది అవినీతిపరులైన అధికారులను జైలుకి పంపారు. కానీ జూన్‌లో ఎసిబిని కేంద్రం లాగేసుకున్న తర్వాత యిప్పటిదాకా కేవలం 8 ఎఫ్ఐఆర్‌లు దాఖలయ్యాయి. అవినీతికి బాగా ఆస్కారం వున్న ఢిల్లీ పోలీసు, డిడిఏ, ఎంసిడి వంటివి ఎసిబి కిందే వస్తాయి. వాటిని అదుపు చేయలేనప్పుడు అవినీతిపై విజయం సాధించలేరు. రాష్ట్రప్రభుత్వం కేవలం విజిలెన్సు ద్వారానే యితర శాఖల్లో అవినీతి ఆపగలదు. "మేం ఎవరైనా అవినీతిపరుడైన అధికారిని బదిలీ చేయగానే లెఫ్టినెంట్ గవర్నరు (ఎల్‌జి) దాన్ని ఆపేస్తున్నాడు. ఇక అధికారులకు మేమంటే భయం ఏముంటుంది?" అని అరవింద్ ప్రశ్న. బదిలీల విషయంలో ముఖ్యమంత్రి సలహా మేరకే ఎల్‌జి నడుచుకోవాలి అని హైకోర్టు కూడా చెప్పింది. ఎసిబికి అధిపతిగా ఎస్ఎస్ యాదవ్‌ను తీసేసి, ఎంకె మీనాను వేశాడు ఎల్‌జి. ఇద్దరు స్పెషల్ సెక్రటరీలు తన మాట వినటం లేదని ఢిల్లీ ప్రభుత్వం సస్పెండ్ చేస్తే కేంద్రం సస్పెన్షన్ ఎత్తివేసింది. చీఫ్ సెక్రటరీ పోస్టు దగ్గర్నుంచి అంతా ఎల్‌జి యిష్టమే తప్ప సిఎం మాట చెల్లటం లేదు. ఢిల్లీ ఎసెంబ్లీ పాస్ చేసిన అరకొర జనలోక్‌పాల్ బిల్లు కూడా ఎల్‌జి ఆఫీసులో పడి మూలుగుతోంది. ఢిల్లీ కింద మూడు మునిసిపల్ కార్పోరేషన్లుంటే మూడూ బిజెపి చేతిలోనే వున్నాయి. అవి తమ ఖర్చులను ఆడిట్ చేయడానికి కూడా ఒప్పుకోవటం లేదు.

ఎవరు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా మోదీకి అరవింద్‌ను చూస్తే అరికాలి మంట నెత్తికెక్కుతుందనేది బహిరంగ రహస్యం.

ఢిల్లీ ఎన్నికల్లో తను ప్రచారం చేసినా 70 సీట్లలో 67 గెలిచేసిన అరవింద్ అంటే ఎందుకు పడుతుంది? తాజాగా డిడిసిఏ వ్యవహారం ఒకటుంది. ''పాకిస్తాన్ వెళ్లి నవాజ్ షరీఫ్‌కి పుట్టినరోజు గ్రీటింగ్స్ చెప్తాడు కానీ నన్ను దగ్గరకు రానీయడు. ఎపాయింట్‌మెంట్ అడిగితే రెండు నెలల పాటు యివ్వలేదు, నేను మీడియాకు యీ విషయం చెప్తే అప్పుడు యిచ్చాడు. వెళ్లి 'మేం తప్పు చేస్తే సరిచేయండి, కానీ మా కార్యక్రమాలకు అడ్డుపడకండి' అని చెప్పాను. ఆ తర్వాత కూడా ఏ సహకారమూ లేదు. నను వ్యవసాయభూములకు సర్కిల్ రేటు ఎకరానికి రూ. 54 లక్షల నుంచి రూ. 3-4 కోట్లకు పెంచితే రైతులు సంతోషించారు. ఎల్‌జి నా ఆర్డర్లు చెల్లుబాటు కావని కొట్టిపారేశాడు. ఇలా రద్దు చేసిన ఆర్డర్లు 30 దాకా వున్నాయి. రాష్ట్రాలతో వ్యవహరించే తీరు యిదేనా? ఎన్నికల మానిఫెస్టోలో బిజెపి ఢిల్లీని పూర్తి స్థాయి రాష్ట్రంగా చేస్తానని హామీ యిచ్చింది. దాన్ని నెరవేర్చమని అడుగుతున్నాను.'' అంటాడు అరవింద్. అరవింద్‌లో లౌక్యం ఏమిటంటే అతను మోదీపైనే విరుచుకుపడతాడు తప్ప బిజెపిని పెద్దగా ఏమీ అనడు. అవినీతి వ్యతిరేక ఉద్యమంలో అతనికి ఆరెస్సెస్ కార్యకర్తలు సాయపడ్డారు. ఆరెస్సెస్ యుపిఎస్‌సికి ప్రిపేరయ్యే విద్యార్థుల కోసం నిర్వహించే సంకల్ప్ అనే కోచింగ్ సెంటరులో అతను లెక్చర్లిచ్చేవాడు. అతని కుడిభుజం మనీశ్ శిశోదియాకు ఆరెస్సెస్‌లో చాలామంది మిత్రులున్నారు. ప్రజల కళ్లల్లో అరవింద్ తనను మోదీ బాధితుడిగా చూపుకుంటూ తన వైఫల్యాలకు కారణం మోదీ సృష్టించే అడ్డంకులే అనే అభిప్రాయం కలిగిస్తున్నాడు. తన తరఫు నుంచి మోదీ ఏమీ మాట్లాడటం లేదు. అరవింద్ చేసే ఆరోపణలకు జవాబు చెప్పడం తన స్థాయికి తగని పని అనుకుంటున్నాడు కాబోలు, పట్టించుకోవటం లేదు. విద్యాధికులు బహుళంగా వున్న ఢిల్లీలో యీ స్ట్రాటజీ ఎంతవరకు వర్కవుట్ అవుతుందో తెలియదు.

అరవింద్ పంజాబ్‌పై కన్నేసి వున్నాడు. 2017లో రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో ఎలాగైనా పంజాబ్‌లో గెలిచి తను పంజాబ్ ముఖ్యమంత్రిగా వెళ్లిపోయి, తన స్థానంలో మనీశ్‌ను కూర్చోబెడతాడన్న పుకార్లు కూడా వున్నాయి. 2014 పార్లమెంటు ఎన్నికలలో దేశమంతా మోదీ ప్రభంజనం వీస్తూ వుంటే పంజాబ్‌లో ఆప్ 24% ఓట్లు, 4 సీట్లు గెలిచింది, అకాలీ దళ్‌కు 26%, 4 సీట్లు, కాంగ్రెసుకు 33%, 3 సీట్లు రాగా బిజెపికి 9%, 2 సీట్లు వచ్చాయి. ఆప్ తరఫున గెలిచినవారిలో యిద్దరు యోగేంద్ర యాదవ్ పక్షాన వెళ్లిపోయారు. పంజాబ్‌లో పార్టీ నిర్మించాలని గట్టిగా నిశ్చయించుకుని దుర్గేశ్ పాఠక్ అనే యువకుడికి ఆ బాధ్యత అప్పగించాడు. అతను బిజెపి మోడల్లోనే బూతువారీగా కార్యకర్తలను తయారుచేశాడు. ఢిల్లీ ఎన్నికలలో ఆప్ తరఫున పనిచేయడానికి 10 వేల మంది పంజాబీలను పంపించాడు. ఆప్ పంజాబ్ యూనిట్ 2015 మే నుంచి వరుసగా ఏదో ఒక కార్యక్రమం చేపడుతూ ప్రజల్లో పలుకుబడి సంపాదించింది. కితం నెల 14 న మాఘీ మేలా అని ముక్తసర్ పట్టణంలో నిర్వహించిన సభ దిగ్విజయంగా జరిగింది. దాంతో పంజాబ్‌లో ఆప్ గెలిచే అవకాశాలున్నాయని మీడియా కథనాలు వెలువడసాగాయి. దాంతో బాటే అరవింద్ పంజాబ్‌కు సిఎం అవుతాడన్న వూహాగానం కూడా! ఇదంతా సహజంగా మోదీకి రుచించే వ్యవహారం కాదు, ముందు ముందు అరవింద్‌తో ఘర్షణ మరింత ముదరవచ్చు. **- ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2016)**

**ఫిబ్రవరి 52 వీక్లీకై** **ఎమ్బీయస్ : సోలార్ సరిత తాజా లక్ష్యం**

కేరళ ముఖ్యమంత్రి ఊమెన్ చాండీ కార్యాలయోద్యోగులపై ఆరోపణలు చేస్తూ వచ్చిన సోలార్ స్కామ్ నిందితురాలు సరితా నాయర్ యీసారి ఏకంగా ముఖ్యమంత్రికే రూ. 1.90 కోట్ల లంచం యిచ్చానని తీవ్ర ఆరోపణ చేసింది. 2013 జూన్‌లో తనపై, తన భాగస్వామి బిజూ రాధాకృష్ణన్‌పై పెట్టిన 46 కేసులను విచారించడానికి ఏర్పడిన కమిషన్ ఎదుట హాజరు కావడానికి సరిత గత 11 నెలలుగా మొహం చాటేస్తూ వచ్చింది. అలాటిది అసెంబ్లీ ఎన్నికలు మూడు నెలలున్నాయనగా జనవరి 27న హాజరై సంచలనం రేపింది. ముఖ్యమంత్రికి నేషనల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సమావేశానికి హాజరు కావడానికి ఢిల్లీ వచ్చినపుడు అతనికి అత్యంత ఆప్తుడైన థామస్ కురువిళ్లాకు ఢిల్లీలో 2012 డిసెంబరు 27న 1.10 కోట్లు యిచ్చానని చెప్పింది. తక్కిన 80 లక్షలు తిరువనంతపురంలో కురువిళ్లాకే యిచ్చిందట. జిక్కుమోన్ ముఖ్యమంత్రి తరఫున రూ. 7 కోట్లు అడిగాడని, అలాగే ఆర్యదన్ మొహమ్మద్ అసిస్టెంటు కేశవన్ మంత్రి తరఫున రూ. 2 కోట్లు అడిగాడని, తను ఆర్యదన్‌కు వాళ్లింట్లో రూ. 25 లక్షలు, కొట్టాయంలో సెమినార్‌లో మరో రూ. 15 లక్షలు యిచ్చానని ఆరోపించింది.

నిజానికి ఇప్పటిదాకా అనేకమందిపై ఆరోపణలు చేస్తూ వచ్చిన సరిత ముఖ్యమంత్రి జోలికి వెళ్లలేదు. కమిషన్ ముఖ్యమంత్రిని పిలిపించి 2016 జనవరి 25 న 14 గంటల పాటు అతని స్టేటుమెంటు రికార్డు చేసినపుడు ఆమె తరఫు లాయరు యీ ఆరోపణ చేయలేదు, దీని గురించి ప్రశ్నించలేదు. కానీ రెండు రోజులు తిరక్కుండా సరిత యిలా స్టేటుమెంటు యివ్వడంతో దీని వెనక్కాల లిక్కర్ లాబీ, సిపిఎం వున్నాయనే అనుమానాలు కలుగుతున్నాయి. కేరళలో పాక్షిక మద్యనిషేధం అమలు చేస్తూ, ఊమెన్ ఫైవ్ స్టారు హోటళ్లలో తప్ప వేరే చోట మద్యం అమ్మరాదంటూ అనేక బార్లు మూయించేశాడు. అందువలన బార్ల యజమానులు అతనిపై కక్ష కట్టారు. అతని కాబినెట్ సహచరులకు లంచాలిచ్చి లోబరచుకోవాలని చూశారు. ఆ ఆరోపణలతో ఎక్సయిజ్ శాఖామాత్యుడు కె.బాబు, ఫైనాన్స్ మంత్రి, కేరళ కాంగ్రెసు (మాని వర్గం)కి అధ్యక్షుడు మాని రాజీనామా చేయవలసి వచ్చింది. ఈ విషయంపై మాని కోపంతో వున్నాడు. అతని కొడుకు, ఎంపీ అయిన జోస్ మాని కేంద్ర కామర్స్ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఢిల్లీలో ఫిబ్రవరి1 న

కలిసి రబ్బర్ మద్దతు ధర పెంచమని కోరితే ఆమె తప్పకుండా పెంచుతామని హామీ యిచ్చింది. స్థానిక ఎన్నికలలో 15% ఓట్లు తెచ్చుకున్న బిజెపి దక్షిణ కేరళలో బలంగా వున్న మాని వర్గానికి చెందిన క్రిస్టియన్లు, ఈళవ కులస్తుల సంఘంతో కలిపి మూడో ఫ్రంట్ ఏర్పాటు చేసి 22% ఓట్లు సంపాదిద్దామని ప్రయత్నిస్తోంది. అందుచేత యిప్పుడు మాని మద్దతు సంపాదించి, ఊమెన్‌పై ఆందోళన చేయడంలో చురుకైన పాత్ర వహిస్తోంది.

ఇక సిపిఎం ఎలాగైనా ఊమెన్‌ను అప్రదిష్టపాలు చేయాలని చూస్తోంది. 2011 ఎన్నికలలో యుడిఎఫ్ అతి తక్కువ మార్జిన్‌తో గెలిచింది. 5 సీట్లు 500 ఓట్ల తేడాతో గెలుచుకుంది. 140 సీట్ల ఎసెంబ్లీలో 4 సీట్ల మెజారిటీతో ఊమెన్ ప్రభుత్వం ఏర్పరచాడు. ఇప్పటిదాకా నెట్టుకు రావడమే కాదు, బలపడ్డాడు కూడా. 2014లో దేశాన్నంతా మోదీ హవా వూపేసినా, కేరళలోని 20 ఎంపీ సీట్లలో 12 గెలిచాడు. ఊమెన్‌పై అవినీతి ఆరోపణలు లేవు. కోచిలో 246 ఎకరాల్లో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు, కోచిలో రూ. 5181 కోట్ల మెట్రో రైలు ప్రాజెక్టు, తిరువనంతపురం దగ్గర్లో అదానీ గ్రూపు కడుతున్న రూ. 7525 కోట్ల డీప్ వాటర్ పోర్టు, కంటెయినర్ టెర్మినల్ యిలా కొన్నిటిని అతని సమర్థపాలనకు ఉదాహరణలుగా చూపుతారు. ఊమెన్ సామాన్యప్రజలకు అందుబాటులో వుంటూ, ఫిర్యాదులు స్వీకరిస్తూ మంచి పేరు తెచ్చుకున్నాడు. ఇప్పుడీ సోలార్ స్కాముతో సిపిఎం ఊమెన్‌ను, యుడిఎఫ్‌ను దెబ్బ కొట్టాలని ఉబలాటపడుతోంది. లిక్కర్ లాబీ, సిపిఎం కలిసి సరితను ఉపయోగించుకుంటున్నారని ఊమెన్ ఆరోపించాడు. తాము అధికారంలోకి వస్తే మద్యనిషేధం పాలసీని సమీక్షిస్తామని సిపిఎం యిప్పటికే ప్రకటించింది.

వాళ్లు ఎంచుకున్న సరిత ఎటువంటిది? 1978లో అళప్పురా జిల్లాలో దిగువ మధ్యతరగతి కుటుంబంలో పుట్టింది. ఆమె స్కూల్లో వుండగానే తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు, తల్లి పెంచింది. చదువుల్లో చాలా చురుకైన అమ్మాయి. 1993లో ఎస్ఎస్‌సి పూర్తి చేసి, అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్‌లో డిప్లమో చేసింది. పెళ్లయి 2004లో ఒక ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తూండగా వివాహితుడైన బిజూ రాధాకృష్ణన్‌తో పరిచయమైంది. భర్తకు విడాకులిచ్చి యితన్ని పెళ్లాడింది. బిజూ నేరమనస్తత్వం కలవాడు, సరిత మాటకారి. ఇద్దరూ కలిసి మాయమాటలు చెప్పి చాలా రకాలుగా చాలామందిని మోసం చేశారు. 2008-2010 మధ్య వాళ్ల మీద 16 చీటింగ్ కేసులు పడ్డాయి. జైలుకి వెళ్లారు. 8 నెలలు జైల్లో వుండి 2010లో బెయిలు మీద బయటకు వచ్చి 2011లో టీమ్ సోలార్ రెన్యూవబుల్ ఎనర్జీ లి. అనే కంపెనీ పెట్టి సోలార్ పానెల్స్ వ్యాపారం మొదలుపెట్టారు. విఐపిల యిళ్లకు వాటిని అమరుస్తూ వాళ్లతో పరిచయాలు పెంచుకున్నారు. సరిత వారితో శారీరక సంబంధాలు పెట్టుకుని, వారితో వేదికలపై కనబడుతూ, వాళ్ల పేరు చెప్పి యితరులను ఏమారుస్తూ ఎదిగిపోయింది. ఆ పరిచయాలు చూపిస్తూ పబ్లిక్ నుండి డిపాజిట్లు వసూలు చేశారిద్దరూ. మొత్తం రూ. 12 కోట్ల ఫ్రాడ్ యిది. 2013 నుంచి 33 కేసులు పడ్డాయి. వాళ్లపై గట్టిగా చర్య తీసుకుందామని నాయకులు ప్రయత్నిస్తే వాళ్లను బ్లాక్‌మెయిల్ చేసేవారు.

2013లో సరిత, బిజూలు పరస్పరసంశయాలతో విడిపోయారు. బిజూ తన భార్యను 2006లో చంపివేశాడని సరిత ఆరోపించడంతో అతనిపై హత్యానేరం మోపబడింది. 2013లో అతనికి యావజ్జీవ కారాగార శిక్ష పడింది. సోలార్ కేసు విచారణ ప్రారంభం కాగానే సరిత తనతో లైంగిక సంబంధం పెట్టుకున్న ట్రాన్స్‌పోర్టు మంత్రి కెబి గణేశ్ కుమార్‌తో వ్యవహారం గురించి కాల్ రికార్డు, వీడియోలు లీక్ చేసింది. దెబ్బకు అతను రిజైన్ చేశాడు. ఇప్పుడు తనను 13 మంది విఐపిలు, ఒక ఐపియస్ ఆఫీసరు లైంగికంగా అనుభవించారని, వాళ్ల పేర్లు సీల్డ్ కవర్లో పెట్టి యిస్తానని సరిత కమిషన్‌కు చెప్పింది. 2014లో కాంగ్రెసు ఎమ్మెల్యే ఎపి అబ్దుల్లాకుట్టి తనను రేప్ చేయబోయాడని ఫిర్యాదు చేసింది కానీ మళ్లీ దాన్ని వెనక్కి తీసుకుంది. ఏం అని అడిగితే 'అతని రాజకీయ ప్రత్యర్థి, కెపిసిసి జనరల్ సెక్రటరీ తాంబనూర్ రవి నన్ను అలా చెప్పమన్నాడు. చెప్పాను' అని సమాధానమిచ్చింది.

ఒకటి మాత్రం నిజం - సరిత ముఖ్యమంత్రి ఆఫీసుకి, యింటికి తరచుగా వచ్చి వెళుతూ వుండేది. ముఖ్యమంత్రి ఆఫీసులో సిబ్బందిగా వున్న జిక్కుమోన్ జోసెఫ్, టెన్నీ జోపెన్‌లు, బాడీగార్డుగా వున్న పోలీసు కానిస్టేబుల్ సలీం రాజు సరితతో అనేకసార్లు ఫోనులో మాట్లాడారని తేలింది. దాంతో ఊమెన్ జోపెన్‌ను అరెస్టు చేయించి, మిగతా యిద్దర్నీ ఉద్యోగాల్లోంచి తీసేసి, 2003 అక్టోబరులో జస్టిస్ శివరాజన్ ఆధ్వర్యంలో విచారణ కమిషన్ వేశాడు. ఆ విధంగా తన సిబ్బంది తప్పు చేశారు తప్ప, తను కాదని ఊమెను ప్రజలకు చూపించే ప్రయత్నం చేశాడు. ఇన్నాళ్లకు సరిత ముఖ్యమంత్రికే డైరక్టుగా యిచ్చానని చెపుతూ, అంటే అతనికి అత్యంత సన్నిహితంగా వుండేవారికే యిచ్చానని కొత్త ఆరోపణలు చేసింది. నిజానికి ముఖ్యమంత్రిది రూ. 9 కోట్ల డిమాండని జిక్కుమోన్ చెప్పాడు అంది. విద్యుత్ మంత్రి ఆర్యదన్ మొహమ్మద్ రూ. 2 కోట్లు అడిగితే రూ. 40 లక్షలిచ్చా అంటోంది. అంతేకాదు, ఫిబ్రవరి 1 న కొత్త ఆరోపణ చేస్తూ 'విచారణ కమిషన్ ముందు ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ఏమీ మాట్లాడవద్దని కోరుతూ నన్ను నలుగురు కాంగ్రెసు నాయకులు కోరారు. వారి సంభాషణలు మూడు సిడిల్లో వున్నాయి వినండి' అంటోంది. ఆ సిడిలు నిజమైనవో, అబద్ధమైనవో యింకా తేలలేదు కానీ టీవీ ఛానెళ్లలో ప్రసారం కావడంతో కాంగ్రెసుకు యిబ్బందికరంగా పరిణమించింది. దీనికి తోడు సరితను తాను ఎన్నడూ కలవలేదని 2014లో అసెంబ్లీలో చెప్పిన ఊమెన్, కలిశానని మొన్నటి 14 గంటల కమిషన్ విచారణ సమయంలో చెప్పాడు. దీనిపై అసెంబ్లీలో హక్కుల తీర్మానం ప్రవేశపెట్టారు.

మీడియా ముందు హుషారుగా వుండే సరిత కమిషన్ ముందు ధాటీగా సమాధానాలు చెప్పడం లేదు. నీ ఆరోపణలకు ఆధారాలేవి అని అడిగిన ప్రశ్నలకు ఏకాక్షర సమాధానాలు, అదీ వినీవినబడకుండా చెప్తోంది. లైంగిక అత్యాచారానికి గురయ్యాను అని చెప్పింది,

వివరాలు చెప్పు అంటే అది వ్యక్తిగతం కాబట్టి చెప్పను అంటోంది. అలాటివి గతంలో ధారాళంగా చెప్పిన మనిషి యీ రోజు యిలా మాట్లాడడం వింతగానే వుంది. ముఖ్యమంత్రి పై గతంలోనే ఎందుకు ఆరోపణలు చేయలేదు అని అడిగితే "నేను కోచిలో చీఫ్ మేజిస్ట్రేటుకు నాతో సంబంధం వున్న విఐపిల గురించి చెపితే ఆయన అన్నీ కాగితంపై రాసి యిమ్మన్నాడు. అన్ని వివరాలతో 30 పేజీల లేఖ తయారుచేశాను. ఈలోగా ముఖ్యమంత్రి తరఫునుంచి రాయబారులు వచ్చి అవన్నీ బయటపెట్టకుండా వుంటే ముఖ్యమంత్రి నాకు జరిగిన నష్టాలను పూడుస్తారని చెప్పారు. దాంతో అది చింపేసి కేవలం 4 పేజీల్లో ఏదో రాసి యిచ్చేశాను" అని సమాధానం చెప్పింది. ఈమె 2014లో సిపిఎం మీద ఆరోపణ చేసింది. "ముఖ్యమంత్రిపై డైరక్టుగా ఆరోపణ చేస్తే రూ.10 కోట్లు యిస్తామన్నారు." అంటూ! ఇప్పుడు ఊమెన్ అది గుర్తు చేస్తూ అదీ నిజమేనంటారా? అని అడుగుతున్నాడు.

కేరళ అసెంబ్లీ ముగింపు సెషన్‌లో యీ విషయమై ప్రతిపక్షాలు లేవనెత్తుతూండగానే వారికి మరొక ఆయుధం దొరికింది. 1992లో రుణాకరన్ ముఖ్యమంత్రిగా వున్నపుడు 32 వేల టన్నుల పామోలిన్‌ను మలేసియా నుంచి దిగుమతి చేసుకున్నారు. దాని వలన రాష్ట్రానికి రూ.2.32 కోట్లు నష్టం వాటిల్లింది అని ప్రతిపక్షం అంటుంది. ఫైనాన్స్ శాఖలో అధికారులపై కేసు నడిచింది. దానిపై విచారణ జరిపిన విజిలెన్సు కోర్టు గత వారం తీర్పు యిస్తూ అధికారులది తప్పు లేదని, అన్నీ ఫైనాన్స్ మంత్రి ఊమెన్‌కు తెలిసే జరిగాయనీ అంది. అధికారులను విడిచిపెట్టేసింది. "ఊమెన్‌కు తెలిసే జరిగాయన్నారు కాబట్టి అతను రాజీనామా చేయాలి" అంటూ ఫిబ్రవరి 24న అసెంబ్లీలో ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. "నేను ఎప్పణ్నుంచో చెపుతున్నాను, అధికారులు అమాయకులనీ. ఆ ముక్కే కోర్టు యిప్పుడు చెప్పింది. ఆ వ్యవహారంలో ప్రభుత్వానికి రూ. 9 కోట్లు లాభం వచ్చింది. కోర్టు నాకు వ్యతిరేకంగా సాక్ష్యాలు సేకరించలేదు, నన్ను తప్పుపట్టనూ లేదు. 23 ఏళ్ల పాత కేసు చూపి నన్ను రాజీనామా చేయమనడం హాస్యాస్పదం. మధ్యలో అనేకసార్లు మీరు ప్రభుత్వంలో వున్నపుడు ఆధారాలతో నాపై కేసు పెట్టలేకపోయారా?" అని ఊమెన్ ఛాలెంజ్ చేశాడు. సరిత కేసులో ఆ పాటి ధైర్యం చూపగలడో లేదో వేచి చూడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2016)**

**ఫిబ్రవరి 53** **ఎమ్బీయస్ : చూసి నేర్చుకోవచ్చు...**

ఇటీవల తెలుగు మీడియాలో ఓ వార్త వచ్చింది. ఆంధ్రలో బాబు ఎంత కష్టపడుతున్నా, కొందరు అధికారులు అవినీతికి పాల్పడుతూ ఆయన ప్రయత్నాలకు తూట్లు పొడుస్తున్నారుట. ఆ వార్త రాగానే దాన్ని ఖండిస్తూ ప్రభుత్వం నుంచి ప్రకటన ఏదీ రాలేదు. పోగా, ఆ వార్త వచ్చాక బాబు అధికారులతో దాన్ని ప్రస్తావించి 'ఇప్పటికైనా మారండి, లేకపోతే జాగ్రత్త' అని హెచ్చరించినట్లుగా కూడా మర్నాడు అదే పత్రికలో యింకో వార్త వచ్చింది. దానికీ ఖండన లేదు. ఏదైనా ఘనత జరిగితే సిఎంకు కట్టబెట్టడం, అవినీతి, బంధుప్రీతి జరిగితే అధికారుల నెత్తిన రుద్దడం ఒక అలవాటుగా మారుతోందనుకున్నా అధికారగణం సవ్యంగా ప్రవర్తించటం లేదన్న సందేహమైతే గాఢంగానే నాటుకుంది. బాబు గారి ప్రణాళికలు నిజంగా రూపు ధరిస్తే ఆంధ్రలో పెట్టుబడులు వరదలా రాబోతున్నాయి, భారీ నిర్మాణాలు జరగబోతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో అధికారుల్లో అవినీతి జాడ్యం వుంది అనుకుంటే రాష్ట్ర భవిష్యత్తు గురించి భయం వేస్తుంది. దాన్ని దూరం చేస్తే కానీ ప్రజల మనసు కుదుటపడదు. పెట్టుబడిదారుల అడుగు ముందుకు పడదు. అధికారుల అవినీతిని అరికట్టడానికి యితర ముఖ్యమంత్రులు ఏం చేస్తున్నారో గమనించడం ఆంధ్ర ముఖ్యమంత్రికి చాలా అవసరమనిపిస్తోంది. ఝార్‌ఖండ్‌ను పాలిస్తున్న రఘువర్ దాస్ ఏడాది పదవీకాలంలోనే చాలా మంచి పనులు చేశారని మీడియాలో వ్యాసాలు వస్తున్నాయి. అవి వాస్తవాలకు దగ్గరగానే వున్నాయని నమ్ముతూ, ఆయన్ని చూసి తెలుగు ముఖ్యమంత్రులు కాస్తయినా నేర్చుకుంటారని ఆశిస్తున్నాను.

అన్నిటికంటె ముందు నాకు నచ్చిన విషయమేమిటంటే – 2014 డిసెంబరు 28న ఆయన ప్రమాణస్వీకారం చేశాడు. స్థానిక నమ్మకాల ప్రకారం అవి మంచి రోజులు కావట. అయినా ఫర్వాలేదన్నాడట. అలాగే కాంకే రోడ్డులో నెం. 3 యింటిని తన అధికార నివాసంగా చేసుకోవడానికి ఆయన జంకలేదు. 'గత ముఖ్యమంత్రులందరూ తమ పదవులు పోవడానికి ఆ యిల్లే కారణమని నమ్మారు కదా మీకేం బెదురు లేదా?' అని అడిగితే 'పాత వాళ్లందరూ తమ అధికారం కొనసాగుతుందా లేదా అని ఆలోచించారు. నేను ప్రజల అధికారం కొనసాగితే చాలనుకుంటున్నాను.' అని జవాబిచ్చాడు. ఈ కాలంలో యిలాటి సమాధానం కొంత వింతగా తోస్తుంది. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినపుడు టంగుటూరి ప్రకాశం గారికి చెప్పారట – "అక్టోబరు 1 ముహూర్తం మంచిది కాదట. మార్పిస్తే మంచిదేమో అని." "నాకా? రాష్ట్రానికా?" అని అడిగారాయన. "మీకే.., ఆ రోజు ప్రమాణస్వీకారం చేస్తే ముఖ్యమంత్రిగా మీరు ఎక్కువకాలం వుండరట." అని జవాబు వస్తే "నాకేమైనా ఫర్వాలేదు, రాష్ట్రం బాగుంటే అదే చాలు. ఆ ముహూర్తం మార్చవలసిన పని లేదు." అని జవాబిచ్చారు. ఇప్పుడు ప్రమాణస్వీకారాలన్నీ సెకన్లతో సహా ముహూర్తాల బట్టే నడుస్తున్నాయి. ఇక అధికారిక నివాసమైతే మంత్రి మారగానే ఆయన జాతకానికి అనుగుణంగా వాస్తు మార్పులంటూ కోట్లు తగలేస్తున్నారు. అది తాత్కాలిక నివాసమైనా సరే! సొంత డబ్బు ఖర్చు పెట్టుకుంటే ఎవరూ ఏమీ అనరు. కానీ పోతున్నది ప్రజాధనం. 60 ఏళ్ల వయసున్న రఘువర్ వయసు తెచ్చే చాదస్తానికి కూడా లొంగకుండా వ్యవహరించడం ఎంతైనా ముచ్చటగా వుంది.

నాకు నచ్చిన యింకో అంశమేమిటంటే ప్రభుత్వశాఖలను తగ్గించడం! మన రెండు తెలుగు రాష్ట్రాలలోను ఫిరాయింపులు ప్రోత్సహిస్తున్నారు. వచ్చినవాళ్లందరికీ మంత్రిపదవులు యివ్వాలంటే పరిమితి వుంది. అందువలన ఆ పదవితో సమానమైన హోదా

యిస్తూ అనేక పోస్టులు సృష్టిస్తున్నారు. కార్పోరేషన్లు పెంచుతున్నారు. కులం పేర, ప్రాంతం పేర, రంగం పేర కార్పోరేషన్ సృష్టిస్తూ పోతే ఖజానాపై ఎంత భారమో చూడండి. ఈ రఘువర్ 43 డిపార్టుమెంట్ల నుండి 31 చేశాడు. కొన్ని కలిపేసి, కొన్ని తీసేసి, మరి కొన్నిటిని పునర్వ్యవస్థీకరించి అధికారులను కూడా తగ్గించాడు. సుస్థిరప్రభుత్వం వుంది కాబోలు ఏం చేసినా చెల్లిపోతుంది అనుకోనక్కరలేదు. 82 స్థానాలున్న ఝార్ఖండ్ అసెంబ్లీలో బిజెపికి 37, దాని భాగస్వామి ఐన ఆల్ ఝార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఎజెఎస్‌యు)కు 5 వచ్చాయి. ఇద్దరు ఫిరాయించినా ప్రభుత్వం కుప్పకూలుతుంది. అలాటి పరిస్థితుల్లో ఝార్ఖండ్‌కు తొలి గిరిజనేతర ముఖ్యమంత్రిగా యితనికి బిజెపి అవకాశం యిచ్చింది. ఏం చేసినా గిరిజనుల నాయకులు తప్పుపడుతూనే వచ్చారు. ఎందుకైనా మంచిదని పదవిలోకి వచ్చిన మూణ్నెల్లకు ఝార్ఖండ్ వికాస్ మోర్చా ఎమ్మెల్యేలు ఆరుగుర్ని పార్టీలో చేర్చుకుని సుస్థిరత సంపాదించుకున్నాడు. సాధారణంగా ఫిరాయింపులు ప్రోత్సహించినపుడు అవినీతిపై చూసీ చూడనట్లు పోవడం జరుగుతుంది. కానీ రఘువర్ ఎసిబి సిబ్బందిని 258 నుంచి 608కి పెంచాడు. జంషెడ్‌పూర్, హజారీబాగ్, ధుమ్కా, పలామూలలో ఎసిబి ప్రాంతీయ ఆఫీసులను తెరిచాడు. ఇప్పటివరకు 61 మంది అధికారులు పట్టుబడ్డారు. 8 మందిని అక్రమాస్తుల కేసులో, మరో 15 మందిని అధికారదుర్వినియోగం కేసుల్లో బుక్ చేయడం జరిగింది. అవినీతిని రూపుమాపుతామనే నినాదంతో "సీధీ బాత్" అనే కార్యక్రమం ఏర్పాటు చేశాడు. ప్రతి నెల ఆఖరి మంగళవారం నాడు 181 నెంబరుకు బాధితులు డయల్ చేస్తే తనే ఫోన్ తీసుకుని సంబంధిత అధికారులకు అప్పటికప్పుడే ఆదేశాలు యిచ్చే ఏర్పాటు చేశాడు.

నిజానికి రఘువర్ వచ్చిన దగ్గర్నుంచి అధికారులను గడగడలాడిస్తున్నాడు. ఝార్ఖండ్‌లో రాజకీయ అస్థిరత ఎక్కువ. రాష్ట్రం ఏర్పడిన 14 ఏళ్లలో 5గురు ముఖ్యమంత్రులు మారారు. ఇతను ఆరోవాడు. నాయకులు వస్తూ పోతూ వుండడంతో అధికారగణానిది ఆడింది ఆట, పాడింది పాటగా వుంటూ వచ్చింది. ఝార్ఖండ్‌లో టాటా స్టీల్, టాటా మోటర్స్, సెయిల్, కోల్ ఇండియా వంటి 32 మెగా కంపెనీలున్నా, ఐఐఎమ్, ఎక్స్‌ఎల్‌ఆర్ఐ, బిట్, ఐఎస్ఎమ్ వంటి ఎన్నో గొప్ప సంస్థలున్నా, రాష్ట్రం మాత్రం అనేక రంగాల్లో వెనకపడి వుంది. విద్య, వైద్యం వంటి రంగాల్లో దాని స్థానాన్ని పెంచడానికి రఘువర్ కృషి చేస్తున్నాడు. 2016–17 బజెట్‌లో రూ. 37 వేల కోట్లు ప్లానింగ్‌కు కేటాయించి రూ. 26 వేల కోట్లను నాన్–ప్లాన్‌కు కేటాయించాడు. అతను టిస్కోలో కార్మికుడిగా వుండేవాడు. అతని తండ్రీ అక్కడే కార్మికుడు. బియస్సీ, ఎల్ఎల్‌బి చదివి ఉద్యోగంలో చేరాడు. కాలేజీలో వుండగా జయప్రకాశ్ ఉద్యమంలో పాల్గొని, తర్వాత జనతా పార్టీలో చేరి, బిజెపి ప్రారంభించినపుడు దానిలో సభ్యుడయ్యాడు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా నెగ్గాడు. శిబు సొరేన్ ముఖ్యమంత్రిగా వున్నపుడు సంయుక్తప్రభుత్వంలో కొంతకాలం ఉపముఖ్యమంత్రిగా వున్నాడు. అందువలన అతనికి ఝార్ఖండ్‌లో సామాన్యుల నుంచి నాయకులదాకా అందరూ బాగా తెలుసు. రాష్ట్ర సమస్యల గురించి కూడా పూర్తి అవగాహన వుంది.

రఘువర్ ముఖ్యమంత్రి ఐన నెలలోపునే ఒక అఫీషియల్ మీటింగులో చీఫ్ సెక్రటరీ తన మాట వినకుండా మొండికేస్తే అతన్ని తీసేసి సంజయ్ కుమార్‌ను అనే ఆయన్ని బిహార్‌నుంచి తెచ్చుకున్నాడు. అలాగే డిప్యూటీ డెవలప్‌మెంట్ కమిషనరు దినేశ్ ప్రసాద్‌ను తీసేశాడు. మావోయిజంపై తీసిన వీడియోలో తన అనుమతి లేకుండా కనబడినందుకు ఆ శిక్ష! మావోయిస్టులపై కఠిన వైఖరి అవలంబించి, జన్ అదాలత్‌లు నిర్వహించి, వాళ్ల బలాన్ని క్షీణింపచేశాడు. 2015లో మావోయిస్టులు ఒక్క పోలీసుస్టేషన్‌పై కూడా దాడి చేయలేకపోయారు. ఆగస్టులో దేవగఢ్ గుడి వద్ద ఉత్సవంలో జనసమ్మర్దం కారణంగా 10 మంది చనిపోతే ఒక ఐయేయస్‌ను, ఒక ఐపియస్‌ను, మరో యిద్దరు ఆఫీసర్లను సస్పెండ్ చేశాడు. ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌లో చెట్లు కొట్టేయించినందుకు డిసెంబరులో కోడెర్మా డిప్యూటీ కమిషనర్‌ను తీసేశాడు. తనకు కావలసిన అధికారులను తెచ్చుకుని వారిచేత సమర్థవంతంగా పనిచేయించుకుంటున్నాడు. బ్యూరోక్రాట్లపై పట్టు సాధించడం చేత కాబోలు, పాలన మొదలుపెట్టి ఏడాదిలోనే బాగానే సాధించాడంటున్నారు. ఇప్పుడే మరీ కితాబులు యిచ్చేస్తే ఎబ్బెట్టుగా వుంటుంది కానీ సరైన దారిలోనే నడుస్తున్నాడనీ, అతన్ని చూసి మనవాళ్లు కొన్ని నేర్చుకోవచ్చని అనుకుంటూ ఝార్ఖండ్‌కు మంచి రోజులు వచ్చాయని భావిద్దాం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2016)**

**మార్చి 01** **ఎమ్బీయస్ : యూరోప్ గాథలు 29**

"క్లియోపాత్రా ముక్కు కాస్త పొట్టిగా వుండి వుంటే, ప్రపంచచరిత్ర మరోలా వుండేది" అన్నాడు 17 వ శతాబ్దం నాటి ఫ్రెంచ్ ఫిలాసఫర్ బ్లాయిజ్ పాస్కల్. ఎందుకంటే క్లియోపాత్రా వలన ఈజిప్టు సామ్రాజ్యమే కాదు, రోమన్ సామ్రాజ్యపు రాజకీయాలు ప్రభావితమయ్యాయి. ఇద్దరు రోమన్ మహా సేనానులు, చక్రవర్తులు ఆమెకు దాసోహమన్నారు. వయసులో 31 ఏళ్లు పెద్దవాడైన జూలియస్ సీజరుతో ప్రణయం సాగించి, అతని వలన లబ్ధి పొంది, రోమ్–ఈజిప్టు రెండు దేశాలకు రాణి అవుదామని ఆమె కన్న కలలు సీజరు హత్యతో భగ్నమయ్యాయి. అతని వారసుడిగా వచ్చిన మార్క్ ఆంటోనీని ఆమె మనసారా ప్రేమించింది. అతన్ని దుస్సాహసానికి ప్రేరేపించింది. అంతిమంగా యుద్ధంలో ఓటమితో వారి జీవితాలు విషాదంగా ముగిశాయి. వీరిద్దరి కథను షేక్‌స్పియర్ "ఆంటోనీ అండ్ క్లియోపాత్రా" పేరుతో "రోమియో అండ్ జూలియట్" తరహా విషాదప్రేమ నాటకంగా మలచాడు. నాటకకారుడు కాబట్టి నాటకీయత పండడానికి క్లియోపాత్రాను శృంగారమూర్తిగా స్వతహాగా కవి కాబట్టి కవిత్వం సహాయంతో తీర్చిదిద్దాడు.

బెర్నార్డ్ షా ఆ దృక్పథంతో విభేదించి, క్లియోపాత్రాలోని రాజకీయ కోణాన్ని ఆవిష్కరిస్తూ "సీజర్ అండ్ క్లియోపాత్రా" వచన నాటకాన్ని రాశాడు. క్లియోపాత్రా గురించి ఈజిప్టు వెళితే ఎలాగూ తెలుస్తుంది. రోమ్‌లో కూడా ఈజిప్టు నుంచి రోమన్ చక్రవర్తులు తెచ్చిన ఒబిలిస్కులు (సూర్యారాధనలో భాగంగా గుడి వద్ద కట్టే ధ్వజస్తంభం వంటి కట్టడాలు) చాలా కనబడతాయి. పారిస్‌లో లక్సర్ ఒబిలిస్కు కనబడుతుంది. ఈజిప్టులోని లక్సర్ గుడిలో వుండే దాన్ని ఈజిప్టు రాజు 19 వ శతాబ్దంలో పారిస్‌కు బహుమతిగా యిచ్చాడు.

క్లియోపాత్రా నిజంగా అంత అందగత్తెయా? ఆమె అందమైనదే కానీ అందం కంటె యితర గుణాలతోనే ఆమె అందర్నీ ఆకట్టుకుందని ఆమె మరణించిన 75 ఏళ్లకు పుట్టిన చరిత్రకారుడు ప్లూటార్క్ అంటాడు. ఆమె చాలా తెలివైనది, మంచి మాటకారి. పలుభాషలు నేర్చి, ఏ జాతివారితో ఆ జాతి వారి భాష మాట్లాడేది. మృదువుగా మాట్లాడుతూనే, తన భావాలను దృఢంగా వ్యక్తపరచగలదు. ఆమె అందం కంటె ఆమెతో శృంగారానుభవమే సీజర్, ఆంటోనీలను కట్టిపడేసిందని ప్రతీతి. ఆనాటి రాజవంశీకులందరి మాదిరిగాగానే ఆమెకు సింహాసనంపై మక్కువ ఎక్కువ. దాన్ని చేజిక్కించుకోవడానికి, సామ్రాజ్యం విస్తరింపచేసుకోవడానికి కుయుక్తులు పన్నడంలో కూడా దిట్ట. తన లక్ష్యం నెరవేర్చుకోవడానికి ఆమె అందాన్ని కూడా ఎరగా వేసినా, ప్రయోజనం వుంటుందని తెలిసినా తన కిష్టం లేనివాళ్లతో పడుక్కోలేదు. 39 ఏళ్లు మాత్రమే జీవించినా ఆమె జీవితంపై అనేక నవలలు, నాటకాలు, సినిమాలు వచ్చాయి. ఎలిజబెత్ టేలర్ క్లియోపాత్రాగా, రిచర్డ్ బర్టన్ ఆంటోనీగా, రెక్స్ హారిసన్ సీజర్‌గా నటించిన "క్లియోపాత్రా" సినిమా అద్భుతంగా వుండి పాత్రల స్వభావాలను చక్కగా వెలికితీసింది. భారీతనానికైనా చూడవలసిన సినిమా.

క్లియోపాత్రా క్రీ.పూ.69లో పుట్టింది. ఆమె తండ్రి పన్నెండవ టాలమీ (అసలు పేరు ఔలటీస్ టాలమీ) అలెగ్జాండర్ ద గ్రేట్ వంశీకుడు. అప్పటికి చాలా ఏళ్లగా గ్రీకు పాలకులు ఈజిప్టు ఫారోలుగా వున్నారు. వారు గ్రీక్ భాష తప్ప వేరేదీ మాట్లాడేవారు కారు. అందువలన పాలనలో ఈజిప్షియన్, గ్రీకు రెండు భాషలు వాడుకలో వుండేవి. ఈజిప్షియన్ వాళ్లతో సంబంధాలు కలుపుకోవడం కూడా వాళ్ల కిష్టం లేదు. అందువలన రాజవంశీకులు వారిలో వారే పెళ్లి చేసుకుంటూ, రక్తం 'కలుషితం' కాకుండా చూసుకునేవారు. అందువలన ఒకే తల్లి కడుపున పుట్టినవారు కూడా పెళ్లి చేసుకోవలసి వచ్చేది. క్లియోపాత్రా తల్లీ తండ్రీ జన్మతః అన్నాచెల్లెళ్లు. క్లియోపాత్రా యిద్దరు భర్తలూ (ఒకరి తర్వాత మరొకర్ని పెళ్లాడింది) ఆమె తమ్ముళ్లే. ఇలా వుండేది వారి ఆచారం. అన్నా చెల్లెళ్లని కాదని రాజులు వేరేవారిని పెళ్లాడితే అపచారం చేసినట్లు ప్రజలు భావించి, వారిపై ఆగ్రహం పెంచుకునేవారు.

ఇక రాజుగా వున్నవారు తమ దారికి కంటకంగా భావించిన వారిని తొలగించడానికి హత్యలు, విషప్రయోగాలు చేసేవారు. ఇలాటి వాతావరణంలో క్లియోపాత్రా పుట్టింది. ఈజిప్టు రాజులు అధికారాన్నంతా తమ చేతిలో పెట్టుకోవడంతో అవినీతి ప్రబలింది. వాళ్లు విలాసాలకు విపరీతంగా ఖర్చుపెడుతూ బొక్కసాన్ని ఖాళీ చేసుకున్నారు. అదను చూసి రోమ్ వాళ్లకు ఋణాలిచ్చింది. వసూలు చేసుకోవాలంటే రాజ్యాన్ని తాకట్టు పెట్టుకోవాలి, రాజవంశీకులను గుప్పిట్లో పెట్టుకోవాలి. అందుకని తన సైనికులను ఈజిప్టులో బస చేయించి, రాజులను రక్షిస్తున్నాన్న మిషపై, తనకు తాకట్టు పెట్టిన ఆస్తులను కాపాడుకునేది. సైనికుల పోషణాభారం ఈజిప్టుమీదే మోపేది. ఈస్టిండియా కంపెనీ మన సంస్థానాధీశుల విషయంలో యిలాగే చేసి, రాజరికపు వివాదాల్లో తలదూర్చి, రెండుపిల్లులకు రొట్టె పంపకం చేసిన కోతిలా ప్రవర్తించి చివరకు సంస్థానాలను స్వాహా చేసింది. సింహాసనంపై హక్కుల విషయంలో పోటీ పడే దాయాదులు చాటుగా కంపెనీతో ఒప్పందాలు కుదుర్చుకుని, తాము గద్దె నెక్కగానే రాజ్యభాగాలను కంపెనీకి ధారాదత్తం చేసేవారు.

క్లియోపాత్రా తండ్రి ఔలటీస్ కూడా రోమ్‌లో ఏళ్లపాటు తిష్ట వేసి పాతికేళ్లకు పైగా కుప్పపడిన ఋణాలు మాఫీ చేయించుకోవడానికి రోమ్ సెనేట్ సభ్యులతో మంతనాలు ఆడుతూండేవాడు. ఈజిప్టు రాజ్యంలో భాగమైన సైప్రస్‌ను అతని తమ్ముడు పాలిస్తూండేవాడు. ఓ రోజు హత్యకు గురయ్యాడు. కాపలాగా వున్న రోమన్లే చేశారేమో తెలియదు కానీ అది రోమ్ సామ్రాజ్యంలో కలిసిపోయింది. సిరినైకా కూడా చేజారింది. తన గతి ఏమవుతుందో తెలియక రోమ్‌లోనే వుంటూ తన సాయం పొందిన పాంపేను మద్దతివ్వమని వేడుకుంటున్నాడు. అతను లేని సమయంలో అతని భార్య (భార్యా కాదా అన్న విషయంలో స్పష్టత లేదు) సింహాసనాన్ని ఆక్రమించింది. ఆమెపై విషప్రయోగం జరిగి, చనిపోగా ఔలటీస్ పెద్దకూతురు బెరినైస్ రాజ్యం చేపట్టింది. బెరినైసే ఆ విషప్రయోగం చేయించిందని చెప్పుకుంటారు. తన చెల్లెలు 14 ఏళ్ల క్లియోపాత్రా తనకు పోటీగా తయారవుతుందన్న భయంతో ఆమెను రాజమందిరం నుంచి బయటకు ఎక్కడికీ వెళ్లనిచ్చేది కాదు. రోమన్లకు యిదంతా తెలిసినా, ఈజిప్టులో అనిశ్చితి కొనసాగించారు. ఎందుకంటే వాళ్ల దోపిడీ నిరాఘంటంగా సాగాలంటే రోమ్‌లో బలమైన రాజు వుండకూడదు. క్లియోపాత్రాను వాళ్ల అక్క ఒక కంటితో కనిపెడుతూ మరో కంటితో కాపాడుతూ వుంది కూడా. ఎందుకంటే ఏ కారణంగానైనా ఆమె హత్య చేయబడితే, ఆ అపవాదు తనపై వస్తుంది. ప్రజలు అప్పటికే అసంతృప్తితో రగులుతున్నారు. రాజమందిరంలో బందీగా వుంటూనే క్లియోపాత్రా విషయాలన్నీ తెలుసుకుంటోంది. తనకు అవకాశం వస్తుందా రాదా అని లెక్కలు వేసుకుంటోంది.

రెండేళ్ల తర్వాత ఔలటీస్ రోమ్ నుంచి రోమన్ సైనికులతో, సైన్యాధిపతితో సహా దిగాడు. వెంట వున్న వారిని చూసి ఈజిప్టు సైనికాధికారులు అతన్ని మన్నించారు. అతను గద్దె ఎక్కుతూనే బెరినైస్‌కు మరణదండన విధించాడు. క్లియోపాత్రకు తనతో పాటు అధికారం యిచ్చాడు. అతను క్రీ.పూ.51 మార్చిలో మరణించాడు. అతని వీలునామా ప్రకారం 18 ఏళ్ల కూతురు క్లియోపాత్రా, 10 ఏళ్ల కొడుకు పదమూడవ టాలమీ (ఇకపై టాలమీ అందాం) భార్యాభర్తలై, ఈజిప్టు సింహాసనాన్ని కలిసి ఏలాలి. పెళ్లి కాదంటే

రాజ్యార్హత పోతుందన్న భయంతో క్లియోపాత్రా తమ్ముణ్ని పెళ్లాడింది కానీ అతనితో పక్క పంచుకోవడానికి సిద్ధపడలేదు. టాలమీకి రక్షకుడిగా వుండే పోథినస్ నపుంసకుడు. అతని మాట టాలమీకి వేదవాక్కు. రాజ్యపాలనంతా అతనే చేసేవాడు. అతని మాట ఎత్తితేన్తే క్లియోపాత్రా మండిపడేది. భర్తతో విభేదాలు ముదరడంతో దస్తావేజుల్లో తన పేరులోంచి టాలెమీ తీసిపారేసి, తన ఒక్కదాని చిత్రంతోనే నాణాలు విడుదల చేసింది. ఈజిప్టు చరిత్రలో యిలా ఎప్పుడూ జరగలేదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2016) (ఫోటో – ఈజిప్టు నుంచి తెచ్చి వాటికన్‌లో నెలకొల్పిన ఒబిలిక్స్)**

**మార్చి 02 వీక్లీకై ఎమ్బీయస్ : తమిళనాట బిజెపి భాగస్వామి ఎవరు?**

రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలలో కలిసి పోటీ చేయడానికి కాంగ్రెసు, డిఎంకె పొత్తు కుదుర్చుకుని 15 రోజులు దాటింది. కానీ యిప్పటిదాకా బిజెపి ఏం చేయబోతోందో తెలియటం లేదు. ఒంటరిగా పోటీ చేయడానికి బిజెపి ధైర్యం చేస్తుందని అనుకోవడానికి లేదు. 2011 ఎన్నికలలో బిజెపి ఒంటరిగా పోటీ చేస్తే 8 లక్షల ఓట్లు (ఓటింగు శాతం 2.2%) వచ్చాయి. 2014 లోకసభ ఎన్నికల్లో బిజెపికి వచ్చిన ఓట్ల శాతం మోదీని ప్రధానిని చేయడానికి ఉద్దేశించినవి. ఇప్పుడు అది ఎన్నికల అంశం కానే కాదు. పైగా మోదీ పాప్యులారిటీ గతంలో కంటె తగ్గింది. అందువలన ఎవరో ఒకరితో చేతులు కలపాలి. 2014 నాటి ఎన్‌డిఏ కూటమి చెదిరిపోయింది. మోదీ-జయలలిత దోస్తీ బట్టి చూస్తే ఎడిఎంకెతో చేతులు కలపాలి. కానీ అదేమీ యిప్పటిదాకా తేలలేదు.

మధ్యలో గొడవలు వచ్చినా 2011 అసెంబ్లీ ఎన్నికలలో డిఎంకె (119 సీట్లు), కాంగ్రెసు (63) కూటమి కలిసి పోటీ చేసింది. వాళ్లతో పిఎంకె (30) కూడా చేరింది. వాళ్లతో బాటు చిన్నా, చితకా యింకో 4 పార్టీలు చేరాయి. ఫలితాలు వచ్చాక చూస్తే డిఎంకెకు 23, కాంగ్రెసు 5, పిఎంకెకు 3 వచ్చాయి. తక్కినవాటికి ఏమీ రాలేదు. 2014 లోకసభ ఎన్నికల పాటికి పొత్తు విచ్చిన్నమైంది. డిఎంకె యితర పార్టీలతో కలిపి పోటీ చేయగా, కాంగ్రెసు ఎవరితోనూ పొత్తు పెట్టుకోలేదు. ఎవరికీ ఒక్క సీటు కూడా రాలేదు. కాంగ్రెసు పార్టీకి ఒకప్పుడు 10% ఓటు బ్యాంకు వుండేది. కానీ దాన్లోంచి జికె వాసన బయటకు వెళ్లిపోయి తన తండ్రి మూపనార్ స్థాపించి, కాంగ్రెసులో విలీనం చేసిన తమిళ మానిల కాంగ్రెసును మళ్లీ ప్రారంభించాడు. అందువలన 2014 లోకసభ ఎన్నికల నాటికి అది 4.5%కి పడిపోయింది. డిఎంకెకు 2014 ఎన్నికలలో 23% మాత్రమే వచ్చింది. ఇప్పుడీ కూటమిలో పుదియ తమిళగమ్ అనే చిన్న పార్టీ (2011లో ఎడిఎంకెతో వుంది) వచ్చి చేరింది. విజయకాంత్ కూడా తమవైపు వస్తే విజయం తథ్యం అని వారి భావన. అందుకే బహిరంగంగా అతన్ని ఆహ్వానించారు. అతను వచ్చేవరకు సీట్ల పంపిణీ ఆపి వుంచారు. విజయకాంత్ అవునని, కాదని ఏమీ అనలేదు కానీ అతని భార్య ప్రేమలతను అడిగితే "నేనేం చెప్పాలి? ఆ రెండు పార్టీలు అవినీతికి మూలస్తంభాలని సోషల్ మీడియాలో యిప్పటికే కూస్తోంది." అంది.

2011 అసెంబ్లీ ఎన్నికలలో విజయకాంత్‌కు చెందిన డిఎండికె, సిపిఐ, సిపిఎం లతో బాటు జయలలితతో జట్టుకట్టాడు. ఆ కూటమిలో మణిదనీయ మక్కల్ కచ్చి, పుదియ తమిళగమ్, ఫార్వర్డ్ బ్లాక్, సమత్వ మక్కల్ కచ్చి (నటుడు శరత్‌కుమార్‌ది), రిపబ్లికన్ పార్టీ, మూవేందర్ మణ్నని కళగం, కొంగు ఇళైంజర్ పెరవై వంటి చిన్న పార్టీలు చేరి 5 సీట్లు తెచ్చుకున్నాయి. అప్పుడు 19 స్థానాలు తెచ్చుకున్న లెఫ్ట్ కూటమి 2014 పార్లమెంటు ఎన్నికలు వచ్చేసరికి విడిగా పోటీ చేసి, ఏమీ తెచ్చుకోలేదు. అప్పుడు 29 సీట్లు తెచ్చుకున్న విజయకాంత్ తర్వాత ప్రతిపక్షంలో కూర్చున్నాడు. తర్వాత 27 సీట్లే అయ్యాయి. ఇప్పుడు 7గురు ఎమ్మెల్యేలు విజయకాంత్‌పై తిరుగుబాటు చేసి జయలలిత వైపు వచ్చేశారు. ప్రతిపక్షనాయకుడు కావాలంటే 24 స్థానాలుండాలి కాబట్టి విజయకాంత్‌కు ప్రతిపక్షనాయకుడి హోదా పోయింది. 2014 పార్లమెంటు ఎన్నికలలో జయలలిత పొత్తు పెట్టుకోకుండా విడిగా పోటీ చేసి 39 సీట్లలో 37 గెలిచింది.

2014 పార్లమెంటు ఎన్నికలలో బిజెపి కూటమిలో చాలామందే చేరారు. 2011లో డిఎంకెతో బాటు వున్న పిఎంకె, ఎడిఎంకెతో బాటు వున్న డిఎండికె, 2011లో జయలలితపై అలిగి ఎన్నికలకు దూరంగా వున్న వైగో ఎండిఎంకె, యింకో మూడు పార్టీలు చేరాయి. చివరకు బిజెపికి 1, పిఎంకెకు 1 సీటు దక్కాయి. ఇప్పుడు ఆ కూటమి చెదిరిపోయింది. వైగోకు చెందిన ఎండిఎంకె విడిగా వచ్చేసి లెఫ్ట్ పార్టీలతో (వీళ్లు 2011లో ఎడిఎంకెతో కలిసి, 2014లో విడిగా పోటీ చేశారు) వారితో పాటు విసికె పార్టీ అని ఒకటి చేరింది. దీనికి పీపుల్స్ వెల్‌ఫేర్ ఫ్రంట్ అని పేరు పెట్టుకున్నారు. డాII రామదాసు పిఎంకె విడిగా పోటీ చేస్తానంటోంది. ఇప్పుడు బిజెపి కూటమిలో ఎవరుంటారో తెలియటం లేదు. సుబ్రహ్మణ్యస్వామి డిఎంకె-డిఎండికె-బిజెపి పొత్తుకై ప్రయత్నించాడు కానీ రాష్ట్ర బిజెపి నాయకులు డిఎంకెతో కలవడానికి యిచ్చగించలేదు.

పరిశీలకులు బిజెపి-ఎడిఎంకె కూటమి ఏర్పడడం తథ్యమని, అందుకే పిఎంకె , ఎండిఎంకెలను వగైరాలను వదుల్చుకుందని అంటున్నారు. రాజ్యసభలో బిజెపికి ఎడిఎంకె అవసరముంది, కేసుల విషయంలో జయలలితకు కేంద్రం సాయం కావాలి. రైల్వే బజెట్‌లో, స్మార్ట్ సిటీల ఎంపికలో తమిళనాడు పట్ల పక్షపాతం చూపించడం గమనిస్తే బిజెపికి ఆ రాష్ట్రం పట్ల ఆశలున్నట్లే తోస్తున్నాయి. కానీ ఒంటరిగా పోటీ చేసే ధైర్యం చేయడం లేదు. డిఎంకె, కాంగ్రెసు కూటమిని మరీ బొత్తిగా కొట్టి పారేయడానికి లేదు. డిఎంకె తరఫున స్టాలిన్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ముందుకు వస్తున్నాడు. కరుణానిధి యితర కుటుంబసభ్యులతో పోలిస్తే స్టాలిన్‌పై వున్న

అవినీతి ఆరోపణలు తక్కువ. పాప్యులారిటీ విషయంలో జయలలిత తర్వాతి స్థానం అతనిదే. ఇటీవల అతను "నమక్కు నామే" పేర ప్రజలను కలిసే కార్యక్రమం చేపడితే అది ప్రజాదరణ పొందింది. ఎడిఎంకెతో పొత్తు పెట్టుకుంటేనే కాంగ్రెసును చావుదెబ్బ కొట్టగలదు. మరి ఆ పొత్తు ప్రకటించడానికి ఎందుకు ఆలస్యం అంటే రెండు కారణాలు కనబడుతున్నాయి. ఒకటి తమిళనాడు ఓటర్లు ఐదేళ్ల కోసారి ప్రభుత్వాలను మార్చేస్తారనే సెంటిమెంటు. 2001లో ప్రభుత్వ వ్యతిరేకత అంతగా లేకపోయినా కరుణానిధి ప్రభుత్వం పడిపోయింది, 2006లో జయలలిత ప్రభుత్వమూ అంతే. జయలలిత సంక్షేమపథకాల మాట ఎలా వున్నా రాష్ట్ర అభివృద్ధి కుంటుతోంది. అనేక సమస్యలున్నాయి. మొన్నటి వరదలు చాలా చెడ్డపేరు తెచ్చాయి. ఇక రెండో కారణం – విజయకాంత్‌కు కచ్చితమైన ఓటు బ్యాంక్ కొంత వుంది. అతను కలిసి వస్తాడేమో అని బిజెపి ఎదురుచూస్తోందట. 'కెప్టెన్' అనే బిరుదు వున్న విజయకాంత్ సిగ్నల్ యిస్తేనే బిజెపి కూటమి ఏర్పడుతుందనుకోవచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2016)**

## మార్చి 03 ఎమ్బీయస్ : నూతిలోంచి సూదెలా వస్తుంది?

మేం పిల్లలుగా వుండగా మావయ్యో, బాబయ్యో కథ చెప్తానని మొదలెట్టేవారు. "ఒక నూతి గట్టు మీద ఒక ముసలమ్మ కూర్చుని బొంత కుట్టుకుంటోంది, ఏం?" – "ఊఁ"

"..అంతలో సూది నూతిలో పడిపోయింది." – "ఊఁ"

"ఊఁ అంటే బయటకు వస్తుందా?" – "రాదు"

"రాదు అంటే వస్తుందా?" – "రాదని చెప్పానుగా.."

"రాదని చెప్పానుగా – అంటే వస్తుందా?" – "ఏహె, కథ చెప్పు"

"ఏహె, కథ చెప్పు – అంటే వస్తుందా?"

..ఇలా సాగేది. మనకి కోపం వచ్చేసి మీదపడి రక్కేసి, కరిచేసేదాకా యీ ప్రశ్నల పరంపర సాగేది.

ఇప్పుడు ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, వెనకబడిన ప్రాంతాలకు కేంద్రసాయం, వైజాగ్ రైల్వే జోన్, రాజధానికి నిధులు – యిలా దేని గురించి మాట్లాడినా నాకు యీ కథ గుర్తుకు వస్తుంది. ప్రత్యేక హెూదా యివ్వం అని కేంద్రం అనదు, యిప్పించలేం అని రాష్ట్రప్రభుత్వం అనదు. వస్తోంది, వచ్చేస్తోంది. హెూదా కాకపోయినా దానితో సమానమైన.. తప్పుతప్పు.. దాని కంటె ఎక్కువ ప్రయోజనకరమైన నిధులు వర్షంలా కురుస్తాయి అంటూ వచ్చారు. ఇప్పుడు విదిల్చిన నిధులు హెూదాకు ఎక్కువైనవా? తక్కువైనవా? సమానమైనవా? ఎంత శాతము? ఏ సుజనా చౌదరిగారో లెక్కేసి చెపితే తెలుసుకుంటాం. కొత్త రాష్ట్రం కాబట్టి బజెట్ లోటు తీరుస్తారు, ప్రత్యేక ప్యాకేజీలు యిస్తారు, పన్ను రాయితీలు యిస్తారు, వైజాగ్ రైల్వే జోన్, జిల్లాకో పది సంస్థలు.. యిలా కొల్లేటి చాంతాడంత లిస్టు చెపుతూ వచ్చారు టిడిపి నాయకులు. చివరకి ఏమిచ్చారో, రేదర్.. ఏమివ్వలేదో హైస్కూలు కుర్రవాడు కూడా చెప్పగలడు.

నా చిన్నప్పటినుంచి రైల్వే, సాధారణ బజెట్ సమర్పించిన మర్నాటి పేపర్లలో ఒకటే హెడ్‌లైన్ – 'ఈ సారి రాష్ట్రానికి మొండిచెయ్యి!' అని. కాంగ్రెసు అధికారంలో వుంటే ఆ చెయ్యి అనేదానికి అటూయిటూ యిన్వెర్టెడ్ కామాలు పెట్టేవారు. గత రెండేళ్లగా హెడ్‌లైన్స్‌లో కాస్త మార్పు. రాష్ట్రానికి బదులు 'తెలుగు రాష్ట్రాలకు' అంటున్నారు. సారాంశం ఒకటే. ఈసారీ తెలంగాణకూ ఏమీ ఒరగబెట్టలేదు. కానీ యిప్పటికే వున్న యిన్‌ఫ్రాస్ట్రక్చర్ చూసి కాస్తకాస్త పెట్టుబడులు వస్తున్నాయి, బండి నడిచిపోతోంది. కెసియార్ చూపించే కలలకు, వాస్తవానికి హస్తిమశకాంతరం వుంది కానీ, ఉన్నది చెడగొట్టకుండా నడుపుకుపోతే భుక్తికి లోటు లేదు. కానీ ఆంధ్ర పరిస్థితి క ృత్యాద్యవస్థ. తాడూ, బొంగరం ఏమీ లేదు. కేంద్రం ఏమీ యివ్వటం లేదు. ఇవ్వాల్సిన చోట కూడా ఎండగడుతోంది. లాలా లజపతిరాయ్, దీన్‌దయాళ్ జయంతులకు యిచ్చినదీ, పోలవరం ప్రాజెక్టుకి యిచ్చినదీ సమానమే అంటే నమ్మబుద్ధి కావటం లేదు. వైజాగ్ మెట్రోకు బొత్తిగా మూడు లక్షలంటే జోకా? అనిపించింది. 3 లక్షల కేటాయింపు కూడా కేంద్ర బజెట్‌లో ప్రస్తావిస్తారని నాకు తెలియదు. ఉన్నత విద్యకు చాలా ప్రాముఖ్యత యిస్తున్నాం అంటూ డప్పు కొట్టి సెంట్రల్ వర్శిటీకి, గిరిజన వర్శిటీకి చెరో కోటి, పెట్రోలియం వర్శిటీకి రెండూ యిచ్చారు. విభజన చట్టంలో వున్న హామీలు నెరవేరుస్తాం అన్నారు యీ బజెట్‌లో కానీ వాటి గురించి నిధులు కేటాయించలేదు. అనగా 2017–18 ఆర్థిక సంవత్సరంలో నెరవేరుస్తారని అనుకోవాలి. దాని తర్వాత యింకో ఏడాది పోతే ఎన్నికలే. రెండేళ్లలో ఆ హామీలన్నీ ఎలా నెరవేరతాయి? అప్పటిదాకా ఆంధ్ర రాష్ట్రం నిలదొక్కుకోవడం ఎలా?

మోదీ అంటే అభిమానంతో చొక్కా చింపుకునే ఆంధ్ర ప్రజలు కూడా మోదీ రాష్ట్రానికి ఏమీ యివ్వటం లేదని ఒప్పుకోక తప్పని పరిస్థితి. బిహార్ కశ్మీరులకి సాయం ప్రకటించిన తీరుతో అమరావతి శంకుస్థాపన మట్టి, నీళ్లు తేవడాన్ని పోల్చి చూస్తే ఆంధ్రుల ఆర్తనాదాలకు అర్థం తెలుస్తుంది. నిధులు లేని ఆంధ్ర గతి అధోగతే. మరి ఏం చేస్తే నిధులు వస్తాయి? బతిమాలితే వస్తాయా? బెదిరిస్తే వస్తాయా? మిత్రపక్షంగా వుండడం మానేసి, శత్రుపక్షం అయిపోతే వస్తాయా? వరసపెట్టి ఆత్మహత్యలు చేసుకుంటే వస్తాయా? అఖిలపక్షాన్ని వెంటేసుకుని ఢిల్లీలో నిరసనలు చేస్తే వస్తాయా? – యిలా ప్రశ్నలు వేసుకుంటూ పోతే మొదట్లో చెప్పిన కథ బాపతే

అవుతుంది. ఏం చేస్తే వస్తుందో తెలియదు కానీ మోదీకి ఆంధ్రపై కక్షకు మూలకారణం ఏమిటో అన్వేషిస్తే..? టీవీ చర్చల్లోనే కాదు, కాలర్స్ కూడా చెపుతున్న విషయమేమిటంటే – మోదీకి, బాబుకి ఎప్పణ్నుంచో పడదు. గోధ్రా అల్లర్ల సమయంలో బాబు మోదీని తీవ్రంగా తప్పుపట్టి ఆయన సాకు చెప్పి ఎన్‌డిఏ నుంచి వైదొలగి, ఆయనను అవమానించారు. అందుని మోదీ యిప్పుడు బాబుకి తన తడాఖా చూపిస్తున్నాడు! కాస్సేపు యిది నిజమే అనుకుందాం. దాని గురించి ఎవరు మాత్రం ఏం చేయగలరు? మోదీ ప్రధాని అని బాబు ఒప్పుకోక తప్పదు, బాబు ముఖ్యమంత్రి అని మోదీ ఒప్పుకోక తప్పదు. మోదీకి కొత్తగా తయారైన శత్రువులు – నితీశ్, అరవింద్ లాటి వాళ్లు వున్నారు కదా. కెసియార్ రెండేళ్ల క్రితమే సన్నాసి అన్నారు కదా. బాబు ఎప్పుడో చేసినదాన్ని యిప్పటిదాకా గుర్తు పెట్టుకోవడం దేనికి? గతం మర్చిపోయి బాబు యిప్పుడు తన భజన చేస్తున్నపుడు, తనూ మర్చిపోవచ్చు కదా! ఆంధ్ర భారతదేశంలో భాగం కాదా? ఆంధ్రులు పన్నులు చెల్లించటం లేదా? బాబు కారణంగా నాలుగున్నర కోట్ల ఆంధ్రులకు శిక్ష వేయడమేమిటి? వాళ్లు ఉసురు తగులుతుందన్న భయం లేదా?

కొంతమంది గెస్ యింకోలా వుంది. బాబు చాణక్యుడు. గతంలో యునైటెడ్ ఫ్రంట్‌కు కన్వీనరుగా వుంటూ రాత్రికి రాత్రి ఎన్డీఏ కన్వీనరు అయిపోయారు. అలాగే 2019 నాటికి తన హవా కాస్త తగ్గేసరికి, నితీశ్, మమతా, జయలలిత వంటి ప్రాంతీయనాయకులను, లెఫ్ట్ పార్టీలను వెంటేసుకుని మూడో ఫ్రంట్‌కు ప్రాణం పోసి, ప్రధాని పోస్టుకి తనతో పోటీ పడతాడని మోదీకి భయం వుందట. అందువలన నవరాష్ట్రస్రష్టగా బాబుకి పేరు రాకుండా తొక్కేద్దామనే డబ్బు బిగపడుతున్నాట్ట. ఇది నిజమే అయితే యీ అనుమానాన్ని దూరం చేయడం ఎలా? భవిష్యత్తులో ఏం చేస్తారో బాబు మాత్రం ఏం చెప్పగలరు? ఎన్నికలకు ముందు తన పార్టీలోంచి అంతమంది వెళ్లిపోతారని ఆయన అనుకున్నారా? అయిన రెండేళ్లకు మళ్లీ అందరూ వెనక్కి వస్తారని, వస్తూ వస్తూ మరి కొందర్ని వెంటపెట్టుకుని వస్తారని కలగన్నారా? కలగని వుంటే 'సంతలో పశువుల్లా కొంటున్నారు' అనే స్టేటుమెంటు యిచ్చి వుండేవారు కాదు కదా! మోదీకి మరీ అంత సందేహంగా వుంటే 'నేను లెఫ్ట్ వాళ్లతో కలవను, మీరు వద్దంటే ఎడమవైపు తిరిగి పడుక్కోను కూడా' అని హామీ యివ్వడం మినహా ఏం చేయగలరు? ఆయన నిజంగా మూడో ఫ్రంట్ వైపు వెళదామనుకుంటే 'బిజెపిని నమ్ముకుని మోసపోయాను, రాష్ట్రానికి ఏమీ చేయలేకపోయాను, నా కోసం కాదు, మీ కోసం యీ సారి మూడో ఫ్రంట్‌లోకి వెళుతున్నాను' అని కాన్వాస్ చేసుకునే అవకాశం మోదీయే కల్పించినట్టవుతుంది.

మోదీ నిధులివ్వకపోవడానికి మరో కారణం కూడా చెప్తున్నారు. బాబు గొప్పలు చెప్పుకునే మనిషి కాబట్టి, ప్రతీ పనినీ తన ఖాతాలో వేసుకుంటారు కాబట్టి 'ఆంధ్రకు యిస్తే నాకేంటంట? రాష్ట్రంలో బిజెపి బలపడి, ఖ్యాతి తన ఖాతాలో వేసుకునే వరకూ యివ్వకూడదు' అన్న లెక్క వేసుకుని మోదీ చేయి విదల్చటం లేదట. 'రాష్ట్రం నిత్యం, కేంద్రం మిథ్య' అని ఎన్టీయార్ ఎప్పుడో కొటేషించారు. రాష్ట్రానికి ఏలుకోవడానికి ఒక ప్రాంతం వుంది, కేంద్రానికి ఆలాటిదేమీ లేదు, (కేంద్రపాలిత ప్రాంతాలు వదిలేయండి) రాష్ట్రాల ద్వారానే పాలన సాగించాలి కాబట్టి ఆయన ఆ పోలిక తెచ్చారు. మిథ్య అయినా కేంద్రమే రాష్ట్రానికి వూపిరి పోస్తూ వుంటుంది. నరుడు కనబడతాడు, హరుడు కనబడడు. అయినా చీమను కుట్టమని అడిగినా హరుడి ఆర్డరేది? అంటోంది. కేంద్ర పథకాల్లో మోదీ ఫోటో వుంటుంది. మరి రాష్ట్ర పథకాల్లో సిఎం బొమ్మ లేకపోతే ఎలా? ఎక్కడో యుపిలో ఒక పథకం మొదలెడితే దేశం మొత్తమంతా ఫుల్ పేజీ యాడ్స్ యిస్తారు – మనమంతా చూసి అఖిలేష్ గట్టివాడే సుమీ అనుకోవాలన్నమాట. ఢిల్లీలాటి అర్ధరాష్ట్రంలో పావు ముఖ్యమంత్రి అర్ధణా స్కీము పెడితే మన తెలుగు టీవీ ఛానెల్స్‌లో కూడా యాడ్స్ యిస్తారు. మీడియా రిపోర్టులు చూసి అరవింద్ వట్టి జగడాలమారి, పేచీకోరు, వాచాలుడు మాత్రమే అనుకున్నాం, ఏదో కాస్త పని కూడా చేస్తున్నాడు సుమా అని మనం అనుకోవాలని అతని తాపత్రయం. ఇలా ప్రతి సిఎం ఎంతో కొంత పబ్లిసిటీకై పాకులాడుతారు. జిఎచ్ఎమ్‌సి చౌక భోజనం పథకం హోర్డింగులపై కెసియార్ బొమ్మ ఎందుకుంది అని అడగ్గలమా? మరి బాబు ఒక్కడిపైనే ఎందుకింత కినుక?

ఏ మాట కామాట చెప్పాలంటే బాబు భగవద్గీతలో కృష్ణుడి లెవెల్లో సర్వం తానే అనేస్తూంటారు. హైదరాబాదుకు బ్రాండ్ యిమేజి నేను తెచ్చినదే, నేను కట్టినదే అంటే కాదని చెప్పడానికి ప్రస్తుతం నిజాం లేడు. కొన్నాళ్లకు బాబు ఏమనుకున్నారో ఏమో 'హైదరాబాదు నిజాం కట్టాడు, సికింద్రాబాదు ఇంగ్లీషువాళ్లు కట్టారు, సైబరాబాదు నేను కట్టాను' అనసాగారు. ఇంగ్లీషు వాళ్లు 1947లో వెళ్లారు. బాబు 1995లో సిఎం అయ్యారు. మధ్యలో వున్న 48 ఏళ్లలో మరి మేం కట్టిన బిఎచ్ఇఎల్, ఐడిపిఎల్, ఇసిఐఎల్, డిఫెన్సు లాబ్స్ వంటి వందలాది సంస్థల మాటేమిటి అని అడిగేందుకు కాంగ్రెసు వారు నోరూ, వాయి లేనివారయ్యారు. సైబరాబాదుకి మూలం అయిన హైటెక్ సిటీకి పునాది వేసిన నేదురుమల్లి దిగి వచ్చి అడగరు. రాజీవ్ టెక్ పార్కుకు హైటెక్ సిటీ అని పేరు మార్చి తన స్టాంపు కొట్టేసి, భూనభోంతరాళాలు బద్దలయ్యేట్టు ప్రచారం చేయడంతో బాబు పబ్లిసిటీ కాంపెయిన్ అంటే అందరికీ దడ పట్టుకుంది. మొన్న జిఎచ్ఎంసి ఎన్నికల ప్రచారంలో కూడా తన పార్టీ అభ్యర్థి ఎలాటివాడో చెప్పడం మానేసి, హైదరాబాదు నేను కట్టాను అనే డప్పే వేశారు. అందుకే ఓటర్లు ఆ అభ్యర్థుల మొహం చూడలేదు. ఇచ్ఛాపురం నుంచి హిందూపురం దాకా వూద్చుకుంటూ యిదే బాకా వూదుకోండి అని బాబును పంపించివేశారు.

'బాబు మీడియాను బాగా మేనేజ్ చేస్తారు. పని ఏమీ జరగకపోయినా ఏదో జరుగుతున్నట్లు ప్రజలను మభ్యపెట్టిస్తారు.' అనే మాట కూడా వుంది. ఇప్పుడు కేంద్రం ఏమీ యివ్వలేదు అని తేటతెల్లమై పోయిన తర్వాత కూడా వదిలిపెట్టరు. ప్రత్యేక హామీ గురించి జైట్లీ ఆలోచిస్తున్నారు అని మీడియాలో వస్తుంది, 'పోలవరానికి వేల కోట్లు యిద్దామని తోలుబ్యాగ్‌లో పెట్టి దాచి వుంచారు,

బాబు ఢిల్లీ రాగానే చంకలో పెట్టి పంపిద్దామని కాచుకుని వున్నారు' అని లీకు వస్తుంది. 'ఇలా ఏదో ఒక అబద్ధం చెప్పి వూరిస్తూ వుండకపోతే నిరాశానిస్పృహలతో ఆంధ్ర యువత ఆత్మహత్యలు చేసుకుంటుంది కాబట్టి పాపం అలా చేయిస్తున్నారు' అని కొందరు వాదిస్తే వాదించవచ్చు కానీ యీ తరహా కథనాలు రెండేళ్లగా చాలా చదివి చదివి 'నాన్నా, పులి' కథలా అయిపోయింది. 2009 నుంచి ఆంధ్ర కాంగ్రెసు నాయకులు యిలాగే మభ్యపెడుతూ వచ్చారు. 'మేం వెళ్లి సోనియాకు సమైక్యవాదం వినిపించాం. ఆవిడ శ్రద్ధగా విని, తల వూపారు.' అని చెప్పేవారు. మీడియాలో ఆ మేరకు కథనాలు రాయించేవారు. కానీ జరగాల్సింది జరిగే తీరింది. ఇప్పుడు కేంద్రసాయం గురించి యిలాటి కథనాలే వస్తూంటే ఎవరు నమ్ముతారు? దీనివలన బాబుకి ఏమైనా లాభం ఏమైనా వుందో లేదో కానీ ఆంధ్ర ప్రజలకు నష్టం కలుగుతోంది. ఈ మీడియా మేనేజ్‌మెంట్‌తో చిర్రెత్తిన మోదీ బిర్రబిగిసిపోయారట.

తను ముఖ్యమంత్రిగా వున్న రాష్ట్రానికి ఏదైనా మేలు జరగాలంటే బాబు సవరణ చర్యలు చేపట్టాలి. గోధ్రా సమయంలో అన్న మాటలను వెనక్కి తీసుకోలేరు కానీ, ప్రస్తుతపు ప్రచారం తగ్గించడం, మీడియా మేనేజ్‌మెంట్ మానేయడం ఆయన చేతిలో వుంది. పథకాలకు ఎన్టీయార్ పేరు పెట్టకుండా మోదీ తల్లి పేరో, తండ్రి పేరో, దీన్‌దయాళ్, శ్యామా ప్రసాద్ ముఖర్జీ, నానాజీ దేశ్‌ముఖ్.. లాటి పేర్లు పెడతానని కబురు పెడితే మోదీ ప్రసన్నుడు కావచ్చు. 2019 ఎన్నికల వరకు కాస్త తగ్గి వుండి రాష్ట్రానికి నిధులు పట్టుకుని వచ్చి, పనులు జరిపించి కావాలంటే జస్ట్ ఎన్నికల ముందు 'అంతా నాదే, మోదీది ఏమీ లేదు' అని చెప్పుకున్నా నష్టం లేదు. బాబు చేసిన పనులే ఆయన్ను గెలిపిస్తాయి. పవన్ కళ్యాణ్‌ను షూటింగు నుంచి స్పెషల్ ప్లేన్‌లో తెప్పించే ఖర్చులూ మిగులుతాయి.

ఇక్కడే యింకో పాయింటు కూడా వుంది. కేంద్రంలో వున్న మీ పార్టీ రాష్ట్రానికి నిధులెందుకు యివ్వటం లేదు అని అడిగితే ఆంధ్ర బిజెపి నాయకులు 'ఆంధ్రులపై కక్షేమీ లేదు, రాష్ట్రం సరిగ్గా నివేదికలు పంపటం లేదు. ఇచ్చినవాటికి లెక్కలు చూపటం లేదు. రాజధానికి యిచ్చిన నిధులు యితరత్రా ఖర్చుపెట్టేశారు. రాజధానికి ప్లాన్ లేదు, పాడు లేదు, డిపిఆర్ యివ్వటం లేదు, ఏం చూసి నిధులు విడుదల చేయాలి?' అంటున్నారు. నిజానిజాలు మాకు తెలియవు. పాలనాదక్షులుగా, అధికారుల పట్ల చండశాసనుడిగా పేరున్న బాబుగారికే తెలియాలి. అలాటి నివేదికలు వెళ్లకపోతే అధికారులదే తప్పు, బాబుగారిదేమీ కాదని మాకు తెలుసు. దాని గురించి మళ్లీ మీడియాలో లీకులవీ ఏమీ యివ్వనక్కరలేదు. ఆ అధికారులను బెదిరించడానికి ఒక్కటే మార్గం – 'తక్షణం విజయవాడ బదిలీ చేస్తాం, మీ యింటద్దె మీరే కట్టుకోవాలి' అని బెదిరిస్తే చాలు.

వీటన్నిటితో బాటు యింకొక్క చిన్న సూచన – యిలాటి సూచన చేసినందుకు టీవీ9 వారు మూఢనమ్మకాలు ప్రోత్సహిస్తున్నందుకు నన్ను మందలిస్తారని తెలుసు, అయినా ఆంధ్రరాష్ట్ర హితాన్ని కోరి చెప్తున్నమాట. అమరావతి శంకుస్థాపన ముహూర్తం సరిగ్గా పెట్టలేదేమో, అందువల్లనే డబ్బులు రాక పని ముందుకు సాగటం లేదనే సందేహం మనసులో మెదులుతోంది. ఎవరైనా తెలిసున్నవారిని అడిగి చూసి, అవసరమైతే.. అవసరమైతేనే సుమా.. మళ్లీ యింకో శంకుస్థాపన.. మళ్లీ అదే పేరుతో పెడితే బాగుండదేమో – గతంలో భూమిపూజ అయిపోయింది, శంకుస్థాపన అయిపోయింది, యీసారి గణపతిపూజ లేక క్లిష్టకష్టనివారిణీపూజ లాటి పేరుతో యింకో భారీ మహోత్సవం నిర్వహిస్తే... మోదీ గారు యీసారి లంకెబిందెలు తెస్తారేమో!

ప్రశ్నలతో మొదలుపెట్టాను కాబట్టి చివరా ఒక ప్రశ్న – 'బాబు మా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారనే నమ్మకంతోనే పార్టీ మారాను' అంటూ చాలామంది మారారు, యింకా మారుతున్నారు. కేంద్రం యిలా ఎండగడుతూ వుంటే, జీతాలకే లేకుండా మాడ్చి చంపుతూ వుంటే బాబు వాటన్నిటినీ ఏవెట్టి చేస్తారు అభి–వృద్ధి!? **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2016)**

## మార్చి 05 వీక్లీకై ఎమ్బీయస్ : అభివృద్ధి కోసమే...

తెలంగాణ కానీయండి, ఆంధ్ర కానీయండి – ఫిరాయింపుదారులందరూ చెప్పేది ఒకే మాట. 'మేం మారేది పదవుల కోసం కాదు, మా నియోజకవర్గ అభివృద్ధి కోసమే..' అని. చేర్చుకునే పార్టీలు యీ మాటలను ఖండించటం లేదు. ఔనౌనంటున్నాయి. 'ఆయనకు తన నియోజకవర్గం గురించి అక్కర వుంది కాబట్టి చేరాడు, లేనివాళ్లు యింకా అవతలిపార్టీలోనే వున్నారు, కానీ వాళ్లకు కూడా యీ అవగాహన కలిగినపుడు ఎవరు అడ్డుపడినా ఆగకుండా గోడ దూకేసి మా దగ్గరకు వచ్చేస్తారు' అంటున్నారు. కాబట్టి ప్రతిపక్షాలలో వున్నవారి నియోజకవర్గాలలో అభివృద్ధి జరగటం లేదన్నమాట నూటికి నూరుపాళ్లు వాస్తవమే అనుకుని ఆ దిశగా ఆలోచన మొదలుపెట్టాలి.

కేంద్రం ఆంధ్రకు నిధులివ్వకపోతే మనకు ఆవేశం వస్తోంది – 'ఏం ఆంధ్ర రాష్ట్రం దేశంలో భాగం కాదా? మనకు న్యాయంగా రావలసిన వాటా మర్యాదగా యిచ్చేయకుండా దాచుకోవడమేమిటి? ఇచ్చిన కాస్త కూడా ఏదో ముష్టి వేసినట్లు యివ్వడమేమిటి? ఏం మనం పన్నులు కట్టడం లేదా? ఇంత పక్షపాతమేమిటి?' అని. మరి అదే లాజిక్ రాష్ట్రప్రభుత్వానికి అన్వయించినపుడు యిలాటి ప్రశ్నలే వస్తాయి. ప్రతిపక్ష సభ్యులు ఎన్నుకున్న నియోజకవర్గాలు పన్నులు కట్టడం లేదా? వాళ్లు రాష్ట్రంలో భాగం కాదా? అని. రాష్ట్రమన్నాక అన్ని చోట్లా అభివృద్ధి జరగాలి. కొన్ని చోట్లే చేయడమేమిటి? ఇదెక్కడి అన్యాయం? ఈ ముక్క ఆ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు నిలదీసి అడగాలా లేదా? ఆంధ్ర, తెలంగాణల్లో పాలన ప్రారంభమైన ఏడాదిన్నర తర్వాత పార్టీ మారుతున్నవారిని యీ ఏడాదిన్నర యీ ప్రభుత్వాన్ని నిలదీయలేదేమని అడగాలి. ఒక వేళ అడిగి వుంటే వాళ్లు ఏం జవాబు చెప్పారు? 'మీరు మా

పార్టీలో మారితేనే మీ నియోజకవర్గంలో అభివృద్ధి లేకపోతే లేదు' అనా? కొన్ని సందర్భాల్లో ఎమ్మెల్యే మాత్రమే ఫిరాయించి, ఎంపీ ఫిరాయించకపోతే ఏం చేస్తున్నారు? అభివృద్ధి జరుపుతున్నారా? ఆపేశారా? ఎంపీ ఫిరాయించి, ఎమ్మెల్యే ఫిరాయించకపోతే ఆ పార్లమెంటు స్థానం పరిధిలోని తక్కిన నియోజకవర్గాలను అభివృద్ధి చేసేసి, దీన్ని మాత్రం వదిలేస్తున్నారా? ఇప్పుడేదైనా పంట కాలువ తవ్వారనుకోండి, మధ్యలో ప్రతిపక్ష నియోజకవర్గం రాగానే ఆపేసి, కాస్త దూరం పోయాక అధికార నియోజకవర్గం రాగానే మళ్లీ అక్కణ్నుంచి తవ్వుతున్నారా? ఏమిటో అంతా కన్‌ఫ్యూజింగ్‌గా వుంది.

కొందరు వెలిగొండ ప్రాజెక్టు గురించి కోసం చేరామంటున్నారు, మరి కొందరు హంద్రీనీవా కోసం అంటున్నారు. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరానికే 100 కోట్లు విదిలిస్తే, యిక వీటికి ఏం నిధులు వస్తాయి? ఎప్పుడు కడతారు? రాష్ట్ర బజెట్‌లో తగినన్ని నిధులు కేటాయించకపోతే వీళ్లు వెనక్కి ఫిరాయిస్తారా? ఆ ప్రాజెక్టు వలన లాభపడే నియోజకవర్గాలు సగం వాటిలో అస్మదీయులు, సగం మంది తస్మదీయులు వుంటే ప్రభుత్వం ఏం చేస్తుంది? తస్మదీయులందరూ అస్మదీయులయ్యేదాకా వేచి చూస్తుందా?

ఇంకో మాట – ఇప్పటిదాకా జరిగిన అభివృద్ధి అధికారపార్టీని ఎన్నుకున్న నియోజకవర్గాల్లో జరిగిందని అనుకోవాలి. వాళ్లింకాయింకా జరుగుతుంది కదాని ఎదురు చూస్తూ వుంటే యిప్పుడు ఫిరాయింపుదార్ల నియోజకవర్గాలు కూడా వచ్చి జాబితాలో చేరితే వాళ్ల వాటా తగ్గిపోదూ? మంది ఎక్కువైతే మజ్జిగ పలచన. రైల్వే కంపార్టుమెంటాలిటీ అంటారు. కంపార్టుమెంటులో వున్న జనం కొత్తవాడెవడైనా వస్తానంటే ప్రతిఘటిస్తారు. ఇప్పటికే చోటు లేక ఛస్తున్నామండీ, కావాలంటే తర్వాతి ట్రైన్‌లో రండి అంటారు. తలుపులు తెరవరు, కిటికీలోంచి బ్యాగు తోస్తూ వుంటే నెట్టేస్తారు. చివరకు జబ్బబలం చూపించి కొందరు లోపలకి చొరబడతారు. తర్వాతి స్టేషన్ వచ్చేసరికి వీళ్లంతా ఏకమవుతారు. ఆ స్టేషన్‌లో ఎక్కబోయేవాళ్లను అడ్డుకుంటారు. అడ్డుకునేవాళ్లలో అందరి కంటె ముందువరుసలో వుండేవాడు, కితం స్టేషన్‌లో ఎక్కినవాడే! అలాగే ఇప్పటికే అభివృద్ధి అనుభవించేస్తున్న నియోజకవర్గాల ప్రతినిధులు కొత్తగా ఎవరైనా పార్టీలోకి ఫిరాయిస్తుంటే ప్రతిఘటిస్తారు. తిరుగుబాటు చేసేటంత ధైర్యం వుండకపోవచ్చు. కానీ పళ్లు నూరుకుంటూ వుంటారు. ఫిరాయింపులు ఎక్కువైన కొద్దీ ఒరిజినల్ అస్మదీయుల కేటాయింపుల్లో కోతలు పెరిగిపోతాయి.

ఈ మనస్పర్థలు తగ్గించడానికి నా సూచన ఏమిటంటే, ఎన్నికల మ్యానిఫెస్టోలోనే పార్టీలు క్లియర్‌గా చెప్పేయాలి – మమ్మల్ని ఎన్నుకున్న నియోజకవర్గాలలోనే అభివృద్ధి, తక్కినవాటికి గుండుసున్నాయే అని. ప్రభుత్వం ఏర్పడ్డాక ఫిరాయింపులు ఒప్పుకోం అని. దాని వలన ప్రజలకు చాలా లాభాలున్నాయి. ఎలాగో చెప్తాను చూడండి. ఉదాహరణకి నియోజకవర్గాల అభివృద్ధికై 180 వందల కోట్ల నిధులున్నాయనుకోండి. 180 నియోజకవర్గాలలోను ఒక పార్టీయే గెలిచిందంటే నియోజకవర్గానికి వంద కోట్లు వస్తాయి. దానికి బదులు ఏదైనా పార్టీకి 100 సీట్లు మాత్రమే యిచ్చి అధికారంలో కూర్చోబెడితే అప్పుడు నెగ్గించిన ఒక్కో నియోజకవర్గానికి 1.80 వంద కోట్లు వస్తాయి. అందరినీ అర్ధాకలితో మాడ్చి చంపేబదులు, 100 నియోజకవర్గాలలో ఐదేళ్లపాటు ఝామ్మని అభివృద్ధి సాగిపోతుంది. తర్వాతి టెర్మ్ వచ్చేసరికి వీళ్లు వెనక్కి తగ్గి తక్కిన నియోజకవర్గాలవాళ్లు అధికారపక్షాన్ని ఎన్నుకోవాలి.

సరే యిదంతా భవిష్యత్ ప్రణాళిక అనుకోండి. ప్రస్తుతానికి టిడిపి ఫిరాయింపులను ప్రోత్సహించడానికి కారణం 'గంటలో పడగొడతా' అని జగన్ విసిరిన ఛాలెంజే అని టిడిపి నాయకులంటున్నారు. జగన్ అలా అనడంతోనే బాబుకి రోషం వచ్చి తన తడాఖా చూపించడానికి యిలా చేస్తున్నారని, జగన్ వాచాలత్వానికి తగిన శిక్ష పడిందని మీడియా అంటోంది. ఇప్పుడు నాకు వచ్చిన సందేహం ఏమిటంటే – వైసిపి నుంచి పార్టీ మారినవారు నియోజకవర్గంలో అభివృద్ధి జరగటం లేదనే బాధతోనే పార్టీ ఫిరాయించామంటున్నారు. ఓకే. కానీ వాళ్లంతా జగన్ స్టేటుమెంటు యిచ్చేవరకూ ఆగారెందుకు? అని. జగన్ ఆ స్టేటుమెంటు యివ్వకపోతే అభివృద్ధి జరగకపోయినా నిమ్మకు నీరెత్తినట్లు కూర్చునేవారా? తాను ఆ స్టేటుమెంటు యివ్వలేదని, ఒక ప్రశ్నకు జవాబుగా 'నా వద్ద మెజారిటీ సభ్యులుంటే...' అంటూ క్వాలిఫై చేశానని జగన్ నాలుగు రోజులు పోయాక వివరణ యిచ్చారు. ఆయన ఆ ఆలస్యం చేయకుండా వెంటనే 'నేను అనలేదు' అని వుంటే వీళ్లేం చేసేవారు? ఏమిటో, అంతా గందరగోళంగా వుంది. ఓ ఏడాది పోయిన తర్వాత యీ ఫిరాయింపుదార్లు 'మా నియోజకవర్గం, ఫిరాయింపుకు ముందు– ఫిరాయింపుకు తర్వాత' అని గణాంకాల పట్టిక విడుదల చేస్తే మనకు స్పష్టత రావచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2016)**

**మార్చి 06 వీక్లీకై ఎమ్బీయస్ : ప్రభుత్వసంస్థ పేరుతో దోపిడీ – మలేసియా మార్గం**

మలేసియా ప్రధాని నజీబ్ తొలిసారి 2009లో ప్రధాని అయ్యాడు. వస్తూనే ఆర్థిక సంస్కరణలన్నాడు, దేశాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నానన్నాడు. స్థానికుల భాగస్వామ్యం విషయంలో నియమాలు సడలించి విదేశీయులను ఆకర్షించి వారి పెట్టుబడులు ఆహ్వానించాడు, దేశంలో సంక్షేమపథకాల్లో కోత పెట్టాడు. ఒబామాతో వ్యక్తిగత స్నేహం పెంచుకుని మలేసియా విదేశీవిధానాన్ని అమెరికాకు అనుకూలంగా మార్చేశాడు. అమెరికాకు సన్నిహితంగా వుండే సౌదీ అరేబియా నాయకులతో కూడా స్నేహం నెరపి వ్యాపారాలు పెట్టించాడు. విపరీతమైన అవినీతితో డబ్బు సంపాదించి, ఆ డబ్బు సాయంతో 2013లో మళ్లీ ఎన్నికైయ్యాడు. ఆ తర్వాత తన విధానాలను విమర్శిస్తున్న ప్రతిపక్ష నాయకులను దేశద్రోహం నేరంపై జైళ్లలో పెట్టించాడు. కానీ 1ఎండిబి అనే ప్రభుత్వసంస్థ ద్వారా అతను దేశాన్ని దోచేశాడని యిప్పుడు ప్రతిపక్షాలే కాక, అనేక స్వచ్ఛంద సంస్థలు కూడా ఎలుగెత్తి చాటుతున్నాయి.

అమెరికాలోని జస్టిస్ డిపార్ట్‌మెంటులో భాగంగా "క్లెప్టోక్రసీ ఇనీషియేటివ్" అనే సంస్థ నైజీరియా, ఈక్విటోరియల్ గినీ, దక్షిణ కొరియా, తైవాన్‌లలో పాలకులు అమెరికాతో ప్రత్యేక బంధాలు ఏర్పరచుకుని స్వదేశంలో అధికారదుర్వినియోగం చేసి తమ బంధువుల పేర ఎలా అక్రమాస్తులు కూడగట్టారో వెల్లడించింది. అవన్నీ అమెరికన్ మీడియాలో కథనాలుగా వెలువడ్డాయి. అదే సంస్థ నజీబ్ చేసిన ఆర్థిక నేరాలను కూడా బయటపెట్టింది. 1ఎండిబి నుండి 700 మిలియన్ డాలర్లు అమెరికాలోని బ్యాంకుల్లో నజీబ్ పేర వున్న ఖాతాల్లోకి వచ్చాయని వాల్ స్ట్రీట్ జర్నల్ రాసింది. నజీబ్ సవతి కొడుకు రిజా అజీజ్, అతని భార్య న్యూయార్క్ యితర నగరాలలో పెనాంగ్‌లో వుండే వ్యాపారస్తుడు, కుటుంబ స్నేహితుడు  ఝో లో ద్వారా సంపాదించిన విలువైన ఆస్తుల వివరాలూ అమెరికన్ పేపర్లలో వచ్చేశాయి. లావాదేవీలన్నీ షెల్ కంపెనీల ద్వారా జరిగాయి. ఆ షెల్ కంపెనీల్లోకి డబ్బు ప్రవహించినది – 1ఎండిబి నుండి! దానికి నిధులు వచ్చినది మలేసియా ప్రభుత్వం నుంచి! బ్రిటన్ నుండి వెలువడే "సండే టైమ్స్" రిజా అజీజ్‌కు ఝో లోకు మధ్య సాగిన ఈ మెయిల్స్ బయటపెట్టింది. 1ఎండిబికి, పెట్రోసౌదీ అనే ఆయిల్ వెలికితీత కంపెనీకి మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంలో 700 మిలియన్ డాలర్లు వీళ్లు కాజేశారని, బ్యాంకు ఆమోదం లేకుండానే ఝో లోకు నజీబ్ 1 బిలియన్ డాలర్ల అప్పు జారీ చేశాడని వాటిద్వారా తెలిసింది. ఇంతకీ యీ 1ఎండిబి ఏమిటి?

తెరెంగాను రాష్ట్రం తన ప్రాంతంలో దీర్ఘకాలిక పెట్టుబడులు ఆకర్షించడానికి తెరెంగాను ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ పేర ఒక సంస్థను 2008లో ఏర్పాటు చేసింది. 2009లో నజీబ్ ప్రధాని అవుతూనే దాని కార్యకలాపాలు దేశాని కంతటికీ అవసరం అంటూ దాని పేరు మార్చి 1ఎండిబిగా మార్చి తన చైర్మన్‌గిరీలో ప్రభుత్వాధీనంలో వుండే స్ట్రాటజిక్ డెవలప్‌మెంట్ కంపెనీగా తీర్చిదిద్దాడు. విదేశీ పెట్టుబడులు ఆకర్షించడం, విదేశీయులను భాగస్వాములుగా తీసుకుని మలేసియాలో పెద్దపెద్ద ప్రాజెక్టులు చేపట్టడం దాని లక్ష్యం అన్నాడు. తున్ రజాక్ ఎక్స్‌ఛేంజ్, బందర్ మలేసియా, భారీ విద్యుత్ ప్రాజెక్టులు వంటివి మొదలుపెట్టారు. తున్ రజాక్ ప్రాజెక్టు మొదలుపెట్టిన ఏడాదిలోగానే వివాదాలు చుట్టుముట్టాయి. "ఆ కంపెనీకి అడ్రసూ లేదు, ఆడిటరూ లేదు" అని అన్వర్ ఇబ్రహీం అనే ప్రతిపక్ష నాయకుడు ఆరోపించాడు. ఆ కంపెనీకి ఆర్నెల్లలోనే విపరీతంగా లాభం వచ్చిందని ప్రకటించడంతో అందరూ ప్రశ్నించసాగారు. తర్వాత తేలిందేమిటంటే ప్రభుత్వాస్తులను ఆ కంపెనీకి బదిలీ చేసి లాభాలు చూపించారు. తర్వాతి రోజుల్లో నిధులు తోడేశారు. విమర్శలు రావడంతో 2010 నాటి బాలన్స్ షీటుపై కెపిఎంజి ఆడిటింగ్ సంస్థ చేత సంతకం చేయించారు. 2013 నాటి బాలన్స్‌షీటు దాఖలు చేయడానికి ఆర్నెల్లు ఎక్కువ గడువు అడగడంతో మళ్లీ అనుమానాలు వచ్చాయి. పైగా యీ మధ్యలో ముగ్గురు ఆడిటర్లు మారారు. చివరకు ఆ సంస్థ ద్వారా ప్రభుత్వధనం పిండేసి, చివరకు దాన్నీ పీల్చి పిప్పి చేశాడు నజీబ్. ఉదాహరణకి గెంటింగ్ అనే కంపెనీకి చెందిన పవర్ ప్రాజెక్టులను 1ఎండిబి మార్కెట్ కంటె ఎంతో ఎక్కువ ధర పెట్టి కొంది. ఆ విధంగా సంపాదించిన డబ్బును గెంటింగ్ కంపెనీ నజీబ్ నడిపే ఫౌండేషన్లకు విరాళంగా యిచ్చింది. 2013 ఎన్నికలలో నజీబ్ ఎన్నికల ఖర్చును యీ ఫౌండేషనే భరించింది. ప్రస్తుతానికి 1ఎండిబికి 42 బిలియన్ల అప్పుందని, అది జారీ చేసిన బాండ్లకు చిత్తుకాగితం కంటె ఎక్కువ విలువ లేదనీ ఒప్పుకోవలసి వచ్చింది.

నజీబ్ అవినీతి వలన, సంస్కరణ ఆర్థికవిధానాల వలన దేశంలో జీవన వ్యయం పెరిగింది. మలేసియా కరెన్సీ విలువ పడిపోయింది. సామాన్యులు గగ్గోలు పెట్టసాగారు. ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. తనపై అవినీతి ఆరోపణలకు నజీబ్ ఎలా స్పందించాడంటే – నిష్పక్షపాతమైన విచారణ జరిపిస్తామని హామీ యిచ్చిన ఉపప్రధాని ముహ్యుద్దీన్ యాసిన్‌ని మార్చేశాడు. ఆరోపణలు ప్రచురించిన రెండు న్యూస్ పేపర్లను మూణ్నెల్లపాటు మూయించేశాడు. దానికి గాను పార్లమెంటు చేత 'నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ బిల్' అనే పేర బిల్లు పాస్ చేయించి ఏ పత్రికనైనా మూసేసే అధికారం తనకు కట్టబెట్టుకున్నాడు. వ్యవహారాలను బయటపెట్టిన విజిల్‌బ్లోయర్స్‌ను అరెస్టు చేయించాడు. విచారణ ప్రారంభించిన అటార్నీ జనరల్ అబ్దుల్ గనీ పటైల్‌ను తీసేసి అతని స్థానంలో మహమ్మద్ అపాండీని నియమించాడు. 1ఎండిబి ఫారిన్ ఎక్స్‌ఛేంజ్ రూల్సును అతిక్రమిస్తోందని, దానిపై కేసు పెట్టాలని మలేసియా సెంట్రల్ బ్యాంకు గత ఏడాది ప్రతిపాదిస్తే ఈ అపాండీ ఆ ప్రతిపాదనను బుట్టదాఖలు చేశాడు.  నజీబ్‌పై గబగబా విచారణ ముగించి, క్లీన్‌చిట్ యిచ్చేశాడు. తను విచారణ చేసేశాడు కాబట్టి ప్రధానికి నిధులు ఎక్కణ్నుంచి వచ్చాయో తెలుసుకోవడానికి ఏంటీ కరప్షన్ కమిషన్ వారు చేపట్టిన విచారణ ఆపివేయాలని తీర్పు యిచ్చాడు. నజీబ్ వ్యక్తిగత ఖాతాల్లో వున్న 700 మిలియన్ డాలర్లలో 681 మిలియన్ డాలర్లు సౌదీ రాజకుటుంబం వ్యక్తిగతంగా యిచ్చిన విరాళమని, దానిలో 620 మిలియన్ డాలర్లు నజీబ్ వెనక్కి యిచ్చేశాడని తనకు నమ్మకం కుదిరిందన్నాడు. (2013 ఎన్నికలలో గెలవడానికి సౌదీ కుటుంబం విరాళం యిచ్చిందనుకున్నా మలేసియా రాజ్యాంగం ప్రకారం అది చట్టవిరుద్ధం) విరాళం ఎందుకిచ్చారో, మళ్లీ దాన్ని వెనక్కి ఎందుకిచ్చారో, పూర్తిగా వెనక్కి యివ్వకుండా కాస్త ఎందుకు మిగుల్చుకున్నారో అపాండీ వివరించలేదు. అంత భూరివిరాళం యిచ్చిన ఉదారుడెవరో పేరు చెప్పలేదు. తలమునకలా అప్పులో కూరుకుపోయిన 1ఎండిబి 10 మిలియన్ డాలర్లు నజీబ్ ఖాతాలో ఎందుకు వేసిందో అదీ చెప్పలేదు.

అపాండీ కాండక్ట్ సర్టిఫికెట్టు యిచ్చి అమ్మయ్య అనుకుంటూండగానే స్విస్ ప్రభుత్వపు అటార్నీ జనరల్ "1ఎండిబి ద్వారా 4 బిలియన్ డాలర్ల డబ్బు గోల్‌మాల్ జరిగింది. మలేసియా ప్రభుత్వ సంస్థ నిధులు మలేసియన్ పౌరుల ఖాతాల్లోకి, యుఎఇ (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్) పౌరుల ఖాతాల్లోకి వెళ్లిపోయాయి. మా దేశపు బ్యాంకుల ద్వారా జరిగిన అక్రమ, చట్టవిరుద్ధ లావాదేవీల గురించిన రహస్య సమాచారం మలేసియా ప్రభుత్వానికి పంపుతాం." అంది. కానీ అప్పటికే మలేసియా ప్రభుత్వం అపాండీ రిపోర్టు ఆధారంగా

700 మిలియన్ డాలర్ల విరాళం గురించిన ఫైలు మూసేయదలచింది. అందువలన స్విస్‌తో సహకరించడానికి ఆసక్తి చూపటం లేదు. డబ్బు పోగొట్టుకున్న మలేసియన్ ప్రభుత్వ సంస్థలేవీ ఫిర్యాదు చేయటం లేదు. ఈలోగా సింగపూరు ప్రభుత్వం 1ఎండిబికి, నజీబ్‌కు తమ దేశంలో వున్న ఖాతాలపై విచారణ ప్రారంభించి అనేక అక్రమ లావాదేవీలు కనుగొంది. అపాండీ సర్టిఫికెట్టుతో తమకు పని లేదని, విచారణ కొనసాగిస్తామని అంటోంది. హాంగ్‌కాంగ్ కూడా అదే బాటలో వుంది. ఇవి చాలనట్లు సౌదీ అధికారులు 'మా దేశం మలేసియా ప్రభుత్వానికి కాని, వ్యక్తులకు కాని రాజకీయ విరాళాలు కాని, ఋణాలు కానీ యివ్వలేదు' అని ప్రకటించారు. సౌదీ విదేశాంగ మంత్రి 'నజీబ్ ఖాతాలోకి వచ్చిందంటున్న డబ్బు ఎవరైనా సౌదీ పౌరుడు వ్యాపారపరమైన పెట్టుబడిగా పెట్టి వుండవచ్చు' అని చెప్పి తప్పించుకున్నాడు.

వీటన్నిటితో మలేసియా ప్రతిపక్షాలకు నైతికబలం చేకూరింది. వాళ్లు తమ స్వరం మరింత పెంచారు. గతంలో ప్రధానిగా పని చేసిన మహతీర్ మొహమ్మద్, అతని కుమారుడు కేడా రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన ముఖ్రీజ్ మహతీర్ ఆందోళన చేపట్టారు. నజీబ్ వెంటనే ముఖ్రీజ్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించి వేశాడు. అటార్నీ జనరల్‌ను అడ్డుపెట్టుకుని నజీబ్ ఎలాటి విమర్శలు వచ్చినా పట్టించుకోకుండా ముందుకు సాగుతున్నాడు. ఈ ఉదంతంద్వారా నేర్చుకోవలసినదేమిటంటే ప్రభుత్వసంస్థ ద్వారా కార్యకలాపాలు జరుగుతున్నాయి కాబట్టి అంతా సవ్యమే అనుకోరాదు. తమ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి వాటిని అడ్డం పెట్టుకుంటున్నారు పాలకులు. గమనించవలసిన మరొక విషయం ఏమిటంటే – విదేశీ పెట్టుబడులతో త్వరితంగా అభివృద్ధి సాధిస్తాం అనే పాలకులందరిలో అవినీతి అంశ తప్పకుండా కనబడుతోంది. స్వదేశీ వనరులను ఎందుకు ప్రోత్సహించకూడదు అని వాదించేవారిని 'అభివృద్ధికి అడ్డుపడుతున్నారు' అని ముద్ర కొట్టి బద్నామ్ చేయడమూ, అవినీతిపై ప్రజలకు అవగాహన పెంచే మీడియాను మూసేయించడానికి ప్రయత్నం చేయడమూ కనబడుతోంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2016)**

## మార్చి 09 ఎమ్బీయస్ : అవినీతి ఆరోపణలపై స్పందన

అమరావతి చుట్టూ భూములపై ''సాక్షి'' పత్రిక చేసిన అవినీతి ఆరోపణలపై బాబు స్పందనలో రెండు, మూడు అంశాలు నాకు వింతగా తోచాయి. దేశంలోనే కాదు, ప్రపంచంలో ఎక్కడైనా సరే పాలనా వ్యవహారాల్లో అవినీతి జరగడమూ, దానిపై ప్రతిపక్షనాయకులు ఆరోపణలు చేయడమూ, పాలకపక్షం వాటిని తిప్పికొట్టడమూ జరుగుతూనే వుంటుంది. మొదట్లో ఆసక్తిగా చదివినా, పోనుపోను యివి బోరు కొట్టేస్తాయి. జరిగిన అవినీతికి పది రెట్లు ఆరోపణలు వస్తాయి, ఒక్కోప్పుడు నిప్పు లేనిదే పొగ కూడా పుట్టిస్తారు. ప్రతిపక్షాలో, మీడియాయో బోల్డు హంగామా చేస్తుంది. చేతనైతే ఆధారాలు చూపమని పాలకులు ఛాలెంజ్ చేస్తారు. డివి నరసరాజు గారు చమత్కరించేవారు – 'ఆ ఛాలెంజ్‌లో అంతరార్థం ఏమిటంటే, ఆధారం దొరక్కుండా అవినీతి చేశాను, చూస్కో' అనిట. ఆరోపణలు చేసినవారు 'బోల్డు ఆధారాలున్నాయి, సరైన సమయంలో బయటపెడతాం, ముందు సిట్టింగ్ జడ్జిచేత విచారణ జరిపించండి (ఇప్పటికే కోర్టుల్లో కేసులు పెండింగు, యిక జడ్జిలకు యివి కూడా అప్పగిస్తే ఎలా?) సిబిఐకు అప్పగిస్తే నిజాలన్నీ బయటకు వస్తాయి' అంటారు. ప్రభుత్వం శ్వేతపత్రం ప్రచురించాలి అంటారు. తప్పు చేసినవాడికి భయం వుంటుంది, మాకెందుకు భయం? అంటారు పాలకులు. ఇలా కొన్నాళ్లు గడిచేసరికి యింకో ఆరోపణ వస్తుంది, దీని విషయం మర్చిపోతారు.

సామాన్యుడికి అర్థంకాని విషయమేమిటంటే – యిన్ని ఆధారాలున్నపుడు కోర్టుకి ఎందుకు వెళ్లకూడదు? అని. పత్రికల్లో ఏవేవో డాక్యుమెంట్లు చీమతలకాయంత అక్షరాలతో ఫోటోలు వేస్తారు, వాటి పూర్వాపరాలు తెలియవు. ఆరోపణలకు గురైన వారు 'ఈ ఆస్తులు నావని నిరూపిస్తే రాసి యిచ్చేస్తా' అంటారు. ఆస్తులు వాళ్ల పేర కాక బినామీల పేర వున్నాయని ఆరోపించినవారంటారు. ఫలానావాళ్లు మీ బినామీ అంటారు. అవునని వాళ్లు ఒప్పుకోరు. కాదంటే వీళ్లు ఒప్పుకోరు. ఇది ఎప్పటికీ తేలదు. కోర్టుకి వెళతామని అనేవారే తప్ప వెళ్లేవాళ్లుండరు. ఎవరైనా వెళ్లినా మధ్యలో కేసు విరమించుకుంటారు. ఇరుపక్షాలూ రాజీ పడ్డాయేమో మనకు అర్థం కాదు. నిజం ఎప్పటికీ వెలుగులోకి రాదు. కానీ మధ్యమధ్యలో పాత ఆరోపణలను గుర్తు చేస్తూంటారు తప్ప లాజికల్ ఎండ్‌కు తీసుకురారు. చాలా ఏళ్లగా చాలా మంది గురించి యిలాటివి వినివిని చలించడం మానేయడానికి కారణం యిది. స్వతంత్రం వచ్చి యిన్నేళ్లయింది కదా, ఎంతో అవినీతి జరిగి వుంటుంది కదా, కానీ అవినీతి ఆరోపణలపై జైలుకి వెళ్లిన నాయకులు పట్టుమని పదిమంది కూడా వుండరు. పదవి పోగొట్టుకున్నవారున్నారు కానీ అది శిక్ష కాదు కదా. అవినీతిపరుడు ఎలాగోలా ఎన్నికల్లో నెగ్గాడంటే 'ప్రజాకోర్టు నన్ను నిర్దోషిగా తీర్పు యిచ్చింది' అని క్లెయిమ్ చేస్తాడు. అంటే వీరెవరూ ఆధారాలు దొరక్కుండా అవినీతి చేస్తున్నారని అనుకోవాలి. లేదా తమ చేతికి మట్టి కాకుండా అధికారులనో, అసిస్టెంట్లనో యిరికిస్తున్నారనుకోవాలి.

అవినీతి కేసుల్లో వీళ్లు బయటపడే విధానం గురించి నేను గమనించిన ఒక ధోరణి చెప్తాను. ఒక లక్ష రూపాయల గోల్‌మాల్ జరిగిందనుకోండి, పది లక్షలకు జరిగిందని పోలీసులు కేసు పెడతారు. దాన్ని కోర్టులో నిరూపించలేకపోతారు. కేసు కొట్టేస్తారు. చూశారా, మేం స్వచ్ఛంగా బయటకు వచ్చాం, మాపై ఉత్తుత్తి ఆరోపణలు చేశారు అని వీళ్లు చెప్పుకుంటారు. అవినీతి కేసుల్లో అనే కాదు, రకరకాల నేరాలు జరిగినప్పుడు పోలీసులు ఎవరినైతే రక్షించదలచారా వారి కోసం యీ ట్రిక్కు వుపయోగిస్తారు. ఈ మధ్యే ఒక జడ్జి రాశారు – ఒక హత్య కేసులో ముద్దాయికి వ్యతిరేకంగా అనేక ఆధారాలున్నాయట, అయినా పోలీసులు కేసు మరింత

పకడ్బందీగా చేస్తున్నాం అంటూ ఉత్తరం ఒకటి అనవసరంగా సృష్టించారట. డిఫెన్సు వాళ్లు అది ఫోర్జరీ అని నిరూపించి కేసు కొట్టేయించుకున్నారట. రావెల సుశీల్ తనను యీవ్-టీజ్ చేశాడని ఒకామె టీవీలో కనబడి చెప్పింది. దానికేదో సెక్షన్ వుంటుంది కదా, అది కాకుండా 'నిర్భయ' చట్టం కింద కేసు పెట్టడం దేనికి? ఇది కోర్టులో నిరూపించలేరు, అతను బయటకు వచ్చేస్తాడు. ఇలాటి 'అదనపు' సాక్ష్యాలు చేర్చమని, తప్పుడు సెక్షన్లతో కేసులు పెట్టమని పోలీసులకు ఆదేశాలెవరిస్తారు అన్నదే అసలు ప్రశ్న. ఉదాహరణకి పిల్లిని చంపితే పిల్లిని చంపారనే కేసు పెట్టాలి కానీ 'పులి అని పెడదామండి, వన్యప్రాణి రక్షణ చట్టం కింద జైల్లోకి తోయిస్తే పదేళ్లదాకా బయటకు రాడు' అంటూ కేసు అనవసరంగా పెద్దది చేస్తారు. చివరకు యితనికి తుపాకీ పట్టుకోవడమే రాదు అని డిఫెన్సువారు రుజువు చేస్తారు, కేసు ఎగిరిపోతుంది. పిల్లిని చంపినదానికి మళ్లీ కేసు పెట్టరు.

వైయస్ హయాంలో రోజుకో అవినీతి ఆరోపణతో మీడియా దద్దరిల్లింది. వాటిలో ఎన్ని విచారణ దశకు వచ్చాయి, ఎన్ని నిరూపణ అయ్యాయి, వాటి స్టేటస్ ఏమిటో ఎవరైనా రిసెర్చి స్టూడెంటు పట్టిక వేసి చూపితే ఎంతో బాగుంటుంది. అంతకుముందు చంద్రబాబుపై కూడా అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి, వాటివీ అజాపజా తెలియదు. వైయస్ కోర్టులో కేసు వేసి, ఏం బేరం కుదిరిందో ఏమో విత్‌డ్రా చేసేశారు. మళ్లీ యింకోళ్లు వేయవచ్చు కదా, వేయలేదు. దాని జాబితా కూడా ఎవరైనా వేయాలి. ఎన్టీయార్ పైనా వేసిన కేసు సుప్రీం కోర్టులో వుండాలి, ఏమైందో తెలియదు. ఇప్పుడు అమరావతి ఆరోపణల గతీ యింతే అవుతుంది. రెండు మూడేళ్లు పోయేసరికి మొత్తమంతా గప్‌చుప్. సాక్షిలో వచ్చిన ఆధారాలు నిజమైనవైతే వైసిపి కోర్టుకి వెళ్లాలి, కడదాకా పోరాడాలి, ఇవి అబద్ధపు ఆరోపణలు, పరువునష్టం దావా వేస్తాం అంటున్న టిడిపి నాయకులు నిజంగా కేసులు వేయాలి. కానీ యివేమీ జరిగేదాకా నమ్మకం లేదు. న్యాయకోవిదులను సంప్రదిస్తున్నాం, వేయబోతున్నాం, వేసేశాం.. అని రెండు మూడు రోజులు పేపర్లో వార్తలు రాయించుకుంటారు, అంతటితో సరి. ఎవరికీ చిత్తశుద్ధి లేదు. స్కాముల్లో యిరుక్కున్నవాళ్లు తమ పార్టీలోకి ఫిరాయిస్తే, మళ్లీ నోరెత్తరు. కేసుల విషయం ఏమైంది అని ఎవరైనా అడిగితే సాక్షులను భయపెడుతున్నారు, అయినా పట్టుదలతో వున్నాం అంటూంటారు. ప్రజలు మాకు అవకాశం యిస్తే అధికారంలోకి వచ్చి అవినీతి సొమ్ము రాబట్టి, అందరికీ పంచుతాం అంటారు.

ఇప్పుడు అమరావతి భూములపై సాక్షి ఉధృతంగా విరుచుకుపడింది. అమరావతి చుట్టూ అనేకమంది నాయకులు భూములు కొన్నారన్నది బహిరంగరహస్యం. అన్ని ప్రాంతాల (తెలంగాణ జిల్లాలతో సహా) నాయకులే కాదు, ధనికులే కాదు, మధ్యతరగతివారు కూడా అప్పులు చేసి కొన్నారు. గత యిరవై ఏళ్లగా అనుకోవచ్చు – తెలుగునాట ఉపద్రవంగా జరుగుతున్న వ్యాపారం ఏమిటయ్యా అంటే రియల్ ఎస్టేటే! స్థలాలు కొనడం, అమ్మడం మధ్యలో లాభపడడం! చేతిలో డబ్బుంటే యిదివరకు వ్యవసాయం చేసేవారు, వ్యాపారం చేసేవారు, పరిశ్రమలు పెట్టేవారు. ఇరవై ఏళ్లగా అలా చేసేవారిని చూసి నవ్వేవారు తయారయ్యారు. ఎక్కడో అక్కడ స్థలం కొనిపడేస్తారు. గవర్నమెంటు అక్కడ ఆ ప్రాజెక్టు వస్తోంది, యీ ప్రాజెక్టు వస్తోందని డప్పు కొడుతుంది. అది చూసి జనాలు వీళ్ల దగ్గర ఎగబడి కొనేస్తారు. కాలు మీద కాలేసుకుని కూచుంటే కట్టలకు కట్టలు డబ్బు వచ్చిపడింది. దీనిలో తెలివితేటలతో పని లేదు. తెగింపు, కాస్త అదృష్టం వుంటే చాలు. ఇలా డబ్బు సులభంగా సంపాదించవచ్చని తెలుసుకున్నాక అందరూ దీనిమీదే పడ్డారు. అందువలన వ్యవసాయం, వ్యాపారం, పరిశ్రమలూ అన్నీ మూతపడ్డాయి.

తెలంగాణ ఉద్యమం వూపందుకునేవరకూ హైదరాబాదుపై పడ్డారు. ఎక్కడెక్కడి భూములూ కొనిపడేశారు, అమ్మిపడేశారు, మళ్లీ కొనేశారు, మధ్యలో వచ్చిన లాభాలతో సినిమాలు తీశారు, పోగొట్టుకున్నారు, మళ్లీ తీశారు. ఈ రంగులరాట్నం తిరుగుతూ తిరుగుతూ కెసియార్ కరీంనగర్‌లో గెలవడంతో ఒక్కసారి స్తంభించింది. రాష్ట్రవిభజనపై కేంద్రం ఎటూ తేల్చకుండా నాన్చడంతో హైదరాబాదు భవిష్యత్తు గురించి సందేహాలు వచ్చాయి. ఎప్పుడైనా, ఎక్కడైనా ఊళ్లో స్థలాల రేట్లు ఒక సాధారణ వేగంతో పెరుగుతూ వుంటాయి. కానీ హైదరాబాదు విషయంలో ఆ ధరలు షేరు మార్కెట్‌లో బుల్‌లా అయిపోయింది. ఆ పరుగు ఒక్కసారిగా ఆగిపోయింది. ఆ బుల్ మళ్లీ పరుగు పెడుతుందా, పడిపోయిన రేట్లు తిరిగి వస్తాయా అని ఎవరికీ తెలియకుండా పోయింది. స్థలం సొంతదారులు నష్టానికి (అంటే వాళ్లు అంచనా వేసిన రేటు కంటె తక్కువ రేటుకి) అమ్మడానికి యిష్టపడలేదు, కొనేవాళ్లు రేటు యింకా తగ్గుతుందని ఆగారు. దాంతో భూమి రిజిస్ట్రేషన్ లావాదేవీలు, నిర్మాణరంగం అన్నీ నిలిచిపోయాయి.

ఇలా కొన్నేళ్లు గడిచేసరికి భూమి కొనడం, అమ్మడం తప్ప వేరే ఏదీ చేతకానివాళ్లు ఖాళీగా వుండలేకపోయారు. రాష్ట్రం విడిపోతుందని, కొత్త రాజధాని విజయవాడ-గుంటూరు మధ్య వెలుస్తుందని ఊహించనారంభించి కొనుగోళ్లు ప్రారంభించారు. పేపర్లలో వార్తలు రాయించారు. అబ్బే కాదు, అక్కడకాదు వైజాగ్‌లో అన్నారు. అలాటివి కొన్నాళ్లు సాగి మళ్లీ ఆగింది. చివరకు విభజన తథ్యం అన్నాక ఒంగోలు వద్ద రాజధాని అని పుకారు వచ్చింది. అక్కడ విరగబడి కొనేశారు. విభజన ప్రకటన వచ్చాక, ఆంధ్రలో బాబు అధికారంలోకి తప్పకుండా వస్తారని, ఆయన వస్తే ఆయన మద్దతుదారులున్న విజయవాడ, గుంటూరు మధ్యలోనే రాజధాని పెడతారని ఊహాగానాలు బలంగా వినవచ్చాయి. అక్కడా కొనేశారు. చివరకు రాష్ట్రం విడిపోయింది. అందరూ అనుకున్నట్టే శివరామకృష్ణన్ కమిటీ సిఫార్సులు బేఖాతరు చేసి బాబు అక్కడే రాజధాని పెట్టేశారు. నూజివీడు, మంగళగిరి అని అక్కడక్కడే తిరుగుతూంటే అక్కడా కొనేశారు. చివరకు తుళ్లూరు దగ్గర అని తేల్చారు. తక్కిన చోట కొన్నవాళ్లందరూ ఘొల్లుమన్నారు.

రాజధాని అనగానే మరో హైదరాబాదు అవుతుందని అందరూ అనుకున్నారు. అంటే ప్రభుత్వం కొన్ని బిల్డింగులు కడుతుందంతే, తక్కినదంతా హైదరాబాదులాగానే ప్రయివేటు యిన్వెస్ట్‌మెంటు వుంటుంది. అక్కడ మనం బిజినెస్ కాంప్లెక్సులు, రెసిడెన్షియల్

కాంప్లెక్సులు కట్టేస్తే బోల్డంత సంపాదించుకోవచ్చు అనుకున్నారు. తీరా చూస్తే బాబు వేరేలా ప్లాను చేశారు. ప్రభుత్వమే 50 వేల ఎకరాల భూమి తీసుకుని దానిలో అన్ని బిల్డింగులూ తామే కట్టిస్తామన్నారు. ప్రభుత్వానికి భూమి అప్పగించమనేసరికి దుఃఖం వచ్చింది. కొత్తగా యీ మధ్య కొన్నవాళ్ల దగ్గర్నుంచే కాదు, రైతుల దగ్గర్నుంచి కూడా భూమి తీసుకుని ఏవేవో వాగ్దానాలు కురిపించారు. అవి ఎంతవరకు నెరవేరతాయో తెలియదు. రాజధాని నిర్మాణం ఆలస్యమౌతోంది. కేంద్రం కనికరించటం లేదు. 2019లోపున పూర్తి కాకపోతే ఎప్పటికవుతుందో, వచ్చే ప్రభుత్వం ఎవరిదో, ఏ మేరకు హామీలు నిలబెట్టుకుంటుందో ఏమీ తెలియని అయోమయ పరిస్థితి. ఇలా రాజధాని ప్రాంతంలో భూములు సమర్పించుకున్నవాళ్లు అయోమయ పరిస్థితిలో పడ్డారు. రాజధాని సరిహద్దు రేఖలు గీసినపుడు దాని బయట వుండి భూములు బచాయించుకున్నవారిని చూసి అసూయ పడుతున్నారు.

ఈ విషయాలన్నీ అందరికీ తెలిసినవే. ఇప్పుడు "సాక్షి" కొత్తగా చెప్పినదేమిటి? టిడిపి నాయకులు, వారి బినామీలు కీలకమైన స్థలాలు కొనుక్కుని సరిహద్దులను తమకు అనుకూలంగా గీయించుకుని, లబ్ధి పొందుతున్నారని! కొన్నవారు టిడిపి వారు మాత్రమే అంటే సాక్షిని ఏకాక్షి అనాలి. కొన్నవారిలో వైకాపావారే కాదు, కాంగ్రెసు వారు కాదు, కమ్యూనిస్టులు కూడా వుండి వుంటారు. ఏ పార్టీకి చెందనివాళ్లూ వున్నారు. ఎఫెక్టు కోసం కొందరు వైకాపావాళ్ల పేర్లు కూడా వేసి వుంటే, తర్వాత వారు టిడిపిలోకి మారినప్పుడు నిందించడానికి వీలుగా వుండేది. నేటి వైకాపావారే, రేపటి టిడిపివారనేది యీనాటి నానుడి. ఇప్పుడు సర్వే నెంబర్లు అవీ వల్లించి, ఏదో కొత్తగా కనిపెట్టినట్లు హంగామా చేసింది సాక్షి పత్రిక. 'అవును కొన్నాం, తప్పేముంది' అని కొందరు టిడిపి నాయకులు ప్రకటించి దులిపేసుకున్నారు. కొన్ని భూముల విషయంలో మాత్రమే యిలా జరిగింది. బినామీల ద్వారా కొన్నారు అని ఆరోపించినపుడు వాళ్లు బినామీలని ఎందుకు అంటున్నారో సాక్షి చెప్పి వుండాల్సింది, కనీసం ఎవరి పేర వుందో వాళ్లయినా 'నేను ఎవరికీ బినామీ కాదు, నా సొంత ధనంతో కొన్నాను. ఇదిగో నా సోర్సెస్ యివి. నాది మినిస్టర్‌గారి కొడుకు పిఏ ఉద్యోగమే కావచ్చు కానీ కానీ ఫలానా గుఱ్ఱప్పందంలో యింత గెలిచాను, లేదా మా పూర్వీకుల ఆస్తి ఫలానా తారీకులో కొన్నాను' అని ప్రకటించి వుంటే సాక్షి నోరు మూతపడేది. ప్రభుత్వమైనా సర్వే నెంబర్ల వారీగా భూమి ఎవరి పేర వుందో ప్రకటించి వారి పూర్తి వివరాలు యిస్తే బినామీలో కాదో కనీసం ఆ వూళ్లో వాళ్లకు తెలుస్తుంది. అనేక కంపెనీలలో డైరక్టర్లుగా, మేజర్ వాటాదార్లుగా  కారు డ్రైవర్లు, అటెండర్లు వుంటారు. ఉన్న విషయం వాళ్లకూ తెలియదు. అడిగితే కాగితాలపై సంతకం పెట్టమంటే పెట్టామని చెప్తారు.

ఇంత సులభమైన మార్గం వదిలేసి, బాబు ఆరోపణల ఖండన మొదలుపెట్టారు. దానిలో కొత్త పుంతలు తొక్కారు. ఇలాటి ఆరోపణల వలన అమరావతి పరువు పోతోందన్నారు. తను కష్టపడి విదేశాల నుంచి పెట్టుబడులు తెస్తూ వుంటే యిలాటి బాధ్యతారహితమైన రాతల వలన పెట్టుబడులు వెనక్కి పోతాయని, ప్రజలకు నష్టమని వాపోయారు. అవినీతి ఆరోపణలు రుజువైతే పరువు పోయేది టిడిపికి, వారు నడిపే ప్రస్తుత ఆంధ్ర ప్రభుత్వానికి తప్ప యావత్తు ఆంధ్రకు కాదు. ఈ పాయింటు ఆయనెందుకోగాని గ్రహించటం లేదు. గతంలో ఓటు-నోటు కేసులో రేవంత్ రెడ్డి పట్టుబడినపుడు కెసియార్ ఆంధ్రులందరినీ అవమానించారన్నాడు, అక్కడికి ఆంధ్రులందరూ నేరం చేస్తూ వీడియోలో పట్టుబడినట్లు! తన ఫోన్ ట్యాప్ చేస్తే ఆంధ్రులందరికీ ద్రోహం చేసినట్లే అన్నాడు. ఇప్పుడు ఏం మాయ చేశారో, ఏం బేరం కుదిరిందో కాని సద్దు మణిగినట్లు కనబడింది. మరి ఆంధ్రుల పోయిన ప్రతిష్ఠ తిరిగి వచ్చినట్లేనా? వైయస్ అవినీతిపరుడు అని ఆరోపణలు చేస్తే, జలయజ్ఞం ధనయజ్ఞంగా మారిందని గోల చేస్తే తెలుగువారందరి పరువు పోయినట్లేనా? ఆ కారణంగా విదేశీ పెట్టుబడులు ఆగిపోయాయా? విదేశీయులు నొచ్చుకుంటారని, నిధులు తేవడానికి వెనకాడతారని నిజాలు వెల్లడించకూడదా? అవినీతి జరిగిందన్న అనుమానం వుంటే వ్యక్తపరచకూడదా? ఇదెలా వుందంటే తిరుగుబోతు భర్తపై భార్య తిరగబడి, అరిస్తే 'చుట్టుపక్కలవాళ్లల్లో నా పరువు పోతుంది, నోరుమూసుకుని పడి వుండు' అని దబాయించినట్లుంది. ఇప్పుడు గుడ్డకాల్చి మొహం మీద పడేస్తే మేం తుడుచుకోవాలా? అని అడుగుతున్న బాబు మొన్నటిదాకా ప్రతిపక్షంలో వున్నపుడు అవినీతి ఆరోపణలు చేయకుండా వున్నారా? 'అరే, నేను వాటిని ఎత్తిచూపితే పెట్టుబడులు రావు, అంతిమంగా తెలుగువారికే కదా నష్టం' అని తమాయించుకున్నారా?

ఇక్కడ యింకో తమాషా ఐన విషయమేమిటంటే – 'అమరావతికి పెట్టుబడులు రావు' అంటున్నారు. అసలు అమరావతి ఏమిటి? ఆంధ్రకు రాజధాని. రాజధానికి విదేశీ పెట్టుబడులేమిటి? కొత్త భువనేశ్వర్, కొత్త రాయపూర్, గాంధీనగర్.. వీటిల్లో ఏమున్నాయి? రాజధాని అంటే అధికారిక భవంతులు కట్టుకోవడం అనే గ్రహింపు వుంటే వాటిని కట్టడానికి ఎవర్నీ ఆకర్షించనక్కరలేదు. కానీ దానిలో కమ్మర్షియల్ కాంప్లెక్సులు కట్టాలని, అది కూడా ప్రభుత్వమే కట్టించాలనీ అనుకోవడమే యిన్ని చిక్కులు తెస్తోంది. ఇంత హంగామా వలన సాధారణ రాజధాని కూడా అమరకుండా పోతోంది. పెట్టుబడి పెట్టేవాడు ప్రకృతి వనరులు, మానవ వనరులు వంటి అంశాలతో బాటు స్థానిక ప్రభుత్వపు సమర్థతను కూడా లెక్కలోకి తీసుకుంటాడు. అది అసమర్థమైనదైనా, అవినీతిభరితమైనదైనా వెనకంజ వేస్తాడు. బాబు తన ప్రభుత్వం సమర్థవంతమైనదని చూపించుకోవాలంటే కొద్ది స్థాయిలోనైనా ఏదైనా సాధించి చూపించాలి. కేంద్రం సహకారనిరాకరణతో యిప్పటిదాకా ఏదీ గట్టిగా సాధించడానికి వీలు పడలేదు.

ఇక అవినీతిరహితమని చూపించుకోవాలంటే పారదర్శకంగా పనిచేయాలి. పారదర్శకత వున్న నాడు, ఎందరు ఏమన్నా మొహం బద్దలయ్యేట్టు జవాబివ్వవచ్చు. దురదృష్టవశాత్తూ అదే లోపిస్తోంది. అమరావతి నిర్మాణానికి భారతీయ కంపెనీలు ఎందుకు పనికి రావు (తాత్కాలికానికి పనికి వచ్చాయి కదా) సింగపూరు కంపెనీలను ఎందుకు పిలుస్తున్నారు అంటే జవాబు లేదు, ఆ తర్వాత

సింగపూరువి గొంతెమ్మ కోర్కెలంటారు, జపాన్ అంటారు, చైనా అంటారు, వాళ్లతో చేసుకున్న ఒప్పందాలు బహిర్గతం చేయరు, టెండర్లు పిలవకుండా నామినేషన్ల ద్వారా పనులు కానిస్తారు. జలయజ్ఞంలో పనులు ప్రారంభించకుండా మొబిలైజేషన్ ఎడ్వాన్సులంటూ యిచ్చినపుడే అనుమానాలు ప్రారంభమయ్యాయి. కొన్నాళ్లలో నీళ్ల కంటె డబ్బులే ఎక్కువ ప్రవహించాయి. అలాటివి ఎన్నో చూసిన ఆంధ్రులు ప్రతి పాలకుణ్నీ అనుమానించడంలో ఆశ్చర్యం లేదు. సందేహాలు వచ్చినందుకు వారిని తిట్టకూడదు, నివృత్తి చేసి ధైర్యం చెప్పాలి. తమపై వచ్చిన ఆరోపణలకు జవాబులు చెప్పాలి తప్ప, జగన్‌పై ప్రత్యారోపణలు చేసి ఏం లాభం? ప్రజలు అతన్ని కాదనే కదా, అతనిపై నమ్మకం లేకపోయే కదా, అతన్ని తిరస్కరించి మీకు పట్టం కట్టారు. అతని వ్యవహారం కోర్టులో వుంది, ఆస్తులు ఎటాచ్‌మెంట్‌లో వున్నాయి. అందువలన ప్రజలకు అతని గురించిన గోల అక్కరలేదు. మీరేం చేస్తున్నారనేదే వాళ్లకు కావాలి.

తాత్కాలిక రాజధాని పనులు అప్పగించినపుడు మీరు స్థలం యివ్వడంతో బాటు చ.అ.కు యింత రేటు చొప్పున కాంట్రాక్టు యిచ్చామన్నారు. అది చాలా ఎక్కువ అని ప్రతిపక్షాల వారంటారు. కాదని మీరంటున్నారు. మామూలు జనాలకు యిళ్ల విషయంలో రేటు ఎలా వుంటుందో తెలుస్తుంది. ఆఫీసు, అందునా ప్రభుత్వ ఆఫీసు రేటు ఎలా వుంటుందో తెలియదు. ఆ కాంట్రాక్టులో అధికార పార్టీ ఆఫీసు కూడా కట్టి యిచ్చే లోపాయికారీ ఒప్పందం వుందేమోనని అనుమానం మొలకెత్తడం సహజం. ఇలాటి సందర్భాల్లో ఈ రేటులో లోపల ఫర్నిచరుతో సహా మాట్లాడాం అనో, లేక ఫలానా వూళ్లో వీళ్లు యిలాటిది యిదే రేటుకి కట్టారు అని అంకెలు విడుదల చేస్తే సరిపోతుంది. మేం తెలుగువాళ్లం, మీరు తెలుగువాళ్లు, మనంమనం అనుమానించకూడదు అని వాదిస్తే కుదరదు.

మధ్యలో యీ తెలుగు గొడవేమిటని విసుక్కోకండి. బాబు తన జవాబులో యీ లైను తీసుకున్నారు. "సాక్షి తెలుగువారి పత్రిక, తెలుగువారికి వ్యతిరేకంగా ఎలా రాస్తుంది" అని వాదించారు. మరి ఈనాడు చెన్నారెడ్డికి వ్యతిరేకంగా రాయలేదా? వైయస్‌కు వ్యతిరేకంగా రాయలేదా? ఆంధ్రజ్యోతి యిప్పుడు కెసియార్‌కు వ్యతిరేకంగా రాయటం లేదా? ఈ రకంగా చూస్తే తెలుగు పాలకులకు వ్యతిరేకంగా రాసే అర్హత తెలుగునాట "వార్త"కు, "హిందు"కు, "టైమ్స్ ఆఫ్ ఇండియా"కు తప్ప వేరెవరికి లేదన్నమాట. జాతీయస్థాయికి అన్వయిస్తే ఇండియన్లు షేర్లు కలిగి వున్న ఏ పేపరూ ఇండియాలో అవినీతి గురించి రాయకూడదు. తెలంగాణలో కెసియార్ అవినీతి చేస్తూ వుంటే, కొత్త సెక్రటేరియట్ పేర వృథా వ్యయం చేస్తూ వుంటే సాటి తెలుగువాడు కదాని బాబు పార్టీని మౌనంగా వుంటుందా? ఆంధ్రలో రేపు బాబు గాక మరొకరు అధికారంలోకి వస్తే అప్పుడాయన మౌనంగా వుంటారా? సాక్షి ఆస్తులు ప్రభుత్వానికి ఎటాచ్ అయ్యాయి ప్రభుత్వ ఆస్తి అయిపోయిందట, కాబట్టి అది ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాయకూడదా!? ఈ లాజిక్ యిప్పటిదాకా ఎవరికీ తోచి వుండదు. ఇంతకీ అది కేంద్రప్రభుత్వం పత్రికా? రాష్ట్రప్రభుత్వం పత్రికా? ఆంధ్ర ప్రభుత్వం "ఆంధ్రప్రదేశ్" అనే మాసపత్రిక ప్రభుత్వ వార్తలతో ప్రచురిస్తుంది. దాని సిబ్బందికి జీతాలిస్తుంది. ఇప్పుడు సాక్షి సిబ్బందికి ఏ ప్రభుత్వం జీతాలిస్తోంది? ఎటాచ్ చేసినంత మాత్రాన స్వాధీనం అయిపోయినట్లేనా? అగ్రిగోల్డ్ ఆస్తులు ఎటాచ్ అయివున్నాయి, అవి అన్యాక్రాంతమయ్యాయని ఎలా అంటారు అని ఒక పక్క అడుగుతూనే మరో పక్క సాక్షి ఆస్తులు ప్రభుత్వపరం అయిపోయినట్లు ఎలా వాదిస్తున్నారీయన?

పనిలో పనిగా రాజకీయాల్లో యింత సీనియరునైన నన్ను జగన్ ఏకవచనంతో సంబోధిస్తున్నారని బాబు బాధపడ్డారు. ఆ ఆవేదనలో అర్థం వుంది. కానీ యివి మాటతీరుకి, సంస్కారానికి సంబంధించిన విషయాలు. బాబునే కాదు, అంతకంటె సీనియరు, తన తండ్రికి అత్యంత ఆత్మీయుడైన రోశయ్యగారిని కూడా వరంగల్ ప్రయాణమప్పుడు జగన్ 'నువ్వు' అనేశారు. రాజకీయాల్లో ఎంతైన ఘర్షించవచ్చు, కానీ మర్యాద పాటించడం హర్షణీయం. కోస్తా జిల్లాల్లో తప్ప తక్కిన ప్రాంతాల్లో 'నువ్వు' ప్రయోగం అభ్యంతరకరం కాదు. కానీ పేరు చివర్లో గారు చేరిస్తే హుందాగా వుంటుంది. ఆ హుందాతనం లేనిది వైసిపి నాయకుల వద్ద మాత్రమే కాదు, టిడిపి నాయకుల వద్ద కూడా! బాబు అనుచరులు అసెంబ్లీలో బయటా జగన్‌ను మీరు అంటున్నారా? ..గారు అంటున్నారా? ఆయన ప్రతిపక్ష నాయకుడు కదా, కాబినెట్ హెూదా కలిగిన వ్యక్తి కదా! తెలంగాణ టిడిపివారు కెసియార్‌పై ఎలాటి భాష వుపయోగిస్తున్నారు? బాబే చెప్పి తిట్టించారని ఎర్రబెల్లి చెప్పారు. అబద్ధమనే అనుకుందాం, కానీ బాబు వారించలేదనుకుంటా, వారిస్తే ఆయన భాష మార్చి వుండేవాడు, మోత్కుపల్లి అంత ఘాటుగా మాట్లాడేవారు కారు. ఇప్పటికైనా అందరూ ఒక ఒప్పందానికి రావాలి. నువ్వు, మీరు మాట ఎలా వున్నా పేరు చివర –గారు చేర్చడం అవసరం అని తీర్మానించుకుని, దానికి కట్టుబడాలి. దీనికి సీనియారిటీతో, వయసుతో సంబంధం లేదు. చిన్నవారినైనా గౌరవించవచ్చు, కొంపలంటుకుపోవు. తెలుగు నాయసమూహంలో సంస్కారం స్థాయి పెంచవలసిన అవసరం అర్జంటుగా పడిందని బాబు గుర్తించినందుకు సంతోషం.

అసలు విషయానికి వస్తే – ఈ ఆరోపణలపై సమాధానం చెప్పడం ఒక ఎత్తు, ఆచరణలో చూపించడం మరో ఎత్తు. వైకాపా చేసిన ఆరోపణలు కాబట్టి పట్టించుకోనక్కరలేదు అంటే, కొన్ని విషయాలపై బిజెపియే విమర్శిస్తోందని గమనించాలి. కేంద్రం నుంచి నిధులు ఎందుకు రావడం లేదో జవాబు చెప్పవలసిన భారం పడడంతో రాష్ట్ర బిజెపి నాయకులు ప్రభుత్వంలో తప్పులు పడుతున్నారు. అమరావతిపై డిపిఆర్ పంపలేదు అంటున్నారు. పర్యావరణం గురించి క్లియరెన్సులు రావటం లేదని గుర్తు చేస్తున్నారు. అదేమిటో మర్నాడు శంకుస్థాపన అంటే ముందురోజు వచ్చిందంటారు. దేనికి వచ్చిందో, ఏ మేరకు వచ్చిందో అర్థం కాదు. పట్టిసీమ గురించి కూడా 'అది పోలవరంలో భాగం అని మంత్రి అన్నారు, కాదని బాబు అన్నారు, చివరకు పోలవరంలో భాగం అని క్లెయిమ్ చేస్తూ బిల్లు పంపించారు, ముందుగా అనుకున్నది కాదు కదా, ముందస్తు అనుమతి లేకుండా ఎలా కడతారు అని కేంద్రం ఆపేసింది, తప్పేముంది?' అని అడుగుతున్నారు. పట్టిసీమలో విధివిధానాలు పాటించి వుంటే యీ చిక్కులు వుండేవి కావు కదా. ఇలాటివి

పరిహరించాలి.

ఇప్పుడు అమరావతి భూములున్నాయి. రాజధాని ఫలానా చోట అని ప్రకటించాక భూములు కొన్నవాళ్ల గురించి ఎవరేం రాసినా పట్టించుకోనక్కరలేదు. అది యింతకే ఎలా కొన్నారు అంటే కొన్నవాడి యిష్టం, అమ్మినవాడి యిష్టం. బ్లాక్ మనీ చేతులు మారింది అంటే అది యిన్‌కమ్‌టాక్స్‌కు సంబంధించిన వ్యవహారం. రాష్ట్రప్రభుత్వం చేయగలిగేది ఏమీ లేదు. రాజధాని ప్రకటించే నాటికి ఎసైన్‌మెంట్ లాండ్స్ ఎవరి పేరిట వున్నాయో వారికే భూ సమీకరణలో భాగంగా వాటా భూములు యిస్తాం అన్నారు బాబు. అసలు ఎసైన్‌మెంట్ లాండ్స్ కొనకూడదనే చట్టం వున్నపుడు వాటిపై జరిగిన లావాదేవీలన్నీ రద్దు చేయాలి తప్ప వారికి వాటా భూములిస్తామనడం ఏమిటి? రాజధాని రాబోయే ముందు పాలకపక్షానికి చేరువగా వున్నవారు ఆ ప్రాంతంలో కొంటే అది యిన్‌సైడర్ ట్రేడింగ్ కింద వస్తుంది. కంపెనీ వ్యవహారాల్లో అయితే అది చట్టవిరుద్ధం, శిక్షార్హం. భూముల విషయంలో దానిపై చట్టం వుందో లేదో నాకు తెలియదు. కావాలంటే కేసు పెట్టుకోండి అని వూరుకోవచ్చు కానీ ప్రజల్లో అనుమానం బలపడుతుంది. దాన్ని దూరం చేయాలంటే ప్రకటనకు నెల ముందు జరిగిన రిజిస్ట్రేషన్లను ప్రకటించి, అమ్మినదెవరో, కొన్నదెవరో, వారి ఇన్‌కమ్‌టాక్స్ రిటర్న్స్‌తో సహా ప్రకటిస్తే విమర్శకులకు సరైన సమాధానం యిచ్చినట్లుంటుంది. పనిలో పనిగా వారు భూపరిమితి చట్టం ఉల్లంఘించారా లేదా అనేది కూడా క్లారిఫై చేస్తే మంచిది.

అనుమానం వచ్చే ఇంకో విషయం ఏమిటంటే – జోను సరిహద్దులు గీయడంలో కొందరి ఆస్తులు కాపాడం! హైదరాబాదులో వైయస్ హయాంలో ఓఆర్‌ఆర్ ప్లాను చేసినపుడు అస్మదీయుల భూములు కాపాడుతూ, తస్మదీయులు భూములు ఎగరగొడుతూ ప్లాను చేశారని వార్తలు వచ్చాయి. వాటిపై నేను 'సున్నా చుట్టడం రానివాళ్లు' అంటూ వ్యంగ్యంగా రాశాను కూడా. ఆ అక్రమాల గురించిన పూర్తి వివరాలు యిప్పటికీ తేలలేదు. కానీ వైయస్‌పై అవినీతి, ఆశ్రితపక్షపాతం ముద్ర అయితే గాఢంగా పడింది. ఇప్పుడు లింగమనేని ఎస్టేటు గురించి యిలాటివే వచ్చాయి. కృష్ణానదీగర్భంలో అక్రమంగా, పర్యావరణనియమాలకు విరుద్ధంగా కట్టిన కట్టడంలో ప్రభుత్వ ఆస్తి అంటూ ముఖ్యమంత్రి వుండడం (పర్యావరణాన్ని చెడగొట్టిన చోట ముఖ్యమంత్రి వుంటూ కొత్త రాజధానిలో పర్యావరణం కాపాడతాం అంటే ఏం బాగుంటుంది?) జోన్ సరిగ్గా వారి ఎస్టేటుకు 10 మీటర్ల ముందు ఆగిపోవడం, తక్కిన అనేక ప్రాజెక్టులు అనుమతులు ఆగిపోగా వారికీ, జయభేరికి మాత్రం అనుమతులు దక్కడం యివన్నీ ఆశ్రితపక్షపాతం ఆరోపణలకు తావిచ్చే అంశాలు. మురళీమోహన్ రియల్ ఎస్టేటు వ్యాపారి. ఆయన భూములు కొనడంలో ఆశ్చర్యం లేదు. కానీ వింతేమిటంటే బాబు డెవలప్ చేసిన సైబరాబాదులోనూ ఆయన ఎస్టేట్లున్నాయి, కొత్తగా డెవలప్ చేస్తానంటున్న అమరావతిలోనూ వుంటున్నాయి. హైదరాబాదులో తక్కిన ప్రాంతాల్లో ఆయన ఎస్టేట్లు కనబడవు. దేవులపల్లివారికి అనుమానం వచ్చింది – 'మావిచిగురు తినగానే కోయిల కూసేనా? కోయిల గొంతు వినగానే మావి చిగురు తొడిగేనా?' అని. అలా జయభేరి ఎస్టేటు వస్తోందని బాబు అభివృద్ధి చేశారా? బాబు అభివృద్ధి చేస్తారని జయభేరి వస్తోందా? అనిపిస్తుంది. ఒకరి అంశ మరొకరిలో వుందేమో అని ఆశ్చర్యం వేస్తుంది. ఈ ఆశ్చర్యం వలన యిన్‌సైడర్ ట్రేడింగ్ వలన లబ్ధి పొందినవారిలో ఆయనా వున్నాడేమో అనే అనుమానం వస్తుంది.

ఇక అగ్రిగోల్డ్ భూముల విషయంలో అయితే బాబు ఏం వివరణ యిచ్చినా సబబుగా కనబడటం లేదు. బాధితులను కదిపితే కథలుకథలుగా చెప్తారు. అగ్రిగోల్డ్ వాళ్లు మోసం చేసి, ప్రజల డబ్బుతో ఆస్తులు సంపాదించారని ఏడాది క్రితమే తెలుసు. అయినా రాష్ట్రప్రభుత్వం అధీనంలోని పోలీసు శాఖ వారిని మొన్నటిదాకా అరెస్టు చేయకపోవడం, అనేక ఆస్తులు స్వాధీనం చేసుకోకపోవడం, అతి తక్కువ నగదు చూపించడం చూసి కోర్టువారే చివాట్లు వేశారు. విచారణ వేగంగా సాగటం లేదన్న కోర్టు వ్యాఖ్యకు బాబు వద్ద జవాబేముంది? పోలీసు వైఫల్యానికి జవాబు చెప్పాల్సింది వారి ప్రభుత్వమేగా! రాజధాని చుట్టూ వున్న అగ్రిగోల్డ్ భూముల కారణంగానే పాలకులు వారిని రక్షిస్తున్నారని స్పష్టంగా తెలుస్తోంది. ఎందుకు ఏమిటి అన్నదానికి జవాబు చెప్పవలసినది పాలకులే. సిబిఐ చేత విచారణ చేయిస్తారా అని ఒక విలేకరి అడిగితే ఏముందని చేయించాలి అన్నారు బాబు. నిజమే సిబిఐ మాత్రం కరక్టుగా చేస్తుందన్న నమ్మకం ఏముంది? వాళ్ల దగ్గర స్టాఫ్ లేరుట కూడా. రాష్ట్రస్థాయిలో విచారణ కమిషన్ వేయడానికి కూడా బాబు సిద్ధంగా లేరు కాబట్టి ప్రభుత్వమే అన్నీ తనకు తానుగా ప్రకటించేస్తే మంచిది. ప్రతిపక్షం ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టడానికి, వాళ్లు అడక్కపోయినా తమంతట తామే ప్రభుత్వం ప్రకటనలు చేయడానికి మన పెద్దలు సమకూర్చిన వేదిక అసెంబ్లీ. ఇద్దరూ దాన్ని సవ్యంగా వుపయోగించుకోవాలి. దాని ద్వారా ప్రజల సందేహాలు నివృత్తి చేస్తే చాలు. ప్రెస్ మీట్ పెట్టి తెలుగువారి ప్రతిష్ఠకోసం, పెట్టుబడుల కోసం మీరు మౌనంగా వుండాలి అని వాదించనక్కరలేదు.

2014 ఎన్నికలలో టిడిపి గెలవడానికి కారణం, జగన్ అవినీతిపరుడన్న యిమేజి, కేసుల్లో యిరుక్కుని జైలు కెళ్లిన నేపథ్యం. మాట తప్పుతారన్న యిమేజి బాబుకి వున్నా అవినీతి తో పోలిస్తే యిది ఫర్వాలేదనుకున్నారు. గెలిచాక మాట తప్పే యిమేజి బాబు కాపాడుకున్నారు – ఋణమాఫీ, కాపు రిజర్వేషన్ వగైరా విషయాల్లో! కానీ బాబు కూడా అవినీతికి పాల్పడ్డారని ఏ మాత్రం రుజువైనా వచ్చినా ఆంధ్రులు హతాశులవుతారు. సీజర్స్ వైఫ్ మస్ట్ బి బియాండ్ సస్పిషన్ అంటారు. వైయస్ కాలంలో ఆరోపణలు వచ్చినప్పుడల్లా ఆయన 'ఆ రెండు పత్రికలు' అంటూ వచ్చారు. చివరకు ఏమైంది? ఆ పత్రికలు నిక్షేపంలా వున్నాయి. వైయస్ వెళ్లిపోయారు – బోల్డంత అపకీర్తి మూటగట్టుకుని! వైయస్ పాలన మళ్లీ తెస్తామని జగన్ వాగ్దానం చేస్తే జనాలు హడలిపోయి వద్దులే అనేశారు. అది చూసి కూడా బాబు సాక్షి పత్రికను ఆడిపోసుకుంటూ కాలం గడపడం వేస్టు. తప్పుడు రాతలు రాస్తే కేసులు పెట్టవచ్చు కాదు, పెట్టాలి

కూడా. పత్రికలపై కేసులు పెట్టడం సర్వసాధారణం. కేసుల్లేని ఏ పబ్లికేషనూ వుండదు. ఆరోపణలకు గురైనవాడికి కేసు పెడతాననే హక్కు వుంది కానీ బాబు దీనిలో కూడా కొత్త పుంత తొక్కారు. క్షేత్రస్థాయిలో రిపోర్టు చేసిన విలేకరిని ఫోకస్ చేసి బెదిరించే ధోరణిలో మాట్లాడి వివాదం కొని తెచ్చుకుంటున్నారు. విలేకరి ఏం రాసినా, అల్టిమేట్‌గా ఎడిటరు, పబ్లిషరు బాధ్యులవుతారు. వాళ్లు కూడా కేసులో భాగస్వాములవుతారు కాబట్టే విలేకరి ధైర్యంగా రాస్తాడు. తనొక్కడే కేసు ఎదుర్కోవాలంటే ఏ అన్యాయం, ఏ అక్రమం జరిగినా విలేకరి రిపోర్టు చేయడం మానేస్తాడు. విలేకరికి వుండే యీ రక్షణ కవచాన్ని ఛేదిద్దామని బాబు ప్రయత్నిస్తే పత్రికాస్వేచ్ఛ హరిస్తున్నారంటూ జాతీయస్థాయి పాత్రికేయుల నుంచి కూడా నిరసనలు వస్తాయి. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2016)**

**మార్చి 14 ఎమ్బీయస్ : చంద్రబాబు ఇమేజి**

"అవినీతి ఆరోపణలపై స్పందన" వ్యాసంలో 'బాబు కూడా అవినీతికి పాల్పడ్డారని ఏ మాత్రం రుజువైనా వచ్చినా ఆంధ్రులు హతాశులవుతారు' అన్న వాక్యంపై చాలామంది వ్యాఖ్యలు చేశారు. బాబు అవినీతిపరుడు కాడా? అంటూ ప్రశ్నలు సంధించారు. వైయస్ అవినీతిపరుడైతే 2009లో ఎలా గెలిచాడని లాజిక్ లాగారు. ఇవన్నీ వివరించాలంటే ఒకటి రెండు వాక్యాల్లో జవాబివ్వడం కుదరదు కాబట్టే యీ వ్యాసం. నా వాక్యంలో కీలకమైన మాట '..రుజువైనా'! అది గమనిస్తే చాలా విషయాలు మీకే బోధపడతాయి.

ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా బాబు యిమేజి వేరు, జగన్ యిమేజి వేరు. రాజకీయనాయకుల్లో అవినీతి లేదంటే చిన్నపిల్లవాడు కూడా నమ్మడు. ఏ మేరకు అవినీతిపరుడు అన్నదే ప్రశ్న. వైయస్ మూర్తీభవించిన అవినీతిపరుడని కోడై కూసిన తెలుగు మీడియా బాబు దగ్గరకు వచ్చేసరికి మూగబోతుంది. ఆయన హయాంలో జరిగిన అవినీతిని అధికారుల నెత్తిన చుట్టేస్తుంది. జగన్ ఏనాడూ అధికారం చేపట్టకపోయినా అవినీతిపరుడుగా ముద్ర కొడుతుంది. దీన్ని మధ్యతరగతి ప్రజలు, ఆలోచనాపరులు అందరూ గుడ్డిగా నమ్మడానికి యిష్టపడతారు. దీన్నే నేను మాటిమాటికీ ఎత్తి చూపుతూంటాను. ఎన్నికలలో ఓట్లు కొంటున్నారు అని అందరికీ తెలుసు. ఓ పార్టీవాళ్లు ఓటుకు వెయ్యి యిస్తున్నారంటే మరొకరు 1200 యిస్తున్నారంటే, యింకోరు 1500 యిస్తున్నారు అని వార్తలు వస్తూనే వున్నాయి. జనాలు చెప్పుకుంటూనే వుంటారు. వీరిలో ఒకరు మాత్రమే అవినీతిపరులని, తక్కినవాళ్లందరూ స్వచ్ఛంగా వున్నారని ఎలా అనగలరు? అని నేను పదేపదే అడుగుతాను. దీనికి ఆ యా పార్టీల అభిమానుల వద్ద నుండి సమాధానం రాదు. అందరికీ తెలుసు – అలా ఖర్చు పెట్టేది కష్టార్జితం కాదు, అక్రమంగా సంపాదించిన డబ్బే అని. ఒక వేళ కష్టార్జితమే ఖర్చు పెట్టినా, అది పెట్టుబడిగా చూస్తున్నారని, పదవిలోకి వచ్చి దానికి మూడింతలు అడ్డగోలు మార్గంలో ఆర్జిద్దామనే ప్లానులో వున్నారనీ అర్థం చేసుకోవాలి. జండాలు మోసేవాళ్లకు కాకుండా వ్యాపారవేత్తలకు టిక్కెట్లు ఎందుకు యిస్తున్నారని కార్యకర్తలను పార్టీ అధినేతలను ప్రశ్నించినపుడు వాళ్లు ఏం సమాధానం చెప్తున్నారు? 'పార్టీ నడవాలంటే కార్యకర్తలుంటే చాలదు, నిధులు కావాలి. అవి సమకూర్చినవారికి టిక్కెట్టు యివ్వకపోతే ఎలా?' అని. గతంలో రాజకీయనాయకులకు, వ్యాపారస్తులకు మధ్య యిచ్చిపుచ్చుకోవడాలు వుండేవి. ఈ డొంకతిరుగుడు ఎందుకుని యిటీవల వ్యాపారస్తులు తామే రాజకీయాల్లోకి దిగిపోయి కావలసినవి చేసేసుకుంటున్నారు. నిధులిచ్చినవారికి నియమాలు ఉల్లంఘించి పనులు చేసిపెట్టాలి, ఎన్నికల్లో డబ్బులు ఖర్చుపెట్టి వచ్చినవారికి అక్రమంగా ఆర్జించుకునే అవకాశం యివ్వాలి. లేకపోతే పార్టీలో తిరుగుబాటు వచ్చి, విడిచి వెళ్లిపోతారు, గద్దె కూలిపోతుంది.

దీనికి ఏ పార్టీ అతీతం కాదు. కానీ టిడిపిని అతీతమనుకోమని దాని అభిమానులు వాదిస్తారు. బాబు నిప్పు అని నమ్మమంటారు. అవును, నిప్పే అని తెలుగు మీడియా మనకు నిత్యం చెపుతూ వుంటుంది. తెలుగు మీడియా అంటే నా ఉద్దేశం ఈనాడు, దాన్ని అనుకరించే యితర పత్రికలు. సాక్షి తెలుగు పేపరే అయినా అది విశాలాంధ్ర, ప్రజాశక్తి లాగ ఒక పార్టీకి అంకితమైన పత్రిక, అందువలన దాని పొలిటికల్ రిపోర్టింగులో వలపక్షం వుంటుంది పాఠకుడికి ముందే తెలిసిపోతుంది. తటస్థంగా వుంటాం అని చెప్పుకుంటూ ఒకరి పక్షం వహించేవాటితోనే యిబ్బంది. ఈనాడు పత్రిక దాదాపు నాలుగు దశాబ్దాలుగా తెలుగువారి ఆలోచనావిధానాన్ని ప్రభావితం చేస్తూ వచ్చి, వారి కళ్లకు గంతలు కట్టే స్థాయికి వచ్చింది. చెన్నారెడ్డి, నేదురుమల్లి వగైరా కాంగ్రెసు ముఖ్యమంత్రులను ఈనాడు అవినీతికి ప్రతిరూపాలుగా చూపించింది. వారిలో మంచి ఏదైనా వుంటే హైలైట్ చేయలేదు. అవినీతి జరిగింది, సరే ఏ మేరకు, యితరులతో పోలిస్తే ఏ స్థాయిది..? అని మనకు చెప్పలేదు, అడగాలని మనకు తోచనీయలేదు. 1983 ఎన్నికల ఫలితాలు వచ్చే ముందు రోజు రామోజీరావు గారు సంతకం పెట్టిన లేఖలో తాను కాంగ్రెసుకు తొలినుంచి వ్యతిరేకినని చాటుకున్నారు. (కాంగ్రెసు ఓడిపోతుందని అప్పటికే ఆయన సర్వేలు చెప్పేయి) మార్గదర్శిపై విచారణ సమయంలో తను కాంగ్రెసు వ్యతిరేకినని చెప్పుకోవడం చేతనే వైయస్ ప్రభుత్వం వేధిస్తోందని రాతపూర్వకంగా ప్రకటించారు. కాంగ్రెసు వ్యతిరేకతను బాహాటంగా చాటుకుంటున్నా ఈనాడు పత్రికావిలువలకు కట్టుబడ్డ పత్రికగా చలామణీ కావడమే వింతల్లో కల్లా వింత. ఆయన కాంగ్రెసు వ్యతిరేకతే బిజెపి ప్రభుత్వం ద్వారా పద్మవిభూషణ్ తెచ్చిపెట్టింది. ఆయన సాధించిన విజయాలు తక్కువేమీ కావు, వాటిలో ఏ ఒక్కటైనా చాలు పద్మవిభూషణ్ యివ్వడానికి. కానీ ఆయన చిక్కుకున్న వివాదాలూ తక్కువవి కావు. ఈనాడు వైజాగ్ ఆఫీసు కేసు ఒక్కటి చాలు, పద్మ ఎవార్డు ఆపడానికి. కానీ గతంలో అద్వాణీపై క్రిమినల్ కేసు వున్నా యిచ్చాం కదా, యీయనకి మాత్రం ఎందుకివ్వకూడదు అనుకుని

యిచ్చేసినట్లున్నారు.

చెప్పవచ్చేదేమిటంటే తెలుగువాళ్లకు ఈనాడు నంది అంటే నంది, పంది అంటే పంది. నాదెండ్ల భాస్కరరావు ఎన్టీయార్‌పై కుట్ర చేస్తే అది ఈనాడు ద ృష్టిలో కోపైలట్ కొంపముంచడమైంది, కొన్నేళ్ల తర్వాత అదే పని బాబు చేస్తే ప్రజాస్వామ్య పరిరక్షణ అయింది. మొదటిది విఫలమైంది. రెండోది సఫలమైంది. నిజానికి రెండుసార్లూ ఎమ్మెల్యేల అసంత ృప్తికి ఒకటే కారణం. కాంగ్రెసు సంస్క ృతికి అలవాటు పడిన రాజకీయాలకు భిన్నంగా ఎన్టీయార్ కొత్తదనం తెచ్చారు. తెలుగుదేశం పార్టీ పెట్టినపుడు ఆయన ఎన్నికల ప్రచారానికి డబ్బులు పంచలేదు. కొందరు ఉత్సాహవంతులు ఆస్తులు అమ్ముకుని మరీ దిగారు. అవినీతిరహిత పాలన అని ఎన్టీయార్ చెప్పినది ఒట్టి మాటలగానే వుంటాయనుకున్నారు కానీ ఆయన దాన్ని నిజంగా అమలు చేయబోయేసరికి కంగు తిన్నారు. "ఆయనకేమండి, సినిమాల్లో దండిగా సంపాదించి, తరతరాలకు తరగనంత సంపాదించి వచ్చి సన్యాసిని, నాకేం అక్కరలేదంటాడు. మరి మేమంతా సంసారులం కదా, నాలుగు రాళ్లు వెనకేసుకోక పోతే ఎలా?" అని సణుగుడు ప్రారంభమైంది. నిజానికి 1983 ఎన్నికలలో తెలుగుదేశం ఓటర్లకు డబ్బులు పంచలేదు కానీ, రకరకాల ప్రచారానికి చాలానే ఖర్చయింది. అది ఎన్టీయార్‌పై అభిమానం చేతనో, పెట్టుబడిగానో, మరో కారణం చేతనో కొందరు భరించారు. వాళ్లు తమ పెట్టుబడి వెనక్కి రావాలని కోరుకున్నారు. కానీ ఎన్టీయార్ కొరకరాని కొయ్యగా మారారు. వెళ్లి చెప్దామంటే ఆయన వినేవాడు కాదు. ఎదురుపడాలంటే భయం. వ్యతిరేకిస్తూ చాటుగా సంతకాలు పెట్టడానికి మాత్రం రెడీ. అందుకే రెండుసార్లు తిరుగుబాటు చేశారు. స్వభావంలో నాదెండ్లకు, బాబుకు తేడా లేదు. 'పెద్దాయన్ని తప్పించి నన్ను కూర్చోబెడితే మీకు తినే ఛాన్సిస్తాను' అనే హామీతోనే వాళ్లు ఎమ్మెల్యేలను ఆకట్టుకున్నారు.

తమిళ రాజకీయాల్లో రాశాను – ఎమ్జీయార్ మొదటి టర్మ్‌లో అవినీతి లేదంటారని, తన ప్రభుత్వం రద్దయి మధ్యంతర ఎన్నికలు వచ్చిపడేసరికి ఆ దెబ్బకి అవినీతి ప్రారంభించాడంటారనీ రాశాను. ఎన్నికలు ఖరీదైన వ్యవహారం అయిపోయింది. ఎమ్మెల్సీ ఎన్నికలలో టీచర్లు కూడా సెల్‌ఫోన్లు పుచ్చుకున్నారని వార్త వచ్చింది. సుద్దులు చెప్పే అయ్యవార్లే యింత దిగజారితే పాటకజనం మాటేమిటి? పాత కాలంలో ఎన్నికలలో వావిలాల గోపాలక ృష్ణయ్యగారి ఎన్నికల ఖర్చు వందల్లో వుండేది. ఈ రోజు ఎన్నికల సభలకే బోల్డు ఖర్చవుతోంది. 50 మంది హాజరయ్యే పుస్తకావిష్కరణ సభకే వేలల్లో ఖర్చవుతోంది. వేలమంది వచ్చే రాజకీయ సభ అంటే ఎంత ఖర్చు! ఖర్చు పెట్టకుండా గోదాలోకి దిగుదామని చూసిన లోకసత్తా ఎక్కడకు చేరిందో చూశాం. అయినా వాళ్లకీ పబ్లిసిటీకి బోల్డు ఖర్చయింది. సేకరించిన విరాళాలన్నీ చూపిస్తున్నాం అంటారు వాళ్లు. ఆచరణలో అదీ సాధ్యం కాదు. ఎందుకంటే జెపిపై అభిమానంతో విరాళం యిద్దామనుకున్న అందరి వద్దా దాని కోసం వైట్ మనీ వుండకపోవచ్చు. క్యాష్‌లో యిస్తా లేదా ఫలానా ఖర్చు భరిస్తా అనే ఆఫర్లు వస్తాయి. అంతెందుకు జెపి కూడా రత్తయ్యవంటి విద్యావ్యాపారికి టిక్కెట్టు యివ్వాల్సి వచ్చింది. వ్యవస్థ యింతలా భ్రష్టుపట్టాక ఎవరో ఒకరు మాత్రం నిప్పులా వున్నారంటే నమ్మడం ఎలా?–

ఎన్టీయార్ పాలించే రోజుల్లో అనేక ఎన్నికలు జరిగినప్పుడు, వాటిల్లో బోల్డంత హంగామా జరిగినప్పుడు ఆ కాలంలో అస్సలు అవినీతి లేదని ఎలా అంటాం? 'పెద్దాయనకు యిష్టం లేదు, పుచ్చుకోడు. అలాటి 'డర్టీవర్క్' బాబు హేండిల్ చేసేవారు' అని ప్రతీతి. ఆ రకంగా బాబు ఎమ్మెల్యేలందరి ప్రయోజనాలు కాపాడే లౌక్యుడు, ఆచరణవాది, సిద్ధాంతాలు పట్టించుకోకుండా లోకరీతి ప్రకారం పోయేవాడు అనే పేరుపడ్డారు. అదే ఎన్టీయార్‌ను దించడానికి వుపయోగపడింది. అనామకులైన తమను నాయకులను చేసిన ఎన్టీయార్‌ను ధిక్కరించి, ఎమ్మెల్యేలు బాబు వెంట నడిచారంటే యిది తప్ప వేరే కారణం లేదు. లక్ష్మీపార్వతి కారణంగా ధిక్కరించాం తప్ప మాకు పెద్దాయనపై అపారమైన గౌరవం అని వాళ్లంతా యిప్పుడు చెప్పుకుంటారు. ధిక్కరించి, యింట్లో కూర్చుని వుంటే, రాజకీయాల్లోంచి తప్పుకుని వుంటే అప్పుడు ఆ మాటలు నమ్మవచ్చు. కానీ వీళ్లంతా పదవులు సంపాదించుకున్నారు. 1983 నాటికి, యిప్పటికి వాళ్ల ఆస్తులు బేరీజు వేసి చూస్తే తెలుస్తుంది – ఎంతెంత ఆర్జించారో! లక్ష్మీపార్వతి చుట్టూ భజనపరులు చేరి కానుకలతో ముంచెత్తి పనులు జరిపించేసుకుంటున్నారన్న దుగ్ధ మాట నిజమే, ఆమెను రాజకీయాల్లోంచి తప్పించమని ఎన్టీయార్‌తో మొత్తుకున్నా ఆయన వినకపోవడమూ నిజమే. కానీ ఒక దశలో ఎన్టీయార్ దిగి వచ్చి ఆమెను పక్కకు పెడతానని అన్నా, ఒక్క అవకాశమూ యివ్వకుండా అత్యంత అవమానకరంగా తీసి అవతలపడేయడానికి బలమైన కారణం – అవినీతి పట్ల ఎన్టీయార్‌కున్న వ్యక్తిగత విముఖతే!

బాబు అధికారంలోకి వచ్చాక జరిగిన ఎన్నికలలో ధారాళంగా డబ్బు ఖర్చు పెట్టేవారు. ఆంధ్రలో ఎన్నికల ఖర్చు యితర రాష్ట్రాలతో పోలిస్తే ఎన్నో రెట్లు ఎక్కువన్న సంగతి జాతీయస్థాయిలోనే తెలుసు. దాన్ని ఆ స్థాయికి తెచ్చిన ఘనత బాబుదే. ఆ డబ్బు ఆయన ఎలా ఖర్చుపెట్టారు? ఇంట్లోంచి తెచ్చా? ఖర్చు పెట్టినదాన్ని ఎలా రాబట్టారు? ఏ మాత్రం కామన్‌సెన్స్ వున్నా యీ పాయింటుకి ఆన్సరు తడుతుంది. అయినా తెలుగు ప్రజల్లో చాలామంది బాబు అవినీతి పట్ల దివాంధుల్లా ప్రవర్తిస్తారు. వైయస్‌తోనే అవినీతి పుట్టి, కాంగ్రెసు నాయకులందరకూ పాకి, జగన్‌కు వారసత్వంగా వచ్చి అక్కడితో ఆగిపోయిందనుకుంటారు. ప్రస్తుతం కాంగ్రెసు అధికారంలో లేదు, జగన్ లేదు, మరి ఆంధ్రలో అవినీతి అస్సలు లేదా!? వైయస్‌తో అవినీతి ప్రారంభం కాలేదు, అంతం కాలేదు. పదవి లేదు కాబట్టి జగన్‌ది సాంకేతికంగా అవినీతి అనడానికి లేదు. పదవి అడ్డం పెట్టుకుని సంపాదించడానికి, తన కొడుకు కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడానికి క్విడ్‌ప్రోకో మార్గం వుపయోగించడానికి అవకాశం వున్నది వైయస్‌కు మాత్రమే. కాంగ్రెసు వైయస్‌ను యిరికించకుండా జగన్‌పైనే కేసులు మోపాలని చూడడం చేతనే కేసులు తేలకుండా వున్నాయి. ఇలా ఎన్నిసార్లు

రాసినా, ఎంతమందితో వాదించినా అదేమిటో తెలుగువాళ్లలో చాలామంది జగన్ అనగానే ‘అవినీతి’ అంటారు. 2014 ఎన్నికల ఫలితాలు వెలువడేందుకు కాస్త ముందు యూరోప్ యాత్రలో వున్నాం. స్విజర్లండ్‌లో తిరుగుతూండగా బస్సులో అందరూ ‘జగన్ బ్యాంకు’, ‘జగన్ బ్యాంకు’ అని అరిచారు. అందరూ స్టేటుబ్యాంకు అధికారులే. ఆర్థిక అక్రమాలు ఎలా జరుగుతాయో బాగా తెలిసినవారే. అయినా నల్లధనం జగన్ వద్ద మాత్రమే వుంటుందని, వేరే ఎవరి దగ్గరా వుండదని ఎలా అనుకున్నారో తెలియదు.

బాబు పాలనలో లోపాల గురించి మాట్లాడితే వెంటనే ‘బాబుని విమర్శిస్తున్నావంటే నువ్వు జగన్ ఆరాధకుడివి’ అనేస్తారు, మోదీని విమర్శిస్తే అయితే మొద్దబ్బాయి రాహుల్ ప్రధాని కావాలా? అంటారు. ఇద్దరిలోనూ నాకు లోపాలు కనబడుతున్నాయంటే అర్థం చేసుకోలేరు. ఇదెక్కడి మూర?త్వమో నాకు అర్థం కాదు.  బాబు సమర్థుడు, మరో హైదరాబాదు మనకి కట్టి యివ్వగలడు, జగనైతే అంతా తినేస్తాడు అనే నమ్మకం ప్రబలడం చేతనే టిడిపి గెలిచింది. రాష్ట్రం విడిపోవడానికి బాబు కూడా కారకుడని తెలిసినా దాన్ని పట్టించుకోకుండా ఓట్లేయడానికి కారణమది. టిడిపి, వైకాపాల మధ్య తేడా ఐదు లక్షలే అనే మాట నిజమే అయినా వైకాపా కొన్ని జిల్లాలలోనే తన సత్తా చూపగలిగిందని, అనేక జిల్లాలలో దారుణంగా దెబ్బ తిందని గమనించాలి. పవన్ కళ్యాణ్, మోదీ మ్యాజిక్, ఋణమాఫీ హామీ, కాపుల మద్దతు.. వగైరా కారణాలన్నీ కలిసి రావడం చేతనే టిడిపికి అధికారం చిక్కినమాట వాస్తవమే కానీ బేసిక్‌గా బాబుకున్న మంచి యిమేజే ఆయన్ను అధికారంలో కూర్చోబెట్టింది. ఆ యిమేజి కలిగించినదెవరు? మీడియా, బాబు! ఆయన నేను నిప్పు అని చెప్పుకుంటూ వుంటాడు. ఆయనపై కేసులు చాలా వున్నాయి. కానీ అవి రుజువు కాలేదు. కాకుండా ఆయన జాగ్రత్తలు పడ్డాడు. సిబిఐ, కోర్టులు అన్నీ ఆయనకు అనుకూలంగా వ్యవహరిస్తూ వచ్చాయి.

దానికి కాంట్రాస్టుగా వున్నది జగన్. అతను పదవీదుర్వినియోగం చేసి సంపాదించాడనడానికి వీల్లేదు. కానీ వైయస్ పాలనలో జరిగిన అవినీతికి అతనే కారకుడంటూ అతని నెత్తిన రుద్దారు. (రేపు బాబు పాలనలో అవినీతి రుజువైతే దానికి కారణం లోకేశ్ అంటే ఒప్పుతుందా? లోకేశ్ ఒత్తిడి తేవచ్చు కానీ దానికి లొంగిన తప్పు బాబుదే అవుతుంది. అలాగే జగన్-వైయస్ విషయం కూడా!) జగన్ వైయస్ నామజపం వదిలిపెట్టకపోవడమే దానికి కారణం. ఒడిశాలో బిజూ పట్నాయక్‌కు సమర్థపాలకుడిగానూ పేరుంది, అవినీతిపరుడిగానూ పేరుంది. అతని కుమారుడు నవీన్ పట్నాయక్ రాజకీయాల్లోకి వచ్చాక తండ్రి పేరు పార్టీకి పెట్టాడు తప్ప నిత్యం తండ్రిని గుర్తు చేయడు. తనకంటూ ఒక మంచి యిమేజి సృష్టించుకుని సమర్థంగా పాలిస్తూ పేరు తెచ్చుకుంటున్నాడు. వైయస్ సంక్షేమపథకాలే తనకు పెట్టుబడి, వాటి పేరు చెప్తే ఓట్లు రాల్తాయి అనుకున్న జగన్ మాటిమాటికీ వాటినే ప్రస్తావిస్తారు. వాటి వలన యింప్రెస్ అయినవాళ్లు కొన్ని ప్రాంతాల్లోనే వున్నారని, వైయస్ అవినీతిపరుడి యిమేజిని గుర్తుంచుకున్నవాళ్లు ఎక్కువ జిల్లాల్లో వున్నారని 2014 ఎన్నికలలో రుజువైంది. అందుకే ‘వైయస్ పాలన మళ్లీ తెస్తామని జగన్ వాగ్దానం చేస్తే జనాలు హడలిపోయి వద్దులే అనేశారు’ అని రాశాను.

సాధారణంగా అవినీతి ఎన్నికలలో ప్రధానమైన పాత్ర పోషించదు. కానీ ఒక్కోప్పుడు బలమైన ఫ్యాక్టర్ అవుతుంది. ప్రబలమైన సెంటిమెంటు వీచిన సందర్భాల్లో తప్ప ప్రతి ఎన్నిక ఫలితం అనేక కారణాల సమ్మిళితఫలం. 2009 ఎన్నికలలో వైయస్ గెలిచారంటే దాని అర్థం ఆయన పాలనలో అవినీతి లేదని కాదు. కొన్ని సంక్షేమ పథకాలు, ప్రతిపక్షాల అనైక్యత వగైరా గెలిపించాయి. అలా అయినా పాస్‌మార్కులే పడ్డాయని వైయస్సే చెప్పుకున్నారు.  ఏ జాతీయపార్టీ ముఖ్యమంత్రయినా సరే, పోగేసినదానిలో 10% మాత్రమే వుంచుకోగలడు. 90% హై కమాండ్‌కు పంపవలసినదే. వైయస్ పాలించే రోజుల్లో దేశంలో ఎక్కడో అక్కడ ఎన్నికలు జరుగుతూనే వున్నాయి. అనేక పెద్ద రాష్ట్రాలలో కాంగ్రెసు అధికారంలో లేదు. అందువలన ఆంధ్రప్రదేశ్‌పై భారం భారీగానే పడేది. వైయస్‌పై కేసులు లాజికల్ ఎండ్‌దాకా తీసుకుని వస్తే తమకే దెబ్బ తగులుతుందన్న భయంతోనే కాబోలు కాంగ్రెసు ప్రభుత్వం జగన్‌పై కేసుల్లో వైయస్ పేరు పెట్టడానికి తటపటాయించింది. ఇక టిడిపికి వస్తే హై కమాండ్ బాబే! సొంతానికి ఆయనకు ఏమీ అక్కరలేదనుకున్నా పార్టీ నడపడానికైనా తీసుకోవాలి. తనకు మద్దతిచ్చిన పెట్టుబడిదారులకు మేలు చేకూర్చాలి. ఇది ఎవరైనా వూహించగలిగినదే అయినా మీడియా ఆయన నిప్పులా బతుకుతున్నాడని మనకు నచ్చచెపుతూ వుంటుంది. మధ్యతరగతి ప్రజల్లో చాలామందికి మీడియా చెప్పినది వేదం కాబట్టి నమ్మేస్తూ వుంటారు.

ఈ నమ్మకాన్ని చెదరగొడితే తప్ప జగన్‌కు ఆంధ్ర రాజకీయాల్లో స్థానం లేదు. తన ఆర్థిక నేరాల కేసుల్లోంచి ఆయన బయటపడడానికి చాలాకాలం పడుతుంది. ఎంతోకొంత శిక్ష లేదా జరిమానా చెల్లించకుండా బయటపడడం కష్టమని అనుకుంటున్నాను. ఈ లోపున బురద కడుక్కోవడం కష్టం కాబట్టి ఆ బురదను బాబుకు పూద్దామని చూస్తున్నాడు. ఉదాహరణకి అమరావతి భూముల కథనాలలో ఫలానావాళ్లు వందల ఎకరాలు, వేల ఎకరాలు కొన్నారని రాశారు. మరి భూపరిమితి చట్టం వుండదా అన్న సందేహం వస్తుంది. ఎన్నారైలు కొన్నారంటారు, విదేశీయులు పెట్టుబడి పెట్టడానికి కొన్ని షరతులు వుంటాయి కదాన్న అనుమానం వస్తుంది. వాళ్ల కుటుంబసభ్యుల పేర కొన్నారు అని అంటారు, ఆ విషయం డాక్యుమెంటులో వుంటుందా? ఇన్‌కమ్‌టాక్స్ రిటర్న్‌లో సోర్సు ఎలా చూపిస్తారు? ఇవన్నీ ఒక్కోటి చెపుతూ పోతే నమ్మడానికి వీలుండేదేమో! అదేమీ లేకుండా యివాళ్టి పేపర్లో బాబు అవినీతి 1.35 లక్షల కోట్లు అని వేసేశారు. ఇక అసెంబ్లీలో టిడిపి వారు ‘లక్ష కోట్లు’ అని స్లోగన్ యివ్వగానే ‘లక్షా ముప్ఫయిఐదు’ అని వైకాపావాళ్లు కౌంటర్ స్లోగన్ యిస్తారేమో! తనను ‘లక్ష కోట్లు’ అంటున్నారు కాబట్టి ఆయన తనకంటె ఎక్కువ అనాలన్న తాపత్రయమా? అమరావతి భూముల కుంభకోణంలో లక్ష కోట్ల దోపిడీ అట.  ఒక కోటి ఎక్కువ కాదు, తక్కువ కాదు. సరిగ్గా లక్ష కోట్లు. పేపర్లో యిప్పటిదాకా

చదివిన ప్రకారం అమరావతి భూముల విషయంలో బాబుది ఆశ్రితపక్షపాతం, బంధుప్రీతి, ఇన్‌సైడర్ ట్రేడింగు తరహాలో ముందుగానే రహస్యసమాచారం తనవాళ్లకు అందించి వాళ్లు లాభపడేట్లు చూడడం. దీనిలో ఆయన లక్ష కోట్లు ప్రజాధనం దోపిడీ చేశాడని ఎలా చెప్పగలరు? అక్కడ పెరుగుతుందన్న ఆశతో ఆయన ఆప్తులు కొందరు బోల్డంత రేటు పెట్టి భూములు కొన్నారు. చెప్పిన స్థాయిలో రాజధాని అవతరించకపోతే నష్టపోయేది వారే, పోయేది వాళ్ల బ్లాక్‌మనీయే. అక్కడ రాజధాని రాకపోతే భూములిచ్చిన రైతులకు నష్టం, వాళ్లను దగా చేసినట్లు లెక్క. దాన్ని ఆ కోణంలో చూపాలి తప్ప లక్ష చిల్లర కోట్ల దోపిడీ అంటూ అంకెలు వేయడం దేనికి? డబ్బు తప్ప వేరేవి అంశాలు కావనుకోవడం పొరబాటు. **– (సమాప్తం) ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2016)**

**మార్చి 18** **ఎమ్బీయస్ : ఆశారాం బాపురే!**

ఆశారాం బాపు 2013 ఆగస్టు నుండి జోధ్‌పూర్ జైల్లోనే వున్నారు. కానీ అక్కణ్నుంచే ఏదో మాయామంత్రంతో తనకు వ్యతిరేకంగా సాక్ష్యమిచ్చినవారిని హాంఫట్ చేసేస్తున్నాడు. అతనికి వ్యతిరేకంగా వున్న రెండు బలాత్కార కేసుల్లో వున్న 10 మంది సాక్షులలో ముగ్గురు హత్యకు గురయ్యారు. ఒకతను మూణ్నెళ్లగా కనబడకుండా పోయాడు. తక్కినవాళ్లు ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటూ బతుకు యీడుస్తున్నారు. తమకు రక్షణ కల్పించమని పోలీసులను బతిమాలుతున్నా వాళ్లు కదలటం లేదంటే ఆశారామ్ పలుకుబడి ఎంత బలంగా వుందో అర్థమవుతుంది.

ఆశారామ్‌కి గతంలో వైద్యుడిగా పనిచేసి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పిన అమృత్ ప్రజాపతిని రాజ్‌కోట్‌లోని అతని క్లినిక్‌లోనే 2014 మే 23 న కాల్చి చంపారు. ఆశారాం అనుచరులు ఆరుగుర్ని నిందితులకుగా అరెస్టు చేశారు. అయినా ఆశారాంను యీ విషయమై యింటరాగేషన్ చేయలేదు.

ఆశారామ్‌కు వ్యక్తిగత సహాయకుడు, వంటవాడు అయిన అఖిల్ గుప్తా ఆశారామ్ తన అహ్మదాబాద్ ఆశ్రమంలో ఒక అమ్మాయిని రేప్ చేశాడని సాక్ష్యం చెప్పిన నాలుగు నెలలకు 2015 జనవరి 11 న ముజఫర్ నగర్‌లో అతను యింటికి మోటార్ సైకిలుపై వస్తూండగా కాల్చి చంపారు.

జోధ్‌పూర్ ఆశ్రమంలో రేప్‌కు గురైన అమ్మాయి తల్లీ, తండ్రి యుపిలోని షహజాన్‌పూర్‌లో వుంటారు. తమను నోరు విప్పవద్దని ఆశారాం పనివాడు అర్జున్ (పంకజ్ అనే మారుపేరు వుంది) బెదిరించాడని వాళ్లు ఫిర్యాదు చేస్తే అర్జున్ని జోధ్‌పూర్ పోలీసులు 2014 జులై 18న అరెస్టు చేశారు. కానీ అతను వెంటనే బెయిల్ మీద బయటకు వచ్చేశాడు. పోలీసులకు ఎన్నిసార్లు చెప్పినా విచారణ ముందుకు సాగటం లేదు. తండ్రికి కృపాల్ సింగ్ అనే ఎల్ఐసి ఏజంటు మిత్రుడున్నాడు. వెళ్లి అతనితో మొత్తుకున్నాడు. అతను పోలీసుల వద్దకు వెళ్లి కాస్త హడావుడి చేశాడు. దాంతో ఆశారాం అతన్ని పిలిపించుకుని 'డబ్బిస్తే తండ్రి కేసు విరమించుకుంటాడేమో, ఎడ్వాన్సుగా పది లక్షలిస్తాం, అతని ఉద్దేశం కనుక్కో' అన్నాడు. వారితో పాటు రామశంకర్ సింగ్ అనే కృపాల్ ఫ్రెండు కూడా వున్నాడు. తమ మధ్య జరిగిన 20 ని.ఎ.ల సంభాషణను కృపాల్ సింగ్ టేపుపై రికార్డు చేశాడు. దాన్ని తండ్రి పోలీసులకు అప్పగించాడు. పోలీసులకు యిప్పటిదాకా టేపుపై వాయిస్ అసలుదో, నకిలీదో పరీక్షించలేదు. పరీక్షించడానికి మూడు రోజులకు మించి పట్టదు. కానీ వారికా ఉద్దేశమే లేదు. ఒక టీవీ ఛానెల్ దాన్ని ప్రసారం చేసేసింది. ఆశారాం అనుచరులు ఆ ఛానెల్‌పై పరువునష్టం దావా వేయలేదు. నేను ఎలాగోలా బయటకు వచ్చేస్తానని అమ్మాయి తండ్రి గమనిస్తే మంచిది అనే ధ్వనిలో ఆశారాం 'నాకు మధ్యంతర బెయిల్ రావడానికి డాక్టర్ సర్టిఫికెట్ తెచ్చుకుంటున్నాను' అని చెప్పినది కూడా ఆ టేపులో వుంది. తర్వాత నిజంగానే జోధ్‌పూర్ డాక్టర్లు అతనికి మెడికల్ సమస్య వుందని సర్జరీ చేయాలని సర్టిఫికెట్టు యిచ్చారు. తండ్రి దానిపై సుప్రీం కోర్టుకి వెళ్లాడు. అప్పుడు వాళ్లు ఎయిమ్స్ డాక్టర్లను నిర్ధారించమన్నారు. వారు రిపోర్టులు పరీక్షించి ఆపరేషన్ అక్కరలేదని చెప్పడంతో జోధ్‌పూర్ డాక్టర్ల రిపోర్టు తప్పని తేలి, బెయిలు ఆగిపోయింది.

అమ్మాయి తండ్రికి మద్దతు యిస్తూ నరేంద్ర యాదవ్ తన జర్నలిస్టు "దైనిక్ జాగరణ్" పత్రికలో 'ఆశ్రమ్ ఆఫత్ మే హై' అనే పేరుతో వరుసగా వ్యాసాలు రాశాడు. అవి ఆపేయమని ఆశారామ్ పనివాళ్లు నారాయణ్ పాండే, సంజయ్ కుమార్ అతనికి రూ. 10 లక్షలు లంచం యివ్వచూపారు. తిరస్కరిస్తే చంపేస్తామని బెదిరించారు. కానీ అతను మాట వినకపోవడంతో 2014 సెప్టెంబరు 17 న అతనిపై దాడి చేశారు. ఆ కేసు కూడా ముందుకు సాగలేదు. పోలీసులు నిరాసక్తంగా వున్నారు. 2015 జులై 10 న కృపాల్ సింగ్‌పై షహజాన్‌పూర్‌లోని అతని యింటికి వెళుతూండగా దాడి జరిగింది. ముగ్గురు వచ్చి కాల్పులు జరిపారు. రెండు రోజుల తర్వాత మరణిస్తూ తనపై దాడి చేసినవారిలో అర్జున్, రాఘవ్, సంజయ్ కుమార్లు వున్నారని అతను తన మరణవాఙ్మూలంలో చెప్పాడు.

2015 ఫిబ్రవరి 2 న ఆశారామ్‌పై వున్న బలాత్కారం కేసులో ప్రధాన సాక్షి రాహుల్ సచన్ జోధ్‌పూర్ కోర్టులో సాక్ష్యం చెప్పడానికి వస్తే ఆశారామ్ అనుచరుడు సత్యనారాయణ్ గ్వాలా అతన్ని కత్తితో పొడిచాడు. అలా కత్తితో పొడవమని ఆశారామే సైగ చేశాడని సచన్ తన స్టేటుమెంటులో చెప్పాడు. అయినా పోలీసులు ఆశారామ్‌ను యీ విషయమై ప్రశ్నించలేదు. ఆ కత్తిపోటుతో సచన్‌కి కొద్దిపాటి పక్షవాతం వచ్చింది. అప్పుడప్పుడు మతిమరుపు కూడా వస్తోంది. తనకు రక్షణ కావాలని లఖనవ్‌కి వెళ్లి పోలీసులను

కోరాడు. వాళ్లు రోజంతా గార్డుని యివ్వడం కుదరదని చెప్పి కేవలం రోజులో 8 గంటలపాటు బాడీ గార్డు నిచ్చారు. అంటే ఎవరైనా దాడి చేయాలంటే ఆ 8 గంటల్లోనే చేయాలన్నమాట! ఆశారామ్‌పై వ్యాసాలు రాస్తూన్న నరేంద్ర యాదవ్‌తో సచన్ 'తన మామ, భర్త కలిసి చేసిన అత్యాచారాలను రెండు రోజుల్లో ఆశారామ్ కోడలు జానకి మీడియా ముందు వెల్లడిస్తుంది. దాంతో భూకంపం వస్తుంది చూడండి.' అని 2015 నవంబరు 23 న చెప్పాడు. అలా చెప్పిన రెండు రోజులకు సచన్ 2015 నవంబరు 25 న మాయమైపోయాడు. అతనికి బాడీగార్డుగా వున్న అమిత్ కుమార్ అతను కనపడటం లేదని ఫిర్యాదు చేయడానికి అక్షరాలా 17 రోజులు పట్టింది. ఇది వింతగా లేదా అని సబ్‌ఇన్‌స్పెక్టరును మీడియావారు అడిగితే అతను కాజువల్‌గా "సచన్ కావాలనే ఎక్కడికో వెళ్లిపోయాడు. తనే తిరిగి వచ్చేస్తాడని మా నమ్మకం" అని జవాబిచ్చాడు.

అతన్ని చంపేసి వుంటారు అంటాడు మహేంద్ర చావ్‌లా. అతను ఆశారామ్ కొడుక్కి వ్యక్తిగత సహాయకుడిగా వుండేవాడు. సాక్షిగా మారాడు. పానిపట్ వద్ద యింట్లోనే వున్న అతనిపై 2015 మే 13న తుపాకీ కాల్పులు జరిగాయి. అతను తీవ్రంగా గాయపడ్డాడు. అతను ఎన్ని ఫిర్యాదులు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. తను నోరు విప్పకుండా వుండడానికి రూ. 2 కోట్లు లంచం యిస్తానన్నారని, ఆశారామ్ అనుచరుడు నిశాంత్ ఘుంఘూస్ తనకు సూటుకేసులో డబ్బు చూపించాడని చెప్పాడు. పోలీసులు వెంటనే ఘుంఘూస్‌ను అరెస్టు చేసి అతనిపై ఎంత బలహీనమైన కేసు పెట్టారంటే మూడు రోజుల్లో అతనికి బెయిలు వచ్చేసింది. దీని గురించి మీడియా అక్కడి పోలీసులను అడిగితే 'విచారణ సాగుతోంది' అని జవాబిచ్చారు. రాష్ట్రం ఏదైనా కానీయండి, ఆశారామ్ సాక్షికి రక్షణ లేదు. వాళ్లపై దాడి జరిగినా పోలీసులు కళ్లు మూసుకుంటున్నారు. జైలు నుంచే ఆశారాం అడలగొడుతున్నాడు. కేసు విచారణకు వచ్చేసరికి ప్రాణాలతో మిగిలివున్న సాక్షులు నోరు విప్పకపోయినా, సాక్ష్యం మార్చేసినా తప్పు వాళ్లది కాదు, వ్యవస్థది. – **ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2016)**

**మార్చి 21 వీక్లీకై ఎమ్బీయస్ : ఎగ్జిక్యూటివ్‌ల బాడీగార్డులు**

మనకి సాధారణంగా సినిమాతారల పక్కన బాడీగార్డులు వుంటారని తెలుసు. తారల అభిమానులతో వచ్చిన చిక్కేమిటంటే వాళు ్లు స్టార్ల కోసం గంటల తరబడి వేచి వుంటారు. వచ్చాక మీదపడబోతారు. పడనీయకపోతే రాళ్లేసి గాయపరుస్తారు. సినిమావాళ్లకు ముక్కుమీదో, మొహం మీద చిన్న గాటు పడినా కెరియర్‌కు యిబ్బంది. అందువలన వాళ్లు బాడీగార్డులను పెట్టుకుని తమను తాము కాపాడుకుంటూ వుంటారు. సల్మాన్ ఖాన్ ఓ సారి ఔరంగాబాద్‌కు వెళితే అతను వస్తున్నాడని తెలిసి అభిమానులు అతనెక్కిన టెంపో తలుపులు బాదసాగారు. అతని బాడీగార్డు షేరా – ఒకప్పుడు మిస్టర్ బాంబే, మిస్టర్ మహారాష్ట్ర కూడా – అతన్ని ముందుసీటులోంచి వెనక సీటులోకి లాగేశాడు. ఈ జనసందోహం తాకిడికి బెదిరి, అతన్ని ఆహ్వానించిన నిర్వాహకులు మీరు సభకు రానక్కరలేదు, వెనక్కి క్షేమంగా వెళితే అంతే చాలు అన్నారు. టెంపోలోంచి దిగకుండానే మళ్లీ ఎయిర్‌పోర్టుకి బయలుదేరాడు. చుట్టూ జనం చుట్టుముట్టేసి తోసేస్తూండడంతో టెంపో ఒక పక్కకు ఒరిగిపోయింది. అలాగే 30 కి.మీ.లు ప్రయాణం చేశారు. అప్పటికీ సల్మాన్ అభిమానులు బైకులు వేసుకుని టెంపోను వెంబడించారు. చివరకు ఎయిర్‌పోర్టు రాగానే షేరా సల్మాన్‌ను ఎలాగోలా లోపలకి చేర్చి ఊపిరి పీల్చుకున్నాడు. అలాగే ఫ్లిప్‌కార్ట్ వాళ్లు తమ దశమ వార్షికోత్సవానికి అక్షయ కుమార్‌ను అతిథిగా పిలిచారు. అతనికి జనాలతో కలవడం సరదా. అభిమానుల మధ్య దూసుకుపోతూ వుంటే జనాలకు, అతనికి మధ్య అడ్డుగోడలా నిలబడడానికి సెక్యూరిటీవాళ్లకు తల ప్రాణం తోకకు వచ్చింది.

కంపెనీ ఎగ్జిక్యూటివ్‌ల వ్యవహారం యిలా వుండదు. వాళ్లు జనంలోకి దూసుకుపోదామని చూడరు. తమ సెక్యూరిటీ అందరికీ తెలిసేట్లు వుండాలని కూడా కోరుకోరు. తాము అందరికీ అందుబాటులో వుంటామని, ఎవరైనా సరే తమ వద్దకు స్వేచ్ఛగా రావచ్చనే యింప్రెషన్ కలిగిస్తూనే తమకు రక్షణ కల్పించాలని కోరుకుంటారు. బాడీగార్డులు ఎవరికీ తెలియకుండా తమను అనుసరించాలని, తాము హాజరయ్యే సమావేశాల్లోని చర్చలు బయటకు పొక్కకుండా చూడాలని, తమను కలిసే వ్యక్తుల పూర్వాపరాలు తెలుసుకోవాలని సెక్యూరిటీ ఏజన్సీలను కోరతారు. విదేశాల నుంచి వచ్చే సిఇఓలైతే మరీ జాగ్రత్తగా వుంటారు. ఏదైనా ఒక భవంతికి సిఇఓ వస్తున్నారన్నా, లేక అక్కడ సమావేశంలో పాల్గొంటున్నారన్నా సెక్యూరిటీ ఏజన్సీ వాళ్ల రక్షణకై ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. ఆ భవంతిలో అగ్నిమాపక సామగ్రి సరిగ్గా పనిచేస్తోందా లేదా, అగ్నిప్రమాదం జరిగితే బయటకు వెళ్లే మార్గాలన్నీ బాగా ప్లాన్ చేశారా లేదా అని పరీక్షిస్తారు. ఆ భవంతి ప్లాను మనసులో ముద్ర పడిపోయేదాకా సాధన చేస్తారు. ఏదైనా ప్రమాదం జరిగితే తమ క్లయింటును ఎంత వేగంగా, సురక్షితంగా బయటకు తీసుకెళ్లడమా అని ప్రణాళికలు ముందే రచించుకుంటారు. సమావేశాలు జరిగే బోర్డు రూము గదులను కనీసం ఒక రోజు ముందే తమ అధీనంలోకి తీసుకుంటారు. మైకులు, ట్రాన్స్‌మిషన్ బగ్స్, లేకుండా అణువణువూ గాలిస్తారు. కిటికీ తెరల అంచులు వుండవలసినదాని కంటె ఎక్కువ మందంగా వున్నాయా, కిటికీకి, అద్దానికి మధ్య వున్న యిన్సులేషన్ అవసరమైనదాని కంటె ఎక్కువగా వుందా అనే చిన్న విషయాలు కూడా లేజర్ గన్స్‌తో క్షుణ్ణంగా పరిశీలిస్తారు. అంతా సవ్యంగానే వుందని తృప్తి చెందాక అప్పుడు ఆ గదికి మామూలు తాళాలు కాకుండా అల్ట్రా వయొలెట్ తాళాలు వేస్తారు. అల్ట్రా వయొలెట్ పెన్నుతో సెక్యూరిటీ ఏజన్సీ సిబ్బంది సంతకం చేస్తేనే తలుపు తెరుచుకుంటుంది.

ఊళ్లోకి విమానంలో వచ్చిన అతిథి ఎయిర్‌పోర్టు దిగగానే యీ సెక్యూరిటీ ప్రారంభమవుతుంది. ఎగ్జిక్యూటివ్‌తో అనుక్షణం వుంటూ రక్షణ కల్పించేవారిని ఇపి (ఎగ్జిక్యూటివ్ ప్రొటెక్షన్) ఏజంటు అంటారు. ఒకసారి ఆరకిల్ కంపెనీ నుంచి ఉన్నతోద్యోగి విదేశం నుంచి ముంబాయి వచ్చారు. హోటల్ గ్రాండ్ హయాత్‌లో ఆయనకు రూము బుక్ చేశారు. ఇపి ఏజంటు ఆయనను ఎయిర్‌పోర్టులో కలిసి తను ఏర్పాటు చేసిన టాక్సీలో ఎక్కించుకోబోతూ వుండగానే ఆయన చటుక్కున హయాత్ టాక్సీ కనబడితే దాన్లో ఎక్కేశాడు. ఏజన్సీ మనిషి గుండె గుభేలుమంది. వెంటనే తన కారులో హోటల్‌కు ఆగమేఘాల మీద వెళ్లి, ఆయన వచ్చే సమయానికి అక్కడ కలిసి రిసీవ్ చేసుకున్నాడు. ఇలాటి సందర్భాల్లో ఆయన ఎక్కిన టాక్సీ ఎటుపోతోందో, ఏమో గమనించడానికి జిపిఎస్‌ను విస్తారంగా వాడతారు. ఆధునిక సామగ్రి సంగతి సరేసరి. సిఇఓలు తమ వ్యాపార వ్యవహారాలు చూడడం అయిపోయాక వూళ్లో షికారు కొడదామనుకుంటారు. ఏవైనా టూరిస్టు స్పాట్ చూద్దామనుకుంటారు. వాళ్లు వెళ్లే ప్రాంతాన్ని కెమెరాల ద్వారా గమనిస్తూ, ఒక కంట్రోలు రూము నిర్వహిస్తారు. ఏదైనా అపాయం సంభవించేట్లు వుంటే ముందుగా హెచ్చరిస్తారు. వారి వెంట వుండేవారిని ఇపి జేబులోనే కెమెరా అమరుస్తారు. ఇన్ని ఏర్పాట్లు చేయాలంటే ఆర్నెల్ల ముందుగానే సిఇఓ రాక గురించి, వారు సందర్శించబోయే ప్రదేశాల గురించి ముందస్తు సమాచారం కావాలని ఏజన్సీలు అడుగుతాయి. అనుకోకుండా ఎవరైనా వచ్చే సందర్భాల్లో కనీసం అయిదారు రోజుల గడువు కోరతారు. ఏజన్సీలు సిఇఓల గురించి సమస్త వివరాలు అంటే – ఆయన అలవాట్లు ఏమిటి, యిక్కడ ఆయన స్నేహితులు ఎవరు, స్వభావరీత్యా ముభావియా, సరదా మనిషా, ఎటువంటి ఆహారం యిష్టపడతారు, ఎలాటి వాహనాల్లో తిరగడానికి యిష్టపడతారు, ఆయన అభిరుచులేమిటి, ఎటువంటి ప్రదేశాలకు వెళ్లవచ్చు వంటి సమాచారమంతా సేకరించి పెట్టుకుంటారు.

గ్లోబల్ కంపెనీల నుంచి వచ్చే సిఇఓలకు సాధారణంగా సరికొత్త కార్లు యిస్తూ వుంటారు. అవి సాధారణంగా బుల్లెట్ ప్రూఫ్, బాంబ్ ప్రూఫ్ అయి వుంటాయి. ఎంత కొత్తకారైనా సరిగ్గా పనిచేస్తోందా, మధ్యలో ఆగిపోయి సెక్యూరిటీ రిస్కు తెచ్చిపెడుతుందాని పరీక్షిస్తారు. ఇక డ్రైవర్ల నయితే శల్యపరీక్షకు గురి చేస్తారు. అతని పాత రికార్డులు తవ్వి తీయడమే కాదు, వాహనం ఎక్కడైనా యిరుక్కుపోతే ఎంత త్వరగా రద్దీలోంచి తప్పించగలడు, దాడి జరిగితే క్లయింటును ఎలా రక్షించగలడు అనే విషయాల్లో పరీక్ష పెట్టి చూడడమే కాదు, తర్ఫీదు కూడా యిస్తారు. ఇంత ప్లాన్ చేసినా ఒక్కోప్పుడు అతిథులు అప్పటికప్పుడు ఏవో వింత కోరికలు కోరతారు. ట్విట్టర్‌కు సిఇఓగా పనిచేసిన డిక్ కొస్టోలో ముంబయి వచ్చినపుడు అపోలో బందర్ లోని తను బస చేసిన తాజ్‌మహల్ హోటల్ నుంచి రేడియో క్లబ్బు దాకా ఫుట్‌పాత్‌పై నడుస్తానన్నాడు. ఇపి ఏజంటు తన వెనక్కాల కాస్త దూరంలో నడవాలి తప్ప తన పక్కనే మరీ ప్రముఖంగా కనబడకూడదన్నాడు. ఇపి ఏజంటుకు చచ్చేచావైంది. ఫుట్‌పాత్ నిండా ముష్టివాళ్లు ఏజంటుకు అడ్డుపడుతూ క్లయింటుకు, అతనికి మధ్య దూరాన్ని పెంచేస్తున్నారు. కంటికి కనబడకుండా పోతే క్లయింటు భయపడతాడు. బిచ్చగాళ్లు డిక్ వద్దకు కూడా వెళ్లి డబ్బులడగసాగారు. వీళ్లు నిజంగా ముష్టివాళ్లో, పోటీ కంపెనీ తాలూకు కిరాయి మనుషులో అతనికి తెలియదు. అందువలన ఇపి ఏజంటు కేసి ప్రశ్నార్థకంగా చూసేవాడు. ఇతను ఫర్వాలేదులే అనేట్టు చూసేవాడు.

అలాగే ఒక ఇటాలియన్ కంపెనీ సిఇఓ తమ ఇండియన్ యూనిట్‌లో వున్న లేబరు సమస్య తీర్చడానికి వచ్చింది. కోపంతో వున్న కార్మికులు ఆమెను ఏమైనా చేస్తారేమోననే భయం వుంది. ఆవిడ కొలాబా కాజ్‌వేలో షాపింగు చేస్తానన్నపుడు ఇపి ఏజంటు హడిలిపోయాడు. 'అదంతా డేంజర్ జోన్, మత్తుమందుకు అలవాటు పడినవాళ్లు అక్కడ సంచరిస్తూ వుంటారు' అని నచ్చచెప్పబోయినా ఆమె వినలేదు. సరే కానీయండి అన్నాడు ఇపి ఏజంటు. ఆవిడకు 50 ఏళ్లు వున్నా మంచి ఫిట్‌గా వుంది. లిఫ్టు ఎక్కేది కాదు, మెట్ల మీదనే నడుస్తానేది, రిస్కు ఎక్కువ కదాని ఏజంటు బాధ. అంతేకాదు, ఆవిడ కుర్చీలో 12 గంటలపాటు ఏకధాటిన కూర్చునేది. ఇతను చచ్చినట్లు అంతసేపూ కాస్త దూరంలో కూర్చోవలసి వచ్చేది. ఇలా 20 రోజులు గడిచాయి. హమ్మయ్య అనుకుంటూండగా ఆఖరి రోజున యీ కొలాబా షికారు పెట్టింది. అక్కడ కూడా అతి వేగంగా నడుచుకుంటూ వెళ్లిపోతే మధ్యలో అడ్డం వచ్చే మత్తుమందు భాయీలను తప్పించుకుంటూ, ఆమెను అందుకోలేక ఏజంటు నానా అవస్థా పడ్డాడు.

లేబరుతో సమస్యలున్నపుడు సిఇఓల రక్షణ భారం మరింత పెరుగుతుంది. అలాటి కేసుల్లో క్విక్ రియాక్షన్ టీము (క్యూఆర్‌టి) ఒకటి ఏర్పాటు చేస్తారు. చర్చల సందర్భంగా ఒక్కసారిగా కార్మికనాయకులు తిరగబడి దాడి చేస్తే, ఘొరావ్ చేస్తే, బయటకు వెళుతూంటే కారు టైరులో గాలి తీసేస్తే ఏం చేయాలి, సిఇఓను బయటకు ఎంత త్వరగా తీసుకెళ్లగలం అనేవి ప్లాను చేసుకుంటారు. ఒక కంపెనీ యాజమాన్యానికి, కార్మిక నాయకులకు మధ్య చర్చలు జరిగే హాల్లో సీటింగు ఎరేంజిమెంటు మార్చాలని ఏజంటు చెప్పాడు. ఎందుకన్నాడు ఎచ్ఆర్ డిపార్టుమెంటుకు డైరక్టరుగా వున్నాయన. 'వాళ్లు సడన్‌గా మూకుమ్మడిగా మీమీద పడితే మీ మేనేజ్‌మెంటు ఉద్యోగులందరినీ ఒక గదిలోకి తీసుకెళ్లి పోలీసులు వచ్చేదాకా కాపాడాలి కదా అందుకని..' అంది ఏజన్సీ. ఆయనకు నచ్చకపోయినా ఊరుకున్నాడు. సమావేశంలో ఏ దుర్ఘటనా జరగలేదు. కానీ సమస్య పరిష్కారం కాలేదు. 'సిఇఓను, ఆయన టీమును ఆఫీసు నుంచి యింటికి, యింటి నుంచి ఆఫీసుకు చేరేటప్పుడు మేం రక్షణ కల్పిస్తాం' అని ఏజన్సీ చెపితే ఆ డైరక్టరు 'మీరు ఉత్తినే హడావుడి చేస్తున్నారు. నా కారు వెనక్కాల మీవాళ్ల కారు వస్తే నేను కార్మికులను చూసి భయపడుతున్నాననే భావం కలుగుతుంది. నాకు ఎస్కార్ట్ ఏమీ వద్దు' అని మొండికేశాడు.

ఆయన అలా అన్నా ఆయనకు తెలియకుండా కాస్త దూరంలో క్యూఆర్‌టి వాహనం అనుసరించేట్లు చూసింది ఏజన్సీ. రెండు

రోజులు గడిచాక కార్మికులు ఆయన కారుపై దాడి చేశారు. ఇనుప రాడ్లతో కిటికీ అద్దాలు పగలకొట్టి మీద పడ్డారు. క్యూఆర్‌టి వెంటనే రంగంలోకి దిగి, అతన్ని కాపాడింది. అప్పటికే అతని చెయ్యి విరిగింది. కొంచెం వుంటే ఏమయ్యేదో ఏమో! 'థ్రెట్ పెర్‌సెప్షన్ ఎనాలిసిస్' చేసి యిలాటివి ముందే వూహించడంలోనే ఏజన్సీ యొక్క ప్రతిభ తెలుస్తుంది. వీళ్ల ఎనాలిసిస్ మాట ఎలా వున్నా అతిథులకు వుండే చాదస్తాలు, భయాలు వాళ్లకు ఎలాగూ వుంటాయి. ఫలానా హోటల్లో ఫలానా మూల వుండే రూమైతేనే నాకు సేఫ్ అంటాడొక సిఇఓ. ఫలానా కారు వుంటేనే నాకు కుదురుతుంది అంటాడు మరొకడు. ఒకసారి ఒక మహిళా సిఇఓ పార్టీలో పాల్గొంటూ తన ఏజంటుకు ఒక వ్యక్తిని చూపించి అతను ఆ రోజు పార్టీలో ఎవరెవరితో మాట్లాడాడో వాళ్లందరి వివరాలూ తనకు కావాలని అడిగింది! **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2016)**

**ఎమ్బీయస్ క్రైమ్ రచన – 16**
**మార్చి 22, 23**

## ఎమ్బీయస్ క్రైమ్ రచన : ముంద్‌డా ఎల్ఐసి స్కాము

విజయ్ మాల్యా ఎగిరిపోయాడు. తను పారిపోలేదని, తిరిగి వచ్చేందుకు ప్రస్తుత తగిన సమయం కాదు కాబట్టి విదేశంలో వున్నానని ట్వీటిస్తున్నాడు. మరో ఘరానా మోసగాడిగా తేలిన మాల్యాకు యుపిఏ, ఎన్‌డిఏ ప్రభుత్వాలు రెండూ సహకరించాయని తేటతెల్లమౌతోంది. బ్యాంకు అధికారులు కానీ సిబిఐ కానీ సరైన సమయంలో తగిన చర్యలు తీసుకోలేదు. అన్ని విధాలా దగా పడిన కింగ్ ఫిషర్ ఉద్యోగులు మొత్తుకుంటున్నా యీ అధికారులు చలించకపోవడానికి కారణం ప్రభుత్వంలో మాల్యాకు వున్న దన్నే. యుపిఏ హయాంలో అతనికి బ్యాంకులు అనవసరంగా మద్దతు యిచ్చాయని ఎన్‌డిఏ సర్కారు అంటోంది తప్ప తాము వచ్చిన ఏడాదిన్నరలో పరిస్థితి చక్కదిద్దడానికి తామేం చేశారో చెప్పదు. 'మీరు మాల్యాను పారిపోనిచ్చారు' అని కాంగ్రెసు అంటే, 'మీరు కత్రోకిని పారిపోనిచ్చారుగా' అంటోంది బిజెపి. కత్రోకికి, సోనియాకు వున్న బాంధవ్యం అందరికీ విదితమే. మరి మాల్యాకు బిజెపిలో ఎవరితో బాంధవ్యం వుందో యింకా తెలియదు. ఒకరినొకరు నిందించుకుంటూ కూర్చుంటే మాకేం లాభం అంటారు కింగ్ ఫిషర్ ఉద్యోగులు. బ్యాంకుల ఉన్నతాధికారులు పడిన లాలూచీ కారణంగా బ్యాంకింగ్ వ్యవస్థే రోగగ్రస్తమై ఉద్యోగులు, డిపాజిటర్లు నష్టపోయే పరిస్థితి వచ్చింది. 'ఏ పార్టీ ప్రభుత్వమైనా సరే, ఆర్థిక నేరస్తులు తమ పనులు సాధించుకోగలరు. మంత్రులు, సెంట్రల్ సెక్రటేరియట్‌లో ఉన్నతోద్యోగులు వారికి కావలసినవన్నీ చేసి పెడతారు' అనేది కఠోర వాస్తవం. ఇది యివాళ ప్రారంభమైనది కాదు, స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర్నుంచీ వున్నదే. స్వాతంత్ర్యం వచ్చిన పదేళ్లలోనే నెహ్రూ హయాంలో ఒక స్కాము బయటపడి సాక్షాత్తూ ఆర్థికమంత్రి రాజీనామా చేయవలసి వచ్చింది. అలా జరగడం అదే తొలిసారి. దాన్ని బయటపెట్టిన ఘనత నెహ్రూ అల్లుడు ఫిరోజ్ గాంధీదే.

హరిదాస్ ముంద్‌డా కలకత్తాకు చెందిన మార్వాడీ కుటుంబానికి చెందిన వ్యక్తి. 1918లో పుట్టాడు. చిన్నవయసులోనే ఎలక్ట్రిక్ సామాన్ల వ్యాపారంలో దిగాడు. దానిలో కంటె అతను షేర్ల వ్యాపారంలో ఎక్కువ సంపాదించాడు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో కలకత్తా స్టాక్ ఎక్స్‌ఛేంజ్‌లో షేర్లు కొని, అమ్ముతూ బ్యాంకుల దృష్టిని ఆకర్షించాడు. వాళ్లు ఋణాలివ్వడానికి ముందుకు వచ్చారు. వాళ్లిచ్చిన డబ్బుతో అతను అనేక ఇంగ్లీషు కంపెనీలలో మెజారిటీ షేర్లు కొని మేనేజ్‌మెంటు తన చేతిలోకి వచ్చేట్లు చూసుకునేవాడు. తర్వాత ఆ కంపెనీ ఆస్తులు అమ్మి, కుదువబెట్టి డబ్బులు సంపాదించి, మరో కంపెనీ కొనేసేవాడు. అలా అనేక కంపెనీలను తన కనుసన్నల్లో శాసిస్తూ దీనితో బాటు షేర్ మార్కెటులో కూడా దుస్సాహసాలు చేయసాగాడు. వసంతం ఎల్లకాలం వుండదు. ముంద్‌డా కొన్న షేర్ల విలువ పడిపోయి 1957 వచ్చేసరికి అతను కలకత్తా స్టాక్ ఎక్స్‌ఛేంజికి భారీ మొత్తాలు బాకీ పడ్డాడు. అప్పటి ఆర్థికమంత్రి టిటి కృష్ణమాచారి ప్రవేశపెట్టిన బజెట్ సోషలిజానికి ఊతమిచ్చేట్లు వుంది. దాంతో స్టాక్ మార్కెట్‌లో షేర్ల ధరలు పతనమయ్యాయి. ఆ స్థితిలో ముంద్‌డా అప్పులు రూ.5.25 కోట్లు అయితే మొత్తం ఆస్తుల విలువ రూ.1.55 కోట్లు. దీనిలోంచి బయటపడడానికి అతను ప్రభుత్వధనాన్ని ఉపయోగించుకుందా మనుకున్నాడు.

చాలామంది ప్రయివేటు వ్యక్తులు ఇన్సూరెన్సు కంపెనీలు పెట్టి ప్రజల్ని మోసగిస్తూ వుండడంతో ప్రభుత్వం అంత కితం ఏడాదే జూన్‌లో 245 చిన్నా, పెద్దా యిన్సూరెన్సు కంపెనీలను జాతీయం చేసి లైఫ్ ఇన్సూరెన్సు కార్పోరేషన్‌గా (ఎల్ఐసి) ఏర్పరచింది. తన ఖాతాదారులకు యిన్సూరెన్సు సొమ్ము, బోనస్సు వగైరాలు చెల్లించడానికై వాళ్లు కట్టిన ప్రీమియమ్ సొమ్మును సరైన కంపెనీల్లో పెట్టుబడిగా పెట్టి ఆదాయాన్ని ఆర్జించే వెసులుబాటు ఎల్ఐసికి వుంది. తన కంపెనీ షేర్లను ఎల్ఐసికి అంటగడదామని ముంద్‌డా ప్లాను చేశాడు. అయితే ఆ సంస్థ ఆర్థిక శాఖ కింద వస్తుంది. ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీగా వున్న ఎచ్ఎమ్ పటేల్‌ను ఆశ్రయించాడు. ఎచ్ఎమ్ పటేల్ పూర్తి పేరు హీరూభాయ్ మూల్జీభాయ్ పటేల్. ముంద్‌డా కంటె 14 ఏళ్లు పెద్దవాడు. గుజరాత్‌లో పుట్టి, ఆక్స్‌ఫర్డ్‌లో ఎకనామిక్స్ చదివి, ఐసియస్ (ఐఏఎస్ కంటె ముందు వుండేది) అధికారిగా బ్రిటిషువారి వద్ద పనిచేశాడు. 1946లో వల్లభ్‌భాయ్ పటేల్ హోం మంత్రి అయినప్పుడు ఆయన వద్ద కాబినెట్ సెక్రటరీగా చేరాడు. దేశవిభజన సమయంలో శరణార్థులకు ఆశ్రయం కల్పించడం విషయంలో, సంస్థానాలను విలీనం చేసే విషయంలో పటేల్‌కు కుడిభుజంగా పనిచేశాడు. సమర్థుడైన అధికారిగా పేరు తెచ్చుకున్నాడు. సర్దార్ పటేల్‌కు ఆత్మీయుడైన యీ పటేల్‌కు నెహ్రూ అన్నా, నెహ్రూ సోషలిస్టు విధానాలన్నా పడదు. ఆర్థికమంత్రిగా వచ్చిన టిటి కృష్ణమాచారి స్వయంగా వాణిజ్యవేత్త (టిటికె గ్రూపు ఆయనదే) కావడంతో ఆయనతో మంచి సమీకరణమే కుదిరింది.

ఎచ్ఎమ్ పటేల్ వద్దకు 1957 జూన్ 21 న ముంద్‌డా వచ్చి "నేను కష్టాల్లో వున్నాను. నా కంపెనీల షేర్లు ఒకేసారి అమ్మకానికి పెడితే ధరలు కుప్పకూలి నష్టపోతాను. అందువలన ఎల్ఐసి నా నుండి గుత్తగా రూ.80 లక్షల విలువున్న షేర్లు కొనేసి, అప్పుడప్పుడు షేర్ మార్కెట్లో అమ్మకానికి పెడుతూ ధర పడిపోకుండా చూసుకుంటూ పెట్టుబడి రికవర్ చేసుకోవచ్చు. దీనితో బాటు ప్రజల్లో నా కంపెనీలపై నమ్మకం పెరగడానికి ఎల్ఐసి షేర్ మార్కెటు నుంచి డైరక్టుగా రూ. 30-40 లక్షల విలువున్న నా కంపెనీ షేర్లు కొనాలి." అని ప్రతిపాదించాడు. "అంతేనా?" అన్నాడు పటేల్.

"అంతే అంటే, యింకోటి వుంది. మీరు ఎల్ఐసి ద్వారా నాకు కోటి రూపాయల లోను యిస్తే నేను మీ ఎల్ఐసికి కోటి రూపాయల బిజినెస్ యిప్పిస్తాను." అన్నాడు ముంద్‌డా. "అంతేనా?"

"ఇంకోటుంది.. నా కంపెనీల్లో ఎల్ఐసి రూ.1.25 కోట్ల రూపాయల పెట్టుబడి పెడితే నేను ఏటా రూ. 15 లక్షల ఫయర్ యిన్స్యూరెన్సు బిజినెస్ యిప్పిస్తాను."

వీటిల్లో ప్రభుత్వానికి జరిగే మేలేం చూశాడో పటేల్‌కే తెలియాలి కానీ మర్నాటి కల్లా పటేల్ ఎల్ఐసికి చైర్మన్‌గా వున్న జిఆర్ కామత్‌ను పిలిచి యీ ప్రతిపాదనల గురించి ఆలోచించమన్నాడు. "మొదటిది ఫర్వాలేదు కానీ తక్కిన రెండూ మాత్రం లాభం లేదు" అన్నాడాయన.

"సరే అలాగే కానీయండి, రేపు ఆదివారమైనా సరే, ముంద్‌డాతో మీటింగు పెట్టి డిస్కస్ చేద్దాం. స్టేట్ బ్యాంక్ చైర్మన్ పిసి భట్టాచార్యను కూడా రమ్మంటాను. మీరూ రండి." అన్నాడు పటేల్. ముగ్గురు అధికారులూ కలిసి ముంద్‌డాతో "మళ్లీ షేరు మార్కెటు ద్వారా విడిగా కొనడం దేనికి, మొత్తమంతా మీ దగ్గరే కొనేస్తాం. ఏయే కంపెనీల షేర్లు కొనాలో ప్రణాళిక వేసుకుని రండి" అన్నారు.

మర్నాటికల్లా ప్రణాళిక సిద్ధం. ఈ సారి సమావేశంలో ఎల్ఐసి మేనేజింగ్ డైరక్టరు వైద్యనాథన్ కూడా వున్నాడు. ముంద్‌డా కు చెందిన రిచర్డ్‌సన్ అండ్ క్రడ్డాస్, స్మిత్ స్టెయిన్‌స్ట్రీట్, ఆస్లర్ ఎలక్ట్రిక్ లాంప్, జెస్సప్ అండ్ కంపెనీ, ఏంజిలో బ్రదర్స్, బ్రిటిషు ఇండియా కార్పోరేషన్ కంపెనీలకు చెందిన షేర్లను రూ.1.26 కోట్లకు ఎల్ఐసి కొనడానికి ఒప్పందం కుదిరింది. ఈ విధంగా ఎల్ఐసి పెట్టిన ఏడాదిలోగానే ప్రజాధనాన్ని ఆగమేఘాల మీద దుర్వినియోగం చేయడం జరిగింది.

ఈ విషయాన్ని ఫిరోజ్ గాంధీ 1957 డిసెంబరులో బయటపెట్టాడు. అతను అధికార పార్టీకి చెందిన ఎంపీ. ప్రధానికి అల్లుడు. అయినా పార్లమెంటులో ప్రసంగిస్తూ ఎల్ఐసికి ఖాతాదారులుగా వున్న 55 లక్షల మంది డబ్బుతో మార్కెట్ రేటు కంటె ఎక్కువ పెట్టి ముంద్‌డా కంపెనీల షేర్లను కొన్నారని ఆరోపించాడు. ఆర్థికమంత్రి 'అది నిజం కాదు' అన్నాడు. నెహ్రూ నివ్వెరపోయి, వెంటనే విచారణకు ఆదేశించి బొంబాయి హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా చేసి రిటైరైన ఎమ్‌సి చాగ్లాతో ఏకసభ్య యింక్వైరీ కమిటీ వేశాడు. బహిరంగంగా జరిగిన ఆ విచారణలో కృష్ణమాచారి, పటేల్ "మేం యీ పెట్టుబడులు పెట్టకపోతే కలకత్తా షేర్ మార్కెట్ కుప్పకూలి ఎంతోమంది నష్టపోయేవారు. వారి కోసం యీ పని చేశాం." అని కమిటీ ముందు వాదించారు. చాగ్లా స్టాక్ ఎక్స్‌ఛేంజ్‌లోని టాప్ షేర్ బ్రోకర్లను పిలిచి మాట్లాడాడు.

"అటువంటి పరిస్థితి ఏమీ లేదు, నిజానికి అతని కంపెనీల షేర్లు జూన్ 10 నుంచి కాస్తకాస్త పెరుగుతున్నాయి కూడా. మాలో కొంతమంది ఎల్ఐసి యిన్వెస్ట్‌మెంట్ కమిటీలో సభ్యులం కూడా. ఎల్ఐసి చైర్మన్, ఎండీ మా కమిటీని సంప్రదించి వుంటే ముంద్‌డా షేర్లను ఫోర్జరీ చేస్తూ 1956లో పట్టుబడ్డాడని చెప్పి వుండేవాళ్లం." ఆ కమిటీకి డిప్యూటీ జిఎంగా వున్న ఎచ్‌టి పారేఖ్ కూడా అవును ముంద్‌డా ఫోర్జరీ చేశాడు అని సాక్ష్యం యిచ్చాడు. విచారణ 24 రోజుల్లో ముగిసింది. చాగ్లా తన తీర్పులో 'పటేల్, ఎల్ఐసి చైర్మన్, ఎండీ ముంద్‌డాతో చేతులు కలిపి అతని బాగు కోసం ఎల్ఐసి నిధులను దుర్వినియోగం చేశారు...స్టాక్ ఎక్స్‌ఛేంజ్‌ను నిలబెట్టడానికి కాదు' అని చెప్పాడు. విషయం బయటకు వచ్చాక కృష్ణమాచారి తన ఆమోదం లేకుండా పటేల్ తీసుకున్న నిర్ణయమిది అని చెప్పాడు. ఆయనకు చెప్పే చేశాను, ఆయన అభ్యంతర పెట్టలేదు అన్నాడు పటేల్. పటేల్ కృష్ణమాచారికి చెప్తుండగా వారితో వున్న భట్టాచార్య సాక్ష్యంతో చాగ్లా మంత్రికి తెలిసే జరిగింది అని తన నివేదికలో పేర్కొన్నాడు.

చాగ్లా రిపోర్టు బయటకు రాగానే ప్రభుత్వానికి కాలుచేతులు ఆడలేదు. నెహ్రూ అయిష్టంగానే కృష్ణమాచారి చేత రాజీనామా చేయించాడు. ఇక స్కాములో పాలు పంచుకున్న ముగ్గురు పబ్లిక్ సర్వెంట్స్‌పై ఏ చర్య తీసుకోవాలో నిర్ణయించడానికి ఆల్ ఇండియా సర్వీసెస్ (డిసిప్లిన్ అండ్ ఎప్పీల్స్) చట్టం, 1958 కింద ఒక బోర్డ్ ఆఫ్ ఇంక్వైరీని సుప్రీం కోర్టు జడ్జి వివియన్ బోసు నేతృత్వంలో వేశారు. పటేల్ తన పదవిని వుపయోగించి కామత్, వైద్యనాథన్‌లను ముంద్‌డా షేర్లు కొనిపించాడని బోర్డు తీర్పు యిచ్చింది. దానిపై యుపిఎస్‌సి పునర్విచారణ జరిపి కామత్‌ను మందలించి, పటేల్‌ను క్షమించి వదిలేసింది. అబద్ధమాడినందుకు మంత్రిని అభిశంసించింది. ఒక ముఖ్యమైన విషయమేమిటంటే వివియన్ బోస్ ముందు ముంద్‌డా సాక్ష్యం చెపుతూ 1957లో తను కాంగ్రెసు పార్టీకి ఉత్తర్ ప్రదేశ్ యూనిట్‌కు రూ.1.50 లక్షల విరాళం, సెంట్రల్ యూనిట్‌కు రూ. 1.00 లక్ష తన కంపెనీ డబ్బులోంచే యిచ్చానని చెప్పాడు. ఇంకో విషయం కూడా బయటకు వచ్చింది. ఇన్‌కమ్ టాక్సు శాఖ వారు కూడా అతనితో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకుని అతని బకాయిలను మాఫ్ చేశారు. వ్యాపారస్తుడు- రాజకీయనేత- బ్యూరోక్రాట్‌ల కూటమి ఎలా పనిచేస్తుందో దేశప్రజలందరికీ తెలిసి వచ్చింది.

ఈ కథకు 'కట్ చేస్తే...' ముక్తాయింపులు కూడా చెప్పుకోవాలి. ఎల్ఐసి ముంద్‌డా కంపెనీల్లో పెట్టిన పెట్టుబడులన్నీ

బూడిదపాలయ్యాయి. నాలుగేళ్లు పోయాక 1962లో నెహ్రూ కృష్ణమాచారిని మళ్లీ కాబినెట్‌లో తీసుకున్నాడు. ఫోర్జరీ నేరానికి, మోసం చేసిన నేరానికి ముంద్‌డా అనేకసార్లు అరెస్టయి, బెయిల్ మీద బయటకు వచ్చేస్తూ వుండేవాడు. 1979 వచ్చేసరికి అతని పేరు మళ్లీ పేపర్ల కెక్కింది. బొంబాయి మలబార్ హిల్స్‌లో రిచర్డ్‌సన్ అండ్ క్రడ్డాస్‌కు చెందిన ఒక భవంతిని అతను తన భార్య పేర బదిలీ చేయించేసుకున్నాడు. ఆ కంపెనీని జాతీయం చేశారు కానీ యితను అంతకుముందే జాగ్రత్తపడ్డాడు. ఆ భవంతిలో రెండు నేషనలైజ్‌డ్ బ్యాంకుల ఆఫీసులున్నాయి. వాటిని ఖాళీ చేయించడానికి ప్రయత్నిస్తూ వచ్చాడు కానీ అంత మంచి లొకాలిటీని అవి వదులుకోవడానికి యిష్టపడలేదు. 1979లో అప్పటి ఆర్థికమంత్రితో మాట్లాడి ఆయన ద్వారా బ్యాంకు చైర్మన్లకు చెప్పించి ముంద్‌డా ఆ ఆస్తిని స్వాధీనంలోకి తీసుకుని దాని మంచి ధరకు అమ్మి బాగా లాభపడ్డాడు. బ్యాంకులు అలా ఎందుకు ప్రవర్తించాయి అని ప్రశ్నలు వుదయించాయి. ఆర్థికమంత్రి ఒత్తిడి మేరకు అని సమాధానం వచ్చింది.

ఆ ఆర్థికమంత్రి వేరెవరో కాదు, ఎచ్‌ఎమ్ పటేలే! అతను ఉద్యోగంలో రిటైరయ్యాక స్వతంత్ర పార్టీలో చేరి, తద్వారా జనతాపార్టీలోకి వచ్చి 1977లో జనతా పార్టీ తరఫున మొరార్జీ దేశాయి ప్రధాని అయినప్పుడు ఆయన అభిమానాన్ని చూరగొని ఆర్థికమంత్రి అయిపోయాడు. అంతేకాదు, మొరార్జీ కొడుకు కాంతి దేశాయిపై అనేక ఆరోపణలు వచ్చినపుడు అతన్ని రక్షించినవాడు పటేలే! చెప్పవచ్చేదేమిటంటే – కాంగ్రెసు పార్టీ అయినా, జనతా పార్టీ అయినా ముంద్‌డా వంటి నేరస్తులను రక్షిస్తూనే వచ్చింది. పేర్లు మారవచ్చు కానీ పార్టీల స్వభావం మారదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2016)**

**మార్చి 24 వీక్లీకై** **ఎమ్బీయస్ : ఆంధ్రా లండన్ ఐ కూడా అమరావతి లోనేనా?**

మార్చి 11 నుంచి 13 వరకు చంద్రబాబుగారు పెట్టుబడుల కోసం లండన్ వెళ్లినపుడు అక్కడ లండన్ ఐ చూసి దాన్ని అమరావతిలో పెట్టే అవకాశాలు పరిశీలించారని పేపర్లో వచ్చింది. అసెంబ్లీ సమావేశాలు ఫలానా టైములో జరగాలని నిర్ణయించేది ఆయనే. మళ్లీ అది నడుస్తూండగా మూడు రోజుల లండన్ యాత్ర పెట్టుకున్నదీ ఆయనే. అదేమిటో మరి! లండన్‌లో కొన్ని కంపెనీ ప్రతినిధులు కలిసి పెట్టుబడులు పెడతానన్నారట, సంతోషం. కింగ్స్ కాలేజ్ హాస్పటల్ వాళ్లు అమరావతిలో వెయ్యి పడకల ఆసుపత్రి పెడుతున్నారని బాబు చెప్పగా ఇండియన్ జర్నలిస్టులందరూ రిపోర్టు చేశారు. అదేమిటో గాని బ్రిటిషు పత్రికలలో యీ విషయం వచ్చినట్లు లేదు. కింగ్స్ కాలేజి వాళ్ల వెబ్‌సైట్‌కి వెళ్లి చూసినా మార్చి నెల ప్రెస్ రిలీజుల్లో కూడా లేదు. (నీశిశిచీరీ://గిగిగి.దిబీనీ.దీనీరీ.తిది/దీలిగిరీ/శ్రీలిఖిరిబి/చీజీలిరీరీ–జీలిజిలిబిరీలిరీ ) గతంలో అమరావతి సింగపూరు ప్రభుత్వమే చేపడుతుందని మన యిండియన్ ప్రెస్ రాయడమూ, తర్వాత అబ్బే సింగపూరు కంపెనీలనడమూ జరిగింది. చివరికి వాళ్లవి గొంతెమ్మ కోర్కెలని తేలడమూ జరిగింది. కింగ్స్ వాళ్లయినా ఆంధ్ర రాష్ట్రాన్ని సీరియస్‌గా తీసుకుంటారని ఆశిద్దాం.

దాని మాట ఎలా వున్నా ఆ ప్రెస్ రిలీజులో ఒక అంశమే నన్ను కాస్త కంగారు పెట్టింది. లండన్ వెళ్లిన సందర్భంగా ముఖ్యమంత్రి బృందం లండన్ ఐ చూడడానికి వెళ్లారు. రోజంతా పని అంటే కష్టమే, సరదాగా చూడ్డానికి వెళ్లి వుండవచ్చు, తప్పేమీ లేదు. కానీ ఉత్తినే వెళ్లారని మనం అనుకుంటామని కాబోలు 'లండన్ ఐను అమరావతిలో పెట్టే అవకాశాలు పరిశీలించమని బాబు అధికారులను ఆదేశించారు' అని వార్త యిచ్చారు. ఆంధ్ర ప్రజలందరు వెంటనే 'మేమేమీ అనుకోం కానీ దయచేసి లండన్ ఐ పెట్టే ప్రతిపాదన మానుకోండి' అని తక్షణం చెప్పాలి. లండన్ ఐ అంటే పెద్ద జెయింట్ వీలు, అది కూడా అమరావతిలోనే ఎందుకు? అమరావతిలో ఎన్ని పెడతారో అర్థం కావటం లేదు. వస్తే గిస్తే కింగ్స్ మెడికల్ కాలేజీ వారి ఆసుపత్రి కూడా అమరావతిలోనే! ఇక యిది కూడా అక్కడేనా? తక్కిన ఆంధ్ర దేశం గొడ్డుపోయిందా? ఎగ్జిబిషన్‌లో పెట్టే పెద్ద చక్రం లాటిది ఎక్కినపుడు పరిసరాలు కనబడతాయి. అరకు వ్యాలీలాటి చోట పెడితే కొండలు, లోయలైనా కనువిందుగా కనబడతాయి. కేబుల్ కారు చూడండి, రెండు కొండల మధ్య నడుపుతారు, మామూలు మైదాన ప్రాంతాల మీదుగా ఎవరూ పెట్టరు.

ఆలు, చూలు లేదు రేపే ఆయన లండన్ ఐ పెట్టేస్తున్నట్లు నీకు కంగారెందుకయ్యా, ఆంధ్రను ఎదగనీయవా? టూరిస్టులను రానీయవా? అని మీరనవచ్చు. ఆంధ్ర ఎదగాలి, అత్యంత వివాదాస్పదులైన హిందూజాల ద్వారా వచ్చినా ఫర్వాలేదు కానీ పెట్టుబడులు రావాలి. అవి రాకుండా వూరికే అంతర్జాతీయ టూరిస్టులకు అల్టిమేట్ డెస్టినేషన్‌గా చేస్తాం అంటూ హంగామా చేస్తే 'తాత్కాలిక రాజధాని కూడా ఏర్పడ లేదు కానీ, మీకు షోకులు కావలసి వచ్చాయా' అంటూ కేంద్రం మరీ బిగబట్టేస్తుంది. ఇప్పటికే వాళ్లు ఆంధ్రకు చాలా యిచ్చేసినట్లు ఫీలై పోతున్నారు. అమిత్ షా గారు వచ్చి ఏడాదిన్నరలో రూ.1.40 లక్షల కోట్లు యిచ్చామని ప్రకటించేశారు. ఎయిమ్స్‌కు 1618 కోట్లు, అమరావతికి 1500 కోట్లు, మిస్సేల్ ఫ్యాకరీకి 3200 కోట్లు, నేవీకి 3000 కోట్లు అంటూ శంకుస్థాపన రాయి వేయగానే నిధుల సంచి అందించిన ధోరణిలో చెప్పేశారు. ఈ అంకెలన్నీ కేంద్ర బజెట్‌లో ఎక్కడ కనబడుతున్నాయో ఆయనే చెప్పాలి. ఇవన్నీ యిద్దామనుకుంటున్నాం అని కాదు, యిచ్చేశాం అని చెప్పారు. అదీ బ్యూటీ! ఇప్పుడు లండన్ ఐ అని మొదలెడితే, యింకేం మరి దాని మీద వచ్చే ఆదాయంతో బతికేయవచ్చు, మీ రాజధానికి సరిపడా నిధులు మీరే తెచ్చేసుకోండి అనవచ్చు. అదీ నా భయం.

ఇంతకీ లండన్ ఐ అంటే ఏమిటో, దాన్ని మన దగ్గర నడపడం ఎంతవరకు సాధ్యమో కాస్త చూదాం. లండన్‌లో థేమ్స్ (కొందరు

టేమ్స్ అంటారు) దక్షిణతీరంలో 443 అడుగుల ఎత్తున, 394 అడుగుల వ్యాసంతో 1999లో అప్పటికి ప్రపంచంలోనే ఎత్తయిన ఫెర్రిస్ వీల్‌గా కట్టారు. ఆ ఏడాది డిసెంబరులో ప్రధాని దానికి ప్రారంభోత్సవం చేసినా సాంకేతికమైన యిబ్బంది వచ్చి మూణ్నెళ్ల దాకా ఆపరేషన్లు మొదలుపెట్టలేదు. దానికి 32 కాప్సూల్స్ (రైలు పెట్టెల్లాటివి) వుంటాయి. అవి అతి నెమ్మదిగా పైకి కిందకు తిరుగుతూ వుంటాయి. ఒక్కో దాంట్లో 25 మంది ఎక్కవచ్చు. పైకి వెళుతున్న కొద్దీ లండన్ నగరం కనబడుతూ వుంటుంది. ఆర్నెల్ల కితం నేనూ ఎక్కా, బోరు కొట్టింది. నాలాగే చాలామంది ఫీలయ్యారో ఏమో అదనపు ఆకర్షణగా 4-డి చిత్రప్రదర్శన జోడించారు. ప్రస్తుతం ఏటా 37.50 లక్షలమంది ఎక్కుతారు. కానీ దాని నిర్వహణాభారం భరించలేక స్పాన్సర్లు మారుతూ వస్తున్నారు. స్థలం యజమానులు అద్దె పెంచమంటే మా వల్ల కాదన్నారు స్పాన్సర్లు. బ్రిటిషు ఎయిర్‌వేస్, ట్యుసాడ్స్, మెర్లిన్ ఎంటర్‌టైన్‌మెంట్.. యిలా చేతులు మారుతూ వచ్చి 2015 నుంచి కోకాకోలా తీసుకుంది. ఏటా అనేకమంది (2014లో1.74 కోట్ల మంది) టూరిస్టులు సందర్శించే లండన్‌లోనే లండన్ ఐ నిర్వహణ అంత కష్టంగా వుంటే అమరావతికి వచ్చే టూరిస్టులు ఎంతమంది వుంటారనుకుని లెక్కలు వేయాలి? అదే 2014లో భారతదేశానికి వచ్చిన మొత్తం టూరిస్టులు 2.25 కోట్లు! దానిలో మన తెలుగు రాష్ట్రాలకు ఎంతమంది వచ్చి వుంటారో చూసుకుంటే అంకె చాలా తక్కువ వుండి వుంటుంది.

అమరావతిని అద్భుతంగా అభివృద్ధి చేసేస్తాం కాబట్టి కుప్పలుతిప్పలుగా వచ్చి పడిపోతారు అని అనుకునే సావకాశం లేదు. ఎందుకంటే టూరిస్టులు ఆధునిక భవంతులు చూడడానికి రారు. ప్రకృతి అందాలు చూడడానికి, చారిత్రక ప్రదేశాలు చూడడానికి వస్తారు. అమెరికాలో ఎన్నో ఆధునిక నగరాలున్నాయి, అయినా యూరోపుకి బోల్డు మంది టూరిస్టులు వెళతారు. ఎందుకంటే అక్కడ చరిత్ర వుంది. ఆనాటి భవనాలున్నాయి. లండన్‌కి వస్తే గతవైభవం వుంది, రవి అస్తమించని సామ్రాజ్యపాలకులు కట్టిన అద్భుత భవంతులున్నాయి. అమరావతికి మాత్రం చరిత్ర లేదా అంటే వుంది. కానీ అమరావతి నేలిన రాజుల రాజ్యపు విస్తీర్ణం బ్రిటన్ సామ్రాజ్యంతో పోలిస్తే చాలా చిన్నది. చిన్నదైనా, పెద్దదైనా చరిత్ర తాలూకు ఆనవాళ్లుంటే, అది ఆకర్షణీయంగా వుంటే కాస్త చూడడానికి వస్తారు. మన దగ్గర ఆనవాళ్లేమున్నాయి? రోము మురికిగానే వుంటుంది. కానీ రెండు వేల ఏళ్ల క్రిందటి శిథిలాలు చూడడానికి వస్తారు. మన దగ్గర శిథిలాలు కూడా లేవు. మనకు చరిత్ర పట్ల ఖాతరు లేదు. చూపించడానికి పాతది లేదు కాబట్టి కొత్త బిల్డింగులు కడతాం, పెద్ద జెయింటు వీలు ఎక్కి చూద్దురుగాని అంటే ఏం మోజు వుంటుంది?

టూరిస్టులను ఆకర్షించాలంటే సుందరమైన ప్రకృతి పరిసరాలనైనా చూపించాలి. మనం పురాతన సంస్కృతినే కాదు, ప్రకృతినీ కాపాడుకోము. రోడ్ల వెడల్పు పేరుతో చెట్లన్నీ కొట్టేశాం. రాజధాని ప్లాను చేశాం కానీ పర్యావరణం గురించి పట్టించుకోకుండానే ముందుకు దూసుకుపోతున్నాం. లండన్ ఐ నదీతీరాన్న వుంది. పై నుంచి చూస్తే నది పరిశుభ్రంగా కనబడుతుంది. చూడముచ్చటగా వుంటుంది. మనవాళ్లు నదీజలాలను ఎలా కలుషితం చేస్తారో విపులంగా చెప్తే వాంతి వస్తుంది. ప్రకృతిమాత, నదీమాత అంటూ శ్లోకాలు చదవడమే తప్ప వాటిని పవిత్రంగా కాదు, పరిశుభ్రంగా వుంచాలన్న ధ్యాస కూడా వుండదు మనకు. కృష్ణా పుష్కరాలు వస్తున్నాయి. మళ్లీ మట్టి పొట్లాలు, కుంకుమ పొట్లాలు ఎన్ని నదిలో పారేస్తారో ! ప్లాస్టిక్ వ్యర్థాలతో పూరంతా ఎలా నింపేస్తారో ఏమో! ఆంధ్రపౌరులు పాలకులకు చేయవలసిన విన్నపమొకటే – 'పర్యావరణం కాపాడండి చాలు, లండన్ ఐ వంటి షోకులు అక్కరలేదు. మన దగ్గర చూడడానికీ చరిత్రా లేదు, నడిపించడానికి డబ్బూ లేదు' అని. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2016)**

**మార్చి 25 వీక్లీకై** **ఎమ్బీయస్ : మమత దూకుడు**

ఏప్రిల్‌లో జరగబోయే ఎసెంబ్లీ ఎన్నికలకు తృణమూల్ కాంగ్రెస్ అందరి కంటె ముందుగా దూసుకుపోతోంది. సిపిఎం-కాంగ్రెసు పొత్తు ఖరారు కాబోతోందన్న వార్తలు వచ్చిన దగ్గర్నుంచే మమత తొందరపడింది. మార్చి 4 న ఎన్నికల ప్రకటన వెలువడిన అరగంటలోనే 294 స్థానాలకూ తన అభ్యర్థులను ప్రకటించేసింది. మూడు రోజులు పోయాక సిపిఎం 116 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. వారి భాగస్వామి కాంగ్రెసు 43 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించేసరికి మార్చి 15 వచ్చింది. ఇక బిజెపి అయితే మార్చి 9 న 52 అభ్యర్థులను ప్రకటించగలిగింది. వారిలో మమతకు వ్యతిరేకంగా నిలబడుతున్న చంద్ర కుమార్ బోస్, నేతాజీ అన్నగారి మనుమడు. ఆయన జనవరి 25నే పార్టీలో చేరాడు!

శారదా స్కాము బయటపడినా తృణమూల్‌కు ఆదరణ తగ్గలేదని అనిపించడానికి కారణం – ఆ పార్టీ టిక్కెట్ల కోసం నాయకులు పోటీ పడడం. ఎవరికి యిస్తే ఏం తకరారో అని కాబోలు మమత 94 సీట్లలో కొత్తవాళ్లను నిలబెట్టింది. 20 మంది సిటింగ్ ఎమ్మెల్యేలను తప్పించింది. ఆశ పెట్టుకున్న అభ్యర్థుల అనుచరులు వర్ధమాన్, వీర్‌భూమ్, మాల్డా, దక్షిణ 24 పరగణా, హౌడా జిల్లాలలో నిరసనగా ఊరేగింపులు చేసి పార్టీ ఆఫీసు ముందు ప్రదర్శనలు నిర్వహించారు. మమతను డైరక్టుగా తిట్టలేరు కాబట్టి ఆమెను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ సీనియర్ నాయకులను నిందిస్తూ నినాదాలు చేశారు. హౌడాలో పార్టీ అభ్యర్థి పేరును గోడల మీద వున్న పోస్టర్లలో కనబడితే మసి పూసేశారు. పార్టీ పట్ల ప్రజలు కోపంగా వుంటే వీరిలా ప్రవర్తించేవారు కాదు కదా అన్న లెక్కతో కాబోలు మమత బెదరకుండా యిష్టం లేనివారు పార్టీలోంచి తప్పుకోవచ్చు అని ప్రకటించింది.

మమత ఎంపిక చేసిన అభ్యర్థులు కొందరు విలక్షణంగా వున్నారు. క్రికెట్ బోర్డు మాజీ అధ్యక్షుడు దాల్మియా కుమార్తె వైశాలీని,

సినిమా నటుడు సోహం చటర్జీని ఆమె పార్టీలో చేర్చుకుని టిక్కెట్టిచ్చింది. జల్పాయిగుడిలో ఎడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసుగా వున్న జేమ్స్ కుజూర్ మమతకు ఆప్తుడు. గిరిజనుడైన అతను అక్కడ తేయాకు తోటల్లో వచ్చిన అనేక సమస్యల పరిష్కారంలో ఆమెకు అండగా నిలిచాడు. అతను ఉద్యోగంలో వుండగానే మమత షెడ్యూల్ తెగలకు కేటాయించిన కుమార్‌గ్రామ్ నియోజకవర్గం నుండి నిలబడడానికి టిక్కెట్టు యిచ్చింది. సర్వీసులో వుండగానే ఎలా నిలబడతారని అడిగితే 'నేను అక్టోబరులో రిటైరు కావాలి, రాజీనామా అప్లికేషన్ పెట్టాను, పెండింగులో వుంది. నా బాధ్యతల నుంచి తప్పుకునే పోటీ చేస్తున్నాను' అన్నాడతను. 'ఇంకా వుద్యోగంలో వున్న వ్యక్తి కాబట్టి ఎన్నిక నిర్వహించే ప్రభుత్వోద్యోగులు అతన్ని చూసి భయపడరా?' అంటున్నారు సిపిఎం వారు. సిలిగుడిలో మమత భాయిచుంగ్ భూటియా అనే ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్రీడాకారుణ్ని అభ్యర్థిగా పెడదామనుకుంది. అతను 2014లో డార్జిలింగ్‌లో తృణమూల్ అభ్యర్థిగా నిలబడితే, జిజెఎమ్ సహాయంతో బిజెపి అతన్ని ఓడించింది. ఈ మధ్య అక్కడ సిపిఎం బలం పుంజుకుంది. అందుకని మమత భూటియా ద్వారా సిపిఎం అభ్యర్థిని ఓడిద్దామనుకుంటోంది.

జిజెఎమ్(గూరా? జనముక్తి మోర్చా)కు మాజీ నాయకుడు హర్కా బహాదూర్ ఛెత్రిని తృణమూల్ తన అభ్యర్థిగా ప్రకటించింది కానీ అతను యిష్టపడటం లేదు. గూరా?లాండ్ ఏర్పాటును వ్యతిరేకించే తృణమూల్ తరఫున తను గెలవడం కష్టమని అతనికి తెలుసు. అందువలన 'నేను స్వతంత్రుడిగా నిలబడతాను, మీరు మద్దతివ్వండి చాలు' అని చెప్తున్నాడు. 2014 పార్లమెంటు ఎన్నికలలో బిజెపి-జిజెఎమ్ పొత్తు వుంది కాబట్టి డార్జిలింగ్ పార్లమెంటు స్థానం నుండి బిజెపి అభ్యర్థి గెలిచాడు. సిపిఎం జిజెఎమ్‌ను దువ్వడానికై మూడు పర్వతప్రాంత జిల్లాలలో తమ కాండిడేట్లను నిలపడం లేదని ప్రకటించింది. జిజెఎమ్‌తో తమ పొత్తు చెదరలేదని బిజెపి నాయకత్వం ప్రకటిస్తోంది కానీ ఏ యే స్థానాలు యిచ్చారో చెప్పటం లేదు. అవతల జిజెఎమ్ ఎటూ చెప్పటం లేదు. 2014 నాటి మోదీ హవా యిప్పుడు లేదని బెంగాల్ పరిశీలకుల అంచనా. అందుకే కాబోలు మోదీ ప్రచారానికి రాడని బిజెపి కూడా చెప్తోంది. బిజెపికి తాజాగా తగిలిన దెబ్బ వాళ్ల బెంగాల్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షకీల్ అన్సారీ రాజీనామా చేయడం! బిజెపి యిప్పటిదాకా ప్రకటించిన 52 అభ్యర్థులలో ఒక ముస్లిము కూడా లేడని అతని అభియోగం. రాష్ట్రంలో 28% మంది జనాభా వున్న ముస్లిములలో ఎమ్మెల్యే కాతగిన వాడు ఒక్కడు కూడా వాళ్లకు కనబడలేదా అని అతని ప్రశ్న.

బిజెపి ధోరణికి భిన్నంగా ముస్లిములను సంతృప్తిపరచే ధోరణి మమత కొనసాగిస్తూనే వుంది. టిప్పుసుల్తాన్ మసీదు షాహి ఇమామ్ పత్రికా సమావేశం పెట్టి తృణమూల్‌కు ఓటేయమని ఓటర్లకు విజ్ఞప్తి చేశాడు. మరొక ముస్లిం లీడరు, ఆలిండియా యునైటెడ్ డెమొక్రాటిక్ ఫ్రంట్‌కు చెందిన సిద్దిఖుల్లా చౌధురీ తృణమూల్‌లో చేరి టిక్కెట్టు సంపాదించాడు. ఫుట్‌బాల్ క్రీడాకారుడు రహీమ్ నబీ కూడా అదే బాటలో నడిచి అభ్యర్థిగా నిలబడుతున్నాడు. వీరితో బాటు సిపిఎం నుంచి వచ్చిన ముస్లిం నాయకుణ్ని మమత ఆకర్షించింది. దక్షిణ 24 పరగణాల జిల్లాలో గతంలో మమతను సమర్థించిన ఎస్‌యుసిఐ యీసారి సిపిఎం-కాంగ్రెసు కూటమికి మద్దతిస్తోంది. వారిని ఎదుర్కోవాలంటే ఆ జిల్లాకు చెందిన ప్రముఖ నాయకుడు ఎవరా అని చూసింది. సిపిఎంకు చెందిన అబ్దుర్ రజాక్ మొల్లా 1972 నుంచి ఆ జిల్లాలో అప్రతిహతంగా గెలుస్తూ వచ్చాడు. అతన్ని మూడేళ్ల క్రితం తృణమూల్ కార్యకర్తలు పట్టుకుని చితక్కొట్టారు కూడా. అయినా సిపిఎంనుంచి వచ్చేస్తే టిక్కెట్టిస్తానని మొల్లాకు ఆశ చూపింది మమత. అతను సరేనన్నాడు. ఇవన్నీ యిచ్చిన దన్నుతో, శారదా స్కాము తననేమీ చేయలేదన్న ధీమాతో మమత ఆ స్కాము నిందితుడు, ప్రస్తుతం కారాగారవాసి అయిన మాజీ మంత్రి మదన్ మిత్రకు కూడా టిక్కెట్టిచ్చింది. **- ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2016)**

**మార్చి 26 వీక్లీకై** ఎమ్బీయస్ : కింగా? కింగ్‌మేకరా?

ఇటీవల కాంచీపురంలో జరిగిన రాజకీయ సభలో తమిళ యాక్టర్ విజయకాంత్ భార్య ప్రేమలత తన భర్త అభిమానులను ఉద్దేశించి ఒక ప్రశ్న వేసింది - "మీ కెప్టెన్ కింగా? కింగ్‌మేకరా?" అని. "కింగ్.. కింగ్" అని వాళ్లు అరిచారు. ఇక విజయకాంత్ ఫిక్సయిపోయాడు - తనే కింగ్ అని. కొన్ని రోజులు పోయాక బిజెపి కేంద్రమంత్రి జావడేకర్ తనను కలిసి పొత్తు గురించి ప్రస్తావించినపుడు బిజెపికి ఎక్కువ సీట్లు యివ్వడానికి నిరాకరించాడు. అంతేకాదు, డిఎంకె, ఎడిఎంకె కూటములు రెండిట్లో చేరడానికి ససేమిరా అంటున్నాడు. ఎడిఎంకెలో కింగ్ లేడు కానీ క్వీన్ వుంది. డిఎంకెలో అయితే తన వయసువాడే అయినా స్టాలిన్ వున్నాడు. విజయకాంత్ అలా డిసైడయినా కరుణానిధి యింకా ఆశతోనే వున్నాడు. 'కాయ పక్వానికి వచ్చింది' అన్నాడు డిఎండికె తమ కూటమిలో చేరే విషయం అడిగినప్పుడు!

2005లో పార్టీ పెట్టినపుడే విజయకాంత్ తను సినిమాలోనే కాదు, రాష్ట్రానికే కెప్టెన్ అవుతానని ప్రకటించి మరుసటి ఏడు ఎన్నికలలో 234 సీట్లలోనూ పోటీ చేశాడు. తనొక్కడే గెలిచాడు కానీ 8.38% ఓట్లు గెలిచి అందర్నీ ఆశ్చర్యపరచాడు. ఆ తర్వాత నుంచి అన్ని ఎన్నికలలో పోటీ చేస్తూనే వున్నాడు. 2009లో 10% ఓట్లు, 2011లో ఎడిఎంకెతో పొత్తు పెట్టుకుని 7.88% ఓట్లతో 29 సీట్లు గెలిచాడు. కానీ జయలలితతో పోట్లాడి విడిపోయాడు. 2014 పార్లమెంటు ఎన్నికలలో వచ్చేసరికి బిజెపితో పొత్తు పెట్టుకుని 5.19% ఓట్లు తెచ్చుకున్నాడు. ప్రస్తుతం అతని బలం ఎంతుందో ఎవరికీ తెలియదు. కనీసపక్షంగా 3%, అధికంగా 5% వుంటుందని అనుకుంటున్నారు. డిఎంకె అంతర్గతంగా చేయించుకున్న సర్వే రెండు ప్రధాన కూటముల బలాబలాలు సమానంగా

వున్నాయనీ, డిఎండికె లాటిది తోడయితే త్రాసు మొగ్గు చూపుతుందని చెప్పింది. అందుకని విజయకాంత్‌కై యింత వెంపర్లాట. ప్రస్తుత ప్రభుత్వంపై వ్యతిరేకత వున్నమాట వాస్తవమే అయినా మరీ అంత ప్రస్ఫుటంగా లేదని, ప్రతిపక్షాలు కలవని పక్షంలో జయలలితే మళ్లీ నెగ్గవచ్చని అంటున్నారు.

విజయకాంత్‌కు వ్యక్తిగతంగా మంచిపేరుంది. సోషల్ నెట్‌వర్క్‌లో అతనిపై జోకులున్నా, పక్కా తాగుబోతని అందరికీ తెలిసినా, వ్యక్తిగా మాయామర్మం తెలియనివాడని, పేదాగొప్పా తేడా పట్టించుకోకుండా అందరితో కలిసిపోతాడనీ అందరూ చెప్తారు. గ్రామీణ ప్రాంతాల్లో యిలాటివి నచ్చుతాయి. డిఎంకె, ఎడిఎంకెలకు ప్రత్యామ్నాయంగా ఏదైనా కనబడితే 10-15% ఓటర్లు ఓట్లేయడానికి సిద్ధంగా వుంటారని, వారిని ఆకట్టుకుంటే తగినన్ని సీట్లు వస్తాయని పరిశీలకులు అంటారు. దేవర్ కులానికి చెందిన యువతిని పెళ్లాడిన దళితయువకుణ్ని భార్య బంధువులు ఉడుమల్‌పేటలో పరువుకోసం హత్య చేసినపుడు దేవర్ ఓట్లు పోతాయన్న భయంతో డిఎంకె, ఎడిఎంకె రెండూ మౌనంగా వుండిపోయాయి. వణ్నియార్ కులస్తుల పార్టీ అయిన పిఎంకె దాన్ని శాంతిభద్రతల సమస్యగా కొట్టి పారేసింది. లెఫ్ట్ కూటమి మాత్రం కులవివక్షత కారణంగానే యిది జరిగిందని విమర్శించింది. విజయకాంత్ కూడా అదే ధోరణిలో విమర్శించడంతో లెఫ్ట్ కూటమిలో ఆశలు చిగురించాయి. అతను తమతో కలవాలని కోరుతూ బహిరంగ ప్రకటనలు చేస్తోంది. నిజానికి డిఎంకె, ఎడిఎంకె కూటములకు భిన్నంగా వైగో, బిజెపి, లెఫ్ట్, కొన్ని చిన్న పార్టీలతో కలిపి కూటమి ఏర్పాటు చేద్దామని విజయకాంత్ అనుకున్నాడట. కానీ బిజెపి వున్న కూటమిలో మేం చేరం, నువ్వు కూడా బిజెపి ధ్యాస వదిలిపెట్టి మాతో చేరు అని లెఫ్ట్, వైగో అడుగుతున్నారు. కానీ విజయకాంత్‌కి బిజెపి ధ్యాస పోలేదు. ఫైనల్‌గా పొత్తు పెట్టుకుంటాడో లేదో యింకా తేలలేదు. అతను పెట్టుకోకపోతే తను పెట్టుకుందామని పిఎంకె ఎదురు చూస్తోంది. పిఎంకె తరఫున 47 ఏళ్ల డా॥ అన్బుమణి రాందాస్ ముఖ్యమంత్రి కాగోరుతున్నాడు. వాళ్లకు 4-5% ఓట్లున్నాయి. బిజెపితో సంప్రదింపులు సాగిస్తున్నాడు కానీ బిజెపి విజయకాంత్ నిర్ణయం కోసం ఎదురుచూస్తోంది. **- ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2016)**

**మార్చి 27 వీక్లీకై ఎమ్బీయస్ : కేరళలో కూడా తారాతోరణం**

దక్షిణాదిన సినిమాతారలు రాజకీయరంగంలో రావడం తమిళనాడుతో ప్రారంభమై, ఆంధ్రప్రదేశ్‌కు కూడా పాకింది. ఆ తర్వాత కర్ణాట కూడా ఆ బాటలో నడిచింది. ఏటా అనేక చిత్రాలు నిర్మించే కేరళలో మాత్రం సినిమా, రాజకీయం రెండింటిని వేర్వేరుగా చూశారు. అభిమానసంఘాలంటూ వుంటే ఆ సభ్యులే పార్టీ కార్యకర్తలుగా పనిచేస్తారు. కేరళలో అభిమానసంఘాలు, బిరుదప్రదానాలు లేవు. మలయాళ సూపర్ స్టార్ ప్రేమ్ నజీర్ 1970లలో కాంగ్రెసు పార్టీ తరఫున ప్రచారం చేసిన రోజుల్లో కాస్త వూగాడు కానీ ఓ సారి ఓడిపోవడంతో మళ్లీ రాజకీయాల్లోకి దిగలేదు. 1999లో మురళి అనే నటుడు లెఫ్ట్ మద్దతుతో అలప్పుళాలో కాంగ్రెసు అభ్యర్థి విఎం సుధీరన్‌పై పోటీ చేసి ఓడిపోయాడు. లెఫ్ట్ లెనిన్ రాజేంద్రన్‌ను కూడా నిలబెడితే అతనూ కాంగ్రెసుకు చెందిన కెఆర్ నారాయణన్ చేతిలో ఓడిపోయాడు. ఇలా నటులు ఓడిపోయినా "ఛెమ్మీన్" సినిమా ద్వారా జాతీయస్థాయిలో ఖ్యాతి తెచ్చుకున్న దర్శకుడు రామూ కారియట్ మాత్రం 1965 అసెంబ్లీ ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా నెగ్గాడు. అలాటి కేరళలో కొద్దికొద్దిగా మార్పు వస్తోంది. మే 16 నాటి అసెంబ్లీ ఎన్నికలలో నలుగురు తారలు పోటీ చేస్తున్నారు.

రాజకీయాల్లోకి రావడమే కాక, మంత్రి కూడా అయిన తొలి మలయాళ నటుడు కెబి గణేష్ కుమార్. అతని తండ్రి బాలకృష్ణ పిళ్లయ్ కాకలు తీరిన రాజకీయయోధుడు. కేరళ కాంగ్రెసును చీల్చి తన పేర కేరళ కాంగ్రెసు (బి) ప్రారంభించినవాడు. గణేశ్ తన 19వ యేట సినిమా రంగంలో ప్రవేశించాడు. రౌడీ యువకుడిలాటి పాత్రల్లో, సపోర్టింగ్ కారెక్టర్లలో రాణించాడు. ఆ పరిస్థితుల్లో తండ్రి కొడుకుని 2001లో 35 ఏళ్ల వయసులో రాజకీయాల్లోకి దింపి తన పక్క నియోజకవర్గంలో నిలిపాడు. గణేశ్ తన ప్రత్యర్థి ప్రకాశ్ బాబును దాదాపు 10 వేల తేడాతో ఓడించాడు. ఎకె ఏంటోనీ కాబినెట్‌లో ట్రాన్స్‌పోర్టు మంత్రిగా చేరి స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు కార్పోరేషన్‌ను కష్టాల్లోంచి గట్టెక్కించి మంచి పేరే తెచ్చుకున్నాడు. రెండేళ్లు పోయాక తండ్రి బాలకృష్ణ పిళ్లయికి తనే మంత్రి కావాలన్న ఆశ పుట్టి కొడుకుని తప్పుకోమన్నాడు. గణేశ్ మారు మాట్లాడకుండా దిగిపోయాడు. ఈ మోడర్న్ 'యయాతి-పురూరవుడి' గాథ ఆధారంగా "లయన్" అనే సినిమా దిలీప్ హీరోగా 2005లో వచ్చింది. తండ్రి అవినీతిపరుడైన రాజకీయనాయకుడు. పేరు బాలగంగాధర మేనోన్. అతనికి తోడుగా అల్లుళ్లు. అతని కొడుకు (పేరు కృష్ణకుమార్) మాత్రం మంచివాడు. మోసం, దగా చేయకుండా నిజాయితీగా తనకంటూ ఒక రాజకీయ వేదిక ఏర్పరచుకుందామని ప్రయత్నిస్తాడు. ఈ సినిమా సూపర్ హిట్ అయింది.

2006 వచ్చేసరికి రాష్ట్రం మొత్తంలో లెఫ్ట్ హవా వీచి, కొల్లమ్ జిల్లాలో 12 స్థానాల్లో 11 గెలిచింది. కొడుకు నుంచి మంత్రి పదవి గుంజుకున్న బాలకృష్ణ కూడా సిపిఎం అభ్యర్థి చేతిలో ఓడిపోయాడు. కానీ గణేశ్ 11 వేల తేడాతో సిపిఐ అభ్యర్థిని ఓడించి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఐదేళ్లు పోయేసరికి 2011లో 20 వేల తేడాతో గెలిచి ఫారెస్టు, స్పోర్ట్‌స్ మంత్రి అయ్యాడు. అతని భార్య డా॥ యామిని తంగచ్చి అతనిపై గృహహింస కేసు పెట్టడంతో రెండేళ్ల తర్వాత రాజీనామా చేయవలసి వచ్చింది. తర్వాత వాళ్లిద్దరూ విడాకులు తీసుకున్నారు. గణేశ్ 2014లో బిందు మేనోన్‌ను పెళ్లాడాడు. రాజకీయాల్లోకి వచ్చాక కూడా గణేశ్ సినిమాలో, టీవీ సీరియల్స్‌లో, టీవీ షోల్లో చేస్తున్నాడు. పాత్రల ఎంపికలో జాగ్రత్త వహిస్తూ మంచివాడి పాత్రలు వేస్తున్నాడు. ఈ ఎన్నికలలో కూడా

నిల్చుంటున్న గణేశ్ యీ సారి లెఫ్ట్ ఫ్రంట్‌తో జత కట్టవచ్చుంటున్నారు. గణేశ్ కాకుండా రాజకీయాల్లోకి వచ్చిన మరో నటుడు హాస్యనటుడు ఇన్నోసెంట్. అతనికీ రాజకీయ నేపథ్యం వుంది. తండ్రి సిపిఎం కార్యకర్త. 2014 పార్లమెంటు ఎన్నికలలో చాలకుడి నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలిచాడు. అతనికి లెఫ్ట్ ఫ్రంట్ మద్దతు యిచ్చింది. కాంగ్రెసు అభ్యర్థి పిసి చాకోపై అలిగిన కాంగ్రెసు కార్యకర్తలు ఇన్నోసెంట్‌కు ఓటేయడంతో అతను గెలిచాడు.

వీళ్లను చూసి చాలామంది నటులకు ఆశ పుట్టింది. వారిలో సురేశ్ గోపీని చెప్పుకోవాలి. తెలుగు వారికి కూడా సుపరిచితుడైన యితను బిజెపి అభిమాని. బిజెపి తరఫున నిలబడతాడని అనుకున్నారు కానీ తనకు ఎన్ఎఫ్‌డిసి చైర్మన్ పదవి యివ్వలేదని అలిగి నిలబడనని చెప్పాడట. కాంగ్రెసు తరఫున ఆరూర్ నుంచి సిద్దిఖీ, పత్తనపురం నుంచి జగదీశ్ నిలబడుతున్నారు. వడకాంజెరి నియోజకవర్గంలో కరుణాకరన్ కూతురికి ప్రత్యర్థిగా సిపిఎం మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా నిలబడుతున్నానని నటీమణి కెపిఎసి లలిత ప్రకటించగానే ఆమెకు వ్యతిరేకంగా "మాకు కావలసినది ఆకాశంలో తారలు కాదు, నేలపై నిలిచి మాతో కలిసి పనిచేసేవాళ్లు" అంటూ వూరంతా పోస్టర్లు వెలిశాయి. ఇతర నటీనటులు ముఖేశ్, శ్రీనివాసన్, నెడుముడి వేణు, షీలా, రాజసేనన్, దేవన్ కూడా రంగంలోకి దిగవచ్చుని వార్తలు వస్తున్నాయి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2016)**

**మార్చి 28** **ఎమ్బీయస్ : భరతమాతకు జై అనాల్సిందేనా?**

'హిందూస్తాన్‌కి జై' అంటాను తప్ప 'భరతమాతకు జై అనను' అని ఒవైసీ అనడం, దాన్ని అతని పార్టీ ఎమ్మెల్యే మహారాష్ట్ర అసెంబ్లీలో పునరుద్ఘాటించడం, వెంటనే అన్ని పార్టీల వాళ్లూ కలిసి అతన్ని ఆ సెషన్ వరకు (కోడెల వారు సీట్లో వుండి వుంటే ఏడాది చేసేవారేమో!) సస్పెండ్ చేయడం జరిగాయి. భరతమాతకు జై అననివాళ్లందరూ దేశద్రోహులే అనీ, రజాకార్ల వారసులనీ వెంకయ్యనాయుడుగారు నిర్వచించారు. వాళ్ల పౌరసత్వాలను, ఓటు హక్కును రద్దు చేయాలని శివసేన డిమాండ్ చేస్తోంది. మధ్యప్రదేశ్ అసెంబ్లీ వేరేమీ పని లేనట్లు ఒవైసీని అభిశంసించింది. దేశభక్తికి యింత సింపుల్ లిట్మస్ టెస్టు వుంటుందని నేనెప్పుడూ అనుకోలేదు. విజయ మాల్యా పారిపోతూ పారిపోతూ 'భారత్‌మాతాకీ జై' అనేసి వుంటే అతనూ దేశభక్తుడి కిందే లెక్కలోకి వచ్చేవాడేమో! భారతమాతకు జై అనని వాళ్లందరూ భారతదేశద్రోహులా అన్న ప్రశ్నకు సమాధానం చెప్పేముందు 'తెలుగుతల్లికి జై' అననివాళ్లందరూ తెలుగుద్రోహులా అని అడుగుతాను. కెసియార్ తెలుగులో మహా పండితుడు. ఆ భాషపై ప్రేమ వున్నవాడు, అయినా తెలుగుతల్లిని దెయ్యం అన్నాడు, ఎక్కడ నుంచి వచ్చింది అన్నాడు, ఎక్కడా లేనిదాన్ని పుట్టించారని తీర్మానించాడు. అయినా తెలుగు రాష్ట్రంలో ఆయన ఓటుహక్కు రద్దు కాలేదు సరికదా, రెండు తెలుగు రాష్ట్రాలలో ఒకదాన్ని ఏలేస్తున్నాడు. కెసియార్ అలా అన్నపుడు మర్యాదహీనంగా మాట్లాడాడని వాపోయారు తప్ప 'తెలుగుతల్లి ఒక కల్పన' అనే పాయింటును ఎవరూ ఖండించలేదు. సొంతంగా కల్పనాశక్తి వుంది కనుక ఆయన 'తెలంగాణ తల్లి'ని కల్పించాడు. అది మన కళ్లెదురే జరిగింది. రేప్పొద్దున్న 'ఎక్కడి తెలంగాణ తల్లి? ఎవరికి తల్లి? దానిలో కెసియార్ అమ్మగారి పోలికలు కనబడుతున్నాయి, నేను మరో మంజీరాతల్లి అని సృష్టిస్తాను.' అని వేరెవరైనా అంటే అననూ వచ్చు. భరతమాత అనే మాత ఏదైనా పురాణవ్యక్తి అయితే ఆవిడ గురించి చర్చించవచ్చు. ఎవరో కవి దేశాన్ని తల్లిగా భావించి భరతమాత అన్నారు. చిలకమర్తి వారు దేశాన్ని పాడియావుతో పోల్చారు. గురజాడ వారు దేశమంటే మట్టి కాదోయ్, మనుషులోయ్ అన్నారు.

ఇలా ఒక్కొక్క కవి ఎలా కావలిస్తే అలా దేశాన్ని ఆరాధించారు. మనం మాతృదేశం అంటారు. జర్మనీవాళ్లు తమ దేశాన్ని పితృదేశంగా భావిస్తారు. చంద్రుణ్ని వారి కవిత్వంలో స్త్రీగా భావిస్తే, మనం పురుషుడిగా భావిస్తాం. దేవతలు కొందరు పరమభక్తులకైనా దర్శనమిచ్చారేమో కానీ భరతమాత మాత్రం ఎవరికీ దర్శనం యివ్వలేదు. ఆవిడ ఎలా వుంటుందో తెలియదు. భారతదేశం మ్యాప్ దగ్గర పెట్టుకుని ఆవిడ హిమకిరీటాన్ని ధరించిందని, వింధ్యపర్వతాలను వడ్డాణంగా పెట్టుకుని, కాళ్లకు సముద్రజలాల మంజీరాలతో విలసిల్లుతోందని చిత్రకారుడు చిత్రీకరించవచ్చు. అంత మాత్రం చేత అదే ఆమె రూపమని ఎవరూ ధృవీకరించలేరు. భారతమాతాకీ జై అనేది మన జాతీయనినాదం కాదు, పతాకవందనం తర్వాత, ఉపన్యాసం ముగింపులో 'జైహింద్' అనే పద్ధతి వుంది కానీ భారతమాతా కీ జై అనే సంప్రదాయం లేదు. ఎవరైనా అంటే వారి యిష్టం. అననివారిని ఒత్తిడి చేసే హక్కు, దండించే హక్కు ఎవరికీ లేదు – ఎందుకంటే అది జాతీయగీతం కాదు, జాతీయపతాకం కాదు, జాతీయపక్షి, జాతీయపుష్పం వగైరా ఏమీ కాదు. జాతీయగీతం అంటే గుర్తుకు వచ్చింది – దానిలో మనం కీర్తించేది ఒక అధినాయకుణ్ని! ఆయన ప్రజాసమూహాల మనస్సులను పాలించే అధినాయకుడు అతనికి జయహే అంటున్నాం. ఆయన జయగాథలు పాడతామని చెప్తున్నాం. ఆయనకు భారతమాతకు మధ్య బాంధవ్యం ఏమిటో ఎవరైనా చెప్పగలరా? తల్లా, భార్యా, కూతురా? ఆయన రూపాన్ని ఎవరైనా చిత్రీకరించారా? ఆయనా ఒక కల్పనే కదా, ఆయన్నీ ఎవరూ చూడలేదు, పరమ దేశభక్తులు కూడా ఆయన యిలా రాజులా వుంటాడు, లేదా వేదాంతిలా వుంటాడని వర్ణించలేదు కదా. ఒవైసీ జాతీయగీతాన్ని పాడడానికి నిరాకరిస్తే అప్పుడు చర్చ తీసుకోవచ్చు. కానీ భారతమాతా కీ జై అనే అనలేదని తప్పు పడితే రేపు మరొకడు 'రాజ్ కరేగా ఖాల్సా' అనలేదని అభిశంసించవచ్చు. నమస్కారం అనడానికి బదులుగా ఉత్తరభారతంలో చాలామంది 'రామ్‌రామ్' అని పలకరించుకుంటారు. మనం అలా అనం కాబట్టి మనల్ని హిందువులం కాదని ఎవరైనా అంటే ఎలా వుంటుంది? కొందరు సాయి భక్తులకు ఫోన్ చేస్తే 'హలో' అనే బదులు 'సాయిరామ్' అంటారు. వాళ్లిష్టం. మనల్ని కూడా హలో అనకుండా

సాయిరాం అనాలని, లేకపోతే సాయిబాబాను అవమానించినట్లే అని వాదిస్తే ఎలా?

జనగణమనలో వుండే అధినాయకుడికి జయహే అని అనడానికి ఒవైసికి లేని అభ్యంతరం భరతమాతకి జై అనడానికి ఎందుకు రావాలి అనే సందేహం వస్తుంది. ఎందుకంటే రెండూ కల్పనలే. హిందూస్తాన్‌కి జై అన్నా జైహింద్ అన్నా ఒక ప్రాంతానికి చెందిన నినాదం. కాల్పనిక పదార్థం కాదు. కానీ అధినాయకుడు, భరతమాత యిద్దరూ కాల్పనిక వ్యక్తులే. మరి యిద్దరిలో వివక్షత దేనికి? స్త్రీలంటే ఒవైసీకి పడదా? లేక షబానా అజ్మీ సూచించినట్లు 'మాత' అనే సంస్కృతపదం పడదా? (ఆవిడ అమ్మీ అనవచ్చుగా అంది, యింకా నయం భరతమాత బొమ్మకు బురఖా వేస్తే ఒప్పుకుంటావా అని అడగలేదు) ఒవైసీ వివరించలేదు. నాకు తోచిన సమాధానం మాత్రం – విగ్రహారాధనకు సంబంధించినది. భరతమాత అనే పేరుతో చిత్రాలను, శిల్పాలను, విగ్రహాలను తయారుచేసి అమ్ముతున్నారు. ఎప్పుడైతే ఒక ఆకారం అంటూ ఏర్పరచారో అది ముస్లిములకు, క్రైస్తవులకు, యూదులకు సమ్మతం కాదు. బైబిల్ కథల్లో చదువుతూనే వుండి వుంటారు. ఇస్రాయేలులో వున్న ప్రజలు అన్యదైవాలను కొలిచి, వాళ్ల విగ్రహాలను యిళ్లల్లో పెట్టుకున్నప్పుడల్లా బైబిల్ దేవుడు వారిని శిక్షిస్తూనే వుంటాడు. బైబిల్ దేవుడికి, యితర దేవుళ్లకు కొట్టవచ్చినట్లు కనబడే తేడా – విగ్రహారాధనే! బైబిల్‌లోని పాత నిబంధన (ఓల్డ్ టెస్ట్‌మెంట్) పైన చెప్పిన మూడు మతాల వారికీ శిరోధార్యం. వారికీ విగ్రహారాధనకు చుక్కెదురు. క్రైస్తవంలో క్రైస్తు ఎక్కిన శిలువ కనబడుతుంది తప్ప దేవుడికి రూపమంటూ కల్పించలేదు. ఇస్లాంలో అయితే దేవుడు కాదు కదా, ప్రవక్త బొమ్మ సైతం వేయరు. ఎవరైనా వేసినా వూరుకోరు. ఎన్నోసార్లు ఆ విషయమై గొడవలు జరిగాయి. భరతమాత అనే భావనకు రూపం కల్పించి, విగ్రహం పెట్టారు కాబట్టి ఒవైసీకి అభ్యంతరం కలిగి వుండవచ్చు. రేపు జనగణమనలోని 'అధినాయకుడు'కి కూడా ఏదైనా రూపం కల్పించి విగ్రహాలు పెడితే అప్పుడు దానికి కూడా అభ్యంతర పెట్టవచ్చని నా వూహ.

ఈ మూడు మతాలే కాదు, శిఖ్కులు మాత్రం విగ్రహారాధన చేస్తున్నారా? వాళ్ల గురుద్వారాలో గ్రంథపఠనం వుంటుంది తప్ప, దేవుడి విగ్రహం వుండదు కదా! ఒక్కో మతానిది ఒక్కో తీరు, దాన్ని మనం అర్థం చేసుకుని, ఆమోదించాలి. హిందూమతంలో కూడా విగ్రహారాధన తప్పనిసరి కాదు. మనం రకరకాలుగా పూజించవచ్చు. నిరాకార పూజలోంచే శివలింగపూజ వచ్చిందంటారు. సాలిగ్రామాన్ని పూజిస్తాం, దానికి ఏ ఆకారం వుంది కనుక! చిదంబరంలో వాయురూపంలో కనబడే పరమశివుడిది ఏ రూపం? పోనుపోను శివలింగానికి కూడా బంగారు నాగుపాము, వెండి పానువట్టం ఏర్పాటు చేసి, విగ్రహారాధనగా మార్చారు. ఏకాగ్రత కుదరడానికి మొదటి మెట్టుగా విగ్రహాన్ని పెట్టుకోమన్నారు కానీ ఎల్లకాలం దాన్నే పట్టుకుని అక్కడే ఆగిపోమనలేదు. తరువాతి దశలో కళ్లు మూసుకున్నా మీ ముందు ఆ రూపం కదలాడాలి. మీ తల్లీతండ్రీ మీ కళ్లముందు లేకపోయినా కళ్లు మూసుకుని ఒక్కసారి జ్ఞాపకం చేసుకుంటే వారి రూపం గోచరించదా? దేవుణ్నయినా అలా తలచుకోగలగాలి. పర్వతాల్లో, అరణ్యాల్లో తపస్సు చేసేవాళ్లు ఎదురుగా విగ్రహాలు పెట్టుకుని చేస్తారా? ధ్యానముద్రలోకి వెళితే వాళ్లకు అన్నీ గోచరిస్తాయి. దేవుణ్ని చేరుకోవడానికి అనేక మార్గాలు. విగ్రహారాధన ఒక్కటే మార్గమని ఎవరూ అనలేరు. అది కొన్ని మతాల్లోనే వుంది. ప్రపంచవ్యాప్తంగా వున్న ముఖ్యమతాల్లో లేదు. భారతమాతా కీ జై అను, భరతమాత విగ్రహానికి దణ్ణం పెట్టుకో అని ఒత్తిడి చేయడం ఏ మాత్రం సబబు కాదు. జై అననివాళ్లను దేశద్రోహులను అనడం పొరబాటు. చట్టసమ్మతం కూడా కాదు. కావాలంటే యిలాటివన్నీ పెట్టి రాజ్యాంగం మార్చి, అప్పుడు సస్పెండ్ చేయడాల్లాటివి తలపెట్టవచ్చు. ఈ లోపున దీన్నో పెద్ద అంశంగా చేసుకోవడం అనవసరంగా తలనొప్పి తెచ్చుకోవడమే! – ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2016)

మార్చి 28 ఎమ్బీయస్ : అమెరికాలో కబుర్లు చెప్తారా?

"ఎమ్బీయస్‌తో కబుర్లు" లండన్‌లో జరిగాక పై ప్రశ్న వేస్తూ చాలామంది మెయిల్స్ రాస్తున్నారు. ఎలాగూ సగం దూరం వచ్చేశారు కదా, అట్లాంటిక్ దాటి వచ్చేయండి అన్నారు కొందరు. 'ఇటీవల తెలుగు సంఘాలు చాలా ఆవిర్భవించాయి, రాబోయే నెలల్లో చాలా సమావేశాలు జరగబోతున్నాయి, మీరు వస్తారేమో, అమెరికా వస్తే మా యింటికి రండి, ఓ వారం పాటు ఆతిథ్యం స్వీకరించండి' అని మెయిల్స్ వస్తున్నాయి. ఈ తరహా ఆహ్వానాలు చాలాకాలంగా వస్తూన్నాయి. వారందరికీ సమాధానంగా యీ వ్యాసం! కాప్షన్‌లో ప్రశ్నకు ముందుగానే ఆన్సరు చెప్పేస్తా – "...చెప్పలేను" అని. దానికి కారణం ఏమిటో యీ వ్యాసంలో చెప్తాను. ఇదేదో నా గోలో, ఏడుపో కాదు, నాబోటి అనేకమంది రచయితలు, వ్యాసకర్తలు అమెరికాకు రావడానికి ఎందుకు వెనకాడతారో వివరాలు సేకరించి విశదీకరించే ప్రయత్నం చేస్తున్నాను. నిజానిజాల ప్రస్తావనలో లోపం వుంటే ఎత్తిచూప ప్రార్థన.

అమెరికాలో అనేక తెలుగు అసోసియేషన్లున్నాయి. రెండేళ్ల కోసారి మూడేసి రోజుల పండగ చేస్తారు. భారీ ఎత్తున చేసే ఆ ఉత్సవాలకు చాలా ఖర్చవుతుంది. టిక్కెట్టు కొని వచ్చే ప్రేక్షకులను ఆకర్షించడానికి అగ్రశ్రేణి సినీతారల్ని రప్పించాలి. ఆ ఖర్చు భరించడానికి స్థానికంగా స్పాన్సర్లు కావాలి. వాళ్లు ఆ వేదికపై తమ కళను చూపించాలని ముచ్చట పడతారు. అందువలన సాయంత్రాలు జరిగే ఫంక్షన్లు భారీగా, గ్లామరస్‌గా సగం సినిమావాళ్లతో, సగం స్థానికులతో జరుగుతాయి. తమ టేలంటు చూపేందుకు యింత పెద్ద వేదిక లభించినపుడు ఖర్చు భరిస్తున్న స్థానికులు యీ అవకాశాన్ని ఎందుకు వదులుకుంటారు? ఏదో ఒక కారణంతో వేదిక ఎక్కడం సహజం. సభానిర్వాహకులు వారిని కాదనలేరు. సాయంసమయాల్లో యీ ఫంక్షన్లకు హాజరవుతూ తక్కిన సమయాల్లో

అందరూ ఒకరి నొకరు పలకరించుకుంటూ, షాపింగు చేసుకుంటూ, వ్యాపార, కుటుంబ బంధాలు నెలకొల్పుకుంటూ, పెంచుకుంటూ వుండే సమయంలో యితర సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు తలపెడతారు. బొత్తిగా చీరల, నగల ఎగ్జిబిషన్, స్టార్‌నైట్ అనిపించుకోకుండా వుండాలని కొన్ని సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలు పొద్దున్న, మధ్యాహ్నాలలో పెడతారు. వీటిలో స్థానిక ప్రతిభావంతుణ్ని ఒక వక్తగా పెట్టి తక్కిన ముగ్గురు నలుగురు వక్తలుగా తెరపై కనబడని సినిమారంగ కళాకారులను, తమతమ రంగాల్లో కృషి చేసిన సాహితీమూర్తులను, కళాకారులను, సామాజిక కార్యకర్తలను తెప్పించి సర్దుతారు. వీళ్లను ఇండియా నుంచి ఖర్చులిచ్చి రప్పించి వేదిక మీద కూర్చోబెట్టగలుగుతారు కానీ ప్రేక్షకులను తీసుకునివచ్చి ఆడిటోరియంలో కూర్చోబెట్టడం నిర్వాహకుల తరం కాదు.

---

మొదటిది సమయానికి సంబంధించినది. ఉదయం తొమ్మిది గంటల నుంచి కార్యక్రమం అంటే అప్పటికి బ్రేక్‌ఫాస్ట్ పూర్తి అయి వుండకపోవచ్చు. కితం రాత్రి స్టార్ నైట్ పొద్దుపోయేదాకా జరిగాక తొందరగా లేవడానికి బద్ధకించవచ్చు. ఈ సమావేశాలకు కుటుంబాలతో వస్తారు కాబట్టి కుటుంబమంతా ఎంజాయ్ చేసే ప్రోగ్రాంలు చూదామనుకుంటారు. పిల్లలకు ఎలాగూ ఆసక్తి వుండదు. భార్యాభర్తల్లో కూడా ఎవరో ఒకరికే టేస్టుండి, మరొకరు బోరని అంటే ప్రోగ్రాంకు రారు. ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే – సాహిత్యం అంటే యిష్టమని జనరల్‌గా అనుకోవడమే తప్ప సాధారణ తెలుగువాడికి తెలిసిన కవీ లేడూ, కథా రచయితా లేడు. ఆధునిక కవుల్లో ఎవరికీ పెద్దగా మార్కెట్ లేదు. కవిత్వపు పుస్తకాలు అమ్ముడు పోవటమే లేదు. కథా, నవలా రచయితల్లో అయితే గతంలో యండమూరి, మల్లాది అనేవారు. ఇప్పుడు అంత డిమాండ్ వున్న రచయిత లేరు. పాతికేళ్లు దాటాక కథలు చదివేవాళ్లు పెద్దగా లేరు. చదివినా రచయిత పేరు గుర్తు పెట్టుకోరు. పెట్టుకున్నా ఆయన ఏం చెప్తాడో విందామన్న ఉబలాటమేమీ వుండదు. జనాలు అష్టావధానాలకు వెళతారు కానీ దాన్ని ఒక సర్కసుగానే చూస్తారు. శతావధానం చేస్తా, వరుసగా పద్యాలు చెపుతా అంటే బాబోయి అంటారు.

ఒక గాయకుడైతే పదిమంది ముందూ పాటపాడి మెప్పించగలడు. కథా/నవలా రచయిత, వ్యాసకర్త పదిమంది ముందూ పేపర్లు ముందేసుకుని రాస్తూ కూర్చోడు కదా. ఏదైనా కథని తను ఎలా రూపకల్పన చేశాడో, ఎలా రాశాడో చెపితే వినడానికి బాగుంటుంది. కానీ రాత నేర్చినవాళ్లందరూ కూత నేర్వలేరు. పెద్దపెద్ద రచయితలు చాలామంది మంచి వక్తలు కారు. వచ్చినాయన మంచి వక్త అయినా ప్రేక్షకుల్లో చాలామంది ఆ కథను చదివి వుంటేనే ఆ వుపన్యాసం రక్తి కడుతుంది. వచ్చినాయన ఏం మాట్లాడతాడో, ఎలా మాట్లాడతాడో తెలియనప్పుడు రిస్కు తీసుకుని సాహితీసభలో కూర్చోడానికి ఎవరూ ధైర్యం చేయరు. ఏ పదిమందో వస్తారు, సభ బోసిపోతోందని నిర్వాహకులు దాన్ని రద్దు చేస్తారు. ఇరవై గంటలు విమానంలో కూర్చుని వచ్చిన సాహితీకారుడు వేదిక ఎక్కకుండానే వెనక్కి మరలవస్తుంది. అందువలననే తెరవేలుపులకు తప్ప యితరులెవరికీ యిలాటి సమావేశాలు తృప్తి నివ్వవు. తిరిగి వచ్చి సభల నిర్వహణ బాగా లేదని విమర్శిస్తూ వ్యాసాలు రాస్తారు. 'ఆయన పేరు చెప్తే అంబ పలకలేదు. శ్రోతల్లో ఆయనకు డిమాండు లేదని తెలియక రానుపోను ఖర్చులిచ్చి, వసతి కల్పించి, తిండీతిప్పలు చూసి పంపించినా యిలా రాస్తాడా, కృతఘ్నుడు' అనుకుంటారు సభానిర్వాహకులు. తెరపై కనబడే చిన్న కమెడియన్‌కు వున్న డిమాండ్ సాహిత్య ఎకాడమీ ఎవార్డు తెచ్చుకున్న సాహితీ మూర్తికి వుండదు. ఈ చేదునిజం హరాయించుకోవడం కష్టం. అమెరికాలోని తెలుగువారందరూ సినిమా వాళ్లని తప్ప వేరెవ్వరినీ ఆదరించరని కాదు. సాహిత్యాభిమానులు, కళాభిమానులు చాలామందే వున్నారు. కానీ యీ సమావేశాలు వారికి అభిమాన రచయితలను కలిసే అవకాశాలు కల్పించలేకపోతున్నాయి. ఎందుకంటే యివి కుటుంబసమేతంగా పాల్గొనే సంబరాల్లా మారిపోయాయి.

---

దీనికి పరిష్కారం ఏమిటి? ఎవరైనా సాహితీకారుడు సమావేశాలకు వచ్చిన తర్వాత కొన్ని రోజులుండి తన అభిమానులున్న అయిదారు పరిసర ప్రాంతాలకు వెళ్లి పాతిక ముప్ఫయి మంది పోగయే చిన్నచిన్న సమావేశాల్లో పాల్గొంటూ తనకు, అభిమానులకు సంతోషం చేకూర్చవచ్చు, కొత్త విషయాలు తెలుసుకోవచ్చు, ఆలోచనా పరిధిని విస్తృతం చేసుకోవచ్చు. అయితే దీనిలో యిబ్బందేమిటంటే ఇండియాలో అయితే వీక్ డేస్‌లో మీటింగు పెట్టినా ఫర్వాలేదు. జనం వస్తారు. అమెరికాలో అయితే వారాంతాల్లోనే సమావేశం పెట్టాలి. తక్కిన రోజుల్లో పెడితే ఎవరూ రారు. అంటే యీ ఆదివారం ఒక వూళ్లో సమావేశం పూర్తయితే మళ్లీ శనివారం దాకా వేరే వూళ్లో మీటింగుండదు. అప్పటిదాకా ఎవరింట్లోనో తలదాచుకోవాలి. 'దానికేముంది, మా యింట్లో వుండండి, మాకిది అలవాటే' అంటారు అభిమానులు. 'అబ్బే వద్దు హెూటల్లో వుంటాను' అంటే పేలిపోతుంది. ఇండియాలో అయితే హెూటళ్లు, కాలనీలు పక్కపక్కనే వుంటాయి. కానీ అమెరికాలో హెూటళ్లు డౌన్‌టౌన్‌లో వుంటాయి. ఇళ్లు ఎక్కడో దూరంగా వుంటాయి. చాలా వూళ్లల్లో పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు వుండదు. టాక్సీలకు చచ్చేటంత అవుతుంది. 'అవన్నీ మీరు భరించలేరు. మా యింట్లోనే ఓ గదిలో వుండండి' అంటారు అక్కడివారు. 'మీరు ఇండియా వచ్చినపుడు మా యింట్లో యీ లెవెల్ ఆతిథ్యం యివ్వడం మా తరం కాదు' అని వీరు మొహమాట పడతారు. 'అలాటిది మేం ఎదురుచూడం' అని వారు హామీ యిస్తారు. దానాదీనా వారింట్లో వీరు వుండాల్సి వస్తుంది.

ఇది నిజంగా కష్టమైన పని. ఎందుకంటే బంధుత్వం, పూర్వస్నేహం ఏమీ లేకుండా కేవలం కళానుబంధంతో వారింట్లో బస చేయడం, భోజనం చేయడం యిబ్బందే. ఇంటావిడకు సాహిత్యంపై అభిరుచి వుండి, అతిథి రచనలు చదివి, ఆయనపై గౌరవం పెంచుకుంటే ఫర్వాలేదు. కానీ చాలా సందర్భాల్లో యింటాయనకే యిలాటి టేస్టు వుంటుంది. ఇంటావిడకు తెలుగు రాకపోవచ్చు, చదవలేక పోవచ్చు, చదవగలిగినా సాహిత్యం చదివే అలవాటు లేకపోవచ్చు. ఏదో భర్త పిలిచాడు కాబట్టి అతిథిని భరించవలసిన స్థితిలో ఆమె వుంటుంది. భార్యాభర్తలన్నాక యిలాటివి తప్పవు. కానీ అది ఒక పూట భోజనానికో, ఒక రోజు ఓ రాత్రి బసకో పరిమితమైతే ఫర్వాలేదు. ఏకంగా వారం రోజులంటే.. బాబోయ్ అనిపిస్తుంది. వాళ్లింట్లో వుంటూ, వాళ్ల తిండి తింటూన్నాం కాబట్టి ప్రతిగా వాళ్లకు ఏదైనా చేసిపెట్టాలని అతిథి ఫీలవ్వచ్చు. రాత్రుళ్లు ఆఫీసులనుంచి తిరిగి వచ్చాక కాస్సేపు వాళ్లను ఎంటర్‌టెయిన్ చేయాలని ప్రయత్నించవచ్చు. ఇది కూడా అందరి వలనా కాదు. గాయకుడైతే గంట, గంటన్నర పాటలు పాడి వినిపించవచ్చు. జ్యోతిష్కుడో, వాస్తు విద్వాంసుడో అయితే యింట్లోవాళ్ల జాతకాలు, బీరువా పెట్టిన మూలలు చూసి సలహాలు చెప్పవచ్చు. ప్రవచనకర్త అయితే ఆధ్యాత్మిక విషయాలు చెప్పవచ్చు. చిత్రకారుడైతే వాళ్ల స్కెచ్‌లు గీసి సంతోషపెట్టవచ్చు. సినిమా జర్నలిస్టు అయితే తెరవెనుక విషయాలు చెప్పి రంజింపచేయవచ్చు. మామూలు కథారచయితో, వ్యాసకర్తో అయితే ఏం చెప్తాడు? ఏం చేస్తాడు? వీడికి తిండిదండగ అనుకోవచ్చు ఆతిథ్యం యిచ్చినవాళ్లు. ఎలాగో కష్టపడి వారం గడిపి, మళ్లీ యింకో వూళ్లో యింకోరి యింట్లో మకాం వేయాలి.

ఇలా అయిదారు వారాల్లో పిల్లిపిల్లలా ఆరేడు మజిలీలు చేస్తే కొన్ని ప్రాంతాల్లో కొందరు అభిమానులను కలవగలుగుతారు. దీనికి చాలా ఓపిక, ఓర్పు వుండాలి. అమెరికాలో కుటుంబసభ్యులుంటే సమావేశాలయిపోయాక వాళ్ల యింటికి వెళ్లి వుంటూ వారాంతాల్లో యిలా వూళ్లకు వెళ్లి వస్తూండవచ్చు కానీ లేకపోతే యిలాటి అవస్తలు తప్పవు. నాకు అమెరికాలో బంధుమిత్రులున్నారు కానీ కుటుంబసభ్యులు లేరు. వెళ్లివచ్చినవారి యిబ్బందులు విన్నాక, చదివాక, వెళ్లాలన్న ఆసక్తి కలగలేదు. రానుపోను ఖర్చులు, బస, భోజనాలు నిర్వాహకులవే అయినా మనమూ సమయం, శక్తి ఖర్చు పెట్టాలి కదా. ఎంత ఖర్చుపెట్టినా జనం రాకపోతే ఎవరు మాత్రం ఏం చేయగలరు? జనం వస్తారన్న గ్యారంటీ ఎవరూ యివ్వలేరు. అందువలన నాకు నాలుగైదేళ్లగా ఆహ్వానాలు వచ్చినా ఉత్సాహం చూపలేదు. 2013 తానా సమావేశాలకు వచ్చి తీరాలని తోటకూర ప్రసాద్‌గారు గట్టిగా చెప్పడంతో మొహమాటానికి ఒప్పుకుని వీసాకి అప్లయి చేశాను. అమెరికావాడు యివ్వలేదు. అమ్మయ్య అనుకున్నాను. అమెరికా చూడదమంటారా, ఎపుడైనా సొంత ఖర్చుల మీదే కండక్టడ్ టూరులో వెళ్లి చూడవచ్చు!

కితం ఏడాది అనుకోకుండా యుకె వెళ్లడం, లండన్‌లో తాల్, సిపి బ్రౌన్ ఫౌండేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరు కావడం జరిగాయి. వ్యక్తిగత పనులపై వచ్చి కుటుంబసభ్యులతో వున్నాను కాబట్టి పైన చెప్పిన మొహమాటాలేవీ లేవు. ఉదయం నేనుండే కొవెంట్రీ నుంచి గంట రైలు ప్రయాణంతో లండన్ చేరడం, మీటింగుకి హాజరు కావడం జరిగాయి. నిర్వాహకులు ఆ రాత్రి బస ఏర్పాటు చేయడమే కాక, ఆ రోజు రెండు ముఖ్యప్రదేశాలు, మర్నాడు నాలుగు దర్శనీయ స్థలాలు చూపించారు. నేను ఫుల్ ఖుష్. సభకు ఆశించినదాని కంటె రెట్టింపు జనం రావడంతో వాళ్లు ఖుష్. మీటింగు తర్వాత కూడా ఓ యిరవై మంది నాతో రెండున్నర గంటల పాటు బాతాఖానీ వేశారు. అంతమంది రావడానికి కారణం ఏమిటాని విశ్లేషించి చూస్తే తేలిందేమిటంటే – నాకున్న గుర్తింపు సాహితీకారుడిగా కాదు. వారిలో నేను రాసిన కథలు చదివినవారు ఎక్కువమంది లేరు. రాజకీయ, సామాజిక విశ్లేషకుడిగా నాకున్న యిమేజి, గ్రేట్ ఆంధ్రా వంటి పాప్యులర్ వెబ్‌సైట్ ద్వారా నా పేరు అందరికీ తెలియడం చేతనే అంతమంది వచ్చారు. పైగా మీటింగు జరిగిన తీరు కూడా విలక్షణంగా వుంది. పది నిమిషాలలో నా పరిచయం ముగిసిన తర్వాత అప్పణ్నుంచి రెండున్నర గంటల పాటు నేను కబుర్లు చెపుతూ, ప్రశ్నలకు సమాధానాలు చెపుతూనే వున్నాను. ఉపన్యాసమైతే భోజనానంతరం ఆవలించకుండా వినడం మహా కష్టం. నావి యింటరాక్టివ్‌గా వుండే కబుర్లు కావడంతో, వచ్చినవాళ్లంతా అలర్ట్‌గా, ఉత్సాహంగా వున్నారు. నేనూ యిలాటి ప్రయోగం గతంలో చేయలేదు. కష్టపడి, సమయం వెచ్చించి వచ్చినవాళ్లను నిరాశపరచనందుకు నేను ఆనందించాను.

దీని తర్వాత నాకు ఒక విషయం అర్థమైంది. నేను అమెరికా సమావేశాల్లో పాల్గొనడమంటూ జరిగితే రెండు గంటలపాటు కబుర్లు చెప్పే యింటరాక్టివ్ కార్యక్రమమైతే ఒప్పుకోవాలి. అమెరికాలో నా పాఠకులు ఎక్కువమందే వున్నారు కాబట్టి సభకు వందకు పైగా వచ్చినా ఆశ్చర్యపడను. వక్తగా కూడా లండన్‌వాసులను మెప్పించాను కాబట్టి సభకు వచ్చినవారిని నిరాశపరచనన్న ధైర్యమూ నాకు వచ్చింది. కానీ యీ ధైర్యం నిర్వాహకులకు వుండదు. మీ ఒక్కడికే రెండు గంటల కార్యక్రమం అంటే కుదరదంటారు. రెండు గంటలు కాదు.. గంట కాదు… గంట సాహిత్యసభలో నాకు పావుగంట కంటె ఎక్కువ కేటాయించడానికి వారు సిద్ధపడరు. నిజానికి నన్ను సాహిత్యకారుడిగా మాత్రమే బ్రాండ్ చేయడం సబబు కాదు. ఈ కబుర్లు శీర్షిక ద్వారా నేను అనేక విషయాలపై వ్యాఖ్యానిస్తున్నాను. ప్రజలకు అనేక అంశాలపై ఆసక్తి కలిగిస్తున్నాను. నా అభిప్రాయాలపై, పరిశీలనలపై బోల్డంత తర్జనభర్జనలు జరుగుతున్నాయి. నేను స్వయంగా ఎదురైనప్పుడు వాదోపవాదాలు జరిగే అవకాశం వుంది. పైగా నా కృషి బహుముఖాలుగా వుంది కాబట్టి వాటి వివరాలు అడగాలనే కుతూహలమూ వుంది. వాటికి వేదిక కల్పించినప్పుడే నాకూ, సభకు హాజరయ్యేవారికి తృప్తి కలుగుతుంది. (ఇది లండన్ సమావేశం తర్వాత గ్రహింపులోకి వచ్చిన విషయం. 'లండన్ వాళ్లయినా మిమ్మల్ని ఇండియా నుంచి ఖర్చులిచ్చి రప్పించేవారా?' అని ఎవరైనా అడిగితే 'నెవర్' అని సమాధానం యిస్తాను) కానీ కాన్ఫరెన్సులకు యిప్పుడున్న ఫార్మాట్‌లలో నేను ఎక్కడా ఫిట్–యిన్ కాను.

అందువలన నేను అమెరికా ఉత్సవాలకు వచ్చే అవకాశాలు లేవు.

...వస్తే, అక్కడక్కడే తచ్చాడుతూ ఎవరైనా నన్ను గుర్తుపట్టి పలకరిస్తే, ముచ్చట్లాడుతూ కాలక్షేపం చేయాలి. 'మీరు దానికి సిద్ధపడి రండి, సమావేశాల మాట పక్కన పెట్టండి, ఆ తర్వాత ఓ నెల్లాళ్లు వుండి, వారమంతా ఎవరింట్లోనే ఒదిగి వుండి, వారాంతాల్లో విజృంభించి ఏదో ఒక వూరు వెళ్లి మాట్లాడి వస్తూ, మళ్లీ యింకో చోట బిచాణా వేస్తూ.. నెలా దాటించేయండి. అమెరికాలో వదాన్యులకు కొదవలేదు. ఉదాహరణకి మాలాటి నలుగురైదుగురు సాయం పట్టి మీ రానుపోను ఖర్చులు భరిస్తాం, మీరు నాలుగు చోట్ల నాలుగు వారాల చొప్పున నెల్లాళ్లు వుండేందుకు ప్రిపేరై రండి' అంటూంటారు హితైషులు. 'ఇంత దూరం నుంచి వస్తున్నాను కదా, నా కోసం ఆ వూళ్లో పాతిక మందో, ముప్ఫయిమందో వారం మధ్యలో ఒక్క రోజు సెలవు పెట్టడానికి సిద్ధపడరా? అలా అయితే రోజుకో వూరు చొప్పున వారంలో నాలుగైదు వూళ్లు చుట్టబెట్టి వచ్చేసే వీలుంటుంది కదా. మీటింగులన్నీ ఒక వారంలో పూర్తయిపోతాయి. పదిరోజుల్లో వెళ్లి వచ్చేయచ్చు.' అని సూచిస్తే 'అలాటి పిచ్చి వూహలు పెట్టుకోకండి. వాళ్లు మీకోసం సెలవు పెట్టడం యింపాజిబుల్' అని జవాబు వస్తుంది. మరి అలాటివారి కోసం నేనెందుకు ఒళ్లు అలవగొట్టుకోవడం?

'అమెరికాలో సమావేశాలకు వస్తే అప్పుడు తమ వూరికి కూడా రమ్మనమని, ఆతిథ్యం యిస్తా'మని ఆఫర్ చేసేవాళ్లలో చాలామంది వ్యక్తిగతంగా పిలుస్తున్నారు కానీ వాళ్లకంటూ సంఘాలు లేవు. సంఘాలు ఏర్పాటు చేయడంలో, చీలకుండా చూసుకోవడంలో తెలుగువాళ్లు నేర్పరులు కారు. ఏర్పాటు చేశాక ఎటువంటి కార్యక్రమాలు చేయాలో – ముఖ్యంగా విదేశాల్లో వున్న పరిమితులతో– ప్లాను చేయడం మహా కష్టం. అందువలన 'సంఘం, సమాజం పిలవాలనకండి, కావాలంటే 'నేను ఫలానా ఖర్చు భరించగలను' అని ఆఫర్ చేస్తూంటారు. వ్యక్తుల నుండి ఆబ్లిగేషన్స్ తీసుకోవడమంటే అదోలా వుంటుంది. కొందరు అభిమానులు కొన్ని సంఘాలలో ఆఫీస్ బేరర్స్‌గా కూడా వుంటారు. కానీ యిప్పటిదాకా వున్న ఫార్మాట్‌ను నా కోసం చెదరగొట్టడానికి వారికీ వీలుపడదు. రకరకాల ఆఫర్లు యిచ్చిన వారందరికీ యీ సందర్భంగా ధన్యవాదాలు అర్పిస్తూ, వాస్తవపరిస్థితిని, పరిమితులను అర్థం చేసుకోమని విజ్ఞప్తి చేస్తున్నాను. నేనే కాదు, నా బోటి సినిమా గ్లామర్ లేని వాళ్లకూ, పెర్‌ఫార్మర్స్ కాని వాళ్లకూ యిదే సమస్య. కుటుంబసభ్యులు అమెరికాలో వున్న వాళ్లు మాత్రమే సమావేశాల మాట ఎలా వున్నా నిర్వాహకుల ఖర్చుతో అమెరికా వచ్చి తమవాళ్లను చూసుకున్నాం కదాని త ృప్తి పడతారు, లేని నా బోటి వాళ్లం అభిమానులు మమ్మల్ని కలవాలని కోరుకున్నా రాలేము. అమెరికాలోని వివిధ ప్రాంతాలలోని నాలుగైదు అసోసియేషన్లు తమలో తాము సమన్వయం చేసుకుని వచ్చిన అతిథి వారం, పదిరోజుల్లో నాలుగైదు వూళ్లల్లో మీటింగులు ముగించుకునేట్లా ప్లాను చేసి, రానుపోను ఖర్చులు ఏర్పాటు చేయగలిగిన రోజు వచ్చినప్పుడే యీ సమస్యకు పరిష్కారం వుంటుంది. లేకపోతే యిప్పటికింతే!

---

ఒక రచయితగా నేను యిక్కడివరకు రాసి వూరుకోవచ్చు. కానీ యిది ఒక సంపాదకీయంలా ధ్వనిస్తూంది – దుస్సాధ్యమైన విషయాలను సాధించాలని ఉద్బోధ చేసినట్లు తోస్తుంది. ఒక అసోసియేషనులోనే కోఆర్డినేషన్ కష్టం. నాలుగైదు అసోసియేషన్లు సమన్వయం చేసుకుని ఒక అతిథి గురించి ఏర్పాట్లు చేస్తాయా? అది సాధ్యమా? నేను రచయితను కావడంతో బాటు ఆర్గనైజర్‌ను కూడా. మా "హాసం క్లబ్బు" శాఖల ద్వారా వివిధ నగరాల్లో నెలనెలా మీటింగులు ఏర్పాటు చేస్తూంటాం కాబట్టి వాటి సాధకబాధకాలు బాగా తెలుసు. ఎవర్ని పిలవాలి, పిలిచినవాళ్లు ఎలా మాట్లాడతారు, వినడానికి జనం వస్తారా రారా, వచ్చిన తర్వాత తృప్తి పడతారా లేదా? ఖర్చులెంతవుతాయి? ఇలా అనేక లెక్కలు వేస్తూంటాం. నేనే అమెరికన్ తెలుగు అసోసియేషన్ ఆర్గనైజర్నయితే యిలాటి రచయితను, అతని అభిమానులను కలపడానికి ఏం చేస్తాను అని ఆలోచించి చూశాను. 'ఫలానా రచయిత యీ సమావేశానికి వస్తున్నారు, సమావేశ స్థలిలోనే ఓ రెండు వందల మంది పట్టే చిన్న హాల్లో రెండు గంటలపాటు ప్రసంగిస్తారు. ఓ యిరవై డాలర్లు ప్రవేశ రుసుము చెల్లించి మీరు ఆ సమావేశంలో పాల్గొనవచ్చు' అని ప్రకటిస్తాను. (ఈ అంకె ఏదో నా నోటికొచ్చిన అంకె) అలా సేకరించిన డబ్బే ఆ రచయితకు పారితోషికం. ఆయన రానుపోను ఖర్చులు ఆయనే పెట్టుకోవాలంటాను. భోజనం, వసతి వగైరాలు తక్కిన అతిథులతో పాటు ఏర్పాటు చేయవచ్చు. హాలుకు విడిగా అద్దె ఎలాగూ వుండదు. వచ్చే రచయితకు టిక్కెట్టు, యితర ఖర్చులకు ఓ రెండు వేల డాలర్లు అవుతుందనుకోండి. ఆ పాటి డబ్బు వస్తుందనుకుంటేనే ఆయన విమానం ఎక్కుతాడు. లేకపోతే రానే రాడు. ఓ వారానికి ముందే బుకింగు క్లోజ్ చేసి 'ఇంత వచ్చింది, ఫర్వాలేదనుకుంటే రండి' అని రచయితకు నిర్మొహమాటంగా చెప్పేయడమే!

ఈ ముందస్తు బుకింగ్ పద్ధతి చాలా మంచిది. లండన్‌లో నా సమావేశానికి ముందే బుక్ చేసుకోండి అని నా కాలమ్ ద్వారా తెలియపరచాను. మంచి స్పందన వచ్చింది. ఊహించనంత స్పందన రావడంతో నిర్వాహకులు ఒక వారం ముందే బుకింగు ఆపేశారు. ఎందుకంటే సమావేశం జరిగే హాలు కెపాసిటీ చూసుకోవాల్సి వచ్చింది. పైగా వాళ్లు ఉచితంగా భోజనాలు కూడా పెడుతున్నారు. అయితే లండన్ సమావేశానికి టిక్కెట్టు పెట్టలేదు. మరి అమెరికాలో తెలుగువాళ్లు డబ్బులిచ్చి మీటింగులకు వస్తారా? తెలియదు. 2007లో హ్యూస్టన్‌కు చెందిన వంగూరి చిట్టెన్ రాజుగారు తన సంస్థ తరఫున హైదరాబాదులో త్యాగరాయగానసభలో ప్రపంచ తెలుగు మహాసభలంటూ సాహిత్యసభ పెట్టి దానికి టిక్కెట్టు పెట్టారు. స్పందన పెద్దగా లేదు కానీ, అసలంటూ కొంత

వుంది. హాలు బోసి పోతోందని మర్నాడు టిక్కెట్టు లేకపోయినా అనుమతించారు. వక్తల్లో చాలామంది ఊళ్లో విడిగా సభల్లో కనబడేవారే. అనుకున్నంత స్పందన లేకపోవడానికి అది ఒక కారణం కావచ్చనుకున్నాను. అమెరికాకు వచ్చే వక్తయితే వేలాది మైళ్ల దూరం నుండి వస్తున్నాడు. 9 ఏళ్ల క్రితం హైదరాబాదు శ్రోత టిక్కెట్టు కొని సాహిత్య సభకు వెళ్లగా లేనిది వారి కంటె ఆర్థిక వసతి మెరుగ్గా వున్న యీనాటి అమెరికా శ్రోత వెళ్లడా!? నాబోటి వాడికే చాలామంది మెయిల్సు రాస్తూ వుంటారు – అమెరికా వస్తే ఎక్కడుంటారో చెప్పండి, వచ్చి కలుస్తాం, మా యింట్లో వుండండి, వారం పదిరోజులైనా సరే, దగ్గరి ప్రదేశాలు తిప్పి చూపిస్తాం అంటూ. ఇలాగే ప్రతి రచయితకు అభిమానులుంటారు కదా. ఇంకో వూరు రావడానికి, యింట్లో పెట్టుకోవడానికి, తిప్పడానికి కనీసం 200 డాలర్లయినా అవదా? ఆ డబ్బుతో యిలాటి సమావేశానికి పది టిక్కెట్లు కొని స్నేహితులకు యివ్వవచ్చు.

ఇలాటి సెల్ఫ్–ఫైనాన్సింగ్ సభ వలన ఆర్గనైజరుకి, రచయితకు రిస్కు లేదు. తెలుగు సంఘాలు చీలిపోతున్న కొద్దీ ఆర్థిక వనరులకోసం తడుముకోవలసిన పరిస్థితి వస్తోంది. సినిమావాళ్లను రప్పించడానికి ఎలాగూ బోల్డు ఖర్చవుతుంది. ఇలాటి సభలపైన ఆదా చేసుకోగలిగితే వాళ్లకూ మంచిది. సముద్రాలు దాటి వచ్చే రచయితకైతే వేదిక ఎక్కి తీరతామన్న కనీస ధీమా వుంటుంది. కానీ సభకు వచ్చే శ్రోతకు మాత్రం రిస్కుంది. కాన్ఫరెన్సులో పాల్గొనడానికి 200, 250 డాలర్లతో బాటు యిది అదనంగా కట్టాలి. తీరా కట్టినదాకా వుండి వచ్చినాయన సరిగ్గా మాట్లాడలేకపోతే టిక్కెట్టు డబ్బు నష్టమే కదా! కానీ యిలాటి రిస్కు మనం సినిమాల విషయంలో కూడా తీసుకుంటున్నాం. సినిమా నటుల్ని ఆహ్వానించిన సందర్భాల్లో కూడా వాళ్లు వసతి బాగా లేదనో, సాటి నటుడికి ఎక్కువ ప్రాధాన్యత యిచ్చారనో మొహం మాడ్చుకుని, రెండు మూడు ముక్కలు గొణిగి వేదిక దిగిపోయిన సందర్భాలూ వుంటాయి. గాయకుడి విషయంలో కూడా ఆ రోజు జలుబు చేయవచ్చు, జ్వరం రావచ్చు, మూడ్ సరిగ్గా లేకపోవచ్చు. రస్కు దొరకాలన్నా రిస్కు తీసుకోవాల్సిన రోజులివి. మొన్న నా లండన్ సమావేశంలో క్రిస్‌మస్ ముందు శనివారపు లండన్ ట్రాఫిక్ యీదుకుంటూ రెండు మూడు గంటలు డ్రైవ్ చేసుకుంటూ వచ్చినవారు కూడా రిస్కు తీసుకున్నారు. రచయితను విడిగా రప్పించాలన్నా, లేక సెలవు పెట్టి వెళ్లి వినాలన్నా, దూరప్రయాణం చేసి వెళ్లి సభకు హాజరు కావాలన్నా 20 డాలర్ల కంటె ఎక్కువే ఖర్చవుతుంది. ఇదైతే ఎలాగూ కాన్ఫరెన్సుకి వస్తున్నారు, ఖర్చులో ఖర్చు. మరీ బోరు కొడితే లేచి, యింకో ప్రోగ్రాం చూడవచ్చు! అంతా బాగానే వుంది కానీ 20 డాలర్ల చొప్పున ఓ 200 మంది లేదా 25 డాలర్లు చొప్పున ఓ 100 మంది వస్తారనుకుని ఆశ పెట్టుకుని యిలా ప్రకటించవచ్చా? రమారమి 5వేల మంది వచ్చే కాన్ఫరెన్సులో 100 మంది కూడా స్పందించలేదంటే రచయిత అవమానకరంగా ఫీలవడా? అలా ఫీలవని రచయితతోనే నేను యిలాటి ప్రయోగం చేస్తాను. వచ్చి వేదిక ఎక్కకుండా వెనక్కి వెళ్లేబదులు, మనకు గిరాకీ లేదని, మన పేరు చెపితే టిక్కెట్టు తెగలేదని – ముందే తెలుసుకోవడం ఆయనకూ మంచిదే కదా!

----

ఈ పరిష్కారం మాత్రం ఎడిటోరియల్‌లా లేదా అన్న ప్రశ్న కూడా తలెత్తవచ్చు. 'రేపటి మాట ఎలా వున్నా, 2016లో యిది ఆచరణయోగ్యం కాదు, 'వక్త ఏదైనా రంగంలో నిష్ణాతుడైతే తప్ప (ఏ శశి థరూరో, ఏ జెత్మలానీ లాటివాడో అన్నమాట) అమెరికా తెలుగువాళ్లు టిక్కెట్టు కొని సినిమాయేతర సభకు రారు' అనే వాస్తవాన్ని మరచి, నేల విడిచి సాము చేసిన సలహా యిది' అని అమెరికన్ తెలుగువారు ఢంకా బజాయించి చెప్పవచ్చు. వారి మాటే రైటు. ఎందుకంటే నేను అమెరికా వెళ్లలేదు. అక్కడి మనుషుల యిష్టాయిష్టాలపై అవగాహన లేదు. ఇదంతా అక్కడాయిక్కడా విని రాసినదే. అయితే ఒక తెలుగు సాహితీ అభిమానిగా 2026 నాటికైనా యిలాటి ఒక వర్కబుల్ సొల్యూషన్ రూపుదిద్దుకోవాలని ఆశిస్తాను. ఈ వ్యాసంలో అహంభావమో, ద్రాక్షపళ్ల కోసం ఆశపడ్డ నక్క స్వభావమో గోచరిస్తే అది నా భావప్రకటనలో లోపం తప్ప మరేమీ కాదు. ఎయిడ్స్ గురించి కూడా బహిరంగ చర్చను ప్రోత్సహిస్తున్న యీ రోజుల్లో సభా నిర్వహణలో యిరువైపులా వున్న యిబ్బందుల గురించి చర్చించడం తప్పుగా నేను భావించలేదు.
**(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2016)**

**మార్చి 30 ఎమ్బీయస్ : యూరోప్ గాథలు 30**

ఇంకో ఏడాది గడిచేసరికి టాలమీకి రక్షణగా ఔలస్ గాబినియస్ అనే రోమన్ సేనాని ఈజిప్టులో నిలిపి వుంచిన సైన్యంతో ఆమెకు ఘర్షణ వచ్చింది. రోమ్ అధీనంలో వున్న సిరియాపై పార్థియన్లు దండెత్తి వచ్చినపుడు అక్కడున్న రోమన్ సైన్యం సరిపోలేదు. సిరియాలో రోమ్ తరఫున గవర్నరుగా వున్న బిబ్యులస్ ఈజిప్టులోని రోమన్ సైన్యదళాలు తనకు సహాయంగా రావాలని కబురు పంపాడు. అయితే ఈజిప్టులోని రోమన్ సైనికులు ఏళ్ల తరబడి ఉత్తిన జీతాలు తీసుకుంటూ, ఖాళీగా వుంటూ, ఈజిప్టు వనితలను పెళ్లాడి, కాపురాలు చేసుకుంటూ కడుపులో చల్ల కదలకుండా వున్నారు. ఇప్పుడు యుద్ధం అంటే ఎవడెళతాడు రాము పొమ్మన్నారు. అప్పుడు బిబ్యులస్ తన కుమారులను పంపి 'మీరు రావాల్సిందే' అని ఆజ్ఞాపించే ధోరణిలో అడిగించాడు. దాంతో సైనికులకు ఒండిమండి వాళ్లని చంపివేశారు. అలా చంపిన సైనికులను బిబ్యులస్‌కు అప్పగిస్తే రోమన్లు సంతోషిస్తారని అంచనా వేసిన క్లియోపాత్రా వారిని గొలుసులతో బంధించి బిబ్యులస్‌కు పంపింది. కానీ రోమన్ల అహంకారం ఎంతటిదంటే – రోమన్లు తప్పు చేస్తే రోమన్లే

శిక్షించాలి తప్ప మధ్యలో యీ ఈజిప్టువాళ్లకు వారిని బంధించే అధికారం ఎవడిచ్చాడు అనుకున్నారు. రోమ్ క్లియపాత్రాకు అండగా నిలవలేదు. తన సైనికులను అప్పగించినందుకు గాబినియస్ క్లియోపాత్రాపై కక్ష కట్టేశాడు. ఆమెను గద్దె నించి దించేయమని రాజరక్షకుడు పోథినస్, సేనాని ఏకిలాస్‌లను ప్రోత్సహించాడు. క్రీ.పూ.48 నాటికి టాలమీ ఏకైక ప్రభువు అయిపోయాడు. క్లియోపాత్రా తిరుగుబాటు చేయబోతే అది విఫలమైంది. తన ప్రాణాలు కాపాడుకోవడానికి ఆమె పారిపోయి సిరియాలో తలదాచుకుంది.

క్లియోపాత్రా యిలా కష్టాల్లో కొట్టుమిట్టులాడుతున్న సమయంలోనే రోమ్‌లో అంతర్యుద్ధం వచ్చింది. సీజరు, పాంపే తలపడ్డారు. పాంపే ఓడిపోయి ఈజిప్టు పారిపోయి వచ్చాడు. సీజరుకి బలవంతుడిగా తోస్తున్నాడు కాబట్టి అతని శత్రువైన పాంపేని వధిస్తే అతను సంతోషిస్తాడని టాలమీ అంచనా వేశాడు. అలగ్జాండ్రియాలో సముద్రపు ఒడ్డున సింహాసనం వేసుకుని కూర్చుని పాంపే ఓడ దిగగానే అతని భార్యబిడ్డల కళ్లెదురుగానే అతని మాజీ సేవకుడి చేతే తల నరికించాడు. రెండు రోజుల తర్వాత సీజరు ఓడ దిగగానే ఆ తల చూపించి అతన్ని సంతోషపెట్టాననుకున్నాడు. కానీ సీజరు ఆగ్రహంతో వూగిపోయాడు. ఎందుకంటే పాంపే తన ఒకప్పటి స్నేహితుడు, కూతురు చనిపోయినా అల్లుడు. అంతటి వీరుణ్ని, రోమన్ కాన్సల్‌ను యింత దుర్మార్గంగా వధించే సాహసం చేస్తాడా ఈజిప్టు రాజు అని మండిపడ్డాడు. ఈ టాలమీ పని పడదామని నిశ్చయించుకుని 'నీకూ, క్లియోపాత్రాకు వున్న తగవు నేను తీరుస్తాను' అంటూ అడక్కుండానే మధ్యవర్తిత్వం చేపట్టి రాజప్రాసాదంలో నివాసం ఏర్పరచుకున్నాడు.

మహాయోధుడైన సీజరు తన ప్రత్యర్థి ఐన టాలమీ పట్ల ద్వేషంతో వున్నాడని విన్న క్లియోపాత్రా సీజరును మంచి చేసుకోవాలని నిశ్చయించుకుంది. కానీ బహిరంగంగా వెళితే లోపలకి రానివ్వరు. అందుకని తనను తాను ఒక పర్షియన్ తివాచీలో చుట్టుకుని ఒక బానిసను సీజరు గదిలోకి తీసుకెళ్లమంది. తనను అడ్డగించిన ద్వారపాలకులతో బానిస "క్లియోపాత్రా పంపిన బహుమతి యిది. సీజరు మాత్రమే చూడాలని చెప్పి పంపారు." అన్నాడు. వాళ్లు వెళ్లనిచ్చారు. గదిలోకి వెళ్లి, బానిస తివాచీ నేలపై దొర్లించాడు. దానిలోంచి దొర్లుతూ క్లియోపాత్రా బయటపడింది. సీజరు కంగారుపడి కత్తి చేతిలోకి తీసుకున్నాడు. అంతలోనే క్లియోపాత్రా అందాన్ని చూసి ముగ్ధుడై పోయి నిలిచిపోయాడు. ఆమె అతని చెంత చేరింది. (ఈ ఘట్టం "క్లియోపాత్రా" సినిమాలో చూసి తీరాలి). అప్పటికి క్లియోపాత్రాకు 21 ఏళ్లు, సీజరుకు 52. అయినా వాళ్ల మధ్య ప్రణయం యించుమించుగా ఏడాదిపాటు (క్రీ.పూ.48, 47) సాగింది. వీళ్లిద్దరి మధ్య వయసు తేడా యింత వున్నా యింత గట్టి బంధం ఎలా ఏర్పడింది అనేది చర్చనీయాంశమైంది.

సీజరుకు అందగత్తెలు కొత్తకాదు. ఆనాటి రోమన్లలో స్త్రీలోలుడు కానివారు ఎవరూ లేరు. భార్యకు (సీజరు కూతురు) మాత్రమే అంకితమైన పాంపేను అందరూ ఆడంగి వాడు (సిస్సీ) అని హేళన చేసేవారు. క్లియోపాత్రా ఎంత అందగత్తె అయినా సీజరు అందాన్ని చూసే దాసోహమన్నాడన్న వాదన తర్కానికి నిలవదు. క్లియోపాత్రా మేధస్సు, బహుభాషాజ్ఞానం, విషయగ్రహణాచాతుర్యం, రాజకీయ కౌటిల్యం యివన్నీ అతన్ని మెప్పించాయని అనుకోవాలి. ఆమె అతన్ని ముగ్గులోకి దింపిందని అనుకోవడం కంటె అతను ఆమెను ఒక రాజకీయవేత్తగా, రాణిగా తీర్చిదిద్దడంలో ఆనందం పొందాడని భావించాలి. క్లియోపాత్రా పాత్రను షేక్‌స్పియర్ తీర్చిదిద్దిన తీరు వేరు, బెర్నార్డ్ షా తీర్చిన తీరు వేరు. క్లియోపాత్రాకు వున్న యిద్దరు ప్రేమికులలో మార్క్ ఆంటోనీ ఆమె పట్ల వ్యామోహం పెంచుకుని, వినాశనాన్ని తెచ్చుకున్నాడు. (తర్వాతి భాగాల్లో అతని కథ చెప్తాను). క్లియోపాత్రా కూడా అతనంటె తలమునకలా ప్రేమలో పడింది. సీజరు విషయానికి వస్తే ముసలి మూరు?డులా క్లియోపాత్రా చెప్పినట్లు ఆడాడని అనుకునే ప్రమాదం వుంది. కానీ సీజరు ఒక స్టేట్స్‌మన్‌లా, ఒక గురువులా ప్రవర్తిస్తూ క్లియోపాత్రాను తన ప్రయోజనాలకు వాడుకున్నాడని గ్రహించాలి. తమ రెండేళ్ల సాహచర్యం వలన ఆమె గర్భవతి అయి, కొడుక్కి సీజరియన్ (చిన్న సీజర్) అని పేరు పెట్టి, వాణ్ని రోమ్‌కు తీసుకుని వచ్చి 'వీడు నీ కొడుకే కాబట్టి నీ వారసుడిగా రోమ్-ఈజిప్టు రెండు రాజ్యాలకు అధిపతిగా ప్రకటించు' అని అడిగినా సీజరు ఆమె మాట మన్నించకుండా తన మేనల్లుడు ఆక్టేవియన్‌ను తన వారసుడిగా ప్రకటించాడు!

క్లియోపాత్రా తన చెప్పుచేతల్లో వుంటుందన్న నమ్మకం కుదిరాక సీజరు ఈజిప్టును రోము సామ్రాజ్యంలో కలిపే ఆలోచన విరమించుకుని, క్లియోపాత్రాను ఈజిప్టు రాణిగా చేయడానికి నిశ్చయించుకున్నాడు. ఇది గ్రహించిన పోథినస్, ఏకిలాస్ అలెగ్జాండ్రియాలో సీజరుపై యుద్ధం ప్రకటించారు. సీజరు వాళ్లని ఓడించాడు. ఈ యుద్ధసందర్భంగా అలెగ్జాండ్రియాలోని పెద్ద గ్రంథాలయం తగలబడిపోవడం మానవచరిత్రలోనే పెద్ద విషాదంగా వర్ణిస్తారు. అనేక శతాబ్దాలుగా అరుదైన పుస్తకాలను తనలో దాచుకున్న ఆ లైబ్రరీ ప్రపంచ వింతల్లో ఒకటిగా వుండేది. తెలివితక్కువ రోమన్ సైనికులు దానికి మంటపెట్టడం మూర?త్వానికి పరాకాష్ఠ. అతి కొద్ది భాగం మాత్రమే రక్షింపబడింది. ఆ దుర్ఘటనకు క్లియోపాత్రాతో బాటు సీజరు కూడా ఎంతో బాధపడ్డాడు. యుద్ధసమయంలోనే టాలమీ నైల్ నదిలో మునిగి చచ్చిపోయాడంటారు, లేదు క్లియోపాత్రాయే విషప్రయోగం చేసి చంపేసిందంటారు. ఏమైతేనేం, సీజరు 22 ఏళ్ల క్లియోపాత్రాను 13 ఏళ్ల ఆమె మరో తమ్ముడు (14 వ టాలమీ)కి యిచ్చి పెళ్లి చేసి యిద్దర్నీ కలిపి ఈజిప్టు సింహాసనంపై కూర్చోబెట్టాడు. ఆమెకు రక్షణగా రఫియో అనే సేనాని ఆధిపత్యంలో రోమన్ సేనను వుంచాడు. అక్కడ వుండగానే తన ఆసియా మైనర్‌లో పాంటస్‌ను గెలిచిన సందర్భంలోనే 'వెని, విడి, విసి' (ఐ కేమ్, ఐ సా, ఐ కాన్‌కర్డ్ – వచ్చా, చూశా, గెలిచా) అనే అతని ఫేమస్ కొటేషన్ ఉద్భవించింది. ఆ ఏడాదే అతను రోమ్‌కు తిరిగి వెళ్లాల్సి వచ్చింది. కారణం – రోమ్‌లో అతను తన ప్రతినిధిగా నిలబెట్టిన మార్క్ ఆంటోనీ ప్రవర్తన కారణంగా యిబ్బందులు రావడం!

మార్క్ ఆంటోనీ అనగానే సీజర్ హత్య తర్వాత అతను యిచ్చిన ప్రఖ్యాత ఉపన్యాసం గుర్తుకు వస్తుంది అందరికీ. తన కంటె 14

ఏళ్లు చిన్నదైన క్లియోపాత్రా ప్రేమపాశంలో పడి సర్వభ్రష్టుడైన కథా గుర్తుకు వస్తుంది. అతను క్రీ.పూ. 83లో పుట్టాడు. రోమన్ పేరు మార్కస్ ఆంటోనియస్. ఇంగ్లీషువాళ్లు మార్క్ ఆంటోనీ అన్నారు కాబట్టి మనమూ అలాగే పిలుద్దాం. అతను చిన్నప్పుడు అల్లరిచిల్లరగా తిరిగేవాడు. స్నేహితులతో విందువిలాసాలతో మునుగుతూ అప్పులపాలయ్యాడు. బాకీవాళ్లను తప్పించుకోవడానికి గ్రీసు పారిపోయినపుడు వక్తృత్వకళలో తర్ఫీదు పొందాడు. తిరిగి వచ్చి సైన్యంలో చేరి, సీజరు దళంలో ముఖ్యనాయకుడిగా ఎదిగాడు. గాల్‌పై యుద్ధంలో చేదోడువాదోడుగా వుండి అతనికి కుడిభుజంగా మారాడు. సీజరు, పాంపే, క్రాసస్‌లతో మొదటి 'త్రయం' ఏర్పడి రోమ్‌ను పాలించేటప్పుడు సీజరు తరఫున వ్యవహారాలు చక్కబెట్టేవాడు. ఆ త్రయం విచ్ఛిన్నమై దేశం అంతర్యుద్ధంలో మునిగినపుడు సీజరునే అంటిపెట్టుకుని వున్నాడు. పాంపేతో యుద్ధాలు సలుపుతూ విదేశాల్లో వుంటూన్నపుడు సీజరు ఆంటోనీని ఇటలీ గవర్నరుగా నియమించాడు. క్రీ.పూ. 47లో సీజరు రోమ్‌కు వచ్చి రెండోసారి కాన్సల్ అయ్యాడు. సెనేట్ అతన్ని నియంతగా వుండమంది. ఆ పదవిలో 11 రోజులు వున్నాక దానికి రాజీనామా చేశాడు. ఆంటోనీని ద్వితీయస్థానంలో నిలిపాడు.

సీజరు ఈజిప్టులో వుండిపోవడం చేత ఆంటోనీకి మార్గదర్శకత్వం చేసేవాళ్లు లేక చాలా పొరపాట్లు చేశాడు. పాంపే అనుచరులు అతనిపై కత్తి కట్టారు. డోలబెల్లా అనే పాంపే అనుయాయి రోమన్ ప్రజల ఋణాలన్నీ మాఫీ చేస్తూ చట్టం చేయాలని ప్రతిపాదించాడు. అలా చేస్తే ఆర్థికంగా దేశం దెబ్బ తింటుందని సీజరు భావిస్తాడని తలచిన ఆంటోని దాన్ని నిరాకరించాడు. దీనికి తోడు మరో కారణం కూడా వుంది డోలబెల్లా తన భార్యకు రహస్యప్రియుడన్న సందేహం కూడా ఆంటోనీకి వుంది. ప్రజల మద్దతు కూడగట్టడానికి యిదే అవకాశం అనుకున్న డోలబెల్లా జనాల్ని వెంటేసుకుని రోమన్ ఫోరమ్‌ను ముట్టడించాడు. ఆంటోనీ ఆ ప్రదర్శకులపై సైన్యాన్ని ప్రయోగించాడు. అప్పులు మాఫీ చేస్తే బాగుండేది కదాన్న భావం సీజరు సైనికుల్లో సైతం వుంది. ఆంటోనీ ప్రవర్తనతో వాళ్లకూ కోపం వచ్చింది. కొద్దికొద్దిగా తిరగబడసాగారు. అరాచకం ప్రబలసాగింది.

ఈజిప్టులో తిష్టవేస్తే రోమ్ చేజారేట్లు వుందని అనుకున్న సీజరు క్రీ.పూ. 47 అక్టోబరులో రోముకి తిరిగి వచ్చేశాడు. ఆంటోనీ విధానాలను నిరసించి, డోలబెల్లాను మచ్చిక చేసుకుందామని చూశాడు. క్రీ.పూ. 46లో మూడోసారి కాన్సల్‌షిప్‌కు ఎంపికై, కాన్సల్‌షిప్‌ను డోలబెల్లాకు బదిలీ చేస్తానని, దానికి అనుమతించాలని సెనేట్‌ను అడిగాడు. ఆంటోనీ దీన్ని ప్రతిఘటించాడు. దాంతో సీజరు నియంతగా తనకున్న అధికారాలను వినియోగించుకుని డోసబెల్లాను కాన్సల్‌గా నియమించాడు. దీనికి కూడా ఆంటోనీ అడ్డు చెప్పాడు. చివరకు సీజరు డోలబెల్లాను కాన్సల్‌గా తీసేసి తన సైన్యంలో జనరల్‌గా చేసి, రోమ్‌కు దూరంగా పంపేశాడు. ఆంటోనీకి క్రీ.పూ. 45 వరకు ఏ పదవీ యివ్వలేదు. అతని స్థానంలో లెపిడస్ అనే అతన్ని సహ కాన్సల్‌గా వేసుకున్నాడు. సీజరు ఉత్తర ఆఫ్రికాలో యుద్ధాలు గెలుస్తూ వుండగా, ఆంటోనీ రోమ్‌లో సాధారణ పౌరుడిగా వుండిపోయాడు. యుద్ధాలు గెలిచి వచ్చిన సీజరును సెనేట్ ఏకంగా పదేళ్లపాటు నియంతగా ఎన్నుకుంది. ఈ పదవే సీజరు హత్యకు దారి తీసింది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2016) (ఫోటో – "క్లియోపాత్రా" సినిమాలో హీరోయిన్‌గా ఎలిజిబెత్ టేలర్, సీజరుగా రెక్స్ హారిసన్)**

**మార్చి 31 వీక్లీకై** **ఎమ్బీయస్ : ఆటల పేరుతో రాజకీయక్రీడ**

తమిళనాట, తెలుగునాట సినిమాతారలు రాజకీయనాయకులుగా మారినపుడు వారికి అందివచ్చినవి అభిమాన సంఘాలు. అప్పటికే ఆ నటుడి అభిమానులందరూ ఒక సమూహంగా ఏర్పడి వుంటారు కాబట్టి ఎన్నికలు వచ్చేసరికి వాళ్లే కార్యకర్తలుగా పనిచేసేవారు. నటుడు పాలకుడయ్యాక తన అభిమాన సంఘ అధ్యక్షులకు టిక్కెట్లిచ్చి రాజకీయాల్లోకి తీసుకుని వచ్చేవాడు. అభిమాన సంఘాలకు అండదండలు అందించేవాడు. బెంగాల్‌లో సినిమా నటులకు అభిమాన సంఘాలుండవు. అందువలన పార్టీలు యూత్ క్లబ్బులను మచ్చిక చేసుకోవడానికి చూస్తూ వుంటాయి. బెంగాల్‌లో, ముఖ్యంగా కలకత్తాలో – బెంగాలీ యువకులలో నిరుద్యోగం ఎక్కువ. బెంగాల్‌కు చుట్టూ వున్న ఒడిశా, ఆసాం, బిహార్, ఝార్ఖండ్‌ల నుండి నిరుద్యోగులు కలకత్తాకు వచ్చిపడతారు. శ్రమపడే ఉద్యోగాలలో ఎంత తక్కువ జీతానికైనా పని చేయడానికి సిద్ధపడతారు. ఇక ఉన్నతోద్యోగాలకు వస్తే యితర రాష్ట్రాల నుండి వచ్చినవారు అనేకమంది కనబడతారు. బెంగాలీ యువకులందరూ వైట్ కాలర్ గుమాస్తా ఉద్యోగాల కోసమే చూస్తూ నిరుద్యోగులుగా మిగులుతారు. నాలుగు మహానగరాలలో దినదినం స్థాయి తగ్గుతున్నది కలకత్తాలోనే. ఒకప్పుడు వుండే పరిశ్రమలు కూడా బెంగాల్ నుంచి వెళ్లిపోతున్నాయి. ఉద్యోగాన్వేషణలో బెంగాలీ యువత యితర రాష్ట్రాలకు వెళ్లినపుడే వారి పరిస్థితి మెరుగవుతోంది. అక్కడే వుండిపోయినవారి స్థాయి పెరగటం లేదు, భవిష్యత్తుపై ఆశ కనబడటం లేదు. చిన్నా, పెద్దా ఏ ఉద్యోగమూ రాక, ఏ వ్యాపారమూ చేయక, యింట్లో వాళ్ల ఔదార్యంమీద బతికేవాళ్లు ఎందరో కనబడతారు.

ఏ మహానగరంలోనూ కనబడని దృశ్యం కలకత్తాలోనే కనబడుతుంది. రోజులో ఏ వేళలోనైనా సరే యువకులు కూడళ్లలో వరుసగా కూర్చుని, సిగరెట్లు తాగుతూ, సమోసాలు తింటూ, జాతీయ అంతర్జాతీయ అంశాలపై చర్చిస్తూ, వాదించుకుంటూ నిర్వ్యాపారంగా కూర్చుంటారు. లేదా సందుల్లో ఏదో పాత కొంపలో కారం బోర్డు వేసుకుని ఆడుతూంటారు. పేకాడుతూ కూర్చుంటారు. వర్షం కురిస్తే రోడ్లపై ఫుట్‌బాల్ ఆడతారు. వీళ్లు తమ జేబుఖర్చు కోసం పండగలు వచ్చినపుడు యింటింటికి వచ్చి చందాలు వసూలు చేస్తారు, మరీ గూండాల తరహాలో కాకపోయినా, ఓ పాటి స్థాయిలో షాపుల వాళ్లను బెదిరించి హఫ్తా వసూలు చేస్తూ వుంటారు.

నాటకం వేస్తున్నామంటూ టిక్కెట్లు అంటగడతారు. సత్యజిత్ రాయ్, మృణాళ్ సేన్, తపన్ సిన్హా, యిలాటి బెంగాలీ దర్శకులు ఎందరో తమ తమ సినిమాల్లో అక్కడి యువత ఎలా భ్రష్టు పట్టిపోతోందో చూపించారు.

రాజకీయపార్టీలకు యీ యువత అక్కరకు వచ్చింది. సిపిఎం వీళ్లను ఎన్నికల సమయంలో కార్యకర్తలుగా, పోలింగు ఏజంట్లుగా వాడుకుంటూ వారు చందాలు సేకరణను చూసీ చూడనట్లు వదిలేసేది. కాలనీవాసులు వారిపై ఫిర్యాదులు చేసినా పట్టించుకునేది కాదు. వీళ్లందరూ గుమిగూడి కబుర్లాడే, ఆటలాడే ప్రదేశాలను అడ్డాలుగా పిలుస్తారు. అడ్డా జనాభా రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించేసి స్టూల్సు వేసుకుని కారం బోర్డు పెట్టేసుకున్నా, దారినపోయే వారిని వేధించినా, జబర్దస్తీ చేసినా ఏమీ అనడానికి లేదు. పోలీసులు కూడా వాళ్ల జోలికి వెళ్లకుండా పాలకులు చూసేవారు. ఈ అడ్డాలు పార్టీలవారీగా చీలిపోయి ఒకరితో మరొకరు కొట్లాడుకున్నా కేసులు పెట్టరు. ఈ విధంగా బెంగాల్ యువశక్తి వ్యర్థమవుతున్నా పాలకులు దాన్ని సవరించే ప్రయత్నం చేయకుండా రాజకీయ ప్రయోజనాలకై వాడుకుంటూ వచ్చారు. తాము కోరుకున్న డెస్క్ జాబ్ ఉద్యోగాలు తమకు యిప్పించని వ్యవస్థపై యువతకు కోపం వుండడం సహజం. కాంగ్రెసు పాలనలో ఆ కోపాన్ని సిపిఎం తనకు అనుకూలంగా మార్చుకుంది. సిపిఎం పాతికేళ్లు పాలించేసరికి యువత కోసం ఆ పార్టీపై మళ్లింది. సిపిఎంకు వ్యతిరేకంగా మమతా బెనర్జీ పోరాడినపుడు సహజంగానే వీరు ఆమె పట్ల ఆకర్షితులయ్యారు.

కాంగ్రెసు నుంచి చీలి వచ్చిన తృణమూల్ ఏక వ్యక్తి పరిపాలిత వ్యవస్థ. దానికి సంస్థాగతమైన నిర్మాణం లేదు. కాంగ్రెసు కార్యకర్తలు కొందరు మాతృసంస్థలో వుండిపోగా, మరి కొందరు యిటు వచ్చారు. మమత కన్ను యీ యువతపై పడింది. 'మీరు నా తరఫున పనిచేస్తే మీ అడ్డాల ఆగడాలకు అడ్డు లేకుండా చూడడంతో బాటు క్రీడలకు ప్రోత్సాహం పేరుతో రాష్ట్ర ఖజానా దోచి పెడతా' అంది. 2012లో రూ. 15.50 కోట్లు యిచ్చింది, 2013 నాటికి అది 40 అయింది, మరుసటి సంవత్సరం 64, 2015లో స్థానిక ఎన్నికలు రావడంతో బజెట్ పెరిగిపోయింది 150 కోట్లు యిచ్చింది. ఈ ఏడాది యిప్పటికి 100 కోట్లు అయింది. రాష్ట్రం మొత్తంలో 7,500 క్లబ్బులకు భృతి అందుతోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుంటే సరేలే అనుకోవచ్చు. ఇప్పటికే రూ.లక్ష కోట్ల అప్పుంది. అయినా క్లబ్బులకు బజెట్ కేటాయింపులకు మించి డబ్బు దోచి పెడుతున్నారు. కాగ్ యూత్ ఎఫయిర్స్, స్పోర్ట్స్ శాఖను మాటిమాటికీ సంజాయిషీ అడుగుతూనే వుంది. 91 మంది టీచర్లకు 17 నెలలుగా జీతాలు యివ్వకపోతే హైకోర్టు చేత మొట్టికాయలు తింటూనే వున్నా వీళ్లకు మాత్రం నిధులు కుమ్మరిస్తూనే వున్నారు. ఏ యే క్లబ్బులకు ఆర్థికసాయం చేయాలి అని రూల్సు తయారు చేసినపుడు అది రిజిస్టర్ అయి వుండాలని, బ్యాంకు ఎక్కవుంట్లు వుండాలని, అది అద్దె కుంటున్న చోటుకి లీజు ఒప్పందం వుండాలని – యిన్ని పెట్టారు. కానీ ఆచరణలో ఏదీ చూడటం లేదు. సందుల్లో గొందుల్లో, అరుగుల మీద, చెట్ల కింద, టీ స్టాలులో, దుకాణాల చూరు కింద ఎక్కడ పెట్టినా సరే డబ్బిచ్చేస్తున్నారు. రాజకీయ నాయకుల ఆదేశాల మేరకు యివ్వాల్సి వస్తున్నా ఆర్డర్ల మీద సంతకాలు చేయడానికి అధికారులు జంకుతున్నారు. అందుకే క్రీడా శాఖలో నాలుగేళ్లలో ఐదుగురు ప్రిన్సిపల్ సెక్రటరీలు మారారు. ఇప్పుడున్నాయనను మీడియా వాళ్లు వెళ్లి దీనిపై అడగబోతే 'ఆ ఒక్కటీ తప్ప వేరే ఏదైనా అడగండి..' అంటున్నాడు.

ప్రజాధనాన్ని యిలా వెదజల్లుతున్నందుకు తృణమూల్‌కు బాగానే కిట్టుబాటవుతోంది. వార్డు నాయకుడు 'ఫలానా అంశంపై నిరసన ర్యాలీ నిర్వహించాలి' అని చెప్పీచెప్పగానే క్లబ్బు నుంచి 50 మంది వెంటనే బారులు తీరతారు. ఆ వార్డులో వున్న ఓటర్లు ఎవరు? ఎవరు ఏ పార్టీ సానుభూతిపరులు అని కన్నేసి వుంచు అంటే వుంచుతారు. ఓటర్ల లిస్టు చెక్ చేయడానికి ఎన్నికల కమిషన్ అధికారులు వార్డుకి వస్తే 'మీరు చూడక్కరలేదు, మేమే చెక్ చేసి చెపుతాం' అని పంపించివేసి, యితర పార్టీల ఓటర్లను ఏరివేస్తారు. తమ పార్టీ సానుభూతి పరుల యిళ్లల్లో ఓటర్ల సంఖ్య పెంచేస్తారు. ఎన్నికలకు ముందు రోజు వందలాది మంది కుర్రాళ్లు గుంపులుగుంపులుగా తిరుగుతూ పెద్దగా అరుచుకుంటూ భయానక వాతావరణం సృష్టిస్తారు. ఓటింగు రోజున తమకు ఓటేసేవారిని మోటార్‌సైకిళ్లపై బూతులకు తీసుకెళతారు. ప్రత్యర్థి పార్టీ వాళ్లను బెదిరిస్తారు. వాళ్ల యిళ్లలోంచి బయటకు రాకుండా గుమ్మం ముందు కారం బోర్డు వేసుకుని ఆడుతూ కూర్చుంటారు. మరీ మొండి ఘటాలు బూతుకు వెళుతుంటే దారి పొడుగునా వెంబడిస్తూ దుర్భాషలాడుతూ వారిని భయపెడతారు. ఓటేసిన వాళ్లెవరో, వేయని వాళ్లెవరో గమనించి ఎమ్మెల్యే ప్రతినిధులకు రిపోర్టు యిస్తారు. తృణమూల్‌కు తప్ప యితరులకు ఓటేస్తే యీ కాలనీలో బతకలేంరా బాబూ అనే అభిప్రాయాన్ని కలిగిస్తారు. అధికార పార్టీకి యింతగా సాయపడుతున్నారు కాబట్టి వీళ్లకు ప్రభుత్వ మద్దతు సంపూర్ణంగా వుంటుంది. పూజలకు చందాల పేరుతో డబ్బు గుంజుకోనిస్తారు, ఖాళీ స్థలం కనబడితే ఆక్రమించనిస్తారు, తాగి గోల చేసినా కేసులు పెట్టనివ్వరు. ఎమ్మెల్యేలు తమ ఫండ్స్ నుంచి వీళ్లకు ఆటల సామగ్రి, జిమ్ సామగ్రి కొనడానికి డబ్బు యిస్తారు. జిమ్‌లో బాగా కసరత్తు చేసి కండలు పెంచితే తమ వద్ద గూండాలుగా వుద్యోగం యిస్తారు కూడా.

ఏమిటిదంతా అని స్పోర్ట్స్ శాఖలో ఉద్యోగిని అడిగితే ఒకాయన 'పార్టీతో నిమిత్తం లేకుండా ప్రతి పార్టీ ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో తలా 10 క్లబ్బులను సిఫార్సు చేయవచ్చని రూలు వుంది' అని చెప్పాడు. అలాటి రూలు వుందని మాకు తెలియదే అన్నారు ప్రతిపక్ష ఎమ్మెల్యేలు. ఉన్నా అసెంబ్లీ లోని 294 మంది ఎమ్మెల్యేలకు కలిపి 2940 క్లబ్బులుండాలి తప్ప 7500 క్లబ్బులకు ప్రభుత్వసాయం అందడమేమిటి? ఈ క్లబ్బులను విరివిగా పోషించిన – ప్రభుత్వధనంతోనే లెండి – మహారాజ పోషకుడు మదన్ మిత్రా. అతను శారదా స్కాములో చిక్కుకుని జైలుపాలయినపుడు యీ క్లబ్బుల వాళ్లంతా అతనికి మద్దతుగా పెద్ద ప్రదర్శన నిర్వహించడంలో ఆశ్చర్యం ఏముంది? రాబోయే బెంగాల్ ఎన్నికలలో తృణమూల్ విజయంలో యీ అడ్డాల భూమిక కూడా గణనీయంగా వుంటుందని

సులభంగా వూహించవచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2016)**

**మార్చి 32 వీక్లీకై** **ఎమ్బీయస్ : ఆసాంలో అట్టు తిరగబడుతుందా?**

ఆసాంలో గత 15 ఏళ్లగా కాంగ్రెసు ఏలుతోంది. అందువలన యీ సారి ఎన్నికలలో అట్టు తిరగబడి 2011 ఎన్నికలలో 5 సీట్లు (మొత్తం సీట్లు 126) మాత్రమే గెలుచుకున్న బిజెపి అధికారంలోకి వస్తుందనే అనుకుంటున్నారు. ప్రభుత్వ వ్యతిరేకతకు మరో అంశం కూడా తోడయింది. ముఖ్యమంత్రిగా వున్న తరుణ్ గొగోయ్‌కి యిన్నాళ్లూ రణతంత్రంలో సహాయపడుతూ వచ్చిన హిమంత విశ్వశర్మ 2015 ఆగస్టులో అతనిపై తిరుగుబాటు చేసి 10 మంది ఎమ్మెల్యేలతో సహా బిజెపిలోకి మారిపోవడంతో కాంగ్రెసుకు పెద్ద దెబ్బే తగిలింది. 79 ఏళ్లు వచ్చిన తరుణ్ గద్దె దిగి తనను ముఖ్యమంత్రి చేయాలని 47 ఏళ్ల హిమంత ఆశించి మూడేళ్లగా అధిష్టానం వద్ద మొత్తుకుంటున్నా మాతాసుతులు పట్టించుకోలేదు. ప్రాణం విసిగి అతను బిజెపిలో చేరాడు. తన చాకచక్యాన్ని వుపయోగించి ఆసాం గణ పరిషత్‌తో సహా అన్ని ప్రతిపక్షాలను కూడగట్టి పొత్తు సాధించాడు. ఒకే ఒక్క ప్రతిపక్షం మాత్రం బిజెపితో కలవలేదు. అది 2011 అసెంబ్లీ ఎన్నికలలో 13% ఓట్లతో 18 సీట్లు గెలిచిన ఎఐయుడిఎఫ్ అనే ముస్లిము పార్టీ. అగరుబత్తి వ్యాపారి బద్రుద్దీన్ అజ్మల్ స్థాపించిన ఆ పార్టీ 2014 పార్లమెంటు ఎన్నికలలో 15% ఓట్లతో 3 సీట్లు సాధించింది. కాంగ్రెసుకు 30% ఓట్లతో 3, 37% ఓట్లతో బిజెపి 7 తెచ్చుకున్నాయి. దీనికి కారణం రాష్ట్రంలో 35% వున్న ముస్లిములు బిజెపిని నిలవరించడానికి ఎఐయుడిఎఫ్‌ను ఆదరించారు. కానీ బిహార్ ఎన్నికల తర్వాత బిజెపి రథానికి అడ్డుకట్ట వేయడానికి కాంగ్రెసును ఆదరించడమే మంచిదని భావిస్తున్నారుట.

బిజెపి శిబిరంలో కూడా అంతా సవ్యంగా లేదు. ఏళ్ల తరబడి పార్టీని అంటిపెట్టుకుని వున్న తమను కాదని, కొత్తగా కాంగ్రెసు నుంచి వచ్చిన హిమంత అతని అనుచరులకు పెద్దపీట వేయడం చాలామందికి నచ్చటం లేదు. ఆసాం గణపరిషత్‌తో (ఎజిపి) చేతులు కలిపిన కారణంగా వాళ్లకు 24 సీట్లు కేటాయించి తమ క్యాడర్‌కు టిక్కెట్లు యివ్వకపోవడమూ సహించలేకపోతున్నారు. 2011 ఎన్నికల్లో ఎజిపికి 10 వచ్చాయి. బిజెపి తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థిగా 53 ఏళ్ల సర్వానంద సోనోవాల్ ముందుకు వచ్చారు. అతను బంగ్లాదేశ్ నుంచి ఆసాంలో స్థిరపడిన శరణార్థులకు వ్యతిరేకంగా దశాబ్దాలుగా పోరాడుతున్నాడు. 2014 పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో మోదీ బంగ్లాదేశ్ శరణార్థులందరూ 2016 మే నాటి కల్లా దేశం విడిచి వెళ్లాల్సిందే అని హుంకరించాడు. ఒకసారి అధికారంలోకి వచ్చాక బిజెపి ట్యూను మార్చి బంగ్లాదేశ్ నుంచి వచ్చిన ముస్లిములు వెళ్లిపోతే చాలు, హిందువులు వుండవచ్చు అంటోంది. అది ఆసామీయులకు రుచించడం లేదు. వాళ్ల దృష్టిలో హిందువైనా, ముస్లిమైనా విదేశీయుడు వెళ్లిపోవాల్సిందే. వాళ్ల కారణంగా తమ ఉద్యోగాలు పోతున్నాయి, శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని వారి బాధ. అరుణాచల్ ప్రదేశ్ బ్రహ్మపుత్రా నదిపై కడుతున్న పెద్ద డ్యామ్‌ను బిజెపి 2014కు ముందు వ్యతిరేకించింది. అధికారంలోకి వచ్చాక దానిపై మెత్తబడింది. వీటిపై ఆసాం ఓటరు ఎలా స్పందిస్తాడో చూడాలి.

ఎఐయుడిఎఫ్ అధినేత బద్రుద్దీన్ అత్యంత ధనికుడు మాత్రమే కాక, స్వచ్ఛంద సంస్థల ద్వారా దండిగా విరాళాలు యిస్తూంటాడు. అతన్ని ఒక సాధుపుంగవుడుగా ఆసాంలో భావిస్తారు. ముస్లిములకే కాక గిరిజనులకు, హిందువులకు కూడా టిక్కెట్లు యిచ్చి వారిని గెలిపించాడు. అతనితో చేతులు కలిపితే హిందువులందరూ బిజెపివైపు మళ్లుతారనే భయంతో తరుణ్ విడిగానే విడిగానే పోటీ చేద్దామని కాంగ్రెసు హై కమాండ్‌ను ఒప్పించాడు. దానికి తోడు 'బద్రుద్దీన్ ఎవడు?' అని హేళనగా మాట్లాడాడు. దాంతో బద్రుద్దీన్ అతనిపై పగబట్టాడు. 2011లో కాంగ్రెసుకు 78 సీట్లు వచ్చాయి. ఈ సారి ఏ మేరకు తగ్గుతాయో చూడాలి. ఏ పార్టీకి మెజారిటీ రాకుండా త్రిశంకు సభ ఏర్పడుతుందని కూడా కొందరు వూహిస్తున్నారు. ఆ పరిస్థితిలో బద్రుద్దీన్ ఎవరివైపు మొగ్గితే వారికే అధికారం దక్కుతుంది. ఇటు చూస్తే తరుణ్, అటు చూస్తే బిజెపి – ఎవరికి మద్దతివ్వాలన్నా బద్రుద్దీన్‌కి గడ్డు పరిస్థితే! **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2016)**

**మార్చి 34** **ఎమ్బీయస్ : మధ్యతరగతి విషాదం**

లోకసత్తా జెపి నేలకు దిగి వచ్చి, క్షేత్రస్థాయిలో వాస్తవాలను గుర్తించారు. రాజకీయాలు, ఎన్నికలు వ్యాపారంగా మారిన నేపథ్యంలో ఎన్నికలకు దూరంగా వుండాలని నిర్ణయించుకున్నామని ప్రకటించారు. లోకసత్తా ఉద్యమాన్ని పార్టీగా మార్చిన తరుణంలో కూడా రాజకీయాలు, ఎన్నికలు వ్యాపారంగానే వున్నాయన్న సంగతి మీలాటి, నాలాటి సామాన్యులకు తెలుసు. మరి జెపి వంటి మేధావికి తెలియకుండా పోయిందా? ఆయనేమీ విదేశాల్లో చదువుకుని, అక్కణ్నుంచి సరాసరి యిక్కడకు రాలేదు. ఐయేయస్ అధికారిగా, నిత్యం రాజకీయనాయకుల మధ్యే తిరిగారు. ఆయన ఎన్టీయార్‌కు ప్రిన్సిపల్ సెక్రటరీగా వుండగానే వెన్నుపోటు ఘటన జరిగింది. చంద్రబాబు, తను, హరికృష్ణ, బాలకృష్ణ కలిసి ఎన్టీయార్‌పై కుట్ర పన్నినపుడు దుర్గాప్రసాద్ (ఐజి), జెపి తన యింట్లోనే వున్నారని, చంద్రబాబు క్యాంపు నిర్వహిస్తున్న వైస్రాయి హొటలుకు వెళ్లవద్దని వారించారని దగ్గుబాటి వెంకటేశ్వరరావు తన పుస్తకంలో రాశారు. ఎన్టీయార్ పేరు చెప్పుకుని గెలిచిన పిపీలికాల వంటి ఎమ్మెల్యేలు సైతం ఎందుకు ఎదురు తిరిగారో తెలుసుకోలేనటువంటి అమాయకుడు

కాదు జెపి. ఆ తర్వాత ఉద్యోగం మానేసి 1996లో లోకసత్తా ఉద్యమం ప్రారంభించి అనేక మంది రాజకీయవేత్తలతో, అధికారులతో తిరిగి, వారితో పోట్లాడి, వారిని ఒప్పించి సమాచార హక్కు, జాతీయ ఆరోగ్య మిషన్, లోక్‌పాల్ వంటి అనేక చట్టాల రూపకల్పన చేసిన జెపికి రాజకీయ నాయకుల ఆలోచనాస్థాయి, స్వార్థదృక్పథం, వ్యాపారధోరణి తెలియకుండా ఎలా వుంటుంది? అన్నీ తెలిసే ఆయన ఉద్యమం చేపట్టిన పదేళ్లకు దాన్ని పార్టీగా మార్చారు. పార్టీగా మార్చిన పదేళ్లకు దాన్ని మూసేశారు.

జెపి లోకసత్తా ఉద్యమం మొదలుపెట్టినపుడు మేధావి వర్గాల్లో ఒక సంచలనం రేగింది. ఆయన ఒక రాజకీయ పక్షాన్ని ఉద్దేశించి కాక, మొత్తం సమాజాన్నే సంస్కరించడానికే పూనుకున్నారని అందరూ హర్షించారు. చట్టాలలో వున్న అధికారాలు ఫలానా, వాటిని వినియోగించుకోండి, మీ సత్తా తెలుసుకుని మీ హక్కుల కోసం పోరాడండి అని ఆయన ప్రజలకు ఉద్బోధించేవారు. ఏ దేశంలో ఎలాటి పరిస్థితి వుందో, దేని కారణంగా అక్కడ మార్పు వచ్చిందో సోదాహరణంగా చెప్పేవారు. అతిశయోక్తులు లేకుండా, సూటిగా, స్పష్టమైన ఆలోచనతో వివరించేవారు. మనం గట్టిగా పూనుకుంటే సమాజం బాగుపడుతుందనే నమ్మకం మధ్యతరగతి మేధావుల్లో కలిగించారు. దాంతో ఆయనకు ఎందరో అండగా నిలిచారు. ఎంతోమంది ఆయన ఉద్యమంలో పాలు పంచుకున్నారు. వారు డబ్బు, పదవులు ఆశించి వచ్చినవారు కారు. జెపి వంటి మేధావి నేతృత్వంలో పని చేసి, ఏదైనా సాధిద్దామనే పట్టుదలతోనే తమ సమయాన్ని, డబ్బును ఖర్చు పెట్టుకున్నారు. విదేశాలలో వున్న తెలుగువారనేకమంది ఆయన ఉద్యమానికి విస్తృత ప్రచారం కల్పిస్తూ, తమ జీతాల్లోంచి కొంత భాగాన్ని విరాళంగా పంపేవారు. సాధారణ మనిషి ఎప్పుడూ ఆదర్శాలు కలవరిస్తూ, అద్భుతాల కోసం కలలు ంటూ వుంటాడు. ఏదో ఒక మేజిక్ చేసి జెపి అవినీతిరహిత సమాజం ఏర్పరచాలని వాళ్లంతా కోరుకున్నారు. ఆయనకా శక్తి వుందా లేదా అని, ఆయన ప్రవచించే ఆదర్శలోకం ఆచరణసాధ్యమా అని గట్టిగా ఆలోచించినది లేదు. ఆయన చేయగలడనే వారు నమ్మారు.

వారలా నమ్మేట్లు చేయగలిగినది ''ఈనాడు''. జెపికి దన్నుగా నిలిచిన ఈనాడు ఆయన చేత తన ఎడిట్ పేజీలో పెద్దపెద్ద వ్యాసాలు రాయించేది. తన టీవీ ఛానెల్‌లో సామాజిక సమస్యలపై చర్చావేదిక నిర్వహించే అవకాశం కల్పించింది. ఆయన లోకసత్తా తరఫున ప్రచురించే ''జనబలం'' పత్రికను తన మార్గదర్శి మార్కెటింగ్ ద్వారా పంపిణీ చేసేది. నిజానికి ఈనాడు ఎన్నో ఆర్థిక అక్రమాల కేసుల్లో యిరుక్కుంది. తన ఆస్తులు కాపాడుకోవడానికి రాజకీయంగా ఎన్ని మొగ్గలు వేస్తోందో యిటీవల మరీ స్పష్టంగా కనబడుతోంది. జెపి చెప్పే సమాజం నిజంగా అవతరిస్తే ఈనాడుకే యిబ్బంది. అయినా జెపిని త్రివిక్రమావతారంలో చూపి, ప్రజల్లో ఆయన యిమేజిని విపరీతంగా ఎందుకు పెంచింది? ఈనాడు కాంగ్రెసు వ్యతిరేకి అనే విషయం సర్వవిదితం. కానీ లోకసత్తా ఉద్యమం రూపు దిద్దుకున్నపుడు అధికారంలో వున్నది 'ఈనాడు' మద్దతిచ్చిన చంద్రబాబు ప్రభుత్వం. ప్రభుత్వంలో, సమాజంలో వున్న అవినీతిని, అన్యాయాన్ని ఎత్తి చూపిస్తే టిడిపికే యిబ్బంది. మరి అలాటప్పుడు ఈనాడు జెపిని హైలైట్ చేయడం దేనికి? అంతిమంగా బాబుకి మేలు చేయడానికే.. అంటారు కొందరు.

అదెలా అంటే – రాముడు పెళ్లి చేసుకుని అయోధ్యకు వెళుతూండగా అందర్నీ హడలగొడుతూ పరశురాముడు వచ్చాడు. 'శివధనస్సు విరిచావుట, విష్ణుధనస్సు కూడా ఎక్కుపెట్టి నీ ప్రతాపం చూపించు' అని ఛాలెంజ్ చేశాడు. అవన్నీ ఎందుకు లెండి అని రాముడు తప్పించుకోబోయినా వదల్లేదు. చివరకు రాముడి చేత ఆ ధనస్సు కూడా ఎక్కుపెట్టించి శభాష్ అని మెచ్చుకుని, రాముడు గట్టివాడే అని లోకానికి చాటి మరీ వెళ్లాడు. రాముడు జనకుడి అంతఃపురంలో శివధనస్సు ఎక్కుపెట్టబోయి విరక్కొట్టినపుడు కాసిన్నిమంది పరిచారకులు, విశ్వామిత్రుడు, జనకుడు, లక్ష్మణుడు తప్ప పెద్దగా ఎవరూ లేరు. (సీతాస్వయంవరఘట్టం వాల్మీకి రామాయణంలో లేదు) ఈ పరశురాముడి హంగామా వలన రాముడు లెవెల్ మరింత పెరిగింది. అయితే జనాలకు యిందులో తెలియని విషయమేమిటంటే రాముడు, పరశురాముడు యిద్దరూ విష్ణువు అవతారాలే! చంద్రబాబు నాలుగేళ్లు పాలన చేసేటప్పటికి పలుకుబడి కాస్త తగ్గింది. ఒంటిచేత్తో నెగ్గే సత్తా ఎన్టీయార్‌తోనే అంతరించింది. 1999లో బిజెపితో చేతులు కలిపి ఆ లోటు పూరించుకుని బాబు మళ్లీ సిఎం అయ్యారు. అయితే ప్రభుత్వ వ్యతిరేకత ప్రబలుతోంది. ఆ వ్యతిరేకతను యితరులు సొమ్ము చేసుకోకుండా జెపిని దాన్ని కేంద్రంగా చేయడానికి రామోజీరావు ప్లాను చేశారంటారు. ఆయన అందరికీ వ్యతిరేకిగా కనబడుతూనే 'అందరిలోనూ లోపాలున్నా, వున్నవాళ్లలో బాబు బెటరు' అనే అభిప్రాయాన్ని మధ్యతరగతిలో కలిగిస్తారన్నమాట. ప్రభుత్వ వ్యతిరేకతను చీల్చడానికి పాలకులు యిలాటి ట్రిక్కులు వేస్తూ వుంటారు. చిరంజీవి పార్టీ పెట్టినపుడు వైయస్ లోపాయికారీగా సాయపడ్డారని అంటారు. ఆ విధంగా ప్రతిపక్షాలు చీలిపోతాయి.

ఎన్ని లెక్కలు వేసినా బాబుపై వ్యతిరేకత ఎక్కువై పోయి 2004 ఎన్నికలలో కాంగ్రెసు గెలిచేసింది. ఇక దాంతో ప్రభుత్వ అవినీతిపై బాబు చెప్పేది, జెపి చెప్పేది ఒకటే అయిపోయింది. టిడిపికి వున్నంత వ్యవస్థ లోకసత్తాకు ఎక్కడుంది? బాబు కున్నంత మేనేజిరియల్ టెక్నిక్స్ జెపికి ఎక్కడున్నాయి? 'సత్తా' ఎందుకు చాటలేదు? అంటూ ''సాక్షి''లో జెపితో సన్నిహితంగా పనిచేసిన నరేశ్ అనే ఒక పాత్రికేయుడు జెపి బలాబలాలపై చక్కటి విశ్లేషణ చేశారు. లోకసత్తా వైఫల్యానికి 50% పరిస్థితులు, 50% జెపి స్వయంకృతం కారణమన్నాడాయన. లీడరుగా జెపి చాలా పొరపాట్లు చేశారని, ఎవరికి ఏ పని అప్పగించాలో ఆయనకు తెలియదని, అందర్నీ కలిపి కూర్చోబెట్టి చర్చించేవారు కాదని, మనసులో జనం మీద అంతులేని ప్రేమ వున్నా జనంలో కలవడం అంతగా యిష్టపడేవారు కాదని, చదవడం, రాయడం, చర్చించడంమీద వున్న శ్రద్ధ, ఫీల్డ్ మీద వుండదని ఆయన రాశాడు. ఈ లోపాలున్నా జెపి చిత్తశుద్ధిపై,

అద్భుతమైన మేధస్సుపై మధ్యతరగతివారికి అపారమైన యిష్టం, వ్యామోహం వుండేది. ఆయనను కలిసి తమ ఆలోచనలు పంచుకోవాలని, ఆయనను అనుసరించాలని తహతహ లాడారు. తర్వాతి కాలంలో అరవింద్ కేజ్రీవాల్ సంపాదించుకున్న క్రేజ్ ఢిల్లీ కంటె పెద్ద రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో జెపి ఎప్పుడో సంపాదించుకున్నారు. అయితే అరవింద్ వెనక్కాల టీము వుంది. వారిలో కొందరు తలకాయనొప్పి తెచ్చేవాళ్లు కూడా వున్నారు. అయినా అతను జయప్రకాశ్ గారిలా 'ఏకోనారాయణ' కాదు. నిజానికి జెపి సిఎం అయి వుంటే కాబినెట్‌లో ఆయనతో పాటు మంత్రులుగా ఎవరుంటారో వూహించుకోవడం కష్టం. ఎందుకంటే ఎన్నికల ప్రచారంలో బ్యానర్లపై, టీవీ యాడ్స్‌లో, రేడియో యాడ్స్‌లో జెపియే కనబడేవారు, వినబడేవారు.

జెపి ఆదర్శబలంతో లోకసత్తా ఉద్యమం కొద్దికొద్దిగా విస్తరిస్తూ పోయింది. దాన్ని బాగా ముందుకు తీసుకుని వెళ్లాలంటే లీడర్‌షిప్ గట్టిగా వుండాలి. పట్టణాలన్నిటిలోను లోకసత్తా శాఖలు ఏర్పడినా గ్రామాల్లో 10% వాటిల్లో మాత్రమే ఏర్పడ్డాయి. అంతకు మించి విస్తరించడానికి జెపి నాయకత్వం చాలలేదు. పైగా అవినీతి వ్యతిరేక వుద్యమంపై లోకసత్తా గుత్తాధిపత్యం పోయింది. వైయస్ అవినీతిపై లెఫ్ట్, టిడిపి, ఈనాడు, ఆంధ్రజ్యోతి ఎవరి ఉద్యమాలు వాళ్లు నడిపేస్తున్నారు. వాళ్లకున్నంత క్యాడర్ కానీ, రీచ్ కానీ లోకసత్తాకు లేక, జెపి పరిస్థితి గుంపులో గోవిందా అయిపోయింది. ఇలాటి పరిస్థితిలో జెపి ఉద్యమాన్ని పార్టీగా మారుద్దామనే అత్యంత వివాదాస్పద నిర్ణయం తీసుకున్నారు. ఉద్యమమే నగరాలను, పట్టణాలను దాటి వెళ్లలేదు. ఆయనలో నియంత పోకడలు వున్నాయని సన్నిహితంగా చూసినవారు చెప్తారు. మామూలు జనాలకు అది తెలియదు. కానీ వ్యవస్థలో అంతర్గత చర్చ, సంప్రదింపులు లేకుండా తాను నిర్ణయం తీసుకుని పైనుంచి అమలు చేయడానికి చూడడంతో కొన్ని శాఖలు తిరగబడ్డాయి. అయినా జెపి ముందుకు వెళ్లారు. అప్పుడు ఆయనకు అండగా నిలబడినవారు 'మనం ఎన్ని ప్లానులు వేసినా అవి కాగితాలకు, బీరువాలకు అంకితమై పోతున్నాయి తప్ప ఆచరణకు నోచుకోవటం లేదు. ఇంకోరికి నచ్చచెప్పి అమలు చేయించేబదులు, మనమే అధికారం చేపట్టి అమలు చేసి చూపిద్దాం అనే ఉద్దేశంతో జెపి తీసుకున్న నిర్ణయాన్ని మేం సమర్థించాం' అని చెప్పుకున్నారు. మళ్లీ వాళ్లే జెపి ఒక ఉత్తరాది వ్యక్తిని లోకసత్తా అధ్యక్షుడిగా కూర్చోబెట్టడానికి ఏకపక్ష నిర్ణయం తీసుకున్నపుడు వ్యతిరేకించి విడిగా వచ్చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ గురించి ఉద్యమించే ఉద్యమసంస్థ అంతర్గత ప్రజాస్వామ్యం పాటించకపోతే ఎలా? మొగ్గ దశలోనే వీరు జెపికి అడ్డు తగిలి వుంటే ఆయన యింత నియంత అయి వుండేవారు కాదేమో! రాజకీయపార్టీగా మారాక లోకసత్తా పంచాయితీ ఎన్నికలలో, మునిసిపల్ కార్పోరేషన్ ఎన్నికలలో పోటీ చేస్తూ ఒక్కో మునిసిపాలిటీలో తన సత్తా చూపించుకుంటూ తను ప్రవచించే ఆదర్శాలు ఆచరణీయమే అని నిరూపించి చూపించి వుంటే ప్రజలకు దానిపై నమ్మకం కుదిరేది. కానీ జెపి కుంభస్థలానికే గురి పెట్టారు. ఏకంగా ఎసెంబ్లీ ఎన్నికల్లోనే పోటీ చేస్తూ 'ఇది సెమిఫైనల్, 2014 ఎన్నికలలో లోకసత్తాయే అధికారంలోకి వస్తుంది' అని ప్రకటించారు. ఇతర రాష్ట్రాలలో, యితర దేశాల్లో వున్న ప్రవాసాంధ్రులు చాలామంది పులకించిపోయారు. ధారాళంగా విరాళాలు పంపారు. ఇంటర్నెట్ ద్వారా చాలా ప్రచారం చేశారు. అంతటితో ఆగలేదు. అలా ప్రచారం చేయనివాళ్లను అవినీతిపరులుగా, అవినీతికి మద్దతుదారులుగా ముద్ర కొట్టారు. అలా ముద్ర కొట్టించుకున్నవారిలో నేనూ వున్నాను. 2009 ఎన్నికల సమయంలో మార్చి నెలలో నేను రాసిన వ్యాసాల్లో కొన్ని భాగాలను చదివితే ఆనాటి మూడ్ గురించి, లోకసత్తా సత్తాపై నా అంచనాల గురించి మీకు అవగాహన ఏర్పడుతుంది.

"జెపికో గుస్సా క్యోం ఆతా హై?" నుండి – '..జయప్రకాశ్ గారికి మీడియాపై కోపం వచ్చింది. 'డబ్బిచ్చి జనాన్ని తెప్పించుకుంటే పోటెత్తిన జనం అని రాస్తారు. వైజాగ్ బీచ్‌లో స్వచ్ఛందంగా పదివేలమంది సభకు వస్తే అది మీకు వార్త కాదా? ఏ ఒక్క పత్రికా, ఏ ఛానెలూ కవర్ చేయలేదేం?' అని. 'నేను యిన్ని రోజులూ మనసులో వుంచుకున్నానే కానీ..ఎప్పుడూ బయటపడలేదు. ఈ వ్యాఖ్యానాల పర్యవసానం ఎలా వుంటుందో నాకు తెలుసు.' అంటూ బాధ వెళ్లగక్కారు. ఆయనది ధర్మాగ్రహం అన్నదానిలో ఆవగింజంతైనా అనుమానం లేదు. కానీ యిదేమైనా కొత్తా స్వామీ? మీడియా పక్షపాత ధోరణి ఆయనకు తెలిసే వున్నా, కానీ అది తనకు అన్వయించదని అనుకుని వుంటారు. ఎందుకంటే ఆయన వుద్యమకారుడిగా వున్నపుడు మీడియాయే ఆయనకు అండగా నిలిచింది. లేకపోతే రాష్ట్రంలో ఎంతమంది మేధావులు లేరు! రాజీనామా చేసిన ఐయేయస్‌లు ఎందరు లేరు! జెపి గారి పేరు యింటింటా తెలిసిందంటే కారణం ఆయన లేవనెత్తిన అంశాలకు మీడియా ప్రచారం కల్పించడమే! ఉద్యమం నుండి రాజకీయ పార్టీగా మారినపుడు యిలాటి ఆక్యుపేషనల్ హజార్డ్స్ వుంటాయని ఆయన వూహించనట్టుగా వుంది. గత ఎన్నికలలో ఆయన క్రిమినల్ కాండిడేట్లు అంటూ ప్రకటించినపుడు యిచ్చిన కవరేజి యిప్పుడు యిమ్మంటే ఎలా? రాజకీయ నాయకుడిగా ఆయన మనకు వుపయోగపడతారా? లేదా అని బేరీజు వేసుకుని పత్రికలు ఆయనను పట్టించుకోవాలా? లేదా? అన్నది తేల్చుకుంటాయి. దీనిలో ఆయనకు ఛాయిస్ ఏమీ లేదు.

ఆయన చాలా అమాయకంగా ఓ మాట అన్నారు – పత్రికల యాజమాన్యాలు ఎలా వున్నా పాత్రికేయులు ధర్మం పక్షాన వుండాలని! యాజమాన్యమే పాత్రికేయులుగా డబుల్ రోల్ వేయడం మొదలెట్టి 30 ఏళ్లు దాటిందని ఆయనకు తెలియదా? పత్రిక యాజమాన్యం ఒక పక్కన, పాత్రికేయుడు మరో పక్కన వుండే రోజులా యివి?...జెపి గారిని నేను యీ మాత్రమైనా నేను విమర్శించడం కొందరికి మింగుడుపడటం లేదు. జెపి గారు వ్యవస్థను విమర్శిస్తారు కాబట్టి, నేనూ అందర్నీ విమర్శిస్తాను కాబట్టి, ఆటోమెటిక్‌గా నేను జెపిగారి అభిమాని అనేసుకున్నారు కొందరు. అదేమిటో జనాలకు కొన్ని ప్రీ కన్సీవ్‌డ్ నోషన్స్ వుంటాయి. కాస్త తెలివిగా మాట్లాడిన వారందరికీ చదరంగం వచ్చేస్తుందనీ.. యిలాటివి. యువతలో చాలామందికి ఆయన ఆశాదీపం అని నాకు తెలుసు.

నాకూ వుండేవి యిలాటి దీపాలు, దివిటీలు. ఇలాటివి చూసి, చూసి ఆశాభంగం చెంది చెంది నేను ముదిరిపోయాను. అంతమాత్రం చేత యీనాటి యువత జెపిని చూసి ఆశ పెట్టుకుంటే నేను తప్పుపట్టను. వాళ్లకీ తెలిసివస్తుంది కొన్నాళ్లకి. అప్పటిదాకా ఒకలాటి అమాయకపు ఆనందం (బ్లిస్‌ఫుల్ యిగ్నోరెన్స్) అనుభవించనీయనీ అనుకుంటా. ఈలోపున జెపిని విమర్శిస్తున్నందుకు వాళ్లు నిందిస్తే నవ్వేసి వూరుకుంటాను.

''జెపి గారే ఒప్పుకున్నారు...'' నుండి – జెపి గారు ఎన్నారైలతో టెలి కాన్ఫరెన్సులో మాట్లాడుతూ 'పార్టీలో తాను తప్ప మరో నేత లేడనే భావనే యీ రోజు లోకసత్తా ఎదుర్కొంటున్న పెద్ద సవాల్' అన్నారు. ఇదేమాట నేనంటే చాలామందికి కోపం వచ్చింది. జెపిగారు ఒక్కరూ 294 స్థానాల్లో నిలబడలేరు కదా. మా నియోజకవర్గంలో నిలబడిన వ్యక్తి గుణగణాలు నాకెలా తెలుస్తాయి? అతని సామర్థ్యం, నిజాయితీ నాకెలా తెలుస్తాయి? జెపిగారు చెప్పేశారు కాబట్టి ఓటేసేయాలా? స్థానిక అభ్యర్థి గుణగణాలు లెక్కలోకి రావా? ఆయనే చెప్తారు కదా – మీ అభ్యర్థి క్రిమినలో కాదో, అంకితభావం కలవాడో లేదో పరిశీలించండి అని. పరిశీలించడానికి యీయన అవకాశం యిస్తే కదా! ఇప్పుడు వచ్చి ఫలానా అతను నంది అందుకే అతను టిక్కెట్టు యిచ్చాను, మరోడు పంది అందుకే యివ్వలేదు అంటే మేం యస్సార్ అనాల్సిందేనా? మా కంటూ సొంత అభిప్రాయాలు, ఆలోచనలు వుండనవసరం లేదా? జనాలను జాగృతం చేయడం అంటే యిదేనా?

ఆయన అంచనా మాత్రం కరక్టని గ్యారంటీ ఏమిటి? తను కూచోమంటే కూచుంటారని, నిల్చోమంటే నించుంటారని అనుకుని ఎన్టీయార్ వెనకబడినవారిని, అణగారినవారిని, అనామకులను తీసుకొచ్చి నిలబెట్టారు. వాళ్లంతా బాబు పిలవగానే అటు పరిగెట్టారు. అంతేకాదు, తమ్ముళ్లూ రండి, నేను మిమ్మల్నేం చేయను అంటున్న ఎన్టీయార్‌పై చెప్పులు విసిరారు. జెపిగారి సర్టిఫికెట్టు చూసి మనం ఓట్లేసినదాకా వుండి ఆయనకే జెల్లకొట్టి గోడదూకే వారుండవచ్చని మీకూ, నాకూ అనుమానం తగిలితే అది మన తప్పు కాదు, నేటి రాజకీయాల తప్పు. ఇంకొకరైతే తన పార్టీలో లోపాలు చెప్పేవారు కారు. జెపి గారు కాబట్టి చెప్పారు అని మెచ్చుకునేవారున్నారు. నిజమే. అదే ఆయన విలక్షణత. కానీ యిది యిప్పుడు మాత్రమే ఆయన దృష్టికి వచ్చిందా? ఇన్నేళ్లగా ఏం చేశారట? నాయకుడు అన్నవాడు ఫస్ట్ ఎమాంగ్ యీక్వల్స్ – సమానుల్లో ప్రథముడు – గా వుండాలి. అలాటిది యీయనంత సత్తా వున్నవారు కాదు కదా, కనీసం ద్వితీయశ్రేణి నాయకత్వాన్ని కూడా తయారుచేయలేని బలహీనత ఎవరిది? దానికి దశాబ్దం కూడా చాలలేదంటే ఆయనలో నాయకత్వ లక్షణాలు లోపించినట్టు కాదా?

మంచివాళ్లలో, నిజాయితీపరుల్లో వున్న బలహీనత యిదే! పదిమందినీ చేర్చుకుంటే వాళ్లు తమంత నిజాయితీగా వుండరేమో, ఉద్యమాన్ని నీరుకారుస్తారేమోనని భయం వుంటుంది. ఏయే ప్రయోజనాలు ఆశించి వస్తారో ఉద్యమాన్ని అడ్డుపెట్టుకుని స్వప్రయోజనాలు సాధించుకుంటారేమోనని భయం. ఆరెస్సెస్‌లో కానీ, కమ్యూనిస్టుల్లో కానీ మొదటిదశలో చాలామంది నిజాయితీపరులను చూస్తాం. పార్టీకోసం సర్వం త్యాగం చేస్తారు వాళ్లు. అతి సింపుల్‌గా జీవిస్తూ బ్రహ్మచారులుగా మిగిలిపోయి పార్టీ ప్రచారం చేస్తూ వుంటారు. అంత కరడు గట్టిన భావాలు వుంటే పార్టీ విస్తరించటం లేదని అందువలన కాస్త కాంప్రమైజ్ అయ్యి అన్ని రకాల వారిని చేర్చుకోవాలని కొంతకాలం పోయాక ఒత్తిడి వస్తుంది. అందర్నీ కలుపుకుని పోవాలని వీళ్లు రాజీపడతారు. అంతే నానారకాల వారు చేరి వీళ్ల ఆశయాలను భ్రష్టు పట్టించేస్తారు. అది మళ్లీ యింకో కాంగ్రెస్ పార్టీలా తేలుతుంది. ఈ భయంతోనే కాబోలు జెపి ఎవర్నీ రానీయకుండా తన ఉద్యమాన్ని కంచుకోటలా కాపాడుకున్నారు, ఏ మచ్చా రాకుండా చూసుకున్నారు. కానీ యీ క్రమంలో విస్తరించలేకపోయారు. పార్టీ మొత్తం తన చుట్టూనే పరిభ్రమిస్తోందన్న విషయానికి విరుగుడు కనిపెట్టలేకపోయారు. ఉద్యమాన్ని పార్టీగా మార్చాలన్న నిర్ణయం సొంతంగా తీసుకున్నారు. ఎదిరించిన యూనిట్లను వదుల్చుకున్నారు. ఉద్యమంగా వున్నంతకాలం వున్న సానుభూతిపరులు పార్టీ అనేసరికి తగ్గారు. పెదవి విరిచారు. అయినా అంత త్వరగా యింత పెద్ద నిర్ణయం ఎందుకు తీసుకోవాలి?

రాజకీయాల్లో నెగ్గడం అంటే మాటలా? ఎంత హడావుడి చేయాలి? ఇతర పార్టీలు రోడ్‌షోలంటూ హంగామా చేస్తూ వుంటే దానికి ప్రతిగా చేస్తూన్నదేమిటి? రైలు ప్రచారం. ఇవాళ కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో ఓ బోగీ బుక్ చేసుకున్నారు. సికింద్రాబాద్‌నుండి నెల్లూరు వరకు రైలు ఆగినచోటల్లా మాట్లాడతారుట. ఈ విధంగా 25 నియోజకవర్గాలు కవర్ చేసినట్టు లెక్కట. ఈయన సందేశం వినాలనుకున్నవారు 3 రూ.ల ప్లాట్‌ఫాం టిక్కెట్టు కొనుక్కుని స్టేషన్‌కి రావాలన్నమాట. రైలు ఆగిన రెండు, మూడు నిమిషాలలో జైజై నాదాలూ అవీ అయ్యాక యీయన ఏం వివరిస్తారో, వాళ్లు ఏం అర్థం చేసుకుంటారో నాకు అర్థం కావటం లేదు. తక్కిన పార్టీలవాళ్లలా మా నాయకుడి ప్రసంగం విననిదే రైలుని పోనివ్వం అని ఆయన అనుచరులు రైలు ఆపేయరు. ఆపేస్తే యీయన వూరుకోరు. అందుకే సాయంత్రం 7 గంటలకు నెల్లూరులో సభ పెట్టుకున్నారు. నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు వచ్చి తర్వాతి స్టేషన్‌వరకు టిక్కెట్టు కొనుక్కుని యీయన బోగీలో కూచుని చర్చించేసి తర్వాతి స్టేషన్‌లో దిగిపోతారు కాబోలు.

''జెపి అభిమానుల కోపం...'' నుండి జెపిగారి అభిమానులు నాపై విమర్శలు గుప్పించారు – సభ్యమైన భాషలోనే. వీరిలో చాలామంది ఉన్నతవిద్యావంతులు, ఉన్నతోద్యోగులు, నా నుండి జెపిగారిపై విమర్శ ఎదురుచూడనివారు. లోక్‌సత్తాను సమర్థించడం విద్యావంతులందరి బాధ్యత అనీ, నేను సమర్థించకపోగా తప్పులెంచానని వీరి బాధ, ఏవో పొరబాట్లు కనబడినా యీ సమయంలో వాటి గురించి చర్చించాలా అన్న ఆగ్రహం. వీరిలో చాలామంది లోక్‌సత్తాకు నైతిక మద్దతే కాక, ఆర్థికంగా సహాయపడుతున్నవారు కూడా వున్నారు. వీరందిరినీ నేను కోరేది ఒకటే – ఎమోషన్ పక్కకు బెట్టి నేను చెప్పేదానిలో లాజిక్ వుందో లేదో చూడమని. నేను

లేవనెత్తే ప్రశ్నలేమిటి? లోక్‌సత్తా ఉద్యమం సమాజంలో మార్పు ఎంతవరకు కొని తెచ్చిందో సమీక్షించి చూస్తే కనబడేదేమిటి? 2004 ఎన్నికల వాతావరణం కంటె 2009 ఎన్నికల వాతావరణం మరింత అధ్వాన్నంగా వుంది. కులాలగోల ఎక్కువైంది. ప్రచారంలో హుందాతనం మ ృగ్యమైంది. ప్రజల్లో రాజకీయ అవగాహన పెంచుతామన్న లోక్‌సత్తా ఈ దిగజారుడుని ఆపలేకపోయిందా? ఎందువలన?

లోక్‌సత్తాలో జెపి తప్ప మరో లీడరు కనబడకపోవడానికి కారణం మీడియా కవరేజి యివ్వకపోవడం వలననే అని తీర్మానించారు చాలామంది లోక్‌సత్తా సానుభూతిపరులు. మీడియా నిలబెడితే నిలబడి, విస్మరిస్తే మూలబడేవారు నాయకులవుతారా? న్యూస్‌వర్దీ పని చేస్తే మీడియా మీ వెంటపడుతుంది. సినిమానటులను మీడియా ఫోకస్ చేస్తోందనేవారు ఓ విషయం గుర్తుంచుకోవాలి. ఈ నటీనటులందరూ కోన్‌కిస్కాలుగా వుండగా మీడియా పట్టించుకోలేదు. వాళ్లు కష్టపడి స్టూడియోల వెంబడి తిరిగి, వేషాలు సంపాదించి, ప్రజామోదం పొందాకనే మీడియా కెమెరాను అటు తిప్పింది. మా ఉద్దేశాలు మంచివి కాబట్టి మీడియా మేము చెప్పినవి కవర్ చేయాలంటే ఒప్పదు. జన్మభూమి లాటి కార్యక్రమం చేస్తే లోకల్ పేపర్లోనైనా పడుతుంది.

జెపి చిన్నస్థాయి విజయాలు పొందాక అసెంబ్లీని లక్ష్యం చేసుకుంటే బాగుండేది అన్నదానిలో తప్పుందా? జనసంఘ్ (బిజెపి పూర్వరూపం) చాలాకాలం ఆందోళనల పార్టీగానే వుండేది. అలాటిది ఢిల్లీ మునిసిపల్ కార్పోరేషన్ ఎన్నికల్లో నెగ్గి కార్పోరేషన్‌ను చక్కగా అవినీతి లేకుండా, సమర్థవంతంగా పాలించడంతో అందరి కళ్లల్లో పడింది. అప్పటినుండే అది పార్టీగా ఎదిగింది. అదేవిధంగా జెపి కొన్ని పంచాయితీల్లో పోటీ చేసి, గెలిచి ఆయన ఆదర్శాలు ఆచరణయోగ్యమేనని చూపిస్తే తప్పా? కమ్యూనిస్టులు, సోషలిస్టులు అందరూ అరచేతిలో స్వర్గాలు చూపించినవారే. జెపి చూపించే యుటోపియాకూడా యించుమించు అలాటిదే. కొందరు పూనుకుంటే యిది జరుగుతుంది అని నిరూపించవలసిన అవసరం ఆయనకుంది. ఆయన పార్టీ ఓ పంచాయితీలోనో, ఓ టౌనులోనో గెలిచి ఓ ఏడాదిలో 0% క్రైమ్‌రేట్ సాధిస్తే మీడియా కళ్లల్లో తప్పక పడుతుంది. ఆ కౌన్సిలర్ ఇంగ్లీషులో మాట్లాడలేకపోయినా తప్పక ప్రొజెక్షన్ వస్తుంది. తరువాతి ఎలక్షన్‌లో అతనే లోక్‌సత్తా తరఫున ఎంఎల్‌ఏ కాండిడేట్ కావచ్చు.

''జెపి అభిమానుల కోపం...'' లో నే రాసినది – జెపి మేధావి అనీ, పరిపాలనా సమర్థుడనీ, నిష్కళంకుడనీ అందరం నమ్ముతాం. అందులో తభావతు లేదు. అయితే నాబోటి వాళ్లం ఆయన మొహమాటాలకు లొంగుతారని మార్గదర్శి వ్యవహారంతో తెలిసి నిర్ఘాంతపోయాం. అవసరం లేకపోయినా మార్గదర్శి వ్యవహారంలో ఆయన వాళ్లని వెనకేసుకుని వచ్చి ఉండవల్లిని విమర్శించారు. ఇర్రెగ్యులారిటీస్ ఏవైనా జరిగితే చూడడానికి ఆర్‌బిఐ వుండగా ఉండవల్లి వేలెత్తి చూపవలసిన అవసరం ఏముంది? అన్నారు. వెంటనే శ్రీరమణ ఆంధ్రజ్యోతిలో తన కాలమ్‌లో జెపిని తూర్పారబట్టారు. 'కల్తీ నిరోధ విభాగం వారు, తూనికల వారు వుండగా మీరు పెట్రోలుబంక్‌లపై దాడి చేసి నిఘా ఎందుకు వేశారు స్వామీ?' అని. వెంటనే జెపి 'నాకు ఈ ఆర్థికవ్యవహారాలు నాకు పెద్దగా తెలియవు' అని తప్పుకున్నారు. ఆస్ట్రేలియాలో ప్రజాస్వామ్యం, ఆఫ్రికా ఆటవికస్వామ్యం గురించి తెలుసుకుని మనకు లెక్చర్లిచ్చే జెపిగారు తలచుకుంటే రెండు రోజులు అధ్యయనం చేస్తే మార్గదర్శి రూల్సు అతిక్రమించిందో లేదో తేల్చలేకపోయారా? మార్గదర్శి అంటే పూనకం వచ్చే ఉండవల్లి 'నాతో చర్చకు రండి. చెప్తా' అని ఛాలెంజ్ చేస్తే చర్చావేదికల ఛాంపియన్ జెపి వెనక్కి జంకారు. మళ్లీ ఆ జోలికి పోలేదు. మార్గదర్శిది తప్పో, ప్రభుత్వానిదో తప్పో తేల్చలేదు. ఎందుకిదంతా? ఈనాడు, ఈటీవీలతో మొహమాటాల వలనా? తన ఉద్యమానికి ఎంతో ప్రచారం కల్పించిన సంస్థలను ఆపదలో ఆదుకోవాలన్న క ృతజ్ఞతాభావంతోనా? మరి యిలాటి మొహమాటాలకు లొంగితే యితర రాజకీయ నాయకుల కంటె భిన్నమైన వాతావరణాన్ని జెపి ఎలా కల్పించగలరు?

ఇవీ నా మనసులో సందేహాలు. అబద్ధాలైతే ఖండించండి. అవగాహనలో పొరబాటుంటే సవరించండి. అంశాలవారీగా చర్చించండి కానీ నిందలు వేయకండి. మిగతా పార్టీలు గొప్పవా, నువ్వు జెపి అంతటివాడివా, ఆయన్ని విమర్శించేటంతటి వాడివా అని కుతర్కాలు చేయకండి. నేను ఆయనంతటివాణ్ని కాను. కానీ విమర్శలు చేయడానికేముంది? ఎవరైనా చేయవచ్చు! జెపి చేస్తున్నారు, నేనూ చేస్తున్నాను, నా పై మీరు చేయవచ్చు. ఎవరంతటివారు వాళ్లమే. అందుకని ఆ పాయింటు వదిలేసి వేరే ఏదైనా వుంటే చెప్పండి.

ఏప్రిల్ నెలలో ''గెలుపెవరిది?'' లో లోక్‌సత్తా విజయావకాశాల గురించి రాసినది యిది – జెపి గారి గురించి నా అభిప్రాయాలు యిదివరకే రాశా. విజ్ఞాన్ రత్తయ్యగారిని పార్టీలో చేర్చుకుంటూనే టిక్కెట్టు చేతిలో పెట్టడంతో జెపిగారిపై నా అభిప్రాయం మరింత తగ్గింది. రత్తయ్యగారు లోక్‌సత్తా గురించి వినని మనిషి కాదు, లోక్‌సత్తాకు ఆయన సహాయ సహకారాలు అందించినట్టుగా ఏమీ చెప్పుకోలేదు. ఎన్నికల సమయంలోనే పార్టీకి రావడమేమిటి? ఈయన ఒప్పుకోవడమేమిటి? ఆయనే కాదు, ఆఖరి నిమిషంలో ఎంతోమందికి పార్టీ టిక్కెట్టు యివ్వడం జరిగింది. ఇది సరైన పద్ధతి కాదని అని ఒప్పుకుంటూనే జెపిగారూ తక్కిన పార్టీల్లాగానే చేశారు. ఇక తేడా ఏముంది? ఆఖరి నిమిషంలో పార్టీలోకి వచ్చినవారి గుణగణాలేమిటో జెపిగారికే తెలియవు. మనని ఏం కన్విన్స్ చేస్తారు? జెపిగారికే తెలియవు. మనని ఏం కన్విన్స్ చేస్తారు? హంగ్ ఎసెంబ్లీ ఏర్పడిన పక్షంలో యీ మహానుభావులు అమ్ముడు పోయినా అమ్ముడు పోవచ్చేమో. ఉద్యమంలో కనీసం ఐదారేళ్లు చేసినవారికి తప్ప టిక్కెట్టు యివ్వకుండా వుంటే బాగుండేదని నా అభిప్రాయం. ఇలాటి సలహాలు ఎన్నయినా చెప్పవచ్చు. కానీ ప్రాక్టికల్‌గా రాజకీయాల్లోకి దిగిన తర్వాత యీ సిద్ధాంతాలేమీ నడవవు. జెపి గారు కానీయండి, మరొకరు కానీయండి, రాజకీయాల క్రీడాప్రాంగణంలోకి దిగాక అక్కడి ఆట పద్ధతులలోనే ఆడాలి. అందుకనే ఆయనా ఐదేళ్లలో ఐదులక్షల వుద్యోగాలన్నాడు. స్విస్ బ్యాంకుల నుండి డబ్బు తెప్పిస్తాననంటున్నాడు.

ఇక వాళ్ల గెలుపు అవకాశాలు ఎలా వుంటాయంటారు? జెపి యీసారి ముఖ్యమంత్రి అవరని అందరికీ తెలుసు. కానీ ప్రస్తుత విధానాలతో విసిగిపోయి, ఇప్పుడున్న వారికి బుద్ధి చెప్పాలన్న వుద్దేశంతో కొందరు లోక్‌సత్తాకు ఓటేయవచ్చు. కాండిడేట్ ఎవరో తెలియకపోయినా, జెపి గారి మొహం చూసి ఓట్లేయవచ్చు. ఈసారి మొదటి విడితలో ఓటింగ్ 70% దాకా జరిగింది. అంటే మధ్యతరగతివాళ్లు గడప దాటి వచ్చి ఓట్లేశారన్నమాట. ఇది లోక్‌సత్తాకు ఉపయోగపడుతుందని అనుకోవచ్చా? (వింతగా కూకట్‌పల్లిలో 52% ఓటింగే! ఓటుహక్కు వినియోగించుకోండొహో అని చాటి చెప్పిన జెపిగారి నియోజకవర్గ ప్రజలే యిలా తేలారు) ఇక్కడో విషయం చెప్తాను. లోకసత్తాకు మొత్తం మీద 2-3% ఓట్ల కంటె, 2,3 సీట్ల కంటె ఎక్కువ రాకపోవచ్చని నా అంచనా.

మే లో ''ఫలితాలు వచ్చాక..''లో రాసినది - రాష్ట్రం మొత్తం మీద లోక్‌సత్తా 1.6% ఓట్లు తెచ్చుకుంది. సిటీలో 8.6% ఓట్లు వచ్చాయి. సిటీలో మొత్తం 22 స్థానాలు వుంటే కూకట్‌పల్లిలో జెపి 71 వేలు తెచ్చుకుని గెలవగా, సిటీలో 3 చోట్ల 20 వేలు మించి వచ్చాయి. 5 చోట్ల 10-20 వేలు వచ్చాయి. 25 చోట్ల లోకసత్తాకు వచ్చిన ఓట్లు మహాకూటమికి వచ్చి వుంటే కూటమి గెలిచివుండేది. కానీ లోకసత్తాకు వేసినవాళ్లందరూ మహాకూటమి అభిమానులని ఎలా నిర్ధారించగలం?

ఇవన్నీ ఏడేళ్ల క్రితంనాటి కబుర్లు. పోనుపోను లోకసత్తా నీరసించింది కానీ ఎదగలేదు. దానికి కారణం - చంద్రబాబు లోకసత్తాపై పూర్తిగా కక్ష కట్టేయడమే! కృష్ణా, గుంటూరు జిల్లాలలో తమకు రావలసిన ఓట్లను లోకసత్తా చీల్చిందని, అదో నాన్-సీరియస్ పార్టీ అని ఆయన ఆగ్రహం వెళ్లగక్కారు. కాంగ్రెసు ఓట్లు చీలుస్తుందని ఆశించిన పీఆర్పీ తమ ఓట్లు దోచిందని చెప్పుకున్నారు. (నా అంచనాలో పీఆర్పీ రెండు పార్టీల ఓట్లూ చీల్చింది) బాబుకు మద్దతుగా నిలిచే మీడియా జెపిని నిర్లక్ష్యం చేయసాగింది. ప్రజాందోళనల కంటె మీడియా ద్వారానే ఎక్కువ ప్రాచుర్యంలోకి వచ్చిన జెపి అసంతృప్తి ఫీలయ్యారు. ప్రజాప్రతినిధిగా ఆయన కార్యశైలిపై కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలు అసంతృప్తి చెందారు. కౌన్సిలరు చేయవలసిన పనులేమిటో, ఎంపీ చేయవలసిన పనులేమిటో ఓటర్లకు అవగాహన వుండదు. కుళాయిలో నీళ్లు రాకపోయినా యీయన దగ్గరకు వచ్చి ఫిర్యాదు చేయబోవడం, యీయన 'మీ సమస్యలు మీకు మీరే ఎలా పరిష్కరించాలో చెప్తాను పట్టండి' అంటూ పాఠాలు చెప్పబోవడం, వాళ్లు విసుక్కోవడం జరిగాయి. గతంలో మాలతీ చందూర్ ''జవాబులు'' శీర్షిక వుండేది - 'మా ఆయన నన్ను పట్టించుకోవటం లేదు, అత్తమావలు పొమ్మంటున్నారు, ఏం చేయమంటారు?' అని ఓ గృహిణి రాస్తే యీవిడ '1932లో అల్బేనియాపై యుగోస్లావియా దండెత్తినపుడు అనేకమంది మహిళలు అత్యాచారాలకు గురయ్యారు. అయినా ఆత్మస్థయిర్యంతో ముందుకు వెళ్లారు.' వంటి జవాబిచ్చేవారు. జెపిదీ అదే ధోరణి. స్థానిక సమస్యలకు అంతర్జాతీయ పరిష్కారాలు చెప్తారు. ఇప్పటి సంఘటనలను గత విషయాలతో పోలుస్తూ నేను '1978లో యిలాగే..' అని రాస్తేనే కొందరు పాఠకులు విసుక్కుంటారు. సమస్యలతో వచ్చినవాళ్లకు ఆస్ట్రేలియాలో, ఆమ్‌స్టర్‌డామ్‌లో విషయాల గురించి చెప్తే ఎవరు సహిస్తారు?

2009 ఎసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన హైదరాబాదు మునిసిపల్ ఎన్నికలలో కూకట్‌పల్లిలో కూడా లోకసత్తా అభ్యర్థి గెలవలేదు. అక్కడ వున్న టిడిపి సమర్థకులు 2009 ఎన్నికలలో టిడిపి తెరాసతో పొత్తు పెట్టుకోవడం సహించలేక లోకసత్తాకు వేశారు తప్ప జెపిపై అభిమానంతో కాదని వ్యాఖ్యలు వచ్చాయి. 2014 ఎన్నికలు వచ్చేసరికి జెపి మల్కాజ్‌గిరి పార్లమెంటు ఎన్నికలలో నిలబడి తను గెలిస్తే మోదీని సమర్థిస్తానని ప్రకటించుకున్నారు. ప్రజాస్వామ్యం, మానవహక్కులు, వగైరా విలువల కోసం తపించే జెపి మోదీలో అలాటివి ఏం చూశారో ఎవరికీ అర్థం కాలేదు. పైగా బిజెపితో పొత్తు పెట్టుకున్న టిడిపి తరఫున అభ్యర్థి కూడా మోదీనే సమర్థిస్తున్నానని ఓ పక్క చెపుతూంటే మధ్యలో యీయన కూడా ఎందుకు? అనుకున్నారు ఓటర్లు. 9.77% ఓట్లు వేసి నాలుగోస్థానంలో నిలబెట్టారు.

లోకసత్తాకు జాతీయ స్థాయి కల్పించాలనుకున్నారో ఏమో జెపి తెలుగువారికి తెలియని వ్యక్తిని తీసుకుని వచ్చి వీరీవీరీ గుమ్మడిపండు వీరే మీ అధ్యక్షుడు అన్నారు. దాంతో పార్టీ చీలింది. మొన్న హైదరాబాదు కార్పోరేషన్ ఎన్నికలలో ఏ ప్రభావమూ చూపించలేకపోయింది. విదేశాల్లో దాన్ని అభిమానులు కూడా బాగా దూరమై పోయి వుంటారనుకుంటా. 2009 సమయంలో నన్ను తిట్టిన లోకసత్తా అభిమానులు కొందరు తర్వాతి రోజుల్లో దాని పోకడ చూసి 'మిమ్మల్ని అనవసరంగా తిట్టాం, యిప్పుడు మేం డబ్బు పంపడం మానేశాం' అని నాకు మెయిల్స్ రాశారు. డబ్బు లేకుండా యీ రోజుల్లో పార్టీ నడపడం మాటలా? చిరంజీవి అంతటి వాడే పార్టీ అటకెక్కించారు. అందుకే పార్టీ మూతపడింది. తెలుగువారికి సంబంధించి యిది ఒక విషాదం. ఈ విఫలప్రయోగం వలన మంచి ఉద్దేశాలతో పార్టీ పెడితే నడవదు అనే సందేశం ప్రజల్లోకి బలంగా వెళుతుంది. జెపి వైఫల్యాలను ఆ ఆదర్శానికి ఆపాదించి, యిలాటి ప్రయోగం మరెవరూ చేయరు.

నిజానికి ఎంతో నిజాయితీపరుడు, సమర్థుడు, మేధావి అయిన జెపి ఎందుకు ఫెయిలయ్యారు అంటే నాకు తోచిన పదం - 'మిస్‌కాస్టింగ్'. కొందరు మంత్రులుగా రాణిస్తారు, కొందరు రాజులుగా రాణిస్తారు, మరి కొందరు సేనానులుగా రాణిస్తారు. దాన్నే స్వధర్మం అన్నారు పెద్దలు. స్వధర్మాన్ని వదలి పరధర్మంలోకి వెళ్లడం ఆత్మహత్యాసదృశం. నిజానికి ఎన్టీయార్ పాలిటిక్స్‌లోకి వచ్చినపుడు ఆయన వెనకాల థింక్ ట్యాంక్ వుంది. దానికి ఆయన గ్లామర్ తోడైంది. మీడియా సపోర్టు చేసింది, ఆయన చెప్పినది అత్యంత ప్రభావవంతంగా జనాల మెదళ్లలోకి చొచ్చుకుపోయింది. వాళ్లు కాంగ్రెసును ఓడించారు. జెపి మేధస్సుకు, చిరంజీవి వంటి స్టార్ గ్లామర్ తోడై వుంటే, వారికి మీడియా మద్దతు యిచ్చి వుంటే లోకసత్తా ఒక బలమైన శక్తిగా వుండి పాలకులకు దడ పుట్టించేది.

కనీసం పార్టీ పెట్టి మూసేయకుండా వుంటే ఉద్యమకర్తగానైనా జెపి అంటే బెదురు వుండేది. చిరంజీవి రాజకీయాల్లోకి వెళ్లి భంగపడినట్లే జెపి కూడా భంగపడ్డారు. అది దురదృష్టం. **– (సమాప్తం) ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2016)**

**మార్చి 37** **ఎమ్బీయస్ : అమెరికాతో కబుర్లు**

"అమెరికాలో కబుర్లు చెప్తారా?" అనే శీర్షికన సినీరంగానికి సంబంధించని కథా, వ్యాస రచయితలు అమెరికాలో అభిమానులను కలుసుకోవడంలో వున్న కష్టనష్టాలను చర్చించాను. చాలామంది వ్యక్తిగతంగా మెయిల్స్ రాశారు – మీరు రాసినది అక్షరాలా నిజమే, కానీ ఏం చేయగలం? పరిస్థితులు అలా వున్నాయి. మా బోటి వాళ్లకు సాహిత్యంపై అభిలాష వుంది, వ్యక్తిగత స్థాయిలో మీకు ఆతిథ్యం యివ్వగలం, కానీ టిక్కెట్టు పెట్టి సాహితీసభలు పెట్టమని ఆర్గనైజర్స్‌ని ఒప్పించలేము అంటూ. పెద్ద సంస్థల ఆఫీసు బేరర్స్ ఎవరూ నాకు ఏమీ రాయలేదు, చదివారో, యిది వారి దృష్టికి వచ్చిందో లేదో కూడా తెలియదు. వచ్చినా నా సలహా నడిచే వ్యవహారం కాదని వారికీ తెలుసు. ఎందుకంటే ఒక పాఠకుడు కామెంట్ రాసినట్లు, యిక్కడే సాహితీసభలకు జనం రారు, అక్కడేం వస్తారు? ఎమ్‌సెట్‌లు, క్యాట్‌లు చదివే హడావుడిలో కథల పుస్తకాలు చదవని అమెరికా యువతకు అక్కడకు వెళ్లాక హఠాత్తుగా సాహిత్యాభిలాష పుట్టుకుని రమ్మనమంటే ఎక్కణ్నుంచి వస్తుంది? రచయితలపై గౌరవం కలగాలంటే ఎలా కలుగుతుంది? సమావేశాలకు వచ్చిన రచయితలను రిసీవ్ చేసుకోవడానికి ఎయిర్‌పోర్టుకి వెళ్లడానికి కూడా ఎవరూ ముందుకు రారని, అదే సినిమా తారలను రిసీవ్ చేసుకోమంటే క్యూలు కడతారనీ కూడా చెప్పారు. మరీ అంత అన్యాయం కాదని, కొందరు అవధానులు చెప్పే పురాణప్రసంగాలకు వెళతారని కొందరు విభేదించారు. పురాణాలను అచ్చగా సాహిత్యం కేటగిరీలో వేయలేం. వాటికి మతపరమైన ఆకర్షణ వుంది కాబట్టి వారిని మామూలు రచయితలుగా లెక్కించలేం. సమావేశాలు సరదాగా గడపడం కోసం వచ్చినవని, భార్యాబిడ్డలు ఎటు తీసుకెళితే అటు వెళ్లాలని, మధ్యలో సాహిత్యం అని కూడా పెడితే ఎలా ఛస్తామని కొందరు వాపోయారు. "గిరీశం లెక్చర్లు"లో ముళ్లపూడి రాస్తారు – 'సినిమా అంటే డాన్సులు, ఫైట్లు, పాటలూ, రంగులూ, పొంగులూ.. అన్నీ పెడతామా, యివన్నీ చాలనట్లు కథ కూడా పెడితే మొహం మొత్తిపోతుంది...' అని. వాస్తవపరిస్థితిని గమనించి, సమావేశాలకు ఓ మూలగానైనా సాహిత్యం రంగు అద్దే ప్రయత్నాలు మానేస్తే నిర్వాహకులకు డబ్బు మిగులుతుంది. వెళ్లే రచయితలకు నిరాశానిస్పృహలు తప్పుతాయి.

మరి అమెరికాలో వున్న వందలాది మంది సాహితీ అభిమానులు ఏం చేయాలి? వారు తమ అభిమాన రచయితను కలుసుకోవాలని, మాట్లాడాలని అనుకున్నా సాగదా? తమ అభిరుచి చంపుకోవలసినదేనా? రచయితలపై అభిమానంతో తమ యింట్లో ఆతిథ్యం యిచ్చి వారి ప్రవర్తన వలన యిబ్బంది పడిన ఘట్టాలు చెప్పారు కొందరు. తమ పుస్తకాలు, సిడిలు అమ్మే ఉత్సాహం తప్ప అమెరికా చూసే ఆసక్తి, అక్కడ తమ జీవితాల గురించి తెలుసుకునే ఆసక్తి ఏమాత్రం కనబరచరని కూడా ఫిర్యాదు చేశారు. జిజ్ఞాస వున్న రచయిత తన పాఠకుల నుండి ఎంతో నేర్చుకుంటాడు. విదేశాలలో వున్న వారి జీవితాల నుంచి నేర్చుకునేందుకు మరింత అవకాశం వుంది. పరాయిగడ్డకు వెళ్లడానికి జంకడం వలన అతనా అవకాశాన్ని కోల్పోతున్నాడు కదా! మరెలా? పాఠకుల్లో ఒకరు స్కైప్ ద్వారా మాట్లాడుకోవచ్చు కదా అని సూచించారు. మరో పాఠకుడు 20-25 మంది కంటె స్కైప్‌లో పట్టరు కదా అని వ్యాఖ్యానించారు. దాన్నుంచే నాకొక ఆలోచన వచ్చింది. 'బాలకృష్ణతో 'గౌతమీపుత్ర శాతకర్ణి' సినిమా వస్తోంది అనే వార్త వచ్చింది. అతనెవడు? అతని గురించి చరిత్రలో ఏముంది? ఆ చరిత్రలో వున్న వైరుధ్యాలేమిటి?' అని తెలుసుకోవాలనే ఉత్సుకత అమెరికా వాసులైన 20 మంది తెలుగువారికి వుందనుకోండి. నాబోటి వాడు ఆ పేరుతో సీరీస్ మొదలుపెట్టి, సగంలో బాకీ పెట్టే హింస భరించడం కంటె ఎవరైనా హిస్టరీ ప్రొఫెసరు గారితో స్కైప్ కాన్ఫరెన్సు పెట్టేసుకుంటే గంటలో విషయం తెలిసిపోతుంది. ఏ శనివారం మధ్యాహ్నమో అమెరికాలో కానీయండి, మరే దేశంలోనైనా కానీయండి, 15, 20 తెలుగు కుటుంబాలు ఒకరి యింట్లో పాట్‌లక్ పార్టీ చేసుకోవడానికి చేరినప్పుడు వారిలో ఒక 20 మందికి తమకు నచ్చిన రచయితతో మాట్లాడదామని అనుకుంటే అక్కణ్నుంచి రచయితతో స్కైప్ సమావేశం పెట్టుకోవచ్చు. 20 మందికి తక్కువగా వుంటే సభలా వుండదు, అంతకంటె ఎక్కువ వుంటే యింటరాక్షన్ కష్టం. ఎవరింట్లో కాన్ఫరెన్సు పెడుతున్నారో ఆయనే ప్రొఫెసరుగారితో ముందుగా మాట్లాడుకుని సాంకేతిక విషయాలు చూసుకుంటే అందరూ వచ్చినపుడు హాయిగా వినేయవచ్చు. అది రచయితకు యిబ్బందికరమైన వేళ కాబట్టి, ఆయన శ్రమకు పారితోషికం అన్నట్టుగా – మాట వరసకు ఓ 50 డాలర్లు యిస్తామని ముందే చెప్పి ఆయన ఖాతాలో ఆన్‌లైన్ వేసేయవచ్చు. వక్తకు ముందుగా సబ్జక్ట్ తెలిపి ఒక గంటసేపు ఆయనను ఉపన్యాసం యిమ్మనమని చెప్పి, మరో గంట ముఖాముఖీ ప్రశ్నోత్తరాలతో గడపవచ్చు. దీనిలో ఎడ్వాంటేజి ఏమిటంటే – తెలుగు చదవడం రాని తెలుగువాళ్లు కూడా పాలు పంచుకోవచ్చు. అప్పటిదాకా వక్త రచనలు చదవనివాళ్లు ఉపన్యాసంతో యింప్రెస్ అయితే చదవనారంభించవచ్చు. నా లండన్ సమావేశంలో కొందరు నా వద్దకు వచ్చి 'మేం యిప్పటిదాకా మీ కాలమ్ చదవలేదు, సంస్థలో చురుకైన కార్యకర్తలం కాబట్టి సమావేశానికి వచ్చాం, మీ ప్రసంగం విన్నాక యికపై చదువుదామనుకుంటున్నాం' అన్నారు. వారిలో కొందరు చదివినా పాఠకుల సంఖ్య పెరిగినట్లే. నాది చదివినపుడు, పక్కవాళ్లదీ చదువుతారు. ఏదో ఒక విధంగా పాఠకులు పెరగడమే కావలసినది.

డాలస్ నివాసి తోటకూర ప్రసాద్‌గారు తానాకు ప్రెసిడెంటు-ఎలక్ట్‌గా వుండగా నాతో ఒక ప్రయోగం చేశారు. నెలనెలా వెన్నెల

పేరుపై వాళ్ల యింట్లో అందరూ సమావేశమవుతూండేవారు. ప్రసాద్‌గారు ముందుగానే నాకు సౌకర్యమైన వేళలో ఫోన్ చేసి ఓ గంట సేపు మాట్లాడించి రికార్డు చేసి, దాన్ని వాళ్లు వచ్చిన తర్వాత వినిపించేవారు. గుమ్మడిగారి గురించి, పద్మనాభం గారి గురించి నేను మాట్లాడాను. అది వట్టి ఆడియోనే. వీడియో అయితే యింకా లైవ్లీగా వుంటుంది. స్కైప్‌లో పెళ్లిచూపులే జరుగుతున్న యీ కాలంలో ఉపన్యాసం వినడం కష్టమేమీ కాదు. ఒకే అభిరుచి వున్నవాళ్లు 20 మంది చేరడమూ అబ్బురం కాదు. వక్త బోరు కొడితే యింకోసారి మరొకరితో ఏర్పాటు చేసుకోవచ్చు. దీనివలన వక్తకు కూడా శ్రోతలను మెప్పించడంలో తర్ఫీదు అవుతుంది. శ్రోతలకు అతి స్వల్పమైన ఖర్చుతో – 20 మంది కలిపి 50 డాలర్లు సేకరించడం అతి సులభం – అభిమాన రచయితతో మాట్లాడామన్న తృప్తి వుంటుంది. వక్త మరీ మెప్పించేస్తే, యిలాటి కాన్ఫరెన్సుల్లో మరీ పాప్యులర్ అయిపోతే అప్పుడు ఆయనను సమావేశాలకు ప్రత్యక్షంగా రప్పించే విషయం ఆలోచించవచ్చు – కనీసడిమాండు వుంటుందన్న ధీమా ఆర్గనైజర్స్‌కు ఏర్పడుతుంది కాబట్టి!

రచయిత, అతని అభిమానులు కలుసుకోవడానికి యీ వేదిక అతి సులభమైనది, చవకైనది. ఎవరింట్లో వాళ్లు కూర్చుని ముచ్చటించుకుంటారు. అయితే యిలాటి వాటి వలన రచయితకు అమెరికా గురించి ఎక్స్‌పోజరు రాదు కదా అని వాదించవచ్చు కొందరు. వివిధ ప్రాంతాల ఎక్స్‌పోజరు వుంటే రచయిత రచనలో క్వాలిటీ తప్పకుండా పెరుగుతుంది. కానీ అమెరికాకు వచ్చినవారందరికీ విస్తారంగా ఎక్స్‌పోజరు కలుగుతుందన్న నమ్మకం లేదు. ఎందుకంటే వచ్చినవాళ్లు ఎవరింట్లోనో నాలుగ్గోడల మధ్య వుంటారు. 'మా జీవితాలు యిలా వుంటాయండి' అని తన దగ్గరకు వచ్చిన వాళ్లు చెప్పినది వింటారు. 'నా అంతట నేను నల్లవాళ్ల కాలనీకి వెళ్లి వాళ్ల స్థితిగతులు స్టడీ చేస్తానండీ' అంటే ఆతిథ్యం యిచ్చినవాళ్లు ఉలిక్కిపడతారు. 'మీరలాటివి ఏమీ చేయండోయ్, తప్పిపోతే మళ్లీ నాకు చచ్చేచావు. నేను కారులో ఎక్కడ తిప్పితే అక్కడ తిరగండి, కిటికీ అద్దం కిందకి దింపకుండా చెట్లూ, పుట్టలూ చూడండి. వాళ్ల గురించి నేను ఏం చెపితే అదే విని వూరుకోండి.' అంటారు. వాళ్లు తమ తలిదండ్రులతోనే రిస్కు తీసుకోరు. వాళ్లంతట వాళ్లు ఎవరింటికైనా వెళ్లి వస్తానంటే దారి తప్పిపోతారేమోనని భయపడతారు. ఈ రచయితగారు హిచ్‌హైక్ చేస్తానంటే ఒప్పుకుంటారా? అందువలన అమెరికా వెళ్లి అక్కడ తెలుగువాళ్ల యిళ్లల్లో వున్నంత మాత్రాన అమెరికాను కాచివడపోసేశామని అనుకుంటే పొరబాటు. అయితే వేరే దేశం వెళితే ఎంతో కొంత జ్ఞానం పెరుగుతుందన్నమాట మాత్రం వాస్తవం. దాని గురించి మరీ వర్రీ అవకుండా వుంటే మాత్రం యీ స్కైప్ ప్రయోగం ఆచరణయోగ్యం. ఎక్కడో అక్కడ ప్రారంభిస్తే మెరుగులు దిద్దుతూ పోవచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2016)**

**మార్చి 38** **ఎమ్బీయస్ : కన్నయ్యను హీరో చేసేస్తున్నారు**

'కన్నయ్య' అంటే ఎవరు అని అడిగే పరిస్థితి ప్రస్తుతం లేదు. ఏదో ఒక రకంగా అతని పేరును బిజెపివారు, లెఫ్టిస్టులు, కాంగ్రెసువాళ్లు అందరూ జపిస్తున్నారు. హైదరాబాదు వస్తే కమ్యూనిస్టు నాయకులు ఎయిర్‌పోర్టుకెళ్లి రిసీవ్ చేసుకున్నారు. అతని కుటుంబం, విద్యార్థి యూనియన్ అన్నీ సిపిఐకు చెందినవి. అందుకనే నారాయణగారు వాటేసుకుని వూరంతా తిప్పారు. ఒకప్పటి తమ కంచుకోట విజయవాడకు తీసుకెళ్లారు. ఇంకా విద్యార్థిగానే వున్న అతను సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రసంగం యిస్తే చుక్కా రామయ్యగారి వంటి విద్యావేత్తలు హాజరయ్యారు. అతని ప్రతి కదలికను వార్తాపత్రికలు ఫ్రంట్ పేజీల్లో వేశాయి. అతన్ని భగత్ సింగ్‌తో కాంగ్రెసు నాయకుడు పోలిస్తే, అతను రోహిత్‌ను భగత్ సింగ్‌తో పోల్చాడు. చూడబోతే ఇంటికో అఫ్జల్ నినాదంతో పాటు, ఇంటికో భగత్ సింగ్ నినాదం కూడా వూపందుకుంటుందేమో! ఇలా ప్రతీవాణ్నీ భగత్ సింగ్ చేస్తూ పోయి, అసలు భగత్ సింగ్ విలువేమైనా మిగులుస్తారా?

మోదీని, బిజెపికి వ్యతిరేకంగా మాట్లాడే ఏ గడ్డిపోచ దొరికినా దాన్ని బ్రహ్మాస్త్రంగా మార్చేద్దామని ప్రతిపక్షాలు ఊహూ కుతూహలపడుతున్నాయి. దేశరాజకీయాలకు కాంగ్రెసు నేర్పిన టక్కుటమార విద్యలన్నీ బిజెపి వంటబట్టించుకుని అమలు చేస్తోంది. అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వాన్ని చీల్చి కూల్చివేసే కార్యక్రమం అయిపోయాక, ఉత్తరాఖండ్ పని పడుతోంది. ప్రతి ప్రభుత్వవ్యవస్థను, రాజ్యాంగవ్యవస్థను తన ప్రయోజనాలకు వాడుకుంటూ రాజకీయంగా కాంగ్రెసుకు ఏమీ తీసిపోనని నిరూపించుకుంటోంది. దాన్ని ఎదుర్కోలేక ప్రతిపక్షాలు తత్తరపడుతున్నాయి. బిజెపి అండదండలతో ఎబివిపి చెలరేగిపోతోంది. విద్యాసంస్థలన్నిటిలో తన పతాకాన్ని ఎగరవేస్తోంది. ఈ ఉధృతిని ఉద్యమాల ద్వారా ఎదుర్కోలేని ప్రతిపక్షాలు ఏ వామనుడు దొరికినా అతన్ని త్రివిక్రమావతారంలో చూపిస్తూ మోదీ అనే గోలియత్‌పై పోరాడగలిగే డేవిడ్ యితనే అతని మనల్ని నమ్మిద్దామని చూస్తున్నారు. కన్నయ్యకు కూడా ఆ నమ్మకం కలిగేసినట్లుంది, హైదరాబాదు సమావేశంలోనే ఆవేశం రగిలి అక్కడికక్కడ మోదీపై కవిత రాసిపారేశాడు. ఇక్కడకు వచ్చే ముందు రాహుల్ గాంధీని కలిసి వచ్చాడు. అంటే రాజకీయాల్లోకి అడుగుపెట్టేశాడనే అనుకోవాలి. అందుకే కాబోలు అతన్ని బెంగాల్ ఎన్నికలలో తిప్పుతామని సిపిఎం అంటోంది. బుద్ధిగా చదువుకునే రోహిత్ యిలాగే రాజకీయాల్లో పడి చదువు అటకెక్కించాడు. ఇప్పుడు కన్నయ్య కూడా అదే బాటలో వెళుతున్నట్లు కనబడుతోంది.

ప్రస్తుతానికి కన్నయ్య విప్లవకారుడేమీ కాదు, సిద్ధాంతకర్త కాదు, కేవలం జెఎన్‌యు విద్యార్థి సంఘ నాయకుడు. 7300 మంది విద్యార్థులుంటే వెయ్యి మంది యితనికి ఓట్లేశారు. అతను గొప్ప ఆలోచనాపరుడు, వక్త వగైరా కాబట్టే యింత గుర్తింపని

సమర్థించనక్కరలేదు. జెఎన్‌యు వంటి యూనివర్శిటీలో విద్యార్థి సంఘానికి నాయకుడనగానే యివన్నీ వుంటాయని ఎవరూ విడిగా చెప్పనక్కరలేదు. ఆ యూనివర్శిటీ యిలాటి నాయకులను ఎంతోమందిని చూసి వుంటుంది. మరి వారెవరికీ దొరకని గుర్తింపు యితనికి ఎందుకు దక్కింది అంటే దానికి కారణం ఎబివిపి అతనిపై పగ బట్టింది కాబట్టి అనే చెప్పాలి. ఎబివిపి అతన్ని మాటే(ర్) (సిద్ధాంతానికి కట్టుబడడం చేత హింసకు గురైనవాడు) చేసిపడేసింది. దాంతో లెఫ్ట్ అతన్ని వాటేసుకుంది. రోహిత్ విషయంలోనూ అదే జరిగింది. ఎబివిపి అతనిపై ఫిర్యాదు చేసింది కాబట్టి, యిద్దరు కేంద్రమంత్రులు లేఖలు రాశారు కాబట్టి ఆత్మహత్య చేసుకున్న భీరుడు లెఫ్ట్ దృష్టిలో వీరుడై పోయాడు. అతని పేర ఎవార్డులు యిచ్చేసే, చట్టం చేయాలని డిమాండ్ చేసే స్థితికి చేరింది సమాజం. తనకూ భావప్రకటన చేసే హక్కు వుందని చూపుకున్న ఎబివిపి నాయకుడిపై రోహిత్ దాడికి వెళ్లాడు. అది వారికి తప్పుగా తోచలేదు. ఈ రోజు కన్నయ్య మీటింగులో అతని ప్రసంగాన్ని వినకుండా బూట్లు విసిరిన వాణ్ని చావగొట్టారు మరి. తమకు భావప్రకటనా స్వేచ్ఛ లేదా అని ఆనాడు అడిగిన ఎబివిపి యీ రోజు కన్నయ్యపై దాడిని ఖండించలేదు.

కన్నయ్య లోపలకి వస్తే ఏదో ఉత్పాతం సంభవిస్తుందన్న బిల్డప్ యిచ్చి హైదరాబాదు యూనివర్శిటీ అతన్ని లోపలకి రానీయలేదు. గేటు దగ్గరే ఆపేశారు. ఇదే పద్ధతిని జెఎన్‌యు పాటించింది. కన్నయ్య బెయిల్ మీద బయటకు వచ్చాక అతనిపై చర్య తీసుకోబోయింది. సస్పెండ్ చేసింది, దాన్ని వెనక్కి తీసుకుంది, కానీ ఫైన్ వేస్తానంది. కానీ ఆ కమిటీలో వున్న కొందరు డీన్‌లు యీ నివేదిక మాకు చూపించలేదన్నారు. అంటే యూనివర్శిటీ కన్నయ్యపై పగ బట్టింది అని అందరికీ విదితమైంది. బిజెపి ఎంపీ చందన్ మిత్రా అయితే ఏకంగా యూనివర్శిటీమీదే పగబట్టేసి, దాన్ని మూసి పారేయాలన్నాడు. ఈ చర్యలన్నిటివలన కేంద్రంలో అధికారంలో వున్న బిజెపియే కన్నయ్యపై కక్ష కట్టిందని తేటతెల్లమౌతోంది. అతను కోర్టుకి హాజరయితే కొందరు లాయర్లు వచ్చి కొట్టారు. బిజెపి ఎమ్మెల్యే ఓపి శర్మ కన్నయ్య అనుచరులపై దాడి చేస్తున్న ఫోటో పేపర్లలో వచ్చేసింది. వారిపై యింకా శిక్ష పడలేదు. అతను బెయిల్ నుంచి తిరిగి రాగానే బయటివాడెవడో వచ్చి లెంపకాయ కొట్టిపోయాడు. కేసు పెట్టిన పోలీసులు కోర్టువాళ్లు సాక్ష్యాలడిగినపుడు తెల్లమొహం వేశారు. కన్నయ్యకు వ్యతిరేకంగా ప్రచారంలోకి వచ్చిన వీడియోలను ఎవరో మార్చేశారని తేలినపుడు యిదంతా అతనిపై కావాలని జరుగుతున్న కుట్ర అనిపించి అయ్యోపాపం అనిపిస్తుంది.

పెట్టిన కేసు చిన్నాచితకా కాదు, దేశద్రోహం! దాన్ని గతంలో కూడా చిత్తం వచ్చినట్లు వాడారు. 2003లో విఎచ్‌పి లీడరు ప్రవీణ్ తొగాడియా త్రిశూలాల నిషేధంపై నిరసన తెలపడానికి రాజస్థాన్ వెళ్లినపుడు అక్కడి కాంగ్రెసు ప్రభుత్వం అతనిపై దేశద్రోహం కేసు పెట్టింది. ఆపరేషన్ బ్లూస్టార్ వార్షికోత్సవ సందర్భంగా 2005లో శిరోమణి అకాలీదళ్ అధ్యక్షుడైన సిమ్రాన్‌జిత్ మాన్ స్వర్ణదేవాలయంలో ఖలిస్తాన్ అనుకూల నినాదాలు యిచ్చినందుకు పంజాబ్‌లో వున్న కాంగ్రెసు ప్రభుత్వం దేశద్రోహం కేసు పెట్టింది. "సూరత్ సామ్నా" అనే పత్రిక సంపాదకీయంలో ముఖ్యమంత్రి నరేంద్ర మోదీపై 'అసభ్యకరమైన' భాష వుపయోగించినందుకు దాని సంపాదకుడు మనోజ్ షిండేపై 2006లో గుజరాత్ ప్రభుత్వం పెట్టిన కేసు – దేశద్రోహం! తెలుగు రచయితలు దేశవిచ్ఛిత్తికై కుట్ర పన్నారంటూ కేసులు పెట్టిన సందర్భాలు గతంలో మన రాష్ట్రంలో చూశాం. దేశద్రోహం చేశాడనగానే సరిపోదు, గతంలో ఎటువంటి నేరాలు చేశాడు, ఎవరితో చేతులు కలిపాడు, ఏం చేద్దామని ప్లాను చేశాడు అని అనేకరకాలుగా నిరూపించాలి. పోలీసులు అవేమీ లేకుండా కేసు పెట్టేసి, అతన్ని హీరో చేసేశారు. ఇంతకీ అతనేమిటి? అతను చేసినదేమిటి? చేయనిదేమిటి? అతనితో బాటు కేసులు ఎదుర్కుంటున్నవారెవరు అనే విషయాలను సేకరించి రాస్తున్నాను. తప్పులుంటే ఎత్తి చూపండి.

అతని గురించి రాయడం మొదలుపెట్టగానే నన్నూ దేశద్రోహి అనేసేవాళ్ల కోసం ముందుగానే రాస్తున్నాను – నా దృష్టిలో కోర్టు తీర్పును కాని, ఉరిశిక్షను కాని వ్యతిరేకించినవారు దేశద్రోహులు కారు. సమాజమంతా తప్పుపట్టి, శిక్ష వేసిన సందర్భాల్లో కూడా వ్యక్తిగతంగా భిన్నమైన అభిప్రాయం కలిగి వుండవచ్చు. మహాత్మా గాంధీ హత్యను భారతసమాజం నిరసించి గోడ్సేని ఉరి తీసింది. అయినా 'గోడ్సే చేసినది తప్పు కాదు, అతన్ని ఉరితీయడం తప్పు, అతను దేశభక్తుడు' అని వాదించేవారికి దేశభక్తి లేదని అనలేం. అలాగే రాజీవ్ గాంధీ హంతకులను వదిలేయమని అడిగేవారినీ, ఇందిరా గాంధీ హంతకులను సన్మానించాలనేవారినీ దేశద్రోహులనలేం. 'చైనా చైర్మనే మా చైర్మన్' అని నినాదాలిచ్చిన నక్సలైట్లను దేశభక్తులుగా వర్ణించినవారినీ దేశద్రోహులనలేం. ఒక్కొక్కరిది ఒక్కో భావజాలం. అయితే 'దేశాన్ని విచ్ఛిన్నం చేస్తాం, దీన్ని నాశనం చేసేదాకా నిద్రపోము' అనే నినాదం మాత్రం నిశ్చయంగా దేశద్రోహమే. అయితే అలా నినాదం యిచ్చినంత మాత్రాన దేశద్రోహం కేసు పెట్టాలా అంటే ఆలోచించాలి. కోపంలో 'నిన్ను చంపేదాకా నిద్రపోను' అన్నంత మాత్రాన హత్యానేరంపై జైల్లో పెట్టరు. హత్య జరగాలి. అప్పుడు యీ మాటలకు విలువ వస్తుంది. లేకపోతే బెదిరించిన దానికే కేసు పెట్టాలి.

ఇంతకీ ఆ రోజు కన్నయ్య చేసినదేమిటి? మీటింగు ఆర్గనైజ్ చేశాడా? నినాదాలిచ్చాడా? విదేశీ శక్తులతో చేతులు కలిపి కుట్ర చేశాడా? అసలలాటి మీటింగు అక్కడ ఎందుకు జరిగింది? దీనిలో ఎబివిపి చేసినదేమిటి? వీటన్నిటికి కార్యక్షేత్రం అయిన జెఎన్‌యు నిజంగా దేశద్రోహుల, అసాంఘిక శక్తుల అడ్డానా? దాన్ని మూసేస్తే తప్ప దేశంలో దేశభక్తి పెరగదా? ఇవన్నీ తెలియాలంటే ముందుగా ప్రతిష్ఠాత్మకమైన జెఎన్‌యు గురించి, అక్కడి వాతావరణం గురించి తెలియాలి. పేరున్న విద్యాసంస్థ అనగానే ధనికుల పిల్లలు చేరేది అయి వుంటుందనే ఊహ పోతుంది. కానీ జెఎన్‌యు దానికి పూర్తిగా విరుద్ధమైన ఆదర్శాలతో స్థాపించబడింది. దేశంలోని వివిధ వర్గాల, ప్రాంతాల నుండి విద్యార్థులను ఆకర్షించాలని, వారిని సమానస్థాయిలో, ఒత్తిడిలేని చదువు చదువుకోనివ్వాలని,

చదువుతో బాటు రాజకీయ, సాంఘిక దృక్పథాలను అలవర్చుకుని తమ ఆలోచనలను యితరులతో స్వేచ్ఛగా చర్చించే వాతావరణం అక్కడ కల్పించాలని, యూనివర్శిటీ బయటకు అడుగుపెట్టేసరికి దేశ పునర్నిర్మాణంలో పాలు పంచుకునే స్థాయిలో వారు ఎదిగేట్లా చూడాలనే లక్ష్యంతో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ చట్టం 1966లో రూపొందించబడింది. దానికి అనుగుణంగా 1019 ఎకరాలకు విస్తరించిన పెద్ద క్యాంపస్‌లో 1969లో యూనివర్శిటీ ప్రారంభించబడింది. ఈ 47 ఏళ్లల్లో అది దేశానికి ఎందరో మేధావులను అందించింది. వారు దేశవిదేశాల్లో ఎకడమిక్ సర్కిల్స్‌లో రాణిస్తున్నారు. రాజకీయ నాయకులైతే అందరికీ పరిచితులు కాబట్టి వారి పేర్లు చూసినా – సిపిఎంకు చెందిన సీతారాం యేచూరి, ప్రకాశ్ కారట్, బిజెపికి చెందిన నిర్మలా సీతారామన్, ఆప్‌కు చెందిన అశుతోష్ రాణా, ఎన్‌సిపికి చెందిన డిపి త్రిపాఠి, కాంగ్రెసుకు చెందిన..., యిలా ఎందరో వున్నారు. ఈ పేర్లు చెప్పగానే అది రాజకీయనాయకులను తయారుచేసే ఫ్యాక్టరీ అని తీర్మానించకూడదు. చదువులో దాని క్వాలిటీ గురించి చెప్పాలంటే నేషనల్ ఎక్రెడిషన్ అండ్ ఎసెస్‌మెంట్ కౌన్సిల్ (నాక్) 4 పాయింట్ల స్కేలుపై దానికి 3.91 పాయింట్లు యిచ్చింది. దేశం యీ విద్యాసంస్థను గర్వకారణంగా భావిస్తుంది కాబట్టి 7300 మంది విద్యార్థులను యీ సంస్థపై ఏటా రూ.163 కోట్లు ఖర్చు పెడుతోంది. అంటే ఒక్కో విద్యార్థిపై రూ.2.33 లక్షలన్నమాట!

నూటికి 95% మార్కులు పైబడి వచ్చినవారిని మాత్రమే తీసుకుని వారిని సానబెట్టి యీ గ్రేడ్ తెచ్చుకుందని అనుకోకూడదు. ఎడ్మిషన్‌కు వారు అవలంబించే విధానం విలక్షణమైనది. ఉదాహరణకి ఆర్థికంగా వెనకబడిన ప్రాంతాల నుంచి, గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తే 'రీజనల్ డిప్రైవేషన్ ఇండెక్స్' కింద నాలుగు మార్కులు కలుపుతారు. కశ్మీరీ శరణార్థులైనా, తక్కువ ఆర్థికస్థాయి కుటుంబాల నుంచి వచ్చినా, యుద్ధంలో మరణించిన సైనికుల పిల్లలైనా, మహిళలైనా, వెనకబడిన కులమైనా, తలిదండ్రులు హైస్కూలు చదువు దాటకపోయినా మార్కులు కలుస్తాయి. కన్నయ్య సంగతే తీసుకుంటే అతను బిహార్‌లోని బెగుసరాయి జిల్లాలోని బిహాత్ గ్రామానికి చెందినవాడు. తండ్రి టెన్త్ క్లాసు దాటలేదు, తల్లి ఆంగన్‌వాడీ కార్యకర్త. కేసులో యిరుక్కున్న యితర విద్యార్థుల గురించి చెప్పినపుడు మీరు గమనించవచ్చు – ఏయే వర్గాల నుంచి, ఏయే ప్రాంతాల నుంచి, ఏయే స్థాయి కుటుంబాల నుంచి వారు వచ్చారో! "క్రీమీ లేయర్" గురించి నేను రాసిన వ్యాసంలో యిటువంటి రిజర్వేషన్ సిస్టమ్ వుండాలని వాదిస్తూ యోగేంద్ర యాదవ్ ఫార్ములా గురించి ప్రస్తావించాను. ఆయనా యిటువంటి సెలక్షన్ ద్వారానే యీ యూనివర్శిటీలో చదివి మేధావిగా వినుతికెక్కాడు.

ఏ రకమైన రిజర్వేషన్ వల్లనైనా సరే ప్రతిభకు చేటు వాటిల్లుతుందని వాదించేవారు జెఎన్‌యు ప్రయోగాన్ని గమనించాలి. దాన్ని ఒక "రిపబ్లిక్ ఆఫ్ ఐడియాస్"గా రూపొందించిన ఘనత తొలి గురువులదే. జర్నలిస్టుగా కెరియర్ ప్రారంభించి యునైటెడ్ నేషన్స్‌లో 1965 నుంచి 69 వరకు భారత ప్రతినిధిగా పనిచేసిన జి.పార్థసారథి దాని తొలి వైస్‌ఛాన్సెలర్. అంతర్జాతీయ స్థాయిలో స్కాలర్‌గా పేరు తెచ్చుకున్న మూనిస్ రజా జెఎన్‌యుకు మొదట్లో ఆఫీసరు ఆన్ స్పెషల్ డ్యూటీగా, తర్వాత రెక్టర్‌గా పనిచేశారు. అక్కడ చదువును ఒక చట్రంలో బిగించకుండా విదేశీ యూనివర్శిటీల తరహాలో ప్రొఫెసర్ల ఆలోచనల మేరకు విద్యార్థుల భాగస్వామ్యంతో సిలబస్ రూపొందిస్తారు. విద్యార్థిని బట్టి కోర్సు కొత్తగా తయారుచేసే విధానం కూడా వుంది. పరీక్షా విధానంలో కూడా విద్యార్థులను సంప్రదిస్తారు. యూనివర్శిటీ కట్టినపుడే టీచర్ల క్వార్టర్లు, విద్యార్థుల హాస్టళ్లు పక్కపక్కన వుండేట్లు కట్టారు. ఒకరితో మరొకరికి సంపర్కం ఎక్కువగా వుండేట్లు చూశారు. యూనివర్శిటీలో శాఖలుండవు. వేర్వేరు స్కూళ్లు వుంటాయి. వాటన్నిటికి యూనివర్శిటీ ఎకడమిక్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో చోటిచ్చి వివిధ విభాగాల మధ్య సమన్వయం సాధించారు. చాలా మంది విద్యార్థులు ప్రొఫెసర్లగా మళ్లీ జెఎన్‌యుకు వచ్చి అదే పంథా కొనసాగిస్తున్నారు.

అక్కడ విద్యార్థి యూనియన్ ఎన్నికలు కూడా అమెరికా అధ్యక్ష ఎన్నిక తరహాలో వాదోపవాదాల తరహాలో జరుగుతాయి. విద్యార్థి సమూహాలను ఉద్దేశించి ప్రసంగించి, అందర్నీ ఒప్పించగలిగినవాడే నాయకుడిగా ఎన్నికవుతాడు. రకరకాల భావజాలాలకు చెందిన విద్యార్థి సంఘాలు అక్కడ వర్ధిల్లాయి. వాటిలో వామపక్ష సంస్థలు ఎక్కువన్నది వాస్తవం. కాలేజీల్లో, యూనివర్శిటీల్లో వామపక్షాలు తిష్ట వేసుకుని కూర్చున్నాయని చాలామంది వాపోతూ వ్యాఖ్యలు రాస్తూ వుంటారు. మధ్యవయసుకి ముందు కమ్యూనిస్టుగా వుండనివాడు, ఆ వయసు దాటాక కూడా కమ్యూనిస్టుగా మిగిలినవాడు యిద్దరూ కాస్త తేడా మనుషులే అని సామెత. విద్యార్థిదశలో వుండగా ఆదర్శాలలో మునిగి తేలడం వుంటుంది. డాక్టరై పేదలకు వుచితంగా వైద్యం చేయాలని, నిరాడంబరంగా పెళ్లి చేసుకోవాలని, గొప్పాబీదా భేదం లేకుండా అందర్నీ సమానంగా చూడాలని, సమసమాజం ఏర్పడాలని కలలు కంటారు. ఇప్పుడున్న సమాజంపై, టీచర్లపై, తలిదండ్రులపై, సాంఘిక మర్యాదలపై తిరుగుబాటు చేయాలని ఉబలాటపడతారు. మధ్యవయసు వచ్చేసరికి దగ్గర డబ్బు చేరుతుంది, దాన్ని యితరులతో పంచుకోవడానికి మనసు రాదు, మడి గట్టుకుని కూర్చుంటే పనులు జరగవనే లోకంతీరు బోధపడుతుంది, సమసమాజమా తొక్కా, నేను కష్టపడలేదా, వాణ్నీ కష్టపడమను, నా వాటా వాడికెందుకు యివ్వాలి? అనే వాదన మొదలెడతాడు.

విద్యార్థి దశలో వ్యవస్థకు వ్యతిరేకంగా తిరగబడేవాళ్లకు వామపక్ష భావజాలమే నచ్చుతుంది. వ్యవస్థను, పాతకాలపు విలువలను, రక్షిద్దామనే ఎబివిపి భావజాలం కిక్కు నివ్వదు. అందుకని విద్యార్థి సంఘాల్లో లెఫ్ట్ సంఘాలే ఎప్పుడూ ముందంజలో వుండేవి. ఇటీవలి కాలంలో సోషలిజానికి మోజు తగ్గింది. కార్మిక హక్కులకై పోరాడడంలో మజా కనబడటం లేదు. పెట్టుబడిదారుడు కార్మికచట్టాలు వర్తించని స్పెషల్ జోన్స్ చూపిస్తేనే పెట్టుబడి పెడతానంటూ కేంద్రాన్ని, రాష్ట్రాలను బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. యువత కూడా ఉద్యోగం వచ్చినపుడు 'యూనియన్లు లేకపోతే నష్టమేమిటి, అవి వుండడం వలన ప్రగతికి అడ్డు కూడా' అనే ఆలోచనలో వుంటూ,

యజమాని హఠాత్తుగా ఉద్యోగంలోంచి తీసేసినపుడు మాత్రమే యూనియన్ అవసరాన్ని, యాజమాన్యం, యూనియన్ అనే రెండు శక్తులూ సమతూకంగా వుంటేనే మంచిదనే వాస్తవాన్ని గుర్తిస్తున్నారు. కానీ విద్యార్థిదశలో, నిరుద్యోగ దశలో కాపిటలిజంవైపే వుంటున్నారు. మీడియా కూడా అదే భావజాలాన్ని ప్రచారం చేయడం వలన దేశంలో ప్రస్తుతం కాపిటలిస్టు, రైటిస్టు శక్తుల విజ ృంభణ కారణంగా చాలా యూనివర్శిటీల్లో లెఫ్ట్ యూనియన్లు నీరసించాయి. ఆరెస్సెస్ విద్యార్థి విభాగమైన ఎబివిపి ఆ స్థానాన్ని భర్తీ చేస్తూ ముందుకు దూసుకుపోతోంది.

1948లో స్థాపింపబడిన ఎబివిపికి ప్రస్తుతం 33 లక్షల మంది సభ్యులున్నారు. దేశంలోని 18 పెద్ద యూనివర్శిటీలలో యూనియన్లు వారి చేతిలోనే వున్నాయి. వాటిలో ఢిల్లీ యూనివర్శిటీ ఒకటి. అక్కడ నాలుగు కీలకమైన పోస్టులు గెలిచారు. ప్రతి యూనివర్శిటీలో తన ఆధిపత్యాన్ని నిరూపించుకునే ప్రయత్నం జరుగుతోంది. 2013లో ముజఫర్‌నగర్ జిల్లాలో 60 మంది చనిపోయిన ఘర్షణలకు సమాజ్‌వాదీ, బిజెపి పార్టీలే బాధ్యులంటూ తీసిన "ముజఫర్‌నగర్ బాకీ హై" అనే సినిమాను ఢిల్లీలోని కిరోరీమల్ కాలేజీలో గత ఆగస్టులో ప్రదర్శించబోతే ఎబివిపి అడ్డుకుంది. అలహాబాద్ యూనివర్శిటీ నిర్వహిస్తున్న సెమినార్‌కు సిద్ధార్థ వరదరాజన్ అనే జర్నలిస్టును ఆహ్వానించబోతే 'అతను నక్సల్ సానుభూతిపరుడు, దేశద్రోహి, పిలవడానికి వీల్లేదు' అంటూ వైస్ ఛాన్సలర్ యింటి వద్ద ఆమరణ నిరాహారదీక్ష చేపట్టారు. చివరకు సెమినార్ జరిగే స్థలాన్ని మార్చవలసి వచ్చింది. ఎబివిపికి కొరుకుడు పడని యూనివర్శిటీల్లో జెఎన్‌యు ఒకటి – అది మితవాదం నుంచి అతివాదం దాకా అన్ని రకాల యూనియన్లు అక్కడున్నాయి. మార్క్సిస్టులు, లెనినిస్టులు, మార్క్సిస్ట్–లెనినిస్టులు, గాంధేయవాదులు, అంబేడ్కర్‌వాదులు, లోహియావాదులు యిలా రకరకాల జనాలున్నారు. రైటిస్టులకు కాలూనడానికి జాగా దొరకలేదు. మండల్ – మందిర్ వివాదసమయంలో మాత్రం కొందరు ఆ తరహాలో మాట్లాడారు. మళ్లీ 2001లో కేంద్రంలో వాజపేయి ప్రభుత్వం వున్నపుడు కొన్ని సీట్లు గెలిచి అధ్యక్షపదవిని కైవసం చేసుకుంది. మళ్లీ గత ఏడాది రెండు సీట్లు గెలిచి జాయింటు సెక్రటరీ పదవి దక్కించుకుంది. ఎంతైనా తక్కిన చోట వున్న ఎబివిపి యూనిట్లకు, యిక్కడ వున్న యూనిట్లకు తేడా వుంది. చర్చ, వాదన అనే జెఎన్‌యు సంస్కృతికి లోబడే యీ యూనిట్ పనిచేసింది. ఇటీవలి కాలంలో మోదీ ప్రధాని అయ్యాక ఎబివిపి మళ్లీ పుంజుకోసాగింది.

జెఎన్‌యుకు వస్తే – లెఫ్ట్ యూనియన్లలో అన్నిటికంటె పాతదైన ఏఐఎస్ఎఫ్, సిపిఐకు అనుబంధంగా పనిచేస్తుంది. దానికి బలం తగ్గుతూ వచ్చింది. దానికి సంబంధించిన కన్నయ్య గత ఏడాది సెప్టెంబరులో అనుకోకుండా గెలిచాడు. ఏఐఎస్ఎఫ్‌లాగే సిపిఎంకు సంబంధించిన ఎస్ఎఫ్ఐ యిటీవలి కాలంలో క్షీణించి, సిపిఐ(ఎమ్ఎల్)కు అనుబంధంగా వుండే ఏఐఎస్ఏ బలపడింది. అందరికంటె తీవ్రవాద సంస్థ అయిన డిఎస్‌యు అన్నిటికంటె చిన్నది. ఎన్నికల ప్రక్రియలో నమ్మకం లేదంటూ అది ఎన్నికలలో పాల్గొనదు కాబట్టి దాని బలం యింత అని యితమిత్థంగా చెప్పలేం. దేశద్రోహం ఆరోపణలు ఎదుర్కుంటున్న ఉమర్ ఖాలిద్ వగైరాలు యీ యూనియన్‌కు చెందినవారే. యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నికైన కన్నయ్య మొదటినుంచి ఆరెస్సెస్ భావజాలానికి, ఎన్‌డిఏ ప్రభుత్వవిధానాలకు వ్యతిరేకి. వామపక్షాల ఐక్యత లేకపోవడం చేతనే రైటిస్టు శక్తులు దేశంలో చొచ్చుకుపోతున్నాయని తన ఎన్నికల ప్రచారంలో పదేపదే చెప్పాడు. ఇవన్నీ ఎబివిపికి రుచించే వ్యవహారం కాదు. జెఎన్‌యును తన అదుపులోకి తెచ్చుకుందామని బిజెపి ప్రయత్నిస్తోంది. జెఎన్‌యు రాజకీయంగా ఎప్పుడూ చురుగ్గానే వుంది. దాని విద్యార్థులు ఎమర్జన్సీకి వ్యతిరేకంగా జైళ్లకు వెళ్లారు, 1984 శిఖ్కులపై దాడుల్లో శిఖ్కులను దాచారు, యివన్నీ బాగానే వున్నాయి కానీ గోధ్రా అల్లర్ల తర్వాత ప్రదర్శనలు జరపడంతో మోదీకి ఒళ్లుమంట వుంది. నాలుగు నెలల క్రితం ఆరెస్సెస్ వారి "పాంచజన్య" పత్రిక జెఎన్‌యును తన కవరుపేజీపై వేసి కథనం వేయడంతో సుబ్రహ్మణ్యం స్వామిని వైస్ ఛాన్సెలర్‌గా వేస్తున్నారని పుకార్లు వచ్చాయి. స్వామి యిప్పుడు యీ గొడవల తర్వాత 'ఆపరేషన్ సానిటైజ్ జెఎన్‌యు' యిప్పుడే ప్రారంభమైంది అంటూ ట్వీట్ చేశాడు. చివరకు స్వామికి బదులు జనవరి ఆఖరి వారంలో మామిడాల జగదీశ్ కుమార్ అనే తెలుగాయన్ని, ఐఐటి ప్రొఫెసర్ని విసిగా వేశారు. ఆయనను వేసినప్పుడే గతంలో ఆరెస్సెస్ నిర్వహించిన సైన్సు సదస్సుకి హాజరయ్యాడని విమర్శలు వినబడ్డాయి. నిర్వాహకులు ఎవరైనా, సైన్సుకి సంబంధించినది కాబట్టి హాజరయ్యానని ఆయన చెప్పుకున్నాడు. పాత కథ ఎలా వున్నా పదవి చేపట్టిన కొన్ని రోజులకే ఆయన చర్యలు వివాదాస్పదమయ్యాయి.

వివాదానికి దారి తీసిన ఫిబ్రవరి 9 నాటి సంఘటనల పూర్వాపరాలు చూడబోతే – మార్క్సిస్ట్–లెనినిస్ట్–మావోయిస్ట్ భావజాలానికి చెందిన డిఎస్‌యు (డెమోక్రాటిక్ స్టూడెంట్స్ యూనియన్) గతంలో జెఎన్‌యులో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించింది. కశ్మీర్ దుస్థితిని చూపించే 'ద కంట్రీ విదవుట్ ఎ పోస్టాఫీస్', ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను విమర్శించే కార్యక్రమం, సైన్యానికి విశేషాధికారాలు యివ్వడాన్ని నిరసించే కార్యక్రమం యిలాటివి ప్రదర్శించింది. కశ్మీర్ ప్రజలకు, ఈశాన్యప్రాంతాల ప్రజలకు యీ దేశంలో భాగంగా వుండాలో లేదో తేల్చుకునే హక్కు యివ్వాలని వాదించే యీ సంస్థకు సిపిఐ (ఎమ్ఎల్)తో కాని, కశ్మీర్, ఈశాన్యప్రాంతాల్లో పనిచేసే మిలిటెంట్ గ్రూపులతో కానీ ప్రత్యక్ష సంబంధాలు ఉన్నట్టు యిప్పటిదాకా ఎవరూ నిరూపించలేదు. అయితే డిఎస్‌యులో విప్లవాత్మకత, లింగవివక్షతపై స్ప ృహ తగినంతగా లేదని వాదిస్తూ 10 మంది విద్యార్థుల బ ృందం బయటకు వచ్చేసింది. వీళ్లు కొత్త సంస్థ పెడదామనుకుని దానికి భూమిక ఏర్పరచడానికి కర్టెన్‌రైజర్‌గా ఒక సాంస్కృతిక కార్యక్రమం ఏర్పాటు చేద్దామని తలపెట్టారు. అఫ్జల్ గురు ఉరికి నిరసన, కశ్మీరులో వున్న సైన్యం చేస్తున్న అత్యాచారాలు, కశ్మీర్ పౌరులకు స్వయం నిర్ణయాధికారం యిత్యాది విషయాలపై అవగాహన కల్గించేందుకు బాడ్మింటన్ కోర్టులో సాయంత్రం నిర్వహించే యీ కార్యక్రమానికి కవులను, గాయకులను, రచయితలను,

విద్యార్థులను, మేధావులను ఆహ్వానించాలని నిశ్చయించారు. గతంలో డిఎస్‌యు విధానాలతో ఏకీభవించనివారు కూడా వారి కార్యక్రమాలకు హాజరవుతూండేవారు.

జెఎన్‌యు ఆనవాయితీ ప్రకారం ఎక్కడ పడితే అక్కడ పోస్టర్లు అతికించారు. కరపత్రాలు పంచారు. అఫ్జల్ గురు ఉరితీతకు వ్యతిరేకంగా 2014లో, 2015లో కూడా యిలాటి ప్రదర్శనలు జరిగాయి. అయితే యీ సారి మాత్రం ఎబివిపి యీ కార్యక్రమానికి అభ్యంతరం తెలిపింది. కార్యక్రమం ప్రారంభం కావడానికి అరగంట ముందు వారు జెఎన్‌యు అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగు ముందు గుంపుగా చేరి అనుమతిని వెనక్కి తీసుకోమని డిమాండ్ చేయసాగారు. వారి అభ్యంతరాన్ని పరిగణించి, కార్యక్రమం కొద్ది సేపట్లో ప్రారంభం కాబోతోందనగా విసి అనుమతి నిరాకరించారు. విద్యార్థులు అనుమతి కోరినప్పుడు అఫ్జల్ గురు విషయం ప్రస్తావించలేదంటారు హోం శాఖ సహాయ మంత్రి. అలాటప్పుడు అఫ్జల్ మాట ఎత్తకూడదనే షరతులతో కూడిన అనుమతి యివ్వవచ్చు. విసి అది చేయలేదు. పైగా నిరాకరిస్తున్న విషయాన్ని నిర్వాహకులకు చెప్పలేదు. వారి సెల్ ఫోన్లు అప్లికేషన్‌లో వున్నా మెసేజ్ పంపలేదు. సెక్యూరిటీ వాళ్లకు మాత్రం ఎస్సెమ్మెస్ పంపి బాడ్మింటన్ కోర్టు దగ్గరకు ఎవర్నీ రానివ్వద్దన్నారు. ఇదో తమాషా! అప్పటికే కొందరు అక్కడ గుమిగూడారు. వారిలో బయటవాళ్లు కూడా వున్నారు. దాంతో ఆ విద్యార్థులు స్థలం మార్చి, క్యాంపస్‌లోనే ఒక ధాబా దగ్గర చేరి తమకు అనుమతి నిరాకరించిన యూనివర్శిటీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నిరసన తెలపసాగారు. అఫ్జల్ గురు ఉరికి వ్యతిరేకంగా నినాదాలిచ్చారు.

ఇంతలో కొందరు ఎబివిపి విద్యార్థులు జీ న్యూస్ జర్నలిస్టులు, కెమెరాలతో సహా అక్కడకు చేరుకున్నారు. టీవీ వాళ్లను వెంటేసుకుని రావడం వల్లన ముందే పథకం వేసుకున్నారన్న అనుమానం కలుగుతోంది. వచ్చి 'జాతివిద్రోహుల'కు వ్యతిరేకంగా నినాదాలివ్వసాగారు. దానికి ప్రతిగా కార్యక్రమ నిర్వాహకులు 'మతతత్వవాదుల'కు వ్యతిరేకంగా నినాదాలిచ్చారు. వామపక్షవాదులందరూ జాతివ్యతిరేకులే అంటూ ఎబివిపి స్లోగన్స్ యివ్వసాగింది. దీనితో తక్కిన వామపక్ష విద్యార్థి నాయకులు కూడా అక్కడకు వచ్చి చేరారు. వాళ్లల్లో కన్నయ్య కుమార్ ఒకడు. అతను సర్దిచెప్పడానికి, గొడవలు లేకుండా ఎవరిదారిన వాళ్లు వెళ్లిపోతే మంచిదని చెప్పడానికీ ప్రయత్నించాడు. కానీ అటుయిటు నినాదాలు హోరెత్తాయి. లెఫ్టిస్టులు సంఘ పరివార్ ఫ్యూడలిస్టులని, మతవాదులని, కులతత్వవాదులని కేకలు వేయగా ఎబివిపి "వందేమాతరం", "భారత్‌మాతా కీ జై" "భారత్ కే గద్దారోంకో ఏక్ ధక్కా ఔర్ దో" వంటి నినాదాలు చేస్తూ అక్కడున్న కశ్మీరీ విద్యార్థులను 'మీరు దేశద్రోహులు, పాకిస్తాన్ ఏజంట్లు' అని కూడా నిందించారు. దీనికి ప్రతిగా కశ్మీరు లోయలో వేర్పాటువాదులు యిచ్చే "భారత్ తేరే టుక్‌డే హోంగే", "ఇన్షా అల్లా, ఇన్షా అల్లా జంగ్ చలేగీ, భారత్‌కీ బర్‌బాదీ హోగీ" నినాదాలు చెలరేగాయి.

ఈ అంశాన్నే జెఎన్‌యుకు వ్యతిరేకంగా అందరూ వుపయోగిస్తున్నారు. మొదటగా గుర్తించుకోదగినది జెఎన్‌యు 47 ఏళ్ల చరిత్రలో దేశద్రోహులకు, టెర్రరిస్టులకు ఆశ్రయం యిచ్చిన రికార్డు లేదు. రెండోది అక్కడ 7300 మంది విద్యార్థులుంటే యీ నినాదాలు చేసినది ఏ పదిమందో అయితే వారి కారణంగా మొత్తం యూనివర్శిటీని మూసేయాలనడం దుర్మార్గం, ఒక విస్తృత పథకంలో భాగం. నినాదాలిచ్చినది ఎవరు? "ఫ్రంట్‌లైన్" రాసిన ప్రకారం – 'విద్యార్థుల మధ్య నినాదప్రతినినాదాలు జరుగుతూండగా కొందరు బయటి వ్యక్తులు వామపక్షవాదులతో కలిసిపోయి భారత వ్యతిరేక నినాదాలిచ్చారు. వాళ్లు ముఖాలు కప్పుకుని వున్నారు. 'వాళ్లలా అంటూ వుంటే మీరు అలాటి నినాదాలు ఆపేయండి అని అడిగాం. వాళ్లు వెంటనే ఆపేశారు' అని కార్యక్రమనిర్వాహకులు చెప్పేరు. ఆర్గనైజర్లు ముఖాలు కప్పుకున్నవారిని ఆపుతూండడం జీ న్యూస్ వీడియోలో కూడా వచ్చింది.' వీడియోలో లైటింగ్ చాలినంతగా లేకపోవడం వలన ఎవరెవరో సరిగ్గా తెలియటం లేదుట. కాస్సేపు ఫ్రంట్‌లైన్ కథనాన్ని పక్కన పెట్టి కార్యక్రమ నిర్వాహకులే ఆ నినాదాలిచ్చారని అనుకుందాం. ఎటువంటి మూడ్‌లో అలాటివి వస్తాయో కాస్త ఆలోచించి చూడండి.

బిహార్‌లోనో, యుపిలోనో గుర్తు లేదు – ఓ సారి ఒక ప్రతిపక్ష సభ్యుడు అసెంబ్లీలో ప్రభుత్వాన్ని యిరుకున పెడుతూ గంభీరమైన విషయంపై ప్రసంగిస్తున్నాడు. అతని తర్కాన్ని ఎదుర్కోలేని కాంగ్రెసు ఎమ్మెల్యేలు "మహాత్మా గాంధీకీ జై" అంటూ నినాదాలు అందుకున్నారు. ఆ హోరులో ఆ సభ్యుడి మాటలేవీ వినబడడం మానేసింది. అతనికి విసుగు వచ్చేసింది. వాళ్ల నినాదానికి ప్రతిగా "గోడ్సే జిందాబాద్" అని అరిచాడు. అది అతను ఫ్రస్ట్రేషన్‌తో అరిచిన అరుపే కానీ అతనేమీ గోడ్సే భక్తుడు కాదు. కానీ కాంగ్రెసువాళ్లు 'ఒక ప్రజాప్రతినిధి గోడ్సే జిందాబాద్ అని అరుస్తాడా' అంటూ పెద్ద యాగీ చేశారు. ఎంజె అక్బర్ అతని గురించి ఎప్పుడు రాయాల్సి వచ్చినా 'ద వన్ హూ షౌటెడ్ గోడ్సే జిందాబాద్' అంటూ వెక్కిరిస్తూ వుండేవాడు. ఇప్పుడు అక్బర్ బిజెపిలో చేరాడు కాబట్టి అలా రాయడనుకోండి. ఆడ్వానీ రథయాత్ర వచ్చిన వెల్లువలో బిజెపి నుంచి చాలామంది సాధువులు ఎంపీలుగా ఎన్నికయ్యారు. పార్లమెంటు చర్చల్లో ఏం మాట్లాడాలో వారికి తెలిసేది కాదు. అవతలిపక్షం వాళ్లు ఏదైనా గంభీరమైన పాయింట్లతో ప్రసంగిస్తూ వుంటే వీళ్లు 'జై శ్రీరామ్, జై శ్రీరామ్' అంటూ అరుస్తూ వుండేవారు. ఈ డిస్టర్బెన్స్‌తో ప్రాణం విసిగి 'రాముడూ లేడూ, గాడిదగుడ్డూ లేదు, చెప్పినది వినండెహె' అని ఎవరైనా అని వుంటే 'అదిగో రాముడి గురించి నీచంగా మాట్లాడాడు' అని యాగీ చేసి వుండేవారు.

జెఎన్‌యులో కశ్మీరు సమస్య గురించి ఆ విద్యార్థులు వాదిస్తూ వుంటే వాళ్లతో వాదనకు దిగాలి తప్ప భారతమాతాకీ జై వంటి నినాదాలేమిటి, అసందర్భంగా! పైన చెప్పిన ఉదాహరణలలో లాగ రెచ్చగొట్టడానికి తప్ప, వేరే ప్రయోజనం కనబడదు. దాంతో అవతలివాళ్లు రెచ్చిపోయారు, జాతి వ్యతిరేక నినాదాలు చేశారు. అది తప్పే. దానికి జెఎన్‌యు యాజమాన్యం క్రమశిక్షణ చర్య

తీసుకోవచ్చు, సంబంధిత సెక్షన్ల ప్రకారం కేసులు పెట్టి దండిస్తే సరిపోయేది. పోలీసులను రప్పించి అరెస్టు చేయించడం దేనికి? పైగా రాజద్రోహం కేసెందుకు? దానికి విస్తృతప్రచారం కల్పించడం దేనికి? తప్పుని సవరించడం పోయి, దాన్ని తమ ప్రయోజనాలకు అనుగుణంగా మలచుకునే పథకమే కనబడుతోంది యిక్కడ. ఈ నినాదకాండ తర్వాత ఎబివిపి మీటింగును అడ్డుకోవడాన్ని నిరసిస్తూ అన్ని లెఫ్ట్ గ్రూపుల వాళ్లూ కలిసి మార్చ్ చేయసాగారు. ఆ సమయంలోనే ఎబివిపి వాళ్లు జెఎన్‌యు స్టూడెంట్స్ యూనియన్ లీడర్లతో వాదనకు దిగారు. ఈ ఘర్షణ నిమిషాల్లో రాత్రి 8.30కు ముగిసిపోయింది. ఈ మార్చ్ నార్త్ గేట్ వైపు సాగిపోయింది.

'జెఎన్‌యు జాతివ్యతిరేకులకు నిలయమై పోయింది' అనే శీర్షికతో జీ న్యూస్ వారు దీన్ని సంచలనాత్మక కథనంగా ప్రదర్శించింది. వెంటనే మహేశ్ గిరి అనే బిజెపి ఎంపి ఎబివిపి కార్యకర్తల సహకారంతో వసంత్ కుంజ్ పోలీసు స్టేషన్లో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో యీ గొలుసుకట్టు సంఘటనల వెనుక ఒక పథకం వుందని అందరికీ అర్థమైంది. లేకపోతే న్యూస్ ఛానెల్ వాళ్లు క్యాంపస్‌లోకి వచ్చేటంత అవసరం ఎందుకు పడుతుంది? పోలీసులు చెప్పేదేమిటంటే – 'జెఎన్‌యులో జాతివ్యతిరేక కార్యక్రమం సాగబోతోంది, గమనించండి అని హెూం శాఖ మమ్మల్ని హెచ్చరించింది. స్పెషల్ బ్రాంచ్‌కు సంబంధించిన ఏరియా ఆఫీసరు ఆ కార్యక్రమం తాలూకు పోస్టరును ఫిబ్రవరి 9 ఉదయం గమనించాడు. వెంటనే అప్రమత్తుడై స్థానిక పోలీసుకు, స్పెషల్ బ్రాంచ్ కంట్రోలు రూముకు ఫోన్ చేశాడు. ఆ కార్యక్రమం వలన క్యాంపస్‌లో శాంతిభద్రతల సమస్య వస్తుందని, డిఎస్‌యు, యితర వామపక్షవిద్యార్థియూనియన్లు సాంస్కృతిక కార్యక్రమం ముసుగులో దేశానికి వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నాయని భయపడడం జరిగింది.' అని. జెఎన్‌యులో యిలాటి సాంస్కృతిక కార్యక్రమాలు జరగడం కొత్త కాదు. అందరూ ఔనన్నది ఏదో ఒక విద్యార్థిబృందం కాదని అలజడి చేయడం, కాస్సేపు హంగామా చేయడం అక్కడ రివాజే. అంతమాత్రానికే కుట్ర జరిగిపోయిందంటే యీ పాటికి ఎన్ని జరిగి వుండాలి? ఢిల్లీలో వున్న ఇంగ్లీషు పత్రికలన్నిటికి క్యాంపస్‌లో రిపోర్టర్లున్నారు. అయినా ఎవరూ ఫిబ్రవరి 9 నాటి సంఘటనను పెద్దగా పట్టించుకోలేదు. విద్యార్థుల గ్రూపులు ఒకరి మీద మరొకరు కేకలు వేసుకోవడం పెద్ద న్యూస్‌గా ఎవరూ అనుకోలేదు. అందుకే ఢిల్లీ పేపర్లు సిటీ పేజీల్లో కూడా దాన్ని కవర్ చేయలేదు. ఢిల్లీలో శాంతిభద్రతల సమస్య తీవ్రంగా వుంది. మీరు బాధ్యులంటే మీరు బాధ్యులని ఢిల్లీ ప్రభుత్వం, కేంద్రం కీచులాడుకుంటూండగానే ఎన్నో ఘోరాలు జరుగుతున్నాయి. ఢిల్లీ పోలీసు కమిషనర్‌కు తలమునకలా పని వుండి వుండాలి. కానీ బియస్ బస్సీకి అన్నిటికంటె జెఎన్‌యు ప్రదర్శనే ముఖ్యమై పోయింది. ఫిబ్రవరి 10, 11 తారీకుల్లో టివి ఛానెళ్లలో జెఎన్‌యును జాతివ్యతిరేకుల డెన్‌గా చూపిస్తూ వుండడంతో ఇదంతా ఎబివిపి ప్రచారం అనే ఖండించడానికి ఫిబ్రవరి 11 న కన్నయ్య క్యాంపస్‌లో వేరే మీటింగు పెట్టాడు. అంతే, మర్నాడు ఉదయానికల్లా ఢిల్లీ పోలీసు క్యాంపస్‌లోకి అడుగుపెట్టింది. విసి జగదీశ్ కుమార్ వారిని అనుమతించారు. పోలీసులు కన్నయ్యను, మరో ఐదుగురు విద్యార్థులను అరెస్టు చేసి దేశద్రోహం కింద కేసులు పెట్టారు.

నినాదాలిచ్చిన కుర్రవాళ్లను అరెస్టు చేయడం సరే, కన్నయ్యను ఎందుకు చేశారు? అతను మీటింగు ఆర్గనైజ్ చేయలేదు. దేశవ్యతిరేక నినాదాలు చేయలేదు. విద్యార్థి సంఘాలు కొట్టుకుంటూ వుంటే వెళ్లి మధ్యస్థం చేయబోయాడు. దానికి దేశద్రోహి అవుతాడా? జరిగిందేమిటంటే ఫిబ్రవరి 11న కన్నయ్య సంఘ్ పరివారానికి వ్యతిరేకంగా ఉపన్యాసం యిచ్చాడు. 'దేశభక్తి గురించి ఆరెస్సెస్ నుండి, బిజెపి నుండి సర్టిఫికెట్లు తీసుకోవలసిన దుస్థితిలో మేం లేం. మేము యీ దేశానికి చెందినవాళ్లం, దాన్ని ప్రేమిస్తాం. దేశజనాభాలో 80 శాతం వున్న పేదల కోసం మేం పోరాడుతాం. ఇదే మా ద ృష్టిలో దేశభక్తి' అని మాట్లాడడంతో ఎబివిపికి రగిలింది. దాని ఫలితమే కన్నయ్యను అరెస్టు చేయించడం! చేయించడమైతే చేయించారు కానీ తగిన సాక్ష్యాలు చూపలేక బొక్కబోర్లా పడ్డారు. అఫ్జల్ గురు ఉరిని వ్యతిరేకించినందుకే దేశద్రోహులై పోతే మరి అదే పని చేసిన పిడిఎఫ్‌తో బిజెపి పొత్తెలా కలుపుతోంది అని అందరూ అడుగుతున్నారు. బిజెపి మరో భాగస్వామి అకాలీ దళ్ మాజీ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్‌ను చంపి ఉరిశిక్ష పడిన బల్వంత్ సింగ్ రాజోవాణాను అమరవీరుడంటోంది. వారి సంగతేమిటి? దేశాన్ని మతపరంగా విడగొడుతూ ప్రకటనలు చేసిన బిజెపి ఎంపీలు దేశోద్ధారకులా?

కన్నయ్యపై దేశద్రోహి ముద్ర వేయడానికి ఫిబ్రవరి 9 నాటి మీటింగుల్లో యితరులను యిచ్చిన నినాదాలను, ఫిబ్రవరి 11 నాటి కన్నయ్య మీటింగులోకి మార్ఫ్ చేసిన వీడియోలు సంఘ్ పరివార్ అనుబంధ సంస్థల ద్వారా, సమర్థకుల ద్వారా సోషల్ మీడియాలో వీరవిహారం చేశాయి. పోలీసులను జెఎన్‌యులోకి రప్పించి వివాదానికి జాతీయప్రచారం కల్పించిన వైస్‌ఛాన్సలర్ అంతటితో ఆగలేదు. ఆ రోజు విద్యార్థులు జాతివ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారా లేదా అని తేల్చడానికి అంతర్గత విచారణ కమిటీ వేశారు. అలాటి కమిటీ ముందుగా వేసి దాని నిర్ణయం వచ్చాకనే పోలీసులకు కేసు అప్పగించి వుంటే సబబుగా వుండేది. పోలీసులు వచ్చి పట్టుకెళ్లాక వాళ్లే చూసుకుంటారుగా. ఇలాటి కమిటీలో జెఎన్‌యులోని అన్ని కళాశాలలనుండి ఒక్కో ప్రతినిధిని తీసుకోవాలి. కానీ విసి గారు సైన్సు కళాశాలల నుండి మాత్రమే తీసుకుని కమిటీ ఏర్పరచేశారు. ఇది పొరపాటని జెఎన్‌యు టీచర్ల అసోసియేషన్ ఎత్తి చూపి కమిటీని మళ్లీ ఏర్పరచమని విసిపై ఒత్తిడి తెచ్చింది. చివరకు ఐదుగురు సభ్యులతో ఏర్పడిన హై లెవెల్ ఇన్‌క్వయిరీ కమిటీ అనిర్బాన్ భట్టాచార్య, ఉమర్ ఖాలిద్‌లను కొంతకాలం పాటు రస్టికేట్ చేయాలని సిఫార్సు చేసింది. కన్నయ్యతో సహా మరి కొందరు విద్యార్థులపై సస్పెన్షన్ ఎత్తివేసి జరిమానా మాత్రం వేయాలంది. 21 మంది విద్యార్థులకు క్రమశిక్షణ ఉల్లంఘించినందుకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలంది. మా తరఫు వాదనలు వినకుండానే ఎలా తీర్పిచ్చేస్తారంటూ విద్యార్థులు నోటీసులు తిరస్కరించారు.

అంతిమ నిర్ణయం తీసుకోవలసిన చీఫ్ ప్రొక్టర్ మాత్రమే.

పోలీసుల అతి చేష్టలను సమర్థించుకోవడానికి కేంద్రం హెూం మంత్రి ఏదో ఒకటి చేయాల్సి వచ్చింది. నిందితుల్లో ఒకడైన ఉమర్ ఖాలిద్‌కి పాకిస్తాన్ ఆధారిత టెర్రరిస్టు గ్రూపు లష్కరే తొయిబాకు సంబంధం వుండి వుండవచ్చన్నారు. వివరాలు అడిగితే చెప్పనన్నారు. కొన్ని న్యూస్ ఛానెల్స్ ఖాలిద్‌కు జేషే మొహమ్మద్‌తో లింకు పెట్టాయి. ఈ వార్తలకు ఆధారం ఏమిటి అంటే యింటెలిజెన్సు బ్యూరో ఎవరో చెప్పారన్నారు. ఇలా చెప్పి కన్నయ్య, యితర విద్యార్థులపై జనాల్ని బాగా రెచ్చగొట్టారు. ఫిబ్రవరి 17న కన్నయ్యను పాటియాలా హౌస్ కోర్టుకి తీసుకుని వచ్చినపుడు హిందుత్వ సంఘాలవారు వారిపై, తోడుగా వచ్చిన టీచర్లపై, జర్నలిస్టులపై దాడి చేశారు. ఆ దాడి గురించి విచారించడానికి సుప్రీం కోర్టు ఏర్పరచిన కపిల్ సిబ్బల్, రాజీవ్ ధవన్, దుష్యంత్ దవే వంటి లాయర్ల బృందం వస్తే కొంతమంది లాయర్లు వారిపై కూడా దాడి చేశారు. అవన్నీ టీవీ కెమెరాలు రికార్డు చేస్తున్నా వారు ఖాతరు చేయలేదు. ఢిల్లీ ఎసెంబ్లీలో బిజెపి ఎమ్మెల్యేగా వున్న ఓం శర్మ టివి కెమెరాల ఎదుటే కోర్టు బయట ఒక ఆందోళనకారుణ్ని కొట్టాడు. బస్సీగారి కళ్లకి అది 'ఓ చిన్న సంఘటన'గా కనబడింది. కనబడక ఛస్తుందా? ఆయనకు ఆ నెలలోనే రిటైర్‌మెంట్. రిటైరయ్యాక ఇన్ఫర్మేషన్ కమిషనర్ పోస్టింగుకోసం ఎదురు చూస్తున్నాడు. ప్రభుత్వం చెప్పినట్లు ఆడకపోతే పోస్టింగెలా వస్తుంది? అప్పటికీ అరవింద్ కేజ్రీవాల్‌తో అనుక్షణం తలపడి మోదీ దగ్గర మంచి మార్కులే కొట్టేశాడు. 'బస్సీ చేతిలో ఢిల్లీ ఎప్పటికీ సురక్షితం కాదు' అన్నాడు అరవింద్ విసిగిపోయి.

పోలీసు మనవాడైనపుడు దుండగులు ఆగుతారా? అందుకే వాళ్లందరూ రెచ్చిపోయారు. లాయర్ల గుంపుకు నాయకత్వం వహించిన విక్రమ్ చౌహాన్, యశ్‌పాల్ త్యాగిలకు నిమిషాల్లో బెయిల్ దొరికింది. పోలీసులు అభ్యంతరం తెలపలేదు. వారి కంటికి జెఎన్‌యు విద్యార్థులు తప్ప వేరెవరూ దోషులు కారు. కన్నయ్యను అరెస్టు చేయించాక ఎబివిపి నాయకుల ధైర్యం మరింత పెరిగింది. ఢిల్లీ యూనివర్శిటీ స్టూడెంట్స్ యూనియన్ సత్యేందర్ ఆవానా తన క్యాంపస్‌లో "ఈ జెఎన్‌యు విద్యార్థులను కోర్టులు శిక్షించకుండా వదిలివేస్తే, మేల్కొన్న మా యువత (జాగరూక్ యువక్) వాళ్ల క్యాంపస్‌లోకి వెళ్లి ఆ దేశద్రోహులను షూట్ చేసి పడేస్తాం" అని ప్రసంగించాడు. ఇదీ పోలీసుల ద ృష్టిలో నేరం కాదు. కన్నయ్య అరెస్టుకు వ్యతిరేకంగా అలహాబాద్, పట్నా, బెనారస్ హిందూ యూనివర్శిటీల్లో జరిగిన నిరసన ప్రదర్శనలను ఎబివిపి కార్యకర్తలు అడ్డుకుని భౌతికమైన దాడులకు తెగబడ్డారు. జెఎన్‌యు క్యాంపస్‌లో కాంగ్రెసు నాయకుడు ఆనంద్ శర్మపై ఎబివిపి కార్యకర్తలు దాడి చేశారు. సిపిఐ లీడరు డి.రాజా కూతురు అపరాజిత జెఎన్‌యులో విద్యార్థిని. జాతివ్యతిరేక నినాదాలిచ్చినవారిలో ఆమె కూడా వుందని ఎబివిపి ఫిర్యాదు చేసింది. ఇలా తమతో విభేదించే ప్రతివారిని కేసుల్లో యిరికించే, భయపెట్టి అణచి వేసే ప్రయత్నం చేస్తోంది ఎబివిపి.

ఇంతకీ కేసులు నిలుస్తాయా? కన్నయ్యే ఆ నాటి ప్రదర్శనను నిర్వహించాడన్న ప్రాసిక్యూషన్ వాదన వీగిపోయింది. అతను నినాదాలిచ్చాడనడానికి పోలీసులు సాక్ష్యాలేమీ చూపించలేకపోయారు. అప్పుడు 'ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన భారతప్రభుత్వంపై ద్వేషాన్ని రగిలించడానికి కన్నయ్య ప్రయత్నించాడని, అది దేశద్రోహమేనని వాదించాడు పబ్లిక్ ప్రాసిక్యూటరు. ఈ లెక్కన ప్రతిపక్షాలన్నీ దేశద్రోహం కింద జైల్లో కూర్చోవాల్సిందే! తక్కిన కుర్రవాళ్లు కూడా తాము దేశవ్యతిరేక నినాదాలివ్వలేదన్నారు. వీడియోలన్నీ డాక్టర్డ్ అన్నారు. వీడియోల మాట ఎలా వున్నా పదిమంది ప్రత్యక్షసాక్షులున్నారన్నారు పోలీసులు. బెయిల్ అప్లికేషన్లను ప్రతిఘటించారు. అయినా మార్చి 18 న కోర్టు అందరికీ ఆరేసి నెలల బెయిలు యిచ్చింది. వీరి నేపథ్యాలేమిటో తెలిస్తే, వీరు దేశభక్తి లేక దేశద్రోహపు పోకడల గురించి ఒక అంచనాకు రావచ్చు.

29 ఏళ్ల కన్నయ్యకుమార్ భూమిహార్ కులానికి చెందినవాడు. వాళ్ల కుటుంబసభ్యులందరూ సిపిఐ పార్టీ సభ్యులే. వాళ్ల కుటుంబాదాయం నెలకు రూ.3 వేలు. అతను ప్రస్తుతం జెఎన్‌యులోని స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్టడీస్‌లో ఆఫ్రికన్ స్టడీస్ పై డాక్టరేటు చేస్తున్నాడు. ఇక కశ్మీర్ ఉగ్రవాది ఆరోపణలు ఎదుర్కుంటున్న 28 ఏళ్ల ఉమర్ ఖాలిద్ కశ్మీరీ కాదు. అతని కుటుంబం మహారాష్ట్రలోని అమరావతికి చెందినది. 30 ఏళ్ల క్రితం ఢిల్లీ వచ్చేశారు. తండ్రి ఇలియాస్ 'సిమి' (స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా)లో ఒకప్పుడు సభ్యుడు. దాన్ని బహిష్కరించడానికి ముందే బయటకు వచ్చేసి వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా పేర పార్టీ పెట్టాడు. ఉమర్ నాస్తికుడు. మార్క్సిస్ట్-లెనినిస్టు భావాలు కలిగి, ఆ రాజకీయాలపై రిసెర్చి చేయడానికి 2009లో క్యాంపస్‌కు వచ్చాడు. అమెరికాలోని యేల్ యూనివర్శిటీ నుండి వచ్చిన ఎడ్మిషన్‌ను తిరస్కరించి యిక్కడ చేరాడు. ఝార్‌ఖండ్, సింగ్‌భూమ్‌లలో ఆదివాసీల నుంచి భూమి లాక్కోవడం సబ్జక్ట్‌పై రిసెర్చి స్కాలర్. ఫిబ్రవరి 18న యంగ్ హిస్టోరియన్స్ కాన్ఫరెన్సులో ప్రసంగించవలసినవాడు కానీ అంతకు ముందుగానే అరెస్టయ్యాడు. అతన్ని కుట్రకు మాస్టర్‌మైండ్‌గా చూపించడానికి టీవీ న్యూస్ ఛానెళ్లు చాలా శ్రమపడ్డాయి. ఫిబ్రవరి 9 నాటి సంఘటనకు ఏడు రోజుల ముందునుంచి అతను ఢిల్లీ విడిచి 14 సార్లు బయటకు వెళ్లాడని, కశ్మీర్‌కు, గల్ఫ్‌కు, బంగ్లాదేశ్‌కు 800 ఫోన్‌కాల్స్ చేశాడని లేదా రిసీవ్ చేసుకున్నాడని ఆరోపించారు. నిజానికి ఆ సమయంలో ఉమర్ జెఎన్‌యులోనే అనేకమందితో కలిసి నిరాహార దీక్ష చేశాడు, అంతేకాదు, శాస్త్రి భవన్ బయట కూడా దీక్ష చేశాడు. ఇక 7 రోజుల్లో 800 కాల్స్ చేయడం లేదా రిసీవ్ చేసుకోవడమంటే రాత్రీ పగలూ నిద్రలేకుండా గంటకు 9 కాల్స్ చేయడమన్నమాట!

మరో 'మాస్టర్‌మైండ్' అనిర్వాణ్ భట్టాచార్య గురించి చెప్పాలంటే – కలకత్తాలోని కళ్యాణి యూనివర్శిటీలో ఒకప్పటి జెనెటిక్స్ ప్రొఫెసరు కుమారుడైన 29 ఏళ్ల అనిర్వాణ్ ఐసిఎచ్ఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఫర్ హిస్టారికల్ రిసెర్చ్) స్కాలర్‌షిప్‌లో పరీక్షలో టాప్.

కులానికి బ్రాహ్మణుడు. ఈ ఏడాది హిస్టరీలో రిసెర్చి పూర్తయిపోతోంది. ఢిల్లీలో స్టీఫెన్సు కాలేజీలో చదివి జెఎన్‌యుకు వచ్చిన అనిర్వాణ్ ఏ పార్టీకి చెందిన కేంద్రప్రభుత్వమైనా సరే ఛత్తీస్‌గఢ్, కశ్మీర్, ఈశాన్యప్రాంతాల్లో ప్రజల ఆకాంక్షలను అణచివేస్తోందని వాదిస్తాడు. స్టూడెంట్స్ యూనియన్‌కు జనరల్ సెక్రటరీగా వున్న రామా నాగా మరో నిందితుడు. ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలోని రామగిరి గ్రామానికి, ఘాసీ అనే షెడ్యూల్డ్ కులానికి చెందిన 24 ఏళ్ల నాగా సిపిఐ(ఎమ్ఎల్)కు అనుబంధంగా వుండే ఏఐఎస్ఏ (ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్)కు చెందినవాడు. అతని తండ్రి గాజులమ్ముతాడు. వాళ్లకు బీడుపడి వున్న 2 ఎకరాల భూమి వుంది. చిన్నప్పణ్నుంచి కష్టపడి చదివి, స్కాలర్‌షిప్పులు సంపాదించి, జెఎన్‌యు సీటు సంపాదించాడు. ఢిల్లీకి రావడానికి టీచర్లు టిక్కెట్టు కొని యిచ్చారు. సాధారణంగా యూనివర్శిటీ విద్యార్థి యూనియన్ ఎన్నికలలో డబ్బు, కులం, గూండాగిరీ రాజ్యమేలుతాయి. కానీ జెఎన్‌యులో తెలివికి, వక్తృత్వానికే పెద్ద పీట కాబట్టి యీ పేదదళితుడు జనరల్ సెక్రటరీ అయ్యాడు.

నాలుగోవాడైన 30 ఏళ్ల అనంత్ ప్రకాశ్ నారాయణ్ ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వంలోని చందోలీ జిల్లాలో తహసీల్ ఆఫీసులో అటెండరు కొడుకు. అతని తండ్రి బెనారస్ హిందూ యూనివర్శిటీ నుంచి ఎమ్మె బిఇడి చేసినా చాలాకాలం ఉద్యోగాలు దొరకలేదు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూండగా మధ్యవయసులో అటెండరు ఉద్యోగం వచ్చింది. రామా నాగా లాగే యితనూ దళితుడు, ఏఐఎస్ఏ యూనియన్‌కు చెందినవాడు. ప్రభుత్వ స్కూళ్లలో చదువుతూనే హిస్టరీలో బిఏ చేసి, న్యాయశాస్త్రంలో మాస్టర్స్ చేశాడు. జెఎన్‌యులో సెంటర్ ఫర్ లా అండ్ గవర్నెన్స్‌లో ఎంఫిల్ చేయడానికి నాలుగేళ్ల క్రితం వచ్చాడు. వివక్షత లేని సమాజం కోసం అనేక ఉద్యమాల్లో పాల్గొన్నాడు. ఆఖరివాడైన అశుతోష్ కుమార్ యాదవ్ కూడా ఏఐఎస్ఐకు చెందినవాడే. ఒబిసి వర్గానికి చెందినవాడు. స్టూడెంట్స్ యూనియన్‌కు మాజీ అధ్యక్షుడు. అతని తాత ఆరెస్సెస్ ప్రచారకుడు. బాబ్రీ మసీదు విధ్వంసంలో పాలు పంచుకున్నాడు. తండ్రి లాయరు. కానీ కుటుంబభారం ఎక్కువ. ఇతను పట్నాకు దగ్గర వున్న బాఢ్ పట్టణంలో ఆరెస్సెస్ వాళ్లు నడిపే సరస్వతీ శిశు మందిర్‌లో చదువుకున్నాడు. ఇతను బిహెచ్‌యులో గ్రాజువేషన్ చేసి, రష్యన్ స్టడీస్‌లో పిహెచ్‌డి చేయడానికి జెఎన్‌యుకు వచ్చాడు. 'బిహెచ్‌యులో వున్న సంకుచిత, వివక్షాపూరిత వాతావరణానికి భిన్నంగా జెఎన్‌యులోని స్వేచ్ఛావాతావరణం నాకు నచ్చింది. వామపక్షవిద్యార్థి నాయకులు చెప్పే సిద్ధాంతాలు నన్ను ఆకర్షించాయి.' అని చెప్పుకున్నాడు. ఇప్పుడు బిహెచ్‌యు విసి గారు 'నేను మా యూనివర్శిటీని కాపాడుకున్నాను కాబట్టి కానీ లేకపోతే అదీ జెఎన్‌యులా అయిపోయేది' అని చెప్పుకుంటున్నాడు.

వీళ్ల నేపథ్యాలు చదివితే వీరంతా పాకిస్తాన్‌తో చేతులు కలిపి దేశంలో ప్రభుత్వాన్ని కూలగొట్టే పనిలో వున్నారని తోచదు. ఆ మేరకు సాక్ష్యాలు దొరికితే అప్పుడే ఆలోచించవచ్చు. ఎవరి దగ్గరైనా నిషేధిక సాహిత్యం కాని, మారణాయుధాలు కాని దొరికితే, వాళ్ల సెల్‌ఫోన్లలో, ఈ మెయిళ్లలో విదేశీయులతో ఉత్తరప్రత్యుత్తరాలు కాని దొరికితే అది వేరే సంగతి. కానీ ప్రస్తుతానికి తోచేదేమంటే – వీళ్లను అడ్డు పెట్టుకుని ఎబివిపి బలపడదామని చూస్తోంది. దేశభక్తికి తామొక్కరే ఏకైక చిరునామా అన్న బిల్డప్ యిస్తూ, తమతో విరోధించినవారందరికీ దేశద్రోహుల ముద్ర కొడుతోంది. అయితే ఆ దూకుడులో కన్నయ్య లాటి వాణ్ని హీరో చేసింది. చూడబోతే కన్నయ్య చేసిన ఘనకార్యం కాని, ఘోరకార్యం కాని ఏమీ లేదు. అతనిపై కేసులు మోపించి, అందరికీ అతనిపై జాలి కలిగించారు. ఇదే అదనని లెఫ్ట్, కాంగ్రెసు అతన్ని భుజాన వేసుకుని మోస్తున్నాయి. "హిందూ"లో సురేంద్ర మంచి కార్టూన్ వేశారు. హెూం మంత్రితో సహా అందరూ జెఎన్‌యు విద్యార్థులపై రాళ్లు వేస్తే అవి గుట్టగా ఏర్పడి, వాటి మీద విద్యార్థులు కూర్చుని జండా ఎగరేస్తున్నారు. ప్రకాశ్ రాజ్ కవిత కూడా వుందిగా – నువ్వు విసిరిన రాళ్లతోనే యిల్లు కట్టుకుంటా అంటూ!

ఎబివిపి ఆగడాలకు బిజెపి ప్రభుత్వం యింత చేటుగా ఎందుకు మద్దతివ్వాలి అని ఆలోచిస్తే, అసలైన సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి యిది మంచి సాధనంగా తోచింది వారికి. ఓటర్లలో ఎన్నో ఆశలు రేకెత్తించిన మోదీ అనేక రంగాల్లో అసంతృప్తి మిగులుస్తున్నారు. కాంగ్రెసుకు నకలుగా మారే ప్రమాదం అనుక్షణం పొంచి చూస్తోంది. పాప్యులారిటీ తగ్గితే వచ్చే ఎన్నికలలో విజయం సందేహంలో పడుతుంది. అందువలన జాతిని వర్గాలుగా విడగొట్టే ప్రయత్నాలు మొదలుపెట్టారు. జాతీయవాదం పేర తమ ఆలోచనాధోరణితో నడిచేవారు మాత్రమే దేశభక్తి కలవారని, భిన్నమైన ధోరణి వుంటే దేశద్రోహులని ముద్ర కొట్టడం మొదలుపెట్టారు. ఇది ఫాసిజానికి తొలిమెట్టని ఆలోచనాపరులు ఆందోళన చెందుతున్నారు. దేశంలో ఆర్థికపరమైన ప్రగతి కలిగి, అది అన్ని వర్గాలకు అందుబాటులోకి వస్తే సమాజంలో అసమానతలు తగ్గి శాంతి నెలకొంటుంది. పాలకులు దానిపై దృష్టి పెట్టాలి తప్ప గోరంత విద్యార్థుల గొడవలను కొండంత చేసి దానిద్వారా లబ్ధి పొందాలని చూడకూడదు. **– (సమాప్తం) ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2016)**

**ఎమ్బీయస్ క్రైమ్ రచన – 17**
**మార్చి 46, 47**

## ఎమ్బీయస్ క్రైమ్ రచన : కువో ఆయిల్ స్కామ్

జనతా ప్రయోగం విఫలమై 1980 జనవరిలో ఇందిరా గాంధీ అధికారానికి తిరిగి వచ్చిన పది రోజుల్లోనే యీ స్కామ్ జరిగింది. ప్రభుత్వాధీనంలోని ఐఓసి (ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్) మూడు లక్షల టన్నుల సుపీరియర్ కిరోసిన్ ఆయిల్ (ఎస్‌కెఓ)ను, 5 లక్షల టన్నుల హై స్పీడ్ డీజిల్ ఆయిల్ (ఎచ్ఎస్‌డి)ని దిగుమతి చేసుకుందామని నిశ్చయించుకుని టెండర్లు పిలిచింది. ఫిబ్రవరి 5 నుంచి 15 లోపుల టెండర్లు పంపాలని చెప్పింది. 1979లో దేశంలో వర్షాభావం వలన పంటలు పండకపోవడంతో వీటికి విపరీతంగా

డిమాండ్ వచ్చింది. అందుకే యింత పెద్దమొత్తంలో టెండర్లు పిలిచారు. కిరోసిన్ కోసం 10 ఆఫర్లు వచ్చాయి. ఐఓసి మామూలు పద్ధతిలోనే వాటిని డీల్ చేసింది. అయితే డీజిల్ విషయంలో వచ్చిన 14 కొటేషన్ల విషయంలో మాత్రం తమాషాలు జరిగాయి. 14లో 12 ఫ్లోటింగ్ ధర కోట్ చేశాయి. డీజిల్ విషయంలో ధర నిరంతరం మారుతూ వుంటుంది కాబట్టి గంటగంటకు ధరలో హెచ్చుతగ్గులు తెలిపే ప్లాటిస్ ఆయిల్‌గ్రామ్ అనే గ్లోబల్ టెలెక్స్ సర్వీసెస్ వుంది. అది తెలియపరచే ధరను ప్లాటిస్ యిండెక్స్ అంటారు. ఫ్లోటింగ్ రేటులో కొటేషన్ యిచ్చినపుడు ప్లాటిస్ కంటె యింత శాతం ఎక్కువ.. అని చెప్తూ వుంటారు. పెట్రోలు ధర పెరిగితే పెరిగినట్లు, తగ్గితే తగ్గినట్లు. అయితే తక్కిన రెండు కంపెనీలు ఫిక్సెడ్ ధర కోట్ చేశాయి. అంటే పెట్రోలు ధర భవిష్యత్తులో పెరిగినా, తరిగినా వాళ్లు యిదే ధరకు సరఫరా చేస్తారన్నమాట. పెట్రోలు ధరలు పెరగబోతున్నాయి అనే కచ్చితమైన సూచన వున్నపుడు యిలాటి స్థిరధరకు కొనుగోలు చేస్తారు. తగ్గుతున్నాయి అనుకున్నపుడు యిలాటి పద్ధతికి వెళితే కొనుగోలుదారుకు అంటే ప్రభుత్వానికి నష్టం, కంపెనీకి లాభం. దీర్ఘకాలిక ఒప్పందం చేసుకునేటప్పుడు ఎవరూ ఫిక్సెడ్ ధరకు కొనరు. ఎందుకంటే ఎప్పుడు తగ్గుతాయో, ఎప్పుడు పెరుగుతాయో తెలియదు కనుక. పైగా యింత బల్క్ ఆర్డర్ తీసుకునేటప్పుడు ఏదైనా పొరపాటు జరిగితే కోట్లలో నష్టం.

ఆ రోజుల్లో నానాటికీ డీజిల్ ధర క్రమేపీ పడిపోతోందని ఫిబ్రవరి నెల ప్లాటిస్ యిండెక్స్ చూస్తే తెలిసిపోతోంది. ఇంకా పడిపోతాయని అంతర్జాతీయ పరిశీలకులు వ్యాసాలు రాస్తున్నారు. అలాటప్పుడు ఫిక్సెడ్ ధరకు కొనాలనుకోవడం అర్థరహితం, ఏదైనా వ్యక్తిగత అర్థలాభం వుంటే తప్ప! పెట్రోలియం శాఖ మంత్రిగా వున్న పిసి సేఠీ అదే పని చేశాడు. గడువు యింకో వారం పొడిగిస్తున్నామనీ, అన్ని కంపెనీలు ఫిక్సెడ్ ధరనే కోట్ చేయాలని ఆదేశాలిచ్చాడు. దెబ్బకు తక్కినవన్నీ తప్పుకుని మొదట్లో ఫిక్సెడ్ ధర కోట్ చేసిన రెండు కంపెనీలే రంగంలో నిలిచాయి. వాటిలో ఒకటి లండన్‌లోని సిట్కో కాగా, మరొకటి హాంగ్‌కాంగ్‌లోని కువో ఆయిల్ లిమిటెడ్. హాంగ్‌కాంగ్ కంపెనీకి ప్రాతినిథ్యం వహిస్తున్నది ఢిల్లీలో వున్న హిందూస్తాన్ మోనార్క్ ప్రయివేట్ లిమిటెడ్. ఈ కంపెనీకి ఆయిలుతో ఏ సంబంధమూ లేదు. దానికి హైదరాబాదులో ఒకటి, ఘజియాబాద్‌లో మరోటి రెండు ఫ్యాక్టరీలున్నాయి. ఒక దాన్లో లైట్ డిఫెన్స్ ఏన్సిలరీస్ తయారు చేయగా, మరో దాంట్లో సైకిల్ స్పేర్ పార్టులు తయారుచేసి ఎగుమతి చేస్తారు. మరి అలాటి దాని టెండరును ఎందుకు పరిగణించాలి? అంటే దాని అధినేత హరీశ్ జైన్ డెహ్రాడూన్‌లో కమల్ నాథ్‌కు స్నేహితుడు. తద్వారా సంజయ్ గాంధీకి కావలసినవాడు. కమల్ నాథ్ మధ్యప్రదేశ్‌కు చెందిన చింద్వారా నుండి ఎంపీగా ఎన్నికయ్యాడు. పిసి సేఠీ కూడా మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా చేసి ప్రస్తుతం కేంద్రమంత్రి అయ్యాడు. ఈ డీల్ ద్వారా అప్పట్లోనే రూ.9 కోట్లు ప్రభుత్వానికి అదనంగా వ్యయం అయింది. అది కిక్‌బాక్స్ రూపంలో కాంగ్రెసు పార్టీకి చేరిందని అంటారు.

ఈ కంపెనీకి కాంట్రాక్టు యిద్దామని సేఠీ అనగానే పెట్రోలియం శాఖలో సెక్రటరీగా వున్న బిబి వోహ్రా అభ్యంతరం తెలిపాడు. నిజాయితీపరుడిగా ఆయనకు చాలా పేరుంది. జనతా ప్రభుత్వం ఆయనను ఇందిరా గాంధీతో బాటు అరెస్టు చేయించినప్పుడు అందరూ ముక్కున వేలేసుకున్నారు. ఇందిర ప్రధానిగా వుండగా ఓఎన్‌జిసికి బాంబే హై ఆయిల్‌ఫీల్డు వద్ద ఆఫ్‌షోర్ డ్రిల్లింగ్ విషయంలో కన్సల్టన్సీ సర్వీసెస్ నాలుగు మిలియన్ల డాలర్ల ఫీజుకే యిస్తానని అమెరికన్ కంపెనీ ముందుకు వచ్చినా 17 మిలియన్ల డాలర్ల ఫీజుతో ఫ్రెంచి కంపెనీకి కాంట్రాక్టు యిప్పించాడు అని అభియోగం. హెూం మంత్రిగా వున్న చరణ్ సింగ్‌కు, బహుగుణకు మధ్య వున్న తగాదా వలన మధ్యలో వోహ్రాను యిరికించి చరణ్ సింగ్ అరెస్టు చేయించాడంటారు. ఆయనను అరెస్టు చేయగానే అన్ని పార్టీల వారూ ఖండించారు. చివరకు కేసు ఎత్తివేయవలసి వచ్చింది. ఇందిర మళ్లీ అధికారంలోకి వచ్చాక ఆయన్ను మళ్లీ పెట్రోలియం సెక్రటరీగా వేశారు. ఆ హెూదాలో ఆయన 'ఆయిలు ధరలు మరింతగా పడిపోతాయని అందరికీ తెలిసిన యీ తరుణంలో ఫిక్సెడ్ ధరతో కొనకూడదు' అని ఫైలుపై రాశాడు. ఆయనలాగే తక్కిన అధికారులూ అభిప్రాయపడ్డారు. కానీ సేఠీ మాత్రం 'ఆయిలు ధరలు యిప్పుడు పాతాళంలో వున్నాయి. ఇంతకంటె తక్కువ కాలేవు. ఈ ధరలో బేరం కుదిర్చేసుకుంటేనే లాభం' అని వారితో వాదించాడు. అంతేకాదు, ప్రజాభిప్రాయాన్ని తన నిర్ణయానికి అనుకూలంగా మార్చుకోవడానికి మూడు పెద్ద పత్రికలలో కథనాలు వేయించాడు – ధరలింతకంటె తగ్గవు అని. ఫిబ్రవరి 22 న కువో ఆయిల్ కంపెనీకి స్థిరధరపై కాంట్రాక్టు యిచ్చేయడం జరిగింది. ఇక్కడ యింకో మోసం కూడా జరిగింది. ఐఓసి, ఓఎన్‌జిసి కొనుగోళ్లలో డైరక్టుగా విదేశీ కంపెనీలే ఒప్పందం చేసుకోవాలి తప్ప వారి యిండియన్ ఏజంట్లు ఒప్పందం చేసుకోకూడదనే నియమం వున్నా, దీని విషయంలో దాన్ని ఉల్లంఘించి హిందూస్తాన్ మోనార్క్ ద్వారా చెల్లింపులు సాగాయి.

ఆ తర్వాత చూడబోతే అధికారులు చెప్పినట్లే ఆయిలు ధరలు వడివడిగా పడిపోయాయి. ఈ విధానంలో 5,12,155 టన్నుల డీజిల్‌కై ప్రభుత్వం మొత్తం 180.90 మిలియన్ డాలర్లు చెల్లించింది. అదే ఫ్లోటింగ్ రేటులో తీసుకుని వుంటే పది మిలియన్ డాలర్లు సరిపోయి వుండేది! ఈ విషయం బయటకు వస్తే ఎవరి కారణంగా యీ నిర్ణయం తీసుకున్నారనే చర్చ వస్తుంది. అది రాకుండా చేయాలంటే పి–20 అనే పేరుతో వున్న ఆ ఫైలు మాయం చేయాలి. మార్చి 7 న సేఠీని ఆ శాఖ నుండి తప్పించి అతని స్థానంలో వీరేంద్ర పాటిల్‌ను తెచ్చారు. అతను యీ ఫైలును ప్రధాని కార్యాలయానికి పంపాలని నిశ్చయించుకున్నాడు. ఎందుంటే ధరల విధానంపై మార్గదర్శకత్వం కోసమట! దస్త్రం మొత్తం ఆర్‌కె ధావన్ చేతికి వెళ్లిపోయింది కానీ యీ విషయాన్ని ఎక్కడా రికార్డు చేయలేదు. ప్రధాని కార్యాలయం నుంచి ఏ మార్గదర్శనమూ రాలేదు. దాని గురించి ఎక్కడా ప్రస్తావన కూడా లేదు. కొన్నాళ్లకు వీరేంద్ర పాటిల్ వెళ్లిపోయి సేఠీ మళ్లీ మంత్రి అయ్యాడు. వ్యవహారం మాటు మణిగింది. డిసెంబరులో ఆడిట్ వాళ్లు వచ్చి యీ డీల్

పూర్వాపరాలు పరిశీలిస్తామన్నారు. మంత్రిత్వ శాఖలోని డిప్యూటీ డైరక్టరు పెట్రోలియం సెక్రటరీకి డిసెంబరు 6 న లేఖ రాసి ఫైలు పంపమన్నాడు. వీళ్లు ఫైలు దొరకలేదన్నారు. పంపకపోతే ఎలా అని వాళ్లు రాశారు. దొరకకపోతే ఎలా పంపడమంటూ వీళ్లు రాశారు. అది అక్కడితో ఆగింది.

పబ్లిక్ అండర్‌టేకింగ్స్‌పై పార్లమెంటరీ కమిటీ (సిఓపియు) ప్రభుత్వసంస్థల లావాదేవీలన్నీ పరిశీలిస్తుంది. వాళ్లు కువో ఆయిల్ డీల్ విషయంలో 1982 ఫిబ్రవరి 20 న ఐఓసి చైర్మన్‌గా వున్న సిఆర్ దాస్‌గుప్తాను 'మీరు ఫిక్సెడ్ ధరపై ఎందుకు కొన్నారు?' అని అడిగారు. ఆయన ''మీరు ఆ ప్రశ్న మంత్రిత్వశాఖను అడగాలి. మాకు కొనమని, డబ్బులు చెల్లించమని ఆదేశాలు వచ్చాయి, అమలు చేశాం' అని జవాబిచ్చాడు. కమిటీకి సందేహం వచ్చి ఫైలు చూస్తానంది. పెట్రోలియంకు శాఖలో అప్పటి సెక్రటరీ లవరాజ్ కుమార్ ఓ వారంలో ఫైలు వెతికి పంపిస్తామన్నాడు కానీ మార్చి 31 వరకు పంపలేదు. ఫైలు పోయిందని తెలియపరచాడు. కమిటీకి ఏం చేయాలో పాలుపోలేదు. ఈ విషయం రిపోర్టులో రాద్దామా అనుకుంటూండగానే పి-20 ఫైలు ఎక్కణ్నుంచో తేలి వాళ్ల ముందుకు వచ్చింది. వాళ్లు క్షుణ్ణంగా చదివి 'ఫిక్సెడ్ ధరకు కొని వుండాల్సింది కాదు' అని రిపోర్టులో వ్యాఖ్యానించారు. కానీ ఫైలు మిస్సయిపోయిందని, మళ్లీ దొరికిందని రాయలేదు. ఎందుకు రాయలేదని అనేకమంది సభ్యులు అభ్యంతరం తెలిపినా కమిటీ చైర్మన్ 'అవన్నీ చిన్న విషయాలు, రిపోర్టులో రాయనక్కరలేదు' అని కొట్టిపారేశాడు. చైర్మన్ మరెవరో కాదు, సంజయ్ గాంధీకి అత్యంత ఆప్తుడైన బన్సీ లాల్! కానీ సభ్యులు పట్టుపట్టారు. అప్పుడు బన్సీలాల్ నాకు ఒంట్లో బాగాలేదంటూ మీటింగు అర్ధాంతరంగా ఆపేసి వెళ్లిపోయాడు. ఆ రిపోర్టును పార్లమెంటుకు సబ్మిట్ చేసేశాడు.

ఈ విషయం ''ఇండియన్ ఎక్స్‌ప్రెస్'' ద్వారా బయటకు తెచ్చిన ఘనత అరుణ్ శౌరీదే! ఆ సందర్భంగా ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన అంతర్గత కలహం కూడా అసక్తికరమైనదే. అది ప్రముఖ పాత్రికేయుడు బిజి వర్గీస్ ''ఫస్ట్ డ్రాఫ్ట్'' పేర రాసిన ఆత్మకథలో కనబడుతుంది. పాత్రికేయుడిగా మారి పరిశోధనాత్మక, సంచలనాత్మక పాత్రికేయుడిగా పేరు తెచ్చుకున్న అరుణ్ శౌరీ ప్రపంచబ్యాంకు ఎకనమిస్టు. రైటిస్టు విధానాలకు కట్టుబడినవాడు. లెఫ్ట్ అన్నా, కమ్యూనిజం అన్నా, సోషలిజం అన్నా, కాంగ్రెసు అన్నా ఒంటికాలిపై లేస్తాడు. ఎమర్జన్సీ తర్వాత ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అధినేత రామనాథ్ గోయెంకా యిచ్చిన అండదండలతో, రహస్యసమాచారంతో ధైర్యంగా కథనాలు రాసి దేశంలోని యువత కంతటికీ ఆరాధ్యదైవం అయిపోయాడు. అయితే స్వభావరీత్యా అతనికి ఆవేశం, తొందరపాటు ఎక్కువ, ఓర్పు తక్కువ. తాను పట్టిన కుందేలుకి మూడేకాళ్లు అనే రకం. తనతో విభేదించినవాణ్ని శత్రువుగా చూసే తరహా. ఆరెస్సెస్‌ను, బిజెపిని సమర్థిస్తూ వచ్చిన అరుణ్ శౌరీ ప్రస్తుతం అరుణ్ జైట్లీపై మండిపడుతున్నాడు.

వర్గీస్ తన ఆత్మకథలో రాసిన దాని ప్రకారం ఆయన 1982 జూన్‌లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో చేరడానికి ముందే గోయెంకాతో జరిగిన సమావేశంలో ఆయన అరుణ్‌ని పిలిచి అతని ఎదుటే వర్గీస్‌తో 'ఇతను రేసు గుఱ్ఱం లాటివాడు. పగ్గాలేసి ఆపుతూ వుండాలి' అని చెప్పాడు. 'మేం యిద్దరం స్నేహితులమే లెండి' అని చెప్పాడు వర్గీస్. అది జరిగిన నెల రోజుల్లోనే అరుణ్ ''కువో ఆయిల్ డీల్'' గురించి మూడు భాగాలుగా కథనం రాసుకుని వచ్చాడు. పార్లమెంటరీ కమిటీకి వచ్చిన పేపర్లను సంపాదించి దాని ఆధారంగా తయారుచేశానని చెప్పాడు. వర్గీస్ అంతా చదివి 'చాలా బాగుంది, వేద్దాం, అయితే కమిటీవాళ్లు తమ రిపోర్టు పార్లమెంటుకి సబ్మిట్ చేయడానికి ముందే మనం దీన్ని బయటపెడితే పార్లమెంటు హక్కులకు భంగం కలిగించినట్లవుతుంది. రిపోర్టు సబ్మిట్ చేశారో లేదో తెలుసా?' అని అడిగాడు. 'తెలియదు, తెలుసుకోనక్కరలేదు' అన్నాడు అరుణ్ బింకంగా. వర్గీస్ కావాలని కథనాన్ని తొక్కిపెడుతున్నాడని అతనికి అనుమానం కలిగింది. 'నేను ఆర్టికల్ విత్‌డ్రా చేసుకుంటున్నాను' అని కటువుగా చెప్పేసి గదిలోంచి బయటకు వెళ్లిపోయాడు. అతను కాస్త చల్లబడ్డాక నచ్చచెపుదామని వర్గీస్ ఆగాడు.

కానీ అరుణ్ మర్నాటికల్లా ఒక ఉత్తరం రాసి పంపాడు. 'దీన్ని వెంటనే ప్రచురిస్తే బ్రీచ్ ఆఫ్ ప్రివిలేజ్ అవుతుందని నేను అనుకోవటం లేదు. మన పేపర్లో కథనం రాగానే పార్లమెంటులో చర్చ జరిగి, మన పేపరు ప్రతిష్ఠ పెరిగి, సర్క్యులేషన్ పెరుగుతుంది. కానీ గోయెంకాకు చెప్తే భయపడతారు. ఇప్పటికే ఆయన ఆర్థిక యిబ్బందుల్లో వున్నాడు. ఎమర్జన్సీ సమయంలో పడిన దెబ్బ తర్వాత ఇందిరా గాంధీతో పేచీ పెట్టుకోవడానికి సిద్ధపడరు. ఆయనే మీకు చెప్పి యీ కథనాన్ని ఆపించివుంటారు. కానీ ఆయనకు తెలియదు, యీ కథనాన్ని వేయడం వలన పత్రిక బలపడుతుందని! అందువలన గోయెంకాగారు వద్దన్నా మనం యిద్దరం కలిసి దీన్ని పబ్లిక్‌లోకి తీసుకెళదాం. అంతిమంగా గోయెంకాగారికే మేలు కలుగుతుంది.' అని రాశాడు. రాసినవాడు ఊరుకోకుండా గోయెంకాకు కాపీ పంపాడు! దీని ప్రకారం ఎడిటరు, అతని అసిస్టెంటు కలిసి ప్రొప్రయిటరుపై కుట్ర పన్నాలన్నమాట – అదీ ఆయన క్షేమం కోరే! వర్గీస్‌కు నవ్వాలో ఏడవాలో తెలియలేదు. గోయెంకాకు ఫోన్ చేశాడు. ఆయన బొంబాయి నుంచి అహ్మదాబాదుకి వెళుతున్నాడు. ఈయన విషయమంతా చెప్పాడు. తను కథనం ఎందుకు ఆపాడో కూడా చెప్పాడు. రెండు రోజుల తర్వాత గోయెంకా నుంచి స్పందన వచ్చింది. ఆయన విపరీతమైన కోపంతో అప్పటిదాకా సొంత కొడుకులా చూసుకున్న అరుణ్‌ను ఉద్యోగం నుంచి తీసేద్దామనుకున్నాడు. అరుణ్‌కు మరో ఛాన్సిద్దాం, తొందరపడకండి అని వర్గీస్ నచ్చచెప్పి అరుణ్‌కు ఫోన్ చేసి 'నువ్వు చేసినది పొరపాటు' అని చెప్పాడు.

అరుణ్ తగ్గలేదు. ఇంకా ముందుకు వెళ్లిపోయాడు. కువో ఆయిల్ డీల్‌పై తన కథనాన్ని 50 మంది ఎంపీలకు పంపాడు. పెట్రోలియం మంత్రికి కూడా! దీన్ని పార్లమెంటులో ప్రస్తావించండి అని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ లెటర్‌హెడ్‌పై లేఖ రాసి జత పరిచాడు.

జులై 4 న వాటి కాపీలు వర్గీస్‌కు పంపారు కొందరు. వర్గీస్ తెల్లబోయి అరుణ్‌ని యిదేమిటి అని అడిగితే 'కమిటీలకు బాధ్యత వుండదు. వాళ్లు నిజాల్ని దాచవచ్చు. ఒక భారతపౌరుడిగా నిజాలు అందరికీ తెలిపే హక్కు వుంది' అని జవాబిచ్చాడు. 'పౌరుడిగా పాత్ర ధరిస్తూంటే ఎక్స్‌ప్రెస్ లెటర్‌హెడ్ వుపయోగించాల్సింది కాదు, దాని కారణంగా నువ్వు ఎక్స్‌ప్రెస్ పాత్రికేయుడిగానే చూడబడతావు. పిక్చర్‌లోకి పత్రికను తీసుకురావడం చేత యిబ్బందులు సృష్టిస్తున్నావు' అన్నాడు వర్గీస్. కానీ అరుణ్ వినలేదు.

అయితే యీ లోపున సేకరించిన సమాచారం ప్రకారం ఆ రిపోర్టు పార్లమెంటుకి ఏప్రిల్ 26నే సమర్పించడం జరిగింది. అందువలన దానిలోని విషయాలను బహిరంగంగా పబ్లిష్ చేయడం హక్కులకు భంగం కలిగించదు. 'కాస్త ఓర్పు వహించి, యీ ముక్క ముందే కనుక్కుంటే పోయేదానికి యింత గొడవ చేశావు కదా' అని అరుణ్‌ని మందలించి, వర్గీస్ ఆ కథనాలను "ద కేస్ ఆఫ్ మిస్సింగ్ ఫైల్" పేర మూడు భాగాలుగా జులై 10 నుంచి ప్రచురించాడు. అరుణ్ యీ లోపున నాలుగో భాగం కూడా తయారుచేసి జోడించాడు. పార్లమెంటులో దీనిపై చాలా రోజుల పాటు రగడ జరిగింది. చివరకు ప్రభుత్వం దిగివచ్చింది. అప్పటి పెట్రోలియం మంత్రి శివశంకర్ 'ఈ డీల్ విషయంలో విచారించదగిన పొరపాటు (రిగ్రెటబుల్ ఎర్రర్) జరిగిందని ఒప్పుకున్నాడు. తర్వాత జరిగిన సంఘటనలతో అరుణ్ చల్లారాడు. వర్గీస్‌కు కృతజ్ఞతలు చెప్పాడు. గోయెంకా, అరుణ్ ఎప్పటిలాగా ఆత్మీయులై పోయారు. దేశానికి జరిగిన నష్టం మాత్రం పూడలేదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2016)**

**మార్చి 48, 49** **ఎమ్బీయస్ : ఉత్తరాకాండలో తాజా మలుపు**

ఇవాళ వచ్చిన హైకోర్టు తీర్పు ప్రాధాన్యత తెలుసుకోవాలంటే కథ ఎక్కడో నాలుగేళ్ల క్రితం మొదలుపెట్టాలి. 2012 ఎన్నికలలో 70 సీట్ల ఎసెంబ్లీలో కాంగ్రెసుకు 32, బిజెపికి 31 వచ్చాయి. ఇద్దరూ అధికారానికి పోటీ పడ్డారు. పరుగుపందెంలో కాంగ్రెసు యితరులను కలుపుకుని ప్రభుత్వం ఏర్పరచింది. ప్రస్తుతం ఒక నామినేటెడ్ ఎమ్మెల్యేను కలుపుకుని వున్న 71 సీట్లలో నామినేటెడ్‌తో కలిపి కాంగ్రెసుకు 36 మంది, దానికి మద్దతు యిచ్చే పిడిఎఫ్‌కు 6 వున్నాయి. ప్రతిపక్షంలో వున్న బిజెపికి 28 వున్నాయి. ఇలాటి పరిస్థితిలో 9 మంది కాంగ్రెసు రెబెల్స్ బిజెపివైపు వచ్చారు, ఒక బిజెపి రెబెల్ కాంగ్రెసు వైపు వెళ్లాడు.

ఈ పరిణామం రావడానికి కారణం కాంగ్రెసులోని యిద్దరు ప్రముఖ నాయకుల పదవీకాంక్ష. వారిలో ముందుగా చెప్పవలసినది హరీశ్ రావత్‌ను. 2002లో ఉత్తరాఖండ్ ఏర్పడిన దగ్గర్నుంచి అతను ముఖ్యమంత్రి పదవి ఆశిస్తూనే వున్నాడు. అప్పుడు ఎన్‌డి తివారీకి ముఖ్యమంత్రి పదవి యిచ్చి, యితన్ని పిసిసి అధ్యక్షుడిగా చేశారు. ఇతనికి నచ్చలేదు. తివారీకి అడ్డుతగులుతూనే వున్నాడు. 2007లో కాంగ్రెసు ఓడింది. 2012లో కాంగ్రెసు పైన చెప్పిన విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసినపుడు మళ్లీ ముఖ్యమంత్రి అవుతానని ఉబలాట పడ్డాడు. కానీ అతని సీనియారిటీ కాదని కాంగ్రెసు హైకమాండ్ విజయ్ బహుగుణకు పదవి కట్టబెట్టింది. తివారీ, బహుగుణ తండ్రి వీళ్లందరూ లఖ్‌నవ్‌లో వుండేవారని, తను భూమిపుత్రుడు కాబట్టి ముఖ్యమంత్రి పదవికి తగినవాణ్నని హరీశ్ నమ్మకం. 2013లో ఉత్తరాఖండ్‌ను వరదలు ముంచెత్తినపుడు విజయ్ సహాయచర్యలు తీసుకోవడం వైఫల్యం చెందినపుడు ప్రతిపక్షం కంటె ఎక్కువగా యితనే యాగీ చేశాడు. పార్టీ ప్రతిష్ఠ కాపాడుకోవడానికి సోనియా 2014లో విజయ్‌ను దింపి హరీశ్‌ను కూర్చోబెట్టింది. కల నెరవేరింది కదాన్న ఆనందమే తప్ప దాన్ని నిలుపుకునే విజ్ఞత హరీశ్‌కు లోపించింది. అతనిపై మంత్రివర్గ సహచరులందరికీ ఫిర్యాదులే – అతని చుట్టూ భజనపరులు చేరారు, మంత్రులకు కూడా ఎపాయింట్‌మెంట్లు యివ్వడు, ఎమ్మెల్యేల గోడు పట్టించుకోడు, ఏదైనా శాఖాధిపతులను పిలిచినపుడు, ఆ శాఖ మంత్రిని కూడా సమావేశానికి పిలవడు, వాళ్లకు చెప్పకుండా నిర్ణయాలు తీసేసుకుంటాడు.. యిలా ఎన్నో!

ఇతని పనితీరుతో విసిగిన అసమ్మతి మంత్రులు, ఎమ్మెల్యేలు రాహుల్ గాంధీ వద్దకు వెళ్లి కష్టాలు చెప్పుకోబోతే అతనికీ తీరిక లేదు. కేంద్రంలో అధికారంలో లేకపోయినా సరే మాతాసుతులకు ఏ రాష్ట్రపు అసమ్మతివర్గపువారినైనా కలుసుకోవడానికి యిష్టముండదు. పరిస్థితిని గమనించిన బిజెపి ఎలాగోలా కాంగ్రెసు ప్రభుత్వాన్ని పడగొట్టాలని నిశ్చయించుకుంది. విజయ బహుగుణను దువ్వింది. అతను రాజ్యసభకు వెళదామన్నా హరీశ్ అడ్డుపడుతున్నాడు. అందుకని కసితో వున్నాడు. మరో 11 మందిని వెంటపెట్టుకుని బయటకు వస్తానని హామీ యిచ్చాడు. మొత్తం 36లో 12 మూడో వంతు కాబట్టి ఫిరాయింపు అనర్హత వేటు పడదు. భళా అనుకుని బిజెపి ముందుకు వెళ్లింది. తీరా చూస్తే విజయ్‌తో కలిపి బయటకు వచ్చినవారు తొమ్మిది మందే అయ్యారు. అందువలన ప్రభుత్వం కూల్చడానికి నానా రకాల వేషాలు వేయవలసి వస్తోంది.

బయటకు వచ్చిన తొమ్మిది మంది ఎవరాని చూడబోతే – విజయ బహుగుణ, జిత్తులమారిగా పేరుబడిన పాత కాంగ్రెసు నాయకుడు ఎచ్‌ఎన్ బహుగుణ కొడుకు. అతను అనేక పార్టీలు మారాడు. ఎమర్జన్సీ నడిచినంతకాలం ఇందిరతో వుండి, ఆఖరి నిమిషంలో జగ్జీవన్ రామ్‌తో బాటు బయటకు వచ్చేసి సిఎఫ్‌డి అనే పార్టీ పెట్టి జనతా పార్టీకి మద్దతు యిచ్చాడు. ఇప్పుడీ విజయ్ కూడా ముఖ్యమంత్రి పదవి పోవడంతో కాంగ్రెసులోంచి బయటకు వచ్చి బిజెపి పంచన చేరాడు. బిజెపి యితన్ని ముఖ్యమంత్రి చేస్తానందో లేదో యింకా తెలియదు. రెండో ఎమ్మెల్యే – అమృతా రావత్. ఈమె భర్త కాంగ్రెసు ఎంపీగా వుండేవాడు. ఈ మధ్య బిజెపిలో చేరాడు. దాంతో హరీశ్ యీమెను కాబినెట్‌నుంచి తీసేశాడు. మూడో వారు – హరక్ సింగ్ రావత్, కాబినెట్‌లో వ్యవసాయ

శాఖ మంత్రి, విజయ్‌తో బాటు బయటకు వచ్చేశాడు. నాలుగోవారు – షీలా రాణీ రావత్, ఈమె హరక్ సింగ్ రావత్‌కు సన్నిహితురాలు. ఐదోవారు – ప్రదీప్ బాత్రా, వ్యాపారవేత్త, మంత్రి పదవి కోరి, రాకపోవడంతో అసమ్మతి బాట పట్టాడు. ఆరోవారు శైలేంద్ర సింఘాల్ కూడా మంత్రి పదవి రాక ఎదురుతిరిగినవారే, ఏడోవారు – సుబోధ్ ఉనియాల్, విజయ్‌కు సన్నిహితుడు, ఎనిమిదో వారు – ఉమేశ్ శర్మ, విజయ్‌కు అనుచరుడు, సోషల్ వర్కర్, తొమ్మిదో వారు – కువర్ ప్రణవ్ సింగ్, హరీశ్‌కు విజయ్‌కు ఎవరికీ సన్నిహితుడు కాడు, ఎందుకు బయటకు వచ్చేశాడో యితమిత్థంగా తెలియదు.

ఈ తొమ్మిదిమంది బయటకు వెళ్లిపోవడంతో కాంగ్రెసు బలం 42 నుంచి 33కి పడిపోయింది. ఆ ధీమా చూసుకుని బిజెపి మార్చి 18 నాటి అసెంబ్లీ సమావేశంలో బజెట్‌పై ఓటింగుకై పట్టుబట్టింది. 9మంది తిరుగుబాటు ఎమ్మెల్యేలు కూడా అదే డిమాండ్ చేశారు. బలాబలాలు తేల్చడానికి డివిజన్‌కై పట్టుబట్టారు. గలభా జరిగింది. స్పీకరు కుంజ్వాల్ ముఖ్యమంత్రి మనిషి కాబట్టి ఆ డిమాండ్ తిరస్కరించి మూజువాణీ ఓటుతో బిల్లు పాసయిందని ప్రకటించి అసెంబ్లీ వాయిదా వేసి వెళ్లిపోయాడు. ఇదే అన్ని చిక్కులకూ దారి తీసింది. తొమ్మిదిమంది ఎదురు తిరుగుతారని హరీశ్ వూహించలేదేమో, లేకపోతే ముందే వారిని స్పీకరు చేత ఏదో కారణం చెప్పి సస్పెండ్ చేయించి వుండేవాడు. మన తెలుగు రాష్ట్రాల స్పీకర్ల నడిగితే అలాటి ట్రిక్కులు బోల్డు నేర్పగలరు. సభ వాయిదా వేశాక యిక 9 మంది పనిపడదామని చూశాడు. విప్ ధిక్కరించినందుకు ఎందుకు సస్పెండ్ చేయకూడదో చెప్పాలంటూ ఫిరాయింపుల చట్టం కింద మార్చి 23 న షోకాజ్ నోటీసులు యిచ్చాడు. ఇటు హరీశ్ తన కాబినెట్ నుంచి హరక్ సింగ్ రావత్‌ను తీసివేశాడు. విజయ్ కొడుకు సాకేత్‌ను పార్టీ నుంచి ఆరేళ్లు బహిష్కరించాడు. దీనికి ప్రతిగా బిజెపి అధిష్టానం చురుగ్గా కదిలింది. నిజానికి అసెంబ్లీ సమావేశానికి ముందు రోజే అమిత్ షా ఆదేశాలపై బిజెపి నాయకుడు కైలాశ్ విజయవర్గీయ బెంగాల్ ఎన్నికల ప్రచారం మానుకుని డెహ్రాడూన్ వచ్చి విజయ్‌తో బేరాలాడాడు. ఆ తర్వాత తమ గ్రూపువాళ్లను హరీశ్ ప్రలోభాలకు లొంగకుండా చూడడానికి జయపూర్‌కు, గుడ్‌గావ్‌కు, యితర ప్రాంతాలకు తిప్ప నారంభించారు. స్పీకరు నోటీసుల తర్వాత బిజెపి, తిరుగుబాటు కాంగ్రెసువాదులు కలిసి గవర్నరును, రాష్ట్రపతి ప్రణబ్‌ను కలిశారు. గవర్నరు కెకె పాల్ ముఖ్యమంత్రిని పిలిచి మార్చి 28 నాడు అసెంబ్లీలో తన బలాన్ని నిరూపించుకోమన్నాడు. ఇది సరైన చర్యగా అందరూ భావించారు.

అయితే యింతలో కథ మలుపు తిరిగింది. స్పీకరు నోటీసుకు జవాబివ్వడానికి తమకు మరి కొంత సమయం కావాలంటూ హైకోర్టుకి వెళ్లిన తిరుగుబాటు ఎమ్మెల్యేల పిటిషన్‌ను కోర్టు మార్చి 25 న తోసిపుచ్చింది. మర్నాడే హరీశ్ తిరుగుబాటు ఎమ్మెల్యేలకు డబ్బుతో ప్రలోభపెడుతున్నట్లు తీసిన స్టింగ్ ఆపరేషన్ వీడియో బయటకు వచ్చింది. అది నకిలీది అని హరీశ్ అన్నాడు కానీ అసలైనదే అని చండీగఢ్‌లోని ఫోరెన్సిక్ లాబ్ ధ్రువీకరించింది. తిరుగుబాటు ఎమ్మెల్యేలు తాము స్పీకరు ఎదుటకు వెళ్లకుండా లాయర్లను పంపారు. అది అదనుగా తీసుకుని స్పీకరు మార్చి 27 న 9 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాడు. దానితో అసెంబ్లీ మొత్తం సభ్యుల సంఖ్య తగ్గిపోయి హరీశ్‌కున్న మెజారిటీ సరిపోతుంది. 28 నాటి బలపరీక్షలో నెగ్గడం ఖాయం. ఈ దశలో కేంద్రం చూస్తూ వూరుకోలేకపోయింది. రాష్ట్ర బిజెపి బహిరంగ డిమాండు మేరకు తన విశేషాధికారాలను వుపయోగించి ఆర్టికల్ 356 సహాయంతో రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించింది. అసెంబ్లీని రద్దు చేయకుండా సుప్తచేతనావస్థలో వుంచింది.

ఇది విమర్శలకు తావిచ్చింది. అసెంబ్లీలో బలపరీక్ష జరగబోయేందుకు ఒక్క రోజు ముందు కేంద్రం ఎందుకు త్వరపడాలి అని అందరూ అడుగుతున్నారు. స్పీకరు ముఖ్యమంత్రి పక్షాన వున్నాడు కాబట్టి అడ్డువచ్చిన ప్రతిపక్షం వాళ్లందరినీ అనర్హులుగా ప్రకటించి, ముఖ్యమంత్రికి మేలు చేస్తాడనా? అనేక రాష్ట్రాలలో అదే జరుగుతోంది కదా! తన విశేషాధికారాలను దుర్వినియోగం చేసే స్పీకర్లలో ఉత్తరాఖండ్ స్పీకరు మొదటివాడూ కాదు, ఆఖరివాడూ కాదు. ద్రవ్యబిల్లు పాసయిపోయిందని ముఖ్యమంత్రి, స్పీకరు ఓ పక్క చెపుతున్నారు. దాని ఓటింగు సందర్భంగా మెజారిటీ కోల్పోయిన రావత్ ముఖ్యమంత్రిగా కొనసాగడం రాజ్యాంగవిరుద్ధం, అనైతికం కాబట్టి ప్రభుత్వాన్ని రద్దు చేయడం సవ్యమైన పని అని అరుణ్ జైట్లీ అన్నాడు. అసెంబ్లీ కార్యకలాపాలలో కోర్టులకే ప్రమేయం లేదంటున్న యీ రోజుల్లో కేంద్రానికి ఏ మేరకు వుంటుంది? 2010 అక్టోబరులో కర్ణాటకలో ఎడ్యూరప్ప ప్రభుత్వాన్ని 19 మంది అసమ్మతి బిజెపి ఎమ్మెల్యేలు, మరో 5గురు యిండిపెండెంట్లు ద్వారా కూలదోయడానికి కేంద్రంలో కాంగ్రెసు ప్రయత్నించింది. రాష్ట్రపతి పాలనకు గవర్నరు సిఫార్సు చేస్తే బిజెపి గగ్గోలు పెట్టింది. ఇప్పుడు తను అదే పని చేస్తోంది. బిజెపి పాత్రను కాంగ్రెసు పోషిస్తోంది. బజెట్ బిల్లు పాస్ కాలేదన్న తన వాదనకు వూతం యివ్వడానికి ఏప్రిల్ 1 నుంచి ప్రభుత్వం కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి డబ్బు తీసుకునేందుకు ఆర్డినెన్సు జారీ చేయడానికి పార్లమెంటును ప్రొరోగ్ చేసింది.

కాంగ్రెసు అధికారంలో వున్నంతకాలం, ముఖ్యంగా ఇందిర ప్రధానిగా వుండగా 356 ఆర్టికల్‌ను చిత్తం వచ్చినట్లు వినియోగిస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శిస్తూ వుండేవి. వారు అధికారంలోకి వచ్చాక వాళ్లూ అదే పని చేస్తున్నారు. ఈనాడులో వచ్చిన ఒక పట్టిక ప్రకారం 54 ఏళ్లపాటు అధికారంలో వున్న కాంగ్రెసు 88 సార్లు (దీనిలో ఇందిరే 50 సార్లు విధించింది) రాష్ట్రపతి పాలన విధిస్తే (అంటే సగటున ఏడాది పాలనకు 1.63 సార్లు అన్నమాట) 14 ఏళ్ల పాటు అధికారంలో వున్న కాంగ్రెసేతర పక్షాలు 36 సార్లు విధించాయి. అంటే సగటున ఏడాది పాలనకు 2.57 సార్లు అన్నమాట)! రాష్ట్రపతి పాలన విధింపుపై హరీశ్ హైకోర్టుకి వెళ్లాడు. హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ ఈ నెల 31 న అసెంబ్లీలో బలపరీక్ష నిర్వహించాలని తీర్పు యిచ్చింది. అనర్హత వేటు పడిన ఎమ్మెల్యేలు ఓటు వేయవచ్చని అయితే వారి ఓట్లను విడిగా వుంచాలని, వీరి అనర్హత సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై తుది తీర్పు వచ్చిన తర్వాత వాటిని లెక్కలో

తీసుకోవడమో, మానడమో తెలుస్తుందని అంది. ఏప్రిల్ 2 న మళ్లీ విచారణ చేస్తానంది. ఇదీ సబబుగానే వుంది. ఎందుకంటే బలాబలాలు అసెంబ్లీ ఫ్లోర్ మీదనే తేలాలని ఎప్పుడూ చెప్తూ వుంటారు. అయితే రాష్ట్రపతి పాలన విధింపు అనేది సమస్యను జటిలం చేసింది. దానిపై హై కోర్టు స్టే యిచ్చిందా, యివ్వగలదా అన్నదానిపై స్పష్టత లేదు. అదే సమయంలో స్పీకరు తీర్పుని కూడా కోర్టు ఆమోదించినట్లు లేదు. తిరుగుబాటు ఎమ్మెల్యేల అంశం ఓపెన్ ఎండెడ్‌గానే వుంచింది.

దీన్ని కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. కోర్టులు రాష్ట్రపతి ఉత్తర్వుపై తీర్పు యివ్వలేవని అటార్నీ జనరల్ వాదించారు. ఇవాళ యిద్దరితో కూడిన డివిజన్ బెంచ్ సింగిల్ బెంచ్ జడ్జి తీర్పుపై ఏప్రిల్ 7 వరకు స్టే యిచ్చింది. మిగతా కథ వెండితెరపై చూడాల్సిందే! ఇందులో ఒక పిట్టకథ కూడా వుంది. రాష్ట్రపతి పాలన విధించగానే ఉత్తరాఖండ్ ఎక్సయిజ్ కమిషనర్ అర్జంటుగా ఒక ప్రకటన చేశాడు – రాష్ట్రంలో అన్ని లిక్కరు షాపుల్లో అన్ని రకాల ఆల్కహాల్ బ్రాండులు లభ్యమవుతాయని! హరీశ్ రావత్ ప్రభుత్వం లిక్కర్ పాలసీ గట్టిగా అమలు చేసింది. రెండే రెండు ప్రభుత్వ ఏజన్సీల ద్వారా ఐఎంఎఫ్ఎల్, ఫారిన్ లిక్కర్ పంపిణీ జరిగేవి. లిక్కర్ లాబీ అలిగింది. అనేక పాప్యులర్ లిక్కర్ బ్రాండులు షాపుల్లోంచి మాయమయ్యాయి. ఇప్పుడు పరిస్థితి చక్కదిద్దుతామని యీయన అంటున్నాడు. కేరళలో లిక్కర్ లాబీ ప్రభుత్వమార్పుకై గట్టి కృషి చేస్తోంది. ఇక్కడా అలాటిదేమైనా వుందేమో ప్రస్తుతానికి తెలియదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2016)**

**మార్చి 50 వీక్లీకై ఎమ్బీయస్ : నిన్న కాదు, నేడు కాదు, ఎప్పటికీ నేనే రాజా...**

ఉగాండాకు అధ్యక్షుడిగా యొవెరీ ముసెవెనీ మళ్లీ ఎన్నికయ్యాడు. ఫిబ్రవరి మూడోవారంలో జరిగిన ఎన్నికలో ఆ గెలుపు సిద్ధించింది. అతను 30 ఏళ్లగా అదే పదవిలో కొనసాగుతున్నాడు. ఉగాండా రాజ్యాంగం ప్రకారం ఎన్నికైన వారు రెండుసార్లకు మించి ఆ పదవిలో వుండకూడదు. కానీ అతనా చట్టాన్ని మార్చేశాడు. 75 ఏళ్లు పై బడితే పదవిలో వుండకూడదనే మరో నియమం వుంది. 71 ఏళ్ల ముసెవెనీ వచ్చేసారి కూడా పోటీ చేయాలంటే దాన్ని మార్చడం అత్యవసరం. మార్చాలంటే యీ ఎన్నిక నెగ్గాలి. నెగ్గాలంటే ఏదైనా చేయవచ్చు అనే పంథా అతనిది. 1970, 80లలో తను ఈడీ అమీన్‌పై గెరిల్లా యుద్ధం చేసే రోజుల్లో సహచరుడిగా, వైద్యుడిగా వుండి తర్వాతి రోజుల్లో ప్రత్యర్థిగా వున్న కిజ్జా బెసిగియాని గత నాలుగేళ్లలో 34 సార్లు అరెస్టు చేయించి, ఎన్నికలకు ముందు హౌస్ అరెస్టు చేయించాడు. తన వద్ద గతంలో ప్రధానిగా పనిచేసి ప్రత్యర్థిగా మారిన అమామా బాబాజీని కూడా ఎన్నికల ముందు అరెస్టు చేయించాడు. కిజ్జా అధినేతగా వున్న ఫోరమ్ ఫర్ డెమొక్రాటిక్ ఛేంజ్ పార్టీకి కంపాలా ప్రాంతంలో గట్టి పట్టుంది కాబట్టి అక్కడకు పోలింగు సామగ్రి సకాలంలో పంపలేదు. సాయంత్రం ఎప్పుడో ఓటింగు ప్రారంభమైంది. దేశంలోని 20% పోలింగు బూతులకు చేరిన బాలట్ పేపరు కట్టలకు సీళ్లు లేవు. 33% బూతులలో దొంగ ఓట్లు పడ్డాయి. ఇవన్నీ ఎవరైనా సెల్‌ఫోన్ల ద్వారా ఫోటో తీస్తారేమోనన్న భయంతో పోలింగు బూతులలోకి సెల్‌ఫోన్లు అనుమతించలేదు. ఇప్పటిదాకా ముసెవెనీ నాలుగుసార్లు ఎన్నికయ్యాడు. మొదటిసారి ప్రజాదరణతోనే నెగ్గాడు. తర్వాత నెగ్గిన మూడిటిలో యిలాటి అక్రమాలు ఎన్నో చేశాడు. 2006లో గద్దె దిగాల్సినవాడు దిగను పొమ్మంటూ రాజ్యాంగం మార్చేశాడు. ఈ అడ్డగోలు ఎన్నికకు తన అనుయాయి అయిన ఎన్నికల కమిషనర్ చేత ఆమోదముద్ర వేయించాడు. ముసావెనీ పార్టీ అయిన నేషనల్ రెసిస్టెన్స్ ఫ్రంట్ 60.8% ఓట్లతో నెగ్గాడని ఆ కమిషనర్ ప్రకటించాడు. ఎన్ని అక్రమాలు చేసినా కిజ్జా పార్టీకి 35% ఓట్లు వచ్చాయి.

ప్రజాస్వామ్యం ముసుగులో యిలా నియంతృత్వం సాగించడానికి అతనికి వున్న దన్ను – ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికే అవతరించానని చెప్పుకునే అమెరికా! దానికి ఈ ప్రాంతంలో ఉగాండా అత్యంత సన్నిహిత దేశం. ముసెవెనీ వామపక్ష విప్లవవాదిగా అధికారంలోకి వచ్చినా ఒక సారి గద్దె కెక్కాక అమెరికాకు అనుకూలంగా మారిపోయాడు. బిల్ క్లింటన్ అతన్ని "ఆఫ్రికాలో ప్రజాస్వామ్యానికి మూలస్తంభం, తక్కిన ఆఫ్రికన్ నాయకులు అతన్ని చూసి నేర్చుకోవాలి" అన్నాడు. అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంటు ఉగాండాను 'కీలకమైన (కీ) యుఎస్ భాగస్వామి'గా వర్ణిస్తుంది. సోమాలియాలో ప్రజల మద్దతులేని ప్రభుత్వాన్ని కాపాడదామని అమెరికా అనుకున్నపుడు అందరి కంటె ముందుగా సైన్యాన్ని పంపినది ఉగాండాయే! ఆ ఖర్చంతా అమెరికాయే భరించింది. ఉగాండా నుంచి పారిపోయి అజ్ఞాతంలో వుంటూ 'లార్డ్స్ రెసిస్టెన్స్ ఆర్మీ' పేర దానితో యుద్ధం సలుపుతున్న జోసెఫ్ కోనీని అణచివేయడానికి ఉగాండా సైన్యానికి మిలటరీ ట్రెయినింగ్, ఆయుధసంపత్తి యిస్తున్నది అమెరికాయే! అమెరికాతో బాటు అది చెప్పినట్లు వినే అనేక యూరోపియన్ దేశాలు రకరకాల పేర్లతో దానికి సహాయం అందిస్తూ వుంటాయి. ఇటీవల 2014లో స్వలింగసంపర్కులకు యావజ్జీవ శిక్ష వేసే అవకాశం కల్పిస్తూ ఉగాండా చట్టం చేసినందుకు యూరోప్ దేశాలు నొచ్చుకున్నాయి. తాము యిచ్చే 2 బిలియన్ డాలర్ల సహాయాన్ని నేరుగా ప్రభుత్వానికి యివ్వకుండా స్వచ్ఛందసంస్థలకు యిస్తున్నాయి తప్ప సహాయం ఆపేయలేదు.

ప్రజల హక్కులను కాలరాసే ముసెవెనీకి వీళ్లంతా ఎందుకు మద్దతిస్తున్నారు అంటే అమెరికా దృష్టిలో అతను రిస్క్–టేకర్. ఏదైనా ధైర్యంగా చేయగలడు. సోమాలియాలో ఉగాండా ప్రమేయాన్ని నిరసిస్తూ 2010లో అల్ షహాబ్ ఆత్మాహుతి బాంబర్లు ప్రజాస్వామ్యవిరుద్ధం లాటి చాదస్తపు మాటలు చెప్పడు. అతనికి గ్రామీణుల్లో యింకా మద్దతుంది. ఎందుకంటే ఈడీ అమీన్ హయాంలో నెలకొన్న అంతర్యుద్ధంతో పోలిస్తే పరిస్థితులు కుదుటపడ్డాయి. అయితే గత ఆరేళ్లగా ఆర్థిక ప్రగతి కుంటు పడినా,

వ్యవసాయరంగం, ఉపాధి రంగం దెబ్బ తిన్నా పల్లెటూళ్లలో యింకా పలుకుబడి వుంది. అయితే ఓటర్లలో 80 శాతం మంది వున్న యువత అతనికి వ్యతిరేకమైంది. ఆర్మీ జనరల్ ముగీషా ముంటు కూడా ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నాడు. ఒకనాటి ముసెవెనీ అనుచరులందరూ దూరమై పోయారు. అతను 2006, 2011 ఎన్నికలలో నెగ్గడానికి కుతంత్రాలు పన్నిన గూఢచారి శాఖాధిపతి డేవిడ్ సెజూసా అతనితో విభేదించి లండన్ పారిపోయి 2013లో తిరిగి వచ్చి అతన్ని ఘాటుగా విమర్శిస్తున్నాడు. 2006లో నిజానికి కిజ్జాయే నెగ్గాడని కానీ ముసెవెనీ ఫలితాలను మార్చేశాడనీ, అతనితో చేతులు కలిపిన వ్యక్తిగా తనే సాక్షి అని చెప్తున్నాడు. అలాగే ముసెవెనీ వద్ద ప్రధానిగా పనిచేసి యిప్పుడు ఎదురు తిరిగిన అమామా 2011 ఎన్నికలలో కూడా యిలాటి అక్రమాలే జరిగాయని, తను సాక్షినని చెప్తున్నాడు. ఈ సారి ఎన్నికలకు పరిశీలకులుగా వచ్చిన యూరోపియన్ యూనియన్ అబ్జర్వర్స్ మిషన్‌కు చీఫ్‌గా వున్న ఎడ్వరాండ్ కుల్కన్ ఎన్నికల కమిషన్‌కు స్వేచ్ఛ లేదని, పారదర్శకంగా పనిచేయటం లేదని విమర్శించాడు. కామన్‌వెల్త్ దేశాల పరిశీలకుల బృందం ఎన్నికలలో మౌలికమైన ప్రజాస్వామ్య సిద్ధాంతాలు కూడా అవలంబించలేదని కుండబద్దలు కొట్టింది. ఇలా వీళ్లు ఎంత చెప్పినా, ముసెవెనీ ఏం చేసినా అమెరికా అతన్ని సమర్థిస్తూనే వుంది. అదీ అమెరికా డొల్లతనం! **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2016)**

**మార్చి 51 వీక్షీకె ఎమ్బీయస్ : నిషిద్ధ ఔషధాలు**

మీరు గమనించారో లేదో, మనం తరచుగా వాడే సారిడన్, గ్లయికోడిన్ కాఫ్ సిరప్, కోరెక్స్, విక్స్ యాక్షన్ 500, డీకోల్డ్ టోటల్ వగైరా 344 ఔషధాలను ప్రభుత్వం నిషేధించింది. దానిపై మందుల కంపెనీలు కోర్టుకి వెళ్లి స్టే తెచ్చుకున్నాయి కాబట్టి అమ్మకాలు సాగుతున్నాయి. నిషేధించిన కారణం ఏమిటంటే యివి ఎఫ్‌డిసి (ఫిక్సెడ్ డోస్ కాంబినేషన్) మందులు. సాధారణంగా ఒక్కో కెమికల్ కాంపౌండు ఒక్కో గుణం కలిగి ఒక్కో రకమైన రోగలక్షణాన్ని నయం చేస్తుంది. ఒక వ్యాధిలో వుండే రెండు మూడు లక్షణాలకై రెండు మూడు మందులు యివ్వాల్సి వుంటుంది. అన్ని మందులంటే రోగి కొనడేమోనని ఆ రెండు, మూడు మందులు కలిపి ఒకే కాంబినేషన్ డ్రగ్‌గా అమ్మేస్తున్నారు. ఇంకో విషయమేమిటంటే – రోగిని బట్టి ఆ యా మందులు ఆ యా డోసుల్లో యివ్వాలి. కానీ యీ కాంబినేషన్ డ్రగ్స్‌ల్లో అన్ని రకాల రోగులకు ఒకేరకమైన నిష్పత్తిలో మందులు కలుపుతున్నారు. అది మంచిది కాదు. ఉదాహరణకి సారిడన్‌లో పారాసెటమాల్, కెఫేన్, ప్రొపైఫెనాజోన్ అనే మూడు మందులను ఒక స్థిరనిష్పత్తిలో (ఉదాహరణకి 3:3:3 అనుకుందాం) కలిపి అమ్ముతారు. రోగలక్షణాలను బట్టి ఎ అనే రోగికి వాటిని 2:5:4 నిష్పత్తిలో, బి అనే రోగికి 4:2:1 నిష్పత్తిలో యివ్వాలనుకోండి. మరి యిలా 3:3:3గా యిస్తే దుష్ఫలితాలు కలుగుతాయి కదా! పైగా కొన్ని వ్యతిరేక లక్షణాలున్న మందులను కూడా కలిపివేసి ఎఫ్‌డిసిలను తయారుచేస్తున్నారు. నిముసులైడ్ అనే ఎనాల్జిసిక్ భోజనానికి అరగంట ముందు తీసుకోవాలి, సెర్రాషియోపెప్టిడేస్ అనే ఎంజైమ్‌ను భోజనానికి అరగంట తర్వాత తీసుకోవాలి. అసంబద్ధంగా రెండిటినీ కలిపి కాంబినేషన్ డ్రగ్ చేసి అమ్మడం ఘోరం కదా అంటారు డాక్టర్లు. మరి కొన్ని సందర్భాల్లో ఒక కెమికల్ మరొక కెమికల్ పనితనాన్ని తగ్గిస్తోంది. భారత ఔషధాల గైడ్‌లైన్స్ ప్రకారం మధుమేహానికి చికిత్స – సరైన ఆహారం, తగినంత వ్యాయామం, మెట్‌ఫార్మిన్ అనే ఒకే ఒక్క మందు! అయితే "లాన్సెట్" అనే ప్రముఖ పత్రిక 2013లో చేసిన అధ్యయనం ప్రకారం ఇండియాలోని మధుమేహ రోగుల్లో మెట్‌ఫార్మిన్ విడిగా వాడేవాళ్లకంటె యితర మందులతో కలిపి కాంబినేషన్ డ్రగ్‌గా వాడేవాళ్లే ఎక్కువ! జలుబు, జ్వరం, నొప్పి, డయాబెటిస్, బిపి, కొలెస్టరాల్, అనేక యాంటిబయాటిక్స్.. యిలా సర్వ రోగాలకు మనం యివి వాడేస్తున్నాం. మనంతట మనం మందులషాపుల్లో కొనేవే కావు, డాక్టర్లు మనకు రాస్తున్న మందుల్లో కూడా యివి వున్నాయి.

ఏదైనా మందుకు అనుమతి కావాలంటే క్లినికల్ ట్రయల్స్ చేసి ఎలా పనిచేస్తోందో నిరూపించాలి. మందు మార్కెట్లోకి వచ్చాక కూడా వాటి పనితనాన్ని పరీక్షించే లాబ్స్ వుండాలి. మన దేశంలో ఆ ప్రక్రియ పటిష్టంగా లేదు. కొన్ని మందులకు రాష్ట్రస్థాయిలో అనుమతి యిచ్చేస్తారు. వారి వద్ద లాబ్స్ వుండవు, డ్రగ్ కంట్రోలు వ్యవస్థ కూడా సవ్యంగా వుండదు. మందుల కంపెనీలు మందులు తయారుచేసి పబ్లిసిటీ గుప్పిస్తాయి. తమ రిప్రజెంటేటివుల ద్వారా డాక్టర్లను ప్రభావితం చేస్తాయి. పరిశోధన ఫలితాలు తెలుసుకునే సావకాశం డాక్టర్లకుండదు. అందువలన సాధారణ ప్రజలమీదనే సకల ప్రయోగాలు జరుగుతాయి. ఏదైనా చెడుప్రభావం కనబడినా అది దీని కారణంగానే కలిగిందన్న స్పృహ వుండదు. నిరూపించలేరు కూడా. 2010లో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ మెడికల్ యూనిట్, హెల్త్ యాక్షన్ ఇంటర్నేషనల్ అనే స్వచ్ఛంద సంస్థ కలిసి అధ్యయనం చేసి పైన చెప్పిన అసంబద్ధ ఔషధాలు 1356 వున్నాయని, అవి 4559 బ్రాండ్ నేమ్స్‌తో అమ్ముడవుతున్నాయని వెలుగులోకి తెచ్చింది. 2012లో పార్లమెంటు కమిటీ దీనిపై అధ్యయనం చేసి ఒక నివేదిక యిచ్చింది. అనేక ఔషధాలకు సరైన క్లినికల్ ట్రయల్స్ (ఔషధ పరీక్షలు) జరగటం లేదని తేల్చి చెప్పింది. దానిపై డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా ఒక కేఎంఎశేఎం రంజిత్ రాయ్ చౌధురీ నేతృత్వంలో నిపుణుల కమిటీ వేసి డ్రగ్ రెగ్యులేటరీ సిస్టమ్‌లోని లోపాలను సరిదిద్దమన్నారు. ఆ కమిటీ 2013లో 100 పేజీల నివేదిక యిచ్చింది. 85 వేల ఫార్ములేషన్స్‌ను పునర్మూల్యాంకనం (రీఎసెస్‌మెంట్) చేయాలని చెప్పింది.

అప్పుడు ప్రభుత్వం బెళగాం యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డా. చంద్రకాంత్ కోకాటే నాయకత్వంలోని నిపుణుల కమిటీకి మార్కెట్లో

ఏయే మందులను నిషేధించాలో నిర్ణయించే పని అప్పగించింది. వాళ్లు తయారుచేసిన తొలి జాబితాలో 344 వున్నాయి. వాటిలో చాలాభాగం మందులను పశ్చిమదేశాల్లో ఎప్పుడో నిషేధించారు. దీనితో బాటు సెంట్రల్ ఎక్స్‌పర్ట్ కమిటీ కూడా అధ్యయనం చేసి 500 ఎఫ్‌డిసిల జాబితా తయారుచేసింది. వాటిని కూడా నిషేధిద్దామనుకుంటున్నారు. ఇది వినగానే ఇండియన్ ఫార్మా యిండస్ట్రీ గందరగోళపడింది. ఎందుకంటే 344 కాంబినేషన్లంటే సుమారు 2500 బ్రాండెడ్ డ్రగ్స్ అన్నమాట. వాటి అమ్మకం వలన వాళ్లు ఏటా రూ. 5 వేల కోట్లు సంపాదిస్తున్నారు. ఎలా చూసుకున్నా తక్షణ నష్టం వెయ్యి కోట్ల రూ.లు. రెండో జాబితాలోని 500 మందులు కూడా నిషేధిస్తే అప్పుడు వాళ్ల నష్టం రూ.10 వేల కోట్లు. మన దేశంలో ఔషధ పరిశ్రమ విలువ రూ.2 లక్షల కోట్లు కాబట్టి ప్రజారోగ్యం ద ృష్ట్యా వాళ్లు యీ నష్టాన్ని భరించడమే సబబు. అయినా వాళ్లు నిషేధాన్ని ఆపేయమంటూ కోర్టుకి వెళ్లారు. ఢిల్లీ హైకోర్టు వారి పట్ల ఉదారంగా వుంది. మద్రాసు హై కోర్టు ఢిల్లీ హైకోర్టు తీరుతో విభేదిస్తోంది. ప్రజాసంక్షేమం ద ృష్ట్యా నిషేధం వెంటనే అమలు చేయాలంటోంది. రెండు కోర్టులు చెరోలా చెపుతున్నాయి కాబట్టి విషయం సుప్రీం కోర్టుకి చేరవచ్చు. అక్కడ ఎన్నాళ్లు పడుతుందో, యీ లోగా ఎందరి ఆరోగ్యాలు చెడతాయో తెలియదు. వ్యవహారాన్ని కడదాకా, వేగిరంగా నడిపించే చిత్తశుద్ధి ప్రభుత్వానికి వున్నప్పుడే యిలాటి నిషేధాలు అమలవుతాయి. లేకపోతే కమిటీ నివేదికలు బుట్టదాఖలే! మన ప్రాణాలు దవాఖానాదాఖలే!

**– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2016)**

•••